
ఏది చరిత్ర?



ఎం.వి.ఆర్. శాస్త్రి

ఏది చరిత్ర?

(ఆర్యుల నుంచి ఔరంగజేబుల దాకా)

ఎం.వి.ఆర్.శాస్త్రి

దుర్గా పబ్లికేషన్స్, హైదరాబాద్

YEDI CHARITRA?

A Reappraisal of Ancient and Medieval Indian History

by

M.V. R. SASTRY

First Published by	: AVK Foundation
First Edition	: April 2003 (2000 Copies)
Reprint	: 2003
Second Edition	: March 2004
Reprint	: December 2005
The Edition	
Published by	: Durga Publications, Hyderabad.
First impression	: March, 2006 (1000 Copies)
Second impression	: April, 2008 (1000 Copies)
Third impression	: December, 2009 (800 Copies)
For Copies	: M. Durga G1, Sai Krishna Mansion 1-1-230/9, Viveknagar Chikkadpally, Hyderabad - 500 020 Phone : 040 - 2763 2824 e-mail: charitra@rediffmail.com
Title Printed at	: Pragati Printers, Hyderabad.
Text Printed at	: Akruti Offset Printers, Hyderabad.
Price	: **Rs. 180/-** **U.S. $ 20**



అందరూ చదవాలి

ఇది శ్రీ ఎం.వి.ఆర్.శాస్త్రిగారి చరిత్ర విమర్శ గ్రంథం. ఒక కావ్యం పుట్టితే దాని గుణగణాలని గురించిన విమర్శ ఆ కావ్యానికి ఒక గౌరవాన్ని ఇస్తుంది. ఫిజిక్సు, కెమిస్ట్రీ మొదలైన శాస్త్రాల్లో కూడా దానికి అధికారికమైన పరీక్ష, ఆమోదము జరిగిన తర్వాతనే అది పరిశోధనా ప్రపంచంలో స్థానం తీసుకుంటుంది. కాని, చరిత్ర అనేది కొందరు పరిశోధకుల సత్యాన్వేషణ శక్తి, సామర్థ్యం, వారు చేసిన విషయ, ఆధార సేకరణ - వీటిమీద ఆధారపడి ఉంటుంది. ఆ తరువాత పరిశోధనల్లో మరికొన్ని బయటపడవచ్చు. మొదటి గ్రంథానికి సవరణలు చేస్తూ మరొక గ్రంథం పుట్టవచ్చు. ఒక చరిత్రకారుడు తనకు లభించిన ఆధారాలనుబట్టి ఒక విషయాన్ని చరిత్రలోని సత్యంగా సూచించవచ్చు. ఆ సూచన ఒక ఊహకావచ్చు. కాని, తన వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, భేదదృష్టి లేక ఏదైనా రాజకీయ ప్రయోజనాపేక్ష-ఇలాంటివి ఉంటే అతడి రచన అపోహలతో కూడుకుని ప్రచార దృష్టితో ఒక ప్రయోజన సిద్ధిని ఆశించి సాగుతుంది. ప్రజలంతా పరిశోధకులు కారు. అది అవసరం కూడా లేదు. పక్షపాత వైఖరిలేని సత్యాన్వేషణ స్వభావం కలిగి, చరిత్రలోని సత్యాలను సూచించడం బదులు, నిర్ణయించి ప్రజలు అది నమ్మాలని ప్రచారం చేయడం, తద్వారా తానొక అతీత వ్యక్తిగానో, మేధావిగానో కీర్తి సంపాదించడంకాని, లేదా, తనకున్న ద్వేషబుద్ధిని సత్యంగా ప్రచారం చేయడానికి పరిశోధనా విధానాన్ని వాడుకోవడం అనేది విజ్ఞానరంగంలో అవినీతి అనబడుతుంది. ఇటువంటిదాన్ని, మరొకవర్గం చరిత్ర పండితులు మాత్రమేకాక చదువుకున్న పౌరులు కూడా ప్రతిఘటించడం సహజం.

దేశస్వాతంత్ర్యానికి తర్వాత హిందూ దేశంలోని హిందూత్వాన్ని హీనశక్తులు కలిగిన దానిగానో, హింధువులను చరిత్రహీనులుగానో వర్ణించి రుజువుచేసే పని అంగబలం, అర్థబలం గల రాజకీయ వర్గాల పర్యవేక్షణలో బాగా సాగుతోంది. తమ చరిత్రను గౌరవప్రదంగా విశ్వసిస్తున్న ప్రజానీకానికి ఈ ధోరణి అర్థంకాలేదు. దీనిలోని రాజకీయ హస్తం గుర్తించడానికి చాలాకాలం పట్టింది. దేశంలోని విజ్ఞులైన పౌరులు కూడా ఏ విశ్వవిద్యాలయ పరిధిలోనూ కాకుండా, స్వతంత్రంగా ఈ రంగంలోకి ప్రవేశించి, కొంత గ్రంథజాలాన్ని పరిశీలించి తమ అభిప్రాయాలను ప్రకటించడం మొదలుపెట్టారు.

ఇది నేటి చరిత్ర రాజకీయం.

భారతీయులు తమ చరిత్రని పురాణరూపంలో వ్రాశారు. పురాణంలో తాము తెలుసు కున్నది దేశ చరిత్రే అన్నమాట సామాన్యులకు తెలియకపోవచ్చు. ఎందుకంటే, చరిత్రతోపాటే, పురాణంలో దేవతలు, లోకాలు, ధర్మాధర్మాలు మొదలైనవాటితో కొన్ని అతిశయోక్తులు, వర్ణనలు, మతబోధలు కూడుకుని చరిత్ర చెప్పబడుతుంది. అందువల్ల పురాణంలో ఎవరికి ఏది కావాలో అది మిగతా విషయాన్ని పరిహరించి తీసుకోవచ్చు. కాని, నేడు మేధావులకు అనేక విషయాలు అస్పృశ్య విషయాలుగా ఉండడంచేత, చరిత్ర కూడా అస్పృశ్యతకు గురైంది. పురాణాలలో అనేక విషయాలు - పరస్పరం సమన్వయంకానివి - ఎన్నో ఉన్నాయి. అందువల్ల నేడు పురాణములు, చరిత్ర గ్రంథములు కూడ సమగ్రంగా పరిశీలించవలసిందే. ఇది ఏ రాజకీయ వర్గానికి చెందని విద్యావంతులైన పౌరులు కూడా - ముఖ్యంగా పౌరులే - చేయవలసిన పని. రాజకీయ ప్రయోజనాలు, ద్వేషబుద్ధితో వ్రాయబడిన గ్రంథాలలో కూడా సమన్వయంకాని అభిప్రాయాలు ఎన్నో ఉండటము మనం చూస్తున్నాం. అందువల్ల చరిత్రపండితుల గ్రంథాలకి పూర్తి ప్రామాణ్యత ఏకగ్రీవంగా లేదన్నమాట. భారతదేశ చరిత్ర, భారతీయతయొక్క గౌరవానికి సామాజిక విషయాలపైన అవగాహన తప్పనిసరి. ఇది ఆ తరువాత చేపట్టవలసిన సంస్కరణలకు, అటుపైన సమగ్ర భారతీయత నిర్దుష్టంగా నిరూపించుకుని ముందుకు సాగడానికి సంబంధించిన విషయం. ఈ కారణంచేత చదువుకున్న పౌరుల భాగస్వామ్యానికి చరిత్ర పరిశీలనలో ప్రాముఖ్యత ఏర్పడింది.

ఈ పౌర హక్కు వినియోగమే శ్రీ ఎం.వి.ఆర్.శాస్త్రిగారి ఈ గ్రంథ రచనకు కారణము; సమర్థన. ఇందులో శ్రీశాస్త్రిగారు ఎన్నో సవాళ్లు చేసారు. దీన్ని అందరూ చదవాలి. తరువాత చరిత్రగ్రంథాలు, పురాణ సాహిత్యం ఒకచోట చేర్చి, సత్యాన్ని నిగ్గు తేల్చుకోవలసిన సమయమిది. ఇది నేటి పరిస్థితులలో విశ్వవిద్యాలయాల నుంచి ప్రజా వేదికకు తీసుకు రావలసిన అవసరం ఏర్పడింది. ఈ గ్రంథం అందరూ చూసి తత్సంబంధిత గ్రంథాలను కూడా చర్చించి మన వారసత్వాన్ని నిజరూపంలో తెలుసుకోవాలి. ఒక పాత్రికేయుడుగా, పౌరుడుగా శ్రీశాస్త్రిగారు తన బాధ్యతను నిర్వర్తించారు. వారికి నా శుభాకాంక్షలు.

15-5-2003 శివానందమూర్తి

భీమునిపట్నం.

ముందుమాట

"తెలుగు పత్రికా రంగంలో శ్రీ యం.వి.ఆర్.శాస్త్రి గత పదేళ్ళుగా సంచలనాన్ని రేకెత్తిస్తున్న అత్యంత ప్రతిభాశాలి అయిన రచయిత-సంపాదకులు" అని ఇప్పుడు వారికి ఎవరూ ప్రశంసాపత్రం ఇవ్వాల్సిన అవసరం లేదు. శాస్త్రిగారి రచనలే వారి ఉపజ్ఞకు, మౌలికమైన విశ్లేషణకు, వివేచనా సామర్థ్యతకు దర్పణాలు. వారు ఏది రాసినా వారి రచనా విన్యాసంలో వారి సొంత ముద్ర ఉంటుంది.

గత సంవత్సరం శాస్త్రిగారి "ఉన్నమాట" వ్యాస పరంపరను సంకలనంగా ప్రచురించే భాగ్యం మా సంస్థకు కలిగింది. వీరి చరిత్ర పరిశోధనలను కూడా పుస్తకంగా తేవాలనే మా సంస్థ కోరిక ఇప్పుడు ఫలించింది.

ఒక వ్యక్తి తన జ్ఞాపక శక్తిని పోగొట్టుకుంటే నిరర్థక జీవిగా ఎలా మిగిలిపోతాడో, అలాగే ఒక జాతి తన గత చరిత్రను - ఆనాటి సంఘటనల్ని పట్టించుకోకపోయినా - విస్మరించినా, ఆ జాతికి భవిష్యత్తు లేదు.

భారతదేశానికి ఎంతో చరిత్ర ఉంది. అయితే ఇతర దేశాలలో తమ చరిత్రపట్ల ఉన్నత ఆదరం, ఆసక్తి, అభిమానం, అధ్యయనం భారతదేశంలో లేవు. ఈ పరిణామానికి చరిత్ర రచయితల బాధ్యతా లోపమే ప్రధాన కారణం. మన జాతి జీవనంలోకి క్రమంగా, అక్రమంగా వచ్చిన పాలకుల తప్పిదం కూడా చాలా ఉంది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జాతి జీవనంలో చరిత్ర పఠన పాఠనాలలో సరైన దిశానిర్దేశం జరగలేదు. వెనకటి కాలంలో సంభవించిన కుట్రలు, ఢాంబిక ప్రచార తత్పరత్వం, స్వార్థ ప్రయోజనాకాంక్షలు స్వాతంత్ర్య అనంతర కాలంలోనూ చోటు చేసుకున్నాయి. విద్యా సంస్థలలో చరిత్ర రచన పట్ల, చరిత్ర చదవడం పట్ల బాధ్యతతో కూడిన దృక్పథం ప్రవేశించలేదు.

ఇటీవలి కాలంలో తెలుగు పత్రికలలో వచ్చిన శీర్షిక రచనలలో శ్రీ శాస్త్రిగారి "ఏది చరిత్ర" శీర్షిక కలిగించినంత ఉత్కంఠ, సంచలనం, ఉద్వేగం మరే రచన కలిగించలేక పోయింది అనడం సత్యదూరం కాదు. పత్రికలో ఎప్పటికప్పుడు పాఠకులు ఎదురుచూస్తూ ఈ రచన చదివారు. అభిమానించారు. ఆదరించారు. ఆత్మీయంగా భావించారు.

చరిత్రను ఎట్లా అర్థం చేసుకోవాలో, ఎట్లా చూడాలో, ఎట్లా చెప్పాలో, ఎట్లా రాయాలో అనే అంశాలమీద మనజాతి అలవరచుకోవలసిన దృక్పథాల్ని యం.వి.ఆర్.శాస్త్రిగారు ఈ వ్యాస పరంపరలో నిర్దేశించారు. ఈ రచనలో వారికి మన జాతి -సంస్కృతుల పట్ల ఎంతటి ఆర్ద్రత, చారిత్రక స్పృహ, విషయ విశ్లేషణ ఉన్నవో అర్థమవుతుంది.

మన తెలుగు వారికి ఇంత ఆదరాభిమానపాత్రమైన ఈ వ్యాసావళిని పుస్తకరూపంలో తేవడానికి అవకాశం కలిగించిన శ్రీ శాస్త్రిగారికి మా సంస్థ కృతజ్ఞత చూపడం ఒట్టి ఔప చారికం మాత్రం కాదు. వారి పట్ల అజో-విభొ-కందాళం ఫౌండేషన్ హార్దిక ప్రశంస తెలుపుకుంటున్నది.

అజో-విభొ-కందాళం ఫౌండేషన్
మే 23, 2003

అనతికాలంలోనే 'ఏది చరిత్ర' రెండో ముద్రణం వెలువరించడం అజో-విభొ-కందాళం ఫౌండేషన్‌కు ఎంతో ఆనందదాయకంగా ఉంది. 'ఏది చరిత్ర' మొదటి ముద్రణ (మే 2003) రెండు వేల కాపీలు, సెప్టెంబరు 2003లో పునర్ముద్రణ వేయి కాపీలు ఏడాది తిరక్కుండానే అమ్ముడుపోయి చరిత్ర సృష్టించింది. శ్రీ శాస్త్రిగారిని గౌరవించేవారు, వారి రచన 'ఏది చరిత్ర' చదువుకుని అలనాటి దేశ, కాల, సామాజిక పరిస్థితులను, చరిత్ర వక్రీకరణలను తెలుసుకోగోరేవారు ఇంకా ఉన్నారని మాకు తెలిసింది. అట్టి గౌరవాభిలాషులు మరెందరి కోసమో ఈ రెండవ ముద్రణ. తొలి ముద్రణలో దొర్లిన కొన్ని అచ్చుతప్పులను ఈ ముద్రణలో సవరించడమేగాక, ఈ పుస్తకంపై ప్రముఖ పత్రికలు వెలిబుచ్చిన సమీక్షలు కొన్నింటిని యథాతథం జోడించి జరిగింది. శ్రీ శాస్త్రిగారి పట్ల అజో-విభొ-కందాళం ఫౌండేషన్ మరోసారి హృదయపూర్వక ప్రశంస తెలుపుకుంటున్నది.

అజో-విభొ-కందాళం ఫౌండేషన్
ఏప్రియల్ 2004

ఎందుకు రాశాను?

'పాఠ్యపుస్తకాల్లో చెప్పే చరిత్ర అంతా తప్పే'.

చిన్నప్పటి నుంచీ వింటున్నాను ఈ మాట.

ఆఖరికి స్కూల్లో మా సోషల్ స్టడీస్ మాస్టరు కూడా పాఠాల్లో ఉన్నది మొత్తం నిజమనుకోవద్దని అనేక సందర్భాల్లో హెచ్చరించేవాడు.

ఇంగ్లీషువాళ్లు వారి స్వార్థం కోసం తిమ్మిని బమ్మి చేసి తప్పుడు చరిత్రను బనాయించారని తరవాత చాలాచోట్ల విన్నాను. ఇంగ్లీషువారు జండా పీక్కునిపోయి ఇన్ని దశాబ్దాలు అయిందికదా, మరి వారు రాయించిన తప్పులను సరిచేసి సిసలైన జాతీయ చరిత్రను మనం ఎందుకు రాసుకోలేదు అని చాలా మందిని అడిగాను. సరయిన సమాధానం దొరకలేదు.

విద్యావిధానాలు ఎన్ని మారినా, కురిక్యులం మార్పుల గురించి, సిలబసుల తబిసీళ్ల గురించి ఎన్ని చర్చలు, ఎన్ని ప్రయోగాలు జరిగినా చరిత్ర పాఠాలు మాత్రం మౌలికంగా మారింది లేదు. ఈస్టిండియా కంపెనీ కాలంలో తెల్లదొరలు పెట్టిన వరవడినే చరిత్ర బడిలో ఈనాడూ అనుసరిస్తున్నాం. స్వతంత్ర పోరాట కాలంలో మన తాతలు వల్లించిన చరిత్ర పాఠాలనే మన పిల్లలూ మరిన్ని తప్పులతో బట్టీపడుతున్నారు. ఈ మధ్యకాలంలో మార్పు ఏదైనా ఉంటే అది అబద్ధాల ఇతోధిక విస్తృతిలోనే! కాళిదాసు కవిత్వం కొంత – నా పైత్యం కొంత అన్నట్టు ఆంగ్లేయుల కల్లబొల్లి కవిత్వానికి ఆధునిక కాలంలో ఎకడమిక్ సంస్థల్లో పీఠం పెట్టిన మహామహోపాధ్యాయుల మార్క్సిస్టు పైత్యం తోడవడంతో చరిత్ర పాఠ్యాంశాలు తప్పులకుప్పలయ్యాయి.

పాఠశాలల్లో, కళాశాలల్లో చరిత్ర పాఠాల సంగతిసరే. పరీక్షల్లో పాసుకోసం కాకుండా దేశ చరిత్ర ఏమిటో తెలుసుకుందామన్న ఆసక్తితో పౌరులెవరైనా చదవదలిస్తే మంచి పుస్తకాలు దొరుకుతాయా? భారత చరిత్రకు సంబంధించి తప్పులేని సమగ్ర ప్రామాణిక గ్రంథం అని చెప్పుకుందుకు ఒక్కటైనా కనపడుతుందా?

ఏమో, అనుమానమే!

సుప్రసిద్ధ చరిత్రకారుడు **ఆర్.సి.ముజుందార్** ఆధ్వర్యంలో భారతీయ విద్యాభవన్ వెలువరించిన 11 సంపుటుల ***The History and Culture of Indian people***

వంటి బృహద్గ్రంథాలు అనేకం లేకపోలేదు. కాని వాటిలోనూ ముఖ్యంగా ప్రాచీన చరిత్రకు సంబంధించి మాక్స్‌ముల్లర్, విలియంజోన్సు వంటి అసంపూర్ణ ప్రజ్ఞావంతులు తెలిసీ తెలియక స్థిరం చేసిన కాలక్రమాన్నే, ప్రతిపాదించిన అడ్డగోలు వాదాలనే తిరుగులేని యథార్థాలుగా పరిగణించడం కనపడుతుంది. The History and Culture ...లో లబ్ధప్రతిష్ఠులైన చరిత్ర ప్రవీణులే వివిధ అధ్యాయాలను రాసినప్పటికీ వారు రాసిందంతా సహేతుకమని, అక్షర సత్యమని నమ్మకం చిక్కదు. ఒక్కోసారి (ముఖ్యంగా మొగల్ చక్రవర్తులకు సంబంధించి) ఆయా రచయితలు చెప్పిన విషయాలు సరికాదని ప్రధాన సంపాదకుడు మజుందారే వేరే నోట్‌లలో ఖండించారు కూడా. అగ్రశ్రేణి చరిత్రకారులలోనే అనేక చారిత్రకాంశాల గురించి ఏకీభావం లేదన్నదే ఇక్కడ గమనించాల్సిందల్లా. మధ్యయుగానికి సంబంధించి H.M.Elliot, Elphinstone, W.W.Hunter, Vincent Smith వంటి పాశ్చాత్య చరిత్రకారుల గ్రంథాలనే తొలితరం భారతీయ చరిత్రకారులూ ప్రమాణంగా తీసుకున్నారు. అనంతర కాలంలో చెయ్యిచేసుకున్న చరిత్రకారులకేమో ఈ తొలితరం చరిత్రకారులు ప్రమాణం. సామ్రాజ్యవాద దృక్పథం వల్లయితేనేమి... శ్వేతజాతి అహంకారం వల్లనయితేనేమి... భారతీయ ఆత్మను సరిగా పట్టుకోలేకపోవడంవల్లనేమి – పాశ్చాత్య విద్వాంసులు భారత చరిత్రకు న్యాయం చెయ్యలేదని జాతీయోద్యమ కాలం నుంచీ మన పెద్దలు చెబుతూ వచ్చారు. అయినా చరిత్ర రచన, బోధన నేటికీ పాశ్చాత్యుల మూసలోనే సాగుతూండటం.... అసలైన భారతీయ ఆత్మను ఆవిష్కరించే సమగ్ర యత్నం ఇంకా ఒక కొలిక్కి రాకపోవడం భరతజాతి దురదృష్టం.

పోనీ – పాశ్చాత్య పండితులు చెప్పినదానికి మించి భారత చరిత్రలో మార్చాల్సింది, చేర్చాల్సింది కొత్తగా ఏమీ కనపడలేదని అనుకుందామా? మన రాష్ట్రంలోనే కోట వెంకటా చలంగారు యాభై ఏళ్లకు పూర్వమే చరిత్ర మరమ్మతును ఉద్యమంగా చేపట్టి సీమ దొరలు ఎంత అజ్ఞానులో... భారతీయ పురాణాలను కొట్టిపారేసి, పాశ్చాత్య పుక్కిటి పురాణాలను నెత్తిన పెట్టుకుని వారు అల్లిన కథనాలు ఎంత అభూత కల్పనలో తిరుగు లేని రుజువులూ సాక్ష్యాలతో అనేక గ్రంథాల్లో నిరూపించారు. దేశంలో అదరికీ తెలియాలన్న ఉద్దేశంతో తన గ్రంథాలను ఎక్కువగా ఇంగ్లీషులోనే ఆయన వెలువరించారు. పాశ్చాత్యుల వాదాలను ఆయన తుత్తునియలు చేసిన తీరును అర్థశతాబ్దంగా పెద్దలందరూ గమనించారు. కాని ఎవరూ మాట్లాడరు. వెంకటాచలంగారి వాదం ఫలానా కారణాల వల్ల తప్పనీ ఇంతవరకూ ఏ పండితుడూ సోపపత్తికంగా నిరూపించలేకపోయాడు. అయినా– అలాంటి వాదం ఒకటి ఉన్నట్టే గుర్తించనట్టు నటిస్తూ తప్పుల తడకలని తేలిన 'ఆర్యదండయాత్ర – ఆర్య-ద్రావిడ సంఘర్షణ'ల వంటి పాశ్చాత్య ప్రసాదాలనే నిశ్చల భక్తితో మన మేధావులు ఇంకా కళ్లకద్దుకుంటున్నారు. అలాగే – మహమ్మదీయ పాలనలో ఎటువంటి నేరాలు, ఘోరాలు జరిగాయో సమకాలిక పర్షియన్ చరిత్రకారులే సవిస్తరంగా ఏకరవు పెట్టినా, హెచ్.ఎం.ఇలియట్, విన్సెంట్ స్మిత్ వంటి పాశ్చాత్యులు సైతం మహమ్మదీయ ప్రభువుల క్రౌర్యాన్ని, కిరాతకత్వాన్ని బట్టబయలు చేసినా 'కార్' ప్రేరితులైన మన కుహనా చరిత్రకారులు మాత్రం అసలలాంటి

అకృత్యాలే జరగనట్టు కళ్లు, మెదళ్లు మూసేసుకున్నారు. తాజ్‌మహల్‌ను షాజహాన్ కట్టించలేదని, అది పురాతన హిందూ రాజప్రాసాదమని ప్రొఫెసర్ పి.ఎన్.ఓక్ నలభై ఏళ్ల కిందటే నిరూపించినా నేటికీ మనం 'వాహ్! తాజ్' అనే మైమరచిపోతున్నాము.

చిరకాల అవకరాలను, అపభ్రంశాలను తొలగించి జాతీయ దృక్కోణం నుంచి సమగ్ర దేశ చరిత్రను అక్షరబద్ధం చేసే పని దాస్యపు సంకెళ్లు తెగిన వెంటనే మొదలై ఉండ వలసింది. వలసపాలకుల అవశేషాలను తొలగించి స్వతంత్ర జాతికి అనువైన విధానాలను రూపొందించుకునే పనిలో విద్య, న్యాయ, పరిపాలనా రంగాల్లోలాగే చరిత్ర విషయంలోనూ మన నాయకులను పెనుబద్ధకం ఆవహించింది. ఐదు దశాబ్దాలకుపైగా రాజ్యమేలిన నానా గోత్రాల పార్టీలు చరిత్రను తీర్చిదిద్దే విధిలో విఫలమయ్యాయి. కనీసం అటల్ బిహారీ వాజపేయి హయాంలోనైనా ఈ దిశలో గట్టి ప్రయత్నం మొదలైందన్న సంతోషమూ అట్టేకాలం నిలవలేదు. ఎన్డీఏ సర్కారువారు చరిత్ర పాఠ్యాంశాల రిపేరుకు ఆయత్తమైనది మొదలుకొని తడవకో గొడవతో, ఎడతెగని వివాదాలతో కాలం చెల్లిపోతున్నది. ఇందులో ఎవరి బాధ్యత ఎంతన్న సంగతి అలా ఉంచితే భారత చరిత్ర తిరగరాత సందర్భంలో ఆలోచించవలసిన అతి ముఖ్య అంశాలు అడుగునపడి అప్రధాన విషయాలపై అనవసరపు ఉద్రిక్తత రేకెత్తడం శోచనీయం.

వేదకాలంలో గోమాంసం తిన్నారా, జాట్ల పూర్వీకులు బందిపోట్లా, మహావీరుడు గోచీ మార్చాడా... లాంటి అల్పవివాదాలపై దేశంలోని కుహనా లౌకిక మేధావి వర్గం ఆవేశపడుతూ... ఎన్.సి.ఇ.ఆర్.టి. సెంట్రల్ సిలబసులో చేయబూనిన మార్పులే దేశ చరిత్రకు జీవన్మరణ సమస్యలైనట్టుగా **'ది హిందూ'** అనే హిందూవ్యతిరేక పత్రిక నాయకత్వంలో భీకర వాగ్యుద్ధం సాగుతున్న ఘట్టంలో భారత చరిత్రలోని చీకటి కోణాలపై దృష్టి సారించాలన్న ఆలోచన నాకు కలిగింది. 2001 డిసెంబర్ 16 తేదీ ఆంధ్రభూమి అనుబంధంలో నా 'ఉన్నమాట' శీర్షిక కింద 'ఏది చరిత్ర' మొదలైంది. ఓ పది పన్నెండు వారాల్లో ముగిద్దామనుకుని దీన్ని ప్రారంభించాను. రాస్తూపోయేకొద్దీ గ్రంథం పెరిగి ప్రాచీన చరిత్రను రేఖామాత్రంగా పరామర్శించేసరికే 12 భాగాలు అయ్యాయి. మరునటి వారం నుంచీ మధ్యయుగ చరిత్ర గురించి రాద్దామనుకుంటూండగా (2002 మార్చిలో) గోద్రా ఘోరకలి సంభవించింది.. ఆవేశకావేశాలు హెచ్చి, మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చి ఉన్న సమయంలో మతద్వేషం ఒక ప్రధానాంశమైన మధ్యయుగ చరిత్రను చర్చించడం భావ్యం కాదన్న ఉద్దేశంతో ఈ సీరియల్‌ను తాత్కాలికంగా ఆపేశాను.

దేశానికేకాదు. ఒక రకంగా ఇది నాకూ మంచిదే అయింది. అదనంగా దొరికిన వ్యవధిలో చరిత్ర గ్రంథాల అధ్యయనాన్ని లోతుగా కొనసాగించగా మరికొన్ని కొత్త విషయాలు తెలిశాయి. కొత్త ఆధారాలు దొరికాయి. వాటన్నిటి సాయంతో చరిత్ర పథంలో అన్వేషిస్తూ, గతాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తూపోగా గ్రంథం 42 భాగాలకు పెరిగింది. ఇందులో నేను ప్రతిపాదించిన కొత్త సిద్ధాంతాలు, కనిపెట్టిన గొప్ప రహస్యాలు ఏమీ లేవు. ఇందులోని అంశాలు చరిత్ర ప్రవీణులకు చాలా కాలంగా తెలిసినవే. అనేక తరాలుగా అందుబాటులో ఉండి ప్రామాణిక గ్రంథాలుగా పేరుపడ్డ

పుస్తకాల నుంచే ఎంచుకున్న సామగ్రితో దేశ చరిత్రను జాతీయ కోణం నుంచి ఆవిష్కరించి... కొందరు ప్రముఖ వ్యక్తుల గురించి, కొన్ని ప్రధాన ఘటనల గురించి చిరకాలంగా మేధావి వర్గంలో గూడుకట్టిన కనీసం కొన్ని పొరపాటు అభిప్రాయాల తుప్పువదలించటం ఈ రచన ఉద్దేశం. ఇది చదివాక మన దేశం గురించి, మన పూర్వుల గురించి, జాతి వారసత్వం గురించి ఒకింత గర్వం... వాస్తవ చరిత్రను భ్రష్టు పట్టించిన బధిరాంధక వర్గాల పట్ల ఒకింత క్రోధం... ఇంతటి ఉజ్వల గతం కలిగిన జాతికి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండగలదని ఒకింత విశ్వాసం ఎవరికైనా కలిగితే ఈ రచన సార్థకమైనట్టే.

'ఏది చరిత్ర'ను ఉత్తమ స్థాయిలో తానే ప్రచురిస్తానని ముందుగా ప్రకటించి, మాట నిలబెట్టుకున్న ప్రియమిత్రులు అప్పాజోస్యుల సత్యనారాయణగారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. విశేష వనరులుగల మరే సంస్థకూ, వ్యవస్థకూ తీసిపోని రీతిలో, ఇంకా చెప్పాలంటే సర్కారీ సంస్థలకన్నా బాగా తెలుగు సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల పునరుజ్జీవనం కోసం ఆయన నేతృత్వంలో అప్పాజోస్యుల – విష్ణుభొట్ల ఫౌండేషన్ చేస్తున్న నిస్వార్థ కృషి గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ వ్యాసావళి ఈ రూపంలో వెలుగుచూడటానికి ఎందరో మిత్రులు తోడ్పడ్డారు. అతి తక్కువ వ్యవధిలో ఎన్నో గ్రంథాలను ఎక్కడెక్కడి నుంచో సేకరించడానికి చాలా కష్టపడ్డ నా సహచరులకు, ఎందరో మిత్రులకు, పెద్దలకు కృతజ్ఞుడ్ని. ఈ పుస్తకానికి విలువైన పీఠిక రాసి నన్ను ఆశీర్వదించిన గురువుగారికి ప్రణామాలు.

హైదరాబాద్
20 మే 2003

ఎం.వి.ఆర్.శాస్త్రి

రచయిత గురించి...

పుట్టింది: 22 ఏప్రిల్ 1952, కృష్ణాజిల్లా, జగ్గయ్యపేటలో.

1975లో 'ఆంధ్రజ్యోతి' మొఫిసిల్ విలేకరిగా జర్నలిస్టు జీవితం ప్రారంభించి స్వయంకృషితో అట్టడుగు స్థాయి నుంచి ఎదిగారు.

1978 నుంచి 1990 వరకూ 'ఈనాడు'లో అసిస్టెంట్ ఎడిటర్ స్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేసి 'ఆంధ్రప్రభ' దినపత్రికకు డిప్యూటీ ఎడిటరుగా వెళ్లారు.

అక్కడ నాలుగేళ్ళు ఉన్నాక 1994 డిసెంబరు నుంచి 'ఆంధ్రభూమి' దినపత్రిక సంపాదకులుగా పనిచేస్తున్నారు.

పదమూడేళ్ళుగా **'ఉన్నమాట'**, పదేళ్ళుగా **'వీక్‌పాయింట్'** శీర్షికలను నిర్వహిస్తున్నారు.

మూడు దశాబ్దాల పత్రికా వ్యాసంగంలో వందలాది సంపాదకీయాలు, ప్రత్యేక వ్యాసాలు రాశారు.

వెలువడిన పుస్తకాలు: **మన చదువులు, కాశ్మీర్ కథ, ఉన్నమాట, ఇదీ చరిత్ర,**
వీక్ పాయింట్

అంకితం

ఈ పుస్తకాన్ని చూసి ఉంటే ఎంతో సంతోషించే మా అమ్మానాన్నలకు.



మార్తి లక్ష్మీనారాయణశాస్త్రి (1910-80)	అనంతలక్ష్మి (1920-94)

ఇదీ వరస

ఏది చరిత్ర ?

(ఆర్యుల నుంచి ఔరంగజేబుల దాకా)

అబద్ధాల దండయాత్ర

ప్రపంచంలో మనకూ మిగతా వారికీ తేడా ఏమిటి?

ఓ ఇంగ్లీషు వాణ్ని పిలిచి 'ఇప్పటిదాకా మీరు అనుకుంటున్న దాని కంటే మీ దేశ చరిత్ర చాలా వేల సంవత్సరాల పాతది' అని చెప్పండి. 'మీ నాగరికత ఎంతో గొప్పది. మీ పూర్వీకులు మహాఘటికులు' అని ఓ జర్మన్‌తోనో, రష్యన్‌తోనో అనండి. 'అసలు ప్రపంచ నాగరికత మీతోనే మొదలైంది. లోకానికి వెలుగు చూపింది మీరే. అందుకు ఇవిగో రుజువులు' అని ఫ్రెంచి వాడికో, డచ్చి వాడికో చెవిన వేయండి. ఎగిరి గంతేస్తారు. సంతోషం పట్టలేక మిమ్మల్ని కౌగిలించుకొని నోట్లో చక్కెర పోస్తారు. 'ఇదిగో విన్నారా' అంటూ ఆ ఊసును ఊరంతా దండోరా వేయడానికి తక్షణమే పరిగెడతారు.

అవే సంగతులు వరసబెట్టి ఓ భారతీయ మేధావికి చెప్పండి. 'ఛస్తే నమ్మను' అంటారు. మిమ్మల్ని ఎగాదిగా అనుమానంగా చూసి 'సనాతన ఛాందసుడివా? కాషాయంగాళ్ల ఏజంటువా? పురాణాలలోంచి లేచొచ్చావా?' అని చడామడా ఆరా తీస్తాడు. అయినా వదలకుండా 'కాదు మహానుభావా! ఇవన్నీ సైంటిఫిక్‌గా రుజువైన చారిత్రక వాస్తవాలు' అన్నారనుకోండి. 'అయినా సరే! నువ్వు చెప్పేది నేను వినను. ఎంత లావు ఎక్స్‌పర్టు ఎన్ని రుజువులు చూపినా పట్టించుకోను. నా అభిప్రాయం ససేమిరా మార్చుకోను' అని కళ్లూ చెవులూ మూసేసుకుంటాడు. పైగా – 'అశాస్త్రీయమైన' 'మతపైత్యపు' కూతలతో చరిత్రను తిరగరాయాలని కుట్ర చేస్తున్నారంటూ కట్టె తీసుకుని మీ వెంట పడతాడు.

తమ పురాతన నాగరికత, సారస్వతం ఇంకా ప్రాచీనమైనవనడానికి కొత్త దాఖలాలు కనపడితే చాలు ప్రపంచంలో మరే దేశం వారయినా ఆ వైనాన్ని గర్వంగా ప్రకటించి, చరిత్ర గ్రంథాల్లో వాటిని అర్జంటుగా చేరుస్తారు. ఇన్నాళ్లూ తెలిసీ తెలియక మనను మనం తక్కువ చేసుకున్నామన్న సంగతి భావి తరాలకు సంతోషంగా బోధపరుస్తారు. ఇండియా పరిస్థితి అందుకు భిన్నం. మన గొప్పతనాన్ని లోకమంతా గుర్తించినా మనం మాత్రం

ఒప్పుకోము. తప్పు అని తేలాక కూడా పరమ పవిత్రమనుకునే మన చరిత్ర గ్రంథాల్లో అక్షరం మార్చడానికి మనం ఇష్టపడం.

అదీ తేడా!

మధ్య ఆసియా నుంచో, మరోచోటి నుంచో వెళ్లి ఇండియా మీద ఆర్యులు దాడి చేశారని.... లేదా అలలు అలలుగా వెళ్లి ఇండియాలో క్రీ.పూ. 1500 ప్రాంతాల్లో వారు సౌమ్యంగా స్థిరపడ్డారని ప్రపంచంలో ఇప్పుడు ఎవరూ నమ్మడం లేదు. అంతకు పూర్వం దేశంలో విలసిల్లిన అనార్య ద్రావిడ నాగరికతను ఆర్యులు ధ్వంసం చేశారనడం శుద్ధాబద్ధమని; మొహంజొదారో హరప్పాలలో బయల్పడినది స్వచ్ఛమైన వైదిక సంస్కృతేనని ఆర్కియాలజీ, ఆంత్రోపాలజీ, జియాలజీ, ఆస్ట్రానమీ తదితర ఆధునిక శాస్త్రాలు ముక్తకంఠంతో చాటాయి. క్రీస్తు పూర్వం 3000 సంవత్సరాల నాటివనుకుంటున్న హరప్పా శిథిలాల కాలంలోనే వేద నాగరికత పుట్టిందని అనుకోనక్కరలేదు. ఇటీవలి దశాబ్దాల్లో ఆర్కియాలజీ తవ్వకాలు, పరిశోధనలు సాగే కొద్దీ వేద సంస్కృతి ఎంత ప్రాచీనమో క్రమక్రమంగా తెలిసి వచ్చింది. కాస్తా కూస్తా కాదు... కనీసం పదిహేను లక్షల చదరపు కిలోమీటర్ల విశాల ప్రాంతంలో ఈ నాగరికత వర్ధిల్లిందనీ, ప్రాచీన ఈజిప్టు, మెసపొటేమియా నాగరికతలు రెంటినీ కలిపినా పరిమాణంలోనూ, నాణ్యతలోనూ దీనికి సాటిరావని శాస్త్రీయంగా రుజువైంది. ఈ వేద నాగరికత ఉచ్ఛస్థితిలో వెలిగిపోయిన దృష్టాంతాలు క్రీ.పూ. 6500 నాటి (ప్రస్తుత పాకిస్తాన్‌లోని) మెహర్‌గఢ్ తవ్వకాల్లో బయటపడటంతో హరప్పా కాలానికి కనీసం నాలుగువేల సంవత్సరాలకు పూర్వం నుంచే (అంటే ఇప్పటికి తొమ్మిది వేల సంవత్సరాలకు పూర్వమే) సింధు - సరస్వతి నాగరికత అవిచ్ఛిన్నంగా, అఖండంగా విలసిల్లిందని స్పష్టమైంది.

ప్రపంచంలోని ఏ జాతికైనా ఇది గర్వించదగిన గతం! ఇలాంటి చరిత్ర తమకు ఉన్నట్లు కమ్యూనిస్టు చైనీయులకు తెలిస్తే పటం కట్టుకుని నెత్తిన పెట్టుకు ఊరేగుతారు. ప్రపంచమంతటా మార్క్సిజానికి నూకలు చెల్లినా మార్క్సును కొలవడం మానని మన కుహనా చరిత్రకారులకు మాత్రం దేశానికి ఇంతటి ప్రాచీన చరిత్ర ఉందని అంగీకరించడానికి మనసొప్పదు. తమ పూర్వులు అనాగరికులు, అజ్ఞానులు, దుర్మార్గులు, క్రూరులు, విజ్ఞానమంతటినీ విదేశాల నుంచి అరువు తెచ్చుకున్న వారు అని వెనకటి ఇంగ్లీషు మాయావులు దుర్బుద్ధితో నూరిపోసిందే ముమ్మాటికి నిజమని నమ్మడానికి వారు చాలా ఇష్టపడతారు!

ప్రాచీన కాలంలో వలసలు నిజమే. కాని అవి బయటి నుంచి ఇండియాలోకి కాక... ఇండియా నుంచే బయటికి జరిగాయి. ప్రపంచమంతా తాండవించిన ప్రకృతి వైపరీత్యాల మూలంగా, జలవనరులు క్రమేణా వట్టిపోయిన పర్యవసానంగా క్రీ.పూ. 4000కు ముందు నుంచే తూర్పు నుంచి పడమరకు ఆర్య సంతతి వారు వలసపోసాగారు. క్రీ.పూ. 1900 నాటికి సరస్వతి నది పూర్తిగా ఎండిపోవడంతో ఇరాన్, పశ్చిమ ఆసియా తదితర ప్రాంతాలకు వలసలు ముమ్మరమయ్యాయి. పశ్చిమాసియాలో దొరికిన పురాతన రికార్డులను బట్టి, ప్రాచీన ఇరానియన్ గాథలు, సారస్వతాలను బట్టి ఈ సంగతి ధ్రువపడింది.

ఈ ప్రకారంగా 'ఇటు నుంచి అటు' వెళ్ళిన ఇండో-ఆర్యన్లే మనం ఇండో-యూరోపియన్ జాతులనుకునే వాటికి మూలపురుషులన్న చారిత్రక సత్యం కట్టెదుట కొట్టొచ్చినట్టు

కనపడుతున్నా.... అది వాస్తవమని విదేశీ చరిత్రకారులు సైతం అంగీకరించినా - చరిత్రకారులుగా చలామణి అవుతున్న మన మహామేధావులు మాత్రం ఇంకా 'అటు నుంచి ఇటు' ఆర్యుల దండయాత్ర సిద్ధాంతాన్నే పట్టుకు వేలాడుతున్నారు.

అబద్ధాల అంకయ్యకు అరవై నాలుగు అసత్య ప్రమాణాలని సామెత. ఆర్యుల సిద్ధాంతానిదీ ఇదే బాపతు. మాయోపాయాలతో పాపభీతి లేకుండా తెగబడి ఇండియాను ఆక్రమించిన తెల్లదొరలు భారతీయులను మానసికంగా బానిసలను చేసుకోవడం కోసం తమకు అనువుగా కృత్రిమ చరిత్రను విశ్వామిత్ర సృష్టి చేయబోగా స్పెషలార్డరు మీద తయారైంది ఆర్యుల గురించి మిథ్యావాదన. నల్లవారైన ఆసియా, ఆఫ్రికా వాసులపై తెల్లవారయిన తాము పెత్తనం చెలాయిస్తున్నారు కనక ప్రాచీన కాలంలోనూ అలాగే జరిగి ఉండాలని ఆంగ్లేయులు ఊహించారు. (లేదా అలా జరిగి వుంటే బావుంటుందని నిశ్చయించుకున్నారు.) అదే ప్రకారం-ఇండో యూరొపియన్ సంతతి వారయిన ఆర్యులు అనే సుకుమారపు తెల్లతోలువారు క్రీ.పూ. 1500లో ఇండియా మీద దండెత్తి అక్కడి అనాగరిక, అజ్ఞానపు జనానికి నాగరికత నేర్పి అక్కడే స్థిరపడ్డారని 19వ శతాబ్దం చరిత్ర పాఠాల్లో రాయించారు. ఆ విధంగా పుట్టిన ఆర్యుల దండయాత్ర సిద్ధాంతానికి శాస్త్రీయ ప్రాతిపదిక ఏదీ లేదు. అసలా కాలానికి పురావస్తు తవ్వకాలు, శాస్త్రీయ పరిశోధనలనేవే లేవు. అలా కొన్ని తరాలు గడిచాక మొహంజొదారో, హరప్పాల్లో తవ్వకాలు జరిగాయి. క్రీ.పూ. 3000 నాటికే అంటే ఇంగ్లీషు వారు పుట్టించిన ప్రకారం ఋగ్వేద ఆర్యులు ఇండియా చేరటానికి వెయ్యి సంవత్సరాల ముందే ఇండియాలో తెల్లవారికి సైతం కళ్ళు తిరిగేంత అద్భుతమైన నాగరికత వర్ధిల్లిందని వాటివల్ల వెల్లడైంది. అది సిసలైన వైదిక నాగరికత అన్న సంగతి దాని మొహం మీదే రాసి ఉంది.

తప్పులో కాలు వేశామన్న సంగతి గుర్తించి, తాము అల్లింది కట్టుకథ అని ఒప్పుకుని... భారతదేశంలో తెల్ల - నల్ల కల్లలతో నిమిత్తం లేకుండా కొన్ని వేల సంవత్సరాలుగా ఉజ్వలమైన వేద నాగరికత విలసిల్లిందన్న సంగతి ఇంగ్లీషు దొరలు ఒప్పుకుని వుంటే ఏ గొడవా లేకపోయేది. కాని - ఆ తప్పును కప్పిపుచ్చుకోవడానికి తెల్ల దొరలు, వారికి విధేయులైన కళ్ళు లేని ఇండాలజిస్టులు ఇంకో కథ అల్లారు. తవ్వకాల్లో బయల్పడ్డ నాగరికత వేద సంబంధమైనది కాదనీ... అనార్యులైన ద్రావిడులదనీ... వారిని బయటి నుంచి వచ్చిన అనాగరిక ఆర్య తండాల వారు ఓడించి, వారి నాగరికతను నాశనం చేసి, ఆ తరవాతెప్పుడో తీరిగ్గా వేదాలను రాసుకున్నారనీ ప్లేటు మార్చారు.

'నాగరిక' ఆర్యులను అవసరార్థం 'అనాగరికులు'గా, నాగరికతల విధ్వంసకులుగా చిత్రించి పిల్లి మొగ్గవేసి, అదే నిజమని చరిత్ర గ్రంథాల్లో దబాయించడంతో సమస్య తొలగలేదు. అసలు సమస్యలు అప్పుడే మొదలయ్యాయి. కాలం గడిచే కొద్దీ కొత్త కొత్త విషయాలు శాస్త్రీయ పరిశోధనల్లో వెల్లడవడంతో ఆర్య - ద్రావిడ విరోధాల సిద్ధాంతమే అడుగు ఊడి వైరుధ్యాల బండారం బట్టబయలైంది.

హరప్పా తవ్వకాలను సాగించిన సర్ మోర్టిమర్ వీలర్‌గారు శిథిలాల్లో ఇవి అనార్యులవని, అవి ఆర్యులవనీ అపరహంసలా వేరుచేసి... వీరు ఆక్రమణదారులని, వారు దాడికి లోనైన వారని నిగ్గు తేల్చారు. అదే తీర్పును చరిత్ర గ్రంథాల రచయితలందరూ ఔదలదాల్చారు. అయితే ఇటీవలి కాలంలో ఆర్కియాలజిస్టులు ఆధునిక పరిజ్ఞానంతో ఆయా శిథిలాలను

శోధిస్తే అసలు నిజం బయటపడింది. అదేమిటో సింధు నాగరికత స్పెషలిస్టు అయిన ప్రఖ్యాత ఆర్కియాలజిస్టు డాక్టర్ ఎస్.ఆర్.రావు మాటల్లో చదవండి:

> A restudy of the stratigraphy of Wheeler's excavation of Harappa revealed that there was a time gap between the mature Harappan (Cemetary R 37) and the later "Cemetary H" Cultures. Wheeler had treated the latter as invaders and the former as the invaded. But stratigraphy clearly indicated that the so-called "invaded" were not present when the so-called 'invaders' came. Fresh excavation in Mohenjodaro by G.F.Dales and a study of the artefacts confirmed that the massacre was a myth. The ten skeletons that had cut marks did not belong to the latest phase... As regrds the indentification of the Indus people as non - Aryans on the plea that horse and rice were unknown to them, the excavations by me at Rangpur, Lothal and other excavations at Kalibangan and at Surkotada by J.P.Joshi have yielded horse bones as well as rice. The so-called stone objects considered as phalluses by Marshall and Piggot are truncated conical stone weights....
>
> [Foreword to ***The Aryan Invasion Theory : A Reappraisal*** **by S.G.Talageri 1993]**

(హరప్పాలో వీలర్ తవ్వకాలు స్ట్రాటిగ్రఫీని పునఃపరీక్షిస్తే ఆయన పేర్కొన్న రెండు సంస్కృతులు ఏకకాలానివి కావని తేలింది. మొదటి గుంపు వారిని దురాక్రమణదారులుగా, రెండో గుంపు వారిని దాడికి లోనైన వారిగా వీలర్ గుణాల పరిగణించాడు. కాని - 'దాడి చేసేవారు' వచ్చే సమయానికి 'దాడికి లోనైన వారు' అక్కడ లేనే లేరని స్ట్రాటిగ్రఫీ స్పష్టంగా వెల్లడించింది! మొహెంజొదారోలో జి.ఎఫ్.డేల్స్ కొత్తగా జరిపిన తవ్వకాలు, కళాఖండాల పరీక్షలు అనార్యుల ఊచకోత అబద్ధమని నిరూపించాయి. ఇక గుర్రం, బియ్యం ఎరుగని వారు కాబట్టి సింధు ప్రజలు అనార్యులన్న వర్గీకరణ విషయానికి వస్తే ... రంగపూర్, లోథల్‌లలో నేను జరిపిన తవ్వకాల్లోనూ, కాళిబంగన్, సుర్కోతదల్లో జె.పి.జోషి సాగించిన తవ్వకాల్లోనూ గుర్రం ఎముకలు, బియ్యం రెండూ బయటపడ్డాయి. లింగాలు అంటూ మార్షల్, పిగ్గట్‌లు చూపించిన వస్తువులేమో కాటాకు వాడే రాతిగుండ్ల శకలాలు.')

అదీ కథ! 'ఇక్కడ స్వదేశీయులు వుండేవారు; అక్కడ విదేశీ ఆక్రమణదారు లుండేవారు. వారిని వీరు ఇదిగో ఇలా నరికిపారేశారు.' అని పాత చరిత్రకారులు వినిపించిన స్థలాలు వేరు కాలాలకు చెందినవి. వాటి మధ్య శతాబ్దాల ఎడం వుంటే ఊచకోతకు ఆస్కారమెక్కడ? కొమ్ములున్న దేవతా ప్రతిమను, లింగాకారం వంటి రాళ్లను చూసి అదిగో పశుపతి, ఇదిగో రుద్రుడని మన చరిత్ర విధాతలు తేల్చారు. వాటిని కొలిచిన వారు ప్రస్తుతం దక్షిణ భారతదేశంలోని ద్రావిడుల పూర్వీకులే అయి ఉండాలని ఊహించేశారే గాని - నేపాల్,

కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ లాంటి ఉత్తరాది ప్రాంతాల్లోనూ శివారాధన జాస్తి అని, సనాతన వేద సంస్కృతిలో అదీ ఒక భాగమని గుర్తించలేకపోయారు.

కొమ్ములున్న పశుపతిని క్రైస్తవానికి ముందు యూరప్‌లోనూ ఆరాధించేవారు. ఆ బొమ్మను చిత్రించిన పెద్ద వెండికప్పు జర్మనీలోనూ బయటపడింది. ఇందులో ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. సరస్వతి నది కాలక్రమంలో పలుమార్లు గతిని మార్చుకుని, చిక్కిపోతూండగా పర్యావరణ వైపరీత్యాల వల్ల క్రీ.పూ. 2200 ప్రాంతంలో కొన్ని వందల సంవత్సరాలు తీవ్ర దుర్భిక్షం, వరదలు, భూకంపాల వంటి వైపరీత్యాలు బాధించిన కాలంలో మనం ఆర్యులనుకుంటున్న వారు పశ్చిమ , వాయవ్య దిశల్లో ఇండియా నుంచి ఇరాన్, పశ్చిమాసియా, యూరప్‌లకు దఫాల వారీగా వలస పోయారని శాస్త్రీయంగా రుజువైంది. అయినా మన చరిత్రకారులు తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లని బందగా వాదించి, తమ అసంబద్ధ సిద్ధాంతానికి లోబడనిది ఏదీ నిజం కావటానికే వీల్లేదని, అది ఎంత నికార్సయినదయినా తాము మాత్రం గుర్తించబోమని మొండికి పడటంతో పాఠ్యగ్రంథాల్లోని భారత చరిత్ర అంతుచిక్కని పజిల్‌లా, అయోమయపు పుంతలా, జవాబులేని ప్రశ్నలా తయారైంది.

ఉదాహరణకు - హరప్పా సంస్కృతి వైదిక ఆర్యులది కాకపోతే వేదాల్లో పేర్కొన్న యజ్ఞశాలలు హరప్పాలో ఎలా కనపడ్డాయి? యజ్ఞశాలలు ఎలా కట్టాలో, ఏ కొలతల ప్రకారం ఏ రీతిలో ఉండాలో వేదాల అనంతర కాలానికి చెందిన శుల్బ సూత్రాలు నిర్దేశించాయి. హరప్పా యజ్ఞశాలలు సరిగ్గా అలాగే ఉన్నాయి. ఆ సంస్కృతికి వైదిక వాసనే లేకపోతే ఇది ఎలా సాధ్యమైంది? యజ్ఞశాలలనేమో అనార్యులైన ద్రావిడులు కట్టారు; వాటిని ఎలా కట్టాలన్న ఆదేశాలనేమో వైదిక ఆర్యులు ఇచ్చారా?! యజ్ఞశాలల ఆకారంలోనే కాక యజ్ఞవిధానంలోనూ వేద సంస్కృతి ముద్ర హరప్పాలో స్పష్టంగా కనపడింది. అక్కడ యజ్ఞకుండాల్లో కనపడ్డ పురోడాశాలు, బలి ఇచ్చిన జంతువుల అస్థికలను గమనించి కూడా అది వేదకాలపు ఆర్య నాగరికత కాదని నమ్మని వారి బుర్రలను అర్జంటుగా వైద్య నిపుణుల చేత రిపేరు చేయించడం మేలు!

సాధారణంగా సంస్కృతి గల జాతికి సారస్వతం లేకుండా ఉండదు. సారస్వతం గల జాతికి సంస్కృతి లేకుండానూ పోదు. లిపిలేని... భాష అభివృద్ధి కాని అనాగరిక జాతికి సంస్కృతే తప్ప సాహిత్యం లేదంటే వింత కాదు. కాని హరప్పా నాగరికత అలాంటిది కాదు. పురావస్తు తవ్వకాల్లో బయటపడిన హరప్పా ముద్రల మీద, కళాఖండాల మీద స్పష్టమైన రాతలున్నాయి. హరప్పన్లు ద్రావిడులన్న నమ్మకంతో వారి లిపి కూడా ద్రావిడ భాషే అయి ఉండాలని ఊహించిన సోకాల్డ్ నిపుణులకయితే ఎన్ని 'ద్రావిడ ప్రాణాయామాలు' చేసినా హరప్పా లిపి పట్టు బడలేదు. అదీ ఆర్యసంస్కృతే కనుక లిపి కూడా ఆర్యభాషదే కావొచ్చునని తలిచిన వారికేమో హరప్పా లిపి కీలకం సులువుగా దొరికింది. హరప్పా ముద్రల మీది భాషకు సంస్కృతంతో దగ్గరి సంబంధం ఉన్నదని సహేతుకంగా వెల్లడైంది. దీన్ని బట్టి హరప్పా వారికి లిపీ ఉంది; భాషా ఉంది అని తేలింది కదా? మరి - భాష ఉన్నప్పుడు సాహిత్యం ఎందుకు లేదు? నవ నాగరికులు సైతం ఆశ్చర్యపోయేంత గొప్ప కట్టడాలు నిర్మించి, అద్భుత కళాఖండాలను సృష్టించి, యజ్ఞాలు చేసి, దేవతలను ఆరాధించి,

జీవితాన్ని అనుభవించి దర్జాగా బతికిన హరప్పన్లు ఆర్యులు కాకపోతే, వారి కాలానికి అసలు వేదాలే పుట్టి ఉండకపోతే మరి వారి సారస్వతం ఏది? ఏమైంది? అంతటి ఉచ్ఛస్థాయిలోని నాగరికతకు భాష, లిపి ఉన్నా సాహిత్యం లేదంటే నమ్మగలమా?

అలాగే – గ్రీకు జామెట్రీకి ఆద్యుడైన పైథాగరస్ పుట్టటానికి రెండువేల సంవత్సరాలకు పూర్వమే ఏ కట్టడాన్ని ఎలా కట్టాలో, జామెట్రీ వివరాలతో కచ్చితంగా వేద సూత్రాల్లో నిర్దేశించిన ఆర్యులు స్వయంగా అలాంటి కట్టడం ఒక్కటీ కట్టలేదా? ఆర్కియాలజీ తవ్వకాల్లో ఇప్పటిదాకా బయటపడినవన్నీ హరప్పా, తత్సంబంధిత సింధు నాగరికత చిహ్నాలే కదా? ఆ నాగరికత ఆర్యులది కాకపోతే వారి నాగరికత ఏది? క్రీ.పూ. 1500లో అనార్య హరప్పా నాగరికతను ధ్వంసం చేసిన ఆర్యులు క్రమేణా నాగరికులై నగరాలను కూడా నిర్మించారని మన మహాచరిత్రకారులు అంటారు కదా? అలా 'ఆర్యన్ ప్రత్యేకం' అనదగ్గ... హరప్పాకు భిన్నమైన నాగరికత అవశేషం ఒక్కటీ కనపడదేమి? హరప్పా ద్రావిడులకేమో నాగరికత మాత్రం ఉండి సాహిత్యం లేదా?! ఆర్యులకేమో వేద సాహిత్యం మాత్రం ఉండి నాగరికత లేదా?!

అదీగాక – ఆర్యులు, ద్రావిడులు ఆగర్భ శత్రువులైతే ఆ శత్రుత్వపు ఛాయలు భారతీయ చరిత్రలో ఎక్కడా కనపడవేమి? ఆర్యులు బయటి నుంచి వచ్చిన దురాక్రమణదారులు; వారి మతంతో వారి సంస్కృతితో మనకు సంబంధం లేదు అని దక్షిణాది ద్రావిడులు ఎప్పుడైనా అనుకున్నారా? ఉత్తరాది ఆర్యులు తమ మీద దాడి చేసి దారుణంగా లొంగదీసుకున్నారన్న ప్రాచీన గాథ దక్షిణాదిన ఒక్కటైనా ఉందా? ఉత్తరాది నుంచి దక్షిణా పథానికి వచ్చిన తొలి మహర్షి అగస్త్యుడిని ఇక్కడి వారు అర్చించారే తప్ప అసహ్యించుకోలేదు కదా? వైదిక సూత్రకారులైన బోధాయన, ఆపస్తంబులు.... ఆర్ష సంస్కృతికి ఈనాటికీ ప్రాతః స్మరణీయులైన శంకర, రామానుజ, మధ్వాచార్యులు దక్షిణాది వారే కదా? ఆర్యులు, ద్రావిడులు వేర్వేరు జాతుల వారయితే ఆర్యభాష అయిన సంస్కృతానికి, తెలుగు వంటి ద్రావిడ భాషలకు అంత దగ్గరి సంబంధం ఎలా పొసగింది? శరీర నిర్మాణంలో కాని, మతపరంగా గాని, సాంస్కృతికంగా గాని ఉత్తర, దక్షిణవాసుల మధ్య చరిత్ర కందని కాలం నుంచీ ఎలాంటి వైరుధ్యమూ లేనప్పుడు ఆర్య – ఆర్యేతర వివాదం ఎంత మతిలేని రాద్ధాంతం?!

ఎండిన నదికి వందనం?!

రామాంధ్ర కతలెల్ల మేమెరుంగని యవే
కాటమరాజుకు కర్ణుడోడె
బాగోత కతలంట పలుమారు వినలేదె
యుగనేశు దర్జును నిరగమొడిసె
బారత కతలోన బాలరాజొక్కడు
కుంభకర్ణుని బట్టి గుద్ది సంపె

రామాయణమేమిటి? అందులో కాటమరాజును కర్ణుడు ఓడించటమేమిటి? భాగవతంలో అర్జునుణ్ని విఘ్నేశ్వరుడు విరగమొడియటమేమిటి? బాలరాజు ఏకాలపు వాడు? కుంభకర్ణుడెక్కడి వాడు? ఇతణ్ని అతడు - అదీ మహాభారత కథలో - గుద్ది చంపటమేమిటి?

ఇలా పొంతనలేని వెర్రి మొర్రి కబుర్లను ఏకరువు పెట్టి **"అనుచ మూర్ఖులు పలుకుదురవని యందు"** అంటాడు వేణుగోపాల శతకంలో పోలిపెద్ది వెంకటరాయకవి.

కవి కదా - ఏదో తమాషాకు అన్నాడు లెమ్మని తీసిపారేయకండి. ఇలా తెలిసీ తెలియకుండా కాలాలను తారుమారు చేసి, చరిత్రలను కలగలిపి, అవే పరమ సత్యాలని, తామే సర్వజ్ఞులమని విర్రవీగే మహాత్ములు ఈ కాలంలోనూ ఉన్నారు.

ఎక్కడో కాదు - మన మధ్యనే.

మేధావుల ముసుగులో!

చరిత్రకారుల వేషంలో!!

మన ముత్తాతల తాతల కాలం నుంచి నేటిదాకా దేశం లోని స్కూళ్లు కాలేజీల్లో సీరియస్‌గా నేర్పుతున్న చరిత్ర పాఠాలు దాదాపు అన్నీ - ఇదిగో ఇందాక ప్రస్తావించిన 'రామాయణంలో కాటమరాజు' కథలలాంటివే.

మనం చదువుకున్న వాళ్లం. పుక్కిటి పురాణాలను మనం నమ్మం. మన చరిత్ర మనకు బాగా తెలుసు. కొత్తగా నేర్చుకోవలసింది; అభిప్రాయం మార్చుకోవలసింది ఏమీ లేదు...

అని మనకు గట్టి నమ్మకం. తరతరాలుగా ఇదే చరిత్రను మనము, మన పూర్వులు చదువుతూ వచ్చాము కాబట్టి... మహామహా జాతీయ నాయకులే, కొమ్ములు తిరిగిన స్వదేశీ, విదేశీ పండిత ప్రకాండులే దీనిని అంగీకరించారు కాబట్టి... ఇదే అక్షర సత్యమని మనం అనుకోవడం సహజమే. ఈ చరిత్ర సరికాదంటూ - తాము నమ్మేదే నిజమంటూ సనాతనవాదులు చెప్పే కృత, త్రేతాయుగాల లక్షల సంవత్సరాల లెక్కలూ, మనువులూ మన్వంతరాలూ పురాణాల సాక్ష్యాలూ నమ్మశక్యం కాని, నిర్హేతుక ఛాందస భావాలని చెప్పటంలోనూ తప్పులేదు. ఎవరో ఏదో చెప్పారని, పూర్వీకులు ఏదో రాశారని మనం కూడా కళ్లు మూసుకుని నమ్మవలసిన పనిలేదు. శాస్త్రపరీక్షకు నిలవనిది, నిర్దిష్టమైన రుజువు లేనిది, తర్కబద్ధంగా తోచనిది ఏదయినా ఖండితంగా తిరస్కరించవలసిందే. అశాస్త్రీయమైన విశ్వాసం ఎంత పాతదైనా, ఎంత గొప్పవారు కలిగించినదైనా వదిలేయవలసిందే.

కరెక్టే! కానీ ఇదే రూలు పురాణాలకూ, మత విశ్వాసాలకే కాక మన ఆధునిక విశ్వాసాలకూ, ముఖ్యంగా చరిత్రల అధ్యయనానికీ వర్తించాలి కదా? పుక్కిటి పురాణాలు ప్రత్యక్షర సత్యాలని మొండిగా వాదించేవాడు ఎంత పిడివాదో- చరిత్ర గ్రంథాల్లో రాసింది తప్పు అని శాస్త్రీయంగా రుజువైన తరవాత కూడా ఆ గ్రంథాలనే పట్టుకు వేలాడి, వాటిలో అక్షరం మార్చరాదని బండగా వాదించేవాడూ అంతే పిడివాది కాదా?

ఇటీవల్ల వార్తల కెక్కిన ఒక రొమిలా థాపర్‌నో, ఒక రామ్ శరణ్‌శర్మనో, ఇంకో సతీశ్‌చంద్రనో వేలెత్తి చూపవలసిన పనిలేదు. స్వాతంత్ర్యానికి ముందా; తరవాతా? ఏ సంవత్సరం? ఏ సిలబసు ప్రకారం? ఏ తరగతి పాఠం? ఎవరు రాసిన పుస్తకం... అని తరచి చూడనక్కర్లేదు. పాఠ్యగ్రంథమా కాదా అన్న మీమాంసా అవసరం లేదు. అనేక తరాలుగా దేశంలోని విద్యాసంస్థల లోపలా వెలుపలా ప్రాచుర్యంలో వున్న చరిత్ర గ్రంథాల్లో వివరాల తారతమ్యాలూ, అభిప్రాయాల్లో భేదాలు కొన్ని ఉన్నా ప్రాచీన భారత చరిత్ర ప్రధానాంశాల వరకూ అందరూ ఏకీభవించినదే.

చరిత్రకారుల్లో జాతీయ, అంతర్జాతీయ ఏకాభిప్రాయం పొసగిందని అను కుంటున్న భారత చరిత్ర పాతరాళ్లు, కొత్తరాళ్లు, లోహయుగాలను దాటాక మొహంజొదారో, హరప్పాలలో బయటపడిన సింధు నాగరికతతో మొదలవుతుంది. క్రీస్తు పూర్వం సుమారు 2500 సంవత్సరాల నాటిదిగా భావిస్తున్న ఈ నాగరికతలో అద్భుతమైన కట్టడాలు, స్నానఘట్టాలు, రమణీయ విహార స్థలాలు, అత్యాధునికులు సైతం ఆశ్చర్యపోయేంత చక్కటి పౌర సదుపాయాలు తవ్వకాల్లో బయటపడిన వైనాన్ని వివరించి అదంతా భారతదేశంలో అదివాసులైన కర్రిరంగు ద్రావిడుల సంస్కృతి అని చరిత్ర తెలుస్తుంది. తరవాత వచ్చిన వేద సంస్కృతికి అది పూర్తిగా భిన్నమైనదని, ఆ కాలంలో ఆరాధించిన రుద్రుడు, పశుపతి వగైరాలు పక్కా ద్రావిడ దేవుళ్లని- తవ్వకాల్లో బయల్పడిన దేవతామూర్తులు, ముద్రలు వగైరాలను బట్టి తెలుసుకుని... చిట్టచివరికి క్రీ.పూ. 1500 ప్రాంతంలో అంత గొప్ప సంస్కృతి ఘోరంగా ధ్వంసమైందని గుండె బరువెక్కేలా మనం చదువుకుంటాం.

ఎలా ధ్వంసమైంది?

విదేశీయుల దండయాత్ర వల్ల.

ఆ విదేశీయులెవరు?

ఆర్యులు.

ఎక్కడి నుంచి వచ్చారు?

బహుశా మధ్య ఆసియా నుంచి. కాకపోతే దక్షిణ రష్యా నుంచి.

వారు ఏ జాతివారు? ఎలా ఉంటారు? ఏమి చేశారు?

ఇండో-యూరోపియన్లు. తెల్లగా ఉంటారు. అనాగరికులు. దేశదిమ్మరులు. గుర్రాలెక్కి ఇండియా మీద దండయాత్ర చేశారు. నాగరికులైన నల్లజాతి ద్రావిడులను అశ్వబలంతో ఓడించారు. వారి నగరాలను నేలమట్టం చేశారు. ఎంతో మందిని ఊచకోత కోశారు. వారి దెబ్బకు తాళలేక ద్రావిడులు దక్షిణ భారతానికి పారిపోయారు. ఆ తరవాత కూడా 'దాసుల'ని, 'దస్యుల'ని పేరు పెట్టి ఆర్యులు వారిని నానారకాలుగా బాధించారు. ఆ విధంగా క్రీ.పూ. 1500 ప్రాంతంలో సింధు లోయలో స్థిరపడిన ఆర్యులు మొదట్లో గణతంత్ర పద్ధతిన ఆదిమ జీవనం సాగించి క్రమేణా పట్నవాసాలకు, రాజ్యాల స్థాపనకు అలవాటు పడ్డారు. ఆ క్రమంలోనే తమ స్మృతులను, ఆలోచనలను, ఆరాధనలను ఏకరువు పెడుతూ క్రీ.పూ. 1200లో ఋగ్వేదాన్ని రాశారు....

వీటికి అధారమేమిటి?

పురావస్తు తవ్వకాలు. భాషాపరమైన సాక్ష్యాలు. వాటిని పరిశీలించి, చరిత్ర స్పృహ అనేది ఏనాడూ ఎరుగక పుక్కిటి పురాణాలను పట్టుకు వేలాడే మన అజ్ఞాన జాతి మీద దయతో విజ్ఞాన విశారదులైన ఆంగ్లేయ నిపుణులు కాచివడబోసిన నిజాలు.

సింధు నాగరికత ఆర్యులది కాదు అనడానికి 1931లో మొహంజోదారో తవ్వకాల తబిసీళ్లు తేల్చిన ప్రవీణుడు సర్ జాన్ మార్షల్ ప్రమాణం. సింధు నాగరి కతను ఆర్యులు ధ్వంసం చేశారనడానికి సర్ మోర్టియర్ వీలర్ మాట వేదవాక్కు. వీలర్ సర్ ఏమి చేశారంటే - అంతకుపూర్వం బయల్పడిన హరప్పా అవశేషాల దగ్గర మళ్లీ తవ్వకాలు జరిపించి కొత్త శిథిలాలను కనుగొని, వాటిని బట్టి హరప్పా నగరాన్ని ఇంద్రుడి నాయకత్వంలో దాడిచేసి ఆర్యులు నాశనం చేశారని మొహంజొదారో తదితర సింధు జనావాసాలుకూడా ఆర్యుల వల్లే నేలమట్టమయ్యాయని 1946లో తేల్చి చెప్పారు. స్టువర్ట్ పిగ్గాట్ (Stuart Piggot) అచ్చ ఇంగ్లీషు దొర ఇంకొక అడుగు ముందుకేసి - దురాక్రమణదారులైన ఆర్యులు ఒళ్లెరుగని ద్వేషంతో ఆనార్య ప్రజానీకాన్ని సామూహికంగా ఊచకోత కోశారని, ఆఖరికి పసిపిల్లలను కూడా వదలక నరికిపారేశారని కళ్లకు కట్టినట్టు (ఊహించి) చెప్పాడు. హరప్పా ముద్రల్లో గుర్రం బొమ్మ లేదు కనుక అప్పటి వారు గుర్రం మొగం ఎరుగరని, అంత నాగరికత ఉండి కూడా చేతిలో గుర్రం లేకపోవడం వల్లే ఆర్య తండాల దండయాత్రలో పాపం ఘోరంగా ఓడి దారుణంగా సర్వనాశన మయ్యారని ఆంగ్లేయ ప్రవీణులందరూ సాధికారికంగా నిర్ధారించారు. తవ్వకాల్లో బియ్యం ఆనవాలు లేకపోవడాన్ని బట్టి కూడా ఆది ఆర్య సంస్కృతి కానేరదని వారికి గట్టి నమ్మకం కుదిరింది. పశుపతి ఆరాధన గురుతులైన రాతిలింగాలు సరేసరి.

ఇక ఈ అనార్య నాగరిక విధ్వంస కార్యక్రమం యావత్తూ క్రీ.పూ. 1500లో జరిగిందనీ, అనంతరం దేశంలో స్థిరపడ్డ ఆర్యులు క్రీ.పూ. 1200లో ఋగ్వేదం రాశారనీ కాల నిర్ణయం చేసిందెవరు?

మహామేధావి మాక్స్‌ముల్లర్.

అలా అనడానికి ఆయన దగ్గరున్న ఆధారాలేమిటి?

తెలియదు.

ఆ అభిప్రాయం కరెక్టనడానికి ఒక్క చారిత్రక సాక్ష్యమైనా ఉందా? శాస్త్రీయమైన రుజువు ఒక్కటైనా ఉందా?

లేదు.

కాని – మాక్స్‌ముల్లర్ అంతటి వేదపండితుడు అన్నాడు కనక అది నిజమయ్యే వుండాలని పాశ్చాత్య, ప్రాచ్య మేధావులందరూ అనుకున్నారు. అదే అక్షరసత్యంగా, తిరుగులేని చారిత్రక వాస్తవమని మన చరిత్రకారులు కళ్లకద్దుకుని అంగీకరించారు. పాతతరం భారతీయ చరిత్రకారుడు ఆర్.ఎస్.మజుందార్ [An Advanced History of India, 1950] మొదలుకుని ఈ కాలపు చరిత్ర- గురువులు ఆర్.ఎస్.శర్మ, రొమిలా థాపర్ ప్రభృతుల వరకూ అందరిదీ ఇదే వరస. ఇందరు మహావిద్వాంసులు శాస్త్ర పరీక్షలన్నీ చేయకుండా, అన్ని కోణాలనూ కూలంకషంగా తరచి చూడకుండా ఏదీ ఒప్పుకోరని, అంతటివారు ముక్తకంఠంతో చెప్పారు కనక ఇది అక్షర సత్యమేనని మనం సహజంగా అనుకుంటాం.

కాని – నిజానికి ఇది కట్టుకథ!

ఆర్యుల దండయాత్ర అభూతకల్పన!

క్రీ.పూ.[1] 1500కు ముందు ఇండియాలో ఆర్య సంస్కృతి లేదనడం అడ్డగోలు వాదన! అనార్య నాగరికతను ఆర్యులు ధ్వంసం చేసారనడం, ఆర్యులు ద్రావిడులు పరస్పరం శత్రువులనడం కుత్సితపు ఆరోపణ!

ఇది హిందుత్వం పొరలు కమ్మిన సనాతన వైదికులు అంటున్న మాట కాదు.

శాస్త్రీయంగా రుజువైన చారిత్రక వాస్తవం! మనం మినహా ప్రపంచమంతా గుర్తించిన తిరుగులేని యథార్థం!!

ప్రస్తుతం అమెరికన్ యూనివర్సిటీలన్నింటిలో హిందుత్వం అధ్యయనానికి ప్రధాన పాఠ్య గ్రంథమైన ***"Survey of Hinduism"***లో క్లాస్ క్లోస్టర్‌మైర్ (Klaus Klostermeir) ఇటీవల కాలంలో వెల్లడైన శాస్త్రీయ సాక్ష్యాధారాల దృష్ట్యా ఆర్యుల దండయాత్ర సిద్ధాంతాన్ని అంగీకరించడానికి వీల్లేదని కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు. ["Both the spatial and temporal extent of the Indus Civilisation has extended dramatically on the basis of new excavations and the dating of the Vedic age as well as the theory of an Aryan Invasion of India has been shaken" - **State University of New York, 1994,** *page 34*]

ఇదే విధమైన అభిప్రాయాన్ని ఇంకా అనేక దేశాల నిపుణులు వెలిబుచ్చారు. వారు చెప్పారని, వీరు తప్పన్నారని మనం పేర్లు చూసి అభిప్రాయాలు మార్చుకోనవసరం లేదు. శాస్త్రీయ పరిశోధనల్లో, ఆధునిక చరిత్రకారుల అధ్యయనాల్లో తేలిన కొన్ని వాస్తవాలను సావధానంగా గమనిస్తే చాలు మాయపొరలు తొలగుతాయి.

మాక్స్‌ముల్లర్ స్థిరం చేసిన ప్రకారం, దేశంలోని చరిత్ర పాఠ్యగ్రంథాల్లో నేటికీ బోధిస్తున్న ప్రకారం ఆర్యులు ఋగ్వేదాన్ని రచించింది క్రీ.పూ. 1200లో. ఆ ఋగ్వేదంలో సరస్వతి నది ప్రస్తావన తరుచుగా వస్తుంది. భారతీయులు పరమ పవిత్రంగా తలిచే గంగను

ఒకేఒకసారి పేర్కొన్న ఋగ్వేదం సరస్వతినయితే కనీసం యాభైసార్లు స్మరించింది. పర్వతం నుంచి సముద్రం దాకా విశాల ప్రవాహంతో పరవళ్లు తొక్కుతూ జీవకోటిని తరింపజేస్తుందని 7వ మండలం కీర్తించగా 2వ మండలం 41 సూక్తమైతే **'అంబితమే, నదీతమే, దేవీతమే'** (తల్లులలో శ్రేష్ఠమైన తల్లి, నదులలో శ్రేష్ఠమైన నది, దేవతల్లో శ్రేష్ఠమైన దేవత) అని సరస్వతిని ప్రస్తుతించారు.

అది వట్టి కల్పన కాదు. ఒకప్పుడు సరస్వతి నది నిజంగానే ఉండేది. యమునకు ఉత్తరాన ఇప్పటి హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌ల గుండా ప్రవహించి భృగుకుచ్చం దగ్గర అరేబియా సముద్రంలో కలిసేది. ఆ నదీ ప్రవాహం ఎక్కడా ఆరేడు (కొన్ని చోట్లయితే పద్నాలుగు) కిలోమీటర్ల వెడల్పుకు తగ్గేది కాదు. అంతటి మహానది అనేకమార్లు గతిని మార్చుకుని, పర్యావరణ విపరిణామాలకు లోనై క్రమేణా చిక్కి క్రీస్తు పూర్వం 2000 నాటికి శాశ్వతంగా ఎండిపోయింది. ఈ సంగతి అమెరికన్ Landsat ఫ్రెంచి SPOT ఉపగ్రహాలు తీసిన ఛాయాచిత్రాలను బట్టి ఇటీవలి కాలంలో శాస్త్రీయంగా రుజువైంది. నది ఎండిపోయాక అది పారిన చోట జనావాసాలు వెలిశాయి. అవి క్రీ.పూ. 2000 నాటివని ప్రఖ్యాత ఆర్కియాలజిస్టు Wakankar పరిశోధనలో వెల్లడైంది.

సూక్తాలలో సరస్వతి మహాప్రవాహాన్ని వర్ణించిన తీరు బట్టి ఋగ్వేదం రాసేనాటికి ఆ నది నిండుగా పొంగి పొర్లేదని స్పష్టం. అదే నది క్రీస్తు పూర్వం 2000కు ముందే ఎండిపోయిందని సైన్సు చెబుతున్నది. అంటే ఋగ్వేదం రచన క్రీ.పూ. 2000కు పూర్వమే జరిగి ఉండాలి. అప్పటికే వేదం పుట్టిందంటే మరి దాన్ని రాసిన ఆర్యులూ క్రీ.పూ. 2000కు ముందే దేశంలో ఉండి తీరాలి. కదా?! ఘనత వహించిన మన చరిత్రకారులు చెబుతున్న ప్రకారం ఆర్యులు ఇండియాలో అడుగుపెట్టిందే క్రీ.పూ. 1500లో! ఋగ్వేదాన్ని రాసింది క్రీ.పూ. 1200లో! ఇదెలా సాధ్యం? అంతకు 800 సంవత్సరాల పూర్వమే ఎండి కనుమరుగైన నదిని ఋగ్వేద ఆర్యులు కళ్లకు కట్టినట్టు ఎలా వర్ణించగలిగారు?! శాటిలైట్ ఫోటోలు, ఆర్కియాలజీ పరిశోధనలు ధ్రువీకరించిన యథార్థాలు గుర్తించయినా క్రీ.పూ. 2000కు ముందే ఆర్యులు ఇండియాలో ఉన్నారని ఒప్పుకుని తీరాలి కదా?!

అక్కడితో అయిపోలేదు.

ఈ చిత్రంలో కనిపించేది వేదకాలపు కంచు ప్రతిమ. ఋగ్వేదం ఏడవ మండలంలో వర్ణించిన వసిష్ఠుడి బొమ్మ ఇది. 1958లో అమెరికన్ శాస్త్ర పరిశోధకుడు హారీ హిక్స్ ఢిల్లీ మార్కెట్‌లో దీన్ని (తుక్కు కింద కరిగించబోతూండగా) కనుగొని సేకరించాడు. పురావస్తువులపై మెటలర్జీ పరీక్షల ప్రక్రియతో ప్రపంచ ప్రసిద్ధ ప్రవీణుడైన రాక్ ఆండర్సన్‌తో కలిసి దీని



మీద కాలిఫోర్నియా, స్విట్జర్లాండ్‌లలో అధునాతన ప్రయోగశాలల్లో అనేక రేడియో కార్బన్, మెటలర్జికల్ పరీక్షలు చేయడంతో ఆ బొమ్మ క్రీ.పూ. 3700 నాటిదని నిర్ద్వంద్వంగా తేలింది. ఆ పరీక్షల ఫలితాలను "Analysis of Indo-European Vedic Aryan Head- 4th millennium B.C."అనే వ్యాసంలో ***Journal of Indo-European Studies*** (Vol-18 pp 425-46) లో 1990లో Hicks & Anderson ప్రకటించారు. ఆ ప్రతిమ నిజంగా వసిష్ఠుడిదా కాదా అన్నది

కాదు ప్రశ్న. వేదంలో చేసిన వర్ణనకు సరిపోయే వర్ణించబడిన బొమ్మ క్రీ.పూ. 3700 నాటిదని సైంటిఫిక్‌గా రుజువైనప్పుడు ఆ వేదాన్ని రాసిన ఆర్యులు క్రీ.పూ. 3700 నాటికే దేశంలో ఉండి ఉండాలి కదా? మన చరిత్రకారులు చెప్పేదే శిలాక్షరమైతే... క్రీ.పూ. 1200లో వచ్చిన ఆర్యులు వాడిన బొమ్మ కాలానికి రివర్స్ గేరులో పరుగెత్తి అంతకు రెండున్నరవేల సంవత్సరాల వెనక్కి వెళ్లి కూచుందా?

కాటమరాజును, కర్ణుడిని రామాయణంలో కలిపిగొట్టిన మూర్ఖుడికి ... కనీసం 3700 బి.సి.కి ముందే వున్నారని సైంటిఫిక్‌గా రుజువైన ఆర్యులను 1500 బి.సి.కి దిగలాగి, అదే ముమ్మాటికీ నిజమని మూర్ఖంగా వాదించే మన చరిత్రకారులకు తేడా ఉందా?

మాయదారి మాక్స్‌ముల్లర్

మాక్స్ ముల్లర్ మహానుభావుడు.

సందేహం లేదు.

ఆయన గొప్ప విద్వాంసుడు. పాశ్చాత్య సంస్కృత విద్వాంసుల్లో ప్రథమగణ్యుడు. భారతదేశానికి మంచి మిత్రుడు.

నిజమే *Sacred Books of the East* పేరిట వేద సారస్వతానికి ఆయన ఆధ్వర్యంలో జరిగిన యాభై భాగాల అనువాదం ఒక్కటి చాలు ఆయన గొప్పతనాన్ని చాటటానికి.

అయితే – మాక్స్‌ముల్లర్ గొప్పవాడు కనుక ఆయన చేసిన ప్రతి సిద్ధాంతమూ గొప్పది కానక్కరలేదు.

ముఖ్యంగా – వేదాలకు, ఆర్యుల ఉనికికి ఆయన చేసిన స్థల, కాల నిర్ణయం! (పాశ్చాత్య లోకానికి సంబంధించినంత వరకూ) వేదాలను వెలుగులోకి తెచ్చినవాడు కనుక వేద కాలం గురించి, వేద సంస్కృతికి ఆద్యులైన ఆర్యుల పుట్టు పూర్వోత్తరాల గురించి ఆయన చేసిన ఊహలన్నీ అక్షర సత్యాలని అనుకోనవసరం లేదు. మాక్స్‌ముల్లర్ అంతటి వాడు చెప్పాడు కనక అది నిజమే అయివుండాలని కళ్లు మూసుకుని నమ్మేయడం కంటే ఆయన ఆ మాట ఎలా చెప్పాడు, ఏ ఆధారంతో చెప్పాడు, ఏ ప్రయోజనాలను ఆశించి, ఏ ప్రభావాలకు లోబడి చెప్పాడు అని సత్యదృష్టితో పరిశీలించడం మేలు.

మాక్స్‌ముల్లర్ సిద్ధాంతాల మంచి చెడ్డలను తరచేముందు వాటిని ప్రతిపాదించిన మనిషి వ్యక్తిత్వం గురించి, అందులోని వైరుధ్యాలూ, వెలుగు నీడల గురించి కొన్ని కఠోర వాస్తవాలను గుర్తించాలి. మాక్స్‌ముల్లర్ వైరుధ్యాల పుట్ట. ప్రపంచానికి తెలిసిన మనిషి వేరు. లోపలి మనిషి వేరు. ఆయన పాండిత్యం గురించి, విశిష్ట వ్యక్తిత్వం గురించి, ఆయన నిష్పాక్షిక దృక్పథం గురించి లోకం అనుకునేది ఒకటి. అసలు నిజం వేరొకటి.

కేవలం భారతదేశం మీద ప్రేమతో... హిందూమతం పట్ల, వేద సంస్కృతి పట్ల గౌరవంతోనే మాక్స్‌ముల్లర్ జీవితకాలం నిస్వార్థంగా శ్రమించి వేదవాఙ్మయాన్ని పాశ్చాత్యులకు

అందుబాటులోకి తెచ్చాడని చాలామంది ఈనాటికి అనుకుంటూంటారు. నిజానికి ఆయన చేసింది కిరాయి పని. అదీ క్రిస్టియన్ మిషనరీల ఏజంటుగా.

మాక్స్‌ముల్లర్ వేదాల మీద చెయ్యి చేసుకున్నది కేవలం పొట్ట గడుపుకోవ డానికి. స్వదేశమైన జర్మనీ విడిచి బతుకు తెరువుకోసం ఫారిన్ వెళ్లి పురాతన పత్రాలను కోరిన వారికి కాపీచేసి పెడుతూ సంపాదన చాలక అర్థాకలితో అవస్థ పడుతున్న దశలో మాక్స్‌ముల్లర్ తనకోదారి చూపించమని బొర్నాఫ్ అనే ఆయనను ఆశ్రయించాడు. భారతదేశంలో క్రైస్తవ మత ప్రచారానికి వీలుగా ప్రాచీన ఋగ్వేదాన్ని ఇంగ్లీషులోకి మార్చి పెట్టగల వారి కోసం మిషనరీలు వెదుకుతున్నారు. నువ్వు లండన్ పోయి ప్రయత్నం చేసుకో- అని ఆయన సలహా ఇచ్చాడు. ఆ ప్రకారమే ముల్లర్ లండన్ వెళ్లి వారినీ వీరినీ పట్టుకుని మొత్తానికి కార్యం సాధించాడు. 'పని' దొరికిన మర్నాడే (1847 ఏప్రిల్ 15న) లండన్ నుంచి తల్లికి రాసిన ఉత్తరంలో తన సంబరాన్ని, సంపాదన వివరాలను ఆయన ఇలా వెలిబుచ్చాడు:

> "At last the long conflict is decided, and I have carried off, so to speak, the prize! I can hardly believe that I have at last got what I have struggled for so long... I am to hand over to the Company, ready for the press, fifty sheets each year... for this I have asked 200 a year, 4 a sheet... and it was only yesterday that it was officially settled.... As the work will be above 400 sheets, I have a certain position for the next eight years, and the work is really so light I could take another post with it... And now what do you say, dearest mother? Is it not more than I could have ever expected?...."
>
> [***The Life and Letters of Max Muller**, Vol. I, PP 60-61 London Edn.*]
>
> *("మొత్తానికి వ్యవహారం తేలిపోయింది. "ప్రైజు" నాకే దక్కింది. ఎంతో కాలంగా నేను పడ్డ కష్టం ఫలించి, కోరుకున్నది నాకు దక్కిందంటే, ఇంకా నమ్మబుద్ధి కావడం లేదు....నేను సంవత్సరానికి యాభై షీట్లు అచ్చుకు సిద్ధంగా కంపెనీకి అందించాలి. దీనికి షీటుకు 4 పౌండ్లు చొప్పున ఏడాదికి 200 పౌండ్లు అడిగాను..... నిన్ననే ఆ సంగతి అధికారికంగా ఖరారయింది... పని 400 షీట్లకు పైగా ఉంటుంది కనుక ఇంకో ఎనిమిదేళ్ల దాకా నాకు చింతలేదు. ఈ పని కూడా ఎంత తేలికైనదంటే ఇది చేస్తూ నేను ఇంకో ఉద్యోగం కూడా చేసుకోగలను... ఇప్పుడు ఏమంటావే అమ్మా? నేను ఆశించగలిగిన దానికంటే ఇది ఎక్కువ కాదూ?...")*

1847 ఏప్రిల్ 14న ఈస్టిండియా కంపెనీ వారు ఋగ్వేదానికి ఆంగ్లానువాదం పనికి తనను ఎంచుకునే నాటికి మాక్స్‌ముల్లర్ వయసు 24. సంస్కృతంతో అతడికి కేవలం ఆరేళ్ల పరిచయం. మహామహ పండితులకే జీవితాంతం పరిశ్రమించినా వేదార్థం పూర్తిగా ఎరగడం కష్టమని సంప్రదాయవేత్తలు అంటుంటారు. వారంతా ఛాందసులు; వారివి సనాతన భావాలు కాబట్టి ఈ అభిప్రాయానికి మనవంటి ఆధునికులు పెద్దగా విలువ ఇవ్వనక్కర్లేదనుకోండి. జర్మనీలో పుట్టి కాలేజీలో జర్మన్ గురువుల దగ్గర సంస్కృతం నేర్వసాగిన

ఆరేళ్లకే వేదాలను మథించి, శోధించి, భావార్థాలను తనకు ఇంకో విదేశీ భాష అయిన ఇంగ్లీషులోకి తర్జుమా చేయగల సామర్థ్యం మాక్స్‌ముల్లర్ వంటి పాశ్చాత్య విద్వాంసుడికి ఉండకూడదనీ చెప్పలేము. నిండా పాతికేళ్లు లేని వయసులో అతడు జీవనోపాధి కోసం ఈస్టిండియా కంపెనీని ఆశ్రయించి తనకు తెలిసిన విద్యతో వాటికి కావలసిన పని చేసి పెట్టడంలో ఆక్షేపించవలసింది ఏమీ లేదు. ప్రతిఫలం తీసుకున్నంత మాత్రాన మాక్స్‌ముల్లర్ పడిన శ్రమ, చేసిన కృషి విలువ తగ్గిపోవు. కడుపు నింపుకోవటానికి "కంపెనీ"ని ఆశ్రయించినా, వారి పనువున వేదాల అనువాదానికి ముల్లర్ మహాశయుడు ఆయత్తమైనది హిందూ మతం మీద, వేదాల మీద గౌరవాభిమానాలతోనే అయితే ఆయనను తప్పక కొనియాడవలసిందే. ప్రత్యేక గౌరవాభిమానాలు లేకున్నా, కేవలం జాబ్ వర్క్‌గానే భావించి ఆయన వేదాల తర్జుమా పనిని సాగించి వున్నా ఎవరూ నొచ్చుకోవలసిన పనిలేదు. ప్రత్యేక ఆదరభావం లేకపోతే మానె; హిందూమతం మీద ప్రత్యేక అనాదరభావం లేకపోతే అదే పదివేలు.

మాక్స్ ముల్లర్‌కు సంబంధించి ఆ పాటి సంతృప్తికైనా ఆస్కారం వుందా?

లాభం లేని వ్యాపారి వరదన పోదని సామెత. ముల్లర్ గారి వేదాల ప్రాజెక్టు లోగుట్టు 1866లో తన ఇల్లాలికి రాసిన ఉత్తరంలో ఆయన మాటల్లోనే చదవండి:

> "I feel convinced, though I shall not live to see it, that this edition of mine and the translation of the Veda will hereafter tell to a great extent on the fate of India... It is the root of their religion, and to show them what that root is, I feel sure, is the only way of uprooting all that has sprung up from it during the last 3000 years"
>
> **[*The Life and Letters of Max Muller,* Vol. I P. 328]**
>
> *(చూడటానికి నేను బతికి వుండకపోయినా వేదానికి నేను చేస్తున్న అనువాదం ఇకపై ఇండియా తలరాతపై చాలా ప్రభావం చూపుతుంది. వారి మతానికి ఇదే తల్లివేరు. మూడువేల ఏళ్లుగా దాని నుంచి పుట్టుకొచ్చిన వాటిని మొత్తాన్నీ సమూలంగా పెకలించటానికి.... ఆ వేరును తీసి వారికి చూపించడమే ఏకైక మార్గమని నాకు గట్టి నమ్మకం)*

భార్యామణితో ఈ తీపి కలను పంచుకునే సమయానికి మాక్స్‌ముల్లర్ వేదాల తర్జుమా చేపట్టి 19 ఏళ్లు. మూడు వేల ఏళ్లుగా భారతదేశంలో వేళ్లూనిన వేద సంస్కృతిని సమూలంగా పెకలించివేయడమే ఆయన గారి వేదాల పని అసలు అంతర్యమని అర్థాంగికి అరమరికలు లేకుండా రాసుకున్న దాని బట్టే తేలిపోతున్నది కదా!

ఇదీ దీని వేరు అని మనకు చూపించడం కోసం వేరును పెకలిస్తే చెట్టు దానికదే కూలిపోతుందన్న తెలివి బాగానే వుంది. ఇంతకీ పనిగట్టుకుని వేదాల చెట్టును కూల్చబోయిందెందుకు? దాని స్థానంలో ఏ మహావృక్షాన్ని తెచ్చి ప్రతిష్ఠిద్దామని?

అదీ ముల్లర్ గారి మాణిక్యాల మాటల్లోనే వినండి. 1856 ఆగస్టు 25న (అంటే వేదాల పని ప్రారంభించిన తొమ్మిదేళ్ల తరువాత.... ధర్మపత్నికి 'వేరు రహస్యం' విప్పి చెప్పటానికి

పదేళ్లకు పూర్వం) ప్రతిష్ఠాత్మకమైన వేదాల ప్రాజెక్టును తనకు అందేట్లు చేయడంలో గొప్ప సాయం చేసిన కార్ల్ జోసియాస్ వాన్ బున్సెన్‌కు రాసిన లేఖలో మాక్స్‌ముల్లర్ ఆలోచనా స్రవంతి ఇది:

> ".... India is much ripe for Christianity than Rome or Greece were at the time of St.Paul. The rotten tree has for some time had artificial supports... But if the Englishman comes to see that the tree must fall, sooner or later, then the thing is done... For the good of this struggle I should like to lay down my life, or atleast lend my hand to bring about this struggle... Whatever finds root in India, soon overshadows the whole of Asia, and nowhere could the vital power of Christianity more gloriously realize itself than if the world saw it spring up there..."
>
> [***The Life and Letters of Max Muller*** *Vol. I PP. 190-91*]
>
> *(సెయింట్ పాల్ కాలంలో రోమ్ కన్నా, గ్రీస్‌కన్నా ఇప్పుడు ఇండియా క్రైస్తవ మతానికి పరిపక్వ స్థితిలో వున్నది.... అక్కడ చెడిపోయిన చెట్టు కొంతకాలంగా కృత్రిమ ఊతాలతో నిలబడి ఉంది... శీఘ్రంగానో, ఆలస్యంగానో చెట్టు కూలాల్సిందేనని ఇంగ్లీషు వాడు గ్రహిస్తే ఆ పని అయినట్టే .... ఈ పోరాటం కోసం నేను నా ప్రాణాలనైనా ధారపోస్తాను. కనీసం ఈ సంఘర్షణను సాధ్యం చేయడం కోసం నా చేయూతనిస్తాను.... ఇండియాలో వేరూనేది ఏదైనా త్వరలో మొత్తం ఆసియాను కమ్మివేస్తుంది. అక్కడ క్రైస్తవం ఉప్పొంగడాన్ని ప్రపంచం చూడగలిగితే చాలు. క్రైస్తవానికి వున్న కీలక జీవశక్తిని నిరూపించుకోవటానికి దానికి మించిన ఉజ్వల అవకాశం మరొకటి వుండదు.)*

భారతదేశంలో "చెడిపోయిన" వేద సంస్కృతి "చెట్టు"ను కృత్రిమ ఊతాలు లాగి కూల్చివేసే పవిత్ర పోరాటంలో ఆత్మాహుతి దళం సభ్యుడు కావడానికైనా సిద్ధమని... క్రైస్తవ పతాకాన్ని భారతదేశంలో జేగీయమానంగా ఎగురవేసేందుకు రంగం సానుకూలం చేయటానికి తన వంతు తోడ్పాటునిస్తానని పాతనేస్తుడైన బున్సెన్ దొరగారికి ఉదారంగా ఆఫర్ చేయడంతో మాక్స్‌ముల్లర్ గారిలోని క్రైస్తవ మతావేశం ఆగలేదు. కాలక్రమంలో ఆ ఉడుకు చల్లారనూ లేదు. ఇంకో పన్నెండేళ్లు గడిచాక 1868 డిసెంబర్ 16న ఇండియాకు విదేశాంగ మంత్రి (సెక్రటరీ ఆఫ్ స్టేట్) అయిన ఆర్గిల్ డ్యూక్ గారికి రాసిన ఉత్తరంలో ముల్లర్ గారు వెలిబుచ్చిన ధర్మాగ్రహం ఇది:

> "The ancient religion of India is doomed and if Christianity does not step in, whose fault will it be?"
>
> [***The Life and Letters of Max Muller,*** *Vol. I - P.358*]
>
> *(ఇండియాలోని ప్రాచీన మతం వినాశానికి సిద్ధంగా వుంది. క్రైస్తవం అక్కడ అడుగుపెట్టకపోతే అది ఎవరి తప్పు?)*

భారతదేశంలోని ప్రాచీన మతం గురించి ఈ "భారతదేశపు మిత్రుడి"కి గల సుహృద్భావం

ఎంతటిదో, ఆయన మనకు ఎంత మేలు కోరేవాడో అర్థమైంది కదా! భారతీయ ప్రాచీన మతానికి తల్లివేరు లాంటి వేదాలను తాను అనువదించడం వెనుక వున్న ఒక ముఖ్యమైన మతలబును - తర్జుమా పనికి ఒప్పుకున్న 40 ఏళ్ల తరవాత - తన 64వ ఏట మాక్స్‌ముల్లర్ మహోదయుడు ఇంగ్లండులోని సెయింట్ జాన్స్ కాలేజీలో చేసిన ప్రసంగంలో దాచుకోకుండా ఇలా బయటపెట్టాడు.

> ".... When I undertook to publish for the University Press a series of translations of the most important of these sacred books, one of my objects was to assist missionaries...."
>
> **[*The Life and Letters of Max Muller, Vol I P-238*]**
>
> *(యూనివర్సిటీ ప్రెస్సు కోసం అతి ముఖ్యమైన ఈ పవిత్ర గ్రంథాల అనువాదాల పరంపరను ప్రచురించడానికి నేను ఒప్పుకున్నప్పుడు, మిషనరీలకు సహాయ పడటం నా ధ్యేయాల్లో ఒకటి.)*

ఇంతవరకూ పేర్కొన్న మాక్స్‌ముల్లర్ మాటలన్నీ ఒకే గ్రంథం నుంచి ఉటంకించినవి. దీన్ని బట్టి అది మాక్స్ ముల్లర్ విరోధి ఎవరో ఆయనను భ్రష్టు పట్టించేందుకు వాస్తవాలను వక్రీకరించి రాయించిన బనాయింపు కుత్సితం అయి వుండొచ్చని కొంతమంది సందేహించవచ్చు. ఆ అనుమానం నిజం కాదు. *The Life and Letters of the Right Honourable Friedrich Max Muller* అనేది మాక్స్‌ముల్లర్‌పై వెలువడిన మొట్టమొదటి జీవిత గ్రంథం. 1902లో ప్రచురితమైన ఆ గ్రంథాన్ని రాసింది Georgina Max Muller. ఆమె ఎవరో కాదు. మాక్స్ ముల్లర్‌కు స్వయానా అర్ధాంగి. దివంగతుడైన తన భర్తను విద్వాంసుడిగా కంటే ఒక విశిష్ట వ్యక్తిగా ఆయన మాటల్లోనే ప్రపంచానికి తెలియజెప్పాలని ఈ గ్రంథ రచనకు ఉపక్రమించినట్టు జార్జినా ముందుమాటలోనే చెప్పుకుంది. కాబట్టి శంక అనవసరం!

ఈ గ్రంథం నుంచి పైనంతా ఉటంకించిన అంశాలను చూస్తే చదువరులకు ఇంకో అనుమానం కూడా రావచ్చు. క్రైస్తవ మత ప్రచారానికీ, వేదాల అనువాదానికీ సంబంధం ఏమిటి? ఇండియాలోనే.... హిందూ మతానికి చెందిన వారిలోనే చాలా మందికి ఆ వేదాల్లో ఏముందో తెలియదే?! తెలుసుకోవాలనే ప్రయత్నమూ పెద్దగా చేయరే! కొద్దిమంది వేద పండితుల నోళ్లలో మాత్రమే (వారిలోనూ చాలామంది వేదమంత్రాలను స్వరం తప్పక వల్లించడమే తప్ప వాటి అర్థం, అంతరార్థం ఏమిటో తెలుసుకోవాలనుకోరు!) నానుతూండే వేదాల మీద విదేశీ క్రైస్తవ మత ప్రచారకులకు అంతటి ఆసక్తి ఎలా పుట్టుకొచ్చింది? వ్యాపారం పేర ఇండియాను దోచి లాభాలు తీయడానికే దుకాణం తెరిచిన ఈస్టిండియా కంపెనీకి ప్రాచీన వేద సారస్వతాన్ని బోలెడు ఖర్చుతో ఇంగ్లీషులోకి ఉద్ధరించాలన్న ఆలోచన ఎందుకొచ్చింది?

ఇది బోధపడాలంటే పూర్వరంగం కొంత తెలియాలి.

విదేశీ వర్తకులతోబాటే (ఇంకా చెప్పాలంటే వారికంటే ముందే) క్రిస్టియన్ మిషనరీలు ఓడలెక్కి ఇండియా వచ్చి మత ప్రచారాన్ని ముమ్మరంగా సాగిస్తుండేవారు. ఇందులో భాగంగానే బాప్టిస్టులు 1799లో కలకత్తా సమీపాన సీరాంపూర్ మిషన్ స్థాపించి విలియం కేరీ

నాయకత్వంలో క్రైస్తవాన్ని ఎంతగా ప్రచారం చేసినా ఏమంత ముందుకు పోలేకపోయారు.

కారణం : రాజారామమోహన్‌రాయ్! అప్పటి భారత మేధావి వర్గాల్లో దుర్నిరీక్ష్యంగా వెలుగుతూ ఆర్య ధర్మాన్ని, వేద బోధను విస్తృతంగా ప్రచారం చేస్తున్న రాయ్‌కి ఎదురొడ్డి నిలవటం బాప్టిస్టుల వల్ల కాలేదు. ముందుగా అతన్నే మచ్చిక చేసుకుని తమ దారికి తెచ్చుకుంటే ఏ గొడవా వుండదని తలచి, రెవరెండ్ విలియం అడమ్‌కు 1818లో ఆ బాధ్యత అప్పగిస్తేనేమో కథ అడ్డం తిరిగింది. క్రైస్తవం ప్రబోధించే దైవత్రయ (trinity) భావంతో రాయ్‌కు నమ్మకం కలిగించడానికి మూడేళ్లు ఆయన వెంటపడి, మాట్లాడి మాట్లాడి చివరికి రాయ్ విశ్వసించే ఏకేశ్వర వాదాన్ని తానూ నమ్మాడు. రాయ్‌ను క్రైస్తవ మతంలో చేర్చబోయినవాడు కాస్తా చివరికి తానే క్రైస్తవంతో తెగతెంపులు చేసుకుని రాయ్ మతంలో చేరి, అద్వైతాన్ని ప్రచారం చేయసాగాడు.

క్రైస్తవ త్రిమూర్తి వాదాన్ని వైదిక ఏకేశ్వర తత్త్వం ఓడించడమనేది క్రైస్తవ మత ప్రచారకులకు దుస్సహమైంది. ముక్కోటి దేవతలు వున్నారనుకునే హిందూ మతం తరఫున దేవుడొక్కడేనని రామ్మోహన్‌రాయ్ సిద్ధాంతీకరించటమేమిటి... అనేక దేవతల ఊసులున్నాయనుకునే వేదాలను ఏకేశ్వరోపాసనకు ప్రమాణంగా రాయ్ చూపించి గెలవటమేమిటి అని దీర్ఘకాలం మథనపడగా చివరకు వారికో ఉపాయం స్ఫురించింది. వేదాలు అనేక దేవతల ఉపాసనను బోధిస్తున్నాయన్న సంగతి బయటపెడితే రాయ్ బోటి వారి ఏకేశ్వర వాదం ఎగిరిపోతుందని వారు తలచారు. హిందూ మతస్థులను క్రైస్తవంలోకి ఆకర్షించాలంటే ముందుగా వారి మత గ్రంథాల్లో ఏమున్నదీ తమకు తెలియడం అవసరమన్న అభిప్రాయం సరేసరి. ఇలాంటి కారణాల వల్ల వేదాన్ని ఇంగ్లీషులో రాసిపెట్టగల వాడి కోసం విస్తృతంగా దేశాలు గాలించగా చివరికి మాక్సుముల్లర్ వారి కంటపడ్డాడు. ఇండియాలో తమ అధికారాన్ని బలిష్ఠం చేసుకోవాలంటే హిందువులను హెచ్చు సంఖ్యలో క్రైస్తవంలోకి ఆకర్షించడం అతి ముఖ్యమని గ్రహించిన ఈస్టిండియా కంపెనీ వారు కూడా క్రిస్టియన్ మిషన్ల ప్రతిపాదనకు వ్యాపార దృష్టితో అంగీకరించి ఋగ్వేదం ఆంగ్లానువాదానికి భారీ నిధులను కేటాయించారు.

అదీ ఒకవిధంగా మేలే అయింది. ఆంగ్లేయులు ఒకందుకు వేదాలను ఆంగ్లంలోకి మార్చే బృహత్ యత్నాన్ని సాగిస్తే భారతదేశానికి అది ఇంకొకందుకు మంచిదయింది. మాక్సుముల్లర్ ఆశించినట్టు వేరు తీసి చూపించినా వేద సంస్కృతి చెట్టు చచ్చిపోలేదు. క్రైస్తవ మతానికి తద్వారా ఒరిగిన మహోపకారమూ లేదు. అంతవరకూ బహుకొద్ది భారతీయ వేద విద్వాంసులకు మాత్రం పరిమితమైన ప్రాచీన వేదం ప్రపంచ భాషలో అందరికీ అందుబాటులోకి రావడంతో పాశ్చాత్య మేధావులకు ప్రాచ్య మత, సారస్వతాల మీద ఆసక్తి పెరిగి వేద సంస్కృతికి ఇతోధిక ప్రాచుర్యం లభించింది. మాక్సుముల్లర్ ఆంతర్యం, ఆయన మత పక్షపాతం, ఎలాంటివైనా అనితరసాధ్యంగా ఆయన సాగించిన బృహత్ కృషి వల్ల వేదాల వరకైతే ఉపకారమే జరిగింది: కాని – వేదాలను అనువదించిన సాధికారకత సాయంతో వేదాలకు ఆయన చేసిన అడ్డగోలు కాల నిర్ణయం వల్ల, క్రిస్టియన్ కళ్లతో ప్రాచీన భారత చరిత్రను చూసి, తన మత విశ్వాసాలకు తగ్గట్టుగా అభూత కల్పనలు చేసి, ఆర్య నాగరికతకు ఆయన వేసిన శిలువ వల్ల దేశానికి తీరని హాని జరిగింది.

ఆర్యులెవరు?

రామాయణంలో రాముడిని సీత 'ఆర్యపుత్రా' అని పిలుస్తుంది. రావణుడిని మండోదరి కూడా 'ఆర్యపుత్రా' అనే సంబోధిస్తుంది. రావణబ్రహ్మ దానికి ఆగ్రహించి 'చెట్టంత ద్రావిడుణ్ణి, నన్ను పట్టుకుని ఆర్యుడంటావా?' అని మండోదరి మీద మండిపడినట్లు ఏ రామాయణంలోనూ లేదు.

ఆయనకు అభ్యంతరం లేకపోవచ్చు... కాని, దక్షిణాది రావణుడు ఆర్యుడంటే మహా మేధావులమైన మనం మాత్రం ఒప్పుకోము. ఆర్యులది వేరే జాతి అని, ఎక్కడి నుంచో ఈ దేశానికి వచ్చారని, ఇక్కడి ఆదివాసులైన ద్రావిడుల మీద దాడులు చేసి, దక్షిణాదికి గెంటేసి, ఉత్తర భారతాన్ని బలవంతంగా ఆక్రమించారని మనం చరిత్ర పాఠాల్లో చదువుకున్నాం. అక్కడా వారిని సుఖంగా ఉండనివ్వకుండా యుద్ధాలు చేసి నానా విధాల వేధించారనీ చరిత్రకారులు చెప్పగా విన్నాం. రామరావణ యుద్ధాన్ని కూడా ఆర్య ద్రావిడ సంఘర్షణగానే మనం పరిగణిస్తాం!

ఉత్తరాది ఆర్యుల పెత్తనాన్ని నిరోధించి ద్రవిడ సంస్కృతిని కాపాడుకునే ధ్యేయంతోటే తమిళనాట ఇటీవల దశాబ్దాల్లో అనేక ద్రవిడ కజగాలు పుట్టాయి. ఆర్యులు అనే విదేశీ ఆక్రమణదారులు తెచ్చి రుద్దిన భాష కాబట్టి సంస్కృతాన్ని భారత రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూలు నుంచి తొలగించాలని ఆంగ్లో ఇండియన్ల ప్రతినిధిగా ప్రభుత్వం నామినేట్ చేసిన ఫ్రాంక్ అంథోని పాతికేళ్ల కింద పార్లమెంట్‌లో డిమాండ్ చేశాడు. 1978లో రోదసికి పంపిన తొలిభారత ఉపగ్రహానికి 'ఆర్యభట్ట' అని పేరు పెడితే అది ఫారిన్ పేరు (!) అన్న కారణంగా డిఎంకె సభ్యులు పార్లమెంట్‌లో తీవ్రాభ్యంతరం తెలిపారు. రాజభాష అయినా సరే ఉత్తరాది హిందీని దాక్షిణాత్యులు తమకు అక్కర్లేని పరాయి భాషగానే పరిగణిస్తారు. బయటి నుంచి వచ్చిన ఆర్యుల వారసులైన బ్రాహ్మణులను దేశం నుంచి గెంటెయ్యాలని కోరుతూ 'ఆర్యన్స్ గోబ్యాక్' నినాదాన్ని ఘోషింపచేసే హైందవేతర తీవ్రవాద వర్గాలూ లేకపోలేదు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భారతీయులందరూ తరాల పర్యంతం కలిసి పోరాడినా,

స్వాతంత్ర్యం సాధించి అర్ధ శతాబ్దం గడిచాక కూడా ఉత్తర - దక్షిణ, ఆర్య - అనార్య తారతమ్యాలు తొలిగి, మానసిక అంతరాలు పోయి పరిపూర్ణ జాతీయ సమైక్యత సిద్ధించిందని ఈనాటికీ చెప్పలేకపోతున్నాము. ఇందుకు కారణాలు, ప్రభావాలు అనేకం ఉందవచ్చు. మూలాల్లోకి వెళ్లి చూస్తే దేశంలో ఈ కనపడని అడ్డుగోడలకు 'ఆర్యజాతి ఆక్రమణ' అనే అడ్డగోలు సిద్ధాంతమే పునాది.

శుద్ధాబద్ధమని ఏనాడో తేలిపోయినా, తప్పు అని చరిత్రకారులు సైతం గుర్తించినా నేటికీ చరిత్ర పాఠాల నుంచి కదలని ఈ వెర్రిమొర్రి సిద్ధాంతానికి సృష్టికర్త రైటానరబుల్ మాక్స్‌ముల్లర్.

నిజానికి ఆర్యజాతి అనేది ప్రపంచంలో ఎక్కడా ఏనాడూ లేదు. ఒక ప్రత్యేక జాతి అన్న అర్థంలో 'ఆర్య' శబ్దాన్ని ఎప్పుడూ వాడలేదు. ఋగ్వేదంలో 'ఆర్య' పదం మొత్తం 36 చోట్ల ఉంది. మాన్యులు, మంచి అన్న అర్థంతో గౌరవ సూచకంగానే ప్రతిసారీ వాడారు. **'మహాకుల కులీనార్య సభ్య సజ్జన సాధవః'** *(మంచి కుటుంబంలో పుట్టిన కులీనుడు, సభ్యత గలవాడు, సజ్జనుడు, సాధువు)* అన్నవి 'అమరకోశం' ఆర్య పదానికి చెప్పిన అర్థాలు. తమది వేరు జాతి, ఇతరులకు అందులో ప్రవేశం లేదు అనుకుంటే **'కృణ్వంతో విశ్వమార్యమ్'** *(ప్రపంచమంతటినీ ఆర్యమయం చేద్దాం)* అని వేదర్షులు అభిలషించే వారే కాదు. ఇంగ్లీషులో 'సర్', 'జంటిల్మన్' ఎంతో సంస్కృతంలో 'ఆర్య' అంత! గౌరవ వాచకంగా ఒకరినొకరు 'సర్' అని పిలుచుకునే వారందరిదీ ప్రత్యేక 'సర్' జాతి అంటే ఎంత విడ్డూరమో ఆర్యులది వేరే జాతి అనడం అంత హాస్యాస్పదం.. వేద సంస్కృతితో, సంస్కృత భాషతో కనీస పరిచయం గల ప్రతి వ్యక్తికీ తెలిసిన ఈ కామన్‌సెన్స్ పాయింటు వేదాన్ని ఆంగ్లంలోకి తర్జుమా చేసిన మాక్స్‌ముల్లర్‌కు బోధపడలేదని అనుకోలేము. ఆర్యజాతి అనేది భౌతికంగా ప్రపంచంలో కాని.... వేద సంస్కృతిలో కాని, జనం వాడుకలో కాని ఎక్కడా లేదని తెలిసే మాక్స్‌ముల్లర్ అభూత కల్పనకు పాల్పడ్డాడు.

సాధారణంగా - ఒక సిద్ధాంతం మంచి చెడ్డల మీద లోకుల్లో ఎన్ని భిన్నాభిప్రాయాలున్నా తాను చెప్పేదే నిజమన్న గట్టి నమ్మకం సిద్ధాంతకర్తకు ఉంటుంది. నమ్ముతారో లేదో - మాక్స్‌ముల్లర్‌కు అదీ లేదు. తాను చెప్పిన దాన్ని తానే ఖండించడం ముల్లర్ ప్రత్యేకత. తప్పంటూ ఆయన ఖండించిన తరవాత కూడా దాన్నే పట్టుకుని, అదే పరమ సత్యమైనట్టు మన మేధావులు ఇంకా భావించటం వింతల్లోకెల్లా వింత.

వేదిక్ స్కాలర్‌గా అవతారమెత్తాక మొదటి 20 ఏళ్లు ఆర్యులది ప్రత్యేక జాతి అని ఢంకా కొట్టి చెప్పిన మాక్స్‌ముల్లర్ తరవాతి 30 ఏళ్లు ఆర్యులది ప్రత్యేక జాతి కాదు అని అంతే గట్టిగా గొంతు చించుకున్నాడు. "The first place in that long row of books which contain the records of the Aryan race will belong forever to the Rigveda" *(ఆర్యజాతి రికార్డులను పొందుపరిచిన గ్రంథాల వరసలో మొట్టమొదటి స్థానం ఎప్పుడూ ఋగ్వేదానిదే)* అని తన వేదానువాదం మొదట్లోనే చెప్పుకున్న పెద్దమనిషి ఆర్యులది ప్రత్యేక జాతి అని నేనెప్పుడన్నానంటూ దరిమిలా తగవులాడాడు. ఆర్యులది వేరే జాతి అంటూ 1851లో తొలి వ్యాసం రాసి, అదే సంగతి విపులీకరిస్తూ 1861లో వరస లెక్చర్లను కూడా ఇచ్చిన 'కలియుగ వేదవ్యాసుడు' 1871లో హఠాత్తుగా ప్లేటు మార్చి ఆర్యులది

ప్రత్యేక భాషా కుటుంబమే తప్ప ప్రత్యేక జాతి కానేకాదని నాలుక మడత వేశాడు. "I have declared again and again that if I say Aryan, I mean neither blood nor bones, nor skull, nor hair; I mean simply those who speak the Aryan language". (నేను 'ఆర్యులు' అనేది రక్తం, ఎముకలు, పుర్రె, జుట్టు అన్న అర్థంలో కాదని, ఆర్య భాషను మాట్లాడేవారని మాత్రమే నా ఉద్దేశమని పదేపదే చెప్పాను) అని ఆయన పదేపదే చెప్పినా మన మేధావి లోకంలో అంతకు ముందు ఆయన వేసిన 'ఆర్యజాతి' ముద్ర చెరగలేదు. ఆర్యులంటూ ప్రత్యేక జాతి ఏదీ లేదని మాక్స్‌ముల్లర్ మొత్తుకున్నా 'ఆర్యులు పరాయి వారు – బయటి నుంచి వచ్చి మన దేశం మీద దండయాత్ర చేసినవారు – ఇక్కడి ఆదివాసులను క్రూరంగా నిర్మూలించి బ్రాహ్మణాధిక్యత వేద వ్యవస్థను స్థాపించినవారు', అన్న దురభిప్రాయం మనలో చాలా మందికి ఈనాటికీ పోలేదు. అలాంటి అపోహ వ్యాప్తికి కారణభూతమైన చరిత్ర పుస్తకాలు నేటికీ మారకుండా అవే అబద్ధాల విషాన్ని భావి పౌరులకు నూరిపోస్తున్నాయి.

అదే విషాదం!

ఇండో – యూరోపియన్ ఆర్య 'జాతి' ఎక్కణ్నుంచో వచ్చి ఇండియాలో స్థిరపడిందని తాను అంతవరకూ చెబుతూ వచ్చింది తప్పు అని తనకే తెలిసి రావడం వల్లే ... భేషజాలకు పోకుండా పొరపాటును దిద్దుకోవాలన్న సద్బుద్ధితోనే మాక్స్‌ముల్లర్ మాట మార్చి ఉంటే ఆయన ధైర్యాన్ని, నిజాయితీని వేనోళ్ల మెచ్చుకోవచ్చు. అంతకు ముందు కట్టుకథలల్లి ఆయన భారతదేశానికి చేసిన హానిని క్షమించి వేయవచ్చు. కాని – వాస్తవానికి మొదటి అబద్ధానికి పురికొల్పిందీ స్వార్థమే; అది సరికాదని మళ్ళీ ఆయన చేత చెప్పించిందీ సంకుచిత స్వార్థ ప్రయోజనాలే. బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యూహానికీ, క్రైస్తవ మతప్రచారకుల అవసరానికీ తగ్గట్టు తొలిదశలో మాక్స్‌ముల్లర్ సాగించిన 'ఆర్యజాతి', 'ఆర్యసంస్కృతి' ప్రచార ప్రభావం ఊహించని రీతిలో జర్మన్ల మీద పడింది. అనేక దశాబ్దాలుగా అనైక్యతతో కకావికలై, నీరసించి నిస్పృహ చెందిన జర్మన్లలో తాము 'ఆర్యజాతి' వారసులమేనన్న అభిప్రాయం బలపడింది. సంస్కృత భాష, ఆర్య సంస్కృతి అధ్యయనాలతో వారి జాతీయత ప్రబలి, 1871 యుద్ధంలో ఫ్రాన్సును ఓడించి బలీయశక్తిగా ఎదగడంతో ఫ్రెంచి వారి నేస్తులైన ఆంగ్లేయులకు గుండె ఝల్లుమంది. జన్మతః జర్మన్ అయినా ఇంగ్లండులో స్థిరపడి ఇంగ్లీషు వారి డబ్బుతో ఇంగ్లీషు వారి సౌజన్యంతో మహా మేధావిగా వెలిగిపోతున్న మాక్స్‌ముల్లర్‌కు ఈ పరిణామాలు పెద్ద ఇరకాటమయ్యాయి. బ్రిటన్‌కు పక్కలో బల్లెంలా తయారైన జర్మన్ జాతీయతా ప్రకోపంతో తనకు సంబంధం లేనట్టు కనపడటానికీ.... ఆర్యజాతి భావనకు తానే ఆద్యుడన్న సంగతి ఆంగ్లేయులకు పెద్దగా గుర్తుండకుండా చేసుకోవడానికీ... తన పేరు, ప్రతిష్ఠ రక్షించుకోవటానికీ ముల్లర్‌గారు అర్జంటుగా బాణీ మార్చి ఆర్యులది 'జాతి కాదు – భాష' అని కొత్త పల్లవిని అందుకున్నారు.

జాతా, భాషా అన్న తేడా పక్కన పెడితే ఆర్యులనే వారు బయటి నుంచి ఇండియాకు వచ్చారన్న మాక్స్‌ముల్లర్ వాదంలో మార్పులేదు. క్రీ.పూ. 1500 ప్రాంతంలో ఆర్యులు ఇండియాకు వచ్చారని, క్రీ.పూ. 1200లో ఋగ్వేదాన్ని రచించారని ఆయన దివ్యదృష్టితో సెలవిచ్చినదే అక్షరసత్యమని, అద్భుత పరిశోధనా ఫలితమని మన చరిత్ర పాఠాల రచయితలు

ఈనాటికీ నమ్ముతున్నారు. ఆర్యుల ఉనికికి, వేదాల రచనకు ఆయన చేసిన కాల నిర్ణయాన్ని బట్టే భారత చరిత్ర తారుమారై, కొన్ని వేల సంవత్సరాల ప్రాచీన చరిత్రను పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. దాని మూలంగా భారత జాతికి వాటిల్లిన తీరని నష్టం సంగతి అలా ఉంచితే ఆ అడ్డదిడ్డపు కాల నిర్ణయానికి మాక్స్‌ముల్లర్ అనుసరించిన ప్రాతిపదికలేమిటి? క్రీ.పూ. 1500 తరవాతే ప్రాచీన ఆర్య సంస్కృతి మొదలైందని ఆయన ఏ ఆధారంతో అన్నాడు?

దీనికి సమాధానం వింటే ఎవరైనా ఫక్కున నవ్వుతారు!

మాక్స్‌ముల్లర్‌గారు నూటికి నూరుపాళ్ళ క్రైస్తవుడు. క్రైస్తవ మత గ్రంథంలో చెప్పినదే ప్రత్యక్షర సత్యమని, ప్రపంచంలో ఏదైనా దానికి లోబడవలసిందేనని గట్టిగా నమ్మే ఆస్తికుడాయన. సృష్టిక్రమం గురించి ఓల్డ్ టెస్టమెంట్‌లో చెప్పిందే యథార్థమని ఆయన దృఢ విశ్వాసం. బైబిల్ ప్రకారం ప్రపంచ సృష్టి క్రీ.పూ. 4004 సంవత్సరంలో అక్టోబర్ 23న ఉదయం 9 గంటలకు జరిగింది. అక్కడి నుంచి లెక్క వేస్తే వరద ప్రళయం క్రీ.పూ. 2448 సంవత్సరంలో జరిగి ఉండాలి. వరద తీసి, నేల గట్టిపడి ఆర్యులు దండయాత్రకు రడీ కావడానికి ఏ వెయ్యి ఏళ్లు పట్టిందనుకుంటే క్రీ.పూ. 1400 దగ్గర్లోకి చేరుతాం. దండయాత్రలు చేసి చేసి దేశంలో కాస్త సెటిలై వేదాల రచనకు తాటాకులు, గంటాలు జమాయించుకోవడానికి ఇంకో రెండొందల ఏళ్లు వదిలేస్తే 1200 బి.సి. దగ్గరికి వస్తాం. అదిగో – ఇలాంటి వెర్రి లెక్కతోనే మాక్స్‌ముల్లర్ సారు క్రీ.పూ. 15వ శతాబ్దంలో ఆర్యన్లు ఇండియా వచ్చారని, క్రీ.పూ. 1200 ప్రాంతంలో ఋగ్వేదం రాశారని చెప్పారు! ఇది వట్టి ఊహాగానం కాదు. మాక్స్‌ముల్లర్‌కు సన్నిహిత సహచరుడిగా ఉండి ఆయన ఆలోచనా విధానం బాగా తెలిసిన థియొడొర్ గోల్డ్‌స్టకర్ పబ్లిగ్గా చెప్పిన మాటే!

మాక్స్‌ముల్లర్ ఏమిటి; ఇలా కాకుల లెక్క అల్లడమేమిటి అని ఆశ్చర్యపోతు న్నారా? అంత గొప్ప పండితుడు కేవలం బైబిల్‌లో చెప్పిన ఒక మాటను పట్టుకుని ఇంత మాయ చేస్తాడా? జీవితమంతా వేదాధ్యయనానికి, వేదాల ప్రాచుర్యానికి అంకితమైన మహానుభావుడు తనకు అంతగా ఆదరపాత్రమైన వేదాలతో బైబిల్ నమ్మకాన్ని తెచ్చి లంకె పెడతాడా అని సందేహిస్తున్నారా? మీ సంశయం సహేతుకమే. కాని – పవిత్ర మత గ్రంథాల పట్ల ఈ మహాపండితుడికి గల అంచనా ఎలాంటిదో ఆయన మాటల్లోనే చదవండి:

'కాథలిక్ కామన్వెల్త్' పత్రిక ఇంటర్వ్యూలో ప్రపంచంలోని పవిత్ర గ్రంథాల న్నింటిలోకి ఏది ఉత్తమమైనదని మీ అభిప్రాయం? అని అడిగితే మాక్స్‌ముల్లర్ ఇచ్చిన జవాబు ఇది:

> "It may sound prejudiced, but taking all in all, I say the New Testament. After that I should place the Koran... Then would follow, according to my opinion, the Old Testament, the Southern Buddhist Tripitaka, the Taote, King of Leo - tze, the Kings of Confucious, the Veda and the Avesta"
>
> ***[The Life and Letters of Max Muller,** Vol . II PP. 322-23]*
>
> *('పక్షపాతపూరితంగా అనిపించవచ్చు. కాని మొత్తంగా తీసుకుంటే, 'న్యూటెస్టమెంట్' అనే నేను చెబుతాను. ఆ తరవాత వరసగా ఓల్డ్ టెస్టమెంట్,*

బౌద్ధ త్రిపిటకాలు, టావోటి, కన్ఫ్యూషియన్ 'కింగ్స్', వేదం, అవేస్తాలు వస్తాయని నా అభిప్రాయం.')

సరే! క్రైస్తవ నేత్రాలతో లోకాన్ని చూసే... బైబిల్ విశ్వాసాన్ని మాత్రమే ఏకైక ప్రమాణంగా తీసుకునే - వేదాలు 1200 బి.సి. నాటివని మాక్స్‌ముల్లర్ తేల్చి చెప్పాడు. బాగానే ఉంది. కనీసం తాను అన్నమాట మీద నిలబడే ధైర్యం, తాను అన్నది సమర్థించుకునే స్థైర్యం అయినా మాక్స్‌ముల్లర్‌కు ఉన్నాయా?

వేదకాలానికి ఆయన కట్టిన లెక్కకు తలాతోకా లేదని మాక్స్‌ముల్లర్ జీవితకాలంలోనే పండితులు తీవ్రంగా ఆక్షేపించారు. ఇంతకూ ఏ ప్రాతిపదికన తమరు ఈ కాల నిర్ణయం చేశారు అని నలుగురూ నిలదీసే సరికి మాక్స్‌ముల్లర్ చిత్రంగా తన మాటలను తానే కొట్టిపారేశాడు.

"Whether the Vedic hymns were composed in 1000, 1500 or 2000 or 3000 B.C., no power on earth will ever determine"

వేద మంత్రాలను కూర్చింది క్రీస్తు పూర్వం 1000లోనా, 1500లోనా, 2000నాడా లేక 3000 బిసి లోనా అన్నది భూమి మీది ఏ శక్తీ ఎన్నడూ నిర్ణయించజాలదు అని నాలుకకు నరం లేని మాక్స్‌ముల్లర్ ఉవాచ!

అంటే - వేదాల రచన క్రీ.పూ. 1000 లోనూ జరిగి ఉండొచ్చు. లేదా క్రీ.పూ. 3000 లోనూ కావచ్చు. ఏది కరెక్టో మాక్స్‌ముల్లర్‌కే తెలియదు. తాను చెప్పేదానికీ, వాస్తవానికీ రెండు వేల సంవత్సరాలు తేడా ఉండవచ్చునని చెప్పే వాడి మాటలకు విలువేమిటి? తనవి వట్టి గాలి కబుర్లని మాక్స్‌ముల్లరే స్వయంగా ఒప్పుకున్న తరవాత కూడా వేదాలు 1200 బి.సి. నాటివన్న ముల్లర్ ఊహను శిలాశాసనంగా రొమిలాథాపర్, ఆర్‌ఎస్ శర్మ వంటి మన చరిత్రకారులు, ఆధునిక మేధావులు పలువురు ఈనాటికీ భావిస్తున్నారంటే వారి తెలివిని ఏమనుకోవాలి?

ఆ దేశంలో పాములు బలిసిన ఆబోతులను అవలీలగా మింగేస్తాయి. కొన్ని పాములకు రెక్కలుంటాయి. రాత్రివేళ అవి గబ్బిలాల్లా ఎగురుతుంటాయి. అవి విడిచే మూత్రంగాని, చెమటగాని మనుషుల మీద పడితే పుండుపడి ఆ శరీర భాగం కుళ్లిపోతుంది. పాముల్లాగే అక్కడి తేళ్లకూ పెద్దపెద్ద రెక్కలుంటాయి. అక్కడ గుర్రాల ముఖం లేడిలా ఉంటుంది. వాటి నెత్తిన ఒక కొమ్ము ఉంటుంది.

ఆ దేశంలోని ఆటవిక తెగల్లో మనుషుల ఆకారాలు మరీ విచిత్రం. కొందరి కాళ్లకు మడమలు ముందు; వేళ్లు వెనక! కొందరికి అసలు నోరే ఉండదు. మరి కొన్ని తెగల వారికి నోరే కాదు - ముక్కు కూడా ఉండదు. మామూలుగా నోరుండే చోట రెండు రంధ్రాలుంటాయి. వాటితో మాంసం, పండ్లు, పుష్పాల వాసనలు పీల్చి అదే ఆహారంగా బతుకుతారు. చెడు వాసనలు పీల్చారో చచ్చిపోతారు! మరి కొన్ని తెగల వారికి ఒంటికన్ను! అది కూడా నుదురు మధ్య! ఇంకొందరి కాళ్లు పాముల వలె చుట్టుకుని ఉంటాయి. మరి కొందరివి ఏనుగుకాళ్లు. కొన్ని తెగలవారు నడుస్తుంటే చెవులు నేలకు తాకుతుంటాయి. ఆ చెవులు ఎంత విశాలమైనవంటే ఇంకో మనిషి వాటిలో సుఖంగా పడుకోవచ్చు.

అక్కడి కొండజాతుల్లో మరుగుజ్జులుంటారు. ఎవరి ఎత్తూ రెండున్నర అడుగులకు మించదు. వాళ్లకు కొంగలు పెద్ద బాధ. అందుకని విల్లు, బాణాలు పట్టుకుని మేకలు, పొట్టేళ్లు ఎక్కి వసంత రుతువులో సముద్రం దగ్గరకు గుంపులుగా వెళ్లి అక్కడ కొంగలు పెట్టిన గుడ్లను, పొదిగిన పిల్లలను చంపేస్తారు. ఆ పని ఏటా మూణ్నెల్లు సాగుతుంది. అది కనుక చెయ్యకపోతే తరవాత వారిని కొంగలు బతకనివ్వవు.

అక్కడ ఆరో ఏటే అమ్మాయిలు గర్భవతులవుతారు.

ఆ దేశంలో బంగారం చీమల నుంచి వస్తుంది. ఒక్కో చీమా మన ప్రాంతంలో నక్క కంటే పెద్దది. నేలలో బొరియలు చేసి బంగారం ధూళిని చీమలు జమాయిస్తూ పోతాయి. పోనుపోను ఒక్కో బంగారం పుట్ట కొండంత ఎత్తు పెరుగుతుంది. అవి ఎంత ఒత్తుగా

ఒకదాన్ని ఒకటి ఒరుసుకుని ఉంటాయంటే వాటి మధ్య నుంచి సూర్యుడు కూడా కనపడడు. ధగధగ మెరిసే ఆ బంగారు కొండలను తేరిపార చూస్తే కంటిచూపు పోతుంది. ఆ చుట్టుపక్కల ఎడారి ప్రాంతాల మనుషులు గుర్రం బండ్లు కట్టుకుని వెళ్లి మధ్యాహ్నం చీమలు నేలలోపలికి పోయిన సమయంలో మోయగలిగినంత బంగారం తవ్వుకుని బండ్లలో వేసుకుని మహావేగంగా వెనక్కి పరిగెడతారు. ఆ సంగతి పసిగట్టగానే చీమలు చరచరా వారి వెంటపడి పట్టుకుని హోరాహోరి పోరాడుతాయి. యుద్ధంలో కొన్ని గెలుస్తాయి. కొన్ని మరణిస్తాయి. ఆ చీమలకు బంగారం విలువ బాగా తెలుసు. అందుకే దాన్ని దక్కించుకోవటానికి ధైర్యంగా ప్రాణాలనే పణం పెడతాయి.

* * *

ఇదంతా ఏమిటనుకుంటున్నారు? పిచ్చివాడి ఊహ? భంగుభాయి సంధి ప్రేలాపనా? కాశీ మజిలీ కథా? *Alice in Wonderland* ను పోలిన వింత కథల అల్లికా ?

కాదండీ - కాదు. మన చరిత్రకారులు పరమ ప్రమాణంగా .... ప్రాచీన స్థితిగతులకు ప్రత్యక్ష సాక్ష్యంగా పరిగణించే ఒకానొక చారిత్రక గ్రంథం నుంచి జాలువారిన కొన్ని మేలి ముత్యాలివి.

ఆ గ్రంథం పేరు **ఇండికా!** రాసినవాడు (లేక రాశాడనుకుంటున్నవాడు) మెగస్తనీస్. ఇందులో వర్ణించినది ఏ అల్లిబిల్లి ఊహాలోకాన్నో కాదు... సాక్షాత్తూ మన ఇండియా దటీజ్ భారత్‌ను!

తరతరాలుగా మనం చదువుకుంటున్న చరిత్రకు విధాతలైన విలియంజోన్సు, మాక్స్‌ముల్లర్ వంటి పాశ్చాత్య పండితుల దృష్టిలో ప్రాచీన భారతీయ సారస్వతానికి చారిత్రక విలువ బొత్తిగా లేదు. భారతీయులకు అసలు చారిత్రక స్పృహ అనేదే ఆది నుంచీ లేదు-ట! వెనకటి వారు పుంఖానుపుంఖంగా పురాణాలైతే రాశారు. అవి అన్నీ కట్టుకథలేనట. యుగాలు, మన్వంతరాలు అంటూ వారు చెప్పే వేల, లక్షల సంవత్సరాల లెక్కలు పచ్చి అబద్ధాలట. ఎంతసేపూ విష్ణువు, శివుడు, ఋషులు, శాపాలు, యాగాలు, ఆగాలు అంటూ కథలు పేనడమే తప్ప విదేశీ రచయితల వలె స్పష్టంగా తెలిసేలా కుదురైన చరిత్ర రాయాలన్న ఆలోచనే పూర్వపు భారతీయులకు లేకపోయిందట. మనలనేలిన తెల్లదొరల అభిప్రాయం ప్రకారం క్రీ.పూ. 320 ప్రాంతాల్లో మన మీదికి అలగ్జాండరు దండయాత్ర చేసేంతవరకూ మన దేశానికి నమ్మదగిన చరిత్ర అనదగ్గది ఏదీ లేదు. ఆ గ్రీకువీరుడు తన వీరోచిత విజయగాథలను స్వయంగా చూసి రికార్డు చేయడానికి తన వెంట కొందరు మేధావులను తీసుకువచ్చాడు. అదిగో - అలా వారు రాసి పెట్టిన రికార్డులతోనే ప్రాచీన భారత చరిత్ర మొదలైంది. గ్రీకు రికార్డులన్నిటిలోకి తలమానికమైనది మెగస్తనీస్ రాసిన 'ఇండికా' అని విదేశీవాళీ చరిత్రబ్రహ్మల ఊహ. వారు నూరిపోసిన సీమ పాఠాలను జీర్ణించుకుని, వారు తగిలించిన రంగుటద్దాల నుంచే నేటికీ లోకాన్ని చూస్తున్న మనం కూడా అదే అక్షర సత్యమని నమ్ముతున్నాం. ఆ సంగతే ఇవాళ్టికీ మన పిల్లలకు చరిత్ర పాఠాల్లో బోధిస్తున్నాం.

ఉదాహరణకు సెంట్రల్ సిలబసు ప్రకారం 11వ తరగతి టెక్స్ట్‌బుక్‌గా రామ్‌శరణ్ శర్మ రచించిన ప్రాచీన భారతదేశం *(Ancient India)*లో - సెల్యూకస్ రాయబారిగా చంద్రగుప్త మౌర్యుడి రాజధాని పాటలీపుత్రంలో ఉండి అక్కడి నగరపాలన గురించి, మొత్తంగా మౌర్య సామ్రాజ్యం గురించి మెగస్తనీస్ రాసినది ఆ కాలంలో పరిపాలన, సామాజిక, ఆర్థిక స్థితిగతుల

మీద విలువైన వెలుగు ప్రసరిస్తుంది (throws valuable light on the administration, society and economy of Maurya times) అని కితాబు ఇచ్చారు.

ప్రాచీన భారత చరిత్రలో విశ్వసనీయతకు అదే పొద్దుపొడుపు అయినట్టు రెండు శతాబ్దాలకు పైగా మన చరిత్ర గ్రంథకర్తలు అభివర్ణిస్తూ వచ్చిన **ఇండికా** పుస్తకరాజంలో ఎంత లక్షణమైన 'చారిత్రకమైన సత్యాలు' ఉన్నాయో పైన చదివారు కదా!

వేలాది సంవత్సరాలుగా భారతీయులు మననం చేసుకుంటున్న స్మృతులు ఇతిహాసాలు, పురాణాలు, చారిత్రక విలువ ఏమీ లేని అభూత కల్పనలనీ... ఆ ప్రాచీన సారస్వతం నిగ్గుతేల్చి, నిజానిజాలు నిర్ధారించడానికి గ్రీకు రచయితల ప్రాచీన గ్రంథాలే గీటురాళ్లనీ ఆధునిక చరిత్ర దొరలు తేల్చారు సరే! కాని – పరమ ప్రమాణంగా వారు పరిగణించే గ్రీకురాతలు ఎక్కడా మిగిలిలేవు. కొన్ని వేల సంవత్సరాల కిందటే అవి కాలగర్భంలో కలిసి అదృశ్యమయ్యాయి. అలగ్జాండర్‌కు పూర్వపు వారైన Skylax, Hechatius, Milletus, Herodottus, Ktesiusలలో ఏ ఒక్కరూ ఇండియా ముఖం చూడలేదు. ఇండియా గురించిన వారి రాతలకు ఆధారాలేమిటో తెలియదు. ఆ గ్రంథాలూ కొద్దికాలానికే నాశనమయ్యాయి. జైత్రయాతలో అలెగ్జాండర్ వెంట వచ్చిన Nearchus, Onesicrotus, Aristobulus, Kallisthenes లు ఇండియాను చూసి గ్రంథస్థం చేసిన జ్ఞాపకాలూ ఆనవాలు లేకుండా పోయాయి.' అలగ్జాండర్‌కు మూడు నాలుగు శతాబ్దాల తరవాతి వారయిన Arrian, Strabo లకే అవి దొరకలేదు. ఆఖరికి – నేటికీ మనం గొప్పగా చెప్పుకుంటున్న మెగస్తనీస్ 'ఇండికా' కూడా రెండు మూడు శతాబ్దాలకే జాడ లేకుండా పోయింది. దానిని చదివిన వారు దానిలో నుంచి తమకు గుర్తున్నంతలో తమ తమ రచనల్లో అరకొరగా ఉటంకించిన ముక్కలే ప్రపంచానికి మిగిలాయి. అలా చెల్లాచెదురుగా పడి ఉన్న మెగస్తనీస్ గ్రంథ శకలాలను ఏరి Megasthenis India పేరిట 1846లో ప్రపంచానికి అందించిన వాడు జర్మన్ పండితుడు Dr. Schwanbeck. దాన్నే ***Ancient India As Described by Megasthenis and Arrian*** పేరు మీద 1877లో J.N.Mc Crindle ఇంగ్లీషులోకి అనువదించాడు. ఈ వ్యాసంలో మొదట్లో ఉటంకించిన విశేషాలు ఆ పుస్తకంలో ఉన్నవే.

అంటే – మౌర్య సామ్రాజ్యంలో మెగస్తనీస్ చూసింది, రాసింది అని గొప్పగా అనుకోవడమే తప్ప నిజంగా మెగస్తనీస్ ఏమి చూశాడో, ఏమి రాశాడో ఎవరికీ తెలియదు. అందులోని ముక్కలు (fragments) అంటూ చలామణిలో ఉన్నవాటిలో ఏది అసలో, ఏది మధ్యవారి సొంత కవిత్వమో మానవమాత్రుడు చెప్పలేడు. మనముందు ఉన్నదంతా మెగస్తనీస్ ఒరిజినల్ రచనేనని మాట వరసకు అనుకున్నా అది యావత్తూ సత్యమని మెడమీద తలకాయ ఉన్నవాడెవడూ అనుకోడు. మరుగున పడిన 'ఇండికా'ను ఏరికోరి లోకం ముందు పెట్టిన Dr. Schwanbeck మాటల్లోనే చెప్పాలంటే....

> "The ancient writers, whenever they judge of those who have written on Indian matters, are without doubt wont to reckon Megasthenes among those writers who are given to lying and least worthy of credit...."
>
> *[Mc Crindle 1877 p. 18]*

(ఇండియా వ్యవహారాలను రాసినవారి గురించి చెప్పవలసి వస్తే - అబద్ధాల కోరులూ, ఏ మాత్రం విలువ ఇవ్వదగని వారిలో మెగస్తనీస్‌ను కూడా ప్రాచీన రచయితలు లెక్కవేశారు.)

ఇక క్రీ.పూ. 63లో పుట్టిన (అంటే - ఇప్పటికీ రెండువేల ఏళ్ల కిందటి వాడయిన) Strabo తన దేశంలోని మహా రచయితల గురించి ఏమన్నాడో ఆలకించండి:

> "Genereally speaking, the men who have hitherto written on the affairs of India were a set of liars. Deimachos holds the first place in the list, Megasthenes comes next.... No faith whatever can be placed in Deimachos and Megathenes. They coined the fables concerning men with ears large enough to sleep in, men without any mouths, without noses, with only one eye... and with fingers bent backward.... They told of ants digging for gold... of serpants swallowing down oxen and stags.... meantime, accusing each other of falsehood."
>
> [***McCrindle, 1877**, p. 20*]

(స్థూలంగా చెప్పాలంటే - ఇంతవరకూ ఇండియా వ్యవహారాల గురించి రాసిన వారంతా అబద్ధాల కోర్లు. వీరిలో డీమాచాస్‌ది మొదటి స్థానం. ఆ తరవాత మెగస్తనీస్ వస్తాడు... డీమాచాస్, మెగస్తనీస్‌లు చెప్పింది ఎంత మాత్రం నమ్మదానికి వీల్లేదు. మనుషులు పదుకోగలిగినంత విశాలమైన చెవులు గల వారి గురించి.... నోరు, ముక్కులేని వారి గురించి, ఒంటికంటి వారి గురించి, కాలివేళ్లు వెనక్కి తిరగిన వారి గురించి వారు కట్టుకథలల్లారు.... బంగారం తవ్వే చీమలు గురించి. ఎడ్లను, జింకలను మింగే పాముల గురించి చెప్పారు. ఒకరు అబద్ధాలాడారని ఒకరు నిందించుకుంటూనే ఇద్దరూ అబద్ధాలాడారు.)

అయితే - మెగస్తనీస్ రికార్డుకు అసలు విలువే లేదా? ఆయన రాతల్లో నమ్మదగింది ఒక్కటీ లేదా? అన్నీ అబద్ధాలేనా? కాదు. పైన ఉదాహరించినటువంటి అతియోక్తులు, అభూత కల్పనలతోపాటు మెగస్తనీస్ రచనల్లో నమ్మదగిన సమాచారం కూడా చాలానే ఉంది. తాను చూసిన దేశం స్థితిగతులేమిటో, పరిపాలన ఎలా సాగేదో, ఆర్థిక, సామాజిక వ్యవస్థలు, కట్టుబాట్లు ఎలా ఉండేవో, విదేశీయుల పట్ల ఎంత మర్యాద చూసేవారో, తమ ప్రాచీన చరిత్ర గురించి అప్పటి భారతీయులు ఏమనకునేవారో, అప్పట్లో బ్రాహ్మణ, బౌద్ధమత విభేదాలు ఎలా ఉండేవో తెలుసు కోవడానికి మెగస్తనీస్ రికార్డు ఉపకరించే మాట వాస్తవం. అందులో రాసిందంతా నిజం కాకపోవచ్చు. సనాతన ధర్మం గురించి, హిందూ వ్యవస్థ సంప్రదాయాల గురించి తెలియని అజ్ఞానం వల్ల కూడా మెగస్తనీస్ అవగాహనలో అనేక లోపాలు ఉండవచ్చు. కనీసం ఒక విదేశీయుడి కళ్లకు అప్పటి భారతదేశం ఎలా కనిపించేదో తెలుసు కోవడానికైనా మెగస్తనీస్ గ్రంథం ఉపయోగిస్తుంది.

నిజం.

ఎంతవరకు యథార్థమన్న సంగతి ఎలా ఉన్నా ఇప్పటికి రెండు వేల ఏళ్ల కంటే ముందు

క్రీ.పూ. 4వ శతాబ్దంలో రాయబడిన రికార్డు అన్న ఒక్క అంశాన్ని బట్టే 'ఇండికా'కు గొప్ప పురాతత్వ ప్రాముఖ్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ పురాతనత్వాన్ని బట్టే అది చరిత్రపరంగా ఎనలేని ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ప్రతి అక్షరం నిజమైతే గానీ ఒక ప్రాచీన పత్రానికి విలువ ఉండదనటం మూర్ఖత్వం. ఇలాంటి వాటిలో తర్కానికి నిలిచి, సమంజసంగా తోచే విషయాలు ఏ మేరకు కనిపిస్తే వాటినే చరిత్ర పరిశోధనలో పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగాలి.

నిజం. నిజం.

మెగస్తనీస్ రికార్డులోని అసంబద్ధాలను, అబద్ధాలను ఎత్తి చూపితే మన చరిత్రకారులు, మహామేధావులు తడుముకోకుండా చెప్పే సమాధానాలివి. వీటితో విభేదించాల్సింది ఏమీ లేదు. వారు చెప్పేదంతా సబబే, సందేహం లేదు.

ఈ సందర్భంలో ఈ ఆధునిక పండిత ప్రకాండులను అడగాల్సిందల్లా ఒక్కటే:

మీరు చెప్పే చారిత్రక ధర్మసూత్రం మెగస్తనీస్‌కే తప్ప భారతీయ పురాణాలకు వర్తించదా?

వేల ఏళ్ల కిందటే నాశనమై పేరు మినహా ఏమీ మిగలని మెగస్తనీస్ గ్రంథమే చారిత్రక ఆధారం కాగా లేనిది.... చదివిన వారు తమకు గుర్తున్నంతలో అందులో నుంచి అక్కడక్కడ ఉటంకించిన ముక్కల అతుకులే ఒరిజినల్ 'ఇండికా' అని అంగీకరించగా లేనిది.... సహస్రాబ్దాలుగా చెక్కుచెదరక నిలిచిన పురాణాలు మాత్రం చారిత్రక ఆధారాలు కావా?

మోడరన్ హిస్టరీ పుస్తకాల్లో వలె తేదీలు, సంఘటనలు ఒక వరసలో, ఒకే మూసలో పురాణాలు ఏకరువు పెట్టకపోవచ్చు. లోకాలు, యుగాలు, దేవతలు, వారి తారతమ్యాలు, ధర్మాలు, వాటి మర్మాలు వగయిరాల గురించి పురాణాల ధోరణి కొత్తవారికి వింతగా ఉండవచ్చు. ఆధునిక శాస్త్రీయ దృక్పథంతో చూస్తే వాటిలోని అనేక విషయాలు విడ్డూరంగా కనబడవచ్చు. వాటిలో కొన్ని భాగాలు ఎవరో కావాలని, ఎవరినో అణచివేయాలని దుర్బుద్ధితో చేసిన బనాయింపులుగానూ ఎర్ర కళ్లద్దాల వారికి అనిపించవచ్చు. ఒక పురాణానికి, ఇంకో పురాణానికి మధ్య వైరుధ్యాలూ ఉండవచ్చు. మాట వరసకు పురాణాల్లో ఉన్నదంతా నూటికి 90 పాళ్లు చెత్త అని ఆధునిక అభ్యుదయ వాదులమైన మనం అనుకున్నా, పనికొచ్చే మిగతా 10 పాళ్ల విషయాలనైనా ఆదరంగా చూడాలి కదా? మనకు నమ్మకం ఉన్నా లేకున్నా కనీసం చారిత్రక దృష్టితోనైనా ఆయా అంశాలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యం ఇవ్వాలి కదా? విరుద్ధాంశాలను వదిలేస్తే... కనీసం పురాణల మధ్య ఏ వైరుధ్యం లేని, అనేక పురాణాలు ముక్త కంఠంతో చెప్పిన, శాస్త్ర సమ్మతమైన, ఇతరేతర రుజువులు, సాక్ష్యాల వల్ల కూడా నిజమని నిరూపించగలిగిన చారిత్రక విషయాలనైనా చరిత్ర పరిశోధనకు వాడుకోనక్కరలేదా?

అలగ్జాండర్ దండయాత్రకు పూర్వం భారతదేశ చరిత్ర అయోమయమని, ప్రాచీనులవన్నీ పుక్కిటి పురాణాలని సర్ విలియం జోన్సూ, మాక్స్ ముల్లర్ వంటి మహామహులు ఎంత చులకన చేయబోయినా ఈ దేశానికి వేల సంవత్సరాల నుంచీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న, కచ్చితంగా గుర్తుపట్టగలిగిన, సందిగ్ధతకు తావే లేని, నిజాయితీ గల ఏ చరిత్రకారుడూ కాదనలేని సుదీర్ఘ చరిత్ర ఉంది. ఆప్రాచీన చరిత్ర యావత్తూ మనం ఈసడించే పురాణాల్లో నిక్షిప్తమై ఉంది.

కృతయుగాలూ, త్రేతాయుగాల లక్షల సంవత్సరాల లెక్కలు నమ్మశక్యం కావని వదిలేసి, ఇప్పటి 'కలియుగం' సంగతే చూద్దాం. పేరు చూస్తే... దాని వెనుక పురాణగాథలు వింటే మనకు నవ్వు రావచ్చు. అంతకు ముందు యుగాలున్నాయో లేవో తెలియదు కాని – ఈ 'కలియుగాన్ని' మాత్రం మొదలైనప్పటి నుంచీ మనవారు లెక్కవేస్తూ వచ్చారు. దేశంలోని ప్రతి పంచాంగంలోనూ సంవత్సరం పేరుతోబాటు కలి ప్రారంభమై అప్పటికి ఎన్నేళ్లయిందో కచ్చితంగా లెక్క ఉంటుంది. దాని ప్రకారం ఈ 2003 A.D. లో నడిచేది కల్యాది 5104 సంవత్సరం. అంటే (5104–2003) క్రీ.పూ. 3101–02 ప్రాంతంలో కలిశకం ప్రారంభమైంది. కలిశకం గణన 3102 ఫిబ్రవరి 20 నుంచి ప్రారంభమైందని పాశ్చాత్య విద్వాంసులు అంగీకరించారు. దానికి 36 ఏళ్ల ముందు అంటే క్రీ.పూ. 3138లో మహాభారత యుద్ధం జరిగింది. అందులో గెలిచి 36 ఏళ్ల రాజ్యమేలాక శ్రీకృష్ణ నిర్యాణం వార్త తెలియగానే ధర్మరాజు తన మనవడు పరీక్షిత్తుకు పట్టాభిషేకం చేసి భార్య, సోదర సమేతంగా స్వర్గారోహణకు బయలుదేరాడు. అదే కలిశకానికి మొదలు. ఆ తరవాత 26 ఏళ్లకు అంటే (3102–26=) క్రీ.పూ. 3076లో ఆయనకు స్వర్గప్రాప్తి అయింది. దానికి గురుతుగా ఆ సంవత్సరం నుంచే యుధిష్ఠిర శకం మొదలైంది. దాన్నే 'లౌకికాబ్ద' శకం అని కూడా అంటారు. అదే ఈనాటికీ కాశ్మీర్‌లో అమలవుతున్నది. ఈ లెక్కలకు సంబంధించిన పూర్తి వివరాలను కోట వెంకటాచలం గారు రాసిన ***The plot in Indian History, Indian Eras, History of Ancient India*** గ్రంథాల్లో చూడవచ్చు.

మహాభారత యుద్ధకాలంలో పరీక్షిత్తు జన్మించే నాటికి సప్తర్షి మండలం (ఇంగ్లీషులో Great Bear) మఘ నక్షత్రంలో ఉంది. వందేళ్లకు ఒక నక్షత్రం చొప్పున అది వెనక్కి నడిచి 2700 సంవత్సరాలకు మళ్లీ అదే స్థానానికి వస్తుంది. ఇందులో మూఢనమ్మకం ఏమీ లేదు. ఖగోళ శాస్త్రరీత్యా లెక్కవేసి దీన్ని ధ్రువీకరించుకోవచ్చు. అలా ఒక రవుండు తిరిగేసరికి ఏఏ రాజుల రాజ్యం ముగిసిందో మత్స్యపురాణం ఇలా వివరిస్తుంది.

అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి మాగధా ఏబృహద్రథాః

(269–18)

బృహద్రథ వంశానికి చెందిన మగధ రాజుల గురించి ఇప్పుడు చెబుతాము.

మహాపద్మాభిషేకాత్తు యావజ్జన్మ పరీక్షితః
ఏకమేవ సహస్రంతు జ్ఞేయం పంచశతోత్తరం

(271–39)

(పరీక్షిత్తు జననం నుంచి మహాపద్మనందుడి పట్టాభిషేకానికి 1500 సంవత్సరాలు గడిచాయి)

పౌలోమాస్తు తదాంధ్రాస్తు మహాపద్మాంతరేపునః
అనంతరం శతాన్యష్టౌ షట్త్రింశత్తు సమాస్తథా

(270–39)

(మళ్లీ మహాపద్మనందుడి నుంచి పులోములనే ఆంధ్ర వంశం వరకూ మధ్య వ్యవధి 836 ఏళ్లు.)

సప్తర్ష యన్తదాప్రాంశు: ప్రదీప్తే నాగ్నినాసమా:
సప్తవింశతి భావ్యానా మాంధ్రాణాంతు యథాపున:

(271-41)

(సప్తర్షి మండలం ఆ [పరీక్షిత్తు జనన] సమయానికి అగ్ని నక్షత్రంలో ఉంది. 2700 ఏళ్ల తరవాత ఆంధ్రరాజుల కాలంలోనే ఈ వృత్తం పూర్తవుతుంది.)

ఇతర చారిత్రక, ఖగోళ శాస్త్ర ఆధారాలకు కూడా ఈ లెక్క సరిపోతుంది. బ్రహ్మ, బ్రహ్మవైవర్త, భవిష్య, విష్ణు, పురాణాల్లోనూ, పురాణాంశాలను సమన్వయం చేస్తూ ప్రాచీన కాలంలో వెలువడిన **కలియుగ** రాజవృత్తాంతంలోనూ ఇటువంటి కచ్చితమైన చరిత్ర లెక్కలు అనేకం ఉన్నాయి.

ఇదంతా చరిత్ర కాదా? ఇవన్నీ చారిత్రక ఆధారాలు కావా? చిత్తశుద్ధి గల చరిత్ర పరిశోధకులకు ఇంతకు మించిన 'క్లూ'లు ఏమి కావాలి? అయినా పురాణాలన్నీ కల్పితాలని, వాటిని విశ్వసించడానికి వీలులేదని మన చరిత్ర తీర్పరులు ఎలా దబాయించగలరు?

ఆబోతులను మింగే పాములు, ఎగిరే తేళ్లు, నోరులోని మనుషులు, చీమల బంగారు కొండలు, ఆరేళ్ల అమ్మలు ఉన్నారని చెప్పిన మెగస్తనీస్ **ఇండికా** పుక్కిటి పురాణం కాదు; వేల సంవత్సరాలు దేశ చరిత్రను సూక్ష్మంగా చెప్పిన భారతీయ సారస్వతమేమో పుక్కిటి పురాణాలా? ఇదేమి వాదం?

అసలైన - మిలీనియం జోకు ఏమిటంటే -

మౌర్య చంద్రగుప్తుడి ఆస్థానంలో రాయబారిగా ఉండి మెగస్తనీస్ 'ఇండికా' రాశాడని కదా మన హిస్టరీ మాస్టర్లు చెప్పేది? నిజానికి మెగస్తనీస్ అనేవాడు మౌర్య రాజ్యం మొగమైనా ఎరుగడు. అతడు ఇండియాలో అడుగుపెట్టటానికి పన్నెండు వందల ఏళ్లకు పూర్వమే మౌర్యచంద్రగుప్తుడు పైలోకానికి పోయాడు!

మరి - మెగస్తనీస్ చూసిన చంద్రగుప్తుడెవరు? ఈ తిరకాసు ఎలా జరిగింది?

దొరలు మింగిన చరిత్ర

'కుప్పుసామయ్యర్ మేడ్ డిఫికల్ట్' అని కన్యాశుల్కంలో గిరీశం చెప్పిన పుస్తకం ఉందో లేదో తెలియదు. తరతరాలుగా మన చిన్నారులు చదువుతున్న చరిత్ర పుస్తకాలు మాత్రం కచ్చితంగా - ఇండియన్ హిస్టరీ మేడ్ డిఫికల్టే!

అయోమయానికి, అస్పష్టతకు ఏ మాత్రం ఆస్కారం లేని ప్రాచీన చరిత్రగల దేశం ప్రపంచంలో ఏదైనా ఉన్నదంటే - అది ఇండియాయే! చలామణిలో ఉన్న చరిత్ర గ్రంథాలు తప్పుల తడకలై, తమ గతమేమిటో తమకే సరిగా తెలియని అయోమయంలో ప్రజలు కొట్టుమిట్టాడుతున్న దేశమేదైనా ఉంటే - అది కూడా ఇండియానే!!

శుభ్రమైన ప్రాచీన చరిత్రను అపభ్రంశాలమయంగా నానా కంగాళీ చేసి 'మేడ్ డిఫికల్ట్'గా మార్చినవారు ఇంగ్లీషు వారు. అదీ తెలియక చేసిన పొరపాటు కాదు. బుద్ధిపూర్వకంగా జరిగిన తప్పు. పథకం ప్రకారం సాగిన కుట్ర. చెప్పాలంటే అదో పెద్ద కథ.

మన పూర్వులకు చరిత్ర స్పృహ లేదని.... కట్టలకు కట్టల పురాతన పురాణాల్లో చారిత్రక ఘటనగా గుర్తించదగినది, చరిత్ర ప్రతిపత్తి ఇవ్వదగినది ఏమీ లేదని... ఊహనూ యథార్థాన్నీ కలగలిపి, అతిశయోక్తులు జోడించి, మూఢవిశ్వాసాలు పులిమి కలగాపులగం చేసిన పాతతరం అయోమయపు పుంత నుంచి మనలను బయటవేసి, ఉన్నంతలో దేశ చరిత్రను క్రమబద్ధీకరించిన పుణ్యం ఇంగ్లీషు వారిదేనని మన మేధావులు చాలామందికి గొప్పగురి. నిజానికి ఉపకారులని మనం అనుకుంటున్న వారే మనకు కానరాని అపకారులు.

బ్రాహ్మడు - నల్లమేక కథలో నలుగురు దొంగలు కూడబలుక్కుని నువ్వు మోస్తున్నది మేక కాదు కుక్క అని విడివిడిగా అనేసరికి బ్రాహ్మడికి కూడా అనుమానం వచ్చి ఇందరు చెబుతున్నారు కనక నిజంగా అది కుక్కే అయి ఉంటుందని నిశ్చయించుకుని దాన్ని అవతల పడేసి పోతాడు. మన సంగతీ అంతే. మహామహా ఇంగ్లీషు దొరలు, కొమ్ములు తిరిగిన పాశ్చాత్య విద్వాంసులు మన పురాణాలు పచ్చి అబద్ధాలని తేల్చారు కాబట్టి నిజంగా అవి పిచ్చిరాతలే అయి ఉంటాయని అమాయకంగా నమ్మాం. సీమ దొరలు పాత రికార్డులన్నీ

తిరగేసి మన చరిత్రను ఒక దోవకు తేవటానికి ఏళ్ల తరబడి పడిన కష్టాన్నే చూశాము గాని, ఆ కష్టం వెనుక మతలబు ఏమిటో పోల్చుకోలేకపోయాం.

నిజమే. తెల్లదొరలందరూ దుర్మార్గులు కారు. ఈస్టిండియా కంపెనీ కాలంలో ప్రాచీన హిందూ ధర్మం, సంస్కృతి, సారస్వతాల పట్ల శ్రద్ధాసక్తులు చూపి, వాటి అభివృద్ధికి యథాశక్తి దోహదించిన వారన్ హేస్టింగ్స్, విలియం జోన్స్, చార్లెస్ విల్కిన్స్, థామస్ మన్రో, సి.పి.బ్రౌన్, మెకంజీ వంటి మహనీయులు ఎందరో ఉన్నారు. కాని – చేదు నిజమేమిటంటే – భారతీయ సంస్కృతి పట్ల ఆదరాభిమానాలు నిజంగా ఉన్న ఆంగ్లేయ మేధావుల్లో కూడా కొందరు ప్రాచీన చరిత్ర పరిశోధన దగ్గరికి వచ్చేసరికి అసంకల్పితంగానే అయినా మనకు అన్యాయం చేశారు. మెకాలేకు ఉన్నట్టుగా భారతీయులను అణగదొక్కాలన్న కుత్సితమేదీ లేకపోయినా, చిత్తశుద్ధితోనే పనిచేసినా, 18వ శతాబ్దంలో తామున్న దేశకాల పరిస్థితుల ప్రభావం వల్లనైతేనేమి, సొంత మత విశ్వాసాల రంగుటద్దాల నుంచే భారతీయ గతాన్ని చూడటం వల్లనైతేనేమి కళ్లెదుట కనిపించే యథార్థాన్ని వారు పూర్తిగా అంగీకరించలేక పోయారు. తిరుగులేని సత్యాలని తాము చిరకాలంగా నమ్మిన అభిప్రాయాలకు అనుగుణంగా భారతీయ వాస్తవాన్ని అడ్డదిడ్డంగా మలచి, మహాసముద్రం వంటి భారతీయ జీవన ప్రవంతిని తమ మేధ అనే చిన్ని సీసాలో వారు బంధించబోయేసరికి రసాభాస అయింది. భారతదేశానికి మేలు చేస్తున్నామని భావిస్తూనే, తమ ప్రమాణాల మేరకు, తమ పరిమితులకు లోబడి నిజనిర్ధారణకు పాటుపడుతూనే, మాన్యులైన ఆంగ్ల మేధావులు కొందరు ముఖం చెక్కి కాళ్లు నరికిన ఫలితంగా భారతీయ చరిత్ర అష్టావక్రంగా తయారైంది.

ఉదాహరణకు – సర్ విలియం జోన్స్ సంగతే తీసుకోండి.

విలియం జోన్స్ సామాన్యుడు కాదు. 1773లో కలకత్తా సుప్రీంకోర్టు జడ్జిగా వచ్చీ రాగానే – తీర్పులు ఇవ్వబోయే ముందు దేశీయ న్యాయం ఏమిటో తనకు తెలియాలన్న ఉద్దేశంతో హిందూ ధర్మశాస్త్రాలను, న్యాయ స్మృతులను క్షుణ్ణంగా తెలుసుకుని, వాటి సారాంశాన్ని చక్కగా వింగడించగలిగిన మేధావి! వేదాలను ఉద్ధరించిన సంస్కృత విద్వన్మణి అనే పేరు మోసి కూడా సంస్కృతంలో ఎవరైనా మాట్లాడితే ఒక్క ముక్కా అర్థం చేసుకోలేని మాక్స్‌ముల్లర్ లాంటి వాడు కాదాయన. సంవత్సరానికి మూడు నెలలు హిందూ విద్యా నిలయమైన నవద్వీపంలో గడిపి అక్కడి విద్వాంసులతో సంస్కృతంలోనే ధారాళంగా సంభాషించేవాడు. 1784లో ఆయన స్థాపించిన రాయల్ ఆసియాటిక్ సొసైటీ అపురూప తాళపత్ర గ్రంథాలను సేకరించి, సంస్కరించి, ప్రాచీన భారతీయ విజ్ఞాన పరిశోధనకు ఎంతో తోడ్పడింది. అదిగో – అంత గొప్ప విలియం జోన్స్ కూడా భారతీయ చరిత్ర కాలక్రమాన్ని నిగ్గుతేల్చటంలో పెద్ద తప్పటడుగు వేశాడు.

వృత్తిరీత్యా న్యాయమూర్తి అయినా ప్రవృత్తిరీత్యా పరిశోధకుడయిన విలియం జోన్స్ భారత చరిత్రను క్రమబద్ధంచేసే పనిలో మూలాధారాలను సరిగానే ఎంచుకున్నాడు. వేల సంవత్సరాల ప్రస్థానాన్ని, ఘటనా క్రమాన్ని సూచ్యంగానో వాచ్యంగానో వివరించిన పురాణేతిహాసాలతోనే ఆయన అన్వేషణ మొదలెట్టాడు. అదే పంథాలో సాగి, తాను గ్రహించిన సహేతుక విషయాలను ఆయన నిస్సంకోచంగా స్వీకరించి ఉంటే బాగుండేది. కాని జరిగింది వేరు.

చరిత్ర గతికి, కాలచక్ర గమనానికి సంబంధించినంత వరకూ ప్రాచీన భారతీయ సారస్వతంలో అస్పష్టతకు తావులేదు. క్షణంలో 1/300 వంతు అయిన వేధ నుంచి 30

కోట్ల 67 లక్షల సంవత్సరాలుండే మన్వంతరం వరకు, ఆపైన కూడా ఆధునిక కంప్యూటర్లకు సైతం అంతుబట్టనంత సూక్ష్మాతి సూక్ష్మ, స్థూలాతిస్థూల కాలగణన విధానం అనాదిగా భారతీయులకు సొంతం.

History is one weak point in Indian literature... Definite dates do not begin to appear in the Indian History till about 500 A.D. *(భారతదేశపు సాహిత్యంలో చరిత్ర ఒక బలహీనత... క్రీ.శ. 500 వరకూ కచ్చితమైన తేదీలు భారతీయ చరిత్రలో ఎక్కడా కనపడవు)* అన్న Arthur A.Macdonell మాట అసత్యం. No dates of ancient history of India can be decided. Indian History begins as far the exact dates are concerned, from the invasion of Alexander of Macedonia on India in 327 B.C. *(భారతదేశపు ప్రాచీన చరిత్రలో ఏ తేదీలను ఇదమిత్థంగా నిర్ణయించలేము. కచ్చితమైన తేదీలకు సంబంధించినంత వరకూ భారత చరిత్ర క్రీ.పూ. 327లో మాసిడోనియా అలెగ్జాండర్ దండయాత్రతోనే మొదలవుతుంది)* అని ***Early History of India***లో V.A.Smith చెప్పింది అబద్ధం.

ఇప్పుడు నడుస్తున్న కలి శకంలో ఆది నుంచి నేటివరకూ నిర్దుష్టమైన, విస్పష్టమైన చారిత్రక కాలక్రమం రాసిపెట్టి ఉంది. తేదీలూ సంవత్సరాల లెక్కలే కావలసి వస్తే మన పురాణ, ఇతిహాసాల నిండా ఉన్నవే అవి.

మహాభారత యుద్ధం 18 రోజులు సాగింది. అందులో పాండవులు గెలిచి, ధర్మరాజు గద్దెనెక్కాడు. ఆయన 36 ఏళ్లు రాజ్యమేలాక, 37వ ఏట శ్రీకృష్ణ నిర్యాణం జరిగింది. సరిగ్గా అదే రోజున కలిశకం మొదలైంది. అది మొదలుకొని నేటివరకు ఏటేటా పంచాంగాల్లో వేసుకుంటూ వస్తున్న లెక్క ప్రకారం చూస్తే కలిశకం క్రీ.పూ.3102లో ఆరంభమైంది. అంటే – భారత యుద్ధం క్రీ.పూ. (3102+36)లో జరిగింది. అనంతర కాలంలో వెలువడిన పురాణాలు, ఇతిహాసాలు అన్నీ భారత యుద్ధకాలం నుంచీ మొదలుపెట్టి వివిధ రాజవంశాల పాలనాక్రమాన్ని వివరించాయి. (మత్స్య పురాణంలో ఇందుకు సంబంధించిన మచ్చుతునకను ఇంతకుముందే చూశాం.) ఇవి కచ్చితమైన తేదీలు కావా?

కలిశకం క్రీ.పూ.3102లోనే మొదలైందని దాఖలా ఏమిటి – అన్న సందేహానికీ తావు లేదు. కలి ప్రవేశించింది ప్రమాది నామ సంవత్సర చైత్రశుద్ధ పాడ్యమి నాడనీ, ఆ రోజు మేషరాశిలో ఏడు గ్రహాలు కలిసి ఉన్నాయని మన పూర్వులు రాశారు. క్రీ.పూ. 3102లో వారు చెప్పిన రోజున గ్రహస్థితి సరిగ్గా అలాగే ఉందని ఖగోళ శాస్త్రజ్ఞులు తేల్చి చెప్పారు. భారత యుద్ధకాలం మొదలుకుని ఏ వంశం తరవాత ఏ వంశంలో ఏఏ రాజులు ఎంత కాలం పాలించిందీ వివరించిన పురాణాల ఊసులూ అబద్ధాల అల్లికలనుకోవడానికి వీలులేదు. వందేళ్లకో నక్షత్రం చొప్పున వెనక్కి కదిలే సప్తర్షి మండలంలో ఎవరి పాలన నాటికి ఏ నక్షత్రం ఉందో పురాణాలు పేర్కొన్న వైనాన్ని కిందటి వ్యాసంలో చూశాం. నూరేసి ఏళ్ల ఖగోళ పరిణామాలను వేల సంవత్సరాల చరిత్ర ప్రస్థానంలో మైలురాళ్లుగా నిలబెట్టి, భూమి మీద ఘటనకూ ఆకాశంలో నక్షత్రాల నడకకూ పొంతన చూపడాన్ని మించిన శాస్త్రీయ ప్రమాణం ఏమి కావాలి?

మత్స్య, వాయు, బ్రహ్మాండ, భాగవత, విష్ణు పురాణాల్లో చెప్పిన దాని బట్టి క్రీ.పూ.

3118లో భారత యుద్ధకాలం నుంచి మగధ నేలిక వివిధ రాజవంశాల పాలనా క్రమం ఇలా ఉంది.

కాలం	మొత్తం సంవత్సరాలు	వంశం	రాజుల సంఖ్య
క్రీ.పూ. 3138 నుంచి క్రీ.పూ.2132	1006	బృహద్రథ	22
క్రీ.పూ. 2132 నుంచి క్రీ.పూ.1994	138	ప్రద్యోత	5
క్రీ.పూ. 1994 నుంచి క్రీ.పూ.1634	360	శిశునాగ	10
క్రీ.పూ. 1634 నుంచి క్రీ.పూ.1534	100	నంద	9
క్రీ.పూ. 1534 నుంచి క్రీ.పూ.1218	316	మౌర్య	12
క్రీ.పూ. 1218 నుంచి క్రీ.పూ.918	300	శుంగ	10
క్రీ.పూ. 918 నుంచి క్రీ.పూ.833	85	కాణ్వ	4
క్రీ.పూ. 833 నుంచి క్రీ.పూ.327	506	ఆంధ్ర	32
క్రీ.పూ. 327 నుంచి క్రీ.పూ.82	245	గుప్త	7

ఆధారం : కోట వెంకటాచలం గారి ***The Plot in Indian Cronology***

భారత యుద్ధ కాలం నుంచి 1500 సంవత్సరాలకు మగధలో మహా పద్మనందుడి పట్టాభిషేకం జరిగింది. ఆయన, కుమారులు (మొత్తం 9 మంది నవనందులు) కలిసి క్రీ.పూ.1534 వరకు పాలించారు. వీరిలో చివరి వాడైన ధననందుడిని ఆర్యచాణక్యుడి సాయంతో అంతమొందించి మౌర్య చంద్రగుప్తుడు క్రీ.పూ. 1534లో గద్దె నెక్కాడు. 316 ఏళ్ల మౌర్యవంశ పాలన తరవాత 891 ఏళ్లు శుంగ, కాణ్వ, ఆంధ్ర వంశాలు మగధనేలాయి. ఆంధ్రవంశంలో చివరి వాడైన చంద్రబీజుడు (అలియాస్ చంద్రమసుడు ఉరఫ్ చంద్రశ్రీ) ఏలుబడిలోనే క్రీ.పూ.327లో అలగ్జాండర్ దండయాత్ర జరిగింది. ఈ చంద్రమసుడినే అలగ్జాండర్ వెంట వచ్చిన గ్రీకు రచయితలు, వారి తరవాతి తరాల వారు Xandrames అనీ Agrammes అనీ పేర్కొన్నారు. ఆ సంవత్సరమే చంద్రమసుడిని హతమార్చి గుప్త చంద్రగుప్తుడు గుప్త సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఈ గుప్త చంద్రగుప్తుడి రాజ్యంలోనే సెల్యూకస్ రాయబారిగా మెగస్తనీస్ ఇండియా వచ్చి కిందటి వ్యాసంలో మనం చెప్పుకున్న 'ఇండికా'ను రాశాడు. గుప్త చంద్రగుప్తుడి అనంతరం అతడి కుమారుడు సముద్రగుప్తుడు సింహాసనమెక్కి చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోయిన చక్కని పాలననందించాడు.

ఇలా సాగుతుంది ప్రాచీన భారత చరిత్ర. భాగవతాది అనేక పురాణాల్లో చెప్పిన ఈ రాజుల వంశక్రమం యథార్థమని ఆయా కాలాల్లో సప్తర్షి మండలం-నక్షత్ర చలనాల దృష్టాంతాన్ని బట్టి శాస్త్రీయంగా నిరూపితమైంది. హిందూ పురాణాలే గాక ప్రాచీన బౌద్ధ వాఙ్మయంలోని రాజచరితాలతో ఈ వంశక్రమం చక్కగా సరిపోతుంది. పురాణాల నుంచి సేకరించి 1788లో సర్ విలియం జోన్స్ ప్రచురించిన హిందూ మగధ రాజవంశావళి కాలక్రమం కూడా ఇంచుమించుగా ఇలాగే ఉంది. జోన్స్ పరిశీలన సారాంశం ఇది:

కాలం	మొత్తం సంవత్సరాలు	వంశం	రాజుల సంఖ్య
క్రీ.పూ. 3102 నుంచి క్రీ.పూ.2102	1000	బృహద్రథ	21
క్రీ.పూ. 2100 నుంచి క్రీ.పూ.1962	138	ప్రద్యోత	5
క్రీ.పూ. 1962 నుంచి క్రీ.పూ.1602	360	శిశునాగ	10
క్రీ.పూ. 1602 నుంచి క్రీ.పూ.1502	100	నంద	1
క్రీ.పూ. 1502 నుంచి క్రీ.పూ.1365	137	మౌర్య	10
క్రీ.పూ. 1365 నుంచి క్రీ.పూ.1253	112	శుంగ	10
క్రీ.పూ. 1253 నుంచి క్రీ.పూ.908	345	కాణ్వ	4
క్రీ.పూ. 908 నుంచి క్రీ.పూ.452	456	ఆంధ్ర	32

సంవత్సరాల్లో, రాజుల సంఖ్యలో తేడాలున్నా జోన్స్ చెప్పిన దానికీ, పురాణాలు తెలిపిన దానికీ మధ్య పెద్ద వ్యత్యాసం లేదు. ఇది వాస్తవం అయి ఉండదనడానికి విలియం జోన్స్ (ఆ మాటకొస్తే నాటి నుంచి నేటి వరకూ ప్రపంచంలో ఏ ఒక్క పండితుడూ) కచ్చితమైన ఆధారం ఏదీ చూపించలేకపోయాడు. సందేహానికి సహేతుకమైన ఆస్కారం ఏదీ లేని ఈ రాజవంశ చరిత్ర క్రమాన్ని ప్రామాణికంగా అంగీకరించడానికి న్యాయంగా అయితే ఎవరికీ అభ్యంతరం ఉండకూడదు.

కాని - అవసరంలేని చోట సంశయం లేవదీసి అర్థంలేని వివాదాన్ని పనిగట్టుకుని రేకెత్తించడమే (ముఖ్యంగా ప్రాచీన భారత చరిత్రకు సంబంధించినంత వరకూ) పాశ్చాత్య మేధావుల ప్రత్యేకత. ఆఖరికి విలియం జోన్స్ అంతటి పెద్ద మనిషి కూడా పురాణాల నుంచి తాను కనుగొన్న చరిత్ర జాడలను ఏ రుజువు చూపకుండా అడ్డంగా కొట్టేసి, ఉత్తుత్తి ఊహాగానాలు చేసి క్రీ.పూ.1534 నాటి మౌర్య చంద్రగుప్తుడిని పట్టి క్రీ.పూ. 327కు నెట్టాడు. నిజానికి ఆ కాలంలో ఉన్న గుప్త చంద్రగుప్తుడినేమో ఎనిమిది శతాబ్దాల అవతలికి విసిరేశారు. దాంతో ప్రాచీన భారత చరిత్రలో ఏకంగా 1200 సంవత్సరాలు ఒక్క దెబ్బతో హాంఫట్ అయ్యాయి. క్రీ.పూ.1534 నాటి మౌర్య చంద్రగుప్తుడిని, క్రీ.పూ.327 నాటి అలెగ్జాండర్ సమకాలికుడుగా బనాయించి, ఆ అబద్ధమే పునాదిగా ప్రాచీన భారత చరిత్ర నిర్మాణం చేయడంతో మొత్తం చరిత్ర తప్పుల తడకగా తయారైంది.

ఈ చారిత్రక మాయాజాలం ఎలా జరిగిందో, దాని పర్యవసానాలేమిటో ముందు వ్యాసంలో చూద్దాం.

వాడే వీడు... కామోసు!

కామమ్మ మొగుడండే కామోసనుకున్నాను. కాకపోతే నా కర్రా బుర్రా ఇట్టా పారెయ్యమన్నాడట వెనకటికో కేటుగాడు. మనిషిని పోలిన మనిషి ఉంటాడు కాబట్టి కొత్త మనిషిని చూసి - చాలాకాలం కింద ఇల్లొదిలి పోయిన కామమ్మ మొగుడని అమాయక జనం పొరబడటంలో వింత లేదు. ఒక ఇల్లు, ఇల్లాలు అప్పనంగా అమరి తిండి సమస్య తీరింది కనక దూప్లికేటు శాల్తీ సాగినంత కాలం మోసాన్ని సాగించడమూ విడ్డూరం కాదు.

కాని - కేవలం పేరు ఒకటే అయిన కారణం చేత తొంభై ఏళ్ల ముసలాడిని చూసి పందొమ్మిదేళ్ల కుర్రాడని పొరబడేవారు ఎక్కడైనా ఉంటారా? మతి సరిగా లేకో, వేరేదో దురుద్దేశంతోనో, 'వాడే వీడు' అని కొద్దిమంది బుకాయించారనుకోండి. మిగతా జనమూ ఆ అబద్ధాన్ని తేలిగ్గా నమ్మేస్తారా? ఏ మాయాజాలంలోనో పడి కాసేపో, ఒకరోజో అందరూ మోసపోయారనుకున్నా, కనీసం ఆ తరవాతైనా మోసాన్ని గ్రహించాలి కదా? ఇద్దరు ముగ్గురు ప్రబుద్ధులు కావాలని అల్లిన కట్టుకథకు ఏళ్ల తరబడి లోకమంతా మోసపోయిందంటే నమ్మగలమా?

నమ్మాలి. నమ్మి తీరాలి. ఎందుకంటే - అటువంటి ఊహకందని మోసం మన కళ్ల ముందే ఎన్నో ఏళ్లుగా (ఎన్నో తరాలుగా) సాగిపోతున్నది. అర్థం పర్థం లేని పచ్చి అబద్ధం తిరుగులేని చారిత్రక సత్యం కింద రెండు శతాబ్దాలకు పైగా చలామణి అవుతున్నది.

ప్రాచీన భారత చరిత్రలో ఇద్దరు చంద్రగుప్తులున్నారు. మొదటివాడు మగధ నేలిన మౌర్య చంద్రగుప్తుడు. ఆర్య చాణక్యుడి అండతో నందవంశాన్ని నిర్మూలించి క్రీ.పూ. 1534లో సింహాసన మెక్కినవాడు. రెండోవాడు ఆంధ్రవంశం చివరి రాజైన చంద్రమసుడిని చంపి పాటలీపుత్రంలో క్రీ.పూ. 320 ప్రాంతంలో గుప్త సామ్రాజ్యాన్ని స్థాపించిన గుప్త చంద్రగుప్తుడు. ఇద్దరి మధ్య 1200 ఏళ్లకు పైబడిన అంతరం ఉంది కాబట్టి పొరపాటు పడేందుకు ఆస్కారమే లేదు. ఇద్దరి జీవిత కాలాలు, వారి మధ్య రాజ్యాలేలిన రాజుల పేర్లు పురాణాలు పూసగుచ్చినట్టు

వివరించాయి. బౌద్ధ వాఙ్మయంలో చెప్పిన దానికీ ఇతర విదేశీ చారిత్రకాధారాలకూ ఇది సరిపోతున్నది కూడా. కనుక సందిగ్ధతకు తావేలేదు.

ఈ విషయాలన్నీ తెలిసి కూడా ఆంగ్లేయ పండితులు కొందరు క్రీ.పూ. 16వ శతాబ్దం నాటి చంద్రగుప్తుడిని తెచ్చి క్రీ.పూ. 4వ శతాబ్దం నాటి అలగ్జాండర్ సమకాలికుడైన చంద్రగుప్తుడిగా చూపెట్టారు. మిగతా వాళ్ళు కామోసనుకున్నారు. ఈ అడ్డగోలు కాల నిర్ణయం జరిగి శతాబ్దాలు గడిచాక ఇంగ్లీషు వారు మరలిపోయి దేశం స్వతంత్రమైన ఇన్ని తరాల తరవాత కూడా మనం ఇంకా కామోసనే అనుకుంటున్నాం!

బృహస్పతి సైతం ఆశ్చర్యంతో మూర్ఛపోయేంతటి కుశాగ్రబుద్ధితో తాము చేసిన ధర్మ నిర్ణయానికి తెల్లదొరలు చూపించిన ఆధారం ఒకే ఒకటి:

అలగ్జాండర్‌కు సమకాలికుడిగా గ్రీకు రచయితలు పేర్కొన్న Sandrocottus ఉనికి!

'శాంద్రోకొట్టస్' అనే గ్రీకు నామం తర్జుమా చేస్తే 'చంద్రగుప్తుడు' అవుతుంది. అంతవరకూ పేచీలేదు.

అలాగని – అతడే మౌర్య చంద్రగుప్తుడని దొరవార్లు తెలియక పొరబడ్డారను కోవడానికి వీలులేదు. ఎందుకంటే Diodorus, Curtius, Plutarch వంటి గ్రీకు రచయితలు ఒక్క 'శాంద్రోకొట్టస్'నే కాదు. అతడికి ముందున్న, తరవాత వచ్చిన రాజుల పేర్లు ఇచ్చారు. శాంద్రోకొట్టస్‌కు పూర్వం Xandrames పాలించాడు. అతడి దగ్గర ఇరవై వేల గుర్రాలు. రెండువేల రథాలు, నాలుగువేల ఏనుగులు, రెండు లక్షల కాల్బలం ఉన్నాయి. ఆ సంగతి శాంద్రోకొట్టస్ ద్వారా తెలుసుకునే మాసిడోనియా చక్రవర్తికి కాళ్ళు చల్లబడి గంగ ఆవలికి దాటకుండానే జైత్రయాత్ర మానుకుని ఇంటి దారి పట్టాడు. అనంతరకాలంలో రాజును చంపి 'శాంద్రోకొట్టస్' గద్దెనెక్కాడు. అతడి తరవాత అతడి కుమారుడు Sandrocyptus రాజ్యమేలాడు. అతడి హయాంలోనే సెల్యూకస్ రాయబారిగా మెగస్తనీస్ ఇండియా వచ్చాడు. సరే!

మౌర్య చంద్రగుప్తుడు ధననందుడిని చంపి గద్దెనెక్కాడు. అతడి తరవాత కుమారుడు బిందుసారుడు, అనంతరం మనవడు అశోకుడు రాజ్యమేలారు. గుప్త చంద్రగుప్తుడేమో చంద్రమసుడు (అలియాస్ చంద్రబీజుడు ఉరఫ్ చంద్రశ్రీ)ని చంపి గుప్తరాజ్యం స్థాపించాడు. అతడి అనంతరం కుమారుడు సముద్రగుప్తుడు సింహాసనమెక్కాడు. ఇంతవరకూ పాశ్చాత్య పండితులు కూడా కాదనరు.

ఇప్పుడు ప్రశ్నల్లా గ్రీకువారి క్లూల ప్రకారం ఇద్దరు చంద్రగుప్తుల్లో ఎవరు అలగ్జాండర్ సమకాలికుడని.

A. Xandrames	Sandrocottus	Sandrocyptus
B. చంద్రమసుడు	చంద్రగుప్తుడు	సముద్రగుప్తుడు
C. ధననందుడు	చంద్రగుప్తుడు	బిందుసారుడు

పైన ఇచ్చిన B, C పేర్ల సెట్లలో ఏది 'A' సెట్టు పేర్లకు దగ్గరగా ఉన్నది అని అడుగుతే మూడో క్లాస్ కుర్రాడు కూడా టక్కున చెబుతాడు 'B' సెట్టు అని.

తెలిసీ తెలియని కుర్రాళ్లే కాదు. తలపండిన కొందరు ఇంగ్లీషు మేధావులు కూడా అదే మాట అన్నారు. ఉదాహరణకు – "Chandramas would be the equivalent of the Greek appellative Xandrames" అని ***Cambridge History of India*** లో భాగంగా

1922లో రాసిన *Ancient India* (470 పేజి)లో E.J.Rapson తేటతెల్లం చేశాడు.

చిత్రమేమిటంటే - ప్రతిదీ శాస్త్రీయ దృష్టితోనే చూస్తామని, సహేతుకంగా తప్ప ఆలోచించబోమని చెప్పే పాశ్చాత్య విద్వాంసులు శబ్దాల సామ్యాన్ని పట్టించుకోకుండా Sandrocottus అనగా మౌర్య చంద్రగుప్తుడే అయి తీరాలని, అందుచేత Xandrames అనగా ధననందుడో, మహాపద్మనందుడో అయి ఉండాలని ఏ ఆధారం లేకుండా తీర్మానించేశారు. భాష, పలుకుబడి, ఉచ్చారణ వగయిరా విషయాలు లోతుగా తెలిసిన మాక్స్‌ముల్లర్ కూడా అర్థంకన్నా స్వార్థం మిన్న అని తలచి అడ్డగోలు సమర్థింపులకు దిగాడు. తమరన్నట్టు మౌర్య చంద్రగుప్తుడే శాండ్రోకొట్టస్ అయిన పక్షంలో ధననందుడు 'శాండ్రేమ్స్' కావాలి కదా స్వామీ' అన్న శంకకు ముల్లర్ గారి సమాధానం వినండి.

> "Xandrames... is the last king of the empire conquered by Sandrokottas. If, however it should be maintained that those two names were intended for one and the same king, the explanation could still be very easy. For, Chandragupta is also called Chandra and Chandramas in Sanskrit is a synonym of Chandra and Chandramas has phonetic similarity with Xandrames.
>
> *('శాండ్రోకొట్టస్' జయించిన రాజ్యంలో 'సాండ్రేమ్స్' చివరి రాజు ... అయితే ఈ రెండూ ఒకేరాజు పేర్లు అనుకుంటే వివరించడం ఇంకా తేలిక. చంద్రగుప్తుడినే 'చంద్ర' అంటారు. సంస్కృతంలో 'చంద్రమస్' అన్నది 'చంద్ర'కు పర్యాయపదం. 'చంద్రమస్'కు 'శాండ్రేమ్స్'కు శబ్దపరంగా పోలిక ఉంది.)*

అనగా - గ్రీకు చరిత్రకారులు శాండ్రోకొట్టస్ పూర్వుడిగా పేర్కొన్నది ఎవరో తాను చెప్పలేక పోతున్నందు వల్ల అసలు అలాంటి శాల్తీయే లేదని, రెండూ ఒకరేనని అనుకుంటే సరిపోతుందని మాక్స్‌ముల్లర్ విచిత్ర వాదం!

సరే! ఆ ప్రకారం వెనక ఉన్న వాడిని కొట్టిపారేద్దాం. మరి మౌర్య చంద్రగుప్తుడి ఉత్తరాధికారి అయిన బిందుసారుడి మాటేమిటి? గ్రీకులు పేర్కొన్న Sandrocyptus కీ 'బిందుసారుడు' పేరుకీ పోలిక ఎక్కడుంది?

దీనికీ ముల్లర్ సార్ తడుముకోకుండా జవాబు చెప్పాడు - 'వాడూ లేడని అనుకో! 'శాండ్రోకొట్టస్'నే 'శాండ్రొసిప్టస్' అని కూడా పిలిచేవారనే అనుకుంటే ఏ గొడవా ఉండదు' అని.

తెలివి అంటే మాక్స్‌ముల్లర్‌దే! భారతీయ పురాణాలూ, ఇతిహాసాల్లో వివరంగా ఏకరువు పెట్టిన రాజుల చరిత్రలేమో ఆయన దృష్టిలో తప్పుల తడకలు. పొంతనలేని రాతలు. ఈ దేశం గురించి ఏమీ తెలియని గ్రీకులు, ఇతర విదేశీయులు రాసి పెట్టిన వాటిలో ధ్వంసమైనవి పోగా మిగిలిన అతుకులే - తలాతోకా లేకపోయినా సరే ముల్లర్ గారికి పరమ ప్రామాణికాలు! కనీసం వాటికైనా నిజంగా కట్టుబడి ఉన్నారా అంటే అదీ లేదు. ముల్లర్ మహాశయుడి వాదానికి అడ్డమొస్తే చరిత్ర కెక్కిన రాజులు కూడా నోరు మూసుకుని మాయం కావలసిందే. వెనక వాడు, ముందువాడు సరిపోలకపోయినా సరే - మధ్యవాడు ఫలానా పురాతన చంద్రగుప్తుడేనని ముల్లర్లు, జోన్సులు గదమాయించదాన్నే అచ్చమైన చారిత్రక

వాస్తవంగా మనం ఈనాటికీ శిరసావహిస్తున్నాం.

అలాగని విలియం జోన్సు, మాక్సుమ్యులర్ ప్రభృతుల వాదాలను ప్రపంచం మారుమాట్లాడక అంగీకరించిందని చెప్పడం తప్పు. మాక్సుమ్యులర్ జీవిత కాలంలోనే- చంద్రగుప్తుడి గురించి ఆయన చెప్పింది తప్పని సుప్రసిద్ధ పాశ్చాత్య విద్వాంసుడు M.Troyer కల్హణ రాజతరంగిణికి తన ఆంగ్లానువాదం పీఠికలో ఖండించాడు. తన ఆక్షేపణలను ఆయన నేరుగా మాక్సుమ్యులర్‌కే లిఖితపూర్వకంగా తెలిపాడు. వాటిలో ఏ ఒక్క దానికీ ముల్లర్ బదులిస్తే ఒట్టు. "Although other scholars and particularly M.Troyer.... have raised objections, we shall see that the evidence in favour of the identity of Chandragupta and Sandrocyptus is such as to admit of no reasonable doubt" *(ఇతర విద్వాంసులు ముఖ్యంగా ఎం.ట్రోయర్ .... అభ్యంతరాలు లేవదీసినా చంద్రగుప్తుడు, శాంద్రోసిప్టస్ ఒకరేనందనానికి సాక్ష్యాలు ఎలాంటివంటే సహేతుకమైన సందేహానికి తావే లేదు)* అని ***"History of Ancient Sanskrit Literature"***లో మాక్సుమ్యులర్ దబాయింపు!

సందేహించజాలని అంత గొప్ప సాక్ష్యాలు ఏమిటో మాత్రం ముల్లర్ మహోదయుడు చెప్పడు. మౌర్య చంద్రగుప్తుడే శాంద్రోకొట్టస్ అని మొట్టమొదట 1793 ఫిబ్రవరిలో ఊహించిన సర్ విలియం జోన్సు కూడా అందుకు ఆధారాలేమిటో మునుముందు బయటపెడతానని అన్నాడు. కాని - అవేమిటో వెల్లడించకుండానే మరునటి సంవత్సరం ఆయన కన్ను మూశాడు. 'సోమదేవుడు రాసిన అందమైన కవిత్వం'. "Coronation of Chandra" (చంద్రపట్టాభిషేకం) అనే విషాదాంత సంస్కృత నాటకం - ఇవి రెండే జోన్స్ గారు తన జీవిత కాలంలో తన వాదనకు ఊతంగా పేర్కొన్న ఆధారాలల్లా!! వాటి అసలు పేర్లు ఏమిటో, వాటిలో ఏముందో దేవునికెరుక. మనం పురాతన ఇతిహాసాలను, పురాణాలను ఎన్ని చూపించినా అవి చారిత్రక ఆధారాలు కానేకావని విదేశీ మేధావులు అడ్డంగా కొట్టిపారేస్తారు. వారు మాత్రం చాలా వందల ఏళ్ల తరవాత వెలువడ్డ కాల్పనిక కవిత్వాలను, నాటకాలను ప్రామాణిక సాక్ష్యాల కింద చూపించవచ్చు. ఎంతైనా వారు దొరలు కదా?!

పేరు పోలికను అలా ఉంచి, శాంద్రోకొట్టస్ గురించి గ్రీకు రచయితలు చేసిన వర్ణనలను గమనిస్తే చాలు- వారు మాట్లాడింది మౌర్య చంద్రగుప్తుడి గురించి కాదని మందబుద్ధులకు సైతం అర్థమవుతుంది. ఉదాహరణకు శాంద్రోకొట్టస్ ఆనాటి భారతీయ రాజులందరి కంటే గొప్పవాడని, కులీనుడని, పెద్ద సైన్యంతో ఆయన మొత్తం భారత దేశాన్ని జయించాడని గ్రీకుల ఉవాచ. అంత పరాక్రమం మౌర్యచంద్రగుప్తునికి లేదు. ఆయన తల్లి శూద్రస్త్రీ కనుక ఉన్నత కులీనుడన్న వర్ణన సరిపోదు. ఆర్య చాణక్యుడి దయవల్ల రాజు కాగలిగి, చుట్టుపక్కల విదేహ, కోసల, కాశీ రాజుల సహాయ సహకారాలతో అధికారం నిలుపుకోగలిగిన సామాన్య పాలకుడాయన. నిజానికి పరాక్రమం చూపిందీ, విశాల సామ్రాజ్యం స్థాపించిందీ గుప్త వంశపు చంద్రగుప్త, సముద్రగుప్తులు! అలాగే - బిరుదు చివర వంశనామాన్ని తగిలించుకుంటారని గ్రీకులు తెలిపింది మౌర్యులకు సరిపోదు. శూద్రులైన మౌర్య చంద్రగుప్తుడికి, బిందుసారుడికి, అశోకుడికి అటువంటి బిరుదులేవీ లేవు. ఆ ఆనవాయితీ గుప్తులది. వారిది సూర్యవంశం. దానికి గురుతుగా చంద్రగుప్తుడి బిరుదు విజయాదిత్యుడు. సముద్రగుప్తుడి బిరుదు అశోకాదిత్యుడు. ఆయన కుమారుడైన రెండో చంద్రగుప్తుడికి

విక్రమాదిత్యుడని పేరు.

ఇంతెందుకు? రాజధాని **పాలిబోత్ర** (పాటలీపుత్రం) అని చెప్పడాన్ని బట్టే గ్రీకులు వర్ణించింది మగధ రాజులైన మౌర్యులను కాదని అర్థమవుతుంది. నగరం చుట్టూ చెక్కగోడ ఉండేదని మెగస్తనీస్ రాశాడు. 1876లో పాట్నా సమీపాన చెరువు తవ్వుతూంటే భూగర్భంలో సరిగ్గా అలాంటి గోడే బయటపడింది. ఇటువంటి నగర రక్షణ ఏర్పాటు కౌటిల్యుడి 'అర్థశాస్త్రం'లో ఎక్కడా కనపడదు.

నౌకాదళం కమాండర్-ఇన్-చీఫ్ గురించి, విదేశీయుల సంరక్షణ గురించి, పారిశ్రామిక వాణిజ్య వ్యవస్థల గురించి, పాలనా విధానాల గురించి మెగస్తనీస్ గమనించిన విషయాలు అర్థశాస్త్రంలో ఎక్కడా కానరావు. (గుప్తుల స్వర్ణయుగం గురించి మనకు తెలిసిన దానికి ఇవి చక్కగా సరిపోతాయి.) మౌర్యుడు, అలగ్జాండర్ సమకాలికులైన పక్షంలో మౌర్యుడి గురువు కౌటిల్యుడు, గ్రీకు రాయబారి మెగస్తనీస్ ఒకేకాలంలో ఒకే రాజ్యంలో ఉండి ఉండాలి కదా? మరి – ఇద్దరు రాసిన దానిలోనూ ఎక్కడా పొంతన లేదేమి?

ఇది ఇవాళ మనం అంటున్న మాటలు కావు. సుప్రసిద్ధ పాశ్చాత్య పండితుడు ప్రొఫెసర్ **Beridale Keith** తన ***History of Sanskrit Literature*** గ్రంథంలో ఏనాడో ఎత్తిచూపిన వైరుధ్యాలివి. ఇక సుప్రసిద్ధ చరిత్రకారుడు విన్సెంట్ స్మిత్ ఏమన్నాడో వినండి:

> "Unfortunately no monuments have been discovered which can be referred with certainty to the Period of Chandragupta or his son and the archeologist is unable to bring the tangible evidences afforded by excavation to support the statements of Greek Observers."
>
> ***[Early History of India, p.142]***
>
> *(చంద్రగుప్తుడి, అతడి కుమారుడి కాలానికి సంబంధించివని చెప్పగల కట్టడాలేమీ దురదృష్టవశాత్తూ బయటపడలేదు. గ్రీకు పరిశీలకులు చెప్పినదాన్ని ధ్రువీకరించగల విస్పష్ట సాక్ష్యమేదీ పురావస్తు తవ్వకాల్లో కనుగొనలేదు.)*

గ్రీకులు ప్రస్తావించింది మౌర్యులను అనడానికి ఏ ఆర్కియాలజీ ఆధారమూ లేదని విన్సెంట్ స్మిత్ అన్నాడు. హిందూ, బౌద్ధ, జైన సంప్రదాయాలు, గ్రంథాధారాలు అన్నీ మౌర్య చంద్రగుప్తుడు అలగ్జాండర్ కాలం వాడన్న వాదానికి విరుద్ధంగా ఉన్నాయని మాక్స్‌ముల్లర్ ఒప్పుకున్నాడు. ఒక్క పోలిక మినహా ఒక్క రుజువునూ ఆదిగురువు విలియం జోన్స్ చూపలేకపోయాడు. ఆయన ఉటంకించిన సమాచారం తప్పని హెచ్.హెచ్.విల్సన్ అంతటి వాడే కుండబద్దలు కొట్టాడు.

అయితేనేమి? క్రీ.పూ. 327 నాటి అలగ్జాండర్ సమకాలికుడైన శాండ్రొకొట్టస్ మౌర్యచంద్రగుప్తుడని జోన్స్‌గారు సిద్ధాంతీకరించారు. అదే సత్యం, ఇక నుంచీ అదే ప్రమాణం, ప్రాచీన భారత చరిత్రకు అదే మూలాధారమని మాక్స్‌ముల్లర్ గారు తాతాచార్ల ముద్ర వేశారు. అవునవును – అదే మూలాధారం; ప్రాచీన భారత చరిత్ర యావత్తూ ఆ ఇరుసు చుట్టూ తిరగవలసిందేనని విన్సెంట్ స్మిత్‌గారు ఖంగున నిర్ధారించారు. అది మొదలుకుని గడచిన శతాబ్దానికి పైగా దేశీయ, విదేశీయ చరిత్రకారులందరూ మౌర్యుల కాలంలో

అలగ్జాండర్ దండయాత్రనే ప్రాచీన చరిత్రకు మూల స్తంభంగా పరిగణిస్తూ వచ్చారు. చంద్రగుప్త మౌర్యుడు గద్దె నెక్కింది క్రీ.పూ. 312 లోనా, 315లోనా, 321లోనా, 322లోనా, 326లోనా, లేక 327లోనా అని ఖండన మండనలు చేయడమే తప్ప - క్రీ.పూ. 16వ శతాబ్దం నాటి మౌర్యుడిని క్రీ.పూ. 4వ శతాబ్దానికి ఎలా గుంజారని ఏ ఒక్క పండితుడూ అడిగిన పాపాన పోలేదు.

తెలిసో తెలియకో, బుద్ధిపూర్వకంగానో తెల్లదొరలు తప్పుచేస్తే మన మహామేధావులు ఇంతకాలం ఏం చేస్తున్నారు?

బద్ధకంగా కాళ్లు జాపి పడుకున్నారు. అంతటి ఫారిన్ దొరలే చెప్పారు కాబట్టి బహుశా అది నిజమే అయి ఉంటుంది కామోసని వెర్రి నమ్మకంతో మిన్నకున్నారు. అది నిజం కాదని ఎవరైనా నోరు మెదిపితే చాలు గయ్యిమని లేచి రేచుకుక్కలా మీద పడి కరుస్తున్నారు.

చరిత్రకు సంబంధించినంత వరకూ దేశానికి ఇంకా స్వాతంత్ర్యం రానట్టే! మానసిక దాస్యం తొలగనట్టే.

శకాలు - శకారులు

పూర్వం ఓ రాజుగారు పలక మీద నిలువు గీత వేసి దానిని చెరపకుండా చిన్నది చేయమన్నారు. అది ఎలా సాధ్యమో మహాపండితులకే బోధపడక తెల్లమొగం వేశారు. ఓ పల్లెటూరి బడికుర్రాడు మాత్రం 'ఓస్! ఇంతేనా' అని బలపం తీసుకుని.... ఆ గీత పక్కన దానికంటే పెద్ద గీత గీసి తెలివి పరీక్షలో నెగ్గాడు. ఇది చాలామందికి తెలిసిన కథే.

ఒకవేళ రాజుగారు అక్కడితో ఆగకుండా... గీతను చెరపకుండా చిన్నది చేశావు సరే. ఇప్పుడు దాన్ని పెంచకుండా పెద్దది చేయమన్నారనుకోండి. బుద్ధిమంతుడు ఏమి చేసేవాడు? దీనికి జవాబు ఎవరైనా ఠక్కున చెప్పగలరు. 'ఏముంది? పక్క గీతను చెరిపి పొట్టి చేస్తే సరి. ఈ గీత దాని కదే పొడుగవుతుంది' – అని.

మన ప్రాచీన చరిత్ర విషయంలో ఇంగ్లీషు వారు సరిగ్గా ఆ పనే చేశారు!

ఈస్టిండియా కంపెనీ కాలంలో ఇండియా వచ్చి భారత చరిత్రను అధ్యయనం చేసిన సర్ విలియం జోన్స్ లాంటి తెల్ల దొరలకు చిక్కు సవాలు ఒకటి ఎదురైంది. వారు దుర్మార్గులు కారు. భారతదేశాన్ని ద్వేషించేవారు కాదు. అంతా సజ్జనులే. భారతీయ సంస్కృతి, సారస్వతాలంటే గౌరవం ఉన్నవారే. కాని– జన్మతః వారు క్రైస్తవులు. మానవ జాతి పుట్టుక, పరిణామాల గురించి హోలీ బైబిల్‌లో రాసి ఉన్నదే అక్షర సత్యమని ఆ కాలంలో అందరిలాగే నూటికి నూరుపాళ్లా నమ్మినవారు.

బైబిల్ బోధనుబట్టి లెక్క వేస్తే ప్రపంచ సృష్టి క్రీస్తుకు నాలుగువేల సంవత్సరాల పూర్వం జరిగి ఉండాలి. దీనిపై 17వ శతాబ్దంలో వివాదం చెలరేగగా ఆర్చి బిషప్ ఆఫ్ ఐర్లండ్ అయిన రెవరెండ్ ఉషర్ గారు కలగజేసుకుని "Creation took place at 9.00 a.m. on 23rd October 4004 B.C. and one, who will say anything else about it will be considered a heretic" *(క్రీ.పూ. 4004 అక్టోబర్ 23 ఉదయం 9.00 గంటలకు సృష్టి ప్రారంభమైంది. దీని గురించి ఇంకా ఏదైనా అనేవాడు అవిశ్వాసిగా పరిగణించబడును)*

అని 1664 సంవత్సరంలో ఘంటాకంఠంగా చాటారు. సృష్ట్యాది గురించి బైబిల్‌లో చెప్పిన వైనమే సరయిన చరిత్ర ("I look upon the account of creation given in the Genesis as simply historical") అని మహాఘనత వహించిన మాక్స్‌ముల్లర్ కూడా 1875లో Duke of Argyll కు ఉత్తరంలో రాశాడు.

ఎవరి విశ్వాసం వారిది.

బైబిల్‌లో చెప్పిన ప్రకారం సృష్టిలో మొట్టమొదటి మానవుడు ఆడమ్. ఆయన 930 ఏళ్లు బతికాడు. అంటే క్రీ.పూ. 4004 నుంచి క్రీ.పూ. 3074 వరకూ జీవించి ఉండాలి. ఆడమ్ 130వ ఏట Seth ని కన్నాడు. అతడి 105వ ఏట - అంటే తాతగారి 235వ ఏట Enosh మనవడు పుట్టాడు. ఆయన 815 ఏళ్లు జీవించి తన 90వ ఏట Enosh ని కన్నాడు. అతడు 910 ఏళ్లు బతికి ,.....

ఈ ప్రకారం సాగిన మానవ సృష్టి ప్రకారం ఆడమ్‌కు 870 ఏళ్లు వచ్చే సరికి ఏడు తరాలు గడిచాయి. అన్ని తరాల వారినీ కలిపినా అప్పటికి ప్రపంచ జనాభా పదుల సంఖ్యలోనే తప్ప వందను చేరడానికి వీలేలేదు. కదా?

హిందూ పురాణాలన్నీ ఏకగ్రీవంగా తెలిపిన దాన్ని బట్టి మహాభారత యుద్ధం క్రీ.పూ. 3138లో జరిగింది. క్రైస్తవుల నమ్మకం ప్రకారం అప్పటికి ఆడమ్‌కు 866వ పుట్టినరోజు జరిగి ఉండాలి. ఇందాక మనం చెప్పుకున్నట్టు క్రైస్తవ విశ్వాసం ప్రకారం అప్పటికి ప్రపంచ జనాభాయే నూరులోపు !

కాని.... మన పురాణాల, ఇతిహాసాల ప్రకారం భారత యుద్ధంలో మరణించిన వారి సంఖ్యే 18 అక్షౌహిణులు. అనగా 42,00,000. చనిపోయిన వారే 42 లక్షలంటే - గెలిచిన వారిని, యుద్ధంలో పాల్గొనని ప్రజలను కలుపుకుంటే అప్పటికి భారత జనాభా కోట్ల సంఖ్యలో ఉండి ఉండాలి.

ఇదెలా సాధ్యం? మొత్తం కలిపినా ప్రపంచంలో నిండా లారీడు జనం లేని కాలంలో ఒక్క ఇండియాలోనే కోట్ల జనం ఎక్కడి నుంచి పుట్టుకొచ్చారు? ఇది నిజమని ఎలా నమ్మగలం?

ఇదిగో - ఇదీ విలియం జోన్స్ లాంటి పాశ్చాత్య పండితులను వేధించిన ప్రశ్న.

వారికి అచంచల విశ్వాసం గల బైబిల్ బోధే అక్షరాలా యథార్థమనుకుంటే - ఆ విశ్వాసానికి విరుద్ధమైన విషయం నిజమవడానికి ససేమిరా ఆస్కారం లేదు. కాని - తిథులు, సంవత్సరాలు, తరాలు, వాటి అంతరాలు సహా భారతీయ పురాణాలు పూసగుచ్చినట్టు వివరిస్తున్నాయే? వాటిని ఏమి చేయడం? క్రైస్తవ చరిత్ర కంటే భారతీయ చరిత్ర చాలా పొడవుగా ఆకాశమంత ఎత్తున ఉన్నప్పుడు దాని ముందు వెలవెల పోకుండా పాశ్చాత్య చరిత్రను ప్రకాశింప జేయడం ఎలా?

సింపుల్! ఆ పొడవాటి భారత చరిత్రకు అంటకత్తెర వేసి కురచ చేసి కిందికి అణగదొక్కేస్తే సరి!!

వినడానికి ఇది వింతగా ఉండవచ్చు. ఆంగ్లేయుల మీది ద్వేషంతో గిట్టనివారు వేసిన అభాండంగా అనిపించవచ్చు. అంతటి గొప్ప పండితులు ఇంత మాయదారి పనిని బుద్ధి పూర్వకంగా చేశారంటే నమ్మశక్యమూ కాకపోవచ్చు. కాని - ఇది నిజం. అంత గొప్ప

పండితులు భారత చరిత్రను తమదైన శైలిలో ఎలా చిత్రిక పట్టారో వారి మాటల్లోనే వినండి.

కలి ప్రారంభం నుంచి భారత రాజవంశాల పాలనా వివరాలు గురించి పురాణాలు చెప్పింది ఫలానా అంటూ తనకు అర్థమైనంతలో చెప్పాక, సర్ విలియం జోన్స్ 1793 ఫిబ్రవరిలో ఇలా ధర్మ నిర్ణయం ప్రకటించాడు:

> ".... the generations of men and the reigns of Kings are extended beyond the course of nature, and beyond the average resulting from the accounts of the Brahmins themselves; for they assign to a hundred and forty two modern reigns a period of 3153 years or about 22 years to a reign...yet they represent only 4 Kanva princes on the throne of Magadha for a period of 345 years... now it is even more improbable, that 4 successive kings should have reigned 86 years each, then that Nanda should have been King a hundred years and murdered at last... that we may allow the highest probable antiquity to the Hindu government, let us grant that three generations of men were equal on an average to an hundred years, and the Indian princes have reigned one with another two and twenty, thus reckoning thirty generations from Arjun to the extinction of his race... we may arrange the corrected Hindu chronology according to the following table..."

(పురాణాల్లో ఇచ్చిన తరాల, రాజవంశ పాలనా వివరాల లెక్కలు ప్రకృతి క్రమానికి విరుద్ధంగా ఉన్నాయి. బ్రాహ్మలే చెప్పుకునే విషయాలను బట్టి తేలే సగటు కాలాలను కూడా ఇవి దాటిపోతాయి. ఎలాగంటే – 142 మంది ప్రభువులకు వారు 3153 ఏళ్లను కేటాయించారు. లేదా – సగటున ఒక్కొక్కరికి 22 ఏళ్లు... అయినా మగధ గద్దె మీద 345 ఏళ్లలో నలుగురిని మాత్రమే వారు చూపించారు.... నలుగురు రాజులు ఒకరి తరువాత ఒకరుగా తలా 86 ఏళ్లు ఏలారంటే, అలాగే నంధుడనే వాణ్ని వందేళ్లు పరిపాలించాక ఎట్టకేలకు హత్య చేశారంటే నమ్మలేము... హిందూ ప్రభుత్వానికి వీలైనంత గరిష్ఠ ప్రాచీనతను ఆపాదించడం కోసం నగుటున వందేళ్లకు మూడు తరాలు మంజూరు చేద్దాం. భారత రాజులు ఒకరి తరువాత ఒకరుగా తలా 22 ఏళ్ల పరిపాలించారని అంగీకరిద్దాం. అప్పుడు అర్జునుడి నుంచి మొదలుపెట్టి అతడి వంశం అంతరించే వరకూ 30 తరాలను పరిగణిస్తే, సరిచేయబడిన హిందూ రాజవంశ క్రమం ఇలా ఉంటుంది:)

[- Asiatic Researches Vol. IV, The Tenth Anniversary Discourse]

అసలు – పురాణాల గురించి విలియం జోన్స్‌కు తెలిసిందే తప్పు. రాజవంశాల గురించి పురాణాలు చెప్పిందేమిటో..... విలియం జోన్స్‌కు అర్థమైంది ఏమిటో రెండు పట్టికల కింద ఇంతకుపూర్వం **దొరలు మింగిన చరిత్ర** వ్యాసంలో గమనించాం. పట్టికలు పరిశీలిస్తే జోన్స్ వాదంలోని బండారం బయటపడుతుంది. నందవంశంలో నవ నందులు తొమ్మిది

మంది మొత్తంమీద నూరేళ్లు పాలించారని పురాణాలు పేర్కొన్నాయి. జోన్స్‌గారేమో మొత్తం నూరేళ్లు ఒక్క నందుడి లెక్కలోనే వేసి.... ఒక మనిషి వందేళ్లు పాలించడం ఎలా సాధ్యమంటూ ప్రశ్నించి.... తన తప్పుకు సంజాయిషీ మనల్ని ఇవ్వమంటున్నారు. అలాగే క్రీ.పూ. 918 నుంచి క్రీ.పూ. 833 వరకూ 85 ఏళ్లపాటు కాణ్వ వంశం రాజులు నలుగురు పాలించారని పురాణాలు చెప్పాయి. దొరగారేమో శుంగరాజుల కాలాన్ని కూడా కాణ్వుల పద్దులోకి లాగి, రాజుల సంఖ్యను మాత్రం అలాగే ఉంచి, క్రీ.పూ. 1253 నుంచి క్రీ.పూ. 908 వరకూ 345 ఏళ్లలో కేవలం నలుగురే రాజులు పాలించారని ఏకపక్షంగా తేల్చారు. ఆపైన నగటు లెక్కవేసి ఒక్కొక్కరికి 86 ఏళ్లు వచ్చింది, ఇది ఎలా సమంజసం అని అడ్డం తిరిగి వాదించారు. అంటే తాను చేసిన తప్పు లెక్కకు ఋషులను దోషులను చేశారు.

ఆది మానవుడు ఆడమ్ ఏకంగా 930 ఏళ్లు బతికాడని తమ మత గ్రంథం చెబితే అక్షరాలా నిజమని నిస్సంకోచంగా నమ్మగలిగిన విదేశీ పండితులకు ఒకవేళ నందరాజు నిజంగా నూరేళ్లు పాలించాడన్నా నమ్మడానికి అభ్యంతరం ఉండవలసిన పనిలేదు. పోనీ మతవిశ్వాసంలో పనిచేయని బుద్ధికుశలత భారత చరిత్ర తనిఖీలో మాత్రం అఖండంగా ప్రకాశించిందని అనుకున్నా జోన్స్ పండితుడు చరిత్రలో తనకు పొడగట్టిన గ్యాప్‌ను అర్థం చేసుకోవడానికి అదనపు సమాచారం కోసం మరికొంత ప్రయత్నించవలసింది. ఒక పురాణంలో ఒక పాఠాన్ని మాత్రం చూసి ఒక పండితుడు తనకు చెప్పిందే పూర్తి సమాచారం అనుకోకుండా మిగతా పాఠాలనూ, మిగతా పురాణాలనూ పరిశీలించి సమన్వయించుకోవలసింది.

జోన్స్‌గారు ఏమి చేశారు? భలే లెక్క వేశారు. 142 మంది రాజులు సగటున తలా 22 ఏళ్లు చొప్పున 3153 ఏళ్లు పాలించారని పురాణాల్లో బ్రాహ్మలు' చెప్పారు కదా? అదిగో ఆ 22 ఏళ్లను మాత్రం గట్టిగా పట్టుకున్నారు. 3153 ఏళ్ల ఊసేమో వదిలేశారు. తాను ఎరుగని రాజులు అసలు పుట్టనే లేదని తీర్మానించి.... తన రాజా దృష్టికి ఆనిన రాజులను మాత్రమే లెక్కలోకి తీసుకున్నారు. అలా తన కంటపడిన భాగ్యశాలురను లైన్లో నిలబెట్టి తలా 22 ఏళ్లను ముష్టిలా పంచి, అదే 'కరెక్టు చేసిన అసలు చరిత్ర' అని రాజముహరు వేశారు.

ఆంగ్లేయులు పుట్టకముందు నుంచీ, పాశ్చాత్యులు బట్టకట్టటం నేర్వకముందు నుంచీ భారతదేశానికి నిర్దుష్టమైన కాల గణన విధానం తెలుసు. క్రీ.పూ. 3102 నుంచి మొదలు పెట్టి కలి శకం... క్రీ.పూ. 3076 నుంచి మొదలెట్టి లౌకికాబ్ద శకం అవిచ్ఛిన్నంగా ఇక్కడ జనం వాడుకలో ఉన్నాయి. పురాణాల లెక్కలూ ఇంచుమించుగా అక్కడి నుంచే ఆరంభమయ్యాయి. అలాంటప్పుడు భారత చరిత్ర గణనకు కూడా అదే ఆదిబిందువుగా పరిగణించి, అక్కణ్నుంచి కిందికిందికి వెదుక్కుంటూ పోవడమే సరైన పద్ధతి. కాని - జోన్స్, ఆయనకు తోడుబోయిన ఇతర పండితులు మాత్రం క్రీ.పూ. 4వ శతాబ్దంలో అలగ్జాండర్ దండయాత్ర కాలం నుంచి ఎత్తుకుని తాము గుర్తించని రాజుల్ని మాయం చేస్తూ, వాస్తవ కాలంతో నిమిత్తం లేకుండా తాము ఏకపక్షంగా నిర్ణయించిన కోటా ప్రకారం 22 ఏళ్లు మాత్రమే తాము గుర్తించిన ప్రతి రాజు మోహానా పదవేస్తూ పైపైకి పోగా అర్జునుడు, యుధిష్ఠిరుల వంతు వచ్చేసరికి క్రీ.పూ. 2029 అయింది. నిజానికి అప్పటికి

వారు గతించి వెయ్యేళ్లు దాటింది. అయితేనేమి? మీ స్థానం ఇక్కడేనని దొరలు తేల్చారు కనుక చరిత్రలో వారి ప్రాప్తం అంతే అయింది. ఈ 'చేతిపని' వాటంతో మహాభారత యుద్ధ కాలాన్ని 1100 ఏళ్లు కిందికి గుంజడంతో సృష్టి క్రమాన్ని గురించి బైబిల్ బోధకూ, భారత చరిత్రకూ మధ్య వైరుధ్యం పోయింది.

శుభం!

సీమదొరల పనితనం దెబ్బకు ఐదువేల సంవత్సరాలకు పైగా దేశంలో అమలవుతున్న శకాలు పిట్టల్లా ఎగిరిపోయాయి!

సహస్రాబ్దాలుగా జనం వాడుకలో ఉన్న కలిశకాన్ని, కాశ్మీర్‌లో ఈనాటికీ అనుసరిస్తున్న లౌకికాబ్ద (లేక సప్తర్షి) శకాన్ని పాశ్చాత్య బృహస్పతులు పాపభీతి లేకుండా పాతిపెట్టటమే తెంపరితనం. అలా ఎలా చేశారు స్వామీ అని అడిగితే వారు 'కలి ఎవరు? సప్తర్షులు ఎక్కడి నుంచి వచ్చారు? వారు ఉన్నారనడానికి దాఖలాలేమిటి?' అని మనపైనే ఎదురుదాడికి దిగగలరు. కలి అనే వాడు ఉంటేనేమి, సప్తర్షులు గడ్డాలు పెంచుకుని ఆకాశంలో కూచుంటేనేమి లేకపోతేనేమి ... వారి పేరిట శకాలు వేల ఏళ్లుగా జనం వ్యవహారంలో ఉంటే ఆ విషయాన్నయినా చారిత్రక ప్రమాణంగా గుర్తించనక్కరలేదా అని మనం వాదించడం దండగ. గమనించాల్సిందేమిటంటే – చారిత్రక రుజువులు లేని వారికే గాక ... చరిత్ర కెక్కిన, పుట్టుపుర్వోత్తరాలు ప్రపంచమంతటికీ తెలిసిన ప్రసిద్ధ శకపురుషులను సైతం విదేశీ చరిత్రకారులు 'హుష్‌కాకీ' అన్నారు.

విశ్వవిఖ్యాత విక్రమాదిత్యుడి సంగతే తీసుకోండి. గుప్త వంశ పతనానంతరం రాజ్యమేలిన పన్వర (ప్రమర) వంశంలో సుప్రసిద్ధుడాయన. గుప్తుల బలహీనతను అలుసుగా తీసుకుని అందినకాడికి రాజ్యాన్ని ఆక్రమించిన విదేశీ మూకలను వెళ్లగొట్టి దేశమంతటా జైత్రయాత్ర సాగించాడు. ఆ చక్రవర్తి ఆస్థానంలోనే కాళిదాసు, వరాహమిహిరుడు, వరరుచి, క్షపణక, అమరసింహాది 'నవరత్నాలు' విరాజిల్లినది! సంస్కృత భాషా సాహిత్యాలను అనితరసాధ్యంగా పోషించి, నిండు నూరేళ్లు జనరంజకంగా రాజ్యమేలి క్రీ.శ. 18 లో కన్నుమూసిన చారిత్రక మహాపురుషుడాయన. దేశాన్ని ఏకచ్ఛత్రంగా ఏలగలిగిన పరాక్రమానికి గురుతుగా ఆయన పేరు మీదే క్రీ.పూ. 57లో విక్రమ శకం మొదలైంది. ఈనాటికీ దేశమంతటా (ముఖ్యంగా ఉత్తరాదిన) అది వాడుకలో ఉంది. అయితేనేమి? శత్రుసేనలపై కత్తిని ఝళిపించి అవక్ర విక్రమంతో పోరాడిన విక్రమార్కుడు కాస్తా ఇంగ్లీషు కత్తెర వాతపడి చరిత్ర చెత్తబుట్టలో ధామ్మని పడ్డాడు. చరిత్రలో, సంప్రదాయంలో, సాహిత్యంలో నిలువెత్తు నిదర్శనాలు కనిపిస్తున్నా సరే – విక్రమాదిత్యుడు అనేవాడు కల్పిత పాత్రే తప్ప ఆ పేరు గలవాడు చరిత్రలో ఎక్కడా లేడని ఆంగ్ల చరిత్ర విధాతలు అడ్డగోలుగా నిర్ధారించారు. విలియం జోన్సు కనీసం విక్రమాదిత్యుడి ఉనికినైనా గుర్తించాడు. ఆయన తరవాతి చరిత్రకారులకు ఆపాటి కనికరమూ లేకపోయింది.

విక్రమాదిత్యుడి తరువాత మళ్లీ అంతటి పరాక్రమశాలి శాలివాహనుడు. అతడు ఇంకో శకపురుషుడు. అతడికీ ఇంగ్లీషు వారి చేతిలో విక్రమాదిత్యుడికి పట్టిన గతే పట్టింది.

శాలివాహనుడు ఎవరో కాదు. విక్రమాదిత్యుడికి స్వయానా మునిమనవడు. విక్రమాదిత్యుడి మరణానంతరం రాజ్యం పద్దెనిమిది చెక్కలైంది. శకులు, తార్తార్లు, మ్లేచ్ఛులు దేశంమీద

పడి దోచుకుని స్త్రీలను ఎత్తుకుపోయి నానా బీభత్సం చేశారు. ఈ అరాజకం అరవై ఏళ్లు చెలరేగిన మీదట శాలివాహనుడు పరాక్రమంతో దుండగుల దండ్లను చీల్చి చెండాడి దేశం ఆవలికి తరిమేసి క్రీ.శ. 78లో ఉజ్జయిని సింహాసనం ఎక్కాడు. ఆ దిగ్విజయానికి గుర్తుగా అదే సంవత్సరం శాలివాహన శకం మొదలైంది. అనంతరం 60 ఏళ్ల దీర్ఘకాలం పరిపాలించి క్రీ.శ. 138లో శాలివాహనుడు పరమపదించాడు.

ఏం లాభం? ముత్తాత లాగే ఆయనకూ ఆధునిక సీమదొరలు వీసమెత్తు విలువ ఇవ్వలేదు. విక్రముడు మిథ్య అన్నట్టే శాలివాహనుడూ మిథ్య అని వారు నిస్సంకోచంగా తేల్చి పారేశారు. దాదాపు రెండువేల ఏళ్లుగా దేశవాసులు అనుసరిస్తున్న రెండు శకాల మూల పురుషులు ఈ దేశచరిత్ర గ్రంథాల్లో సూదిమోపినంత జాగాకూ నోచుకోలేకపోయారు.

సుప్రసిద్ధ శక పురుషులకే దిక్కులేకపోయినప్పుడు మిగతా రాజుల, రారాజుల గతి వేరే చెప్పాలా? క్రీ.పూ. 1534 నాటి మౌర్య చంద్రగుప్తుడిని క్రీ.పూ. 322కు తన్నేశారు. క్రీ.పూ. 327నాటి గుప్త రాజ్యాన్ని క్రీ.శ. 320కి తరిమేశారు. మౌర్యులకూ గ్రీకులకూ తాము పెట్టిన ముడికి అడ్డమొచ్చిన కారణంగా విక్రమాదిత్యుడిని గాలిలో కలిపినట్టే క్రీ.పూ. 725 నాటి మాళవ గణ శకాన్ని క్రీ.పూ. 57కు దిగలాగి అదే విక్రమశకం పొమ్మని భేషుగ్గా బుకాయించారు. క్రీ.పూ. 457 నాటి శ్రీహర్ష శకాన్నేమో క్రీ.పూ. 606కు ప్రమోట్ చేసి హర్ష శిలాదిత్య శకమని దానికి కొత్తపేరు బనాయించారు... ....

ఇలా ఇలా - తమకు అడ్డు తగిలిన వారినల్లా ఇష్టానుసారం అనేక శతాబ్దాల ఆవలికీ ఇవతలికీ విసిరేస్తూ, తమ వాదానికి అనువుకాని వారి అస్తిత్వాన్నే కొట్టిపారేస్తూ, శాండ్రోకొట్టస్ అనే ఒక్క మాటను పట్టుకుని గ్రీకు కత్తితో భారత చరిత్రను తెల్లదొరలు ఖండఖండాలుగా నరికిపోగులు పెట్టారుకదా? అనేక సహస్రాబ్దాలుగా ఈ దేశంలో ఏ ఋషికీ, ఏ మహాపురుషుడికీ కలనైనా స్ఫురించని ఇన్ని దివ్య చారిత్రక సత్యాలను వారు ఎక్కడి నుంచి సేకరించారు? ఏ ప్రామాణిక గ్రంథాలను బట్టి వీటిని అవగతం చేసుకున్నారు?

వీటికి జవాబుల కోసం కష్టమేమీ పడనవసరం లేదు. తమ చారిత్రక తీర్పులకు ప్రాతిపదిక లేమిటో మన చరిత్ర స్రష్టలే దాచుకోకుండా చెప్పారు. అవేమిటంటారా? వినండి.

విలియం జోన్సు గారి ప్రమాణమేమో (ఇంతకుముందు వ్యాసంలో చెప్పినట్టు) “సోమదేవుడు రాసిన అందమైన పద్యం” మరియు "Tragedy of Chandra" అనే విషాదాంత నాటకం. (అసలు అలాంటి పదార్థాలే ఎక్కడా లేవని హెచ్.హెచ్.విల్సన్ అంతటి సమకాలికుడే బండారం బయటపెట్టడం వేరే విషయం.)

విలియం జోన్స్‌కే కాదు మాక్స్‌ముల్లర్ మహాశయుడికీ సోమదేవుడే మూలాధారం. క్రీ.శ. 1060 నాటి సోమదేవుడు రాసిన కథాసరిత్సాగరంలోని ఒక కల్పిత కథలో మగధనేలిన నందుడి మంత్రి అయిన వరరుచి అనే వాడి పూర్వజన్మ వృత్తాంతం గురించి కాణభూతి అనే ఒంటి కంటి పిశాచం చెప్పిన కాలక్షేపం కబుర్లు మాక్స్‌ముల్లర్ చరిత్ర పరిశోధనకు ఒక ప్రధానాలంబనం!

ఇక శాండొకొట్టసే మౌర్యచంద్రగుప్తుడని బల్లగుద్ది వాదించిన కల్నల్ విల్ ఫోర్డ్ గారికేమో 'ముద్రారాక్షసం' పరమ ప్రమాణం. నిజానికి ఆ నాటకాన్ని రాసిందెవరో, అందులో ఏముందో కూడా విల్‌ఫోర్డ్ దొరగారికి తెలియదని మృచ్ఛకటికం ఆంగ్లానువాదం పీఠికలో

హెచ్.హెచ్.విల్సన్ నిష్కర్షగా బయటపెట్టాడు.

ఇలా వరసగా చెప్పుకుంటూ పోతే – పాశ్చాత్య చరిత్రకారులు ఉటంకించిన 'చారిత్రక గ్రంథాల' లిస్టులో శుక సప్తతి కథలు, లీలావతి, గాథాసప్తశతి, మృచ్ఛకటికం వగైరా వగైరా కథలు, నాటకాలు, కావలసినన్ని. ఈ కల్పిత కథలను, నాటకాలను ఆసరా చేసుకుని చరిత్ర నాటకం ఆడిన సీమదొరల బుర్రే బుర్ర!

మిగతా వాటి సంగతెలా ఉన్నా పై లిస్టులోని 'మృచ్ఛకటికం' నాటకాన్ని మాత్రం ఈ సందర్భంలో ఒకందుకు గుర్తు చేసుకోవాలి. అందులో రాజుగారి బావమరిది మహా దుష్టుడు. పేరు శకారుడు.

శకారుడు అనగా శకాలను హరించిన వాడు అని (ఇంగ్లీషు వారి బాణీలో) మనమూ కొత్త అర్థం కనిపెట్టే పక్షంలో మన చరిత్రను సృష్టించిన వారు కూడా నిస్సందేహంగా 'శకారులే'!

మతం ముందు..! ప్రవక్త వెనుక!

నాటకాల్లో, సినిమాల్లో చూసిన 'మయసభ' నీకు గుర్తుంది కదా? అక్కడ దుర్యోధనుడికి నీళ్లు లేని చోట నీళ్లు కనపడతాయి. బొమ్మలు మనుషుల్లా... మనుషులేమో బొమ్మల్లా భ్రమ గొలుపుతారు. గోడలా కనిపించేది గోడ కాదు. నిజం గోడ ఏమో కంటికి కనిపించదు...

ప్రాచీన భారత చరిత్ర కూడా విదేశీ చరిత్ర విధాతల పాలిట మయసభ లాంటిదే. తమకు తెలిసిందే లోకమనీ, తాము నమ్మిందే సత్యమనీ అహంకరించి వారు ధీమాగా వేసిన అడుగులన్నీ నీళ్ల మడుగుల్లోనే పడ్డాయి. వారి మిథ్యావాదపు మసక దృష్టికి గుప్త చంద్రగుప్తుడు మౌర్య చంద్రగుప్తుడిలా కనపడ్డాడు. చెట్టంత విక్రమార్కుడు, నిలువెత్తు శాలివాహనుడు అసలు వారి కంటికి ఆననే లేదు. అంతేకాదు. ఒక బుద్ధుడిని చూసి ఇద్దరు అనుకున్నారు. వేర్వేరు కాలాలకు చెందిన ముగ్గురు అశోకులను కలగలిపి తాము కన్ఫ్యూజ్ అయి జనాన్ని కన్ఫ్యూజ్ చేశారు. మయసభలో రారాజు తొట్రుపాటు వంటిదే మన చరిత్ర రాజుల తబ్బిబ్బు భంగపాటు కూడా.

ప్రాచీన భారత చరిత్ర రచనకు మూల పురుషుల్లో ముఖ్యుడు విలియం జోన్స్. క్రీ.పూ. 4వ శతాబ్దం శాండ్రొకొట్టస్ పేరును అంతకు 1200 ఏళ్ల పూర్వపు మౌర్యచంద్రగుప్తుడికి జయప్రదంగా అంటగట్టిన దరిమిలా ఆయన తన దివ్యదృష్టిని గౌతమబుద్ధుడి మీద ప్రసరిస్తే ఒక బుద్ధుడు ఇద్దరు బుద్ధుల్లా కనపడ్డారు. అదీ ఆయన మాటల్లోనే ఆలకించండి:

> "The Brahmins universally speak of the Buddha with all the malignity of an intolerable spirit; yet the most orthodox amongst them consider Buddha himself as an incarnation of Vishnu; this is a contradiction hard to be reconciled, unless we cut the

knot instead of untying it, by supposing that there were two Buddhas... the first of whom was born before the close of the last age (Dwaparayuga), and the second, when above a thousand years of the present age (Kaliyuga) had elapsed"

[***The works of Sir William Jones*** *Vol. IV, 1807, P.17*]

బ్రాహ్మలందరూ బుద్ధుడి మీద అసహన భావంతో దుమ్మెత్తి పోస్తుంటారు. వారిలోనే మరి సనాతనులు అదే బుద్ధుడిని విష్ణువు అవతారంగా పరిగణిస్తారు. ఈ వైరుధ్యాన్ని సరిచేయడం ఎలాగా అని దొరగారు ఆలోచిస్తేముడి విప్పటం కాదు – కోసివేయటమే మార్గమని తోచిందట. అదీ ఎలాగంటే పూర్వం ఇద్దరు బుద్ధులు ఉండేవారని ఊహించుకోవాలట... వారిలో మొదటివాడు ద్వాపర యుగం చివరిలో పుట్టాడట. రెండోవాడేమో కలియుగంలో వెయ్యేళ్లు నడిచాక జన్మించి కొత్త మతం నెలకొల్పాడట. అదే భారతదేశంలో తీవ్ర ఆగ్రహానికి కారణమైందట.

నిజానికి జోన్స్‌కు కనిపించని వైరుధ్యాన్ని అర్థం చేసుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. హిందువులు మొదటే బుద్ధుడిని దశావతారాల్లో చేర్చి, తరవాత బౌద్ధంతో దెబ్బలాడారా? లేక... మొదట బౌద్ధంతో తగువుపడి హోరాహోరీ పోరాడి ఆ మతాన్ని దాదాపుగా దేశం నుంచి తరిమేశాక అందులోని మంచిని హిందూమతంలో మిళితం చేసుకునే ప్రయత్నంలో బుద్ధుడిని విష్ణువు అవతారంగా పరిగణించారా? ఈ కోణం నుంచి పరిశీలిస్తే సత్యం స్ఫురించకపోదు. ఆ సంగతి అలా ఉంచితే పైన ఉటంకించిన వాక్యాల్లో దొరగారు ఉపదేశించింది ఏమిటంటే, 1. చిక్కుముడి కనపడితే కోసెయ్యాలే తప్ప విడదీసే పని పెట్టుకోకూడదు. 2. విషయం అర్థం కాకపోతే మనకు ఎలా బుద్ధిపుడితే అలా ఊహించుకోవాలి.

ఈ రెండు 'మూల సూత్రాలను'. భారత చరిత్ర నిర్మాణంలో జోన్స్ వారసులు చాలా చక్కగా అమల్లో పెట్టారు. తమకు అంతుబట్టని చిక్కు ముడినల్లా పరపర కోసేస్తూ... తిన్నగా ఉన్న చారిత్రక వాస్తవాలకు తీరి కూర్చుని చిక్కుముడులు వేస్తూ... భావకవుల లెవెల్లో ప్రతీదీ ఊహించేసుకుంటూ.. అభూత కల్పనలు అల్లుకుంటూ... చరిత్ర రచన అనే సీరియస్ వ్యవహారాన్ని అబద్ధాల సాలెగూడుగా జయప్రదంగా భ్రష్టుపట్టించారు.

చైనా, టిబెట్ బౌద్ధ గ్రంథాలను, అబుల్‌ఫజల్ రాతలను, కాశ్మీర్‌లో తనకుదొరికిన దబిస్తాన్ డాక్యుమెంట్‌ను, భారత పురాణాలను పరిశీలించిన మీదట గౌతమబుద్ధుడు క్రీ.పూ. 1027లో పుట్టాడని విలియం జోన్స్ ప్రకటించాడు. (నిజానికి అదీ తప్పే.) కాని – ఆయన తరవాత విదేశీ చరిత్రకారులు ఆపాటి ప్రాచీనతనయినా శాక్యమునికి మిగలనివ్వలేదు. ఏ చారిత్రక సాక్ష్యాన్నీ పట్టించుకోకుండా... వేల సంవత్సరాలుగా బుద్ధుడి కాలం ప్రచారంలో ఉన్న వాదాలన్నింటినీ కాలదన్ని... ఆ భగవానుణ్ని రెక్కపుచ్చుకుని లాక్కెళ్లి క్రీ.పూ. 5వ శతాబ్దంలో, కూలేశారు.

ఆఖరికి మాక్స్‌ముల్లర్ కూడా బుద్ధుడి విషయంలో బుద్ధిని కొంచెం బాగానే ఉపయోగించాడు. చైనీస్ బౌద్ధ గ్రంథాల ప్రకారం అశోకుడు క్రీ.పూ. 850 వాడనీ, అశోకుడి కంటే బుద్ధుడు 371 సంవత్సరాల పూర్వపు వాడు కనుక బుద్ధ నిర్వాణం 850 + 371 =క్రీ.పూ. 1221లో జరిగి ఉండాలని ఆయన (***History of ancient Sanskrit Litera-***

*ture, 1859*లో లెక్కగట్టాడు. ఆయనకు సమకాలికుడైన సుప్రసిద్ధ పండితుడు Dr. Fleet కాశ్మీర రాజతరంగిణి ప్రకారం మౌర్య అశోకుడు క్రీ.పూ. 1260 ప్రాంతాల వాడు కనక అక్కణ్నించి 371 సంవత్సరాలు కలిపి బుద్ధ నిర్వాణం క్రీ.పూ. 1631లో జరిగిందని తేల్చాడు.

విష్ణు, వాయు, మత్స్య, బ్రహ్మాండ పురాణాల్లో ఇక్ష్వాకు వంశక్రమాన్ని చెప్పిన ప్రకారం బుద్ధుడి జననం క్రీ.పూ.1887లోనూ, నిర్వాణం 80వ ఏట క్రీ.పూ. 1807లోనూ జరిగి ఉండాలి. అవే పురాణాల్లో మగధ రాజుల పాలనా క్రమం వివరాలకు కూడా ఈ లెక్క సరిపోతుంది. ఇక్ష్వాకు వంశీకుడైన బుద్ధుడికి శిశునాగ వంశీకులైన క్షేమజిత్తు, బింబిసారుడు, అజాతశత్రువులు సమకాలికులు. బుద్ధ భగవానుడిని వైశాలి నగరానికి తోడ్కొని వెళ్లటానికి అక్కడి ప్రజల తరఫున తోమరుడి బృందం రాజగృహానికి వెళ్ళిన సమయంలో బింబిసారుడు రాజు. అప్పుడు బింబిసారుడు ఏమి షరతులు పెట్టాడో, వాటికి లిచ్ఛవులు ఒప్పుకున్నాక వైశాలిలో బుద్ధుడు ఏమి మహోత్యం చూపాడో బౌద్ధ గ్రంథమైన **దివ్యావాదన** రసవత్తరంగా వివరిస్తుంది. ఆ బింబిసారుడు క్రీ.పూ. 1852 నుంచి 1814 వరకూ రాజ్యం చేశాడని పురాణాలు చెబుతున్నాయి. అలాగే బుద్ధుడికి 72వ ఏళ్ల వయసులో బింబిసారుడి కుమారుడు అజాతశత్రువు మగధ గద్దె నెక్కాడని, ఎనిమిదేళ్ల తరవాత ఆయన హయాంలోనే కుసినారలో బుద్ధ నిర్వాణం జరిగిందని ***Gotama Buddha*** గ్రంథంలో ప్రఖ్యాత పాశ్చాత్య విద్వాంసుడు Kenneth Saunders పేర్కొన్నాడు. మన పురాణాలు చెప్పిన దాన్ని బట్టి అజాతశత్రువు క్రీ.పూ. 1814 నుంచి 1787 వరకూ మగధ రాజ్యాన్ని ఏలాడు. ఇతర ఆధారాలను బట్టి సాండర్స్ చెప్పినదానికి పురాణాల తేదీలు సరిపోతాయి.

పురాణాలు చెప్పినదానికీ, బౌద్ధ వాఙ్మయంలో వర్ణించిన వాటికీ, పాశ్చాత్య పండితులు కొందరు కనుగొన్న దానికీ ఇన్ని పోలికలు ఉన్నప్పుడు ప్రాచీన భారత చరిత్రకు ప్రథమ ప్రమాణమైన పురాణాల్లో చెప్పిందే నిజమని ఒప్పుకుని గౌతమబుద్ధుడు క్రీ.పూ.1887లో జన్మించి క్రీ.పూ. 1807లో నిర్వాణం చెందాడని ప్రకటించటానికి న్యాయంగా అయితే ఎవరికీ అభ్యంతరం ఉండవలసిన-పనిలేదు.కాని – మన విదేశవాళీ చరిత్ర బ్రహ్మలు ఏమి చేశారు?

బుద్ధుడి జననం క్రీ.పూ. 1887లో జరిగి ఉండాలన్న పురాణాలది అబద్ధపు సాక్ష్యమని తీసిపారేశారు. బుద్ధుడు క్రీ.పూ. 16వ శతాబ్దం వాడన్న ఫ్లీట్ వాదాన్ని కొనగోటితో కొట్టేశారు. మాక్స్‌ముల్లర్‌కు దయ గలిగిన ప్రకారం క్రీ.పూ. 13వ శతాబ్దంలో మరణించటానికీ బుద్ధుడిని అనుమతించలేదు. విలియం జోన్స్ చాన్సిచ్చిన మేరకు క్రీ.పూ. 1027లోనూ శాక్యసింహుడిని పుట్టనివ్వలేదు.

కనీసం – పురాణాలతో, బ్రాహ్మలతో ఎలాంటి లాలూచీ లేని, ఇంగ్లీషు వారికి ఉన్నపాటి సంపర్కమైనా భారతీయులతో లేని చైనా యాత్రికుడైన ఫాహియాన్ మాటయినా ఆలకించారా?

ఫాహియాన్ ఇప్పటి వాడు కాదు. నేటికి 16 శతాబ్దాల కిందటి ప్రాచీనుడు. బౌద్ధమతాన్ని స్వీకరించాక ఆ చైనీయుడు దేశాలు తిరుగుతూ గాంధార (నేటి ఆఫ్ఘనిస్తాన్) దేశానికి పోయినప్పుడు బౌద్ధం మీ దగ్గరికి ఎప్పుడు వచ్చిందని కనపడిన బౌద్ధ గురువునల్లా అడిగాడట. బుద్ధ నిర్వాణం అయిన 300 ఏళ్ల తరవాత తమ దేశంలో మైత్రేయ బోధిసత్త్వుడి విగ్రహం

నెలకొల్పినప్పటి నుంచీ శ్రమణుల ద్వారా బౌద్ధమతం తమకు చేరువైందని వారు చెప్పారట. ఆ మైత్రేయ బోధిసత్వ విగ్రహ నిర్మాణమేమో చైనాలో చౌ వంశీకుడైన పిఇంగ్ రాజుకాలంలో జరిగిందని ఫాహియాన్ వివరణ. చైనా చరిత్ర ప్రకారం ఆ రాజు క్రీ.పూ. 750 నుంచి 719 వరకూ రాజ్యం చేశాడు. ***Record of Buddhistic Kingdoms*** పేర ఇంగ్లీషులో అనువాదం అయిన గ్రంథంలో ఫాహియాన్ ఇచ్చిన ఈ వివరాలను బట్టి బుద్ధ నిర్వాణం క్రీ.పూ. 1050 ప్రాంతాల్లో జరిగి ఉండాలి.

అబద్ధాలకోరులని స్వదేశంలోనే ముద్రపడిన గ్రీకు రచయితలు వాడిన శాంద్రొకొట్టస్ అన్న పదం బూరను పట్టుకుని గాలి నింపి తెల్లదొరలు భారత చరిత్ర బెలూన్ తయారుచేశారు కదా? అనుమానాస్పదులైన గ్రీకుల కంటే వెయ్యిరెట్లు నయమయిన చైనీయుడు ఫాహియాన్ మాటకు కూడా అంతే గౌరవం ఇవ్వాలి కదా? కాని – చిత్రంగా ప్రాచీన భారతంలో స్వయంగా తిరిగి చెప్పిన ఫాహియాన్ రాతలకు వారు పూచికపుల్ల పాటి విలువ ఇవ్వలేదు. క్రీ.పూ. 11వ శతాబ్దంలోనే నిర్వాణం చెందినట్టు ఫాహియాన్ కనుగొన్న బుద్ధుడిని ఏకాఎకి తీసుకుపోయి క్రీ.పూ. 483లో పుట్టించారు!క్రీ.పూ. 403లో చంపేశారు!!

దొరలు కదా? అన్నీ ఆలోచించే... మనకు తెలియని సాక్ష్యాధారాలేవో పరిశీలించే... సందేహాలకు తావులేదని నిర్ధారించుకునే అలా కాల నిర్ణయం చేసి ఉంటారని అనుకుందామా? ఈకాలపు చరిత్రకారులు చిలకల్లా వల్లిస్తున్న బుద్ధుడి కాలం, కర్మం అన్నిటికీ ఒరిజినల్ కర్తలు ఇ.జె. రాప్సన్, విన్సెంట్ స్మిత్ లాంటి ఇంగ్లీషు లార్డులు. వారి ప్రతిపాదనలకు ఆధారాలేమిటో, అవి నిజమన్న నమ్మకం వారికే ఎంతవరకూ ఉందో వారే చెబుతున్నారు వినండి.

"Unfortunately even after all that has been written on the subject of early Buddhist chronology we are still uncertain as to the exact date of the Buddha's birth. The date 483 B.C. adopted in this history must still be regarded as provisional" (*దురదృష్టవశాత్తూ – బౌద్ధ కాలక్రమం గురించి ఇంత రాసిన తరవాత కూడా బుద్ధుడు కచ్చితంగా ఏ తేదీన పుట్టాడు అంటే ఇంకా మనం నమ్మకంగా చెప్పలేకపోతున్నాం. ఈ చరిత్రలో పేర్కొన్న క్రీ.పూ. 483 తేదీ కూడా తాత్కాలికమైనదిగానే పరిగణించి తీరాలి.*) అని ***The Cambridge History of India*** లో E.J. Rapson ఉవాచ.

"The date of Buddha's death is uncertain, but there is good reason for believing that the event happened in or about 487 B.C. possibly four or five years later." (బుద్ధుడి తేదీ సందిగ్ధమే. అయితే క్రీ.పూ. 487లోనో, దానికి నాలుగైదేళ్ల తరవాతో ఆ ఘటన జరిగిందని నమ్మడానికి మంచి కారణం ఉంది.) అని ***The Oxford Student's History of India*** లో Vincent Smith మాట.

ఇద్దరికీ ఏదీ కచ్చితంగా తెలియదు.అయినా క్రీ.పూ. 5వ శతాబ్దంలోగానీ బుద్ధుడు పుట్టలేదని మాత్రం ఇద్దరూ అంటారు. ఏ ఆధారంతో అన్నారో వారికే తెలియదు. మంచి కారణం ఉందని ఊరించిన స్మిత్ ఇంతకీ అది ఏమిటన్నది ఎక్కడా చెప్పిన పాపాన పోలేదు.

కాని – దొరలు గుర్తించనంత మాత్రాన అసలు చరిత్ర మాసిపోదు. పాశ్చాత్యులు, వారి

మానసపుత్రులు ఒక తప్పును సమర్థించుకోవటానికి ఇంకో తప్పు చేస్తూ, తమ మెదళ్లకు తామే ముదుల మీద ముదులు వేసుకుంటూ పోయేకొద్దీ వైరుధ్యాలు పెరిగి వారు అల్లిన చరిత్ర అయోమయపు పుంతలా తయారవక మానదు. భారతదేశంలో ఉన్న ప్రాచీన రికార్డులు పురాణాలు మాత్రమే అయితే అవన్నీ నమ్మరాని బనాయింపులని బుకాయించి తమకు కావలసిన ప్రకారం తిమ్మిని బమ్మి చేసి దొరవార్లు తప్పించుకో గలిగే వారేమో! కాని - వారి దురదృష్టం కొద్దీ ఈ దేశంలో పురాణాలే గాక - వారు సైతం కాదనజాలని పక్కా చరిత్ర పుస్తకాలూ బోలెడు ఉన్నాయి.

ఉదాహరణకు **రాజతరంగిణి**. క్రీ.శ. 1148లో - అంటే ఇప్పటికి సుమారు 900 ఏళ్ల కింద కల్హణుడు రాసిన కాశ్మీర్ చరిత్ర ఇది. తనకు పూర్వపు వారు రాసిపెట్టిన చరిత్రలను పరీక్షించి తప్పొప్పులు తేల్చి, వైరుధ్యాలను సమన్వయపరచి కాశ్మీర్ రాజవంశాల వాస్తవ చరిత్రను తయారు చేయడమే తన ధ్యేయమని రాజతరంగిణి మొదట్లోనే కల్హణుడు చెప్పుకున్నాడు. "The Sanskrit book which comes nearest to the European notion of regular history is the Rajatarangini of Kalhana, a metrical chronical of Kashmir, written in the twelfth century by the son of a minister of the Raja" *(క్రమబద్ధమైన చరిత్ర గురించిన యూరోపియన్ భావనకు అత్యంత సమీపంలోకి వచ్చే సంస్కృత గ్రంథం కల్హణుడి రాజతరంగిణి. 12వ శతాబ్దంలో ఓ మంత్రి కుమారుడు పద్యకావ్యంగా రాసిన కాశ్మీర్ చరిత్ర అది.)* అని విన్సెంట్ స్మిత్ కూడా ఒప్పుకున్నాడు.

ఆ గ్రంథంలో కల్హణుడు క్రీ.పూ. 3450 నుంచీ మొదలుపెట్టి పూసగుచ్చినట్టు వివరించిన చరిత్రతో సరిచూస్తే తెల్లదొరలు ఆడిన అబద్ధాలన్నీ అడుగు ఊడి బయటపడతాయి.

బుద్ధుడి సంగతే చూద్దాం.

తదా భగవతః శాక్య సింహస్య పర నిర్వృతేః
అస్మిన్ మహీలోక ధాతౌ సార్ధం వర్షశతం హ్యగాత్

(రాజ తరంగిణి 1 - 172)

కనిష్కుడికి నూట యాభై సంవత్సరాల పూర్వం శాక్యసింహుడు నిర్వాణం చెందాడని కల్హణుడు చెప్పాడు. ***రాజతరంగిణిలో*** ఆయన వరసగా చెప్పుకుంటూపోయిన కాలక్రమం ప్రకారం కనిష్కుడు క్రీ.పూ. 1294 నుంచి 1234 వరకూ రాజ్యమేలాడు. దీన్నిబట్టి బుద్ధ భగవానుడు 1294 + 150 =క్రీ.పూ. 1444లోనే నిర్వాణం చెంది ఉండాలి.

తమ అడ్డగోలు కలగాపులగంలో భాగంగా పాశ్చాత్యులు కనిష్కుడిని క్రీ.శ. 78 కు నెట్టేశారు. అదే నిజమైతే బుద్ధ నిర్వాణం 150-78 = క్రీ.పూ. 72 లో జరిగి ఉండాలి కదా? కాని - పాశ్చాత్య పండితులు క్రీ.పూ. 403 అంటున్నారే? వారివి తప్పుడు లెక్కలని దీనిబట్టే అర్థమవడం లేదా?

పోనీ - కనిష్కుడికి పూర్వం 150 సంవత్సరాలు అని కల్హణుడిచ్చిన వివరం పొరపాటు అనుకుందామా? ***రాజతరంగిణిలో*** బుద్ధుడి, బౌద్ధుల ప్రస్తావన ఉన్నది ఆ ఒక్కచోటే కాదు. తురుష్క వంశానికి చెందిన హుష్క, జుష్క, కనిష్కులు ఇంచుమించు ఏకకాలంలో కాశ్మీర్‌ను పరిపాలించారని, వైదికాచారాలు పాటించే మునులకు మఠాలను, బౌద్ధ భిక్షువుల కోసం చైత్యాలను అనేక చోట్ల వారు నిర్మించారని **రాజతరంగిణి** ప్రథమ తరంగం 168-171

శ్లోకాల్లో ఉంది. కనిష్కుడి అనంతరం కాశ్మీర్‌ను ఏలిన క్షత్రియ రాజు అభిమన్యుడి కాలంలో నాగార్జునుడు అనే బోధిసత్వుడు కాశ్మీర్‌లో నివసించి రాజ్యమంతటా బౌద్ధమతాన్ని వ్యాప్తి చేశాడనీ కల్హణుడు రాశాడు. తెల్లదొరలు నిశ్చయం చేసినట్టు క్రీ.పూ. 483 వరకూ అసలు గౌతమబుద్ధుడే పుట్టకపోతే **రాజతరంగిణి** రికార్డు ప్రకారం క్రీ.పూ. 1234 నాటి వాడైన అభిమన్యుడి కాలంలోనే కాశ్మీర రాజ్యంలో బౌద్ధం ఎలా వ్యాపించింది? పుట్టబోయే ప్రవక్త పెట్టబోయే మతం 800 ఏళ్ల అడ్వాన్సుగా ప్రపంచంలో విస్తరిస్తుందా?

ఇలా చెబుతూ పోతే – **రాజతరంగిణి** గీటురాయి ముందు తెల్లవారి వాదంలోని డొల్లతనం పరిపరి విధాల బయటపడుతుంది. ఆయా వైరుధ్యాల తమాషాలన్నీ **కోట వెంకటాచలం**గారు యాభై ఏళ్ల కింద రాసిన ***Age of Lord Buddha, Milinda & King Amtiyoka*** గ్రంథంలో వివరంగా చదవొచ్చు.

అసలు – బుద్ధుని జీవితానికి సంబంధించి దాదాపు అందరూ అంగీకరించే ముఖ్య ఘటనలనే తీసుకుని ఆయా తిథులూ గ్రహచారాలూ క్రీ.పూ. 5వ శతాబ్దంలో దొరలు పేర్కొన్న బుద్ధుడి కాలానికి ఎంతవరకూ సరిపోతాయో చూస్తే నిజానిజాలు తేలుతాయి కదా? ఇది కొంచెం కష్టమైన పనే. అయినా – మన రాష్ట్రంలోనే అర్ధశతాబ్దం కింద రాజమండ్రి, అనంతపురం ప్రభుత్వ కళాశాలల్లో గణిత శాస్త్రాచార్యుడిగా పనిచేసిన **వి. తిరువేంకటాచార్య** ఎఫిమెరీలు ముందు వేసుకుని ఈ పని ఏనాడో చేశారు. ఎలాగంటే – **Bishop Bigandet** రాసిన **Life of Gaudama** నుంచి బుద్ధుని జీవిత విశేషాల్లో ముఖ్యమైనవి తీసుకున్నారు. ఉదాహరణకు – సిద్ధార్థుడు పుట్టింది వైశాఖ పౌర్ణమినాడు. ఆ రోజు శుక్రవారం. విశాఖ నక్షత్రం. 28 ఏళ్ల తరవాత ఆయన కపిలవస్తునగరం వదిలిపోయినది ఆషాఢ పౌర్ణమి ఆదివారం ఉత్తరాషాఢ నక్షత్రం నాడు. 35వ ఏట బోధివృక్షం కింద జ్ఞానోదయమైంది వైశాఖ పౌర్ణమి బుధవారం వేకువఝామున. ఆ తరువాత నాలుగు సంవత్సరాలకు బుద్ధుడి తండ్రి శుద్ధోదనుడు మరణించింది శ్రావణ పౌర్ణమి శనివారం సూర్యోదయ వేళ. 80వ ఏట బుద్ధ నిర్వాణం జరిగింది వైశాఖ పౌర్ణమి మంగళవారం విశాఖ నక్షత్రంలో. ఈ వివరాలన్నీ బుద్ధుడు క్రీ.పూ. 19వ శతాబ్దం వాడయినప్పుడే సరిపోతాయని క్రీ.పూ. 5వ శతాబ్దానికి ఎంత మాత్రం వర్తించవని **తిరువేంకటాచార్య** పరీక్షలో వెల్లడైంది. (వివరాలను – పైన పేర్కొన్న చోట **కోట వెంకటాచలం** గారి గ్రంథంలోని అనుబంధంలో చూడవచ్చు) బుద్ధుడి జననం క్రీ.పూ. 1886 మార్చి 31న, నిర్వాణం క్రీ.పూ. 1807 మార్చి 27న జరిగాయని ఈ పరిశీలనలో తేలింది.

బుద్ధుడి జీవిత ఘటనలను తీసుకున్నది బిషప్ బిగాండెట్ రాసిన ఇంగ్లీషు గ్రంథం నుంచి అయినా – ఆ దారిన లెక్కలు గుణిస్తూ పోతే సరిగ్గా పురాణాలు పేర్కొన్న సంవత్సరాల దగ్గరికే వెంకటాచార్య చేరుకున్నారు.

ఈ రుజువులు చాలవా? గౌతమబుద్ధుడు క్రీ.పూ. 19వ శతాబ్దం వాడనటానికి ఇంకా సందేహమా? తిరుగులేని ఆధారాలు ఇన్ని ఉన్నా... తెల్లవారి కట్టుకథకు తలాతోకా లేదనీ, అది తర్క పరీక్షకు నిలవదనీ ఇంత స్పష్టంగా తెలుస్తున్నా ఇంకా ఇంగ్లీషు చరిత్రకారుల డొల్ల మాటలనే వేదవాక్కుగా శిరసున దాల్చి క్రీ.పూ. 5వ శతాబ్దంలో గానీ బుద్ధుడు పుట్టలేదని ఇంకా నమ్ముతున్నామంటే మన తెలివితేటలను ఏమనాలి?

ఆదిశంకరా! క్షమించు!

శూన్య నగరంలో ముగ్గురు రాజకుమారులు. వారిలో ఇద్దరు పుట్టనే లేదు. మూడోవాడు అమ్మ కడుపులో కూడా లేడు. ఓ రోజు వాళ్లు సరదాగా బయలుదేరి ఆకాశంలో ఫల పుష్ప భరితాలైన మహావృక్షాల అరణ్యంలో విహరించాక మూడు నదీ తీరాలకు చేరారు. ఒక నదిలో నీరు పూర్తిగా ఇంకిపోయింది. మిగతా రెండింటిలో నీటి చుక్క కూడా లేదు. ఆ నదుల్లో దోసిళ్ల కొద్దీ నీరు తాగి ఈతలు కొట్టాక భవిష్యన్నగరంలో ప్రవేశించి ముగ్గురూ మూడు ఇళ్లు సంపాదించారు. వాటిలో ఒక దానికి గోడలు లేవు. రెండో దానికి స్తంభాలు లేవు. మూడోది అసలు నిర్మాణమే కాలేదు. ముగ్గురు రాకుమారులూ గోడల్లేని ఇంట్లో ప్రవేశించి మూడు పాత్రలు చూశారు. వాటిలో రెండు ముక్కలు చెక్కలయ్యాయి. మూడోది చూర్ణమై ఉంది. చూర్ణమైన పాత్రను తీసుకుని మూడు పడులు తక్కువగా మూడు పడుల బియ్యంతో అన్నం వండగా నోరులేని బ్రాహ్మణులువచ్చి సుష్టుగా భోంచేశారు.

యోగవాసిష్ఠంలోని బాలకోపాఖ్యానం ఇది. వేదాంతార్థంలోకి వెళ్లకుండా మన మామూలు లోకరీతిలో వింటే ఇందులో అర్థంపర్థం లేదనిపిస్తుంది. పుట్టని వాడేమిటి? ఆకాశంలోని అరణ్యంలో విహరించి నీరులేని నదిలో ఈత కొట్టటమేమిటి? గోడల్లోని ఇంట్లో ప్రవేశించి చూర్ణమైన పాత్రలో అన్నం వండి నోరులేని వాళ్లకు తినిపించడమేమిటి? నాన్సెన్స్! అని కొట్టెయ్యబుద్ధేస్తుంది. కాని – మనలో మాట! మనం చదువుకున్న భారతదేశ చరిత్ర కూడా విశ్వసనీయతలో ఈ కథకుతోడు బోయినదే!!

మనం చెప్పుకుంటున్న చరిత్రలోనూ – పుట్టనివాడు, అమ్మ కడుపులో కూడా లేనివాడు దేశ సంచారం చేయగలడు. భూమి మీదికి రాకుండానే – దూరభూమిలో మకాం చేసి మత ప్రచారం సాగించగలడు. తాను పుట్టటానికి వెయ్యేళ్లకు పూర్వమే తన పేరిట గుడి కట్టించుకుని రోజూ పూజలందుకోనూ గలడు!

ఛ ఛ అలా ఎన్నటికీ జరగదు! ఆ ప్రకారం ఎక్కడ ఉందో చూపించమంటారా?

ఆదిశంకరాచార్యుల చరిత్రను ఓసారి పరికించండి!!

మాక్స్‌ముల్లర్ లాంటి పాశ్చాత్య బృహస్పతులు ఆదిశంకరుడు క్రీ.శ. 788లో పుట్టి 820లో పరమపదించాడని నిర్ద్వంద్వంగా తేల్చారు. దాస్‌గుప్తా, రాధాకృష్ణన్ లాంటి భారతీయ విద్వాంసులూ దానిని ఒప్పుకున్నారు. అన్ని చరిత్ర గ్రంథాల్లోనూ అవే తేదీలు తిరుగులేని సత్యాలుగా చలామణి అవుతున్నాయి.

అంటే - మహాచరిత్రకారుల మాటలను బట్టి ప్రపంచమంతా నమ్ముతున్న ప్రకారం క్రీ.శ. 788కు ముందు ఆదిశంకరాచార్యులు పుట్టనే లేదు.

ఈ సంగతి గుర్తు పెట్టుకుని, ఇప్పుడు - ఇంచుమించుగా ప్రామాణిక చరిత్ర అని పాశ్చాత్యులే ఒప్పుకున్న కల్హణుడి **రాజతరంగిణి** తెరవండి.

కాశ్మీర్ రాజుల్లో 70వ వాడైన గోపాదిత్యుడు క్రీ.పూ. 417 నుంచి అరవై ఏళ్ళు రాజ్యమేలాడని, అతడే క్రీ.పూ. 366లో శంకరాచార్య దేవాలయాన్ని శ్రీనగర్‌లో కట్టించాడని **రాజతరంగిణి** చెబుతుంది. లోయకు వెయ్యి అడుగుల ఎత్తున తఖ్త్ - ఇ - సులేమాన్ కొండ మీద కట్టిన ఈ ఆలయాన్ని అనంతర కాలంలో ముస్లిం రాజు జైనుల్ అబ్దిన్ మరమ్మతు చేయించాడని కూడా కాశ్మీర్ చరిత్రను బట్టి తెలుస్తుంది. మన చరిత్రకారులు ఆదిశంకరుడిని పుట్టించిందేమో క్రీ.శ. 788లో! అంటే క్రీ.పూ. 366లో శంకరాచార్యాలయం వెలిశాక 1154 ఏళ్ల తరువాత! దీన్నిబట్టి - మనిషి తాను పుట్టటానికి వెయ్యేళ్లకు పూర్వమే తన పేర గుడి కట్టించుకోగలడని తేలింది కదా?!

ఇప్పుడు **నేపాల రాజవంశావళి**ని తిరగేయండి. సూర్యవంశరాజు వృషదేవ వర్మ పరిపాలిస్తుండగా క్రీ.పూ. 487లో దక్షిణాది నుంచి ఆదిశంకరాచార్యుడు నేపాల్ వచ్చి బౌద్ధ విశ్వాసాలను ధ్వంసం చేశాడని తెలుస్తుంది*[The Indian Antiquary Vol. XIII P. 411]*

క్రీ.పూ. 487 అంటే మన చరిత్ర పుస్తకాల ప్రకారం ఆదిశంకరుడు ఇంకో 1275 ఏళ్లకు పుడతాడనగా! పుట్టని వాడు దేశాంతరాలకు వెళ్లి జైత్రయాత్ర సాగించగలడని ఇందాక చెప్పింది నిజమేనని దీన్నిబట్టి రుజువైంది కదా?!

ఆదిశంకరుడు క్రీ.శ. 8వ శతాబ్దం వాడన్న పాశ్చాత్య చరిత్రకారుల నిర్ణయం బూటకమనడానికి ఈ రెండు చారిత్రక ఆధారాలే చాలు. క్రీ.పూ. 366లో ఆలయం వెలిసింది అంటే ఆ కాలానికి పూర్వమే శంకరుడు ఉండి ఉండాలి. క్రీ.పూ. 487లో ఆయన నేపాల్ దర్శించాడంటే అంతకు ముందే ఆయన జన్మించి ఉండాలి. **రాజతరంగిణి, నేపాల రాజవంశావళి** చెప్పింది నిజమనడానికి రుజువేమిటన్నది చచ్చు ప్రశ్న. ఆ చరిత్ర గ్రంథాల్లో శంకరుడి ప్రస్తావన యాదృచ్ఛికమే తప్ప ఆ గ్రంథాలు భావి చరిత్రకారులను శంకరుడి కాలం విషయంలో తప్పుదారి పట్టించటానికి తీరి కూర్చుని రాసినవి కావు.

అదీగాక - ప్రాచీన చరిత్ర గ్రంథాల ప్రామాణికతను శంకించే ముందు శంకరుడు క్రీ.శ. 788 నాటి వాడని తాము అంటున్న దానికి ప్రమాణమేమిటో సోకాల్డ్ చరిత్రకారులు వివరించాలిగదా?

మాక్స్‌ముల్లర్ వంటి మహాపురుషులకు బహుశా దివ్యదృష్టి ఉండవచ్చు. మానవ మాత్రులు ఎరుగని దేవ రహస్యాలూ వారికి అవగతమై ఉండవచ్చు. మనబోటి సామాన్యులకు తెలిసినంతలో మాత్రం ఆదిశంకరుడు క్రీ.శ. 820 కాలం వాడనటానికి రెండు ప్రాచీన శ్లోకాలు (Chronograms) ఆధారం. అందులో మొదటిది ఇది.

దుష్టాచార వినాశాయ ప్రాదుర్భూతే మహీతలే
సఏవ శంకరాచార్యః సాక్షాత్కైవల్య నాయకః
నిధినాగే భవహ్న్యబ్దే విభవే శంకరోదయః

ఇందులో నిధి నాగే భవహి అంటే 9883. సంస్కృత సంప్రదాయం ప్రకారం దీనిని తిరగవేసే 3889 సంవత్సరం వస్తుంది. కల్యాదిగా ఆ సంవత్సరంలో దుష్టాచారాలను నాశనం చేయటానికి సాక్షాత్తూ కైవల్య నాయకుడయిన శంకరుడు భూమిమీద అవతరించాడని ఈ శ్లోకం చెబుతుంది. కలిశకం క్రీ.పూ. 3102లో మొదలైంది. కనుక కల్యాది 3889 అంటే 3889- 3102 = క్రీ.శ. 787.

ఇంకో ప్రాచీన శ్లోకం ప్రకారం శంకరుడు పరమపదించిన సంవత్సరం **చంద్ర నేత్రాంక వహ్న్యబ్దే**. లెక్కవేస్తే ఇది క్రీ.శ. 819 - 20 అవుతుంది. ఇదిగో ఈ రెండింటిని బట్టి ఆదిశంకరుడు క్రీ.శ. 788లో పుట్టాడని పాశ్చాత్య మేధావులు తేల్చారు.

ఇది శుద్ధ తప్పు. క్రీ.శ. 788లో పుట్టటం వరకూ కరెక్టే. కాని - ఆ పుట్టిన వాడు ఆదిశంకరుడు కాదు. కంచిపీఠం ఆచార్యుల్లో 38వ వాడయిన అభినవ శంకరుడు!

పైన ఉదహరించిన **దుష్టాచార వినాశయ...** శ్లోకమే మరికాస్త దూరం వెళ్ళాక **విభవే మాధవే మాషిదశమ్యాం శంకరోదయః** (విభవ నామ సంవత్సర వైశాఖ దశమినాడు శంకరుడు పుట్టాడు) అని చెబుతుంది. నిజానికి ప్రపంచమంతటా ప్రతి ఏడూ శంకర జయంతి జరుపుకునేది దశమినాడు కాదు... వైశాఖ శుద్ధ పంచమిన. అలాగే ఆదిశంకరుడు పుట్టింది విభవ సంవత్సరంలో కాదు - నందనలో దీనిబట్టే తెలుస్తుంది- ఈ శ్లోకంలో పేర్కొన్నది ఆదిశంకరుడి జననాన్ని కాదని!

ఈ వివరాలు సరిపోయేది అభినవ శంకరుడి పుట్టుకకు. ఆ సంగతి సదాశివబ్రహ్మేంద్రుడి ***గురురత్నమాలిక***కు **ఆత్మబోధస్వామి** రాసిన సుషమ వ్యాఖ్యానంలోని ఈ కింది శ్లోకం చూస్తే అర్థమవుతుంది.

విభవే వృషమాసే శుక్లపక్ష దశమీదిన మధ్యే
శేవ ధిద్వీప దిశానలవర్షే...

విభవ నామ సంవత్సర - వైశాఖ శుద్ధ దశమినాడు కలిశకం 3889లో (అనగా క్రీ.శ. 788లో) అభినవ శంకరుడు అవతరించాడని తాత్పర్యం.

ఆదిశంకరుడు కాలడిలో పుట్టగా అభినవ శంకరుడు చిదంబరంలో జన్మించాడు. ఆయనలాగే ఈయనా దేశమంతా తిరిగాడు. ఆదిశంకరుడిలాగే ఈయనా కాశ్మీర్ వెళ్ళి కొంతకాలం సర్వజ్ఞ పీఠం అధిష్ఠించాడు. అక్కణ్నుంచి కైలాస పర్వతానికి వెళ్లి దత్తాత్రేయ గుహలో ప్రవేశించాడు. మళ్లీ ఎవరికీ కనపడలేదు.

జీవితంలో కొన్ని పోలికలు ఉన్నట్టే ఇద్దరి మధ్య చాలా తేడాలూ ఉన్నాయి. ఆదిశంకరుడు

32వ ఏట శివైక్యం చెందగా అభినవ శంకరుడు కాలం చేసింది 52వ ఏట (క్రీ.శ. 840లో). అయితే ఆయనే ఆదిశంకరుడు అని అడ్డగోలుగా నిర్ణయం చేసిన పాశ్చాత్య చరిత్రకారులు అది నిజమని జనానికి భ్రమ గొలపటం కోసం ఆదిశంకరుడి 32 ఏళ్ల ఆయుస్సునే అభినవ శంకరుడికీ అనుమతించి 788 + 32 = క్రీ.శ. 320లోనే (అంటే ఇరవై ఏళ్ల ముందే) చంపేశారు. ఇలాంటి లీలలు వారు చరిత్రలో చాలానే చేశారు కనక ఈ 'ఖూనీ'కి పెద్దగా ఆశ్చర్యపోవలసిన పనిలేదు!

మరి – ఆదిశంకరాచార్యుడు ఎప్పుడు పుట్టినట్టు?

ఇందులో గందరగోళం ఏమీ లేదు. ఆయన జన్మించింది క్రీ.పూ. 509లో. ఆ సంగతి ఆదిశంకరుడి సమకాలికుడైన చిత్సుఖాచార్యుడు రాసిన ***బృహత్ శంకర విజయం***లోని ఈ శ్లోకంలో స్పష్టంగా ఉంది:

తిష్యే ప్రయాత్య నల సేవధి బాణ నేత్రే
యే నందనే దినమణా వుదగధ్వభాజి
రాధేదితే రుడు వినిర్గత మంగలగ్నే
స్యాహూతవాన్ శివగురుః సచ శంకరేతి

ఇందులో అనల = 3; సేవధి = 9; బాణ = 5; నేత్ర = 2. కలిపితే 3952 అంకానాం వామతో గతిః అనే సంఖ్యాశాస్త్ర సంప్రదాయం ప్రకారం తిరగవేస్తే 2593. కల్యాది 2593 సంవత్సరం అంటే (3102–2593) క్రీ.పూ. 509. ఆ ఏడు – నందన నామ సంవత్సర వైశాఖ శుద్ధ పంచమి ఆదివారం నాడు ధనుర్లగ్నంలో శివగురుడికి శంకరుడు అనే కుమారుడు జన్మించాడని తాత్పర్యం.

ప్రాచీన జైన గ్రంథమైన ***జిన విజయ*** కూడా ఇదే సంగతిని ఇంకో రకంగా ధ్రువీకరిస్తుంది. కలిశకం 2608లో (అనగా క్రీ.పూ. 494) తన 15వ ఏట శంకరాచార్యుడు కుమారిలభట్టును కలిశాడని ఆ గ్రంథంలో ఉంది. క్రీ.పూ. 494లో 15వ ఏడు అంటే ఆదిశంకరుడు పుట్టింది క్రీ.పూ. 509లో అని స్పష్టం.

అలాగే అది శంకరుడి నిర్యాణ కాలాన్ని ***జిన విజయ*** ఇలా తేటతెల్లం చేసింది:

ఋషిర్బాణ స్తథా భూమి ర్మర్త్యాక్షౌ వామ మేళనాత్
ఏకత్వేన లభేతాంకం తామ్రాక్షౌ తత్ర వత్సరః

ఋషి = 7; బాణ = 5; భూమి = 1; మర్త్యాక్షా=2. వెనుక నుంచి 2157. అందులో తామ్రాక్ష (రక్తాక్షి) సంవత్సరంలో శంకరుడి నిర్యాణం అని సారాంశం. ఇక్కడ పేర్కొన్నది యుధిష్ఠిర శక సంవత్సరాన్ని. జైన, బౌద్ధ సంప్రదాయం ప్రకారం యుధిష్ఠిర శకం కల్యాది 468 సంవత్సరాలకు అంటే క్రీ.పూ. 2634తో మొదలవుతుంది. ఈ శకంలో 2157 అనగా 2634 – 2157 = క్రీ.పూ. 477లో శంకరుల నిర్యాణం అని అర్థం. అప్పటికి ఆయన వయస్సు (519 – 477)= 32 ఏళ్లు. ఇది లోకమంతా విశ్వసిస్తున్న దానికి సరిపోతుంది.

బృహత్ శంకర విజయం రాసిన వాడూ ***జిన విజయ*** రచయితా కూడబలుక్కుని ఈ తేదీలు బనాయించారని ఊహించడానికి ఆస్కారం లేదు. అద్వైతులకూ, జైనులకూ వైరమే

తప్ప స్నేహం లేదు.

ఇష్టానుసారం చరిత్రను మార్చి పారేసే మన అభినవ విశ్వామిత్రులు జైనగ్రంథాన్ని ప్రమాణంగా తీసుకోరు. బృహత్ శంకర విజయాన్నీ యథార్థమని ఒప్పుకోరు. ఆ ప్రాచీన శంకర విజయం ఇప్పుడు ఎక్కడా కనవడటం లేదు కనుక అందులో రాసి ఉన్నదని వారూ వీరూ చెప్పే మాటలకు లెక్కేమిటని వారి వాదన. అక్కడికీ **టి.ఎస్. నారాయణశాస్త్రి** అనే ఆయన కష్టపడి ఆ ప్రాచీన గ్రంథం శిథిల భాగాన్ని సంపాదించి, దాని ఆధారంగా 1916లో ***Age of Sankara*** అనే గ్రంథాన్ని రాశాడు. అయినా మన చరిత్రబ్రహ్మలకు నమ్మకం కుదరలేదు. అది శిథిల గ్రంథం అని ఆయనే అంటున్నాడు కదా – అదే ఒరిజినల్ పుస్తకం అని ఎలా చెప్పగలం అని వారి సవాలు. క్రీ.పూ. 5వ శతాబ్దంలో రాసిన గ్రంథం తాలూకు ప్రతి శిథిలమైనది కాక – నిన్ననే ప్రెస్సు నుంచి బైండింగ్ అయి వచ్చినట్లు తళతళలాడుతుందా? పోనీ – ఎక్కడా చిరగకుండా, పాడవకుండా నవనవలాడే ప్రతిని చూపిస్తే మాత్రం ఈ నిత్యశంకితులు ఒప్పుకుంటారా? అంత ప్రాచీన గ్రంథం ఇలా చెక్కు చెదరకుండా ఉందంటేనే అది అసలు కాదు ఫోర్జరీ అని వీరే నాలుక తిప్పి వాదించరా?

పోనీ – అతి ప్రాచీన *శంకర విజయం* తప్పనేవారు శంకరుడి కాలానికి ప్రమాణంగా మరేదైనా గ్రంథాన్ని చూపించ గలుగుతున్నారా? శంకర విజయాల పేరిట వివిధ కాలాల్లో పది గ్రంథాలు పుట్టినా, అన్నిటికంటే ఎక్కువగా ఈ కాలంలో ప్రచారంలో ఉన్నది **మాధవ-విద్యారణ్యులు** రాసిన *శంకర దిగ్విజయం*. పూర్వం **పంచదశి** ని రాసిన విద్యారణ్య స్వామే దాన్ని రచించాడని అంటారు. నిజానికి దీన్ని రాసింది 20వ శతాబ్దం మొదట్లోననీ, కుంభకోణం – శృంగేరి మఠాల మధ్య ఆధిక్య వివాదం చెలరేగిన సమయంలో శృంగేరి మఠానికి ఉపయోగం ఉండే విధంగా మాధవ విద్యారణ్యుడి పేరుతో **తానే** ఈ గ్రంథాన్ని పుట్టించినట్లు భట్టశ్రీ నారాయణశాస్త్రి అనే ఆయన చెప్పుకున్నాడని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 1922లో **ఆంధ్రపత్రిక**లో రాశారు.

కర్తృత్వం ఎవరిదన్న సంగతి పక్కనపెట్టినా మాధవీయ *శంకర విజయం*లో శంకరుడు ఎన్నడు జన్మించాడన్న సంగతి లేనే లేదు. రవి, కుజుడు, శని ఉచ్చలో ఉండి లగ్నానికి బృహస్పతి శుభదృష్టి ఉన్న సమయంలో ఆర్యాంబ ప్రసవించిందని మాత్రమే అందులో ఉంది. ప్రాచీన సంప్రదాయం ప్రకారం పుట్టిన సంవత్సరాన్ని అంకెల కోడ్‌లో ఏ శకంలోనూ పేర్కొనలేదు. చాంద్రమాన సంవత్సరం, తిథి వివరాలు ఈ గ్రంథంలో ఎక్కడా ఇవ్వనే లేదు. కాబట్టి శంకరుడి కాలనిర్ణయానికి ఈ అభినవ శంకర విజయం ఎందుకూ అక్కరకు రాదని స్పష్టం.

క్రీ.పూ. 509లో శంకరుడు పుట్టాడనటానికి ఆధారం కాలగర్భంలో కలిసిన ***బృహత్ శంకర విజయం*** ఒక్కటే కాదు. ఆదిశంకరుడు తన జీవిత కాలంలో దేశం నలుమూలలా సంస్థాపించిన శంకర పీఠాల్లో (ఒక్క శృంగేరి మినహా) అన్నిటి రికార్డులూ ఇదే సంగతి చెబుతున్నాయి. పీఠం స్థాపించింది మొదలుకుని ఏ ఆచార్యుడు ఎన్నడు ఆధిపత్యం స్వీకరించారు, ఎన్నడు కాలం చేశారు అన్నది ఈ పీఠాల్లో ఎప్పటికప్పుడు రికార్డు అవుతూ వచ్చింది.

కంచికామకోటి పీఠం రికార్డు ఇలా మొదలవుతుంది.

*పీఠం స్థాపించింది క్రీ.పూ. **482లో***

నెం.	ఆచార్యుడి పేరు	ఆధిపత్య కాలం	గతించిన సంవత్సరం
1.	శ్రీశంకరాచార్య	6	క్రీ.పూ. 476
2.	సురేశ్వరాచార్య	70	క్రీ.పూ. 406
3.	సర్వజ్ఞాత్మ	42	క్రీ.పూ. 364
4.	సత్యబోధ	96	క్రీ.పూ. 268
	....	....	....

ఈ వరసలో ఇప్పటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి 69 వ ఆచార్యులు.

ఈ వివరాలను శృంగేరి పీఠం వారు అంగీకరించరు. ఎందుకంటే అసలు కంచిపీఠం ఆదిశంకరుడు స్థాపించిందే కాదని వారి దృఢ విశ్వాసం. ఇందులోని నిజా నిజాలు ఇక్కడ అప్రస్తుతం. అసలు పీఠం పుట్టుక గురించే వివాదం ఉంది కనుక కంచిని వదిలేద్దాం. ద్వారక పీఠం మాటేమిటి? అదయితే గ్యారంటీగా ఆదిశంకరులు స్థాపించిందే కదా? కాదని ఎవరూ ఇంతవరకూ అనలేదు కదా? మరి ద్వారక పీఠం రికార్డులు ఏమి చెబుతున్నాయి?

*పీఠం స్థాపన : క్రీ.పూ. **490***

నెం.	ఆచార్యుడి పేరు	ఆధిపత్య కాలం	గతించిన సంవత్సరం
1.	బ్రహ్మస్వరూపాచార్య	42	క్రీ.పూ. 447
2.	చిత్సుఖాచార్య	24	క్రీ.పూ. 423
3.	సర్వజ్ఞాచార్య	59	క్రీ.పూ. 364
4.	బ్రహ్మానందతీర్థ	49	క్రీ.పూ. 315
	....	....	....

ఆదిశంకరుడు క్రీ.శ. 8వ శతాబ్దం వాడని శంకర పీఠాల్లో నమ్ముతున్నదల్లా శృంగేరి వారే. వారి అభిప్రాయమే నిజమైతే అదే ఆదిశంకరుడు స్థాపించిన ద్వారక పీఠం క్రీ.పూ. 490లోనే ఎలా వెలసింది? నాటి నుంచి అవిచ్ఛిన్నంగా సాగుతున్న అక్కడి ఆచార్యుల కాలక్రమమూ అక్కడి పీఠాధిపతులు దుర్బుద్ధితో బనాయించినదే అనుకోవాలా?

పోనీ – ఇతర పీఠాల రికార్డులు నమ్మశక్యం కానివనే ఒప్పుకుందాం. యథార్థమేమిటో నిర్ద్వంద్వంగా వెల్లడించటానికి కనీసం శృంగేరి పీఠంలోనైనా స్పష్టమైన రికార్డు ఉందా?

1963 ఫిబ్రవరిలో శృంగేరి పీఠానికి చెందిన వారు వెలువరించిన '*స్మృతి కుసుమాంజలి*' సూవెనీర్ చివరిలో ఇచ్చిన శృంగేరి జగద్గురు పరంపర ఇలా సాగుతుంది.

నెం.	ఆచార్యుడి పేరు	సన్యాసం క్రీ.శ.	ముక్తి క్రీ.శ.	పీఠాధిపత్యకాలం
1.	శ్రీ శంకర భగవత్పాదులు		.....	
2.	శ్రీ సురేశ్వరాచార్య	.....	773	
3.	శ్రీ నిత్యబోధగణాచార్య	757	848	75
4.	శ్రీ జ్ఞాన గణాచార్య	846	910	62

దీన్ని బట్టి శ్రీ శంకర భగవత్పాదుల కాలానికి సంబంధించి శృంగేరి పీఠంలో స్పష్టమైన రికార్డు ఏదీ లేదనుకోవాలి. ఆదిశంకరుడి ఉత్తరాధికారి సురేశ్వరుడు క్రీ.శ. 773లో పరమపదించారన్నది మాత్రమే వారి దగ్గర ఉన్న తొట్టతొలి రికార్డు అని భావించాలి. ఈ పీఠంలో రికార్డులు ఆది నుంచీ ఇదమిత్థంగా లేనప్పుడు ... మిగతా శంకర పీఠాల్లో ఆరంభం నుంచీ ఉన్న రికార్డుల ప్రకారం ఆదిశంకరులు క్రీ.పూ. 5వ శతాబ్దం వారని స్పష్టంగా తెలుస్తున్నప్పుడు .. జైన గ్రంథాల వివరాలకూ, కాశ్మీర్, నేపాల్ చరిత్రల ఆధారాలకూ ఇది సరిపోతున్నప్పుడు – ఆ చారిత్రక సత్యాన్ని అంగీకరించటానికి ఎవరికైనా అభ్యంతరం ఎందుకుండాలి?

న్యాయంగా అయితే ఉండనక్కర్లేదు. కాని – మత విశ్వాసం పెద్దగా లేని ఆధునిక మేధావులకేమో పాశ్చాత్య చరిత్రకారులు చెప్పిందే శిలాక్షరమని గుడ్డినమ్మకం. శంకర సంప్రదాయంలో విశ్వాసం కలిగిన మిగతా మహాజనులకేమో, ఏమంటే ఏ పీఠం వారికి కోపం వస్తుందోనని భయం. ఆదిశంకరులు క్రీ.పూ. 5వ శతాబ్దంలో కంచిపీఠం స్థాపించి అక్కడే శివైక్యం చెందారంటే శృంగేరికి ఆగ్రహం. ఆ భగవత్పాదులు క్రీ.శ. 8వ శతాబ్దంలో దక్షిణామ్నాయ శృంగేరి పీఠం పెట్టారంటే కంచికి కోపం. కాబట్టి... మనకెందుకు వచ్చింది లెమ్మని ఎవరికి వారు వివాదంలోకి పోకుండా లౌక్యంగా నెట్టుకొస్తున్నారు.

ఫలితం? ఆదిశంకరాచార్యుడు ఆవిర్భవించిన అనేక శతాబ్దాల తరవాత, ఆయన పేరిట దేశం నలుదిశలా శంకర పీఠాల్లో ఆచార్య పరంపర నిరంతరాయంగా సాగుతున్నా మనకు ఆదిశంకరుడు ఏ కాలం వాడో తెలియదు! ఆయన ఏఏ పీఠాలు స్థాపించాడంటే నోరు పెగలదు! ఎక్కడ సిద్ధి పొందారంటేనూ దిక్కులు చూడకుండా స్పష్టమైన జవాబు చెప్పలేము. ఆధ్యాత్మిక రంగంలో ఈ దేశం గర్వించదగ్గ మేరువంతటి బుద్ధ భగవానుడిలాగే కైలాస శిఖరస్థాయి గల భగవాన్ శంకరుణ్ని పన్నెండు వందల ఏళ్ల కిందికి దిగలాగి మన అల్పత్వానికీ, మన అజ్ఞానానికీ మనమే మురిసిపోతున్నాం.

ఆదిశంకరా ! క్షమించు!!

ఆంధ్రులకు అన్యాయం

విశ్వామిత్ర మహర్షికి నూరుగురు కుమారులు. అరణ్యంలో సరస్వతి నది ఒడ్డున ఉన్న ఆశ్రమ వాటికలో అందరూ కలిసే ఉండేవారు. ఒకనాడు ఆ మహర్షి బ్రహ్మ వర్చస్సుతో వెలిగిపోతున్న ఒక యువకుడిని వెంట తీసుకువచ్చి 'ఇతడు శునశ్శేపుడు. వేదాలు చదివాడు. ఎన్నో యజ్ఞాలు చేశాడు. ప్రతిభా వ్యుత్పన్నతల్లో మీ అందరినీ మించిన వాడు. ఇతణ్ని నా జ్యేష్ఠ కుమారుడిగా దత్తు చేసుకుని 'దేవరాతుడ'ని పేరు పెట్టాను. ఇక నుంచీ మీరందరూ శునశ్శేపుని లేక దేవరాతుని సోదరులుగా లోకానికి తెలియగలరు. జ్యేష్ఠ సోదరునిగా భావించి ఇతడి ఆజ్ఞలను మీరందరూ శిరసావహించాలి' అని కొడుకులకు చెప్పాడు.

ఈ ఊహించని పరిణామానికి కుమారులు సహజంగానే ఆశ్చర్యపోయారు. వారిలో పెద్దవాడైన అష్టకుడికీ, మిగతా జ్యేష్ఠులకూ తండ్రి వరస బొత్తిగా నచ్చలేదు. ఉన్న వందమంది చాలరన్నట్టు కొత్తగా ఇంకొకణ్ణి తీసుకు రావటమేమిటి, తెచ్చిన వాణ్ని ఓ మూల ఉంచకుండా మా నెత్తిన కూచోబెట్టి మా మీద పెత్తనం అప్పగించడమేమిటి? ఇప్పుడొచ్చిన వాడిని పెద్ద కుమారుడు అంటే మా సీనియారిటీ అంతా ఏమిగాను – అని తలచి, బాహాటంగానే యాభై మందీ తండ్రికి ఎదురు తిరిగారు. చిన్నవారయిన మిగతా సగం మంది తండ్రి మాటను మన్నించి శునశ్శేపుడిని పెద్దన్నగా అంగీకరించారు.

అసలే విశ్వామిత్రుడు కదా? సొంత కుమారులే తనను ధిక్కరిస్తే ఊరుకుంటాడా? మాట వినని మొదటి యాభై మందినీ పిలిచి 'ఒరేయ్! తండ్రి ఆజ్ఞ పాలించని నేరానికి మీరు, మీ సంతానం, వారి వారసులుఅందరూ కులభ్రష్టులై సమాజం నుంచి వెలివేయబడి చండాలాది నీచజాతుల్లో కలిసిపోవుదురుగాక' అని శాపం పెట్టాడు.

అదిగో – ఆ శాపం వల్లే యాభై మంది సోదరులూ కులబహిష్కృతులై అంధ్ర, పుంద్ర,

శబర, పుళింది మూతిబుల వంటి నీచ జాతుల్లో కలిసిపోయారు అని ***'ఐతరేయ బ్రాహ్మణం'*** చెబుతుంది.*

విశ్వామిత్రుడు శాపాలివ్వడంలోనే కాదు; సృష్టికి ప్రతిసృష్టి చేయడంలోనూ స్పెషలిస్టు. ఈ రెండు విద్యల్లోనూ విశ్వామిత్రుడినే తలదన్నిన వారు మహానుభావులైన మన చరిత్రకారులు! విశ్వామిత్రుడు తన మాట వినలేదన్న కోపంతో యాభైమంది సుపుత్రులను మాత్రం కులం నుంచి వెలివేస్తే... మన చరిత్ర బ్రహ్మలు ఏ కారణమూ లేకుండా ఉత్తపుణ్యానికి మొత్తం ఆంధ్రజాతిని తీసుకుపోయి సమాజ బహిష్కృతులైన మ్లేచ్ఛ జాతుల పద్దులో చేర్చారు! ఈ మహోపకారం కోసం ఏకంగా విశ్వామిత్రుడి కథనే తారుమారు చేసి కొత్త కథను పుట్టించారు!!

సమాజం నుంచి వెలివేయబడ్డ నీచ వర్గాల్లో విశ్వామిత్ర పుత్రులు కలిశారనడానికి ఉదాహరణంగా 'అంధ్ర' వర్గాన్ని ఖతరేయ బ్రాహ్మణం పేర్కొనగా ఆ పదం 'ఆంధ్ర'కు దగ్గరగా ఉన్నది కనుక ఆంధ్రజాతిని తీసుకుపోయి ఆ కులభ్రష్టుల సమూహంలో కలిపి - అదిగో అలా పుట్టుకొచ్చిన వారే ఆంధ్రులు సుమా అని దబాయించి చిత్రవిచిత్రమైన అభూత కల్పన సాగించారు మన చరిత్ర విధాతలు! కమ్యూనిస్టులు అయినవారు, కానివారు అన్న తేడా లేకుండా ఈ నూరేళ్లలో విదేశీయుల 'బుద్ధి శుద్ధి'కి లోనైన మేధావులను, మహాపండితులను ఎవర్ని కదిపి ఆంధ్రజాతి పుట్టుక గురించి అడిగినా సీరియస్‌గా చిన్ముద్రవేసి ఐతరేయ బ్రాహ్మణంతోనే మొదలెడతారు. అలా విశ్వామిత్రుడు వెళ్ళగొట్టిన కుమారులే ఆంధ్రులనీ, వారే క్రమేణా దక్షిణాపథాన్ని ఆక్రమించి ఉజ్వలమైన సంస్కృతిని స్థాపించారనీ నమ్మకంగా చెబుతారు. పైగా - ప్రిన్సిపుల్ కోసం తండ్రినే ఎదిరించిన వారు.... పర్యవసానం ఏమయినా సరే తమ సీనియారిటీని, అగ్రస్థానాన్ని వదులుకోదలచని వారు - అయిన మహాత్ములే మన పూర్వీకులని నొక్కిచెప్పి మన కంట ఆనందబాష్పాలు కూడా రాల్పింపజేస్తారు.

కాని - కులభ్రష్టులై, వైదిక సంస్కారాలకు దూరమై, సమాజం నుంచి వెలివేయబడి, దారి దోపిడీలు, దొంగతనాలు చేస్తూ క్రూరంగా, హేయంగా బతికిన అనాగరిక 'దస్యు'ల మందలలో నుంచి మన పూర్వులు పుట్టుకొచ్చారనడం జాతి గౌరవానికి అవమానమేమోనన్న అనుమానం వారికి గాని, వారి కబుర్లను ఇంతకాలం వింటూ వచ్చిన మహాజనులకు గానీ రానే లేదు! అసలు తాము వింటున్నది నిజం కాదేమో, ఈ వాదన తప్పేమో, తర్కానికి నిలవదేమోనన్న శంక లేశమైనా లేకుండా ఆ బ్రాహ్మణంలోని ఒక్క 'ఆంధ్ర' పదాన్ని దొరకబుచ్చుకుని వింత వింత ఊహలు చేశారు. కొత్త కొత్త సిద్ధాంతాలను గాలిలోంచి పేనారు.

ఒక జన సమూహాన్ని దాని స్థాపకుడి పేరు మీదో, పూర్వీకుడి పేరునో పిలవటం ప్రాచీన భారతీయ సంప్రదాయం కనుక మన జాతికి ఆద్యులనుకుంటున్న విశ్వామిత్ర కుమారుల్లో పెద్దవాడి పేరూ 'ఆంధ్ర' అయి ఉండొచ్చని కొందరి ఊహాగానం. పెద్దవాడి పేరు అష్టకుడు అని- తాము ఉటంకించే ప్రాచీన సాహిత్యంలోనే ఉన్న సంగతి వారికి

---

* తస్య హ విశ్వామిత్ర స్యైకశతం పుత్రా అసుః పంచాశత్ ఏక జ్యాయాంసో మధుచ్ఛందసః పంచాశత్ కనీయాంసః తద్యే జ్యాయాంసో న తే కులం మేనిరే తాన్ అనువ్యాజహార తాన్ వః ప్రజా భక్షిష్టేతి త ఏతేఽంధ్రాః పుంద్రాః శబరాః పుళిందా మూతిబా ఇత్యుదంత్యా బహవో భవంతి వైశ్వామిత్రా దస్యూనాం భూయిష్ఠాః!

.పట్టదు!

వెలికి గురయిన విశ్వామిత్ర సంతానమే క్రమేణా దక్షిణానికి విస్తరించి కృష్ణ, గోదావరి నదుల మధ్య ఆంధ్ర సంస్కృతిని స్థాపించారని మరికొందరు పండితుల వాదన. ఇదే నిజమైతే పెద్ద చిక్కు వస్తుంది. దక్షిణాపథంలో కృష్ణ, గోదావరి మధ్య విస్తరించిన ఆంధ్రులు ఆర్య సంస్కృతిలో భాగమైనవారు. చాతుర్వర్ణ్య వ్యవస్థను అనుసరించిన వారు. వేద విద్యల మీద అధికారం ఉన్నవారు. కదా? మన పూర్వీకులను కుల వ్యవస్థ నుంచి, ఆర్య సమాజం నుంచి బహిష్కరించి ఉంటే మళ్లీ మనం అదే వ్యవస్థలోకి, అదే ఆర్య సమాజంలోకి ఎప్పుడు ఎలా ప్రవేశించాం? కుల బహిష్కారాలనేవి ఈ కాలపు రాజకీయ పార్టీలు ఎన్నికల వేడిలో తిరుగుబాటు దారుల మీద ప్రయోగించే బహిష్కరణ అస్త్రాల వంటివి కావు కదా... వాతావరణం చల్లబడగానే మెల్లగా వెనక్కి తీసుకునేందుకు?! ఇటీవలి శతాబ్దాల్లో సమాజం మీద కులవ్యవస్థ పట్టు కొంచెం సడలింది గానీ పూర్వకాలంలో వెలి నిబంధనలు మహాకరకు. కులభ్రష్టులని ప్రకటించి ఒకసారి గెంటివేశాక మళ్ళీ ఎవరిని గానీ, వారి తరవాతి తరాల వారిని గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ వైదిక సమాజంలోకి తిరిగి తీసుకునే ప్రశ్నే లేదు. నిషేధించబడిన కులాంతర సంపర్కాలకు పాల్పడినందువల్లో, మరేదైనా అపరాధం చేతో ఆర్య సమాజం నుంచి బహిష్కరించబడిన వారు ఆ సమాజం వెలుపలే ఉంటూ వేద శాస్త్రాలకు, సంస్కారాలకు దూరమై 'దస్యు'ల పేరిట కునారిల్లవలసినదే తప్ప సాంప్రదాయిక ధర్మంలోకి వారిని ఏ కులం వారయినా, ఎంత ఉత్తములైనా సరే ఏనాటికీ అనుమతించరు. ఇది న్యాయమా, అన్యాయమా అన్న చర్చ ఇక్కడ అప్రస్తుతం. సామాజిక కట్టుబాటు ఇంత కరుకుగా ఉన్నప్పుడు మన పూర్వులు సంఘ బహిష్కృతులయి ఉంటే అదే ఆర్ష సంప్రదాయంలో శతాబ్దాలుగా, సహస్రాబ్దాలుగా మనం భాగం అయి ఉండగలిగేవారం కాదన్నదే ఇక్కడ పాయింటు.

ఇంకో సంగతి. శాపగ్రస్తులైన వారు పోగా మిగిలిన యాభైమంది కుమారులు తండ్రి మాటను ఔదలదాల్చి శునశ్శేపుడి జ్యేష్ఠ భ్రాతృత్వాన్ని ఆనందంగా అంగీకరిస్తున్నామన్నారు. వారిలో పెద్దవాడు మధుచ్ఛందుడు. ఈ చిన్న కుమారుల అణకువకు సంతోషించి గోసంపదతో సకల ఐశ్వర్యాలతో తరతరాలు వర్ధిల్లమని విశ్వామిత్రుడు ఆశీర్వదించాడు. 'దేవరాతుడు' అన్న కొత్త పేరుతో శునశ్శేపుడిని జ్యేష్ఠ పుత్రుడిగా ఆయన స్వీకరించిన దరిమిలా కౌశిక గోత్రంలో వైశ్వామిత్ర, దేవరాత, దేవళులు త్రయార్షేయంగా కొత్త ప్రవర బయలుదేరింది. దేవరాతుడిని ఋషిగా చెప్పుకునే కౌశిక గోత్రీకులు ఆంధ్రదేశంలో ఈనాటికీ ఎందరో ఉన్నారు. తమ గోత్రాన్ని, ప్రవరను మరచిపోయి, కులభ్రష్టులైన 'పెద్ద 50 మంది' సోదరుల సెట్టు నుంచి మనం పుట్టుకొచ్చి ఉంటే మన పూర్వులకు శత్రు పక్షం వారయిన 'చిన్న 50 మంది ' గోత్రాలు మనలో ఎలా వచ్చి చేరాయి? వారూ వీరూ కలిసి పోయిన దాఖలాలు చరిత్రలో ఎక్కడైనా ఎవరికైనా కనిపించాయా?

పూర్వ సంస్కారాలను కోల్పోయి దస్యుల్లో కలిసి అనాగరికంగా, క్రూరంగా దారిదోపిడీలతో బతికారని ప్రాచీన సారస్వతంలో చెప్పబడిన వారు సామూహికంగా దక్షిణాదికి వెళ్ళి అక్కడే స్థిరపడ్డారనీ, వారే ఆంధ్రులనీ విదేశీ చరిత్రకారులకు ఊహ కలగడంలో ఆశ్చర్యం లేదు. అలా అనాగరికులు, దొంగల ముఠాలు బయటి ప్రాంతాలకు గుంపులుగా వలసపోయి స్థిరపడటం వారి దేశాల్లో మామూలే. ఎందుకంటే నిన్న మొన్నటిదాకా ఆ దేశాల్లో విశాల

ప్రాంతాలు నిర్మానుష్యంగా ఉండగా జనావాసాలు అక్కడక్కడ విసిరేసినట్టు ఉండేవి. బందిపోట్లు, అనాగరిక ఆటవిక మూకలు కూడా కండబలంతో ఆధిపత్యం సంపాదించి, కోటలు కట్టుకుని ఓ చోట స్థిరపడ్డాక సమాజంలో గౌరవస్థానం పొంది కులీనులుగా 'సర్' 'లార్డ్' 'డ్యూక్' లాంటి గౌరవ నామాలతో చలామణీ కాగలగటం ఇంగ్లండు లాంటి దేశాల్లో పూర్వం పరిపాటి. తమ దేశంలో అది రివాజు కనక ఇండియాలోనూ అలాగే జరిగి ఉంటుందని తెల్లదొరలకు తోచింది! ఒకప్పుడు ఆర్యులు కూడా తమలాగే బయటి నుంచి వచ్చి ఇండియాను ఆక్రమించారని, వారు దేశ దిమ్మరులని, అనాగరికులని, స్థానిక (ద్రవిడ) నాగరికతను నాశనం చేశాక వేద సంస్కృతిని స్థాపించారని వారు అన్నారు. మనం నమ్మాం. అలాగే కులభ్రష్టులై సమాజం నుంచి వెలివేయబడ్డవారు దక్షిణ దేశానికి వలసపోయి ఆంధ్ర జాతిని స్థాపించారని వారు ఊహించారు. మనం మారుమాట్లాడక ఒప్పేసుకున్నాం. దొరల పెత్తనం పోయి అర్ధశతాబ్దం గడిచాక కూడా దొరలు నేర్పిన పాఠాన్నే నెమరు వేసుకుంటూ మన పూర్వులు భ్రష్టులని ఇల్లెక్కి చాటుతున్నాం.

పూర్వకాలంలో ఆర్య సమాజానికి వెలుపల ఉన్న 'దస్య' వర్గాల్లో 46 తెగలు ఉండగా ఉదాహరణ కోసం 'ఆంధ్ర' సహా ఐదు పేర్లను ఐతరేయ బ్రాహ్మణం పేర్కొన్నదే తప్ప ఆ 'ఆంధ్ర'కూ "అంధ్ర' జాతికీ బాదరాయణ సంబంధం కూడా లేదు. పూర్వం పాశ్చాత్య దేశాల్లో వలె కాకుండా ఇండియాలో ఐతరేయ బ్రాహ్మణ కాలానికే వైదిక నాగరికత దేశమంతటా విస్తరించి వాసయోగ్యమైన ప్రాంతాలన్నీ జన సంచారంతో నిండి ఉండేవి. (కురుక్షేత్ర సంగ్రామంలో ఆంధ్రులు కౌరవుల పక్షాన ఉన్నారని మహాభారతం చెబుతుంది.) కృష్ణా, గోదావరి నదుల మధ్యదేశంలో కూడా ఆర్య సమాజంలో భాగమైన ఆంధ్రులు చాతుర్వర్ణ్య వ్యవస్థతో అప్పటికే స్థిరపడి ఉన్నారు. విశ్వామిత్రుడు శపించి వెలివేసిన యాభై మంది కుమారులు సామూహికంగా వచ్చి ఇక్కడే పుత్ర పౌత్రాభివృద్ధిగా సెటిలై పోదామనుకున్నా కుదిరే పనికాదు. ఋషి పెట్టిన శాపం భరత ఖండంలో ఎక్కడున్నా వర్తిస్తుంది. వారు ఆంధ్రదేశానికి వలస వచ్చి ఉన్నా అప్పటికే ఇక్కడ ఉన్న వైదిక సాంప్రదాయిక ఆంధ్ర సమాజం వారిని మ్లేచ్ఛులుగా పరిగణించి శాశ్వతంగా వెలివేసి ఆవల ఉంచేదే.

చారిత్రక ఆధారాలుగా ఆధునిక మేధావులు చాలామంది అంగీకరించని ప్రాచీన సాహిత్యాన్ని వదిలేసి, ఆంధ్రుల మూలాల చర్చ మానేసి... అందరూ చెప్పుకునే సోకాల్డ్ చరిత్రనే చూద్దాం. అక్కడా ఆంధ్రులకు తీరని అన్యాయమే జరిగింది.

ప్రాచీన భారత చరిత్రకు తిరుగులేని ప్రమాణాలైన భవిష్య, మత్స్య, బ్రహ్మాండ, విష్ణు, వాయు పురాణాల్లో చెప్పిన ప్రకారం భారత యుద్ధం జరిగిన క్రీ.పూ. 3138 నుంచి లెక్కవేస్తూ పోతే 100 సంవత్సరాల నందవంశం, 316 ఏళ్ల మౌర్య వంశం, 300 ఏళ్ల శుంగ వంశం, 85 ఏళ్ల కణ్వ వంశం తరవాత క్రీ.పూ. 833 నుంచి క్రీ.పూ. 327 వరకు 32 మంది ఆంధ్ర శాతవాహన రాజుల పాలన దాదాపుగా 500 ఏళ్లు సాగింది. శాతవాహనుల్లో చివరి వాడైన చంద్రశ్రీ (ఇతడే వెనకటి వ్యాసాల్లో మనం చెప్పుకున్న చంద్రమసుడు)ని, అతడి కుమారుడు మూడవ పులోముడిని చంపి చంద్రగుప్తుడు ఆంధ్ర భృత్యులు అనే గుప్త సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఆ వంశం పాలన క్రీ.పూ. 327 నుంచి క్రీ.పూ. 82 వరకు 245 ఏళ్లు సాగింది.

మగధ నేలిన మిగతా రాజవంశాల్లాగే ఆంధ్ర శాతవాహనుల చరిత్రా పురాణాలలో

స్పష్టంగా, వివరంగా ఉంది. శాతవాహన వంశానికి చెందిన సింహక (లేక శిముఖ లేక సిముక) శ్రీ శాతకర్ణి కాణ్వ వంశం చివరివాడైన సుశర్మకు మంత్రిగా ఉండి రాజును చంపి మగధ సింహాసనం ఆక్రమించి యుధిష్ఠిర శకం 2305 నుంచి 2328 వరకు (అంటే క్రీ.పూ. 833 నుంచి 810 వరకూ) మగధ నేలాడు. అప్పటి నుంచి క్రీ.పూ. 327 లో గుప్త చంద్రగుప్తుడి చేతిలో పులోముడు హతమయ్యేంతవరకూ 32 మంది శాతవాహన రాజులు సుమారు ఐదు శతాబ్దులు రాజ్యం చేశారు. రాజుల సంఖ్య, వారి పేర్లు, పాలనా కాలాల్లో మత్స్య, విష్ణు, వాయు, బ్రహ్మాండ పురాణాల మధ్య స్వల్పమైన తేడాలున్నాయి. ఒక పురాణంలోనే ఒక ప్రతికీ ఇంకో ప్రతికీ మధ్య కొన్ని భేదాలు, కొండొకచో వైరుధ్యాలూ ఉన్నాయి. అయితే భారత యుద్ధకాలం నుంచి గుప్త రాజుల దాకా నడచిన రాజవంశాలు, వాటి పాలనా క్రమాలు సప్తర్షి మండలంలో నక్షత్ర సంచారంతో సరిచూసుకుంటే ఎక్కడికక్కడ సరిపోతున్నాయి కనుక పురాణాలు పేర్కొన్న వంశ క్రమం స్థూలంగా సరయినదని ఎవరైనా ఒప్పుకుని తీరాలి. వివిధ పురాణాల మధ్య, వేరు వేరు ప్రతులమధ్య కొద్దిపాటి తేడా పొడాలుంటే పండితులు వాటిని పరిశీలించి, పరిష్కరించడం అసాధ్యమేమీ కాదు. ఆపని చేయాలంటే ప్రాచీన సాహిత్యం మీద కనీస గౌరవం ఉండాలి. అందులో నిర్దిష్టంగా ఉన్న అంశాలను, సమన్వయించగలిగిన విషయాలను చారిత్రక ఆధారాలుగా గుర్తించగలిగిన నిజాయితీ ఉండాలి. మన చరిత్రకు తీర్పరులైన విదేశీ చరిత్రకారుల్లో ఆ రెండు లక్షణాలూ లేవు.

విచిత్రమేమంటే – మన పురాణాల రాతలు నమ్మదగినవి కావని కొట్టిపారేసిన విదేశీయులు ఆ రాతలను మించి మరే ఆధారాలనూ కనిపెట్టలేక పోయారు. పురాణాల్లో ఇచ్చిన రాజవంశాల క్రమాన్నే, వాటిలోని రాజుల వరసనే వీరూ కాపీ కొట్టారు. అయితే కాలక్రమం దగ్గరికి వచ్చేసరికి తమ మూర్ఖపు పైత్యాన్ని జోడించి, వందల సంవత్సరాలను చెరిపేసి రాజుల పాలనా కాలాన్ని యథేచ్ఛగా కోసేసి భారత చరిత్ర ప్రాచీనతకు అంటకత్తెర వేశారు. ఈ అడ్డదిడ్డపు కత్తిరింపుల పనితనమే ఆంధ్ర శాతవాహనుల చరిత్రలోనూ కనపడుతుంది. పురాణాలలో పేర్కొన్న విషయాలను సాపేక్షంగా బేరీజు వేసి పరిశీలిస్తే మగధ నేలిన పూర్వ శాతవాహనుల కాలక్రమం ఎలా ఉంటుందో ఈ కింది పట్టికలో చూడండి.

నెం.	రాజుపేరు	ఎంతకాలం	పాలనా కాలం క్రీ.పూ.
1.	శ్రీముఖ శాతకర్ణి	23	833-810
2.	శ్రీకృష్ణ శాతకర్ణి	18	810-792
3.	శ్రీమల్ల శాతకర్ణి	10	792-782
	....	....	....
19.	హాల శాతవాహన	5	494-484
	....	....	....
25.	గౌతమీపుత్ర శాతకర్ణి	25	433-408
	....	....	....
31.	చంద్రశ్రీ శాతకర్ణి	3	337-334
32.	పులోమ శ్రీశాతకర్ణి III	7	334-327
	మొత్తం	506 సంవత్సరాలు	

తెలివి లావు అయిన విదేశీ చరిత్రకారులు ఇదే జాబితాను రడీమేడ్‌గా తీసుకుని, కాలక్రమాన్ని మాత్రం ఆరు శతాబ్దాలు కిందికి నెట్టారు. క్రీ.పూ. 327లో అలెగ్జాండర్ దండయాత్ర అనే 'ఏకైక సత్యప్రమాణాన్ని' ఆధారం చేసుకుని క్రీ.పూ. 1534 నాటి మౌర్య చంద్రగుప్తుడిని అలెగ్జాండర్ సమకాలికుడిగా నిర్ణయించి అబద్ధాల సాలెగూడు ఒకటి వారు అల్లారు కదా? అక్కణ్నించి ఒక్కో రాజవంశాన్ని కిందికి నెట్టుకుంటూ పోతే ఆంధ్రరాజుల వంతు వచ్చేసరికి క్రీ.పూ. 3వ శతాబ్దం అయింది. ఆ కాలపు ముద్రకొట్టి విదేశీయులు బనాయించిన దానినే మన దేశపు మేధావులూ ప్రామాణిక చరిత్ర అని భ్రమపడ్డారు. ఈ బూటకపు వాదానికి విరుద్ధమైన రాతలు, ఆధారాలు కనిపించినా వాటిని పట్టించుకుంటే అధికారిక చరిత్రకు అడుగు ఎక్కడ ఊడిపోతుందోనన్న ఆరాటాన్ని దేశీయ మేధావులూ కనపరిచారు. పురాణాల్లో చెప్పినది తప్పనడానికి బలమైన రుజువు ఏదీ లేకపోయినా, వాస్తవానికి ఆరు శతాబ్దాల తరవాత గానీ ఆంధ్ర రాజుల కాలం మొదలవలేదనడానికి ఏ చారిత్రకాధారమూ దొరకకపోయినా విదేశీయుల మిథ్యావాదాన్ని మనవారూ గొర్రెదాటుగా అనుసరించారు. ఈ రకమైన ధోరణికి 1950లో ఆంధ్రేతిహాస పరిశోధక మండలి, గుంటూరు వారు వెలువరించిన *'సాతవాహన సంచిక'* మచ్చుతునక.

శాతవాహన చరిత్రకు, సంస్కృతికి సంబంధించిన వివిధ కోణాలను సాధికారికంగా విమర్శించిన ఈ సంచికలోని రచయితలు సామాన్యులు కారు. ఆయా రంగాల్లో పేరుమోసిన దిగ్దంతులు, వారి నిజాయితీని, నిశిత దృష్టిని ఎవరూ ఆక్షేపించజాలరు. అయితేనేమి? దేశ చరిత్రకు సంబంధించి విదేశీయులు మేకులు కొట్టిన కాలక్రమ చట్రం నుంచి వారు సైతం బయటపడలేకపోయారు. విదేశీయులు కట్టిన గంతల మూలంగా అంతటి మేధావులు కూడా యథార్థాన్ని గుర్తించలేక పోయిన విధాన్ని సాతవాహన సంచికకు సంపాదకత్వం వహించిన ప్రసిద్ధ చరిత్రాచార్యుడు మారేమండ రామారావుగారి సుదీర్ఘ వ్యాసాల్లోని ఈ కింది వాక్యాల్లో స్థాలీపులాకన్యాయంగా గమనించండి.

'ఆంధ్ర సాతవాహన వంశము యొక్క పరిపాలనా కాలమును... నిర్ణయించుట సుకరముకాదు. ఈ యంశములను గురించి పురాణములలో పరస్పరమును వ్యత్యాసములున్నవి. సాతవాహనుల శాసనములు ఆయా రాజుల రాజ్య సంవత్సరములనే పేర్కొనును గాని ఏ శకమును ఉదహరింపవు. నాణెముల మీద రాజుల పేర్లు మాత్రమున్నవి కాని రాజ్యవర్షములు లేవు..'

ఇలా ఈ తీరున మెగస్తనీస్ రాతలను, టోలెమీ పరిశీలనలను, అశోకుని శాసనాలను, అతని సమకాలికుల ప్రస్తావనలను - ఆంగ్లేయులు చేసిన కాల నిర్ణయానికి లోబడి చర్చించి, చివరికి ఆంధ్ర శాతవాహనుల కాలం ఇదీ అని మారేమండ రామారావుగారు తేల్చిందిలా:

నెం.	రాజు పేరు	ఎంతకాలం	పాలనా కాలం క్రీ.పూ.
1.	సిముకుడు	23	క్రీ.పూ. 221-198
2.	కృష్ణుడు	18	198-181
3.	సాతకర్ణి I	10	180-170
	....	....	....
14.	హాలుడు	5	క్రీ.శ. 19-24

	....	....	....
20.	గౌతమీపుత్రుడు	24	78-102
	....	....	....
28.	చంద్రశ్రీ	3	209-211
29.	పులోమావి III	7	211-218
	మొత్తం	**439** సంవత్సరాలు	

పురాణాల జాబితాలోంచి ఐదుగురు రాజుల్ని తీసేసి కొత్తగా ఇద్దర్ని కలపడం మినహా ఈ లిస్టు కూడా స్థూలంగా పురాణాలు చెప్పిన వరసలోనే సాగింది. కాకపోతే పాలనా కాలం మాత్రం 600 ఏళ్లు కిందికి దిగింది.

మొత్తంగా ప్రాచీన భారత చరిత్రకు విదేశీయుల వల్ల జరిగిన అన్యాయాన్ని అందరూ గుర్తించి సమూలంగా సరిదిద్దగలిగితేగాని మిగతా దేశంతోబాటు ఆంధ్ర శాతవాహనులకూ చారిత్రక న్యాయం సిద్ధించదు. బుద్ధుడు, అశోకుడు సహా అందరి కాలాలనూ సవ్యంగా అంచనా కట్టగలిగేదాకా ఆంధ్రదేశంలోని బౌద్ధ స్థూపాలూ, చైత్యాలూ, శాతవాహన శాసనాలూ, నాణేలూ చెప్పే అసలు కథ మన బుర్రకెక్కదు.

ప్రాచీన భారత చరిత్ర పరామర్శకు ఇక్కడితో స్వస్తి.

మనకు పట్టని ఊచకోత

మనలో చాలా మందికి- మన పూర్వీకుల మీద ఒకందుకు కోపం. వారికి చరిత్ర స్పృహ లేదనీ- గ్రీసు, చైనా లాంటి దేశాల ప్రాచీనులు అప్పటి చరిత్రను ఎంచక్కా పద్ధతి ప్రకారం రికార్డు చేయగా... మనవాళ్లు యుగాలు, మన్వంతరాలు, వేల సంవత్సరాలు రాజ్యం చెయ్యడాలు, దేవతలతో యుద్ధాలు, అవతారాలు అంటూ అర్థంలేని పుక్కిటి పురాణాలను మాత్రమే రాసి పెట్టారనీ... దానివల్ల నమ్మదగిన (ఇండియన్ మేడ్) చరిత్ర అనేది మనకు లేకుండా పోయిందనీ- మేధావులమైన మనకు మా చెడ్డ చిరాకు! సరే! అజ్ఞానులు, మూర్ఖులు అయిన మన పూర్వులకు 'హిస్టరీ సెన్సు' లేదు.కానీ... వారికి లేదని ఆక్షేపించే ఆ 'చరిత్ర జ్ఞానం' మనకు ఉందా?

మన పురాణాలు ప్రామాణిక చరిత్ర కావనీ, వాటిలో చారిత్రక అంశాలు, చారిత్రక ఆధారాలు లేవని ఇంగ్లీషు పండితులు తమ అవసరం కొద్దీ తేల్చి చెబితే... వారి మాటే వేదవాక్యంగా తలచి జెనౌను అని నేటికీ మనం వల్లె వేస్తున్నాము కదా? మన దృష్టిలో సర్వజ్ఞులైన బ్రిటిష్ చరిత్రకారులే - పురాణ కాలం తరవాత, ముఖ్యంగా మహమ్మదీయ మహోయుగం ఆరంభమయ్యాక నడిచిన చరిత్రను అక్షరబద్ధం చేశారు. ఆ చరిత్రనైనా మనం మననం చేసుకుని, దాని నుంచి నేర్చుకోవలసిన పాఠాలను నేర్చుకుంటున్నామా? ఒకవేళ తెల్లవాళ్లు దుర్మార్గులనీ, మనల్ని విభజించి, పాలించడం కోసమే వారు తిమ్మిని బమ్మిని చేసి ఘోర దురంతాలు జరిగిగాయంటూ కల్ల చరిత్రను సృష్టించారనీ అనుకుందామా? ఆయా ఘటనలను స్వయంగా చూసిన సమకాలిక చరిత్రకారులు రాసిపెట్టిన రికార్డులు కూడా ఉన్నాయి. వారు ఆ కాలపు పాలకుల ఆశ్రితులూ, ఆస్థాన రచయితలే. కాబట్టి

పగబట్టి అబద్ధాలు రాశారనడానికీ వీల్లేదు. మరి – తిరుగులేని ఆ రికార్డులనైనా అవలోకించి ఈ దేశం పడిన దుర్భర క్షోభను, ఇక్కడ ప్రజలు అనుభవించిన యమ యాతనలను గుర్తు పెట్టుకునే ప్రయత్నమైనా మనం చేస్తున్నామా? ఎప్పుడో ఏదో జరిగిపోయింది లెస్తూ, .. ఆ గొడవలన్నీ ఇప్పుడెందుకు? వాటిని కెలుక్కుని మనసులను కలుక్కుమనిపించుకోవడం ఎందుకు అని వాటిని మరచిపోగలమా? మనం ఉన్న ప్రపంచంలో మన చుట్టూ ఉన్న దేశాలూ, జాతులు, వాటిని ప్రభావితం చేసే మేధావి వర్గాలు తమ గత చరిత్రల గురించి, వెనుకటి ఘోరాల గురించి ఇలాంటి నిర్లిప్తతే చూపుతున్నాయా?

ఉదాహరణకు – 20వ శతాబ్దంలో యూదుజాతి మొత్తాన్ని నిర్మూలించాలని కంకణం కట్టుకుని నాజీలు సాగించిన భయానక జన సంహారాన్నే తీసుకోండి. హిట్లర్ అనే ఉన్మాది జాత్యహంకారంతో పేట్రేగి యూదుల సమస్యకు 'అంతిమ పరిష్కారం'గా లక్షలాది యూదులను గ్యాస్ చాంబర్లలో పెట్టి, చిత్రహింసలతో చిత్రవధలు సాగించి కనీసం అరవై లక్షల మందిని క్రూరంగా, ఘోరాతి ఘోరంగా బలిగొన్న తీరును తలచుకుంటే మానవత్వం గల ప్రతి ఒక్కరికీ గుండె చెరువవుతుంది. Great Holocaust పేరిట ప్రసిద్ధమైన ఆ రాక్షసకాండను సభ్య ప్రపంచం ముక్తకంఠంతో ఖండించింది. ఆ కాలంలో నాజీ నరపిశాచులు చేసిన సామూహిక సంహారాన్ని అన్ని కోణాల నుంచి గర్హిస్తూ ప్రపంచంలోని అన్ని భాషల్లో వేల సంఖ్యలో పుస్తకాలు వెలువడ్డాయి. ఎన్నో వందల సినిమాలూ వచ్చాయి. తమ దేశంలో నాజీలు సాగించిన పైశాచిక జాతి హత్యాకాండను జర్మన్లు మరచిపోలేదు. దానిని కప్పిపుచ్చే ప్రయత్నమూ చేయలేదు. జర్మన్ పాఠశాలల్లో బోధించే చరిత్రలో ఆ చీకటి అధ్యాయాన్ని కప్పిపుచ్చడంలేదు, వక్రీకరించడంలేదు. మానవతకు మాయని మచ్చ అయిన అటువంటి ఘోరాలు మళ్ళీ ఎక్కడా ఎవరి మీదా జరగకుండా ఉండాలంటే అలాంటి పైశాచిక మనస్తత్వం వల్ల గతంలో వాటిల్లిన దారుణ దుష్ఫలితాలను పదే పదే గుర్తు చేసుకోవాలన్న ఉద్దేశమే ఇందుకు కారణం. అలాగే నాజీలు తమపై సాగించిన దారుణ మారణకాండను నిరంతరం స్మరించడాన్ని జర్మన్లు ఎక్కడ అపార్థం చేసుకుంటారో, ఎలా నొచ్చుకుంటారోనన్న సంకోచం యూదులకు లేదు. గతకాలపు ఘోరాలను తలచుకోవడం యూదుల, జర్మన్ల సఖ్యతకు, సహజీవనానికి భంగకరమన్న ఆలోచనే ప్రపంచంలో ఏ మేధావికీ రాలేదు.

ఇప్పుడు మళ్ళీ మన దగ్గరకి వద్దాం. యూదులను ద్వేషించి నాజీలు సాగించిన ఊచకోతల కంటే భారతదేశ ప్రజలపై బయట నుంచి దండెత్తి వచ్చిన ఇస్లామిక్ మూకలు, వాటి వారసులు సాగించిన జన సంహారం ఎన్నో రెట్లు పెద్దది! క్రీ.శ. 1000లో గజనీ మహమ్మద్‌తో మొదలు పెట్టి క్రీ.శ. 1739లో నాదిర్షా వరకూ ఏడొందల సంవత్సరాల్లో తెరలు తెరలుగా క్రూరాతిక్రూరంగా సాగిన ఊచకోతల్లో మొత్తం హతులెందరన్నది కచ్చితంగా తెలియదు. ఆ సంఖ్య అనేక కోట్లలోనే ఉంటుందని మాత్రం ఘంటాపథంగా చెప్పవచ్చు. ఇందుకు చారిత్రక దాఖలాలు కావలసినన్ని.

క్రీ.శ. 1399లో తైమూర్ ఒక్క రోజునే లక్షమంది అమాయక ప్రజలను ఊచకోత కోయించాడు. బహమనీ సుల్తానులు ఏడాదికి లక్ష మంది కాఫిర్లను చంపాలని వ్రతంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం హోషియార్‌పూర్ జిల్లాలో ఉన్న మిలామత్ లోయలో తాను నరికి పారేయించిన కాఫిర్ల నెత్తురుతో నేలంతా తడిసిపోవటం వల్ల తాను విడిది చేసిన డేరాలను మూడుసార్లు వేరే చోటికి మార్చాల్సి వచ్చిందని, అక్కడి యుద్ధంలో తాను చంపించిన

కాఫిర్ల పుర్రెలతో తాను ఒక స్థూపాన్ని నిర్మింపజేశానని బాబర్ స్వహస్తాలతో రాసుకున్నాడు. ఇలాంటి పుర్రెల స్థూపాలను ఖాన్వాలో, చందేరీలో కూడా ఆ 'మహాత్ముడు' నిర్మించాడు. తమకు లొంగి మతం మారేందుకు ఇచ్చగించని హిందువులను, బౌద్ధులను నరికించి పుర్రెల గోపురాలు సగర్వంగా కట్టించిన సుల్తాన్లు చరిత్రలో ఇంకా చాలామంది ఉన్నారు. మొగలాయీ అక్బర్ 1568లో చిత్తూరు కోటను పట్టుకున్న వెంటనే తనకు చిక్కిన 30 వేల మంది రాజపుత్రుల తలలు పరపరా నరికించాడని ఆయన ఆస్థానంలోనే ఉన్న అబుల్‌ఫజల్ గొప్పగా చరిత్రకెక్కించాడు. 1565లో విజయనగర సామ్రాజ్య పతనానంతరం హంపిలో నెలలు తరబడి రాకాసి మూకలు సాగించిన సామూహిక జనసంహారం, భయానక విధ్వంసం వర్ణించడానికి మాటలు చాలవు. ఇక గజనీ, ఘోరీలు జరిపించిన ఘోరాలకైతే అంతే లేదు. వారి దారుణాలతో ఢిల్లీ సుల్తాన్ల పాపాలతో పోల్చితే బాబర్, ఔరంగజేబుల అఘాయిత్యాలు కూడా ఒక లెక్కలోనివి కావు. ఒకప్పుడు గాంధారరాజ్యంగా ప్రసిద్ధమైన భారతదేశంలో అంతర్భాగమైన నేటి ఆఫ్ఘానిస్తాన్ క్రీ.శ. 1000లో గజనీ మహ్మద్ అనే నరపిశాచి పాలపడేంతవరకూ, అక్కడి ప్రజల్లో అత్యధిక సంఖ్యాకులు హిందువులే. లక్షల సంఖ్యలోని ఆ జనాభాను తుడిచిపెట్టటానికి గజనీ, అతని వారసులు సాగించిన ఘాతుకాలు ఎంతటివంటే ఈనాటికీ అక్కడి పర్వత శ్రేణిని 'హిందువుల ఊచకోత' అని అర్థం వచ్చే 'హిందుకుష్' పేరుతో పిలుస్తారు. పశ్చిమ ఆఫ్ఘానిస్తాన్‌లోని హీరట్ నగరం ఒక్కదానిలోనే ఏకంగా 15 లక్షల మంది జనాన్ని నరికేశారని ఆఫ్గాన్ చరిత్రకారుడు Khondamir పేర్కొన్నాడు. యుద్ధాల్లో మరణించిన సైనికులు... ఓడిపోయిన రాజ్యాల్లో జనావాసాల మీద పడి పైశాచికంగా సాగిన మూకుమ్మడి హత్యాకాండలో నిహతులైనవారు మాత్రమే గాక యుద్ధం లేని సమయాల్లోనూ ఒళ్లెరుగని మతోన్మాదంతో ఇస్లామిక్ మూకలు బలిగొన్న అమాయకుల సంఖ్య ఎన్నో లక్షల్లో ఉంటుంది. గజనీ మహ్మద్ దాపురించిన క్రీ.శ. 1000 నుంచి పానిపట్టు యుద్ధానికి ముందు క్రీ.శ. 1525 వరకూ ఐదు శతాబ్దాల్లో ఇండియాలో హిందువుల జనాభా. 8 కోట్లు తగ్గిందని ప్రొఫెసర్ కె.ఎస్.లాల్ అంచనా. ఈ సంఖ్య ఇంత అని ఇదమిత్థంగా తేల్చడం తేలిక కాదు. శాస్త్రీయ సరళిలో ఈ దిశగా జరిగిన కృషి కూడా ఏమీ లేదు. 8 కోట్లా అంతకంటే ఎక్కువా, తక్కువా అన్న మీమాంస ఎలా ఉన్నా... కళ్లెదుట కనిపించే చారిత్రక సాక్ష్యాలను గమనిస్తే ఇండియాలో ముస్లిం మతోన్మాదం బలిగొన్న ప్రాణాల సంఖ్య యూదులపై నాజీలు సాగించిన జాతి హత్యాకాండ కంటే ఎన్నో రెట్లు తీవ్రమైనదనడంలో రెండోమాటకు తావులేదు.

శతాబ్దాల కిందట జరిగిపోయిన ఘోరాలను ఇప్పుడు గుర్తు చేసుకోవడం అవసరమా? అది పాత గాయాలను కుళ్లగించడమే కాదా? బయటి నుంచి వచ్చిన ముస్లిం మూకలు అలాంటి దురంతాలకు పాల్పడ్డాయని అధిక్షేపిస్తే అది దేశంలో ఇప్పుడున్న ముస్లిం ప్రజలను అవమానపరచడం కాదా? వారిపట్ల ద్వేషాన్ని, ప్రతీకార భావాన్ని ఈ రకమైన అభియోగాలు సామాన్య జనంలో రెచ్చగొట్టవా? అది సామాజిక ఉద్రిక్తతకు, మతకల్లోలాలకు దారి తీయదా?

తీయదు. ఇవన్నీ అకారణ భయాలు. అప్రియమైనా, జుగుప్స కలిగించేవైనా జీవన వాస్తవాలను జాతి జనులకు ఎరుక పరచకుండా జాతి శీలాన్ని, పరిణతమైన జాతీయతను పెంపొందించటంకల్ల. ఎటువంటి పశు ప్రవృత్తులు మనలను గతంలో బాధించాయో తెలిస్తే తప్ప మళ్లీ అటువంటి శక్తులు చెలరేగకుండా జాగ్రత్త పడలేము. ఎటువంటి బలహీనతల

వల్ల, ఏ రకమైన అలసత్వాల వల్ల లోగడ భయంకర వ్యధలకు గురి అయ్యామో గ్రహిస్తే తప్ప మళ్లీ అటువంటి బలహీనతలు, అలసత్వాలు పొడసూపకుండా మనల్ని మనం కాచుకోలేము. తక్షణావసరమైన జాతి నిర్మాణంలో మనలోని ముస్లింలు కూడా సమాన భాగస్వాములే.. గజనీ మహమ్మదులూ, మహమ్మద్ ఘోరీలూ దండెత్తి వచ్చి, కాలుపెట్టిన చోటల్లా సర్వనాశనం తెచ్చి, మెడమీద కత్తి పెట్టి మతం మారతావా, చస్తావా అంటే ప్రాణం మీద తీపితో విధిలేక మతం మార్చుకున్న హిందువుల సంతతే ఈనాటి మహమ్మదీయ సోదరుల్లో నూటికి తొంభైమంది. తమ పూర్వీకులు పడిన అగచాట్లేమిటో వారికీ తెలియాలి. గతాన్ని ఎంత లోతుగా గమనిస్తే వర్తమానం అంత స్ఫుటంగా తేటపడుతుంది. భవిష్యత్తూ అంతే స్పష్టంగా గోచరిస్తుంది. మనం ప్రస్తావిస్తున్న గతానికి సంబంధించినంత వరకూ ప్రజల్లో హిందువులు, ముస్లింలూ అన్న తేడా లేదు. అందరూ భారతీయులే.

నాజీలు చేసిన కిరాతకాలను ఏవగించుకోవడమంటే జర్మన్లను ఏవగించుకోవడమని, దానివల్ల జర్మన్ జాతి సెంటిమెంట్లు గాయపడవచ్చునని ప్రపంచంలో ఎవరూ అనుకోవడం లేదు. హిట్లర్ హయాంలో నాజీల ఘోరాలను యూరప్ ఏనాడూ మరవలేదు. ఏ మాత్రం క్షమించలేదు. ఐరోపా చరిత్రకు సంబంధించిన ఏ గ్రంథంలోనూ, ఏ టెక్స్ట్ బుక్కులోనూ హిట్లర్ గురించి, నాజీ తత్వం గురించి మెచ్చుకోలు మాట మచ్చుకైనా కనపడదు. హిట్లర్ మంచి భావుకుడని గాని, గొప్ప కమాండరు అని గాని, జర్మను జాతిని ఉత్తేజితం చేసిన ప్రతిభాశాలి అని గాని ఎవరూ ఎక్కడా మాట్లాడరు. వ్యక్తిగా ఆయన గొప్ప తనాన్ని, ఆయన ప్రేమాయణాలను చిత్రిస్తూ ఎవరూ కావ్యాలు రాయలేదు. సినిమాలు తీయలేదు. నాజీలు సాగించిన అమానుష మారణకాండను సభ్యసమాజం యావత్తూ ఒక్క గొంతుతో గర్హించింది.

మరి మన దేశంలో జరుగుతున్నదేమిటి?

నాజీల హత్యాకాండ కంటే పెద్ద జనసంహారాన్ని, మేరలేని విధ్వంసాన్ని, అంతులేని అత్యాచారాల ఘోరకలిని శతాబ్దాల పర్యంతం భారతీయులు అనుభవించినా అది సీరియస్‌గా గుర్తు పెట్టుకోవలసిన విషయం కానట్టే మనం వ్యవహరిస్తాం. అలాంటి ఘోరాలు అసలు జరగనట్టే నటిస్తాం. పాతకాలపు ఏ చరిత్ర గ్రంథాల్లోనో వాటి తాలూకు జాడలు కనిపించినా, హిందూ మతోన్మాదులెవరైనా పనిగట్టుకుని అల్లరి చేసినా, పెద్ద మనుషులమైన మనం ఏదీ చూడనట్టే, విననట్టే ఉండి అదే మన హుందాతనమని మురిసిపోతుంటాం. మనలాగే గజనీల, ఘోరీల ఘోరాల బారిన పడ్డ అభాగ్యుల సంతతి అయిన భారతీయ ముస్లింలను గజనీల, ఘోరీల చుట్టాలుగా, ఔరంగజేబు, నాదిర్షాల వారసులుగా మనకు మనమే ముద్ర వేసుకుని, ఆయా విదేశీ ముష్కరుల దుర్మార్గాలను ఖండిస్తే మన మధ్యగల ముస్లిం సోదరుల మనసులు ఎక్కడ బాధపడతాయోనని ఉలికిపడతాం. మనలాగే అత్యాచారాల బాధితులైన వారిని తీసుకుపోయి అత్యాచారాలు చేసిన కిరాతకుల పంచలో పడవేయటం భారతీయ ముస్లింల జాతీయతను, భారతీయతను అవమానించడమేనని సూడో సెక్యులర్ తిమ్మిరిలో మనం గ్రహించడం లేదు. గతంలో ఒకే రకమైన అఘాయిత్యాలకు మీరూ మేమూ సమానంగా గురి అయ్యామని, ఇకముందు అలాంటి విపత్తులు విరుచుకుపడకుండా మనందరం కలిసి జాగ్రత్త పడదామని ముస్లిం ప్రజలతో అరమరికలు లేకుండా చెప్పినప్పుడే వారికీ, హిందువులకూ మధ్య ఆత్మీయతా భావం పెంపొందుతుంది. అలాగాక – గతంలో మీ వాళ్లు ఎంతటి పాపాలు చేసినప్పటికీ మేము మంచివాళ్ళం కాబట్టి, మీరు నొచ్చుకోకూడదని

కోరేవాళ్లం కాబట్టి ఆ మాట అనడం లేదన్న భావం కలిగిస్తే – మీరు వేరు, మేము వేరు అని చెప్పకనే చెప్పిన వారమవుతాం. ఇస్లాం వ్యాప్తి పేరిట గజనీలు, ఔరంగజేబులు చేసిన నాజీ తరహా నేరాలు ఎంత నికృష్టమైనవో మన ముస్లిం సోదరులందరూ గుర్తించేట్టు చేయకపోతే, ఆ రకమైన దుష్కరత్వాలను నిర్ద్వంద్వంగా ఖండించకుండా ఊరకుంటే కొత్తకొత్త గజనీలు, ఔరంగజేబులు ఇదే ముస్లిం శ్రేణుల నుంచి పుట్టుకొచ్చేందుకు మనమే కారణభూతులమవుతాం. ఎవరూ పెద్దగా అభ్యంతరం తెలపలేదు కనుక గతంలో తమ మతస్థులను ఆవహించిన దుష్కరత్వమే నేటికీ ఆదర్శమన్న ఫండమెంటలిజం ముస్లింల్లో మోరసాచేందుకు మనమే ఆస్కారమిచ్చిన వాళ్ళమవుతాం.

అవుతాం – ఏమిటి! ఇప్పటికే – అయ్యాం!! కాశ్మీర్‌ను ఏళ్ల తరబడి కార్చిచ్చులా దహిస్తూ, పార్లమెంట్‌నే బందీ చేయబోయి, గోధ్రాలో కాటువేసి, గుజరాత్ గుడిపై దాడిచేసి, పది తలలతో, నూరు కాళ్ళతో నేటికీ వికట తాండవం చేస్తూ భారత జాతి పరువును, పౌరుషాన్ని గేలిచేస్తున్న జిహాదీ పైత్యమే ఇందుకు దృష్టాంతం.

అమెరికాలో, యూరప్‌లో నాజీల ఘాతుకాలను అన్ని కోణాల నుంచి ఎండగడుతూ వందల, వేల సినిమాలు వచ్చాయని ఇందాక అనుకున్నాం కదా? ఆ దేశాలతో పోల్చితే మన సినిమా పరిశ్రమా పెద్దదే. ఏటా వందల సంఖ్యలో చిత్రాలను అనేక దశాబ్దాలుగా మనం ఉత్పత్తి చేస్తున్నాం. మధ్యయుగంలో దేశాన్ని చెరబట్టిన ఇస్లామిక్ మూకలు సాగించిన మారణకాండను కళ్లకు కట్టినట్టు చూపించింది – చెప్పాలంటే వాటిలో ఒక్కటీ లేదు. అంతేకాదు. ఆ కాలానికి సంబంధించి కలకాలం గుర్తుండేలా మన వారు తీసిన చిత్రరాజాలు ముఖ్యంగా మూడు. ఒకటి – **మొఘల్-ఇ-ఆజం**, రెండోది – **అనార్కలి**, మూడోది – **తాజ్‌మహల్**. మూడూ – వేల మందిని మతద్వేషంతో మట్టుపెట్టి, అడ్డమైన అఘాయిత్యాలకు పాల్పడ్డ మొఘల్ పాదుషాలను వీరులుగా, మానవతా మూర్తులుగా, ప్రేమైక జీవులుగా చూపించేవే. చిత్తూరును చెరబట్టగానే ఒకేరోజు ముప్పైవేల మంది అమాయక జనాన్ని వరసబెట్టి ఊచకోత కోయించి... అభిమానవతులైన 8 వేల మంది మంటల్లో దూకి ఆత్మాహుతి చేసుకుంటే వికటాట్టహాసం చేసిన అక్బర్ అనే నరహంతకుడిని ఒక సినిమా ధీరోదాత్తుడిగా చూపెట్టింది. వందలకొద్దీ దేవాలయాలను కూలగొట్టించిన విధ్వంసకుడు... తాను కబ్జా చేసిన కళాత్మక కట్టడం లాంటిది మరెక్కడ వెలవకుండా దాన్ని చెక్కిన శిల్పుల చేతులు నరికించిన క్రూరుడు, కాముకుడు అయిన షాజహాన్ ఇంకో సినిమా కథానాయకుడు. జాతికి చెరుపు చేసిన విదేశీ ప్రభువులను రొమాంటిక్ హీరోలుగా, గొప్ప భావుకులుగా సినిమాల్లో చిత్రించి, వారి ఘనతను గుర్తు చేసుకుంటూ ఆయా సినిమాల మధురగీతాలతో యువతరం మునిగి తేలి మైమరచేట్టు చేయడాన్నే మనం 'సృజనాత్మకత', 'ప్రగతిశీలత' 'లిబరల్ పోకడ' వగైరా ముద్దు పేర్లతో పిలుచుకుంటాం.

మన సినిమాల్లో జాతీయతాభావం ఇంత లక్షణంగా అఘోరించింది సరే. కనీసం సీరియస్‌గా ఛదివే చరిత్ర గ్రంథాల్లోనైనా మధ్యయుగంలో దేశం పడిన దుర్భర క్లేశాల్ని, దానికి కారణభూతమైన పరిస్థితులను సవ్యంగా చిత్రించారా? చారిత్రక కఠోర వాస్తవాలను మేధావులు, మహానాయకులు అయినా ధైర్యంగా గుర్తించి, జాతిని జాగృతపరచటంలో తమవంతు బాధ్యత నిర్వర్తించారా?

సెక్యులర్ తైమూర్

1398 **సంవత్సరం డిసెంబరు 13.**

ఘనత వహించిన తైమూర్ అలియాస్ తామర్లేన్ గారికి గొప్ప చిక్కు వచ్చి పడింది. మధ్య ఆసియా సమర్‌ఖండ్ నుంచి ఆయన లక్ష మంది అశ్వికులతో ఇండియా మీదికి దండెత్తి వచ్చి అప్పటికి తొమ్మిది నెలలయింది. సింధునది దాటి ముల్తాన్ కోటను కొల్లగొట్టి, వాయవ్య పంజాబ్‌కు అగ్గి పెట్టి, దీపాల్పూర్, భట్నీర్, సర్సుతి, లోనీ లాంటి పెద్ద పట్నాలను తగులబెట్టి, అడ్డుకున్న రాజపుత్రులను ఊచకోత కోసి, జనావాసాలపై పడి వేలసంఖ్యలో హిందువులను నరికి, అడుగుపెట్టిన చోటల్లా స్త్రీలు, పిల్లలు సహా వీలయినంత మంది హిందువులను ఖైదీలుగా పట్టుకుని - ఎట్టకేలకు ఆ చల్లని ప్రభువు ఢిల్లీ పొలిమేరలకు చేరాడు. లెక్కవేస్తే అప్పటికి ఖైదీలు లక్ష మంది అయ్యారు. అలవాటు ప్రకారం సైనికులు వారిని తలా కొంచెం పంచేసుకున్నారు. స్వదేశం తిరిగి వెళ్ళాక ఏదో ఒక ధరకు వారిని బానిసలుగా అమ్ముకోవడమే తరువాయి.

యమున దాటి ఢిల్లీపై దండయాత్ర చేయడానికి ఆఖరి సన్నాహాలను చర్చించడానికి జహన్నుమా విడిదిలో తైమూర్ కొలువు దీరాడు. అమీర్లు, రాజవంశీకులు, సైన్యాధికారులు అందరితో కీలక యుద్ధ ఏర్పాట్లను ముచ్చటిస్తుండగా ఖైదీల సమస్యను మంత్రులు ఆయన ముందు పెట్టారు.

బందీలు ఒకర్రా, ఇద్దరా? ఏకంగా లక్షమంది ఉన్నారాయె. వీళ్లను ఎప్పుడూ కాపలా కాయాల్సిందే. ఏ మాత్రం సందు దొరికినా పారిపోతారు. శత్రుసేనలు మన మీద దాడి చేస్తే వీరూ సంబరపడి రెచ్చిపోయి ఎదురుతిరుగుతుంటారు. నమ్మడానికి బొత్తిగా వీల్లేని మూక ఇది. మరి - అతి ముఖ్యమైన యుద్ధంలో ఉన్న సేనలన్నీ కదన రంగానికి వెళ్ళాల్సిన తరుణంలో ఈ ఖైదీల కాపలా ఎలాగ? వీరిని నమ్మి శిబిరాల్లో వదిలి వెళ్ళడం ఎలాగ?

ఇదీ సమస్య. 'నిజమే! మరి ఏమి చేయాలి?' అని అమీర్లను సలహా అడిగాడు తైమూర్.

తరవాత కథ తైమూర్ మాటల్లోనే చదవండి:

I asked the amirs for advice about the prisoners, and they said that on the day of the battle these one hundred thousand prisoners could not be left with the baggage, and that it would be entirely opposed to the rules of war, to set these idolators and foes of Islam at liberty, so that no course remained but to make them all food for the sword.

When I heard these words.... I directed the commanders to proclaim throughout the camp that everyman who had infidel prisoners was to put them to death and that whoever neglected to do so, should himself be executed and his property given to the informer. When this order became known to the champions of Islam, they drew their swords and put their prisoners to death. One hundred thousand infidels, impious idolators, were slain on that day. Maulana Nasir-ad-din Omar, a counsellor and man of learning, who had never killed a sparrow in all his life, now, in execution of my order, killed fifteen idolatrous Hindus, who were his captives.

(ఖైదీల గురించి అమీర్లను సలహా అడిగాను. యుద్ధానికి వెళ్లేటప్పుడు సామాన్లతోపాటు ఈ లక్షమంది ఖైదీలను వదిలి వెళ్ళకూడదు. ఇస్లాంకు శత్రువులైన ఈ విగ్రహారాధకులను స్వేచ్ఛగా విడిచిపెట్టటమూ యుద్ధ నియమాలకు విరుద్ధం. కాబట్టి వారందరినీ కత్తికి ఎరవేయడం మినహా వేరే దారి లేదని వారు చెప్పారు.

ఈ మాటలు విన్నాక... నేను కమాండర్లకు ఆదేశాలిచ్చాను. కాఫిర్ ఖైదీలు తన దగ్గర ఉన్న ప్రతివాడూ వారిని చంపెయ్యాలనీ, అలా కనక ఎవడైనా చెయ్యకపోతే వాడినే చంపేసి, వాడి ఆస్తిని సమాచారమిచ్చిన వారికి ఇచ్చేస్తామనీ శిబిరమంతటా చాటించమన్నాను. ఈ ఉత్తర్వు తెలియగానే ఇస్లాం యోధులు కత్తులు దూసి తమ తమ ఖైదీలను చంపేశారు. దైవ విశ్వాసం లేని విగ్రహారాధకులు లక్షమందిని ఆ రోజున నరికేశాం. పండితుడు, సలహాదారు అయిన మౌలానా నసీరద్దీన్ ఒమర్ తన జీవితంలో పిచ్చుకను కూడా చంపలేదు. అలాంటి వాడే నా ఆజ్ఞ ప్రకారం, తన అధీనంలోని పదిహేను మంది హిందూ విగ్రహారాధకులను చంపేశాడు.)

ఇది ఎవరో చెబితే విని ఎప్పుడో రాసింది కాదు. స్వయానా తైమూరే స్వహస్తాలతో రాసుకున్న ***Tuzuk i Timuri*** లో వివరించిన దానికి ఆంగ్లానువాదమిది. ఈస్టిండియా కంపెనీ అధికారి Sir H.M. Elliot, ప్రొఫెసర్ John Dowson కలిసి 8 సంపుటాలుగా వెలువరించిన ***The History of India As Told By Its Own Historians*** లోని మూడవ సంపుటలోని భాగమిది.

ఇక్కడ మాట్లాడుతున్నది ఉత్తర ధ్రువం దగ్గరో, ఏ చంద్ర మండలం మీదో జరిగిన ఘోరం కాదు. మనదేశంలో, రాజధాని ఢిల్లీ వెలుపల ఎందరో స్త్రీలు, పిల్లలు సహా లక్షమంది అమాయక ప్రజలను నిష్కారణంగా, పైశాచికంగా ఒకేరోజున ఊచకోత కోసిన దారుణ

దురంతమిది. వేల సంవత్సరాల ప్రపంచ చరిత్రలోనే ఇంతటి ఘాతుకాలు అరుదు.

పోనీ - ఎక్సెస్ లగేజిని అవతల పడేసినట్టు యుద్ధ సమయంలో లక్ష బందీల తలలు తరగడంతోనే తైమూర్ అఘాయిత్యం ఆగిందా?

బోడీగా లక్షమంది నిస్సహాయులను కిరాతకంగా తెగటార్చి యుద్ధానికి పోయి, ఢిల్లీని వశం చేసుకున్నాక ఏమి చేసిందీ కూడా తైమూరే చెబుతున్నాడు వినండి:

> The savage turks fell to killing and plundering, while the Hindus set fire to their houses with their own hands, burned their wives and children in them and rushed into the fight and were killed... All day Thursday and throughout the night, nearly fifteen thousand Turks were engaged in slaying, plundering and destroying. When Friday morning dawned, my entire army, no longer under control, went off to the city and thought of nothing but killing, plundering, and making prisoners. The sack was general during the whole day, and continued throughout the following day, Saturday, the seventeenth (Dec. 17), the spoil being so great that each man secured from fifty to a hundred prisoners, men, women and children, while no soldier took less than twenty. There was likewise an immense booty in rubies, diamonds, pearls and other gems; jewels of gold and silver... gold and silver ornaments of the Hindu women were obtained in such quantities as to exceed all account. Excepting the quarter of the Sayyids, the scholars, and the other Mussulmans, the whole city was sacked.
>
> ***[Elliot & Dowson,** Vol. III PP 445-446]*

(తురుష్కులు క్రూరంగా హత్యలకు, దోపిడీలకు దిగారు. హిందువులు తమ చేతులతో తామే ఇళ్ళకు నిప్పుపెట్టి భార్యా బిడ్డలను సజీవ దహనం చేసి పోరాటానికి పరుగెత్తారు. తామూ చచ్చారు.. గురువారం పగలు, రాత్రి అంతా - పదిహేనువేల తురుష్కులు చంపటం, దోచుకోవటం, ధ్వంసం చేయటాల్లో నిమగ్నమయ్యారు. శుక్రవారం తెల్లవారేసరికి నా మొత్తం సైన్యం అదుపు తప్పి నగరం మీద పడింది. ఖూనీలు, దోపిడీలు, బందీలను పట్టుకోవటాలు మినహా ఎవరికీ వేరే ఆలోచనే లేకపోయింది. ఆ రోజు, మర్నాడు, (డిసెంబరు 17) శనివారం కూడా ఈ విధ్వంసం కొనసాగింది. దొరికించుకున్నది ఎంత ఎక్కువంటే - ప్రతివాడికీ యాభై నుంచి వంద మంది దాకా స్త్రీలు, పురుషులు, పిల్లలు పట్టుబడ్డారు. ఏ సైనికుడూ ఇరవై మందికి తక్కువ తీసుకోలేదు. అలాగే కెంపులు, వజ్రాలు, ముత్యాలు, రత్నాలు విపరీతంగా దొరికాయి. హైందవ స్త్రీల నుంచి లాక్కున బంగారం, వెండి ఆభరణాల రాశులకైతే లెక్కే లేదు. సయ్యిద్‌లు, విద్వాంసులు, మిగతా ముసల్మాన్లు నివసించే ప్రాంతం మినహా మొత్తం నగరాన్ని ధ్వంసం చేశాం.)

చేయించిన వాడే స్వయంగా చెబుతున్నాడు కనుక నిజంగా ఇలా జరిగిందా, గిట్టని దుర్మార్గులెవరైనా అబద్ధాలు రాశారా అని సందేహించాల్సిన పనిలేదు. తైమూరు గారి లెక్క ప్రకారం ఢిల్లీ చేరే సమయానికి ఆయన దగ్గర కనీసం 90 వేల సైనికులు ఉండి ఉండాలి. అంత మందీ ఆవురావురుమని ఊరి మీద పడి తలా యాభై వందా చొప్పున హిందువుల్ని చెరబడితే తలకు ఇరవై అనుకున్నా పరువుగల స్త్రీలు, పసిపిల్లలు, గౌరవంగా గర్వంగా బతికే గృహస్థులు హీనపక్షం 18 లక్షల మంది తురుష్కులకు చిక్కి వారికో, వారి నుంచి కొనుక్కున్న వారికో బానిసలై బతికినంత కాలం ఘోర నరకం అనుభవించి ఉండాలి కదా? మూడు రాత్రులు, మూడు పగళ్లు 90 వేల సైనికులు ఢిల్లీ నగరం మీద పడి కనిపించిన హిందువునల్లా నరికి పారేస్తూ పోతే ఆ హింసాగ్ని కీలల్లో ఎన్ని లక్షల ప్రాణాలు భస్మమై ఉండాలి? ఒక్కొక్కడూ రోజుకు ఇద్దరిని చంపినా మూడు రోజుల భయానక నరమేధంలో దారుణంగా నిహతులైన అభాగ్యుల సంఖ్య (2 × 3 × 90,000) తక్కువలో తక్కువగా నాలుగున్నర లక్షల పైనే ఉండాలి కదా? ధన మాన ప్రాణాలను హరించడానికి తరుముకు వస్తున్న పిశాచి మూకల బారిన పడకుండా ఉండాలని ప్రియాతిప్రియమైన పిల్లలనూ, ప్రాణంలో ప్రాణమైన ఇల్లాళ్లను కూడా బతికుండగానే తామే తగులబెట్టి, హైందవ గృహస్థులు శత్రువులతో తలపడ్డారంటే వారిని అంతటి భయంకర నిర్ణయానికి నెట్టిన భయాలు, దిగుళ్లు ఎంత బలమైనవి అయి ఉండాలి?

మరి – తలచుకుంటే ఒళ్లు జలదరించే ఆ భయానక మారణ, విధ్వంస కాండకు మన దేశవాళీ చరిత్రకారులు ఎలా స్పందించారు? రాజధానిలో లక్షలాది అమాయకులను బలిగొని, లక్షల కుటుంబాల్లో నిప్పులు పోసిన ఆ ఘోర దురంతం గురించి ఈ కాలపు వారికి ఎటువంటి అవగాహన కలిగించారు?

ఎన్.సి.ఇ.ఆర్.టి (విద్యా విషయాల పరిశోధన, శిక్షణలకు సంబంధించిన జాతీయ మండలి) వారు 11వ తరగతి విద్యార్థుల పారాయణకు నిర్దేశించిన ***Medieval India*** పాఠ్య గ్రంథంలో సతీశ్‌చంద్ర అనే పేరుమోసిన చరిత్రకారుడు తైమూర్‌కు కేటాయించింది–ఢిల్లీ సుల్తాన్ల అధ్యాయం చివరిలో రెండే రెండు పేరాలు! వాటిలో సెలవిచ్చింది ఇది:

> (Timur's) raid into India was a plundering raid, and its motive was to seize the wealth accumulated by the Sultans of Delhi over the last 200 years. With the collapse of Delhi Sultanat, there was no one to meet this incursion. Timur's army mercilessly sacked and plundered the various towns on the way to Delhi. Timur then entered Delhi and sacked it without mercy, large number of people, both Hindu and Muslim, as well as women and children losing their lives.
>
> Timur's invasion once again showed the dangers of a weak government in India. It resulted in the drain of large amount of wealth, gold, silver, jewellery etc., from India. Timur also took with him a large number of Indian artisans, such as masons,

stone cutters, carpenters etc. Some of them helped him in putting up many fine buildings in his capital, Samarqand. But the direct political effect of Timur's invasion of India was small..*(p.73)*

(ఇండియాలో తైమూరు చేసింది దోపిడీ దాడి. గడచిన 200 ఏళ్లలో సుల్తాన్లు పోగు చేసిన సంపదను వశం చేసుకోవాలన్నదే దాని వెనుక ఉద్దేశం. ఢిల్లీ సుల్తాన్‌గిరీ కుప్పకూలడంతో దాడిని ఎదుర్కొనే వారులేకపోయారు. తైమూర్ సైన్యం ఢిల్లీ వెళ్ళే దారిలో వివిధ పట్నాలను నిర్దాక్షిణ్యంగా ధ్వంసం చేసి దోచుకున్నది. ఆనక తైమూర్ ఢిల్లీలో ప్రవేశించి దయ లేకుండా ధ్వంసం చేశాడు. హిందువులు, ముస్లింలు కూడా స్త్రీలు, పిల్లలు సహా పెద్ద సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకున్నారు.

ఇండియాలో బలహీన ప్రభుత్వం వల్ల వాటిల్లే ప్రమాదాలను తైమూరు దండయాత్ర మరోసారి చూపించింది. ఇండియా నుంచి పెద్దమొత్తంలో సంపద, బంగారం, వెండి, ఆభరణాలు కొల్లగొట్టడానికి అది దారితీసింది. తైమూర్ తనతో బాటు తాపీ పనివారు, రాళ్లు కొట్టేవారు, వడ్రంగులు వంటి చేతి పనివారిని కూడా పెద్ద సంఖ్యలో తీసుకుపోయాడు. అతడి రాజధాని సమర్‌ఖండ్‌లో ఎన్నో గొప్ప కట్టడాలను నిర్మించడానికి వారిలో కొందరు సాయపడ్డారు. కాని - ఇండియాపై తైమూరు దండయాత్ర వల్ల ప్రత్యక్ష రాజకీయ ప్రభావం చాలా స్వల్పం...)

ఇదీ - మహా మేధావులనుకునే మన మార్క్సిస్టు చరిత్రకారులు జాతి అనుభవించిన ఘోరకలి గురించి నవతరానికి నూరిపోస్తున్న సోకాల్డ్ 'చరిత్ర'!

ఇండియా మీదికి తాను దండెత్తింది ఎందుకన్న విషయంలో తైమూర్‌కు ఎలాంటి సందేహమూ లేదు.

"My object in the invasion of Hindustan is to lead an expedition against the infidels...(so that) the army of Islam might gain something by plundering the wealth and valuables of the Hindus... we may convert to the true faith the people of that country, and purify the land from the filth of infidelity and polytheism; and that we may overthrow their temples and idols and become ghazis and mujahids before God."

[***Tuzuk i Timuri*** - **Elliot & Dowson** *Vol-III Page 397*]

(హిందుస్తాన్‌పై దండయాత్రలో నా ఉద్దేశం అవిశ్వాసుల మీదికి దాడిచేయాలని.. హిందువుల సంపదను, విలువైన వస్తువులను కొల్లగొడితే ఇస్లాం సైన్యం కొంత లాభపడుతుందని.. ఆ దేశంలోని ప్రజలను నిజమైన మతంలోకి మార్పించవచ్చునని.. బహు దేవతలను ఆరాధించే, అవిశ్వాసుల కశ్మలం నుంచి ఆ నేలను క్షాళన చేయవచ్చుని.. అక్కడి గుడులను, విగ్రహాలను పడగొట్టి దేవుని ముందు మనం ఘాజీలు, ముజాహిద్‌లు కావచ్చునని) అని తైమూరే స్పష్టంగా చెప్పాడు. కాని - మన ప్రఖ్యాత చరిత్రకారులు మాత్రం దోపిడీ మినహా తైమూర్‌కు

మరో ఆలోచనే లేదని ఢంకా కొట్టి చెబుతున్నారు. తైమూర్ ఆంతర్యం ఏమిటో తైమూర్ కంటే సతీష్‌చంద్రలకే బాగా తెలుసు కాబోలు. కాలు బయటపెట్టింది మొదలుకుని స్వదేశం తిరిగి వెళ్ళేంత వరకూ తైమూర్ వేసిన ప్రతి అడుగులోనూ. పలికిన ప్రతి పలుకులోనూ ఇస్లామిక్ మతతత్వం, హిందువులపై ద్వేషం, విగ్రహాలను, విగ్రహారాధకులను నాశనం చేయాలన్న ఉన్మాదం తొణికిసలాడుతున్నా సూడో సెక్యులర్ గంతలు తగిలించుకున్న మన చరిత్రకారుల కళ్లకు తైమూరులో వట్టి బందిపోటు మాత్రమే కనపడ్డాడు. భట్నీర్ కోటలో పదివేల మంది విశ్వాసరహితుల తలలు అతివేగంగా నరికించానని తైమూరే గర్వంగా చెప్పిన సంగతి వారికి పట్టలేదు. ఢిల్లీ వెళ్ళబోయే ముందు లక్ష మంది ఊచకోత కూడా చరిత్రలో రికార్డు చేయదగ్గ అంశంగా వారికి కనిపించలేదు. 'లోనీ'లో పట్టుబడిన ఖైదీల నుంచి ముసల్మాన్లను వేరు చేసి కాపాడాలని, మిగతా వారిని కత్తివేటుతో నరకానికి పంపాలని ఆజ్ఞాపించాననీ... ఢిల్లీలో ముసల్మాన్లు నివసించే ప్రాంతాలను మాత్రం వదిలేసి మిగతా నగరాన్ని, మిగతా జనాభాను నాశనం చేశాననీ తైమూరే ప్రకటించినా సరే హిందువులపైనే హింసాకాండ జరిగిందని ఒప్పుకునేందుకు ఘనత వహించిన చరిత్రకారుడికి చేతులు రాలేదు. హిందువులతోబాటు ముస్లింలు కూడా స్త్రీలు, పిల్లలు సహా ఎందరో ప్రాణాలు కోల్పోయారని తూకాయించి రెండు మతాలనూ కృత్రిమంగా బాలన్సు చేస్తే గానీ మన మేధావుల సూడో సెక్యులర్ సెంటిమెంట్లు సమాధానపడలేదు. పశువుల్లా తోలుకుపోయి జీవించినంత కాలం బానిసల్లా బతకమని తురుష్కులు శపించిన లక్షలాది అభాగ్యుల దయనీయ దుర్గతి మన చరిత్రకారుల ప్రగతిశీల దృష్టికి ఆనలేదు. తైమూరు వెంట వెళ్ళి అతడి రాజధానిలో కళాత్మక నిర్మాణాలకు సాయపడ్డ చేతిపనుల వారు మాత్రమే మన కళ్లులేని చరిత్రకారుల కటాక్ష వీక్షణానికి నోచుకున్నారు.

ఆధునిక పాఠ్యగ్రంథంలో అభినవ చరిత్రకారుల పోకడను బట్టి ఢిల్లీ సుల్తాన్ల మీద అక్కసుతో ఇండియాకు వచ్చి, ఇక్కడి సంపదను కొల్లగొట్టి, మత ప్రసక్తి పెట్టుకోకుండా హిందువులతోబాటు ముసల్మాన్లనూ సమానంగా హింసించి, పోతూ పోతూ ఇక్కడి శిల్పులను కళాభిరుచితో గౌరవంగా తీసుకుపోయి వారిచేత చక్కని కట్టడాలు నిర్మించుకున్న సెక్యులర్ కళాపోషకుడుగా మాత్రమే తైమూరును మనం గుర్తుపెట్టుకోవాలా? దేశ రాజకీయ జీవితంపై తైమూర్ దండయాత్ర ప్రభావం చాలా స్వల్పమని మన నిపుణుల వారు ఒట్టేసి చెబుతున్నారు కనక అసలు అతడి పేరునుగాని, అతడి పనులను గాని మనం ప్రత్యేకంగా గుర్తుపెట్టుకోవడమే దండుగ అనుకోవాలా?

గజనీగారి కళాపోషణ

'మీ వాడు పరీక్ష పాసయ్యాడా?'

'లేదు. గజనీ మహ్మద్‌లా ఇంకా దండయాత్రలు చేస్తూనే ఉన్నాడు.'

ఇది దేశంలో తరచూ వినిపించే జోకు. వరసగా పరీక్షలు తప్పే వాడిని గజనీ మహ్మద్‌తో పోల్చటం వల్ల... గజనీ 17 దండయాత్రలు చేస్తే మనవాడు 7 దండయాత్రలు చేశాడని నవ్వుకుంటూండటం వల్ల... గజనీ అనగా ఒక అసమర్థుడని, యుద్ధంలో గెలవలేక వరసగా ఓడిపోయి, విసుగు లేకుండా మళ్లీ మళ్లీ దండయాత్రల విఫల యత్నాలు చేసినవాడనీ జనం మనసులో ముద్రపడిపోయింది. లోకులు పలుగాకులు కనుక... ఎవరు ఏమిటి అన్న చారిత్రక నిజాలు అమాయక జనానికి తెలియవు కనుక... అజ్ఞానులు లెమ్మని సరిపెట్టుకుందాం.

కాని... ప్రపంచ చరిత్రను, భారత చరిత్రను అగస్త్యుడిలా ఆపోశన పట్టి... హిస్టరీ మిస్టరీలు ఛేదించి తమ జ్ఞానామృతాన్ని లోకానికి పంచిన మహామేధావులకయినా గజనీ మహ్మద్ ఎటువంటి వాడో, ఏమి చేశాడో సరిగా తెలుసు అని చెప్పగలమా? !

మాట వరసకు జవహర్‌లాల్ నెహ్రూ ! చాదస్తాలూ, రాగద్వేషాలూ పెట్టుకోకుండా భారత చరిత్రను ఆధునిక దృష్టితో అవలోకించి, వ్యక్తులనూ వారి తత్వాలనూ అవి ప్రభావితం చేసిన శక్తులనూ శాస్త్రీయంగా మదింపు చేసే ఉద్దేశంతో విరచించిన **'ది డిస్కవరీ ఆఫ్ ఇండియా'** గ్రంథంలో గజనీ గురించి నవ భారత నిర్మాత నెహ్రూ తేల్చిందిది:

> "Mahmud was far more a warrior than a man of faith and like many other conquerors he used and exploited the name of religion for his conquests. India was to him just a place from which he could carry off treasure and material to his homeland... Mahmud was anxious to make his own city of Ghazni rival the great cities of central and western Asia and he carried

off from India large numbers of artisans and master builders. Building interested him and he was much impressed by the city of Mathura... About this he wrote: "There are here a thousand edifices as firm as the faith of the faithful; nor is it likely that this city has attained its present condition but at the expense of many millions of dinars, nor could such another be constructed under a period of 200 years."

[The Discovery of India, page 235]

(మత విశ్వాసం కంటే ముఖ్యంగా మహ్మద్ యోధుడు. చాలామంది విజేతల్లాగే అతడు తన దండయాత్రలకు మతం పేరును వాడుకున్నాడు. అతడి దృష్టిలో ఇండియా అనేది - తన స్వస్థలానికి సంపదను, సామగ్రిని తరలించుకుపోవడానికి ఉపయోగపడే ప్రదేశం. మధ్య ఆసియాలో, పశ్చిమ ఆసియాలో ఉన్న గొప్ప నగరాలకు దీటుగా తన గజనీ నగరాన్ని తయారు చేయాలని అతడు ఆరాటపడ్డాడు. ఇండియా నుంచి చేతి పనివారిని, భవన నిర్మాణ ప్రవీణులను పెద్ద సంఖ్యలో అతడు తీసుకుపోయాడు. కట్టడాలంటే అతనికి ఆసక్తి. మధుర నగరం నిర్మాణాలను చూసి మహా. అబ్బురపడ్డాడు... దీని గురించి అతడు ఇలా రాశాడు... 'ఇక్కడ ఆస్తికుడి విశ్వాసమంత పటిష్ఠమైన వెయ్యి ప్రాసాదాలు ఉన్నాయి. ఎన్నో కోట్ల దీనారాలు ఖర్చు పెడితే గానీ ఈ నగరం ఇప్పుడీ స్థితికి చేరేది కాదు. ఇంకో రెండొందల ఏళ్ళ కాలంలో ఇలాంటివి మళ్ళీ ఎవరూ కట్టలేరు')

పండిట్ నెహ్రూ గారి ఈ వాక్చిత్రాన్ని చదివితే ఎలాంటి మనిషి మన మనసులో మెదలుతాడు? మన కట్టడాలను చూసి తెగమెచ్చుకుని, అలాంటివి తన నగరంలోనూ కట్టించాలన్న కళాత్మక తపనతో ఇక్కడి శిల్పులను, హస్త కళాకారులను గౌరవంగా తోడ్కొని పోయిన కళాపోషకుడు గజనీ మహ్మద్ అన్న అభిప్రాయం సహజంగానే కలుగుతుంది కదా? కాని - వాస్తవం ఏమిటి?

మధురలో మహాద్భుతమైన దేవాలయాలను చూసి గజనీ మహ్మద్ నిర్ఘాంతపోయిన మాట యథార్థం. వాటిని అతగాడు చాలా గొప్పగా మెచ్చుకున్న సంగతీ అక్షరాలా నిజం. ఆ కాలంలో గజనీ మహ్మద్‌కు పర్సనల్ సెక్రటరీలా పనిచేసిన అబూనాసర్ ముహ్మద్ ఇబ్నె ముహ్మద్ అల్ జబ్బారల్ ఉత్బి (క్లుప్తంగా **'అల్ ఉత్బి'**) రాసిపెట్టిన ***Tarikh Yamini*** గ్రంథమే ఇందుకు సాక్ష్యం. మధుర గుడి, గోపురాల గురించి **అల్ ఉత్బి** రాసిందిది.

In the middle of the city there was a temple longer and firmer than the rest... The Sultan thus wrote respecting it: "If any should wish to construct a building equal to this, he would not be able to do it without expending an hundred thousand thousand red dinars, and it would occupy two hundred years, even though the most experienced and able workmen were employed..."

(నగరం మధ్యలో ఓ దేవాలయం ఉంది. మిగతా గుడుల కంటే అది పెద్దది. దృఢమైంది. దాని గురించి సుల్తాన్ ఇలా రాశారు: 'దీనితో సమానమైన భవనాన్ని

ఎవడైనా కట్టాలనుకుంటే పదికోట్ల దీనారాలు ఖర్చు చేయాలి. అత్యంత అనుభవం, సామర్థ్యం ఉన్న పనివాళ్లని పెట్టినా పూర్తి కావడానికి రెండు శతాబ్దాల సంవత్సరాలు పడుతుంది.)

గజనీ మహ్మద్ గురించి ప్రపంచంలో ఎవరు రాసిన దానికైనా ముఖ్యాధారం **ఉత్బీ** రాతలే. నెహ్రూ గారు కూడా ఇదే విని ఉండాలి. అయితే హిందూ దేవాలయాన్ని సుల్తాన్ మెచ్చుకున్నాడు అంటే బావుండదు కనక 'నగరంలోని నిర్మాణాలకు అబ్బురపడ్డాడు' అని పండిట్జీ సెక్యులర్ మర్యాదను పాటించారు. బాగానే ఉంది. కాని – ఒకటే లోటు. మధురలో దేవాలయ నిర్మాణాలను అంతగా మెచ్చుకున్న సుల్తన్‌గారు ఆ తరవాత ఏమి చేశారో నెహ్రూజీ పట్టించుకోలేదు. గజనీ మాటలను ఆయన చెవిన వేసిన మహాత్ములు ఆ తరవాత గజనీ గారి చేతలను దాచిపుచ్చి ఉండాలి. గజనీ గారి కళా ప్రియత్వానికి సర్టిఫికెటు ఇచ్చే ముందు **ఉత్బీ** రచనను నెహ్రూ పండితుడు కొంచెం పరిశీలించి ఉంటే బావుండేది. గొప్ప పనివాళ్ళను పెట్టి పదికోట్ల దీనారాలు వెచ్చించి రెండొందల ఏళ్ళు కష్టపడ్డా ఇలాంటి వాటిని నిర్మించలేమని వాల్యుయేషన్ ఎసెస్మెంటు భేషుగ్గా చేసిన సుల్తాన్ మహ్మద్ గారు ఆ వెనువెంటనే అంతటి అపురూప అద్భుత నిర్మాణాలకు అర్పించిన నివాళి ఎలాంటిదో – అదే పేరాలో **AL UTBI** ఇలా రాశాడు:

"The sultan gave orders that all the temples should be burnt with naphtha and fire and levelled with the ground".

[Tarikh Yamini, **Elliot & Dowson,** *Vol-II, Page 45]*

(నాఫ్తా, నిప్పుతో మొత్తం అన్ని దేవాలయాలను తగలబెట్టి నేలకూల్చుమని సుల్తాన్ ఉత్తర్వులిచ్చాడు)

ఇక గజనీ గారి మధురా విజయం గురించి నిజాముద్దీన్ అహ్మద్ తన ***Tabakat - i Akbari*** లో ఇలా రాశాడు.

..."the king arrived at Mathura, which was a very large city full of magnificient temples. It is the birth place of Krishn (or) Basdeo, whom the Hindus venerate as an incarnation of God. When the Sultan reached the city no one came out to oppose him. The Sultan's army plundered the whole city and set fire to the temples. They took up immense booty and by the Sultan's order they broke up a golden image which was ninety eight thousand three hundred miskals in weight...)

[Elliot & Dowson, *Vol.II, Page 460-61***]**

(... రాజు మధుర ప్రవేశించాడు. ఆ నగరం నిండా అత్యద్భుతమైన దేవాలయాలు ఉన్నాయి. దేవుడి అవతారమని హిందువులు విశ్వసించే కృష్ణ వాసుదేవుడి జన్మస్థలమది. సుల్తాన్ ఆ నగరానికి వెళ్ళేసరికి ఎదిరించడానికి ఎవరూ లేరు. సుల్తాన్ సైన్యం మొత్తం నగరాన్ని కొల్లగొట్టి దేవాలయాలకు నిప్పుపెట్టింది. వారికి బ్రహ్మాండమైన సొత్తు స్వాధీనమైంది. సుల్తాన్ ఉత్తర్వుపై వారు తొంభై ఎనిమిది

వేల మూడొందల మిస్కళ్ళ బరువున్న బంగారు విగ్రహాన్ని పగులగొట్టారు...)

క్రీ.శ. 1000 నుంచి మొదలు పెట్టి 1026 వరకూ గజనీ మహమ్మద్ ఇండియాపై ఏకంగా 17 దండయాత్రలు చేశాడు. వాటిలో ఏదో కృష్ణుడి కర్మం చాలక ఒక్క మథురలోనే దేవాలయాల మీద, గ్రహాల మీద అతడు ప్రతాపం చూపాడనీ, అది మినహా మిగతా సమయాల్లో సౌమ్యంగా ఉండి, తన దోపిడీ పని ఏదో తాను చూసుకుపోయాడనీ చెప్పటానికి వీలు లేదు. జవహర్‌లాల్ నెహ్రూ వంటి జాతీయ నాయకుల నుంచి రొమిల్లా థాపర్, సతీశ్‌చంద్ర వంటి ఎర్రకళ్ళద్దాల మార్క్సిస్టు చరిత్రకారుల వరకూ 'ప్రగతిశీల మేధావుల'ందరూ గజనీ వట్టి గజదొంగేనని, మతాన్ని ముసుగుగా వాడుకున్నాడే తప్ప మత విశ్వాసాల మీద అతనికి నిజంగా మక్కువ లేదని ఒక్కగొంతుతో బహు చక్కని 'జాతీయ ఏకాభిప్రాయాన్ని' ఆవిష్కరించడం భేషుగ్గానే ఉంది. కాని గజనీ మహ్మద్ గారి చేతలను, ఆ కాలంలో ఆయనకు సన్నిహితంగా ఉన్నవారి రాతలను గమనిస్తేమాత్రం ఈ సోకాల్డ్ చరిత్రకారుల ఏకాభిప్రాయానికీ, అసలు వాస్తవానికీ ఆమడ దూరం ఉందని స్పష్టం. గజనీ మహ్మద్‌కు సంబంధించినంత వరకూ ఆ దండయాత్ర, ఈ దండయాత్ర... ఆ ఊరు, ఈ ఊరు.. ఆ గుడి ఈ గుడి... అన్న తేడా లేదు. ఆలయ విధ్వంస పుణ్యకార్యంలో ఆయనకు అన్ని ఊళ్లూ, అన్ని ఆలయాలూ, హిందువుల అందరు దేవుళ్లూ సమానమే! అదేవిధంగా కాఫిర్లపై అతడు ఎత్తిన కత్తికి శత్రు సైనికులు, సామాన్య ప్రజలు అన్న తేడా తెలియదు! వరసబెట్టి అందరినీ ఊచకోత కోయడమే!!

తన బాస్‌గారి కళాత్మక విధ్వంసం, ప్రబోధాత్మక జన సంహారాల గురించి పైన ప్రస్తావించిన **AL UTBI** తన ***Tarikh Yamini*** లో ప్రత్యక్షంగా తెలుసుకుని, సాధికారికంగా రికార్డు చేసినదాని నుంచి ఈ మచ్చుతునకలను చిత్తగించండి:

విగ్రహారాధన నుంచి 'హింద్'ను ప్రక్షాళన చేసి, ఆయా స్థలాల్లో మసీదులను నిర్మించిన మీదట సుల్తాన్ మళ్ళీ (క్రీ.శ. 1013లో) విగ్రహాలను పూజించే వారిని శిక్షించడానికి 'హింద్' మీదికి దండు వెడలాడు.. [**Elliot & Dowson** *Vol.II Page 37*]

పెద్ద ఎత్తున సంపదను మోసుకుని సుల్తాన్ వెనక్కి వచ్చాడు. ఆయన పట్టుకొచ్చిన బానిసలు ఎంత మందంటే... మార్కెట్లో బానిసల ధర బాగా పడిపోయింది. తమ మాతృభూమిలో ఎంతో గౌరవంగా బతికిన కులీనులు మామూలు దుకాణదారులకు బానిసలుగా దిగజారిపోయారు. ఇది దేవుడి మంచితనం. తన సొంత మతానికి గౌరవాలు కురిపించి అవిశ్వాసాన్ని ఆయన దిగజార్చుతాడు (పేజీ 39).

మత ఘాతకుల రక్తం ఎంత ధారాళంగా పారిందంటే దానివల్ల స్వచ్ఛమైన నదీ ప్రవాహం రంగు మారింది. ఆ నీటిని జనం తాగలేకపోయారు. సమయానికి చీకటి పడకుండా ఉంటే ఇంకా ఎందరో శత్రువులను నరికివేసేవాళ్ళం. ఈ విజయం దేవుని దయవల్ల సిద్ధించింది. (పేజీ 40).

కనోజ్‌లో పదివేల గుడులు ఉన్నాయి... తాము భక్తితో కొలిచిన మూగ, చెవిటి విగ్రహాలకు పట్టిన గతి చూసి ఆ పట్నం వాసులు భయంతో వణికి దిక్కులేని వితంతువుల్లా, అనాథల్లా పారిపోయారు, పరారవకుండా మిగిలినవారిని చంపేశారు. సుల్తాన్ అక్కడి ఏడు కోటలనూ ఒకే రోజు పట్టుకున్నాడు. ఇష్టం వచ్చినట్టు దోచుకొని, బందీలను పట్టుకోవటానికి ఆయన

సైనికులకు సెలవు ఇచ్చాడు. (పేజీ 46)

తన అనుచరుల్లోకెల్లా ఎక్కువ మత విశ్వాసం కలిగిన వారిని సుల్తాన్‌గారు పిలిచి శత్రువుపై వెంటనే దాడి చేయమన్నాడు. ఆకస్మిక దాడిలో ఎంతోమంది విశ్వాసరహితులను నరికేశారు. ఎంతో మందిని బందీలుగా పట్టుకున్నారు. సూర్యుడిని, అగ్నిని ఆరాధించే అవిశ్వాసులను సంపూర్ణంగా ఊచకోత కోసేంతవరకూ ముసల్మాన్లు దోపిడీ సొత్తు సంగతి పట్టించుకోనే లేదు. (పేజీ 49)

ఈ కాల్చివేతలూ, నరికివేతలూ అన్నీఒక ఎత్తు అయితే సోమనాథ్‌లో గజనీ మహ్మద్ సాగించిన విధ్వంసాలు, ఊచకోతలు ఇంకో ఎత్తు. క్రీ.శ. 1024లో హిందూ దేశంపై గజనీ 16వ దండయాత్రలో జరిగిన ఈ దారుణ దురాగతాన్ని తలచుకుంటే మనిషనేవాడికి అన్నం సయించదు. సోమనాథ్ మీద గజనీ ప్రతాపం గురించి అనంతర కాలంలో వచ్చిన గ్రంథాలన్నిటికీ **Ibn Asir** రాసిన **Kamilu - t Tawarikh** ఆధారం. అందులో చెప్పింది:

'సోమనాథుడు హిందుస్తాన్‌లోని దేవతా మూర్తులందరిలోకీ గొప్పవాడు. గ్రహణం పట్టిన రాత్రి కనీసం లక్షమంది హిందువులు ఈ గుడిని దర్శించుకునేవారు... వెలలేని కానుకలు ఇక్కడ భక్తులు సమర్పించుకునే వారు... ఈ గుడికి మాన్యంగా పదివేల గ్రామాలు ఉండేవి. ఎవరూ విలువ కట్టలేనంతటి నగలూ, వజ్ర వైఢూర్యాలూ ఇక్కడ రాశులుగా పడి ఉండేవి. హింద్‌లో గంగ అని గొప్ప నది ఉంది. దాని నీరు మహా పవిత్రమైనదని ప్రజల నమ్మకం. ఆ నదికీ సోమనాథ్‌కూ మధ్య దూరం 300 పారసంగులు (వెయ్యి మైళ్ళు). అంతదూరం నుంచి రోజూ గంగా జలాన్ని తెచ్చి దేవతామూర్తిని కడిగేవారు. యాత్రికుల తలలూ, గడ్డాలూ గొరగటానికి 300 మంది క్షురకులు ఉండే వారు. గుడిలో పాటలు పాడి, నృత్యం చేయటానికి మూడొందల యాభై మందిని పెట్టుకునేవారు. వీరిలో ప్రతి ఒక్కరికీ రోజుకింత అని భృతి ఉండేది.

మహ్మద్ హిందూ దేశంలో విజయాలను సాధిస్తూ విగ్రహాలను పగల గొడుతున్నప్పుడు హిందువులు ఒక భ్రమలో ఉండేవారు. ఆ దేవతా మూర్తుల మీద సోమనాథుడికి ఆగ్రహం కలిగిందనీ, ఆయన అనుగ్రహమే కనక ఉంటే ఆ విగ్రహాలను ఎవరూ ధ్వంసం చేయగలిగేవారు కాదని వారు అనేవారు. ఈ సంగతి మహ్మద్ విన్నాడు. అలా అయితే మనం ఆ విగ్రహాన్నే విరగ్గొట్టాలనీ, తమ ప్రార్థనలూ, నమ్మకాలూ అన్నీ అసత్యం, నిరర్థకం అని తెలుసుకున్నప్పుడు వారు ఇస్లాంలోకి వచ్చి తీరుతారనీ ఆయన నిశ్చయించాడు. సాయపడమని దేవుడిని ప్రార్థించి, 30 వేల ఆశ్వికులను పనివారిని తీసుకుని ఓ మంచి రోజున గజనీ నుంచి బయలుదేరాడు.

[E & D *Vol. II PP 468-69]*

తరువాత ఏమైంది?

ఎక్కడ ఆ మహ్మద్ ?

వారు నరరూప రాక్షసులు. పురాణ కాలపు రాకాసులు వారి ముందు ఎందుకూ కొరగారు. గొంతులు కోయటం, ఆస్తులు దోచటం, విలువైనదల్లా ధ్వంసం చేయటం ఒకటే వారికి తెలుసు. వారు కాలుపెట్టిన చోట పీనుగుల పోగు. వారు నడిచే దారి వల్లకాడు. వారి పాలబడిన అభాగ్యులకు చావు వరం; బతుకు శాపం.

అంతటి మహాక్రూరులు వేల సంఖ్యలో మిడతల దండులా తమ మీదికి దూసుకు వస్తున్నారని తెలిస్తే ఎంత గట్టి గుండె అయినా గజగజలాడాలి. సామాన్య జనం ప్రాణభయంతో పరుగులు పెట్టాలి.

కాని – సోమనాథ్ వాసులు హడలిపోలేదు. కించిత్తు కూడా కలవరపడలేదు. ముసల్మాన్లు తమ మీదికి మహోగ్రంగా దూసుకు వస్తున్నారని తెలిసి వారి మొహాల్లో ఆనందమే తప్ప ఆందోళన లేదు. మహాదేవుడైన సోమనాథుడి రక్షణలో ఉన్న తమను ఏ మ్లేచ్ఛుడూ ఏమీ చేయలేడని వారి నమ్మిక. తమకు హాని తలపెట్టిన వారే తమ దేవుడి క్రోధాగ్నిలో బూడిదవుతారని వారి ధీమా. మ్లేచ్ఛుల పాపం పండింది కనకే సోమనాథుడి తెరువు వచ్చారనీ... మిగతా దేవాలయాల్లో చేసిన ఆగడాలకు శిక్షించటానికే తమ దేవుడు వారిని తన సన్నిధికి రప్పించుకుంటున్నాడనీ భక్తజనం భరోసా. తమ ఇష్టదైవం ఆగ్రహ జ్వాలలకు ఆహుతి కాబోతున్న పాపుల మూకను తిలకిద్దామనే కుతూహలంతో మేడలెక్కి, మిద్దెలెక్కి కోట గోడలెక్కి ఎక్కడెక్కడి జనమూ దూసుకు వస్తున్న శత్రుసేనను నవ్వుకుంటూ చూశారు.

అది సామాన్య సైన్యం కాదు. ముప్పైవేల అశ్వబలం. అరవై దెబ్బైవేల కాల్బలం. ఇటీవలి చరిత్రలో కనీవినీ ఎరుగని సైన్య సమీకరణ. అయినా జనం భయపడలేదు. దేవతా సార్వభౌముడైన సోమనాథుడే తమ అండనుండగా శత్రువులు ఇంతకు మరింతగా విరగబడినా తమ సిగపువ్వు చెదరదని వారికి అచంచల విశ్వాసం.

కాని – ఆ అమాయక జనానికి ఒక సంగతి తెలియదు. తమకు రెండు రోజుల ప్రయాణ దూరంలో ఉన్న దాబల్వారా ప్రజలు కూడా వారిలాగే సోమనాథుడిని నమ్ముకుని ముసల్మాన్లు

మీద పడ్డా నిశ్చింతగా ఉన్నారు. సుల్తాన్ మహ్మద్ సేనలు అక్కడి కోటను పట్టుకుని, అందిన జనాన్ని అందినట్టు నరికి, ఆస్తులు దోచుకుని వికటాట్టహాసం చేస్తూ సోమనాథ్ దారి పట్టాయి. ఆ వైనం ఇక్కడి వారు ఎరుగరు. అప్పట్లో ఫోన్లూ, రేడియోలూ, టీవీలూ, న్యూస్‌పేపర్లూ లేవు గనుక తెలియకపోవడంలో వింత లేదు.

సామాన్య జనం దైవశక్తిపై నమ్మకం ఉంచి దిలాసాగా ఉన్నా వారిని రక్షించవలసిన వారు దేవుడి మీద భారం వేసి చేతులు ముడుచుకుని కూచోలేదు. సోమనాథ్ దేవాలయాన్ని గజనీ మహ్మద్ ముట్టడించి, ఊచకోత సాగిస్తూంటే అక్కడి వారు తిరగబడకుండా దేవుణ్ని ప్రార్థించుకుంటూ సాష్టాంగ పడ్డారనీ, వారే కనుక తెగించి ఎదురు తిరిగితే పరిస్థితి మరోలా ఉండేదనీ కొంతమంది తెలిసీ తెలియని మేధావులు అంటూంటారు. అది నిజం కాదు. సోమనాథ్ సంరక్షణకు హిందువులు భీకర పోరాటమే సాగించారు. వారి ధాటికి నిలవలేక అన్నివేల గుర్రాలు, సుమారు లక్ష సైనికులు గల గజనీ సేన కూడా కనీసం ఒక రోజంతా కకావికలమైంది.

సోమనాథ్ సంగ్రామం, ఎలా సాగిందో ***The History and Culture of the Indian people*** 6వ సంపుటి ***[The Struggle for Empire]*** 19, 20 పేజీల్లో ఇలా వివరిస్తుంది.

1025 జనవరిలో సోమనాథ్ చేరిన సుల్తాన్ మహ్మద్‌కు సముద్రపు ఒడ్డున దేవాలయానికి రక్షగా గట్టి బందోబస్తుతో పటిష్ఠమైన కోట కనిపించింది... మర్నాడు సుల్తాన్ దాడి ప్రారంభించాడు. కోట గోడ మీద ఉన్న సైనికులపై బాణాల వాన కురిపించి ఉన్నచోటు నుంచి తరిమివేశాడు. ముస్లింలు నిచ్చెనలు వేసుకుని కోట గోడలపైకి ఎగబాకారు. భీకరమైన యుద్ధం జరిగింది. పెద్ద సంఖ్యలో ప్రాణాలు పోయాయి. ముసల్మాన్లు కాలు నిలదొక్కుకునే లోపే కొత్త జట్టు హిందువులు ఆలయం నుంచిఉరికి వచ్చి ప్రచండంగా పోరాడారు. వారి దాడికి ముస్లింలు తట్టుకోలేక పోయారు. హిందువులు వారిని ఊరి బయటికి తరిమికొట్టారు. మర్నాడు రెట్టించిన ప్రతాపంతో సుల్తాన్ మళ్ళీ దాడి చేశాడు. హిందూ సేనలు ఎంత శౌర్యంతో నిరోధించినా ప్రయోజనం లేకపోయింది. కోటను పట్టుకోకుండా శత్రువును అడ్డుకోలేక పోయాక హిందువులందరూ ఆలయ మహాద్వారం ముందు గుమికూడారు. ముస్లింలు వారిని వెంటాడారు.

ఆ తరవాత జరిగింది భయానక ఘోరకలి. హిందువులు జట్టు జట్లుగా గుడిలోకి వెళ్ళి మహాలింగం ముందు మోకరిల్లి జయం చేకూర్చుమని ఆర్తితో అర్థించి, బయటికి వచ్చి శత్రు సేనలపైకి ఉరికారు. ముసల్మాన్లు అందిన వారిని అందినట్టు తెగ నరికారు. ఈ రకంగా ఆ ఒక్క రోజునే 50 వేల మంది హిందువులు దేవుడి మానం కాపాడటానికి ఆత్మబలిదానం చేశారు. మిగిలిన కొద్దిమంది సముద్ర మార్గాన పారిపోతుంటే ముస్లింలు వెంటపడి అందరినీ చంపేశారు. అలా ప్రతిఘటనను అంతమొందించాక సుల్తాన్ విజయగర్వంతో గుడిలో అడుగుపెట్టాడు.

సోమనాథ్ గుడి ప్రాంగణంలో ఆ రోజున 50 వేల మందిని నరికివేశారని, 20 లక్షల దీనారాలకు పైగా విలువైన సంపదను దోచుకున్నారని Ibn Asir కూడా తన ***Kamilu-t Tawarikh*** లో ధ్రువీకరించాడు.

ఆ రోజుల్లో సోమనాథ్ కలియుగ కైలాసం. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో అది సుప్రసిద్ధమైనది.

గండ శిలతో 56 స్తంభాల మీద పిరమిడ్ ఆకారంలో కట్టిన ఆ గుడి గోపురం 13 అంతస్థులు. దాని చుట్టూ 14 బంగారు గుమ్మటాలు. లింగమూర్తి చుట్టుకొలత నాలుగున్నర అడుగులు. ఎత్తు తొమ్మిది అడుగులు. అది పైకి కనిపించేది. దాని కింద కనపడని భాగం నిడివి ఆరు అడుగులు, పానవట్టం దిగువనే శివయ్య ఖజానా. దాని నిండా వెలలేని మణిమాణిక్యాలు, రత్నాభరణాలు రాశులు పడిఉండేవి. లింగమూర్తి వెలసిన గర్భగుడి మణిదీపాలతోనే ప్రకాశించేది. గర్భాలయం ఎదుట పెద్ద గంట. దానిని మోగించటానికి బంగారపు గొలుసు. దాని బరువు 200 మణుగులు. దాని నిండా చిరుగంటలు. వెయ్యి మంది అర్చకులను వంతుల వారీగా సేవకు పిలవటానికి దానిని మోగించేవారు.

అంతటి వైభవంగల సోమనాథుడి గుడిలో గజనీ మహ్మద్ కాలు మోపాక ఏమి జరిగిందో ***Tarikh-i-Alfi*** ఇలా చెబుతుంది:

> Mahmud, as soon as his eye fell on the idol, lifted up his battle axe with much anger, and struck it with such force that the idol broke into pieces. The fragments of it were ordered to be taken to Ghaznin, and were cast down at the threshold of the Jami Masjid where they are lying to this day. It is a well documented fact that when Mahmud was about to destroy the idol, a crowd of Brahmans represented (to his nobles) that if he would desist from the mutilation they would pay several crores of gold coins into his treasury. This was agreed to by many of the nobles, who pointed out to the Sultan that he could not obtain so much treasure by breaking the image, and that the proferred money would be very serviceable. Mahmud replied, "I know this; but I desire that on the day of resurrection I should be summoned with the words, 'where is that Mahmud who broke the greatest of the heathen idols?' rather than by these: 'where is that Mahmud who "sold the greatest of the idols to the infidels for gold?"

[***The History of India As told By its Own Historians,*** **Elliot & Dowson** *Vol. II PP 471-72]*

(దేవతా మూర్తి మీద కన్ను పడగానే మహ్మద్ చాలా కోపంతో గొడ్డలి ఎత్తి దాన్ని ముక్కలయ్యేంత గట్టిగా కొట్టాడు. ఆ విగ్రహ శకలాలను గజనీకి తీసుకువెళ్లి జామి మసీదు గుమ్మం ముందు పరిపించమని ఆజ్ఞాపించాడు. ఈ రోజుకీ అవి అక్కడే పడి ఉన్నాయి. దేవతా ప్రతిమను మహ్మద్ ధ్వంసం చేయబోతుండగా బ్రాహ్మణులు గుంపుగా వచ్చి ఆయన సర్దార్లకు బేరం పెట్టారు. దేవతా మూర్తిని విరగ్గొట్టకుండా వదిలేస్తే అనేక కోట్ల బంగారు నాణేలు సమర్పించుకుంటామని వేడుకున్నారు. సర్దార్లుకూడా దానికి అంగీకరించారు. విగ్రహాన్ని విరగ్గొడితే అంత సంపద రాదు కదా! వీరు ఇవ్వజూపిన మొత్తం బాగా ఉపయోగిస్తుంది కదా అని సుల్తాన్‌కు నచ్చచెప్పబోయారు. మహ్మద్ ఇలా బదులిచ్చాడు. "ఆ సంగతి నాకు

తెలుసు. కాని – పునరుత్థానం రోజున 'ధర్మదూరుల విగ్రహాలన్నిటిలోకీ గొప్పదాన్ని పగులగొట్టిన ఆ మహ్మాద్ ఎక్కడ' అని దేవుడు నన్ను పిలవనంపాలే గాని 'విగ్రహాల్లోకెల్లా గొప్పదాన్ని ధర్మదూరులకు బంగారం కోసం అమ్ముకున్న ఆ మహ్మాద్ ఎక్కడ' అని పిలవకూడదు")

ఇంత నిక్కమైన మతదీక్ష కలిగిన గజనీ మహ్మాద్‌ను కేవలం బందిపోటుగా మన సెక్యులర్ చరిత్రకారులు ముక్తకంఠంతో ముద్రవేయడం ఎంతవరకు సమంజసం? తన దృష్టిలో గడ్డిపరక విలువ చెయ్యని ఒక రాయిని పగలగొట్టకుండా విడిచిపెడితే చాలు కోట్లకొద్దీ బంగారు నాణేలు కుమ్మరిస్తామని ఆశ పెట్టినా బెసగక... ఎన్ని కోట్లయినా నాకు అక్కర్లేదు; నా మత బోధ ప్రకారం నడిచి నా దేవుడి మెప్పు పొందడమే నాకు ముఖ్యం అన్నవాడు క్రూరుడు అయితే కావొచ్చు. కాని దుర్మార్గుడు కాడు. గజనీలోనూ, ఘోరీలోనూ, మధ్యయుగంలో హిందువులపై నానా రకాల అఘాయిత్యాలకు పాల్పడ్డ మహమ్మదీయ ప్రభువుల్లోనూ, వారి చేతలను యథాతథంగా రికార్డు చేసిన మహమ్మదీయ చరిత్రకారుల్లోనూ కనీసం ఒకవిధమైన నిజాయతీ ఉంది. తమ మతం చెప్పిన ప్రకారం, సత్యమని తాము నమ్మిన దాని ప్రకారమే విగ్రహారాధకులపై, దేవతా ప్రతిమల ప్రార్థనా స్థలాలపై, అల్లాను నమ్మని కాఫిర్లపై ఆ సుల్తాన్లు దారుణమైన దాడులు చేశారు తప్ప వ్యక్తిగతమైన ద్వేషం ఉండి కాదు. పైశాచిక మనస్తత్వం ఆవహించీ కాదు. తాము చేస్తున్న పని చాలా కరెక్టనీ, దేవుడు దానిని మెచ్చుతాడనే అలా చేశారు. అందుకే ఆ ఘోరాలన్నిటినీ వీరోచిత కృత్యాలుగా, దైవారాధనలో భాగంగా నాటి మహమ్మదీయ చరిత్రకారులు దాచకుండా అక్షరబద్ధం చేశారు. ఆపాటి చిత్తశుద్ధి మనకాలపు మహాచరిత్రకారులు చాలామందికి లేదు. కుహనా లౌకికవాదపు కామెర్ల కళ్లతో వందల సంవత్సరాల కిందటి చరిత్రను అవలోకించి... ఏది ఎలా జరిగి ఉండాల్సిందో తామే నిర్ణయించి, అది అలాగే జరిగిపోయినట్టు అబద్ధాలల్లి... ఘోరాలను, నేరాలను చాపకింద కప్పిపుచ్చి... మత ప్రకోపంతో లక్షల జనాన్ని ఆరని క్షోభకు గురిచేసిన కిరాతకులను మతంతో నిమిత్తం లేని సాధారణ నేరస్తులుగా చిత్రించి, తమ సైద్ధాంతిక పైత్యాలన్నింటినీ నానా కంగాళీగా కూరి దేశ చరిత్రను వారు శాయశక్తులా భ్రష్టు పట్టించారు.

తమకు కావలసిన రీతిలో వాస్తవాలను వక్రీకరించి చరిత్రకు సున్నం కొట్టేపనికి ఆధునిక కాలంలో మొట్టమొదట ఉపక్రమించిన వాడు అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ ఆచార్యుడు ప్రొఫెసర్ **మహమ్మద్ హబీబ్**. 1924లో వెలువరించిన ***Sultan Mahmud of Ghazni*** గ్రంథంలో ఆయన సెలవిచ్చినదేమంటే – అంతులేని గనుల నుంచి తరతరాలుగా తవ్విపోసిన బంగారు, వెండి గుట్టలతో, ఎగుమతి వ్యాపారంలో అపారంగా ఆర్జించిన లాభాలతో గజనీ కాలంలో ఇండియా మహాసంపన్నంగా ఉండేదట. ఆ సిరిసంపదలన్నిటినీ గుడి భోషాణాల్లోనే భద్రపరిచేవారట. (దేవాలయాలు సేఫ్ డిపాజిట్ లాకర్లలా ఎలా మారాయో, ఎప్పుడు మారాయో, అందుకు ఆధారమేమిటో హబీబ్ సాహెబ్‌గారు చెప్పలేదు.) అలా వెర్రి ఊహతో వాటమైన అభూతకల్పన చేశాక హబీబ్ ఉవాచ:

> "It was impossible that the Indian temples should not sooner or later tempt someone strong and unscrupulous enough for the impious deed. Nor was it expected that a man of Mahmud's

character would allow the tolerance which Islam inculcates to restrain him from taking possession of the gold... when the Indians themselves had simplified his work by concentrating the wealth of the country at a few places" *(p. 82)*

(ఈ పరిస్థితుల్లో బలం, కుత్సితం ఉన్న వాడిని భారతీయ దేవాలయాలు పాపిష్టిపనికి పురికొల్పకుండా ఉండటం అసాధ్యం. ఇస్లాం ప్రబోధించే పరమత సహనాన్ని మన్నించి, బంగారం కైవసం చేసుకోకుండా నిగ్రహం చూపడం మహ్మద్ లాంటి స్వభావం ఉన్న వారి వల్లకాదు... దేశంలోని సంపద అంతటినీ కొద్ది స్థలాల్లో కేంద్రీకరించడం ద్వారా భారతీయులే అతడి పనిని సులభం చేశారు.)

మతావేశం కాక దోపిడీ యావే మహమ్మదీయ సుల్తాన్లను దేవాలయ విధ్వంసానికి పురికొల్పిందన్న హబీబ్‌గారి సూత్రీకరణే అనంతర కాలంలో 'సెక్యులర్' చరిత్రకారులందరికీ దారిదీపమైంది. ఆ సమయాల్లో జరిగిన అమాయక హిందువుల ఊచకోతలుగాని, జనావాసాల విచ్చలవిడి విధ్వంసాలుగాని, వాటిని ప్రేరేపించిన ఇస్లామిక మతతత్వంగాని వెలికి రాకుండా ఈ కుహనా చరిత్రకారులు శాయశక్తులా అబద్ధాల తెరలు కట్టారు. దేశమంతటా 11వ తరగతి విద్యార్థుల నిమిత్తం ఎన్.సి.ఇ.ఆర్.టి. వారు వెలువరించిన మధ్యయుగ భారత చరిత్ర గ్రంథంలో **సతీశ్‌చంద్ర** కూడా ఇదే తీగను దొరకబుచ్చుకుని మధ్యాసియాలో తన శత్రువులను గెలిచేందుకు వనరులు సమకూర్చుకోవడానికే గజనీమహ్మద్ ఆలయాలను దోచుకున్నాడని, దాన్ని కప్పిపుచ్చుకుందుకే విగ్రహ విధ్వంసకుడుగా పోజుపెట్టాడని భావిపౌరులకు నూరి పోశాడు.

అసలు ఘోరాలే జరగలేదనీ, జరిగినా అవి కొద్దిమంది వ్యక్తుల వల్లే జరిగాయి తప్ప మత ప్రమేయం దానికి లేదనీ, హిందువుల దేవాలయాల్లో సంపదను దోచుకోవడం కోసమే దాడులు జరిగాయనీ నమ్మబలికే చరిత్రకారులు – సదరు బందిపోట్లు దోపిడీతో ఆగకుండా విగ్రహాలను, ఆలయాలను రోజుల తరబడి కష్టపడి ఎందుకు ధ్వంసం చేశారో వివరించలేదు. దోచుకోవడమే ధ్యేయమైతే ఆ పని కాస్తా పూర్తయ్యాక విలువైనవన్నీ కొల్లగొట్టుకు పోయాక మళ్లీ ఆ ఆలయాల జోలికి ఎవరూ పోరుకదా? మరి మహమ్మదీయ సుల్తాన్లు మళ్లీ మళ్లీ అవే ఆలయాలపై ఎందుకు దాడులు చేశారు? పునర్నిర్మించేందుకు ఏకాస్త ప్రయత్నం జరిగినా పగబట్టినట్టు ఎందుకు కూలగొట్టారు?

మళ్లీ సోమనాథ్ దగ్గరికే వద్దాం. మణుగుల కొద్దీ బంగారాన్ని, రాశుల కొద్దీ వజ్రవైఢూర్యాలను గజనీ మహ్మద్ అక్కడి నుంచి తన దేశం తరలించుకుపోవడంతో సోమనాథుడి పాట్లు తప్పలేదు. కూలిన పవిత్ర దేవాలయాన్ని అనేక దశాబ్దాలు అష్టకష్టాలు పడి హిందువులు మళ్లీ కట్టుకున్నారు. కొంతకాలం సాఫీగా పూజా పునస్కారాలు జరిగాయో లేదో అల్లావుద్దీన్ ఖిల్జీ (మామ జలాలుద్దీన్‌ను చంపి) 1296లో ఢిల్లీ సుల్తాన్ అయ్యాడు. ఆ మరుసటి సంవత్సరం తనకు కుడి ఎడమ భుజాలైన ఉలుఘ్‌ఖాన్, నస్రత్‌ఖాన్‌లను పెద్ద సైన్యంతో గుజరాత్ మీద దండయాత్రకు పంపాడు. సూరత్, కాంబే రేవు పట్నాలను కొల్లగొట్టాక ఆ సేనలు సోమనాథ్ మీద విరుచుకుపడ్డాయి. అడ్డు వచ్చిన వారిని నరికివేసి, అగ్గి పెట్టి అక్కడ నానా విధ్వంసం ఎలా చేసింది ***Tarikh-i-Firuz Shahi*** లో ఆ కాలపు

చరిత్రకారుడు జియావుద్దీన్ ఇలా రాశాడు.

> Gujarat became a prey to the invaders, and the idol, which after the victory of sultan Mahmud and his destruction, the Brahmans had set up under the name of Somanat, for the worship of the Hindus, was carried to Delhi where it was laid for the people to tread upon...
>
> *(మొత్తం గుజరాత్ ఆక్రమణదారుల భోజ్యమైంది. సుల్తాన్ మహ్మద్ విజయం, ఆయన చేసిన విధ్వంసం తరవాత హిందువుల ఆరాధన కోసం సోమనాథుడి పేర బ్రాహ్మణులు నెలకొల్పిన ప్రతిమను ఢిల్లీ తీసుకెళ్లి నడిచే దారిలో జనం కాళ్లతో తొక్కేలా పరిపించారు...)*

మళ్ళీ గుడి కట్టిన నేరానికి పెద్ద సంఖ్యలో హిందువులను నరికి పోగులు పెట్టి, ఆలయాన్ని నేలమట్టం చేయడంతో ఆగక అదే స్థలంలో విజయ చిహ్నంగా మసీదును నిర్మించినట్టు **ముల్లాఅబ్దుల్ ఖదీర్ బాదౌని** తన ***Muntakhabu 't- Tawarikh*** లో రాశాడు. అంత ధ్వంసం జరిగినా సోమనాథుడి మీద భక్తిని చంపుకోలేక హిందువులు కాలు చెయ్యి కూడదీసుకుని మళ్లీ గుడి కట్టారు. తుగ్లక్ సుల్తాన్ల పనుపున గుజరాత్‌లో గవర్నరుగా ఉండి అనంతరం స్వతంత్ర ప్రభువుగా అవతారమెత్తిన ముజాఫర్ షా 1392లో సోమనాథ్‌పై దండెత్తి, పునర్నిర్మాణానికి సాహసించిన కాఫిర్లను చంపి, కట్టిన గుడిని కూల్చివెళ్లాడు. పట్టు వదలని హిందువులు పర్యవసానాలకు వెరవక మళ్లీ గుడి కట్టారు. 1401లో ముజఫర్ షా మళ్లీ వచ్చి జన సంహారం సాగించి గుడి కూలగొట్టి ఆ శిథిలాల మీద ఇంకో మసీదును నిర్మించి వెళ్లాడు.

మళ్లీ మళ్లీ ఈ దాడులు కూడా సంపదను కొల్లగొట్టటానికే జరిగాయా? వాటికి పాల్పడిన వారు బందిపోట్లేనా?

ఘనత వహించిన చరిత్రకారులే చెప్పాలి.

"I have heard that the Turks have invaded your dominions, and have spread over Khurassan. If you desire it, I will join you with 5000 Cavalry, 10000 infantry and 100 elephants; but if you prefer it, I will send my son, with twice the number. In making this proposal, I do not wish to ingratiate myself with you. Though I have vanquished you, I do not desire that anyone else but my selfshould obtain the assendancy.

('నీ రాజ్యం మీదికి తురుష్కులు దండెత్తి వచ్చారని,ఖురాసాన్ ప్రాంతాన్ని ఆక్రమించారని విన్నాను. నువ్వు కావాలంటే ఐదువేల గుర్రాలతో,పదివేల సైనికులతో, నూరు ఏనుగులతో నీకు సాయంగా వస్తాను. లేదా, నీకు ఇష్టమైతే అంతకు రెండింతల బలగంతో నా కుమారుడిని పంపుతాను. నేను ఈ ప్రతిపాదన చేస్తున్నది నీ అనుగ్రహం కోసం కాదు. నేను నిన్ను పూర్తిగా పరాభవించాను. ఆ గౌరవం నాకు తప్ప ఇతరులెవరికీ దక్కకూడదని నా కోరిక.')

పంజాబ్ రాజు అయిన ఆనందపాలుడు సుల్తాన్ గజనీ మహ్మద్‌కు పంపిన లేఖ ఇది. నిజమో కాదో అని శంకించాల్సిన పనిలేదు. అనంతర కాలంలో ఏ భారతీయ చరిత్రకారుడో, ఇటీవల ఏ 'సంఘ్ పరివార్' ఆసామినో ఈ సంగతి చెప్పి ఉంటేబనాయింపు అని అనుమానించవచ్చు. కాని - ఈ సంగతి వెల్లడించింది ఆ కాలంలో జీవించి, అందునా సుల్తాన్ మహ్మద్‌కు సన్నిహితంగా మెలిగి, ఆయన ఆస్థానంలో అతిముఖ్యుడైన మహమ్మదీయ చరిత్రకారుడు **అల్‌బిరూనీ**. అదీ ఎక్కడో ఎవరికో నోటి మాటగా చెప్పింది కాదు. ప్రపంచ ప్రసిద్ధమైన తన T***arikhu-l Hind*** గ్రంథంలో ఆ కాలపు హిందూ రాజుల గుణగణాలను మెచ్చుకుంటూ "The letter which Anand Pal wrote to Amir Mahmud, at the time enmity existed between them, is much to be admired" (తమ మధ్య శత్రుత్వం

ఉన్న సమయంలో ఆనందపాలుడు అమీర్ మహ్మద్‌కు రాసిన లేఖ ఎంతో ప్రశంసనీయం) అంటూ ఆల్‌బిరూనీ ఈ లేఖను ఉటంకించాడు.

[Al Biruni, **Elliot & Dowson**, *Vol-Ii, page 12-13]*

ఈ ఉత్తరాన్ని బట్టి ఏమి తెలుస్తుంది? ఆనందపాలుడనే హిందూ రాజు గజనీ మహ్మద్‌ను అంతకు ముందు ఒక యుద్ధంలో చిత్తుగా ఓడించాడనే కదా? ఆ సంగతి నేరుగా సుల్తాన్ మహ్మద్‌కే గుర్తు చేసిన తీరును బట్టి ఈ విషయంలో సంశయానికి తావే లేదు కదా? ఆ మాట అన్నందుకు ఆల్‌బిరూనీ కూడా మెచ్చుకున్నాడే తప్ప - మా రాజును గెలిచినట్టు అబద్ధమాడాడంటూ కోపం తెచ్చుకోలేదు కదా?

మరి - హిందూ రాజు చేతిలో గజనీ మహమ్మద్ అంత చిత్తుగా ఓడింది ఏ యుద్ధంలో? హిందూ దేశం మీద గజనీ సుల్తాన్ చేశాడంటున్న 17 దండయాత్రల్లో ఎన్నో నెంబరు దానిలో? ఏ సంవత్సరంలో ఏ స్థలంలో జరిగింది ఆ చరిత్రాత్మక యుద్ధం?

అందుబాటులోని చరిత్ర గ్రంథాలన్నిటినీ తిరగేయండి. గజనీ దాడుల గురించి పేరు మోసిన స్వదేశీ, విదేశీ చరిత్రకారులు చెప్పిందంతా ఆలకించండి. కాని - ఇలాంటి యుద్ధం ఒకటి జరిగిందన్న ఊసే ఎక్కడా కానరాదు. సుల్తాన్ మహ్మద్ వెళ్ళిన చోటల్లా ఘనవిజయం లభించిందనీ, ఎన్నివేల శత్రుసేనలనైనా కొద్దిపాటి సైన్యంతో, దైవబలంతో అవలీలగా గెలిచాడని, ఇస్లామిక్ ధర్మాగ్రహ జ్వాలల్లో కాఫిర్లు మిడతల్లా మాడిపోయారని మధ్యయుగపు ముస్లిం ఆస్థాన రచయితలు రాసిందే అక్షర సత్యమని మన చరిత్రకారులూ గుడ్డిగా నమ్మారు. వాటినే కొద్దిపాటి మార్పులతో తమ తమ గ్రంథాల్లో చిలక పలుకుల్లా ఒప్పగించారు. బయటి దేశపు ముష్కరుడు తమ మీద డజనుకు పైగా దండయాత్రలు వరసబెట్టి చేస్తే... మధుర, సోమనాథ్ వంటి ప్రాచీన పవిత్ర దేవాలయాలను ధ్వంసం చేసి, జనాన్ని ఊచకోత కోసి, అపార సంపదను తరలించుకు పోతూంటే... ఇంత గొప్ప విశాల దేశంలో అడ్డుకున్న వాడు, ముష్కర మూకకు గట్టి శాస్తి చేసినవాడు ఒక్కడూ లేకపోయాడే - అని పౌరుషంగల ప్రతి భారతీయుడూ పరితపిస్తాడు కదా? అడ్డగించటం కాదు - జన్మలో మరచిపోలేని విధంగా గజనీ మహ్మద్‌ను కనీసం ఒక భారతీయ ప్రభువైనా చిత్తుగా ఓడించాడనటానికి గట్టి దాఖలా కనపడితే దానిని దొరకపుచ్చుకుని చరిత్ర చీకటి కోణాలను అన్వేషించి, వాస్తవ చరిత్రను ఆవిష్కరించటం జాతీయ మేధావుల కర్తవ్యం కాదా?

ఈ మాట 90 ఏళ్ల కిందే విఖ్యాత చరిత్రకారుడు **కొమర్రాజు లక్ష్మణరావు** అన్నారు. **'మహమూదును పంజాబు రాజయిన అనందపాలుడు పూర్తిగా పరాభవించినందులకు వొక గొప్ప యాధారము నాకు క్రొత్తగా గానుపించినది'** అంటూ అబూరిహాన్ అల్‌బిరూని ***'తారీఖ్ ఉల్ హింద్'*** నుంచి పై ఉత్తరాన్ని 1911లో వెలువడిన తన ***మహమ్మదీయ మహాయుగము*** గ్రంథంలో లక్ష్మణరావుగారు ఉటంకించారు. *'మహమూదును గురించి వ్రాసిన యంశములన్నియు నింగ్లీషు గ్రంథముల ననుసరించి వ్రాయబడినవి. ఈ గ్రంథకారులందరును తురుష్క చరిత్రకారుల ననుసరించి యున్నారు. కావున నీ వర్ణనమంతయు పక్షపాతభూయిష్ఠమని చెప్పుటకు సందేహము లేదు... ఇన్నిసారులు హిందూ దేశముపై దండెత్తి వచ్చినపుడొక్కసారియైనను నాతనికి బరాజయము కలిగినట్లు తురుష్కులు వ్రాసియుండలేదు. ఇది గొప్పవింత. తమ నాయకులకు బరాజయము కలిగినపుడూరక జారవిడుచుట వారి స్వభావమైనందున నేదవ యెనిమిదవ పదవ దాడులలో నాతనికి*

జక్కుని పరాభవము కలిగెనని మన మూహింపవచ్చును. ఈతడిన్ని పర్యాయములీ దేశమునకు వచ్చినను ఇచ్చట రాజ్యస్థాపనము చేసిన వాడు కాడు. అందుచే నాతనికీ దేశపు రాజులచే ననేక పరాభవములు సంప్రాప్త మయ్యెననియు, నందుచే నాతనికి నిచ్చట రాజ్యము స్థాపించుటకు వీలు లేకపోయెననియు మనమూహింపవలసి యున్నది... దీనిని గురించి యెక్కువగా బరిశోధన జరిగిన గాని నిజము తేలనేరదు' అన్నారు లక్ష్మణరావు పంతులుగారు.

కొమర్రాజు వారు ఈ పలుకులు రాసేనాటికి జాతీయోద్యమం ఊపు అందుకోలేదు. ఇంగ్లీషు వారు వండి వార్చిన గ్రంథాలే తప్ప స్వతంత్ర చరిత్ర పరిశోధనకు అవకాశాలు లేవు. వ్యక్తిగత చొరవలే తప్ప చరిత్ర పరిశోధనకు వనరులూ, వ్యవస్థలూ లేవు. కాలక్రమంలో జాతీయోద్యమం బలపడింది. దేశానికి స్వతంత్రం వచ్చింది. చరిత్ర పరిశోధన, అధ్యయనాల పేరుగొప్ప సంస్థల మీద వందలకోట్ల రూపాయలు ఖర్చయ్యాయి. చరిత్ర గొంగళి మాత్రం ఇంగ్లీషు వారు ఎక్కడ వేసినది అక్కడే. మెకాలే మానస పుత్రులైన 'సెక్యులర్', 'మార్క్సిస్టు' చరిత్రకారుల సంగతి తెలిసిందే కనుక వదిలేయండి. ఇజాల ప్రిజన్‌లో బందీలు కారనీ, జాతీయ దృక్పథం కలవారనీ సాధారణంగా అనుకునే ఆర్.సి. మజుందార్ లాంటి చరిత్రకారులు కూడా మధ్యయుగ చరిత్రకు సంబంధించి మొత్తం మీద మహమ్మదీయ, పాశ్చాత్య చరిత్రకారుల రికార్డుల చట్రానికి లోబడే బృహత్ రచనలు సాగించారు తప్ప దేశ చరిత్ర నుంచి ,విదేశీయులు చింపిన పేజీలను వెతికి పట్టుకునేందుకు గట్టి ప్రయత్నం చేయలేదు. తొంభై ఏళ్ల కింద కొమర్రాజు లాంటి వారికి కలిగిన సందేహాలు శేష ప్రశ్నలుగానే మిగిలాయి. క్రమేణా ఆ ప్రశ్నలు కూడా మరుపున పడ్డాయి. ప్రామాణికమని చెప్పబడే చరిత్ర గ్రంథాల నిండా గజనీలు, ఘోరీలూ, సుల్తాన్లూ, మొగలాయిల జైత్రయాత్రలే తప్ప విదేశీయుల దాడులను నిరోధించేందుకు ఈ దేశంలో ఇక్కడి ప్రభువులూ, ప్రజలూ సాగించిన వీరోచిత పోరాటాలూ, సాధించిన ఘన విజయాలూ కాగడాతో వెదికినా కానరావు.

మన మహా చరిత్రకారుల కథనాలను విన్న తరవాత సామాన్యుడికి కలిగే అభిప్రాయం ఏమిటంటే – చరిత్రలో మనం పడ్డ బాధలకు మనమే కారణం. ఆనాటి రాజులు అసమర్థులు; భోగలాలసులు; తమ చుట్టూ ఏమి జరుగుతోందో, తమ విరోధులు ఏ ఎత్తు మీద ఉన్నారో, ఎలా దెబ్బతీయనున్నారో పట్టించుకోకుండా, తగిన ప్రతిక్రియకు సంసిద్ధమవకుండా ఉపేక్షించిన మూర్ఖులు! పైగా వారిలోవారికి సవాలక్ష అంతఃకలహాలు. ఎవరి రాజ్యంలో ఎవరి అధికార స్వార్థాన్ని వారు చూసుకుంటూ, కీచులాటల్లో, కుమ్ములాటల్లో మునిగి తేలిన రాజులకు దేశం సంగతి పట్టలేదు. మహమ్మదీయులు తెరలు తెరలుగా దేశంలోకి చొచ్చుకువచ్చి దారుణంగా దండయాత్రలు సాగిస్తుంటే మన రాజులు ఎవరి గిరిలో వారు గడుగుడుగుంచా లాడుకున్నారే తప్ప శత్రువుల ధాటిని నిలువరించేందుకు పటిష్ఠమైన వ్యూహమేదీ ఆలోచించలేదు. ఇదీ చరిత్ర గ్రంథాలు చదివితే స్థూలంగా మనకు కలిగే అవగాహన.

వాస్తవానికి -విదేశీయుల సవాలును ఎదుర్కొని, వారి దాడులను వీరోచితంగా ప్రతిఘటించడానికి హిందూ దేశం రాజులు ప్రతి కీలక దశలోనూ గట్టి ప్రయత్నమే చేశారు. కాలం కలిసిరాక వారి శౌర్యం, ప్రతాపం నిష్ఫలమవడం వేరే సంగతి. ఈ సందర్భంలో విశేషంగా చెప్పుకోవలసిన వారిలో ప్రథమగణ్యుడు నాటి గాంధార దేశ ప్రభువైన జయపాలుడు. ఈ వ్యాసం మొదట్లో ప్రస్తావించిన ఆనందపాలుడి తండ్రి.

జయపాలుడి విశిష్టత విశదం కావాలంటే వెయ్యేళ్ల కిందటి హిందూ దేశపు ఎల్లలను గమనించాలి. ఇస్లామిక్ దండయాత్రలకు పూర్వం ఇప్పుడు ప్రస్తుతం స్వతంత్ర రాజ్యాలైన ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇండియా, నేపాల్‌లతో కూడిన విశాల మహీతలంలో హిందూ సంస్కృతి పరిఢవిల్లేది. అప్పట్లో ఆఫ్ఘనిస్తాన్‌ను, 'ఉపగణ స్థానం' అనే వారట,

ఇరాన్‌లోని సీస్తాన్‌లో ముస్లిం సేన కాలూనడంతో క్రీ.శ. 650లో ఇస్లామిక్ ప్రభంజనం మొదలైంది. అరబ్బులు, పర్షియన్లు, తురుష్కులు, అఫ్గాన్లు పెద్ద సంఖ్యలో ఇస్లాం మతం పుచ్చుకుని,అలలు అలలుగా విస్తరించే కొద్దీ పర్షియన్ సీస్తాన్ మొత్తం ఆఫ్ఘనిస్తాన్‌లో గణనీయ భాగం 'దారుల్ ఇస్లాం'లో చేరిపోయాయి. పూర్వపు సంస్కృతి ఆనవాలు లేకుండా తుడిచి పెట్టుకుపోయింది. ఇరాన్, పశ్చిమ ఆఫ్ఘనిస్తాన్‌ల నుంచి జొరాస్ట్రియన్ మతాన్ని నిర్మూలించి అక్కడి ప్రజల్ని ఇస్లాంలో కలుపుకున్నాక ఇస్లామిక్ జిహాద్ కత్తి భారతదేశ సరిహద్దు రాజ్యాల మీద పడింది. అప్పటికే పశ్చిమ ఆఫ్ఘనిస్తాన్‌లో హరి-రుద్రుల పేరు మీద వెలసిన హర్త్, మహాభారత కాలపు గాంధార రాజ్యమైన కాందహార్ రాష్ట్రాలు గజనీ పట్నాన్ని రాజధాని చేసుకున్న సబక్తజిన్ అనే ముస్లిం బానిస రాజు ఆధిపత్యంలోకి వచ్చాయి. తూర్పు అఫ్ఘానిస్తాన్‌లోని ఇప్పటి కాబూల్‌ను నాడు కూభ అనేవారు. దానికి రాజు జయపాలుడు. హిందుకుష్ పర్వతశ్రేణులకు పశ్చిమానగల కపిల, తూర్పున ఉన్న పంజాబ్ కలిసి అతని రాజ్యం.

మిగతా ఆఫ్గాన్ ప్రాంతాలను ఆక్రమించిన తరవాత సబక్తజిన్ కన్ను హిందూషాహీల రాజ్యం మీద పడింది. పొలిమేరల దగ్గర, సుదూరపు కొండల మీద ఉన్న షాహీల కోటలపై సబక్తజిన్ అడపాదడపా దాడులు చేసి, జనావాసాలను కొల్లగొట్టసాగాడు. షాహీ జయపాలుడు ఆ దురాగతాలకు మండిపడి సేనలను సమీకరించి భీకరమైన గజబలంతో సబక్తజిన్ మీదికి దండెత్తాడు. లంఘాన్, గజనీల మధ్య రెండు సేనలూ తలపడ్డాయి. చాలారోజులు భీకర సమరం సాగింది. క్రమంగా హిందువులదే పైచేయి అయింది. గెలవలేమని తేలిపోవడంతో సబక్తజిన్ ప్రతాపాన్ని వదిలి కుతంత్రానికి దిగాడు. అదేమిటో - మహ్మదీయ చరిత్రకారుడు **అల్‌ఉత్బీ** తన ***Tarikh Yamini*** లో వివరంగా రాశాడు. హిందువులు దండు విడిసిన చోటకు ఎగువన పెద్ద కొండ ఉండేది. దానిలోని పగులు నుంచి స్వచ్ఛమైన జలధార ఉబుకుతుంది. అందులోని నీరు ఎంత శుభ్రమంటే కనీసం నాచు కూడా కనపడదు. ఆ ధారలోకి ఏదైనా కశ్మలాన్ని విసిరేస్తే చాలు - వెంటనే కారుమబ్బులు కమ్ముతాయి; సుడిగాలి లేస్తుంది; కొండ కొమ్ములు నల్లబారుతాయి; కుంభవృష్టి కురుస్తుంది; కొండరాళ్లు పగిలి గాలి విసురుకు నేలమీద పడి అక్కడ ఉన్నవారినెల్లా మృత్యువులా కబళిస్తాయి... అని జనశ్రుతి! ఇంకేం? అమీర్ సబక్తజిన్ తట్టెడు అశుద్ధాన్ని ఆ జలధారలో పడవేయించాడు. వెంటనే ప్రళయకాలంలో వలె ఉత్పాతాలు లేచాయి. వడగళ్ల వానలో, మహావృక్షాలను పెకలించే గాలి హోరులో కళ్ళు తెరవనీయకుండా కమ్ముకున్న నల్లటి పొగలో జయపాలుడి సేన కకావికలైంది. విశేష ప్రాణనష్టం జరిగి, వెంట తెచ్చుకున్న ఆహార పదార్థాలన్నీ నాశనమై, పోరు కొనసాగించడం అసాధ్యమని తేలాక జయపాలుడు సంధికి రాయబారం పంపాడు - అని **అల్‌ఉత్బీ** ఉవాచ. పదిలక్షల దీనారాలు, యాభై ఏనుగులు, కీలకమైన కొన్ని కోటలు అప్పగించే షరతు మీద సబక్తజిన్ సంధికి ఒప్పుకున్నాడు. సరేనని షరతులకు అంగీకరించి,

క్షేమంగా వెనక్కి రాగానే, చిల్లిగవ్వ కూడా ఇచ్చేది లేదని జయపాలుడు అడ్డం తిరిగాడట. ధిక్కారానికి మండిపడ్డ సబక్తజిన్ పెద్ద సైన్యంతో దండెత్తి వచ్చి హోరాహోరీ పోరులో జయపాలుడిని ఓడించి అతడి రాజ్యాన్ని లంఘాన్ నగరం వరకూ ఆక్రమించాడట.

హిందూ షాహీ రాజు అప్పుడేమి చేశాడు? ముసల్మాన్ల సైనిక ధాటికి తట్టుకోలేనని బేజారయ్యాడా? పోగా మిగిలిన రాజ్యమే చాలునని సరిపెట్టుకున్నాడా? తనను తిన్నగా బతకనివ్వమంటూ సబక్తజిన్‌కు దాసోహమన్నాడా? లేదు. ముసల్మాన్లు ఆక్రమించిన రాజ్యాన్ని తిరిగి కైవసం చేసుకోవడానికి రెట్టించిన పట్టుదలతో లక్ష సేనను సమీకరించాడు. చుట్టుపట్లగల మిగతా హిందూ రాజులూ తమకు పట్టనట్టు ఊరకుండక, తలో చెయ్యి వేసి జయపాలుడికి అండగా నిలిచారు. మధ్యయుగపు ముస్లిం చరిత్రకారుడు **ఫిరిస్తా** రాసినట్టు – ఢిల్లీ, అజ్మీర్, కాలంజర వంటి ధూర ప్రాంతాల రాజులు కూడా సంఘీభావం చూపి జయపాలుడి సాయానికి సేనలను పంపారు. ముస్లింల దురాక్రమణను నిరోధించటానికి ఆ తొలి రోజుల్లోనే హిందూ రాజులు అంతటి ఐకమత్యాన్ని, సంఘటిత శక్తిని కనపరచడం నిస్సందేహంగా జాతికి గర్వకారణం. పగవారయిన ముస్లిం చరిత్రకారులే ఆ సంగతి ధ్రువీకరించాక ఇందులో సందేహానికి తావే లేదు.

కాని – ఎక్కడ సందేహానికి తావు లేదో అక్కడే అనుమానం రావడం మన దేశవాళీ చరిత్రకారుల ప్రత్యేకత! ఉదాహరణకు ఆర్.సి. మజుందార్ సంపాదకత్వంలో వెలువడిన ***– The History and Culture of the Indian People*** 5వ భాగం (***The struggle for Empire***) **డి.సి. గంగూలీ** – పైన పేర్కొన్న అల్‌ఉత్బీ రాతను ప్రస్తావించి, వెనువెంటనే అనుమానం వ్యక్తపరిచాడు.

> "If Firishta's statement could be accepted as true, it would go a long way in absolving the Indian rulers of the charge commonly levelled against them that they could not unite even in the face of common danger threatening the safety of their motherland. Unfortunately we have no independent testimony corroborating Firishta's statement, and meagre as it is, it does not enable us to identify the rulers who joined Jayapala in defending their motherland against the onrush of Islam."
>
> ***[The struggle for empire P.4]***
>
> *(ఫిరిస్తా చెప్పింది నిజమని నమ్మగలిగితే, భారతీయ ప్రభువులపై సాధారణంగా ఉన్న అభియోగాన్ని పటాపంచలు చేయటానికి చాలా పనికొస్తుంది. మాతృభూమి భద్రతకు ముప్పు వాటిల్లినా, ఉమ్మడి ప్రమాదాన్ని ఎదుర్కోవటానికి ఏకం కాలేక పోయారన్నది వారి మీద నింద. దురదృష్టవశాత్తూ ఫిరిస్తా చెప్పిన దాన్ని రూఢి చేయటానికి వేరే సాక్ష్యమేదీ మనకు లేదు. ఇస్లాం ధాటినుంచి మాతృభూమి రక్షణకు జయపాలుడితో జత కలిసిన పాలకులు ఎవరో గుర్తించటానికి ఫిరిస్తా చెప్పిన స్వల్ప వివరం సరిపోదు.)*

ఇదెక్కడి తర్కమో అర్థం కాదు. సబక్తజిన్ మాయ చేసి వడగళ్ల వాన తెప్పించగానే జయపాలుడు బెంబేలెత్తి సంధికి వచ్చాడనీ... షరతులకు ఒప్పుకున్నట్లే నటించి వెనక్కి

రాగానే మాట తప్పాడనీ.. దానికి ఆగ్రహించి సబక్తజిన్ దండెత్తి రాగా అతడి చేతిలో మళ్లీ ఓడి విశాల ప్రాంతాలు కోల్పోయాడనీ మజుందార్ బృందం అక్షర సత్యంగా అంగీకరించింది కదా? దానికీ ప్రమాణం **అల్‌ఉత్బీ** అనే చరిత్రకారుడి మాటే కదా? అది నిజం అవునో కాదో, జయపాలుడు నిజంగా అలా చేశాడో లేదో, ఆ యుద్ధంలో ఓడాడో లేదో వేరే స్వతంత్ర సాక్ష్యం దొరికితే తప్ప నికరంగా నమ్మలేమని గంగూలీగానీ మజుందార్ గానీ సందేహం వ్యక్తపరచలేదు కదా? అక్కడ రాని డౌటు జయపాలుడికి హిందూ రాజుల బాసట విషయంలో మాత్రం ఎందుకు రావాలి? ఫలానా రాజ్యాల ప్రభువులు సంఘీభావం తెలిపారని శత్రుపక్షం చరిత్రకారుడు చెబితే చాలదా? వారి వారి పేర్లు, గోత్రాలు, అడ్రసులు, బయోడేటా వివరాలు తెలిస్తేగానీ ఆ వివరం యథార్థమని చెప్పలేరా?

సాటి హిందూ రాజులు జయపాలుడికి సాయపడ్డా ప్రయోజనం లేకపోయింది. ఎంత భీకరంగా పోరాడినా సబక్తజిన్ రణతంత్రం ముందు నిలవలేక సేనలు చెల్లాచెదురయ్యాయి. లంఘాన్ నుంచి పెషావర్ వరకూ షాహీల రాజ్యాన్ని సబక్తజిన్ ఆక్రమించాడు. జయపాలుడి ప్రాభవం పంజాబ్‌కు పరిమితమైంది. తరవాత కొద్ది కాలానికి సబక్తజిన్ మరణించాడు. స్వల్ప విరామం అనంతరం అతడి కుమారుడు మహ్మద్ సుల్తాన్ అయ్యాడు. ఆ వెంటనే క్రీ.శ. 1000 లో ఇండియా మీదికి దండయాత్రల పరంపరను మొదలెట్టాడు. పెషావర్ దగ్గర్లో కొన్ని కోటలు పట్టుకున్నాక మరుసటి సంవత్సరం పదిహేను వేల గుర్రాలను తీసుకుని జయపాలుడి మీదికి దండెత్తాడు. అతడూ 12 వేల అశ్వికులను, 30 వేల సైనికులను, 300 ఏనుగులను తీసుకుని పెషావర్ దగ్గర పోరు సలిపాడు. మహ్మద్ మధ్యాహ్నానికల్లా 5 వేల సైనికులను చంపి జయపాలుడిని, అతడి కొడుకులను, మనవలను బందీలుగా పట్టుకున్నాడు. తరవాత షాహీల రాజధాని ఉపభాండపై దండెత్తి ఎదిరించిన సేనలను ఊచకోత కోశాడు. రెండున్నర లక్షల దీనారాలను, 25 ఏనుగులను సమర్పించుకునే షరతు మీద జయపాలుడిని మాత్రం విడిచిపెట్టి, మిగతా రాజవంశీకులను మహ్మద్ తన బందీలుగా అట్టే పెట్టుకున్నాడు. జయపాలుడి కుమారుడైన ఆనందపాలుడు ఒడంబడిక ప్రకారం ఆ మొత్తమంతా చెల్లించి బంధువులను విడిపించుకున్నాడు. జయపాలుడు క్షేమంగా వెనక్కి వచ్చినా ముసల్మాన్ల చేతిలో వరస పరాభవాలకు తట్టుకోలేక చితి పేర్చుకుని తన చేతితోనే దానిని అంటించి సజీవ దహనమయ్యాడట. ఆయన స్థానంలో రాజయిన ఆనందపాలుడికీ గజనీ చేతిలో అన్నీ పరాజయాలేనట..

ఇదీ కథ. ఏ చరిత్ర గ్రంథం చూసినా ఇదే కనపడుతుంది. ఎంతవరకు నిజమో తెలియదు. **అల్ ఉత్బీ** లాంటి ముస్లిం పక్షపాతులైన చరిత్ర కారులు మినహా వేరే స్వతంత్ర సాక్ష్యమేదీ లేదు. అయినా - కనీసం అనుమానమైనా వ్యక్తం చేయకుండా ఆర్.సి. మజుందార్ లాంటి జాతీయవాదులైన జంటిల్మన్ చరిత్రకారులు కూడా ముస్లిం రాతలను ఒప్పేసుకున్నారు. జయపాలుడికి అండగా సాటి రాజులు సాయపడ్డారన్న విషయంలో వీరికి వచ్చిన సందేహం జయపాలుడి విషాదాంతం విషయంలో వీరికి ఎందుకు రాలేదు? 'చీమల బారులా' హిందూ సేనలు తమను కమ్ముకున్నాయని చెబుతూనే, పరాక్రమానికి పేరొందిన అంతటి మహాసైన్యాన్ని తమ వాళ్ల అతి తక్కువ బలగాలతో అల్లా దయవల్ల చీల్చి చెండాడారని ఉత్బీలు, ఫిరిస్తాలు చెప్పింది ఎంతవరకు నమ్మశక్యం? అంతకు ముందు సబక్తజిన్‌తో

రెండుమార్లు యుద్ధంచేసి, 'ఘోరంగా' ఓడిపోయినా... మునుపు కూడా శత్రువుల చెరలో చిక్కి, అవమానకరమైన షరతులకు ఒప్పుకుని బయటపద్దా,పౌరు[illegible] జయపాలుడు, సబక్తజిన్ కుమారుడి చేతిలో ఒక్కసారి ఓడిపోగానే జీవితేచ్ఛ నశించి చితి పేర్చుకున్నాడా? ఇచ్చిన మాటను ఈవలికి రాగానే తప్పి గతంలో సంధి షరతులకు ఎగనామం పెట్టినంతటి నీతిమాలినవాడే అయితే.. మళ్ళీ అదే మనిషి అటువంటి పరిస్థితుల్లోనే విడుదల కట్నం చెల్లించుకుని ఇంకోసారి చెర నుంచి బయట పడగానే చితి అంటించుకుని చచ్చిపోయేంతటి మహా నీతిమంతుడు ఎలా అయ్యాడు? ఇదే పరాభవాగ్ని ఆయనను వెనుకటి 'పరాజయాల'లో ఎందుకు దహించలేదు? అంతటి పరాక్రమశాలి ఆత్మాభిమానం ప్రకోపించి ఇలా నిలువునా ఆత్మాహుతి చేసుకుంటూంటే అప్పటిదాకా ఆయనకు బాసటగా ఉన్న సాటిరాజులు ఎలా ఊరుకున్నారు? దేశం కోసం, ధర్మం కోసం పోరాడి, ఓడినందుకే తన తండ్రి మంటల్లో కాలిపోతానంటే ఆనందపాలుడు ఎందుకు వారించలేదు? ఆనందపాలుడికి కూడా గజనీ మహ్మద్ చేతిలో వరసగా అపజయాలే సంప్రాప్తించా యన్న మాటే నిజమైతే మళ్లీ అదే ఆనందపాలుడు 'నిన్ను నేను పరాభవించాను. ఆ గౌరవం మళ్లీ ఇంకొకరికి దక్కడం నాకుఇష్టం లేదు. అందుకే నీ మీద దండెత్తిన శత్రువులను గెలవటానికి నువ్వు కావాలంటే సాయం చేస్తా' అని ఉత్తరం ఎలా రాశాడు?

చరిత్రకారులు సమాధానం చెబుతారా?

పృథ్వీరాజ్ ప్రేమాయణం

'పృథ్వీరాజ్ పాప్యులర్ హీరో... దేన్నీ లక్ష్యపెట్టక ఎంతకైనా తెగించేప్రేమికులు ఎప్పుడూ పాప్యులరే. అతడు ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆమె కూడా అతణ్ని ప్రేమించింది. ఆమె తండ్రి కనోజ్ రాజు జయచంద్రుడు. ఆమె స్వయంవరానికి వచ్చిన ఎందరో రాజకుమారులను ధిక్కరించి, తండ్రి ప్రాసాదం నుంచే పృథ్వీరాజ్ ఆమెను పట్టుకుని పోయాడు. కోరిన వధువును కొద్దికాలం అతడు పొందగలిగాడు. బలవంతుడైన ప్రభువుతో బద్ధ వైరాన్ని అందుకు మూల్యంగా చెల్లించాడు. ఇరుపక్షాలా మహావీరులెందరి ప్రాణాలో పోయాయి... నిరంతర ఘర్షణల్లో ఉభయత్రా భారీ సంహారం జరిగింది. ఇలా కేవలం ఒక స్త్రీ ప్రేమకోసం పృథ్వీరాజ్ తన ప్రాణాన్నీ, రాజ్యాన్నీ కోల్పోయాడు. సామ్రాజ్యానికి పీఠ స్థానమైన ఢిల్లీ - బయటి నుంచి వచ్చిన దురాక్రమణదారు చేతుల్లోకి వెళ్ళింది. కాని పృథ్వీరాజ్ ప్రేమ కథను జనం ఇంకా పాడుకుంటూనే ఉన్నారు. అతడిని ఒక వీరుడిగా చూస్తూ, జయచంద్రుడినేమో ద్రోహిగా ఏవగించుకుంటున్నారు'.

ఇదీ - జాతీయ వీరుడు పృథ్వీరాజ్ మీద నవభారత నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ తన **డిస్కవరీ ఆఫ్ ఇండియా** (పేజి 237)లో వెలువరించిన తీర్పు. దీన్నిబట్టి ఏమి అర్థమవుతుంది? పృథ్వీరాజ్ అనేవాడు వెర్రి తెగింపు గల ప్రేమికుడు. ఆఫ్టరాల్ ఒక ఆడదాని కోసం బలవంతులైన రాజులతో శత్రుత్వాన్ని కొని తెచ్చుకుని, రెండు వైపులా ఎందరో మహావీరుల మరణానికి కారకుడయ్యాడు. ఒక స్త్రీ ప్రేమలో పడి తన ప్రాణాన్నీ, సింహాసనాన్నీ పోగొట్టుకోవడమే కాక విదేశీ దురాక్రమణదారుకు సామ్రాజ్యం హస్తగతమవడానికి కారణమైన వాడిని వెర్రిజనం అనవసరంగా వీరుడని గౌరవిస్తున్నారు. అతడి ఆగడాన్ని ఎదిరించిన జయచంద్రుడినేమో పాపం ద్రోహిలా చూస్తున్నారు. ఇది చాలా అన్యాయం - అనే కదా?

దేశంలో ఏ మేధావినైనా అడగండి. దారినపొయ్యే దానయ్యకైనా ఈ సంగతి చెప్పండి. 'నిజమే కదా?' అనే అంటారు. పృథ్వీరాజ్ వీరుడా, కాదా, జయచంద్రుడు దేశద్రోహి

అవునా కదా అన్న మీమాంసను పక్కనపెడితే... ఇద్దరి మధ్యా విరోధం ముదిరింది ప్రేమాయణం వల్ల అని దాదాపు అందరూ అంగీకరిస్తారు.. ఈ విషయంలో అసలు డౌటు ఎందుకు రావాలని ఆశ్చర్యపడతారు.

నిజమే. పృథ్వీరాజ్ ప్రేమకథ తరతరాలుగా వింటున్నదే. ఎన్నో పుస్తకాల్లో చదివిందే. ఎన్నో సినిమాల్లో, ఎన్నో నాటకాల్లో చూసిందే. జయచంద్రుడి కూతురైన సంయోగిత (లేక సంయుక్త) ఢిల్లీనేలే పృథ్వీరాజ్‌ను ప్రేమించింది. కాని ఆమె తండ్రికి అతడంటే ఇష్టం లేదు. అందుకే – కూతురికి స్వయంవరం ఏర్పాటు చేసి సాటి రాజులందరినీ పిలిచి పృథ్వీరాజ్‌కు మాత్రం ఆహ్వానం పంపలేదు. పైగా అతణ్ని అవమానించటం కోసం అతడి రూపులో బొమ్మను చేయించి ద్వారపాలకుడిలా గుమ్మం ముందు నిలబెట్టాడు. భాగవతంలో కృష్ణుడికి రుక్మిణీదేవి విన్నవించుకున్న రీతిలో సంయుక్త ప్రియుడికి కబురంపింది. స్వయంవరంలో బారులు తీరిన రాజులను క్రీగంటయినా చూడకుండా చరచర వెళ్లి వరమాలను గుమ్మం బయట ప్రతిమ మెడలో వేసింది. అప్పటికే ఆ విగ్రహం వెనుక కాచుకుని ఉన్న పృథ్వీరాజ్ ఆమెను గుర్రం ఎక్కించుకుని, అడ్డగించిన రాజులను, సేనలను ఓడించి సంయుక్తను తీసుకుపోయి పరిణయమాడాడు. (అలా కాదు. తనను ధిక్కరించి తన విరోధి ప్రతిమకు వరమాల వేసినందుకు జయచంద్రుడు ఆగ్రహించి ఆమెను ఖైదు చేశాడు. ఆ సంగతి తెలిసి, తన పట్ల రాకుమారి ప్రేమకు ముగ్ధుడై, పృథ్వీరాజ్ సేనను తీసుకుని కనోజ్ మీదికి దండెత్తాడు. అక్కడే ఇద్దరూ రహస్యంగా కలిసి గాంధర్వ వివాహం చేసుకున్నారు. అనంతరం యుద్ధంలో పృథ్వీరాజ్ తలను శత్రుసేనాని వేటు వేయబోతూండగా సంయుక్త కత్తిదూసి భర్తను కాపాడుకుంది – అని కొందరు అంటారు.)

అప్పటి నుంచి వైరం తీవ్రమైంది. పృథ్వీరాజ్‌ను సాధించడానికి జయచంద్రుడు తురుష్క ప్రభువు శహాబుద్దీన్ ఘోరీతో చేతులు కలిపాడు. దానికి కొన్ని నెలల ముందే తారాయిన్ దగ్గర (1191)లో జరిగిన యుద్ధంలో ఘోరీని పృథ్వీరాజ్ చిత్తుగా ఓడించి ప్రాణభిక్ష పెట్టాడు. ఈసారి తురుష్కుడు కనోజ్, గుజరాత్ రాజుల సాయంతో మళ్లీ దండెత్తి వచ్చి అదే తారాయిన్‌లో పృథ్వీరాజ్‌ను ఓడించాడు. యుద్ధరంగంలోనే పృథ్వీరాజ్‌ను నరికి చంపాడని కొందరంటారు. కాదు – కొన్నాళ్ల తరవాత కోపమొచ్చి చంపాడని మరి కొందరంటారు. రెండూ కాదు. యుద్ధంలో పట్టుబడ్డ పృథ్వీరాజ్‌ను ఘోరీ తన దేశం తీసుకుపోయి, గుడ్లు పీకించి చెరలో పెట్టాడు; పృథ్వీరాజ్‌కు మంత్రి, చరిత్ర లేఖకుడు అయిన చాంద్‌భట్టు అనే మహాకవి అతణ్ణి రహస్యంగా కలిసి ఒక ఉపాయం చెప్పాడు; కళ్లు లేకున్నా పృథ్వీరాజ్ గురి మీదికి బాణం వదలగలడని ఆ కవి ఘోరీకి చెప్పి వినోదార్థం అస్త్ర విద్యా ప్రదర్శనను ఏర్పాటు చేయించగా, పృథ్వీరాజ్ అలికిడిని బట్టి బాణం వేసి ఘోరీని చంపాడు; శత్రువుల చేతికి చిక్కకుండా పృథ్వీరాజ్, చాంద్‌భట్టు ఒకరినొకరు పొడుచుకుని చచ్చిపోయారు.. అని ఇంకొందరంటారు.

ఇదీ – ఎన్నో తరాలుగా, అనేక శతాబ్దాలుగా ప్రచారంలో ఉన్న పృథ్వీరాజ్ కథ. సన్నివేశాల్లో, ముగింపులో తేడాలు ఉన్నప్పటికీ, ఘోరీ చేతిలో పృథ్వీరాజ్ ఓటమికి, చిరకాల స్వాతంత్ర్యం కోల్పోయి హిందూ దేశం పరరాజుల స్వాధీనమై, పారతంత్ర్య శృంఖలాల్లో బంధింపబడటానికీ సంయుక్త స్వయంవరం, పృథ్వీరాజ్‌తో ఆమె ప్రణయం మూలకారణమని సర్వసాధారణంగా అందరూ అంగీకరిస్తారు. ఈ సాధారణ జనాభిప్రాయాన్నే జవహర్‌లాల్

నెహ్రూ కూడా తన గ్రంథంలో వ్యక్తీకరించారు.

బాగానే ఉంది. - ఒక్కటే చిక్కు

పృథ్వీరాజ్ ప్రేమాయణం పచ్చి అబద్ధం! జయచంద్రుడికి అసలు ఒక కూతురు ఉందా? పేరు సంయుక్తేనా? ఆమెకు స్వయంవరం జరిగిందా - అన్నదే అనుమానం. ఒకవేళ స్వయంవరం జరిగినా అందులో ఆమె పృథ్వీరాజ్‌ను వరించడం అవాస్తవం. జయచంద్రుడికీ, పృథ్వీరాజ్‌కూ మధ్య ఎన్ని గొడవలు ఉన్నా, ఈ స్వయంవరం వాటికి ఎంతవరకూ కారణమైనా ఘోరీతో యుద్ధంలో పృథ్వీరాజ్ ఓటమికి, అతడి విషాదాంతానికి, తన్మూలంగా దేశానికి పట్టిన దుర్గతికి ప్రేమకలాపం మాత్రం కారణం కాదు.

పృథ్వీరాజ్ చౌహాన్ చరిత్రకు ప్రధాన ఆధారాలుగా చెప్పదగ్గవి ముఖ్యంగా మూడు పురాతన గ్రంథాలు. మళ్లీ వీటిలో ప్రామాణికమని చరిత్రకారులు దాదాపు అందరూ అంగీకరించేది **పృథ్వీరాజ్ విజయ్**ను. ఆ గ్రంథంలో సంయుక్త పేరు, ఊసు ఎక్కడా కనిపించవు. తిలోత్తమ అనే అప్సరసను ప్రేమించి పెళ్ళాడాడని మాత్రమే ఆ గ్రంథం చెబుతుంది. ఆ తిలోత్తమ జయచంద్రుడి కూతురు కాదు. దాని తరవాత ప్రామాణికమని చెప్పదగ్గది **హమీర్ మహాకావ్య**ను. పృథ్వీరాజ్ జీవితాన్ని వివరంగా వర్ణించిన ఈ గ్రంథంలోనూ సంయుక్త పేరు గాని, అలాంటి ప్రేమ కలాపం ఒకటి సాగిందని గాని ఎక్కడా ప్రస్తావించలేదు.

ఇక మూడోది **పృథ్వీరాజ్ రాసో**. చదవడానికి మాంచి రొమాంటిక్ స్టోరీలా ఉంటుంది. కాని - దానిలో చారిత్రక సత్యాలకంటే అవాస్తవాలే ఎక్కువ. పృథ్వీరాజ్‌ను ఘోరీ కళ్లు పీకించి చిరకాలం చెరలో ఉంచి వినోదించగా, చాంద్‌భట్టు సాయంతో బాణం వేసి ఘోరీని చంపి తానూ చచ్చిపోయాడన్న కట్టుకథలాగే... సంయుక్త స్వయంవరం, పృథ్వీరాజ్‌తో పరిణయం, అనంతర పర్యవసానాలనూ ఈ 'రాసో' బహురమ్యంగా వర్ణిస్తుంది. ఎప్పుడు రాశారో తెలియదు గాని 13వ శతాబ్దానికే ఇది వ్యాప్తిలో ఉంది. దీని తొలి ప్రతి ఎలా ఉంటుందో ఎరిగిన వారు లేరు. శతాబ్దాలు గడిచేకొద్దీ ఎవరికి తోచిన ఊహను వారు జోడించి గ్రంథం పెంచుకుంటూ పోయారు. సంయుక్త ప్రేమకథను అక్బర్ కూడా విని ఉన్నట్టు **అబుల్ ఫజల్** రాతను బట్టి తెలుస్తుంది. అనేక శతాబ్దాలుగా ప్రచారం ఉన్నదన్నంత వరకూ వాస్తవమే అయినా సంయుక్త - పృథ్వీరాజ్‌ల ప్రేమాయణానికి నమ్మదగిన చారిత్రక దాఖలా అంటూ ఏదీ లేదు. ఆ కాలంలో యుద్ధాలను, వాటికి దారితీసిన పరిస్థితులను, తమ సుల్తాన్ల ప్రతాపాలను చిలవలు పలవలుగా సాధ్యమైనంత పక్షపాతంతో వర్ణించిన పర్షియన్ చరిత్రకారుల్లో ఏ ఒక్కరూ అలాంటి ప్రేమాయణం ఒకటి నడిచినట్టు ఎక్కడా చెప్పలేదు. హిందూ రాజుల్లో ఒకడి కుమార్తెను ఇంకొకడు ఎత్తుకుపోయి, పెళ్ళి చేసుకుంటే... దాని మూలంగా కక్షలు రగిలి, హిందూ రాజులు పరస్పరం కలహించుకుని, చివరికి మొత్తం అందరూ మహమ్మదీయ సుల్తాన్ చేతిలో పరాజితులైన సంగతి నిజమే అయితే - **ఫిరిస్తా** లాంటి పర్షియన్ చరిత్రకారులు మహదానందంతో ఒకటికి రెండు జోడించి ఆ వైనాన్ని ఏకరువు పెట్టేవారే. యధార్థమే అయి ఉండక్కర్లేదు... అలాంటి భాగోతం ఒకటి నడిచిందని చెప్పటానికి ఏ కాస్త ఆరా దొరికినా పీకి పాకం పెట్టకుండా సదరు అబద్ధాల పెద్దయ్యలు వదిలేవారు కాదు.

ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే **ఆర్.సి. మజుందార్** కూడా తన సంపాదకత్వంలో వెలువడిన ***The History and Culture of the Indian people*** ఐదవ సంపుటమైన ***The Struggle***

for Empire లో సంయుక్తతో పృథ్వీరాజ్ ప్రేమ వివాహం కథను కొట్టేస్తూ -

"The details given by **Raso** in connection with the above marriage are so improbable and romantic that the authenticity of the whole story may resonably be doubted" *(ఆ వివాహానికి సంబంధించి 'రాసో' ఇచ్చిన వివరాలు ఎంత అసంగతంగా, రొమాంటిక్‌గా ఉన్నాయంటే మొత్తం కథ యథార్థతనే శంకించవలసి వస్తుంది)* అన్నారు. (పేజీ 105)

అనేక చారిత్రక ఆధారాలను పరిశీలించి **హిందూ దేశ కథా సంగ్రహమును** రాసిన **కొమర్రాజు లక్ష్మణరావుగారు** దాని రెండో భాగమైన **మహమ్మదీయ మహాయుగములో** ఇంకో సంగతి చెప్పారు. ఢిల్లీనేలిన తువర వంశంలో చివరివాడయిన అనంగపాలుడికి పుత్ర సంతానం లేదు. ఇద్దరు కుమార్తెలు. వారిలో కమలాదేవిని అజ్మీర్ రాజయిన సోమేశ్వరుడికి ఇచ్చారు. ఆమె కుమారుడే పృథ్వీరాజు. అనంగపాలుడి రెండో కుమార్తె విమలాదేవిని కనోజ్ రాజయిన విజయపాలుడికి ఇచ్చారు. ఆమె కుమారుడు జయచంద్రుడు. తాతగారు ముసలితనంలో బదరికాశ్రమానికి పోతూ పోతూ ఢిల్లీ రాజ్యాన్ని దౌహిత్రుడైన పృథ్వీరాజ్‌కు ఇచ్చాడు. దాంతో అజ్మీర్‌కూ, ఢిల్లీకీ అతడు రాజయ్యాడు. రాజ్యం తనకెందుకు ఇవ్వలేదని రెండో దౌహిత్రుడు జయచంద్రుడు ఆగ్రహించాడు. అదీ - పృథ్వీరాజ్, జయచంద్రుల విరోధానికి మూలకారణం అంటారు లక్ష్మణరావుగారు.

ఇదే నిజమైతే - పృథ్వీరాజ్, జయచంద్రులు అక్కచెల్లెళ్ల పిల్లలు. అంటే వరసకు అన్నదమ్ములు. దాని ప్రకారం జయచంద్రుడి కూతురికి పృథ్వీరాజ్ చిన్నాయన అవుతాడు. అలాంటప్పుడు సొంత బాబాయిని సంయుక్త ఎలా ప్రేమించింది? అన్న కూతురిని పెళ్ళాడే ఆచారం హిందువుల్లో ఏనాడూ లేదే!

విడ్డూరమేమిటంటే - సంయుక్తకు పృథ్వీరాజ్ చిన్నాయన అని చెప్పిన లక్ష్మణరావుగారు కూడా ఆమె స్వయంవరానికి ఈయన పిలవకపోయినా వెళ్ళి వరమాల వేయించుకుని ఎత్తుకొచ్చాడని తన గ్రంథంలో రాశారు. బహుశా **పృథ్వీరాజ్ రాసో** నుంచి గ్రహించిన రసవత్తర ఘట్టాన్ని వర్జించే సందర్భంలో వరస చెడిన సంగతి ఆయన గమనించి ఉండరు.

సంయుక్త స్వయంవరం ఎంత అబద్ధమో అంతఃకలహాల వల్లే ఘోరీ చేతిలో హిందువులు ఓడారనటం అంత అసంబద్ధం. వెర్రి తెగింపుతో రాజకన్యను పృథ్వీరాజ్ ఎత్తుకుపోయిన కారణంగా రాజుల మధ్య విరోధాలు ప్రబలి, రెండు వైపులా మహావీరులు పెద్ద సంఖ్యలో నేలకొరిగి, సేనలు బలహీనమై చివరికి విదేశీ దురాక్రమణదారు చేతిలో దారుణంగా ఓడిపోయాయన్న నెహ్రూగారి అవగాహన తప్పు. నాటి రాజుల మధ్య వైరాలు లేవని కాదు. కాని - వాటివల్లే హిందువుల పోరాట పటిమ క్షీణించిదని, ముసల్మానులపై ఉమ్మడి ప్రతిఘటన వమ్ము అయిందని చెప్పటం పొరపాటు. తారాయిన్‌లో పృథ్వీరాజ్ చేతిలో చిత్తుగా ఓడి, అదృష్టవశాత్తు ప్రాణం దక్కించుకున్న ఘోరీ మరుసటి సంవత్సరం (1192లో) అదే చోట మళ్ళీ తలపడినప్పుడు "All the Rais of Hindustan were with the Rai kolah" (హిందుస్తాన్‌లోని రాజులందరూ పృథ్వీరాజ్ వెంట ఉన్నారు) అని ఘోరీ సమకాలికుడైన Minhaj-uddin Siraj తన *Tabakat-i-Nasiri* లో స్పష్టంగా చెప్పాడు. చుట్టుపట్ల రాజ్యాల ప్రభువులందరినీ కలుపుకొని పృథ్వీరాజ్ 3 లక్షల గుర్రాలతో 3 వేల ఏనుగులతో బ్రహ్మాండమైన సైన్యాన్ని సమీకరించాడని ఫిరిస్తా ధ్రువీకరించాడు. (Briggs -

Firistah *Vol. I P. 176*). అలాగే -

When the Rai of Ajmir, the vaunts of whose courage had reached the ears of far and near, heard of the approach of the... victorious armies, he advanced for the purpose of fighting... marched on over hills and deserts with a well equipped army, the number of which can not be conceived in the picture gallery of the imagination *(విజయోత్సాహంతో సేనలు తరలి వస్తున్నాయని తెలియగానే పరాక్రమానికి ప్రఖ్యాతి చెందిన అజ్మీర్ రాజు ఊహించడానికి శక్యం కానంత అసంఖ్యాకమైన, సర్వసన్నద్ధమైన సైన్యంతో కొండల దారిన పోరు కోసం దండువెడలాడు)* అని ***Taju-l Ma-Asir*** లో Hasan Nizami రాశాడు. ***[Elliot & Dowson** Vol. II, Page 214-15]*

మరి ఇంత బ్రహ్మాండమైన సైన్యంతో, సకల హంగులతో శత్రువుపైకి ఉరికిన పృథ్వీరాజ్ అంతటి మహా పరాక్రమశాలి తొరాయిన్ యుద్ధంలో ఎందుకు ఓడాడు? సంవత్సరం కింద అదే చోట తాను మట్టి కరిపించి ప్రాణభిక్ష పెట్టిన ఘోరీ చేతిలో - లక్షల సైన్యం ఉండి కూడా - ఘోర పరాజయం ఎందుకు చెందాడు? సతీశ్‌చంద్ర లాంటి ఆధునిక చరిత్రకారులు ఏకగ్రీవంగా నిర్ధారించినట్లు ముసల్మాన్ల పోరాట పటిమ ముందు, వారి సంఘటిత శక్తి ముందు, వారి పటిష్ఠ సైనిక వ్యూహం ముందు హిందూ సేనలు నిలవలేక పోయాయా? తురుష్కుల గుర్రాల మెరుపు వేగమే కదనరంగంలో జయాపజయాలను తేల్చి వేసిందా?

కాదు. ధర్మ ప్రకారం వీరోచితంగా తలపడితే పృథ్వీరాజ్ సేనలను ఘోరీ గెలవడం కల్ల. ఆ సంగతి అతడికీ తెలుసు. అందుకే అధర్మయుద్ధానికి ఒడిగట్టాడు. విశాల బలగంతో 150 మంది సాటి రాజకుమారులు అండనిలవగా అరివీర భయంకరంగా కదన రంగంలో మోహరించిన తరువాత ఔదార్యానికి పెట్టింది పేరయిన పృథ్వీరాజు శత్రువుకు ఆఖరి అవకాశం ఇవ్వదలిచాడు. 'నిష్కారణంగా మా చేతిలో ఎందుకు చస్తారు? ఇప్పుడే వెనుతిరిగిపోండి. మిమ్మల్ని క్షేమంగా వెళ్లనిస్తాం' అని శహాబుద్దీన్ ఘోరీకి సందేశం పంపాడు. హిందూ రాజు మంచితనాన్ని ఉపయోగించుకుని ఘోరీ కుతంత్రం పన్నాడు. దూరదేశంలో ఉన్న మా అన్నగారిని అడిగి కానీ నేను ఇలాంటి నిర్ణయం చేయలేను. ఆయనకు కబురు పంపాను. జవాబు వచ్చేంత వరకు దయచేసి ఆగండి' అని పృథ్వీరాజ్‌కు ప్రత్యుత్తరం పంపాడు. నిజమే కాబోలనుకుని హిందూ శిబిరం ఆదమరచి ఉండగా మర్నాడు వేకువ జామునే వేళకాని వేళ విరుచుకుపడ్డాడు.

దానికీ ఎంత మోసం చేశాడని! తాము శిబిరంలోనే ఉన్నట్టు భ్రమ కలిగేలా దీపాలు వెలిగించమని కొందరు సైనికులకు చెప్పి, సేనలను తీసుకుని చీకటిలో చప్పుడు కాకుండా కదలి ఘోరీ మెరుపుదాడి చేశాడు.

అప్పటికి తెల్లవారలేదు. సైనికులు చాలామంది నిద్రలో ఉన్నారు. కొందరు స్నానాల్లో, కొందరు పూజాదికాల్లో ఏమరి ఉన్నారు. ఆ సమయంలో మెరుపులేని పిడుగులా శత్రుసేనలు నలుదిశలా కమ్ముకునే సరికి అంతా నిర్ఘాంతపోయారు. ఎలా ఉన్న వారు అలాగే ఆయుధాలందుకుని ఆదరాబాదర్గా పోరుకు దిగారు. తీవ్ర దిగ్భ్రాంతిలో కూడా పృథ్వీరాజ్ తెప్పరిల్లి ఎదురుదాడిని బాగానే నడిపించాడు. కాని ఘోరీ మాయా యుద్ధానికి దిగాడు. ఎదుట నిలిచి పోరాడకుండా, గుర్రాలతో దాడి చేయించినట్లే చేయించి, పరారవుతూ,

వెంటపడిన ఆవలి పక్షం వారిని పరుగులెత్తించాడు. అలా దెబ్బతీసి పారిపోయే తంత్రాన్ని నాలుగువైపులా నాలుగు అశ్వదళాలతో సాయంత్రం దాకా నడిపించాడు. పొద్దుటి నుంచి ఏమీ తినకుండా ఖాళీ కడుపులతో నకనక లాడుతున్న సైనికులకు సత్తువ నశించే సమయానికి అంతవరకూ రిజర్వులో ఉంచిన అసలు బలగాలను ఉసిగొలిపి, భీకర సంహారం సాగించాడు. చేజిక్కిన పృథ్వీరాజును క్రూరంగా చంపాడు. (కాదు - కొంతకాలం తర్వాత చంపాడంటారు కొందరు.)

యుద్ధ తంత్రం వరకూ ఇందులో ఆక్షేపించాల్సింది ఏమీ లేదు. రణానికి దిగాక ఎవరి వ్యూహం వారిది. ఫలానా రీతిలోనే యుద్ధం చేయాలన్న రూలు ఎక్కడా లేదు. కాని - ఈ యుద్ధానికి ముందు వైరి పక్షాన్ని నమ్మించి, మోసగించి, దొంగ దెబ్బ తీసిన తీరు మాత్రం ఘోరీ శౌర్యానికి ఏ విధంగానూ శోభాయమానం కాదు. ఈ రకమైన కుతంత్రాలతో, నమ్మకద్రోహాలతో అతడు సాగించిన గెలుపును అవక్ర విక్రమంగా... ఐక్యత లేని, పాత పద్ధతులను వదలని హిందూ సేనలపై సాధించిన అద్భుత సైనిక విజయంగా చిత్రించడం నగుబాటు.

ఇందులో అవాస్తవమని అనుమానించాల్సింది ఏమీ లేదు. తారాయిన్‌లో తమ ప్రభువు కాఫిర్లను ఎలా వంచించి, చావుదెబ్బ తీసిందీ **ఫిరిస్తా, మహమ్మద్ ఉఫి, మిన్హాజుద్దీన్ సిరాజ్** లాంటి పర్షియన్ చరిత్రకారులే వివరంగా చెప్పారు.

సరే! పృథ్వీరాజ్ పరాజయానికి ప్రేమాయణం కారణం కాదు. హిందూ రాజుల్లో అంతః కలహాలూ ప్రధాన హేతువుకాదు - జయచంద్రుడి దేశద్రోహం వల్లే ఘోరీ గెలవగలిగాడనటానికి నమ్మదగిన ఆధారం లేదు. తారాయిన్ యుద్ధంలో వీరోచితంగా పోరాడటం వరకూ హిందూ పక్షాన్ని తప్పుపట్టాల్సింది లేదు. ఒప్పుకుందాం. ఇవేవీ కాకపోతే మరి ముసల్మాన్ల ధాటిని హిందువులు నిరోధించలేక పోవటానికి, కీలకమైన ప్రతి పోరులోనూ పరాజయం పాలవడానికి కారణమేమిటి? అంతా ముసల్మాన్ సుల్తాన్ల కుట్రలూ, కుతంత్రాలూ, మిత్రద్రోహాలే తప్ప - హిందువుల వైపు తప్పులు లోపాలూ ఏమీ లేవా?

ముందు వ్యాసంలో చూద్దాం.

మనం నేర్వని పాఠం

పాత తప్పుల నుంచి పాఠాలు నేర్వని వారు అవే తప్పులు మళ్లీ చేస్తారు. పరాభవాలకు కారణం కనుగొని తగు జాగ్రత్త పడని జాతికి అదే చరిత్ర పదే పదే పునరావృతమవుతుంది.

ఈ అరవై ఏళ్ల అనుభవాలనే చూడండి. మతం కత్తితో దేశాన్ని చీల్చాలని కొద్దిమంది దురాత్ములు పన్నిన కుత్సితాన్ని మొగ్గలోనే తుంచేసి... విచ్ఛిన్న శక్తుల ఆగడాలను ఆదిలోనే అరికట్టి ఉంటే దేశం రెండు ముక్కలు అయ్యేది కాదు. మతకల్లోలపు ఘోర కలిలో లక్షల ప్రాణాలు పోయేవి కావు. దేశ విభజన వెనువెంటనే ఇండియాను కాటు వేయటానికి పాకిస్తానీలు ఆరంభించిన కుతంత్రాలను ఒక కంట కనిపెట్టి, కొండజాతి దుండగుల దండు ఫొలిమేరలో కాలుబెట్టగానే కీలు విరిచి ఉంటే దురాక్రమణ బాధ తప్పేది. పాకిస్తాన్ ఉసికొలిపిన కిరాతక మూకలు ముజఫరాబాద్‌ను ఆక్రమించి ధ్వంసం చేస్తున్నప్పుడే భారత సైన్యాన్ని పంపి సకాలంలో భరతం పట్టి ఉంటే డోమెల్, బారాముల్లా ఇతర పట్టణాలు కూలేవి కావు. ఎట్టకేలకు భారత సేనలను ఆకాశమార్గాన తరలించిన తరవాతయినా వాటి పని వాటిని చేయనిస్తే, వీరజవాన్లు దుండగులను తరిమి మొత్తం జమ్మూ-కాశ్మీర్‌ను దురాక్రమణ నుంచి విముక్తి చేసి ఉండేవారు. 1971లో పాకిస్తానే దుర్మార్గంగా దండెత్తి వచ్చి, మన చేతిలో నడుము విరిగి కూలబడ్డ స్థితిలోనైనా సైనిక ఘన విజయాన్ని తెలివిగా వినియోగించుకుని ఆక్రమిత కాశ్మీర్ నుంచి పాకిస్తాన్ వైదొలిగేట్టు గట్టి పట్టు పట్టవలసింది. కానీ - కాశ్మీర్‌లో పాకిస్తాన్ దురాక్రమణ ఊసయినా ఎత్తకుండా యుద్ధంలో మనకు కైవసమైన పాక్ ప్రాంతాలన్నింటినీ ఖాళీచేసి, సుమారు లక్షమంది యుద్ధ ఖైదీలను వదిలిపెట్టి మన మంచితనానికి మనమే తెగ మురిసిపోయాం. మళ్లీ పావు శతాబ్దం తరవాత అసలు సమస్యలు పక్కకు నెట్టి, పాకిస్తాన్‌తో చెలిమి కోసం పరితపించి భారత ప్రధాని బస్సు వేసుకుని లాహోర్ పోయినప్పుడు పాకిస్తానీల కల్లకబుర్లకు మురిసి ముప్పందుమయ్యారే తప్ప మన వెనుక శత్రుదేశం తీస్తున్న గోతులను, మన సరిహద్దు లోపలికి సాగిస్తున్న చొరబాట్లను భారత సర్కారు గమనించనే లేదు. కార్గిల్ యుద్ధంలో వందలాది వీర సైనికులు

ప్రాణాలు అర్పించి, అష్టకష్టాలు పడ్డాక సైనిక దిగ్విజయం సాధించాకైనా అదే ఊపులో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌నూ విముక్తి చేసి, చేజిక్కిన చొరబాటుదారులను బంధించి, పాకిస్తాన్‌ను దోషిగా బోనెక్కించేందుకు మన ప్రభువులకు బుద్ధి పుట్టలేదు. అందివచ్చిన స్వర్ణావకాశాన్ని వదులుకుని, దురాక్రమణకు పాల్పడిన దుండగులను క్షేమంగా వెనక్కి వెళ్లనిచ్చి, తమ సజ్జనత్వానికి తాము సర్టిఫికెట్లు ఇచ్చేసుకుని వాటిని చూస్తూ వారు పొంగిపోసాగారు. ఆఖరికి భారత పార్లమెంట్ మీద పాకిస్తానీ టెర్రరిస్టులు దాడి చేశాక, మరి కొన్ని నెలలకు జమ్మూ కాశ్మీర్‌లోని సైనిక శిబిరాలపై అమానుషమైన దాడి జరిపించి ఊచకోత కోయించాక.. ఎట్టకేలకు తెగువ తెచ్చుకుని సరిహద్దులకు సైన్యాన్ని భారీ ఎత్తున తరలించినా, శత్రువు మీదికి వాటిని పౌరుషంతో ఉరికించటానికి ఏలిన వారికి ధైర్యం చాలలేదు. శత్రు దేశానికి చచ్చు హెచ్చరికలు విసుగు లేకుండా, చేసి, వారితో వీరితో మొర పెట్టుకుని అంతర్జాతీయ జోక్యాలను అపేక్షించి, ఆరు నెలలు సాము చేయించిన తరువాత ఏమీ సాధించకుండానే, తోక ముడిచి సేనలను వెనక్కి పిలిపించారు.

చిత్రమేమిటంటే – ఈ అరవై ఏళ్లలో మన ప్రభుత్వాల అసమర్థ నిర్వాకాల్లో, చవి చూసిన వైఫల్యాల్లో ఏ ఒక్కటీ కొత్తది కాదు. గడచిన 1400 సంవత్సరాల చరిత్రలో ఇంచుమించుగా ఇవే తప్పులను భారతీయ ప్రభువులు ఎన్నోమార్లు చేశారు. పేర్లు వేరు; శతాబ్దాలు మార్పు; సందర్భాల తేడాలే తప్ప తీరు మాత్రం అదే. ముందు చూపులేకపోవటం; తమ చుట్టూ ఏమి జరుగుతోందో పోల్చుకోలేక పోవటం, అతి మంచితనంతో నయవంచనలకు మోసపోవటం, శాంతిప్రియత్వానికీ పిరికితనానికీ మధ్య తేడా కానకపోవటం; పొంచి ఉన్న ప్రమాదాన్ని సకాలంలో గుర్తించి తగిన ప్రతిక్రియ చేయలేక పోవటం, పరాక్రమం ఉండి కూడా స్వయం కృతాపరాధాలతో పరాభవం పాలవటం ఆది నుంచీ మన పాలకులకు అలవాటే.

భారతదేశం మీద మహమ్మదీయుల దాడి క్రీ.శ. 1000లో గజనీ మహమ్మద్‌తో మొదలైందని చాలా మంది అనుకుంటారు. నిజానికి ఈ దండయాత్ర క్రమం దానికి మూడు శతాబ్దాల పూర్వం క్రీ.శ. 712లో మహమ్మద్ బిన్ కాసిం (ఇప్పుడు పాకిస్తాన్‌లో భాగమైన) సింధు రాజ్యాన్ని కబళించటంతో మొదలైంది. అది కూడా తలవని తలంపుగా అప్పటికప్పుడు అయింది కాదు. అంతకు 75 సంవత్సరాల పూర్వం నుంచీ ఇండియా మీద వరసగా దాడులు జరుగుతూ వచ్చాయి. క్రీ.శ. 632లో మహ్మద్ ప్రవక్త మరణానంతరం, ఎనిమిదేళ్ల లోపలే ఇస్లాం ప్రాబల్యం అరేబియా ద్వీప కల్పాన్ని దాటి సిరియా, ఈజిప్టులకు విస్తరించింది. తరవాత కొద్ది కాలానికే ఉత్తర ఆఫ్రికా ముస్లింల కైవసమైంది. క్రీ.శ. 642 కల్లా విశాల పర్షియన్ సామ్రాజ్యం అరబ్బుల హస్తగతమై ఉత్తరాన ఆక్సస్ నది నుంచి హిందుకుష్ పర్వతాల వరకూ అన్ని దేశాలూ వారికి స్వాధీనమయ్యాయి. ఇంత త్వరగా విశాల ప్రాంతాలకు విస్తరించాక విశాల హిందూ దేశాన్నీ తమ పెత్తనంలోకి తెచ్చుకోవాలని అరబ్బులు సహజంగానే తహతహలాడారు.

క్రీ.శ. 637లో ఖలీఫాగా ఉమర్ ఉండగా బొంబాయి సమీపాన థానా మీద అరబ్ నౌకలు దాడి చేశాయి. భారత రక్షణ దళాలు ప్రతాపం చూపి దాడికి దిగిన మూకలో ఏ ఒక్కరూ మిగలకుండా మట్టుపెట్టాయి. తరవాత కొంత కాలానికి బ్రోచ్ మీద, సింధు నదీ తీరంలోని దేవళ్ (బహుశా ఇప్పటి కరాచీ) మీద ఇలాగే దాడులు జరిగాయి. అవి కూడా

మన సేనల అప్రమత్తత వల్ల ఘోరంగా విఫలమయ్యాయి. నౌకల ద్వారా సాధించలేనిది నేలదారిన బలప్రయోగంతో సాధించాలని అరబ్బులు నిశ్చయించుకుని అప్పట్లో హిందూ రాజ్యమైన ఇప్పటి ఆఫ్ఘనిస్తాన్‌మీద, సింధ్ మీద విడవకుండా చిన్నా పెద్ద దాడులకు ఉపక్రమించారు. అవి ఫలించలేదు. ఎందుకు అని ఖలీఫా ఉమర్ వాకబు చేస్తే హిందూ రాజ్యాలు మహాపటిష్ఠమైనవనీ, వాటిని లొంగదీయటం దాదాపు అసాధ్యమనీ ఇరాక్ గవర్నర్ నిస్సహాయత వ్యక్తపరిచాడు. అనంతర కాలంలో ఖలీఫా అయిన ఉస్మాన్ కూడా చేతులు కాల్చుకుని సింధు మీద దండెత్తే ఆలోచనను విరమించుకున్నాడు. తరవాత ఖలీఫా అలీ పట్టు వదలక క్రీ.శ. 660లో పెద్ద సైన్యంతో సింధ్ మీదికి దండయాత్ర చేయించాడు. కొండ ప్రాంతంలో కొంత దూరం వరకూ అవి వెళ్ళగలిగాయి. కానీ కిక్రాస్ సమీపంలో హిందూ బలగాలు వాటిని చావుదెబ్బ తీశాయి. తరవాత ఇరవై ఏళ్లలో అదే కిక్రాస్ మీద అరబ్బులు ఆరుసార్లు దాడి చేశారు. ప్రతిసారీ ఓడిపోయారు.

ఇలా అనేక విఫల యత్నాల అనంతరం క్రీ.శ. 708లో విరోధాలు మళ్ళీ భగ్గుమన్నాయి. సింహళ ద్వీపం నుంచి ముస్లింలు చెరపట్టి ఇరాక్ తీసుకుపోతున్న మహిళల నౌకను రేవు పట్నమైన దేవళ్ (లేక దేవాలయపూర్) సమీపాన సముద్రపు దొంగలు పట్టుకున్నారు. ఇరాక్ గవర్నర్ హిజ్జాజ్ మండిపడి తక్షణం తమ నౌకను, స్త్రీలను విడిచిపెట్టమని సింద్ రాజు దాహిర్‌సేన్‌కు అల్టిమేటం పంపాడు. నడిసముద్రంలో సంచరించే దొంగల ముఠాలపై తనకు కంట్రోలు లేదని రాజు బదులిచ్చాడు. చిరకాలంగా ఇస్లాంను ధిక్కరించి దుర్భేద్యంగా నిలిచిన హిందుస్తాన్ మీద ప్రతీకారం తీర్చుకోవడానికి దానిని సాకుగా తీసుకుని హిజ్జాజ్ సింద్‌పై దండయాత్రలకు దిగాడు. వెనుకటి పరాభవాల దృష్ట్యా ఖలీఫా మొదట్లో వెనకాడినా, తాను పెట్టిన పెట్టుబడికి రెట్టింపు విలువను హిజ్జాజ్ యుద్ధ లాభాల్ల నుంచి తిరిగి చెల్లించే షరతుమీద మందీ మార్బలాన్ని సమకూర్చాడు. తొలుత ఉబేదుల్లా అనే వాడిని దేవళ్ మీదికి దండెత్తించారు. అతణ్నీ, అతడి సేననూ హిందువులు నిశ్శేషంగా చంపేశారు. తరువాత బుదాయిల్ అనే వాడిచేత దేవళ్‌పై దాడి చేయించారు. రాజకుమారుడు జయసింహ ఒక రోజంతా హోరాహోరీ యుద్ధం చేసి దురాక్రమణదారులను మట్టుపెట్టాడు.

ఈ విధంగా అనేక దండయాత్రలు విఫలమై, వెళ్ళిన వారిని వెళ్ళినట్టు హిందూ సేనలు హతమార్చసాగాక, పగబట్టిన హిజ్జాజ్ సర్వశక్తులూ ఒడ్డి, అంతిమ పోరుకు దిగాడు. ఖలీఫా సాయంతో భారీ ఎత్తున సేనలను, సాధన సామాగ్రిని సమకూర్చి, సింద్‌ను కాలరాచే గురుతర బాధ్యతను స్వయాన తన అల్లుడైన మహమ్మద్ బిన్ ఖాసింకు అప్పగించాడు. అప్పుడు ఖాసిం వయస్సు కేవలం 17. అయితేనేమి – గతంలో తమ సర్దారు లెవరి వల్లా కాని కార్యాన్ని సాధించి, హిందూ రాజ్యాన్ని కార్చిచ్చులా దహించటానికి అతడే సమర్థుడని మామగారు నమ్మాడు.

ఖాసి అతడి నమ్మకాన్ని వమ్ము చేయలేదు. చూసి రమ్మంటేనే కాల్చి రాగల మొనగాడు అతడు. ఇక కాల్చే రమ్మంటే ఆగుతాడా? సర్వనాశనం చేయక మానుతాడా? ఒక దుర్ముహూర్తాన భారీ సైన్యాన్ని వెంటబెట్టుకుని వెళ్లి దేవళ్‌ను ముట్టడించాడు. మూడు రోజుల భీకర యుద్ధం తరవాత కోటను పట్టుకుని చేతికి చిక్కిన వారినల్లా ఊచకోత కోశాడు. చస్తారా, మతం మారుతారా అని మెడమీద కత్తిపెట్టి ఎందరినో ఇస్లాంలోకి మార్పించాడు. అక్కడి సుప్రసిద్ధ దేవాలయాన్ని కొల్లగొట్టి మసీదులుగా మార్పించి, వాటిలోని

పూర్వపు పూజారులనే ముల్లాలను చేశాడు. పది రోజులపాటు విచ్చలవిడిగా ఆస్తులు దోచుకొని, స్త్రీలను చెరచి, చెరబట్టి తీరుబడిగా నానా బీభత్సం సృష్టించాక దారి పొడవునా పంటలు నాశనం చేస్తూ, చెరువుల్లో విషం కలుపుతూ, గ్రామాలను ధ్వంసం చేస్తూ ఆరు రోజులు ప్రయాణించి నెరూన్ (సింద్‌లోని ఇప్పటి హైదరాబాద్) చేరుకున్నాడు.

సింద్‌కూ, అరబ్బులకూ మధ్య అనేక సంవత్సరాలుగా తీవ్ర ఘర్షణలు జరుగుతున్నప్పుడు... ఎన్నిసార్లు ఓడినా పట్టువదలక అరబ్బులు మళ్ళీ మళ్ళీ బలాలు పుంజుకుని తమ మీదికి దండెత్తుతున్నప్పుడు... శత్రువులుఏ ఎత్తు మీద ఉన్నారో, ఎలాంటి బలసమీకరణలు చేస్తున్నారో సింద్ రాజు దాహిర్‌సేన్ అప్రమత్తంగా కనిపెట్టి ఉండవలసింది. నెలల తరబడి హిజ్జాజ్ సాగించిన విస్తృత సైనిక సన్నాహాలను చారుల ద్వారా వాసన పట్టలేక పోయినా, కనీసం ఖాసిం మూకలు సుడిగాలిలా దూసుకొచ్చి దేవళ్‌ను ముట్టడించినప్పుడైనా సింధు రాజ్యంలో ప్రమాద ఘంటికలు మోగి ఉండవలసింది. సకల శక్తులనూ సమీకరించి శత్రువుల సవాలును అప్పుడే అక్కడే తిప్పి కొట్టవలసింది. కాని - 1947 సెప్టెంబరులో పాక్ దుండగులు జమ్మూ కాశ్మీర్‌లోకి చొరబడి ముజఫరాబాద్‌ను ముట్టడించినా అదేదో కాశ్మీర్ మహారాజు చూసుకోవలసిన వ్యవహారమని చెప్పి నెహ్రూ ప్రభుత్వం మిన్నకుండి పోయినట్టే 712లో దాహిర్‌సేన్ రాజ్య రక్షణను ఆయా గవర్నర్లమీద వదిలేసి చివరికి నెత్తికి చేతులు తెచ్చుకున్నాడు. స్థానిక సేనల పరాక్రమానికి లోపం లేకపోయినా, అంతశ్శత్రువుల మూలంగా వారు ప్రచండంగా పోరాడీ ఫలితం లేకపోయింది. తిండిలేక, సత్తువ తగ్గి, హిందువుల ధాటికి తట్టుకోలేక ముస్లింలు డీలా పడిన స్థితిలో... బౌద్ధ మతస్థుడైన నెరూన్ నగర పాలకుడూ, ఇతర బౌద్ధ ప్రముఖులూ సరయిన అదనులో శత్రువులతో చేతులు కలిపారు. విద్రోహుల సహకారంతో అర్ధరాత్రి దొంగతనంగా కోటలోకి చొరబడిన తరవాత ఊచకోతలు, బలవంతపు మతం మార్పిడులు, మహిళలపై అత్యాచారాలు, ఆస్తుల లూటీలు, దేవాలయాలను మసీదులుగా మార్పించడాలూ షరా మామూలే. అక్కడ యథాశక్తిగా ఇస్లామిక్ ప్రతాపాన్ని ప్రదర్శించాక సుప్రసిద్ధ శివక్షేత్రమైన శివస్థాన్ పట్టణం మీద ఖాసిం విరుచుకుపడ్డాడు. అక్కడా ఇంచుమించుగా అదే కథ.

దారి వెంట స్థానిక హిందూ ప్రముఖులను పశుబలంతో అణచేసి,లేక భయపెట్టి లొంగదీసుకుని, పెద్ద సంఖ్యలో స్త్రీలను చెరబట్టి, సంపదను కొల్లగొడుతూ ఖాసిం సేన సింధు నది పశ్చిమ తీరాన్ని చేరింది. ఉరకలేస్తున్న ఆ మహానదిని ఎలా దాటాలా అని దిక్కులు చూస్తుండగా ఆ తీరాన్ని రక్షించవలసిన మోకా అనే హిందూ సర్దారు సమయానికి వచ్చి తనను సామంతుడిని చేసేట్టు బేరమాడుకుని పడవలను సమకూర్చి ఆవలి తీరం చేర్చాడు. తూర్పు తీరం చేరేసరికి మోకా తమ్ముడు వచ్చి ఖాసింతో చేరిపోయాడు. అయినా సరే దాహిర్‌తో తలపడేందుకు ధైర్యం చాలక ఖాసిం సింధు నదీ తీరానే రెండు నెలలు గడిపాడు. హిజ్జాజ్ ఆగ్రహించి దాహిర్‌పైకి ఉరకమని బలవంతపెట్టాక గానీ అతడు కదలలేదు. సింధు రాజు అంటే అరబ్బులకు అంతటి సింహస్వప్నం.

చివరికి ధైర్యం కూడదీసుకుని ముందుకు కదిలాక అరబ్బులు ఒక సరస్సును చేరారు. దానికి ఆవలి ఒడ్డున దాహిర్ సేనలు వారి భరతం పట్టటానికి కాచుకుని ఉన్నాయి. అరబ్బులు సరస్సు దాటేంతవరకూ ఆగవద్దనీ, ముందే ఎదురుదాడి చేసి శత్రువులను మట్టుబెట్టవలసిందనీ దాహిర్‌సేన్‌తో మంత్రులు, సచివులు మొత్తుకున్నారు. అసలు వారిని

అంత దూరం రానివ్వడమే ప్రమాదమని – గతంలో హిజ్జాజ్‌తో విరోధించి సింధు దేశంలో దాహిర్ శరణు జొచ్చిన అరబ్బు అలాఫీ అనేవాడు ముందు నుంచే చెబుతూ వచ్చాడు. సింధు నదిని దాటనివ్వకుండా ఆవలి ఒడ్డునే శత్రువులను ఖతం చేయమని హితైషులందరూ సలహా చెప్పారు. అదే సరైన వ్యూహం కూడా. అయినా దాహిర్ లక్ష్యపెట్టలేదు. తనకు తానుగా చెరువుదాటి ఆవలికి వెళ్ళి నదీ తీరానే వారిని ఎదుర్కొంటే వారిని చూసి తాను బెంబేలు పడినట్టుగా ఉంటుందనీ, వారంతట వారిని సింహపు గుహలోకి రానివ్వడమే వీరోచితమనీ, అంతకు ముందు ఎన్నో పర్యాయాలు అరబ్బులను మన్ను కరిపించిన తాను ఈసారీ వారు ఎంత ముందుకు చొచ్చుకొచ్చినా అవలీలగా చీల్చి చెండాడగలననీ ఆ వెర్రిరాజు ధీమాగా ఉన్నాడు.

అదే అతడి కొంప ముంచింది.

సుప్రసిద్ధ ఇండో – ఆంగ్లియన్ గ్రంథకర్త **వి.ఎస్. నైపాల్** ఇదే సందర్భాన్ని ప్రస్తావిస్తూ ఇలా అన్నాడు:

> King Dahir never understood the nature of the war, never understood that more than his throne was at stake. There was for him, in war, an element of chivalry and deadly play. He could have prevented Bin Qasim from crossing the Indus river. It was what he was advised to do. But he considered such an act undignified. He could have retreated and left the desert to deal with the invaders. It was again what he was advised to do. He considered this too undignified.
>
> ***[Among the believers : An Islamic Journey, P. 132]***
>
> *(యుద్ధ స్వభావాన్ని దాహిర్ రాజు ఎన్నడూ అర్థంచేసుకోలేదు. ముప్పు వచ్చింది తన గద్దెకు మాత్రమే కాదన్న సంగతీ ఆయన గ్రహించలేకపోయాడు. అతడి ఉద్దేశంలో యుద్ధం అంటే ప్రాణాలను పణం పెట్టి శౌర్యంతో ఆడే ప్రమాదకరమైన క్రీడ. తలచుకుంటే బిన్ ఖాసింను సింధు నది దాటకుండా అతడు అడ్డుకోగలిగేవాడు. ఇతరులు అతడికిచ్చిన సలహా కూడా అదే. కాని అలాంటి పని తన హుందాకు తగదని అతడు భావించాడు. యుద్ధంలో గెలవలేనప్పుడు అతడు వెనక్కి తగ్గగలిగేవాడు. ఎడారి దాటి వెళ్ళి ఆనక దురాక్రమణ దారుల పనిపట్టగలిగేవాడు. ఆ సలహానే అతనికి ఇచ్చారు. అదీ తనకు పరువు తక్కువని అతడు అనుకున్నాడు.)*

ఆ రకంగా వీరత్వానికీ మూర్ఖత్వానికీ తేడా తెలియని విచిత్ర మనస్తత్వంతో గొప్ప బలం, అద్భుత పరాక్రమం ఉండి కూడా దాహిర్‌సేన్ గువ్వపిట్టలా ఖాసిం గుప్పిట్లో చిక్కాడు. పెద్ద మనసుతో ఆయన శరణు ఇచ్చిన అలాఫీ కూడా అరబ్బుల ఏజంటుగా మారి నమ్మకద్రోహం చేశాడు. రోవర్ సమీపాన పదకొండు రోజులు హోరాహోరీగా సాగిన చరిత్రాత్మక యుద్ధాన్ని ఆ కాలంలో రాసిన **CHACHNAMA** కళ్లకు కట్టేలా వర్ణించింది. పది రోజులపాటు దాహిర్ వెయ్యి చేతుల కార్తవీర్యార్జునుడిలా చెలరేగి అరబ్బులను చీల్చి చెండాడాడు. గెలుపుమీద ఖాసిం కూడా ఆశలు వదిలేసుకుని ప్రాణాలతో బయటపడితే గొప్ప అనే అనుకున్నాడు. ఆశలుడిగి పళ్లబిగువున పోరాడుతుండగా పదకొండో రోజున

అరబ్బుల అదృష్టం పండింది. బలగాలు క్షీణించి బేజారయిన స్థితిలో విద్రోహి మోకా పెద్ద సేనతో వచ్చి వారితో కలిశాడు. అదే సమయంలో రాజుకుమార్తెలను శత్రువులు చెరబట్టారన్న వదంతి వ్యాపించి సింధు సేనల్లో కలకలం లేచింది. 'నేనున్నాను, భయం లేదు' అని ఏనుగు మీది దాహిర్ ధైర్యం చెబుతూండగా శత్రుసైనికుడు మండే బాణాన్ని వదిలి దాహిర్ గుండెను చీల్చాడు. తొమ్మిది మంది ఖలీఫాలు విశ్వప్రయత్నం చేసి క్రీ.శ. 638 నుంచి 712 వరకు 74 ఏళ్లలో 15 పర్యాయాలు దాడులు చేయించి విఫలమైన మీదట 712 జూన్ 16 సాయంత్రం మహావీరుడు దాహిర్‌సేన్ నేలకూలడంతో సింధురాజ్యం ఎట్టకేలకు ముస్లింల వశమైంది. రాజు మరణంతో సేనలు చెల్లా చెదురయ్యాయి. అనంతర కాలంలో దాహిర్ కుమారుడు జయసింహ, భార్య లాదీదేవి రాజధాని అలోర్‌ను, మిగిలిన కోటలను నిలుపుకోవటానికి వీరోచితంగా పోరాడినా శత్రువుతో కుమ్మక్కయిన విద్రోహుల మూలంగా వారి ప్రతాపమంతా నిష్ఫలమైంది.

ఆ ఊళ్లో ఇన్ని వేలమంది హిందువులను నరికేశాను. ఈ ఊళ్లో ఇన్ని వేలమందిని హడలగొట్టి మతం మార్పించాను, ఇన్ని దేవాలయాలను మసీదులుగా మార్చాను, ఇంతలేసి ఆస్తులను కొల్లగొట్టి ఇన్నివేలమంది స్త్రీలను బంధించి మీకు కానుకగా పంపుతున్నాను - అని మహ్మద్‌బిన్ ఖాసిం మామగారికి గొప్పగా ఉత్తరాలయితే రాసుకున్నాడు. అంతాచేసిఆ కుర్ర రాకాసి బావుకున్నదీ ఏమీ లేదు. తనూ కుక్క చావే చచ్చాడు. దాహిర్‌ను చంపిన రెండేళ్లకు హిజ్జాజ్ మరణించాడు. వెంటనే ఖలీఫా వలీద్ కూడా కన్నుమూశాడు. దాంతో ఖాసింకు చేటు కాలం వచ్చింది. కొత్త ఖలీఫా హిజ్జాజ్‌కు శత్రువు. అతడి కుటుంబం మీద పగబట్టి వచ్చీరాగానే ఖాసింను సింధ్ నుంచి హుటాహుటిన ఇరాక్ పిలిపించి చిత్రహింసలు పెట్టి క్రూరంగా చంపించాడు.

శత్రువు కదలికలను జాగరూకతతో కనిపెట్టి ఉండి, సకాలంలో సమర్థంగా నిరోధించలేకపోతే ఏమవుతుందో సింధ్ విషాదానుభవాన్ని చూసయినా మిగతా హిందూ రాజులు నేర్చుకోవలసింది. మతానికి, ధర్మానికి విదేశీయులవల్ల హాని కలిగినప్పుడు దానిని ఉమ్మడి సవాలుగా పరిగణించి సకాలంలో దృఢంగా ఎదుర్కోకపోవటం ఎంత సర్వానర్థహేతువో కూడా వారికి అర్థమై ఉండాలి. అనుభవం నుంచి గుణపాఠం నేర్చి ఇకముందు అలాంటి పరిస్థితి ఉత్పన్నమైతే తగిన జాగ్రత్త పడటానికీ చరిత్ర కావలసినంత అవకాశం ఇచ్చింది. సింధ్‌లో ఖాసిం రాక్షసత్వం దరిమిలా దాదాపు రెండున్నర శతాబ్దాల పాటు హిందూ దేశానికి విదేశీ దురాక్రమణ బాధ లేకపోయింది. దీర్ఘ విరామం తరవాత గజనీలు, ఘోరీలు పైశాచికంగా విజృంభించి వరస దండయాత్రలను సాగించినప్పుడైనా హిందూ ప్రభువులు తెలివి తెచ్చుకుని ప్రాప్తకాలజ్ఞత కనపరిచారా?

అమాయక చక్రవర్తులు

ఇండియాకి పాకిస్తాన్ శత్రువు. రెండు దేశాల మధ్య సవాలక్ష గొడవలున్నాయి. లెక్కలేనన్ని ఘర్షణలు జరిగాయి. విరోధాలు ఎన్ని ఉన్నా, పాకిస్తాన్ క్రికెట్ జట్టుతో టెస్ట్ మ్యాచ్ ఆడాల్సి వస్తే... ఆట అయ్యాక తాము ఆదమరచి ఉండగా అవతలి వారు తమను ఏమి చేస్తారోనని మన ఆటగాళ్లు భయపడరు. ఆ రోజు ఆట చాలించి మర్నాడు నిర్ణీత సమయానికి మళ్లీ మొదలెట్టేదాకా ఆత్మరక్షణ గురించి, ప్రత్యర్థుల వ్యూహాల గురించి టెన్షను పడకుండా ఎవరికి వారు బేఫర్వాగా ఉంటారు. ఆట నియమాలను ఎవరూ అతిక్రమించరు కనుక, ప్రతిదీ నిర్దిష్ట నిబంధనలకు, క్రీడా నియమాలకు లోబడే జరిగి తీరుతుంది కనుక ఇందులో ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు.

పూర్వకాలంలో మన దేశాన యుద్ధాలు కూడా క్రికెట్ మ్యాచిల్లాగే జరిగేవి. ఆటల్లాగే వాటికీ కొన్ని రూల్సు రెగ్యులేషన్లూ ఉండేవి. కక్షలు, కార్పణ్యాలు ఏ స్థాయిలో ఉన్నా యుద్ధ నియమాలను ఏ రాజూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించేవాడు కాదు. సాధారణంగా ఏ యుద్ధమైనా సూర్యోదయానికి మొదలై సూర్యాస్తమయానికి ముగిసేది. ఆనాటికి పోరాటం చాలించి ఎవరి శిబిరాలకువారు వెళ్లాక మర్నాడు పొద్దున తిరిగి శంఖాలు పూరించేదాకా ఎవరూ ఎవరి మీదా దాడి చేసేవారు కాదు. చీకటి మాటున దెబ్బతీయటం యుద్ధ క్రీడలో 'ఫౌల్'. అలాగే కదనరంగంలో ఆయుధాలు విడిచి లొంగిపోయిన వారిని - వారు తమకు ఎంత బద్ధ శత్రువులైనా - ఎవరూ చంపే వారు కాదు. ఆవలి పక్షం ఓడిపోయామని చేతులెత్తేసిన తరవాత యుద్ధాన్ని కొనసాగించి ఊచకోత కోసేవారు కాదు. అలాగే యుద్ధ రంగంలోకి వచ్చిన వారినే తప్ప చుట్టుపక్కల ఉన్న వారికి ఎవరూ హాని చేసేవారు కాదు. యుద్ధంలో గెలిచిన తరవాత కూడా తమకు వశమైన శత్రు రాజ్యంలో సాధారణ ప్రజలకు ఏ రాజూ అపకారం చేసేవాడుకాదు. ముఖ్యంగా స్త్రీలు, గోవులు, బ్రాహ్మణులు, బౌద్ధ భిక్షువులు ఇత్యాదులను చంపటం మహా పాపమని భావించేవారు. అందుకే - గొప్ప

సైన్యాలతో రాజులుమహా భీకరంగా యుద్ధం చేస్తూ వేల సంఖ్యలో తలలు ఎగిరిపడుతున్న సమయంలో కూడా ఆ పక్కనే ఉన్న పొలాల్లో రైతులు,. కూలీలు నిబ్బరంగా పనులు చేసుకుంటూండేవారు. ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా తమకు ప్రమాదం లేదని, తమ జోలికి ఎవరూ రారని వారికి తెలుసు. క్రీ.పూ. 4వ శతాబ్దంలో ఇండియాకు వచ్చిన మెగస్తనీస్ కూడా ఇండికాలో ఈ సంగతి చెప్పి బోలెడు ఆశ్చర్యపడ్డాడు.

మహమ్మదీయ దండయాత్రలకు ముందు కూడా భారత దేశంలో తరచూ యుద్ధాలు జరిగేవి. దండయాత్రలు, జైత్రయాత్రలు, ప్రచ్ఛన్న యుద్ధాలు, కోటల ముట్టడులు, వేల సంఖ్యలో సైనికుల ఊచకోతలు రివాజుగా సాగేవి. వారూ వీరూ కూడా యుద్ధ నీతిని, క్షాత్ర ధర్మాలను పాటించేవారయినంత వరకూ అవాంఛనీయ పరిణామమేదీ ఉత్పన్నం కాలేదు. నిర్దిష్ట నియమాలకు అందరూ కట్టుబడినంత వరకూ యుద్ధాన్ని ఒక వీరోచిత క్రీడగా పరిగణించినా ఇబ్బంది లేకపోయింది.

విదేశీయుల – ముఖ్యంగా మహమ్మదీయుల ఆగమనంతో పరిస్థితి మౌలికంగా మారింది. యుద్ధాల్లో యుక్తాయుక్తాలమీద భారతీయులకున్న నిబద్ధత బయటి దేశాల వారికి లేదు. శత్రువును గెలవటమే ముఖ్యం తప్ప ఎలా గెలిచామన్నది వారికి ప్రధానం కాదు. కుట్రలు, కూహకాలు...దొంగ దెబ్బ తీయటాలు... ఆడి తప్పటాలు... మోసాలూ, ద్రోహాలూ... గతి లేనప్పుడు కాళ్లమీద పడి శరణు వేడి, కాలం అనుకూలించగానే వికటాట్టహాసంతో ఉపకారికి అపకారం చేయడాలూ వారికి చాలా మామూలు విషయాలు. లొంగిపోయాక కూడా శత్రు సేనను సంహరించడం వారికి అలవాటు. చేతికి చిక్కిన శత్రువును వారు చంపే తీరుతారు. శత్రురాజ్యం స్వాధీనమయ్యాక సామాన్య జనం మీదే వారు ప్రతాపం చూపిస్తారు. ముఖ్యంగా స్త్రీలనూ, గోవులనూ, బ్రాహ్మణులనే ప్రత్యేక శ్రద్ధతో హింసిస్తారు. ముందుగా దేవాలయాలనే ధ్వంసం చేస్తారు. మెడమీద కత్తిపెట్టి జనం చేత బలవంతంగా మతం మార్పిస్తారు. ఊరిమీద పడి, ఇల్లిల్లూ దోచి, అందిన వారినల్లా కత్తికి ఎరవేసి, లేక బానిసలుగా చెరబట్టి, కళాత్మక కట్టడాలను వనిగట్టుకుని కూల్చి, జనావాసాలను వల్లకాడుగా మార్చి అదే మహాపరాక్రమమైనట్టు గద్దాలు దువ్వుతారు.

అగంతకులు అంతటి కుటిలాత్ములని తెలిసిపోయినప్పుడు హిందూ రాజులు కూడా తమ జాగ్రత్తలో తాము ఉండాల్సింది. శత్రువులకు ఉచ్చనీచాలతో పని లేనప్పుడు వారితో తలపడేటప్పుడు ఉచితానుచితాల జంజాటాన్ని పెట్టుకోవటం వెర్రితనం. తాము పెద్ద మనుషులు కాబట్టి అవతలి వారూ పెద్ద మనుషుల్లాగే వ్యవహరిస్తారని భ్రమించి ఆదమరచి ఉండటం, విష సర్పాలను మట్టుపెట్టకుండా తగని ఔదార్యంతో వదిలేసి చేజేతులా వినాశాన్ని కొని తెచ్చుకోవటం ఆత్మహత్యా సదృశం. విచిత్రమేమిటంటే ఈ చిన్న విషయమే మన అమాయక చక్రవర్తులకు అర్థం కాలేదు. పదే పదే ఎన్ని అఘాయిత్యాలకు గురిఅయినా, శతాబ్దాల పొడవునా మాయదారి ముష్కరుల చేతిలో ఎన్నిసార్లు దగాపడ్డా, ఎన్ని వినాశాలను కళ్ల చూసినా వారి పద్ధతి మారలేదు. చుట్టూ మడిబట్టలు కట్టాను కనుక దొంగెవడూ లోపలికి రాలేదని అమాయకంగా నమ్మిన ముసలమ్మ సామెతలాగే తాము యుద్ధ నియమాలను, క్షాత్ర ధర్మాలను తుచ తప్పక పాటిస్తున్నాము కనుక శత్రువులెవరూ తమను గెలవలేరని వెనుకటి రాజుల్లూ భ్రమల లోకంలో బతికారు. అందుకే సైనిక బలం, పరాక్రమం, యుద్ధ నైపుణ్యం ఎంత ఉన్నా నీతి, న్యాయం లక్ష్యపెట్టని రాక్షస మూకలచేతిలో ఘోర

పరాభవాల పాలయ్యారు.

'యుద్ధంలో నిన్ను పూర్తిగా పరాభవించాను. ఆ గౌరవం ఇంకొకరికి కూడా దక్కటం నాకు ఇష్టం లేదు. అందుకే నీ మీద ఇప్పుడు యుద్ధానికి వచ్చిన వారితో తల పడటానికి నీకు సాయంగా కావాలంటే సైన్యాన్ని పంపిస్తా' అని అత్యద్భుత పరాక్రమాన్ని ఒలికిస్తూ గజనీ మహమ్మద్‌కు షాహీరాజు ఆనందపాలుడు పంపిన వీరోచిత సందేశం గురించి ఇంతకు ముందు వ్యాసంలో చెప్పుకున్నాం. తన తండ్రి ఆత్మాహుతికి కారకుడైన శత్రువును యుద్ధంలో చేతికి చిక్కినా చంపకుండా పెద్ద మనసుతో వదిలిపెట్టి... పై పెచ్చు వేరెవరూ అతడిని పరాభవించకుండా అతడిని ఆదుకునే ఎక్స్‌ట్రా డ్యూటీ కూడా తన భుజస్కంధాలపై ఉందనుకున్న ఆ వెర్రిరాజు గతి చివరికి ఏమయింది?

ముల్తాన్‌ను ఏలుతున్న అబుల్ ఫత్ దావుద్‌పై కత్తిగట్టిన గజనీ మహ్మద్ అతని మీద యుద్ధానికి మీ రాజ్యం గుండా పోనివ్వమని ఆనందపాలుడిని అడిగాడు. ముందు నుంచీ దావుద్‌తో తమకుగల మైత్రీబంధం వల్ల ఆనందపాలుడు అందుకు నిరాకరించాడు. దాంతో పగబట్టిన మహ్మద్ క్రీ.శ. 1008లో అతడి మీదికి సర్వ సైన్యాలతో దండెత్తి వచ్చాడు. ముంచుకొచ్చిన ముప్పును గుర్తించి ఉజ్జయిని, గ్వాలియర్, కాలింజర్, కనోజ్, అజ్మీర్ రాజులు ఆనందపాలుడికి అండగా పంజాబ్‌కు పెద్ద ఎత్తున సేనలను తరలించారు. దేశంలో వివిధ ప్రాంతాల స్త్రీలు, పురుషులు, నగానట్రా అమ్మి శత్రువును ఎదుర్కొనేందుకు యథాశక్తి నిధిని సమకూర్చారు. అంతటి జాతీయత, అంతటి సంఘీభావం సర్వత్రా వ్యక్తమైనా, స్వతహాగా తానే మహావీరుడై గొప్ప సైన్యం ఉండి కూడా దురదృష్టవశాత్తూ ఆనందపాలుడు ఓడిపోయాడు. శత్రు సైనికుడి బల్లేనికి ఆయన ఎక్కిన ఏనుగు గాయపడి పరుగులు తీయటంతో, రాజే పారిపోతున్నాడని తలచి ఆయన సేన కకావికలమైంది. తాత్కాలికమైన ఆ తొట్రుపాటును సుల్తాన్ మహ్మద్ తనకు అనుకూలంగా మలచుకుని యుద్ధంలో గెలిచాడు. పరాజితులైన శత్రుసేనను హిందూ రాజుల్లా క్షమించి వదిలెయ్యకుండా గజనీ వెంటాడి వేటాడి 20 వేల మంది సైనికులను ఊచకోత కోశాడు. చివరికి గత్యంతరం లేక ఆనందపాలుడు సుల్తాన్ మహ్మద్‌కు లొంగిపోయి, విలువైన వస్తువులతో 50 ఏనుగులను, సుల్తాన్ సేవకు 2000 మందిని ఏటేటా పంపేట్టు ఒడంబడిక కుదుర్చుకున్నాడు. ఆ ప్రకారంగా ఆ సుల్తాన్‌కు కప్పం కడుతూ... తాను పరాభవించానని గతంలో గర్వపడ్డ శత్రువు చేతిలో ఘోరంగా పరాభూతుడయ్యాడు.

సరే! బయటి నుంచి దాడిచేసిన శత్రువుల తత్వం తమకు కొత్త కాబట్టి తామెంతో జగమంత అన్న వెర్రి నమ్మకంతో ఆనందపాలుడు తన ఔదార్యానికి తానే బలి అయ్యాడని సరిపుచ్చుకుందాం. కాని అతడికి పట్టిన దుర్గతిని గమనించాక, కనీసం బావితరాల వారయినా చరిత్ర నుంచి పాఠం నేర్చి జాగ్రత్తగా ఉండాలి కదా? వీరులపట్ల చూపాల్సిన క్షాత్రధర్మాన్ని నీచుల పట్ల పాటించటమంటే పాముకు పాలు పొయ్యటమేనన్న వివేకం కలగాలి కదా?

ఆనందపాలుడికి పృథ్వీరాజ్ చౌహాన్ ఐదారు తరాల తరవాతి వాడు. గజనీ మహ్మద్ విషయంలో ఆనందపాలుడు చేసిన తప్పునే మహమ్మద్ ఘోరీ విషయంలో పృథ్వీరాజ్ చేశాడు. ఘోరీతో యుద్ధంలో అతడు ఒకేసారి గెలిచాడని పర్షియన్ చరిత్రకారులు బుకాయించారు. వాస్తవానికి అతడు కనీసం ఏడుసార్లు ఘోరీని ఓడించాడు. చేతికి చిక్కిన ప్రతిసారీ అతడిని క్షమించి, రాచమర్యాదలతో గౌరవించి, గొప్ప బహుమానాలను కూడా

ఇచ్చి సగౌరవంగా వెనక్కి పంపాడు. తురుష్క ముష్కరుడు ఆ మంచితనానికి ఆజన్మాంతం రుణపడి ఉండకపోగా ప్రతీకారంతో రగిలి, ఎలాగైనా అతడిని గెలవాలని పంతంబట్టి, పట్టుదలతో పథకాలు వేశాడు. ఎట్టకేలకు తారాయిన్‌లో రెండో యుద్ధంలో మాయచేసి గెలవగానే తన ప్రాణదాత ప్రాణాలు తీశాడు. 'నేను నిన్ను ఏడుసార్లు పట్టుకుని ఏడుసార్లూ దయతలచి విడిచిపెట్టాను కదా. ఆ ఉపకారాన్ని గుర్తు చేసుకునైనా నన్ను విడువు'మని పృథ్వీరాజ్ అంటే 'కనుకే నిన్ను విడవటానికి వీలులేదు. నీలా చేతికి చిక్కిన శత్రువును వదిలేంత మూర్ఖుడిని కాదు. శత్రువును మొదట పట్టుకున్నప్పుడే చంపివేస్తే ఇవాళ నీకీ గతి పట్టేది కాదు కదా? నీ మూర్ఖత్వానికి ఫలం అనుభవించక తప్పదు' అంటూ ఆ మహావీరుడిని ఘోరీ నరికిపారేశాడు.

గతంలో చేతికి దొరికినప్పుడు విడిచిపెట్టటం ఒకటే కాదు. తాను మహా యోధుడు అయి కూడా, 150 మంది సాటి రాజకుమారులు వివిధ రాజ్యాల నుంచి సైన్యాలతో తనకు సాయంగా వచ్చినా, ముసల్మాన్ల కంటే అన్ని విధాల బలాధిక్యం ఉండీ 1192లో రెండో తారాయిన్ యుద్ధంలో పృథ్వీరాజ్ ఓడిపోవటానికి అతడి అవివేకమే ముఖ్యకారణం. చతురంగ బలాలతో యుద్ధ రంగానికి తరలిన వెంటనే శత్రువును ఎదుర్కొని, నిర్దయగా పీచమణచాల్సింది పోయి – 'అనవసరంగా మా చేతిలో ఎందుకు చస్తారు? ఆఖరి అవకాశం ఇస్తున్నాను. ఇప్పుడే వెనుతిరిగి పోండి. మిమ్మల్ని క్షేమంగా వెళ్ళనిస్తాం' అని మొన్నటి కార్గిల్ యుద్ధంలో మన జార్జిఫెర్నాండెజ్‌లా అడక్కుండానే ఆఫర్ చేశాడు. శత్రువులు తమ చేతిలో నిష్కారణంగా ఎక్కడ చచ్చిపోతారోనన్న అతి మంచితనంతో, తన శక్తిమీద అపరిమితమైన నమ్మకంతో అలాంటి ఆఫర్‌ను ఏకపక్షంగా ప్రకటించటం మంచిదే అనుకుందాం. ఆ తరవాత శత్రువు కదలికలను అప్రమత్తంగా కనిపెట్టి ఉండాలి కదా? మీరన్నమాట మా సుల్తానన్నకు తెలియపరుస్తాను. ఆయన ఏమి చేయమంటే అలా చేస్తాను. దయచేసి అంతవరకూ ఆగండి – అని మాయదారి ముష్కరుడుఅనగానే నమ్మేయడమేనా? అతగాడికి జవాబు అంది, యుద్ధం చేయదలిస్తే పోరుకు రమ్మని తమకు బెల్లు కొట్టేదాకా ఆయుధాలు పక్కన పడేసి రికామీగా కూర్చోవడమేనా? సూర్యాస్తమయం తరవాత యుద్ధం చేయరాదన్న నియమం హిందువులకు ఉండవచ్చు. హిందూ రాజులందరూ దానికి సర్వదా కట్టుబడి ఉండవచ్చు. కాని – ప్రస్తుతం యుద్ధం చేయబోయేది సాటి హిందూ రాజులతో కాదు కదా? అవతలి వారు ఏ నీతినీ, ఏ రీతినీ మన్నించేవారు కాదని చిరకాల అనుభవంలో తేలిపోయినప్పుడు వారు ఏ ఎత్తు మీద ఉన్నారో, ఏ పన్నాగాలు పన్నుతున్నారో కనిపెట్టి తమ జాగ్రత్తలో తాము ఉండాలి కదా? క్రికెట్ మ్యాచ్ చాలించాక మర్నాడు మళ్లీ నిర్ణీత సమయానికి మొదలయ్యే దాకా ఆటగాళ్లు బ్యాట్లు అవతల పారేసి కులాసాగా కాలక్షేపం చేసినట్టు... లక్షకు పైగా సైన్యం తమ కుత్తుకలు తెగ నరకటానికి అవల దండు విడిసిన సమయంలో చీకటి పడింది కనుక యుద్ధం టైము కాదు లెమ్మని హిందూ సేనలు ఆదమరచి ఉండటాన్ని ఎలా సమర్థించగలం? అలవాటు ప్రకారం తెల్లవారు ఝామున 3 గంటలకే లేచి, వ్యాయామాలు, స్నానాలు జపాలు సాగిస్తూ కొందరు...వండుకున్న అన్నం తింటూ కొందరు... చప్పుడు కాకుండా సేనతో వచ్చి మెరుపుదాడి చేసిన ఘోరీకి గువ్వపిట్టల్లా చిక్కారంటే వారి నియమ నిబద్ధతకు నవ్వాలా? వారి అమాయకత్వానికి ఏడవాలా?

సాటి మానవుల పట్ల చూపించవలసిన దయ, క్షమ, మైత్రి లాంటి సుగుణాలను క్రూరమైన

మానవ మృగాల పట్ల చూపించటం ఎంత అనర్థహేతువో పృథ్వీరాజ్ చరిత్ర తెలియజెప్పినా మన రాజమార్తాండుల పంథా మారలేదు. అల్లా ఉద్దీన్ ఖిల్జీ ఢిల్లీ సుల్తాన్‌గా ఉండి, చిత్తోడ్ మీద కన్ను వేసినప్పుడూ వల్ల మాలిన ఔదార్యమే రాజపుత్రుల కొంప ముంచింది. మహారాణి పద్మిని సౌందర్యం గురించి విని ఎలాగైనా ఆమెను పొందాలన్న పట్టుదలతో ఖిల్జీ వచ్చి 1302లో చిత్తోడ్‌ను ముట్టడించాడు. పరాక్రమంతో కోటను పట్టుకోవటం అతడివల్ల కాలేదు. దాంతో మోసానికి దిగాడు. పద్మినీదేవి నాకు సోదరి లాంటిది. ఒక్కసారి ఆమె ముఖాన్ని చూడనిస్తే చాలు ఆనందంతో వెళ్లిపోతానని మహారాజు రావల్ రత్నసింహుడికి చెప్పాడు. నువ్వేమిటి, మా రాణిని చూసేదేమిటి, పోపొమ్మని అతడిని మొదటే చీదరిస్తే బావుండేది. కాని అతి మంచితనానికి మారుపేరైన రాజపుత్రులు – నేరుగా చూపటం కుదరదు. అంతగా అడుగుతున్నావు కాబట్టి అద్దంలో మొహం చూపిస్తాం తృప్తిపడు అన్నారు. ఖిల్జీ ఖుష్ అయ్యాడు. అనుకున్న ప్రకారం అద్దంలో రాణిగారి ముఖావలోకన కార్యక్రమానికి సపరివారంగా తరలి వచ్చాడు. పద్మిని ప్రతిబింబం చూపించాక గృహస్థ ధర్మం ప్రకారం అతడిని మర్యాదగా సాగనంపటానికి విడిది దాకా మహారాజు వెంట వెళ్లాడు. వాటం చూసి ఖిల్జీ ఆయనను బందీ చేసి, పద్మినిని తనకు అప్పగిస్తేనే రాజును విడిచి పెడతానని షరతు పెట్టాడు. అమాయకంగా శత్రువు చేతికి చిక్కిన రావల్‌ను విడిపించుకోవటానికి రాజపుత్రులు ఎదురు మోసం చేసి, పద్మినిని పంపినట్టే పంపి, ఆమెకు తోడుగా అంతఃపుర కాంతల వేషాల్లో సైనికులను వందలాది మేనాల్లో ఎక్కించి పంపారు. చెరలోని నాథుడిని రాణి చేరుకోగానే ఇద్దరూ తప్పించుకోవటానికి వీలుగా రాజపుత్ర వీరులు రక్షణ గోడలా నిలిచి శత్రువుల చేతిలో బలి అయ్యారు. ఈ దిగ్భ్రమ నుంచి తెప్పరిల్లి వెనక్కి వెళ్లి, సకల సన్నాహాలతో మరుసటి సంవత్సరం ఖిల్జీ మళ్లీ దండెత్తి వచ్చాడు. ఆరు నెలలు కోటను ముట్టడించి దిగ్బంధం చేసి ఎట్టకేలకు విజయం సాధించాడు. మహారాజు రత్నసింహుడు సహా ముప్పైవేల మంది రాజపుత్రులు ఆ యుద్ధంలో నిహతులయ్యారు. పద్మిని సహా వెయ్యి మంది రాజపుత్ర స్త్రీలు అగ్నిప్రవేశం చేసి మానం కాపాడుకున్నారు. కాముకుడు ఖిల్జీకి చివరికి దక్కింది బూడిద. ఆ బూడిద రాశికి ఒక ప్రధాన హేతువు రాజపుత్రుల అతి మర్యాద.

చేతికి చిక్కిన శత్రువును చంపకుండా వదిలే సంప్రదాయాన్ని రాజపుత్ర వీరులందరిలోకీ గొప్పవాడని పేరుపడ్డ కుంభరాణా కూడా పాటించాడు. మహారాణా మోకుల్‌ను చంపినవాడిని తనకు అడిగినా అప్పగించకుండా ఆశ్రయం ఇచ్చినందుకు ఆగ్రహించి కుంభరాణా 1437లో మాళవ సుల్తాన్ మహమ్మద్ ఖిల్జీ మీద భీకర యుద్ధం చేశాడు. కోటలో దాక్కున్న సుల్తాన్‌ను ఖైదీగా పట్టుకుని చిత్తోడ్‌కు తెచ్చాడు. ఆరు నెలలు చెరలో ఉంచాక ఎలాంటి ప్రతిఫలం కోరకుండా పై పెచ్చు తానే వెలలేని కానుకలిచ్చి సగౌరవంగా అతడ్ని వెనక్కి పంపాడు. ఈ ఉపకారానికి కృతజ్ఞత చూపాల్సింది పోయి సుల్తాన్ అతడి మీద పగబట్టాడు. ఇరవై ఏళ్లపాటు కుటిల వ్యూహాలు పన్ని, వారినీ వీరినీ కూడగట్టి ఆరుసార్లు యుద్ధానికి వచ్చాడు. ప్రతిసారీ రాణాయే గెలిచాడు. కాని ఆ గెలుపుకోసం అతడు పడిన శ్రమ, వేలాది సైనికుల ప్రాణాల రూపేణా అతడు చెల్లించిన మూల్యం వెలగట్టలేనిది. ఈ చరిత్ర యావత్తూ తెలిసినా, 1519లో అదే మాళవ రాజ్యంలో అదే మహ్మద్ పేరుగల ఇంకో సుల్తాన్‌తో తలపడి గెలిచినప్పుడు సంగరాణా కూడా సరిగ్గా అలాంటి ఔదార్యాన్నే ప్రదర్శించాడు. పట్టుబడ్డ

సుల్తాన్‌ను తన కోటకు తెచ్చి ఆరు నెలలు బందీగా ఉంచి కానుకల రాజలాంఛనాలతో సగౌరవంగా విడిచిపెట్టాడు. దానివల్ల అతడి తలనెప్పులు పెరిగాయే తప్ప తగ్గలేదు.

చంపదగినట్టి శత్రువు చేతికి చిక్కినా చంపకుండా వదిలిపెట్టటం ఒకటే కాదు. హిందూ రాజులు సాధారణంగా యుద్ధం చేసిన తీరు, రక్షణపట్ల వారి ఆలోచన కూడా ముసల్మాన్ల చేతిలో ఓటమికి ప్రధాన హేతువులే.

నిదరోయిన నిఘా

పూర్వం రాజును చారచక్షువు అనేవారు. గూఢచారులే అతడి కళ్లు. వారి ద్వారా తన చుట్టూ ఏమి జరుగుతుందో, తనకు వ్యతిరేకంగా విరోధులు ఎలాంటి కుయుక్తులు పన్నుతున్నారో, తన పక్షం వారనుకునే వారిలో ఎవరిని ఎలా లోబరుచుకోజూస్తున్నారో, తనను దెబ్బతీసేందుకు ఎలాంటి ప్రయత్నాలు సాగుతున్నాయో, రాజ్యంలో శాంతిని, భద్రతను భగ్నం చేసి ప్రజా క్షేమాన్ని అల్లకల్లోలం చేసేందుకు ఎటువంటి విద్రోహాలు నడుస్తున్నాయో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. ఎవరినీ గుడ్డిగా నమ్మకుండా రాజ్యం లోపలా వెలుపలా మిత్రులమీదా శత్రువుల మీదా ఎలా నిఘా పెట్టాలో, ఎవరి మీద ఎటువంటి వారిని గూఢచారిగా నియమించాలో, వేగులు తెచ్చే సమాచారాన్ని ఎలా క్రాస్‌చెక్ చేసుకోవాలో వేల సంవత్సరాల కిందటే 'అర్థశాస్త్రం'లో ఆర్య చాణక్యుడు వివరంగా చెప్పాడు. మన కాలంలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐ.బి)లూ, సి.ఐ.ఎ.లూ, ఐ.ఎస్.ఐ.లూ ప్రయోగించే ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్ ఉపాయాలను ఆనాడే కౌటిల్యుడు ఉపదేశించాడు.

రాజు, రాజ్యం క్షేమంగా ఉండాలంటే ఇంటెలిజెన్స్ వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలని శాస్త్రకారులు మహాభారత కాలం నుంచీ మొత్తుకుంటున్నా, విధివశాత్తూ ఈ ఇంగితజ్ఞానం కాలక్రమంలో మన ప్రభువులకు లోపించింది. పెనుముప్పును ముందే పసికట్టి, సకాలంలో తగిన ప్రతి చర్యలు చేస్తూ, రాజ్య రక్షణ విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్న విజ్ఞత వారికి ఉంటే మహమ్మదీయ ప్రభంజనంలో శౌర్యవిక్రమాలకు పేరొందిన అనేక రాజ్యాలు పేకమేడల్లా కూలేవికావు.

ఉదాహరణకు - బానిస వంశస్థుడైన అల్లా ఉద్దీన్ ఖిల్జీ దక్షిణాపథాన్ని క్రీ.శ. 1293లో జయించిన తీరే చూడండి. అప్పటికి అతడి పెదతండ్రి జలాలుద్దీనే ఢిల్లీ సుల్తాన్. అల్లాఉద్దీన్ అతడి కింద సుబేదారుగా ఉండేవాడు. అంతవరకూ తురుష్కులెవరూ దక్షిణానికి పోలేదు. ఎవరూ చేయని పనిని తాను చేయాలని, ముఖ్యంగా సిరిసంపదలతో వెలుగుతున్న దేవగిరి

(ఔరంగాబాద్ ప్రాంతంలోని ఇప్పటి దౌలతాబాద్) నగరాన్ని కొల్లగొట్టాలని అల్లాఉద్దీన్ నిశ్చయించాడు. ఆ సంగతి సుల్తానుకు చెబితే అమ్మో అన్నాడు. ఢిల్లీ నుంచి దేవగిరికి సుమారు 700 మైళ్లు. దారిలో ఎన్నో కారడవులు. మధ్యలో ఎన్నో హిందూ రాజ్యాలు. తెలియని చోటు. దారిలో అడ్డగించినా, గుర్రాలకు దాణా, సైనికులకు తిండి దొరకనియ్యకపోయినా ఎంత గొప్ప సైన్యమూ మాడి చావవలసిందే.

అందుకే - 'వద్దురా' అన్నాడు జలాలుద్దీన్. కుమారుడు వినలేదు. నాకు హిందువుల తత్వం బాగా తెలుసులే. తమ జోలికి రానిదే వారు ఎవరి జోలికీ పోరు. ఏదీ పట్టించుకోరు. వారి రాజులు ముందుగా చెప్పి కానీ యుద్ధానికి దిగరు. ధర్మ యుద్ధం మినహా మరొకటి చేయరు. వారి సంగతి నాకు వదిలెయ్ - అన్నాడు. అన్నట్టే - ఎనిమిది వేల సైన్యాన్ని తీసుకుని గంగాతీరంలోని 'కురా' నుంచి బయలుదేరాడు. బుందేల్‌ఖండ్ అడవుల్లో చాలా రోజులు ప్రయాణించి, వింధ్యపర్వతం దాటి నర్మద ఆవలి తీరం చేరి నిరాటంకంగా, నిరాఘాటంగా దేవగిరి చేరాడు!

"త్రోవలో నంతటను నీతడు 'నేను ఢిల్లీ సుల్తానునకు తమ్ముని కుమారుడను. పెత్తండ్రితో పోరాడి రాజమహేంద్రవరపు రాజునొద్ద ఉద్యోగము సంపాదించుకొనుటకు వెళ్లుచున్నాను' అని చెప్పెను. ఈ యేడువందల మైళ్ళ ప్రదేశములో అతని మాట సత్యమా అసత్యమా అని విచారించినవాడుగాని, ఈ తురుష్కుని ముందుకుపోనిచ్చుట దేశోపద్రవకరమని తలచి యాతనిని ఎదిరించినవాడుగాని యొక్కడును లేదయ్యెను!" అని బాధపడ్డారు '***మహమ్మదీయ మహాయుగము***'లో కొమర్రాజువారు.

సరే! దారిలోని రాజులెవరూ పట్టించుకోలేదు. మధ్యలో ఎవరూ అడ్డగించ లేదు. కనీసం వేల సైన్యంతో తురకలు తనమీదికి ఉరికి వస్తున్నారని దగ్గర్లోకి వచ్చాకయినా దేవగిరి రాజు గ్రహించాడా? సైన్యాన్ని సమీకరించి వారితో తలపడ టానికి సర్వసన్నద్ధంగా ఉన్నాడా?

లేదు. ఖిల్జీ సేనలు దేవగిరిని చుట్టుముట్టే సమయానికి మహారాజు రామదేవరావు వేరే ఊళ్లో దైవదర్శనానికి వెళ్లి ఉన్నాడు. ఖిల్జీ వస్తున్నాడన్న వార్తే ఆయనకు తెలియదు. తెలిశాక, ఎదిరిద్దామంటే సమయానికి ఆయన సేనలు దగ్గర లేవు. వేరే రాజ్యానికి అవి యుద్ధానికి పోయాయి. సైనికులు లేరు కనక కనపడ్డ గ్రామస్థులనే కూడగట్టి వారి సాయంతోనే అల్లాఉద్దీన్‌తో పోరాడి, ఓడిపోయి రాజుగారు ఎలాగో కోటలోకి దూరాడు. ఖిల్జీ కోటను ముట్టడించాడు. 'నేను చిన్న సైన్యంతో అడ్వాన్సు పార్టీగా వచ్చా నంతే. వెనక నుంచి మా సుల్తాన్ సైన్యం సముద్రంలా ముంచుకొస్తున్నది' అని రాజును బెదిరించాడు. కోటలో ధాన్యం సంచులు నిండుకోవటంతో లోనివారికి తిండిలేక, వేరే దారి కానక రాజు దబ్బిచ్చి ఖిల్జీతో సంధి చేసుకున్నాడు. బయటికి వెళ్లిన దేవగిరి సైన్యం తిరిగొచ్చి ఎక్కడ తన పని పడుతుందోనని లోలోన భయం ఉండటంతో తురుష్కుడూ చప్పున సంధికి ఒప్పుకున్నాడు.

అంతలో - యుద్ధానికి పోయిన యువరాజు శంకరదేవుడు సైన్యంతో తిరిగి వచ్చి, ఖిల్జీ సైన్యాన్ని చీల్చి చెండాడసాగాడు. తన పని అయిపోయిందనే అల్లాఉద్దీన్ అనుకున్నాడు. అప్పుడే ఊహించనిది జరిగింది. కోటలోని సైనికులు యువరాజుకు సాయపడదామని ఉత్సాహంతో బయలుదేరారు. వారి గుర్రాలవల్ల లేచిన దుమ్మును చూసి, ఢిల్లీసుల్తాన్ మహాసైన్యం వస్తున్నదనుకుని శంకరదేవుడి సైనికులు పారిపోయారు. అదృష్టం ఖిల్జీని వరించింది!

పెదతండ్రిని చంపి అల్లాఉద్దీన్ ఢిల్లీసుల్తానయ్యాక దక్షిణాది రాజ్యాలను గెలవటానికి తన సేనాని మాలిక్‌కాఫుర్‌ను పంపినప్పుడూ ఇలాగే జరిగింది. 1310లో కాఫుర్ ఢిల్లీ నుంచి బయలుదేరి దేవగిరి, పైఠన్‌ల మీదుగా కర్ణాటక రాజధాని ద్వారసముద్రాన్ని కొల్లగొట్టి, రామేశ్వరం దాకా పోయినా తోవలో అతనిని అడ్డగించినవాడు, అతడి ఆనుపానులను కనిపెట్టి ముందు జాగ్రత్త పడినవాడు ఒక్కడూ లేడు.

వేగుల వ్యవస్థ అధ్వాన్నమవడం ఒక్కటే కాదు. యుద్ధంలోకి దిగాక నాటి హిందూ రాజులు చాలామంది పోరాడినతీరూ ప్రమాదభరితమైనదే. తాను కోటలో కూచుని సైనికులను కదనానికి పంపటంకాక యుద్ధంలోనూ తామే ముందుండి నడిపిచాలనుకున్న ప్రభువుల పరాక్రమం ప్రశంసనీయమే. కాని - తమ సైన్యానికేగాక వైరి సైన్యానికీ కొట్టొచ్చినట్టు కనిపించే రీతిలో, ప్రతివారూ పోల్చుకోగలిగేలా పెద్ద ఏనుగు అంబారీమీద రాజు ఆసీనుడై పోరాడుతూంటే ముందుగా ఎవరికి గురిపెట్టాలో శత్రువులకు వేరే చెప్పక్కర్లేదు. మహారాజు విజృంభించి శత్రుసేనలను చెండాడినంత వరకూ బాగానే ఉంటుంది. ఆయన బలగాలు కూడా ఉత్సాహంతో చెలరేగుతాయి. పొరపాటునో గ్రహపాటునో ఏ బాణమో తగిలి, ఏ బల్లెమో తాకి రాజు నేలకొరిగాడా అంతవరకూ అపర వీరభద్రుల్లా అరివీర భయంకరంగా పోరాడుతున్న సేనలు కంగారుపడి కకావికలవుతాయి. జయాపజయాలు క్షణంలో తారుమారవుతాయి. క్రీ.శ. 712 లో సింధు రాజ్యంలో దాహిర్‌సేన్ సేన పరాజయం పాలయింది ఇలాగే. క్రీ.శ. 1009 యుద్ధంలో పంజాబ్ రాజు ఆనందపాలుడు గజనీ మహ్మద్ చేతిలో ఓడిందీ సరైన అదనులో ఏనుగు గాయపడి పరుగు లంకించుకోవటం వల్లే! రెండో పానిపట్టు యుద్ధంలో మునుముందు మనం చెప్పుకోబోయే మహావీరుడు హేము అనూహ్యంగా అక్బర్ సేన చేజిక్కిందీ ఏనుగు మీద ఉండగా కంట్లో బాణం దిగడం వల్లనే! చెప్పాలంటే ఇలాంటి ఉదాహరణలు ఇంకా చాలా ఉన్నాయి.

ఆ కాలాన భారతదేశంలో గజబలం పేరు చెబితే విదేశీయులు గడగడ లాడేవారు. ఒక్కో ఏనుగూ పర్వతంలా పోతరించి ఉండేది. వంద ఏనుగులను ముందు నిలిపితే ఎంతటి అరబ్బీ గుర్రాలనైనా, ఎంత గొప్ప సేననైనా చావచితక గొట్టేవి. ప్రధానంగా గజబలంతోనే మన రాజులు ఎన్నో యుద్ధాలు గెలిచారు. అయితే అంత సాయం చేసే ఏనుగులే బాణాలూ, బల్లేలూ, కత్తుల ధాటికి కళవళపడి అదుపు తప్పితే సొంత సైన్యాన్నే కాళ్ళతో తొక్కివేసేవి. వరమనుకున్నదే శాపంగా మారేది. ముఖ్యంగా ఫిరంగులు, తుపాకులు వాడుకలోకి వచ్చాక యుద్ధ స్వరూపమే మారిపోయింది. వేల సంవత్సరాల కిందటే ఖండాంతరాలకు వ్యాపించి, దేశదేశాలతో వర్తక, సాంస్కృతిక సంబంధాలు పెట్టుకున్న భారతదేశానికి ఒక దశలో పూర్వపు ప్రాభవం సన్నగిల్లి, వివిధ రాజ్యాలు దేని పరిధిలో అది గిరిగీసుకుని కూచుండి పొయ్యాయి. బయట ప్రపంచంలో ఏమి జరుగుతుందో, ఏ శక్తులు ఎలా పనిచేస్తున్నాయో, కొత్త టెక్నికులు ఏమి వచ్చాయో, వాటికి అనుగుణంగా పాత పద్ధతులను మార్చుకోవటం ఎలాగో ఆకళింపు చేసుకోవటం మన మారాజులు మానేశారు. అందుకే మొగలాయీ బాబర్ తమ మీదికి గురిపెట్టిన ఫిరంగులు ఏమిటో కూడా తెలియక, వాటిని ఎలా ఎదుర్కోవాలో బోధపడక, వాటి ఎదుట ఎప్పటిలాగే గజదళాన్ని నిలిపి మనవారు కిందుమీదు అయ్యారు. 1527లో బాబర్ చేతిలో రాణాసంగ పరాజయానికి ఇది కూడా ఒక కారణం.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. హిందూ రాజులలో అంతఃకలహాలు ఎన్ని ఉన్నా దేశానికి

విపత్తు వచ్చినప్పుడు ఏకం కావడానికి మొత్తం మీద అవి అవరోధం కాలేదు. దేశం మొత్తానికి చక్రవర్తి అంటూ ఎవరూ లేక, దేనికది స్వతంత్ర రాజ్యమైన పరిస్థితుల్లో ఎంత సంఘీభావానికి అవకాశం ఉంటుందో అంత సంఘీభావాన్నీ (కొద్దిమంది మినహా) మన ప్రభువులు కనపరచిన మాట వాస్తవం. తొమ్మిదో శతాబ్దంలో సింధును అరబ్బులు ఏలుతున్నప్పుడు దానిగుండా మేవాడ్ మీదికి ఖలీఫా మామూన్ రషీద్ సేనలు దాడిచేసినప్పుడు గుజరాత్, రాజస్తాన్, పంజాబ్, ఢిల్లీ, కనోజ్, మాళవ రాజ్యాలకు చెందిన 38 మంది రాజపుత్ర వీరులు సైన్యాలతో వెళ్ళి మేవాడ్ ప్రభువు ఖుమాన్‌కు బాసటగా నిలిచి అరబ్ మూకలను నేలకరిపించారు. మళ్లీ మూడు శతాబ్దాల దాకా మేవాడ్ వైపు ఎవరూ తేరిపార చూడలేదు. ఆ తరవాతి తురకల దురాక్రమణల సందర్భంలోనూ దేశంలోని హిందూ రాజులు దాడిని ఎదుర్కొనే రాజుకు సాయంగా సైన్యాన్ని తీసుకుని వెళ్లకపోలేదు. కనీసం సైనిక సాయం చేయక పోలేదు. తద్వారా దురాక్రమణను నిరోధించడానికి సంఖ్యాబలమైతే సమకూడింది. కాని - చాలా సందర్భాల్లో ఆయా సేనలు ఉమ్మడి నాయకత్వానికి లోబడకుండా, క్రమశిక్షణ పాటించకుండా, దేనికది స్వతంత్రంగా పోరాడటంతో వివిధ రంగాల మధ్య సమన్వయం లేకుండా పోయింది. శత్రువుల సేనకంటే మనవారి సేనల బలం ఎంతో ఎక్కువైనా చాలా యుద్ధాల్లో గెలవలేకపోవటానికి ఇదో ముఖ్య కారణం.

ఇదేమాట బాబర్ కూడా అన్నాడు. చరిత్రాత్మకమైన యుద్ధంలో సంగరాణా మహాపరాక్రమంతో పోరాడినా సరైన సమన్వయం, దీటైన యుద్ధ వ్యూహం లేకే తన చేతిలో ఓడిపోయాడని *బాబర్‌నామా*లో రాసుకున్నాడు. రాజులు, సామంతులు, గవర్నర్లు, కమాండర్లు ఎంతో మంది సంగ పక్షాన ఉన్నా వారెవరూ మునుపు ఏ యుద్ధంలోనూ అతడితో కలిసి పోరాడిన వారు కారని, ఎవరి భేషజం వారిదే తప్ప క్రమశిక్షణతో ఏకనాయకత్వం కింద పనిచేసే లక్షణమే వారిలో లేదనీ బాబర్ అభిప్రాయపడ్డాడు. ఆధునిక తరహాలో అన్ని సెక్టార్లనూ అప్రమత్తంగా కనిపెడుతూ, పటిష్ఠ వ్యూహంతో అందరినీ నడిపిస్తూ ఓటమిని కూడా గెలుపుగా మార్చుకోగల సత్తా ఉన్న గొప్ప సేనాపతిగా బాబర్ ఖ్యాతిని ఎవరూ కాదనలేరు. అంతటివాడు వైరి పక్షం బలహీనత గురించి స్వయంగా చూసి చెప్పిన దానికి తగిన ప్రాముఖ్యం ఇచ్చి తీరాలి.

అలాగని - పగవాడి మాటను అక్షర సత్యమని పూర్తిగా నమ్మడానికీ వీలులేదు. బాబర్ రాతలనుబట్టి, మొగలాయీలంటే ప్రేమకొద్దీ, హిందూ రాజులంటే ఈసడింపుతోనూ చరిత్రకారులు చాలామంది - బాబర్ రణతంత్రానికి, అతడు తెచ్చిన ఫిరంగులకు తాళలేకే, తమలో తమకు శ్రుతి కలవకే 1527 యుద్ధంలో హిందువులు ఘోరపరాజయం పాలయ్యారని తేల్చారు. అది సరికాదు. వారు ఉటంకించిన లోపాలు ఓటమికి కొంతవరకే కారణం. చరిత్రను మలుపు తిప్పిన ఆ యుద్ధం గురించి చరిత్రకారులు చెప్పేదానిలో వాస్తవంకంటే అబద్ధం పాలు ఎక్కువ.

మేవాడ్ మహారాణా సంగ్రామసింహుడు మామూలు మనిషికాదు. ప్రపంచంలోని ఆల్‌టైమ్ మహావీరుల్లో అగ్రశ్రేణిన ఎన్నదగిన వ్యక్తి. 27వ ఏట 1509లో తండ్రి మరణానంతరం మేవాడ్ సింహాసనం ఎక్కేనాటికే యుద్ధంలో అతడికి ఒక కన్నుపోయింది. ఆ తరవాత రాజ్యాన్ని రక్షించటానికీ, విస్తరించటానికీ ఎన్నో యుద్ధాలు చేశాడు. ముందు పీటీన నిలిచి తన అద్భుత పరాక్రమంతో చివరిది ఒక్కటి మినహా అన్ని యుద్ధాల్లోనూ గెలిచాడు. ఆ

క్రమంలో అతడికి ఒక చెయ్యిపోయింది. ఒక కాలు విరిగింది. ఒంటి నిండా ఎనభై గాయాలయ్యాయి. అయినా మరణించేదాకా గుర్రం మీద నిటారుగా కూర్చుని స్వదేశీ, విదేశీ శత్రువులతో ప్రచండంగా పోరాడాడు. ఒకరి తరవాత ఒకరితో వరసబెట్టి పోరాడి, మహామహా రాజులనూ, సుల్తాన్లనే చిత్తుగా ఓడించి, ఉత్తరాన యమునాతీరం, తూర్పున ఆరావళి పంక్తులు, దక్షిణాన మాళవ, పశ్చిమాన సింద్‌ల వరకూ మేవాడ్ సామ్రాజ్యాన్ని విస్తరించి ఆ రోజుల్లో సాలుకు పది కోట్ల రూపాయల రెవెన్యూ రాబట్టాడు.

మిగతా రాజులు మునుపటి యుద్ధాల్లో సంగరాణాతో కలిసి పోరాడిన వారు కారని బాబర్ అన్నది అబద్ధం. ఎనిమిది మంది రాజులు, రావల్, రావత్ ఇత్యాది హోదాగల 104 మంది రాజప్రముఖులు, 80 వేల గుర్రాలతో, 500 ఏనుగులతో సంగరాణా వెంట యుద్ధం తరవాత యుద్ధంలో పాల్గొన్నారు. గుజరాత్, మాళవ సుల్తాన్లతో 18 యుద్ధాలు చేసి గెలవటమేకాక సంగరాణా మాళవ సుల్తాన్ మహమ్మద్‌ను బందీగా పట్టుకుని ఆరు నెలలు చిత్తోడ్ కోటలో ఉంచి అనేక షరతులకు లోబడ్డాక వదిలి పెట్టాడు. ఆఖరికి తనపై దాడిచేసిన ఢిల్లీసుల్తాన్ ఇబ్రహీం లోడీని 1517లో మెడలు వంచి ఉత్తర భారతంలో తనకు ఎదురులేదని నిరూపించుకున్నాడు. ఢిల్లీ సామ్రాజ్యం మీద తనకు హక్కు ఉన్నదని ప్రకటించి ఢిల్లీ గద్దెనెక్కడం కోసం కడదాకా గట్టి ప్రయత్నాలు చేశాడు.

ఆ సందర్భంలోనే రాణాసంగ దృష్టి బాబర్ మీద పడింది. చాలామంది హిందూ రాజుల్లా తన కలుగులో తాను కూరుకుని, ఇరుగు పొరుగు రాజ్యాలతో చిటపటల్లో మునిగి మిగతా ప్రపంచాన్ని పట్టించుకోని తత్వం కాదు సంగ్రామసింహుడిది. తెలివితేటల్లో, రాజతంత్రంలో అతడు బాబర్‌కంటే నాలుగాకులు ఎక్కువ చదివినవాడు. అప్పటికే లోడీ సుల్తాన్ విరోధులు కొందరు ఇండియా మీదికి దండెత్తి రమ్మని కాబూల్‌లో బాబర్ దగ్గరికి రాయబారాలు పంపారు. అతడూ ఆ ప్రయత్నంలోనే ఉన్నాడు. సరిగా అప్పుడే సంగరాణా కూడా తెలివిగా బాబర్‌కో రస్సా వేశాడు. నువ్వు కనుక సేనలతో లోడీ సుల్తాన్ మీదికి దండెత్తితే నేను కూడా సేనలతో ఆగ్రా వైపు కమ్ముకుని నీకు సాయపడతానని ఎరవేశాడు. ముల్లును ముల్లుతో తీసినట్టు పగవాడైన ఒక తురకను ఇంకో తురక ద్వారా అడ్డు తొలగించుకుంటే ఢిల్లీని వశం చేసుకోవాలన్న తన ఆశయం నెరవేరుతుందని రాణా ఎత్తుగడ. ఆఫ్ఘాన్లు, తురుష్కులు ఇండియా మీదికి దండెత్తేది సంపదను దోచుకోవటానికే తప్ప సామ్రాజ్యం స్థాపించటానికి కాదని శతాబ్దాల చరిత్ర చెబుతుంది కదా? గజనీ మహ్మద్‌లాగే, తైమూర్‌లాగే బాబర్ కూడా అందినంత సంపద మూటకట్టుకుని పోతాడే తప్ప శాశ్వతంగా ఇక్కడే తిష్ఠ వేసేవాడు కాదు. కనుక అతడు పోయాక భారత సామ్రాజ్యాన్ని తురకల నుంచి విముక్తిచేసి మనం హస్తగతం చేసుకుందాం - అని సంగరాణా ఆలోచన.

అక్కడే అతడి అంచనా తప్పింది. ఊహించనిది జరిగింది. హిందుస్తాన్ మీద దండెత్తిన బాబర్ 1526లో పానిపట్టు దగ్గర ఇబ్రహీంలోడీని ఓడించాడు. ముందుగా అనుకున్న ప్రకారం సంగరాణా అతడి సాయానికి వెళ్లలేదు. దాంతో బాబర్ రాణాపై కత్తిగట్టాడు. దానికి సంగ భయపడలేదు. కానీ అతడి పథకాన్ని తారుమారు చేస్తూ బాబర్ తన సామ్రాజ్యానికి ఢిల్లీని కేంద్రస్థానం చేసి అక్కడే స్థిరపడాలని నిశ్చయించుకున్నాడు. ఢిల్లీని చేజిక్కించుకోవడంతోపాటు చుట్టుపక్కల రాజ్యాలనూ ఒకటొకటిగా ఆక్రమించాలని అతడు సంకల్పించాడు. ఆ పనిని అప్పటికే సంగరాణా పూర్తిచేసి ఢిల్లీ గద్దెకోసం అర్రులు చాస్తున్నాడు.

దాంతో బాబర్‌కూ, రాణాకూ ఘర్షణ అనివార్యమైంది. ఇరుసేనలు ఇప్పటి ఫతేపూర్ సిక్రీ దగ్గర భీకరంగా తలపడ్డాయి.

అదీ 1527 యుద్ధానికి నేపథ్యం.

ఒకరకంగా దాన్ని విదేశీ దురాక్రమణదారుపై జరిగిన జాతీయ యుద్ధమని చెప్పవచ్చు. ఎందుకంటే రాజపుత్ర వీరులు, ఇతర హిందూరాజ ప్రముఖులేగాక ఢిల్లీలో బాబర్ గెంటేసిన లోడీలు, ఇతర ఆఫ్ఘాన్ ప్రముఖులు కూడా సంగరాణా వెంట ఉన్నారు. అతడి సైన్యంలోనూ హిందువులతోబాటు వేలాది ముస్లింలు ఉన్నారు. బాబర్ సైన్యం 80 వేలుకాగా రాణా బలం 1,80,000 అని ***Afsan-i-Shahan*** లో రాశారు. చరిత్రకారులు చెబుతున్నట్టు తుపాకులు, ఫిరంగులు, బాబర్‌గారి యుద్ధ నైపుణ్యమే ఫలితాన్ని నిర్ణయించి ఉంటే మొగలాయిలు అవలీలగా మొదటే గెలిచి ఉండాల్సింది. కాని జరిగింది వేరు. ఖాణ్వా దగ్గర జరిగిన తొలి యుద్ధంలో బాబర్ సేనలను రాణా నజ్జు నజ్జు చేశాడు. క్షతగాత్రులు మొర్రో అంటూ వెనక్కి వెళ్ళి అతడి ప్రతాపాన్ని వివరించటంతో మిగతా సర్దార్లకూ కాళ్లూ చేతులు చల్లబడ్డాయి. యుద్ధం చేయటం తమవల్లకాదని బాబర్ సేనలు మొరాయించాయి. దాంతో తాగుబోతు బాబర్ మద్యం పాత్రలు పగలగొట్టి, జన్మలో మద్యం ముట్టనని ప్రతిజ్ఞచేసి, అల్లాను నమ్ముకుని విజయమో వీరమరణమో పొందుదామని సర్దార్లకు స్పీచ్‌లిచ్చి, ఖొరాన్ పట్టి ప్రమాణం చేయించి నానా హైరానపడితేగాని సైనికులు సమాధానపడలేదు. ఈ సంగతులన్నీ ***Tazakh-i Babri*** లో స్వయంగా బాబరే రాసుకున్నాడు.

బాబర్ తత్వం అనుభవంలో అర్థమయ్యాకయినా జాగుచేయకుండా అదను చిక్కినప్పుడే సంగరాణా అతడిని అణచివేసి ఉంటే చరిత్రగతి మరో విధంగా ఉండేది. ఖాణ్వాలో శృంగభంగమై తురక సైన్యం బెంబేలుపడుతున్న స్థితిలోనే రాణా బాబర్‌ను వెంటాడి వేటాడి పాదాక్రాంతం చేసుకోవలసింది. కాని – రణతంత్రంలో ఆరితేరిన సంగరాణా అంతటి మహావీరుడిని కూడా ఆ సమయంలో భారతీయులకు సహజమైన దయ, క్షమ, శాంతిప్రియత్వం లాంటివి ఆవహించాయి. సంధికి ఒప్పుకుంటావా లేదా అని అతడు ఒకటికి పలుమార్లు రాయబారం పంపగా బతకనేర్చిన బాబర్ అదిగో ఇదిగో అని మిషలు పెట్టి తాను కాలూ చెయ్యీ కూడదీసుకునేదాకా దాదాపు నెలరోజులు కబుర్లతో కాలక్షేపం చేశాడు. ఈలోపు రాణా పనుపున రాయబారం నడిపిన రాయసేన్ రాజును తెలివిగా బుట్టలో వేశాడు. బాబర్ కాళ్లబేరానికి వచ్చేస్తున్నాడు; జన్మలో మీ తెరువు రాడు అని అతగాడు రాణాను నమ్మించి ద్రోహం చేశాడు. ఉరుము లేని పిడుగులా బాబర్ రాణా సేనల మీదపడగానే ఆ మిత్రద్రోహి సైన్యంతో సహా బాబర్ మందలో కలిశాడు. అక్కడికీ కాలూ చెయ్యీ కన్నూ లేకపోయినా ఒళ్ళంతా గాయాలతో సంగ్రామసింహుడు ఏనుగునెక్కి మహోగ్రంగా వీరవిహారం చేశాడు. కాని శత్రు సైనికుడి దాడిలో ఆయువుపట్టుపై దెబ్బపడి స్పృహ తప్పాడు. వెంటనే అతడిని ఏనుగుమీంచి దింపి అనుచరులు గుర్రం మీద దూర ప్రాంతానికి తరలించారు. స్పృహలోకి రాగానే గుర్రమెక్కి యుద్ధానికి పోవాలని ఆరాటపడ్డాడు కాని అప్పటికే యుద్ధం అయిపోయింది. రాణా లేని సేనను బాబర్ సునాయాసంగా ఓడించాడు. జరిగింది విని సంగరాణా బొటబొట కన్నీరుకార్చాడు. శత్రువును గెలవకుండా మళ్ళీ చిత్తోడ్‌లో అడుగు పెట్టను. తలపాగా ధరించను అని భీషణ ప్రతిజ్ఞ చేశాడు. ఆ దిశలో విశ్వ ప్రయత్నం మొదలెట్టాడు. కాని దురదృష్టవశాత్తూ కొద్దికాలానికే కన్నుమూశాడు.

ఖాణ్వా యుద్ధంలో బాబర్‌కు దక్కింది ఘన విజయమేమీ కాదు. గెలిచాక కూడా మేవాడ్ రాణా అంటే అతడికి వెరపుపోలేదు. దీనికి ఒక్కటే రుజువు. యుద్ధంలో తన చేతికి చిక్కిన వేలాది హిందువులను ఊచకోత కోయించి వారి కపాలాలతో గోపురాలు కట్టించి పైశాచికానందం అనుభవించిన మహావీరుడు.. సంగరాణాతో జతకలిసిన నేరానికి ఆ వెంటనే చందేరీ కోటను పట్టుకుని అక్కడ అందినవారినల్లా ఊచకోత కోయించిన మహాశూరుడు... అటు నుంచి వెనుదిరిగిపోయాడే తప్ప చిత్తోడ్ మీద పడి రాణా రాజ్యాన్ని నాశనం చేయలేదు. చేయదలచుకోకకాదు; చేసేందుకు ధైర్యం చాలక! ఆ తరవాత కూడా బాబర్ మళ్ళీ ఎప్పుడూ మేవాడ్ తెరువు పోలేదు. సంగ్రామసింహుడి ప్రతాపానికి ఇంతకంటే నిదర్శనం ఏమికావాలి?

రాణాప్రతాప్

పొట్టేలు కొండను ఢీకొంటే ఏమవుతుంది? కొండ చెక్కుచెదరదు. పొట్టేలు కొమ్ములే విరుగుతాయి. దాని తలే పగులుతుంది. కదా?! మరి – పెద్దకొండే వచ్చి ఢీకొట్టినా చిన్నపొట్టేలు చెక్కుచెదరకపోతే...? కొండకే తలపగిలి, పొట్టేలును ఏమీ చేయలేక, చేతులెత్తేస్తే...? ఆ పొట్టేలు కండబలాన్ని ఎలా వర్ణించాలి? పొట్టేలు కాకుండా – ఒక మనిషే కొండతో తలపడి గెలిచి, అజేయంగా నిలవగలిగితే ఆ మహావీరుడి పరాక్రమాన్ని ఏమని కొనియాడాలి?

అంతటి వీరుడు నిజంగా ఉంటాడా అని సందేహించనక్కర్లేదు. అటువంటి మహాశూరుడు మన దేశంలోనే ఉన్నాడు. పుక్కిటి పురాణాల్లో కాదు... ప్రామాణిక చరిత్ర గ్రంథాల్లోనే అతడి విజయగాథ అక్షరబద్ధమైంది. ఎటొచ్చీ– ఆ మహాపురుషుడి ఘనతకు గర్వించి, అతడిని జాతీయవీరులలో అగ్రశ్రేణిన నిలిపే విజ్ఞతే మన మేధావి లోకానికి కొరవడింది. జాతి జనులు గుండెల్లో పటం కట్టి అతడిని ఆరాధిస్తున్నా... అరువు బుర్రలతో తప్ప ఆలోచించలేని, మూర్ఖపు భ్రమలలో తప్ప బతకలేని మన సోకాల్డ్ బుద్ధిజీవులకు అతడికి సముచిత గౌరవం ఇవ్వడానికి ప్రాణం ఒప్పదు.

ఆ వీరుడి పేరు: రాణాప్రతాప్; అతడిని అణచబోయి బోర్లపడ్డ కొండ పేరు: అక్బర్ ది గ్రేట్! విన్సెంట్ స్మిత్ మాటల్లో చెప్పాలంటే 16వ శతాబ్దం చివరి పాదంలో ప్రపంచంలోకెల్లా అత్యంత శక్తిమంతుడైన, అత్యంత సంపన్నుడైన మొగలాయీ చక్రవర్తి.

అప్పటికే దాదాపుగా మొత్తం ఉత్తర భారతాన్ని తనకు పాదాక్రాంతం చేసుకుని, సర్వంసహాధిపత్యానికి సవాలుగా మిగిలిన చిన్నపాటి మేవాడ్ రాణాను కూడా కాలికింద నలిచెయ్యాలని అక్బర్ సర్వశక్తులూ ఒడ్డే సమయానికి రాణాప్రతాప్‌ది నమ్మశక్యంకాని దీనావస్థ. అతడు పేరుకు రాజు. కాని ఏలడానికి రాజ్యం లేదు. పోయిన రాజ్యం తెచ్చుకునేందుకు యుద్ధం చేద్దామంటే సైన్యం లేదు. సైన్యాన్ని సంపాదించడానికి ఖజానాలో చిల్లిగవ్వలేదు. సాటి రాజులెవరినైనా సాయం అడుగుదామా అంటే – రాజనీతి నిపుణుడైన

అక్బర్ అప్పటికే రాజుల మధ్య భేదాలు తెచ్చి, సామదాన దండోపాయాలతో, వివాహ తంత్రాలతో అనేకులను తనవైపుకు తిప్పుకున్నాడు. ఇదివరలో మేవాడ్ రాణాలకు అండదండగా నిలిచిన జోధ్‌పూర్, అంబేర్, బికనీర్, బుందీ వగయిరా రాజు లందరూ అక్బర్ పక్షం వహించారు. ఆఖరికి ప్రతాపసింహుడి తమ్ముడు సాగర్‌జీ అనేవాడు కూడా మొగలుల పంచనచేరాడు.

ఇలా - ఎటుచూసినా ఆశలేదు. పైగా చేసేది అరణ్యవాసం. అందులో ఎన్నో ఇక్కట్లు. తరుముకు వచ్చే శత్రువు నుంచి తప్పించుకుంటూ, ఎప్పుడు ఎటు నుంచి దాడి జరుగుతుందోనని అప్రమత్తంగా గమనిస్తూ, ఎప్పటికప్పుడు మకాం మారుస్తూపోవడం వల్ల తనకూ, పరివారానికీ చెప్పరాని ఇబ్బందులు. ఒక్కోసారి అరణ్యంలో ఆరుబయట ఏ అచ్ఛాదనా లేకుండా భార్యాబిడ్డలతో నిదురించాల్సి వచ్చేది. ఒక్కోసారి వండుకోవటానికి గింజలు లేక అడవిలో ఏమి దొరికితే అది తిని కడుపు నింపుకునేవారు. ఇంకోసారి భోజనానికి కూచోగానే శత్రువుల జాడ తెలిసి ముద్దనోటిలో వేసుకోకుండానే కత్తిపట్టి పరుగులు తీయాల్సి వచ్చేది. కొన్నిసార్లు శత్రువుల బారిన పడకుండా గుహలలో, గనులలో భార్యాబిడ్డలను దాచవలసి వచ్చేది. ఆరావళి పర్వత శ్రేణులలో పసివారయిన రాజకుమారులను ఉయ్యాలలో వేయడానికి ఆనాడు చెట్లకు కట్టిన కొక్కేలు ఇప్పటికీ చూడవచ్చునట. రాజభక్తి, దేశభక్తిగల వీరులను కూడగట్టి, భిల్లుల వంటి ఆటవికులను సమీకరించి శత్రుసేనలపై ప్రచండంగా పోరాడినా ప్రతి పోరులోనూ అనివార్యంగా వందల, వేల సంఖ్యలో సైన్యాన్ని నష్టపోవలసి వచ్చేది. మళ్లీ ఆ లోటు పూడ్చుకుని, కాలు చెయ్యి కూడదీసుకోవడం చాలా కష్టమయ్యేది.

సాటి రాజులు, రాజపుత్రవీరులు, అక్బర్ పాదుషాతో సంబంధం కలుపుకొని, ఆయన ప్రాపకంలో సుఖభోగాల్లో మునిగి తేలుతుండగా ఒక్క రాణాప్రతాప్ మాత్రం ఇలా అడవులుపట్టి అష్టకష్టాలపాలు ఎందుకు కావలసి వచ్చింది? అతడొక్కడి మీదే అక్బర్ పగబట్టాడా? మిగతా రాజపుత్ర ప్రభువుల్లా రాజీకి వస్తే కాదన్నాడా? లేదు. ఎలాగయినా అతడిని తనవైపు తిప్పుకోవాలని అక్బరే తహతహలాడాడు. అందుకోసం ఎలాంటి వరాలయినా ఇస్తానని పదే పదే వారితో వీరితో రాయబారాలు పంపాడు. మిగతా హిందూ ప్రభువులు ఎవరికీ ఇవ్వనంతటి ప్రత్యేక హోదానిచ్చి నెత్తిన పెట్టుకుంటానని ఎరలు విసిరాడు. అయినా రాణాప్రతాప్ లొంగలేదు. అంగుళం బెసగలేదు. ఎన్ని కష్టాలయినా పడతాను గాని తురుష్కుడి ముందు తలవంచను అని తెగేసి చెప్పాడు. ప్రతికూల పరిస్థితులన్నిటినీ గొప్ప స్థయిర్యంతో ఎదుర్కొని - దశాబ్దంపైగా న్యాయం కోసం, ధర్మం కోసం హోరాహోరీగా పోరాడాడు. చివరికి తానే గెలిచాడు.

మహాపర్వతం లాంటి మొగల్ సామ్రాజ్యంతో ఢీకొనటానికి సాంప్రదాయిక యుద్ధతంత్రాన్ని అనుసరించి ఉంటే మహావీరులైన ఎందరో హిందూ రాజుల్లాగా రాణాప్రతాప్ కూడా ఘోరపరాజయం పాలయ్యేవాడే. పరిస్థితినిబట్టి వ్యూహాన్ని మార్చి, ఆత్మహత్యాసదృశమైన పోరాట పద్ధతులను విడనాడి, ప్రతికూలతలను అనుకూలతలుగా మార్చుకుని, అనన్యసాధ్యమైన నేర్పుతో, ఓర్పుతో గెరిల్లాయుద్ధాన్ని సాగించాడు కనకే అతడు అంతటి మహాప్రత్యర్థినీ ముప్పతిప్పలు పెట్టి అద్భుత విజయం సాధించాడు. అనంతర కాలంలో ఛత్రపతి శివాజీ వంటి జాతీయవీరులకు స్ఫూర్తినిచ్చి మార్గదర్శి అయ్యాడు.

వేరేదారిలేనప్పుడు గెరిల్లాపోరు సాగించటం రాజపుత్ర వీరులకు కొత్త కాదు. పూర్వం హమీర్, కుంభరాణా వంటి మహాయోధులు సైతం ఒక దశలో శత్రువును మాటువేసి, చాటుదెబ్బతో వేటాడే పంథాను అనుసరించినవారే. కాని అలాంటి ఘట్టాలు బహు అరుదు. సర్వసాధారణంగా పూర్వపు రాజులందరి రక్షణ వ్యూహమూ కోటల చుట్టూనే పరిభ్రమించింది. రాజధానిలోనూ, కీలక మైన ఇతర స్థలాల్లోనూ దుర్భేద్యమైన కోటను కట్టి, ఆయుధాగారాన్నీ, పెద్ద సంఖ్యలో సేననూ అందులో సర్వదా సిద్ధంగా ఉంచటం, రాచనగరులోని వారికి కొన్ని వారాలకు సరిపడా ఆహారం, వస్తు సామగ్రిని అందులో నిల్వ చేయటం రివాజు. కొండలమీద, ఎత్తయిన ప్రదేశాల్లో పటిష్ఠంగా కట్టిన దుర్గం ప్రాకారాలు శత్రువులు ఎంతో దూరంగా ఉండగానే వారి జాడను పసిగట్టడానికి, పై నుంచి బాణాలు వేసి ఎంత గొప్ప సేననైనా తేలికగా మట్టుపెట్టడానికి అనువుగా ఉండేవి. కాని – శత్రువు గట్టివాడై, చిరకాలపు పోరుకు సిద్ధపడి వచ్చి అన్ని వైపులా కోటను దిగ్బంధంచేసి, లోపలివారికి నిత్యావసర వస్తువుల సరఫరాను అడ్డుకుంటే.... కొంతకాలానికి నిల్వలు అడుగంటేవి. రక్షణ కవచం అనుకున్న దుర్గమే బోనులా మారి లోనివారు మలమలమాడే దురవస్థ దాపురించేది. గుర్రాలు, ఏనుగులు, పదాతి బలగాలతో యుద్ధాలు సాగినంత వరకూ కోటలవల్ల గొప్ప రక్షణే కలిగేది. కాని – శతఘ్నులు, గన్‌పౌడరు వాడుక లోకి వచ్చాక పరిస్థితి మౌలికంగా మారింది. పైనుంచి వేసే బాణాలనూ, విసిరే బల్లేలనూ తట్టుకుని, ప్రాణ నష్టానికి లెక్కవేయక విరోధిపక్షం వారు ఫిరంగులు పేల్చి, మందుపాతరలు పెట్టి దాడికి దిగారా? ఎంత గొప్ప కోటగోడయినా కూలి తీరవలసిందే. ముట్టడిని తట్టుకునే శక్తి సన్నగిల్లి, ప్రాకారాలు కూలడం వల్లో ఓటమి తప్పదని రూఢికాగానే కోటలోని అంతఃపుర స్త్రీలు, కులకాంతలు మూకుమ్మడిగా అగ్నిప్రవేశం చేయడం, ఆ వెనువెంటనే సైనికులు తలుపులు తెరుచుకుని, బయటికి ఉరికి చేతనైన మేరకు శత్రువులను హతమారుస్తూ నిశ్శేషంగా అందరూ నేలకొరగటం హిందూ రాజ్యాల్లో అనేక పర్యాయాలు జరిగిందే. 1303లో అల్లాఉద్దీన్ ఖిల్జీ, 1535లో గుజరాత్ సుల్తాన్ బహదూర్ షాల ముట్టడిలో చిత్తోడ్‌కోట కూలిపోయింది ఇలాంటి పరిస్థితుల్లోనే. పోరాటంలో ప్రాణం పోవాలే తప్ప శత్రువులకు లొంగకూడదు; ఎంతటి విపత్తులోనైనా వెన్నుచూపి పారిపోకూడదు అని పెట్టుకున్న నియమాల వల్ల వేలాది రాజపుత్ర వీరులు వెర్రితెగింపుతో విలువైన ప్రాణాలు బలిపెట్టుకున్నారు.

విషాదానుభవాల వరస తరవాత తమ రక్షణ వ్యూహాల గురించి, పోరాట పద్ధతుల గురించి రాణాప్రతాప్ తండ్రి (సంగరాణా కుమారుడు) ఉదయ్ సింగ్ హయాంలోనే మేవాడ్ రాజపుత్రుల్లో పునరాలోచన మొదలైంది. రేపటి గెలుపు కోసం నేడు వెనక్కి తగ్గినా తప్పులేదు. క్షాత్రధర్మాలంటూ, శూరుడి లక్షణాలంటూ మరీ చాదస్తంగా ప్రాణాలమీదికి తెచ్చుకోనవసరం లేదు అన్న ప్రాప్తకాలజ్ఞత అదృష్టవశాత్తూ కలిగింది. కాబట్టే 1567 అక్టోబరులో చిత్తోడ్ ముట్టడికి భారీ సైన్యంతో అక్బర్ కదలి వస్తున్నాడని తెలియగానే తమకు ఓటమి తప్పదని గ్రహించి, మేవాడ్ రాజప్రముఖులు మహారాణా ఉదయసింగ్‌ను, ఆయన పరివారాన్ని వేలాది గొప్పయోధులను చిత్తోడ్ నుంచి ఆరావళి పర్వతపంక్తుల్లోని అడవులకు తరలించారు. కేవలం ఏడెనిమిది వేల మంది సైనికులను మాత్రం జైమాల్ రాథోడ్ నాయకత్వంలో చిత్తోడ్ రక్షణకు ఉంచారు. సకాలంలో రాజును, రాజకుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి పంపి ఉండకపోతే ఎలాగూ గెలిచే ఆశలేని యుద్ధంలో మిగతా సైనికులతోబాటు రాణా

ఉదయసింగ్, యువరాజు ప్రతాప్ కూడా బలిపీఠం ఎక్కేవారు. అంతకు ముప్పై రెండేళ్ళ పూర్వమే బహదూర్‌షా దాడిలో 32 వేల వీరులను కోల్పోయి కోలుకోలేని దెబ్బతిన్న రాజపుత్ర జాతి 'చచ్చినా బతికినా అందరూ చిత్తోడ్‌లోనే' అన్న విధానాన్ని అనుసరించి ఉంటే అక్బర్ ముట్టడిలో ఘోరంగా చితికి ఛిద్రమయ్యేది. ఆ ప్రమాదాన్ని నివారించాలని రాజపురుషులందరి సమష్టి నిర్ణయం ప్రకారం కోట వదిలిపోయినందుకే రాణా ఉదయసింగ్‌ను రాజస్థాన్ చరిత్ర కారులు, ప్రఖ్యాత పాశ్చాత్య చరిత్రకారుడు జేమ్స్‌టాడ్ కూడా 'పిరికిపంద' అని ముద్రవేశారు. నిజానికి ఆనాడు ముందుచూపుతో చేసిన అపూర్వ నిర్ణయమే అనంతర కాలంలో రాణాప్రతాప్ విజయపరంపరకు భూమిక అయింది.

జోహార్‌లు, వీరమరణాలు, రాజపుత్రులకు కొత్తకాదు కాని – చిత్తోడ్‌లో అక్బర్ సాగించిన అమానుష హత్యాకాండ ఇస్లామిక్ కిరాతకాల చిట్టాలో మొదటి పంక్తిన ఎక్కించదగ్గది. అంతకుముందు అల్లాఉద్దీన్ ఖిల్జీ, బహదూర్ షాలు చిత్తోడ్‌లో తమతో పోరాడిన సైనికులను వధించారే తప్ప సామాన్య పౌరులను హతమార్చలేదు. ది గ్రేట్ అక్బర్ పాదుషా మాత్రం నాలుగు నెలల ముట్టడితో దిగ్బంధం చేసి, మందుపాతరలతో ప్రాకారాలను కూల్చి, ప్రధాన దుర్గ రక్షకుడు జైమాల్‌ను కాల్చి కోటలో ప్రవేశించాక పిల్లలు, వృద్ధులు, నిస్సహాయులు అన్న కనికరం లేకుండా ఊరిమీద పడి మొత్తం 30 వేల మంది అమాయక జనాన్ని పైశాచికంగా ఊచకోత కోయించాడు. అక్కడి హిందూ దేవాలయాలను, మందిరాలను పడగొట్టించి, ఆ స్థానంలో మసీదులు కట్టించి, దేవాలయాల నగారాలు, నగలు, తలుపులు ఆగ్రాకు తరలించాడు. జైమాల్ నేలకొరిగాడని తెలియగానే కుల స్త్రీలు జాగ్రత్తపడి అంతకుముందు రోజే సామూహిక చితి రగిలించి చీకటి రాత్రి ఆకాశంలో వింత కాంతి ప్రసరిస్తుండగా తెల్లవార్లూ వేల సంఖ్యలో అగ్నిప్రవేశం చేశారు. ఆత్మాహుతి చేసుకోనివారిని అక్బర్ సైనికులు వేటాడి చిత్తోడ్‌లో మనిషి మిగలకుండా నరికి పోగులు పెట్టారు. తమ రాజ్యంలో తమ రక్షణను నమ్ముకున్న ప్రజలను అంత క్రూరంగా నిశ్శేషంగా అక్బర్ సంహరించడం రాణాప్రతాప్ బతికినంతకాలమూ హృదయశల్యంలా బాధించింది. ప్రతీకారేచ్ఛ అతడి గుండెను దహించింది. అక్బర్ ఎంత మంది చేత ఎన్ని ప్రలోభాలు పెట్టించినా, ఎంతటి దీనావస్థలోనూ ప్రతాప్ రాజీకి సమ్మతించకపోవడానికి ప్రధాన కారణాల్లో ఇదీ ఒకటి.

అక్బర్ అంతటి మహానుభావుడు భారతదేశం మొత్తాన్నీ ఏకచ్ఛత్రం కిందికి తెచ్చి, సమైక్యం చేయబోతే రాణాప్రతాప్ దురహంకారంతో భేషజాలకు పోయి సైంధవుడిలా అడ్డు తగిలాడన్న కినుక మన చరిత్రకారులు చాలా మందికి ఉంది. 20వ శతాబ్దపు ఆలోచనలతో 16వ శతాబ్దపు పరిణామాలను బేరీజు వేసి తప్పొప్పులపై తీర్పు చెప్పడంలోని ఔచిత్యం గురించి ఇక్కడ చర్చించనక్కరలేదు. రాణాప్రతాప్ సమకాలికులే... ఆయనకున్న గుండె బలం తమకు లేక పరిస్థితులతో రాజీపడి తురుష్క ప్రభువుకు దాసోహమన్న హిందూ రాజులూ, రాజప్రముఖులే ఆయన ధైర్యానికి, స్థయిర్యానికి గర్వపడేవారని గుర్తు చేసుకుంటే చాలు. ఒక దశలో దెబ్బమీద దెబ్బను తట్టుకోలేక రాణాప్రతాప్ తనతో సంధికి సుముఖుడయ్యాడని దర్బారులో అక్బర్ గొప్పగా చెప్పుకోగా... 'అటు సూర్యుడు ఇటు పొడిచినా ప్రతాపసింహుడు అలాంటి పని ఎన్నడూ చేయడు. మీకు వచ్చిన సమాచారం నిజమై ఉండదు' అని పృథ్వీరాజ్ అనే రాజపుత్ర ప్రముఖుడు పాదుషా మొహానే చెప్పాడు. 'మీ సిసోదియా వంశం మర్యాదను,

మేవాడ్ కులకాంతల శీలాన్ని ఢిల్లీ అంగడిలో అమ్మకానికి పెట్టే పని మీరు ఎన్నడూ చేయకండి. మేమంతా మిమ్మల్ని చూసుకునే బతుకుతున్నాం' అని ఉద్వేగపూరితమైన లేఖను ప్రతాప్‌కు పంపాడు. సమకాలికుల్లో ప్రతాప్‌పైగల పూజ్యభావానికి ఇదో ఉదాహరణ.

మిగతా రాజపుత్ర ప్రభువులు అక్బర్‌కు లొంగి, అతడి కాళ్లకు మొక్కుతూ అతడి దర్బారులో అవమానకరంగా బతకడం గొప్పపని అని రాజస్తాన్‌లో పరువుగల ఏ వ్యక్తీ అనుకోలేదు. ఆయా ప్రభువులు అక్బర్ పంచన చేరినా రాజపుత్రుల్లో ప్రతాప్ మాటే చెల్లుబాటయింది. తురక ప్రభువుల కుటుంబంలోకి పిల్లనిచ్చిన రాజపుత్రులను సాటివారు వెలి వెయ్యాలన్న ప్రతాప్ కట్టడి నిక్కచ్చిగా అమలయింది. అప్పట్లో అక్బర్‌కు కుడి భుజంలా చాకిరి చేసిన రాజా మాన్‌సింగ్ ప్రతాప్‌కు నచ్చచెప్పి దారికి తెచ్చేందుకు అక్బర్ పనుపున రాయబారిగా పోయినప్పుడు ప్రతాప్ మాత్రమే కాక, ఏ రాజపుత్ర కులీనుడూ అతడితో సహపంక్తి భోజనానికి ఇష్టపడలేదు. మాన్‌సింగ్‌కు జరిగిన ఆ అవమానమే 1576లో చరిత్రాత్మకమైన హల్దీఘాట్ యుద్ధానికి ఒక ప్రేరణ.

తమ స్వాతంత్ర్యాన్ని అక్బర్‌కు కుదవబెట్టి అతడి దయతో అతడి మున్సబ్‌దారుగా రాజ్యాన్ని తిరిగి పొంది అతడికి ఎల్లవేళలా అణగిమణగి ఉండటమే తమకు దేవేంద్ర పదవి అన్న రీతిలో మాన్‌సింగ్ లాంటి రాజులు అక్బర్‌కు చోపుదారులుగా ఎంత చొక్కాలు చించుకున్నా అక్బర్‌కు వారి మీద ప్రత్యేక ప్రేమ ఏమీలేదు. మొగలులకు దాస్యంవల్ల వారు బావుకున్నదీ పెద్దగా లేదు. 1576 జూన్ 18న జరిగిన హల్దీఘాట్ యుద్ధంలో రాణాప్రతాప్ సేనతో అక్బర్ తరఫున మాన్‌సింగ్ ప్రభృతుల నేతృత్వంలోని రాజపుత్రుల సేనలు హోరాహోరీగా తలపడుతూ వేల సంఖ్యలో తలలు నరుక్కుంటున్న తరుణంలో అక్బర్ సైన్యం లోని **అల్‌బాదౌనికి** పెద్ద సందేహం వచ్చిందట. మనవైపు, వారివైపు కూడా రాజపుత్రులే కనపడుతున్నారు. అంతా చూడటానికి ఒకేలాగ ఉన్నారు. శత్రువు లనుకొని మనం బాణాలు వేస్తే మనవైపు వారికే అవి తగులుతాయేమో. మరి ఈ పరిస్థితుల్లో రాజపుత్రుల్లో సున మిత్రులెవరో, శత్రువులెవరో ఎలా పోల్చుకోవాలి అని మొగలు సేనాపతి ఆసఫ్‌ఖాన్‌ను అతడు అడిగాడట. ఆ మహానుభావుడేమో వారూ వీరూ కాఫిర్లే. ఎవరు చచ్చినా ఒకటే. ఎటువైపు వారు చచ్చినా ఇస్లామ్‌కు లాభమే. ("They will experience the whiz of the arrows by what way. On whichever side they may be killed, it will be a gain to Islam") అన్నాడని **బాదౌని** సుప్రసిద్ధమైన తన చరిత్ర గ్రంథంలో ***[MuntakhabUl Tawarikh, Vol.II, p. 237]*** రాశాడు. ఆ ప్రకారమే అతగాడు స్వపక్షంలోని రాజపుత్రులను వీలయినకాడికి ఆనందంగా చంపేశాడట. ఇదీ వీరసెక్యులరిస్టు, మహాజాతీయవాది అని మన మేధావులు మురిసిపోయే అక్బర్ ది గ్రేట్ గారి సైన్యాధిపతి తమ తరఫున పోరాడుతున్న హిందువుల పట్ల చూపిన ఆదరణ!

ప్రాణం పోయినా సరే విదేశీయుడికి తలవంచేది లేదన్న పంతంతో భీకరంగా పోరాడినా రాణాప్రతాప్ ముస్లింలకు వ్యతిరేకి కాదు. హల్దీఘాట్ యుద్ధంలో ప్రతాప్‌కు సేనానిగా ముందుండి పోరాడిన హకీంఖాన్ సుర్ మహమ్మదీయుడు. రాణా సేనలో ఇంకాఎందరో ముసల్మాన్లు ఉన్నారు. ఆయనకు బాసటగా ఉండి ఐచ్ఛికంగా ఆయనతో కలిసి అష్టకష్టాలు పడ్డారు. మొగలుల తరఫున 80 వేల మంది, రాణా తరఫున 20 వేల మంది పోరాడిన హల్దీఘాట్ యుద్ధంలో ఏనుగు మీదికి లంఘించి మాన్‌సింగ్‌ను వేటు వేయబోతుండగా

ప్రతాప్ గుర్రం తీవ్రంగా గాయపడిన కారణంగా పరిస్థితి తారుమారైంది. ఇరువైపులా పెద్ద సంఖ్యలో ప్రాణాలు పోయిన మీదట విజయం మొగలులను వరించినా ప్రయోజనం లేకపోయింది. వెనుకటి హిందూ ప్రభువులవలె ఒకే కోటను పట్టుకు వేలాడి, అది కాస్తా కూలగానే సర్వ నాశనానికి సిద్ధపడే పంథాను వదిలి, రాణాప్రతాప్ మెరపు వేగంతో వ్యూహం మార్చుతూ పోయాడు. హల్దీఘాట్‌లో పరాజయం తప్పదని ధ్రువపడగానే అంతవరకూ తన స్థావరమైన గోగాండ కోటను ఖాళీ చేయించాడు. విజయగర్వంతో మొగలులు అడుగుపెట్టేసరికి అక్కడ మనిషన్నవాడు లేడు. తరవాత పదేళ్లలో అక్బర్ పంతం కొద్దీ వెంటాడి, ఎన్ని విధాల వేటాడినా, కుంభల్‌గడ్, ఉదయపూర్‌లాంటి కోటలు ఎన్ని పట్టుకున్నా స్వయంగా తానే అజ్మీర్‌లో కూచుని పర్యవేక్షణ చేస్తూ తన కుమారుడు సలీంను, గండరగండల్లాంటి సర్దార్లను గొప్ప సైన్యంతో ఎన్నిసార్లు ప్రతాప్ మెడలు వంచటానికి పంపినా రాణా చిక్కలేదు. దొరకలేదు. ఎన్ని కోటలు వశమైనా 'పిట్ట' తుర్రుమనేది. ఆక్రమించిన కోటలో పీఠం పెట్టిన సేనలకు అన్నం నీళ్లు దొరికేవి కావు. కోటలో ఉండలేరు. ఎటునుండి ప్రతాప్ దాడి చేస్తాడో తెలియదు కనుక బయటికి రాలేరు. ఇలా – గతంలో హిందూ రాజుల కోటలు దిగ్బంధం చేసి బాధించిన ముసల్మాన్లకు రాణాప్రతాప్ వారి ఆయుధాన్ని వారికే తిప్పికొట్టాడు. తన రాజ్యంలోని ప్రజలందరినీ ప్రతాప్ బలవంతంగా పర్వత ప్రాంతాలకు మకాం మార్పించి, వందల సంఖ్యలో ఊళ్లకు ఊళ్లనే దీపం పెట్టే దిక్కులేకుండా పాడుబెట్టటంతో జనావాసాలు కాస్తా కీకారణ్యాలయ్యాయి. దారిలో తినడానికి తిండి, తాగేందుకు నీళ్లు దొరకక మొగల్ సేనలు మలమలమాడేవి. పైగా గుజరాత్ రేవు నుంచి ఢిల్లీ దర్బారు చేరే వెలలేని వస్తుసామగ్రి అంతా మేవాడ్ గుండానే వెళ్లవలసి వచ్చేది. ప్రతాప్ గెరిల్లాలు దారికాచి ఆ మూటలన్నిటినీ దోచుకోవటంతో మొగలాయీలు దిక్కుతోచక బిక్కమొగం వేసేవారు.

అనేక దౌత్యాలు, అనేక యుద్ధాలు చేసి చేసి ప్రతాప్‌ను లొంగదీయడంలో అన్నీ విఫలమయ్యాక అంత "గొప్ప" అక్బర్ పాదుషాయే విసిగి వేసారి, ప్రతాప్ జోలికిపోయే ఆలోచనను మానుకున్నాడు. 1585 నుంచి 1597 వరకూ 12 ఏళ్లు మేవాడ్ రాజ్యం మొగలుల బాధ లేకుండా ప్రశాంతంగా ఉంది. వాయువ్య, ఈశాన్య, మధ్య ప్రాంతాలలోని మొగల్ సైనిక స్థావరాలను ఆక్రమించి, చిత్తోడ్ మినహా కోల్పోయిన కోటలను దాదాపు అన్నిటినీ ఒకటొకటిగా వశం చేసుకుని, అంబేర్‌ను జయించి మాన్‌సింగ్‌పై కూడా ప్రతీకారం తీర్చుకుని రాణాప్రతాప్ చావండ్ రాజధానిగా మేవాడ్ రాజ్యానికి పూర్వ ప్రాభవం మళ్లీ తేగలిగాడు. పాడుబడిన ఊళ్లు మళ్లీ జన సందోహంతో కళకళలాడి, బీళ్లు మళ్లీ సాగులోకి వచ్చి, వర్తక వాణిజ్యాలతో పట్నాలకు సిరి అందుకుంది. కళలను పోషించి, కళాత్మక కట్టడాలను నిర్మించి, ప్రజారంజకం గా పాలించి రాణాప్రతాప్ 57వ ఏట 1597 జనవరి 19న కన్నుమూశాడు. ఆ మహావీరుడి మరణవార్త విని బద్ధశత్రువైన అక్బర్‌కు కూడా కళ్లు చెమర్చాయట.

ఏ ప్రమాణాలనుబట్టి చూసినా రాణాప్రతాప్ మతాలకూ, ప్రాంతాలకూ, వైఖరులకూ అతీతంగా జాతి జనులందరూ కొలవదగిన మహాపురుషుడు. స్వాతంత్ర్య కాంక్షకు, జాతీయతా భావానికి, భారతజాతి ఆశలకు, ఆశయాలకు ఆయన గొప్ప ప్రతీక. రాణా ప్రతాప్‌కున్న తెగువ, చొరవ, పోరాట పటిమలలో శతాంశమైనా ఆ కాలంలోని మిగతా హిందూ

రాజులకు ఉండి ఉంటే చరిత్ర గతి మరో విధంగా ఉండేది. బలవంతుడైన తురుష్క ప్రభువుకు ఎదురుతిరిగి కష్టాలను కొని తెచ్చుకునేకన్నా, పరిస్థితులతో రాజీపడి, అతడి పంచనే చేరి బతుకు వెళ్ళదీయడం మేలన్న మానసిక దౌర్బల్యానికి లోనైన ఆ కాలపు హిందూ ప్రభువుల్లో కూడా అత్యధికులు కనీసం లోలోన రాణాప్రతాప్‌ను ఆరాధించారు.

"The Rana, while fully prepared to sacrifice his life, if necessary, was resolved that his blood should never be contaminated by intermixture with that of the foreigner, and that his country should remain a land of free men. After much tribulation, he succeeded and Akbar failed"

[Akbar the Great Mogul, V.A.Smith, P. 151]

(విదేశీయుడి రక్తంతో తన నెత్తురు కలుషితం కాకూడదని, తన దేశం స్వతంత్రంగానే ఉండాలని అందుకోసం అవసరమైతే తన జీవితాన్ని బలిపెట్టాలని రాణా నిశ్చయించుకున్నాడు. అనేక కష్టాల తరవాత అతడే గెలిచాడు. అక్బర్ ఓడాడు) అని విన్సెంట్ స్మిత్ ప్రతాపసింహుడిని కొనియాడాడు.)

"Single handed, for a quarter of a century (1572-97) did he withstand the combined efforts of the empire; at one time carrying destruction into the plains, at another, flying from rock to rock, feeding his family from the fruits of his native hills, and rearing the nursling heir Amar (his son) amidst savage beasts and scarcely less savage men... The bare idea that "the son of Bappa Rawal should bow the head to mortal man' was insupportable; and he spurned every overture which had submission for its basis...'

[Annals and Antiquities of Rajasthan,* James Tod *Vol.I.p.347]

(ఒకసారి విధ్వంసాన్ని మైదానాలకు తీసుకు వెళుతూ.... ఇంకోసారి కొండ నుంచి కొండకు ఎగురుతూ, కొండల్లో దొరికే ఫలాలతో కుటుంబం కడుపు నింపుతూ, క్రూరమృగాల నుంచి, అంతకంటే క్రూరులైన మానవుల నుంచి పసివాడైన తన కుమారుడిని కాపాడుకుంటూ పావు శతాబ్దం (1572-97) పర్యంతం అతడు మొగల్ సామ్రాజ్యపు సంయుక్త యత్నాలను తట్టుకుని నిలిచాడు) అని మనవాడు కాని జేమ్స్‌టాడ్ తన సుప్రసిద్ధ గ్రంథంలో ప్రతాప్ దీక్షను ప్రశంసించాడు. ఆరావళి పర్వత పంక్తులలోని ప్రతి చెట్టూ, ప్రతి పుట్టా రాణా ప్రతాప్ పడిన కష్టాలను తలచుకుంటూ, ఆయన శౌర్యాన్ని, పరాక్రమాన్ని ఇంకా కీర్తిస్తున్నట్టు టాడ్‌లాంటి విదేశీయుడికే తోచింది. కనీసం విదేశీ చరిత్రకారులకున్న పాటి ఆదరభావమైనా ఆధునిక కాలంలో మన మహా మేధావులు చాలా మందికి లేకపోయింది. ప్రతాప్ పుట్టిన దేశంలోనే పుట్టి అతడు కాంక్షించిన స్వాతంత్ర్యానికే తాము నిబద్ధమైనట్టు, అతడు కోరిన జాతీయతకే తాము అంకితమైనట్టు చెప్పుకునే భారతీయ చరిత్రకారులు జేమ్స్ టాడ్ భావుకత వట్టి గ్యాస్ అని కొట్టిపారేశారు. చిత్తోడ్

కోటను అక్బర్ ధ్వంసం చేసినప్పుడు అక్కడ పెద్ద నిధి ఏదీ దొరికినట్టు ఏ చరిత్రకారుడూ రాయలేదు. కాబట్టి కోశాగారాన్ని రాణా ఉదేసింగ్, యువరాజు ప్రతాప్‌లు ముందే తరలించుకు పోయి ఉండాలి అని ఊహించి, అందులో అపార సంపద ఉన్నది కాబట్టి అడవిలో ప్రతాప్ పరివారం కష్టాలు పడాల్సిన అగత్యమేమీ లేదని మజుందార్ సంపాదకత్వం వహించిన ***History and culture of the Indian People*** 7వ భాగం 336 పేజీలో కళ్ళతో చూసినట్టు చెప్పారు. అలాగే – హల్దీఘాట్ యుద్ధంలో మనవారు, పగవారు అన్న తేడా లేకుండా హిందువులను చంపెయ్ అని మొగల్ సేనాని నేరుగా తనకే చెప్పాడని 'అల్‌బాదౌని' మొత్తుకున్నా... అక్బర్ అంతటి ఉదారుడు నియోగించిన సేనాని అలా అని ఉండడని జె.ఎల్.మెహతా లాంటి చరిత్రకారులు అక్బర్ తరఫున వకాల్తా తీసుకున్నట్టు వాదించారు. నవభారత నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ అయితే తన డిస్కవరీ ఆఫ్ ఇండియా ఉద్గ్రంథంలో అక్బర్ కీర్తిని అనేక అధ్యాయాలలో వినుతించి, రాణా ప్రతాప్ మొహాన మాత్రం ఒకే ఒక వాక్యాన్ని విదిలించారు.

జాతీయవీరుల గొప్పతనాన్నే సవ్యంగా గుర్తించలేని జాతికి నిజమైన జాతీయత ఎలా కలుగుతుంది?

మహావీరుడు హేము

ఒక సామాన్యుడు. చిన్నపట్నంలో పెట్లుప్పు అమ్ముకునే చిన్న వ్యాపారి. పుట్టింది వీరుల వంశంలో కాదు... వైశ్య కులంలో. వెనకా ముందూ ఏ అండా లేదు. పెద్దగా చదువుకోలేదు. అంగబలం, అర్థబలం అసలే లేదు. అయినా - స్వశక్తితో పైకి వచ్చాడు. అంచెలంచెలుగా ఎదిగాడు. ఒక సామ్రాజ్యానికి మహామంత్రి అయ్యాడు. ఒకటీ రెండూ కాదు... ఏకంగా 22 యుద్ధాలు చేశాడు. ఓటమి అనేది ఎరుగక అన్ని యుద్ధాలూ గెలిచి మధ్యయుగపు నెపోలియన్ అనిపించుకున్నాడు. ఘన విజయాలకు పరాకాష్ఠగా ప్రతిష్ఠాత్మకమైన ఢిల్లీ సింహాసనమెక్కి మహారాజుగా పట్టాభిషేకం చేయించుకున్నాడు. సామాన్య వ్యాపారి దేశానికి ప్రభువయ్యాడు. ఇది జానపద గాథ కాదు. కల్పించిన సినిమా కథ కాదు. యథార్థ జీవితగాథ. ఇంకో దేశంలో పుట్టి ఉంటే అంతటి మహావీరుడిని జాతి జనులందరూ పటం కట్టి పూజించేవారు. జాతి గొప్పతనానికి, పరాక్రమానికి నిలువెత్తు గురుతుగా భావి తరాలకు అతడిని గర్వంగా చూపెట్టుకునేవారు.

కాని - అతడు పుట్టింది భారతదేశంలో. కుహనా వీరులను కొలిచినంతగా నిజమైన జాతీయ వీరులమీద (ముఖ్యంగా ఈ కాలపు) భారతీయులకు సాధారణంగా గురి కుదరదు. ఈ జాతీయ అవలక్షణానికి తగ్గట్టే హేము అనే మహాపురుషుడికీ చరిత్ర న్యాయం చెయ్యలేదు. మన దొరబాబులు రాసిన చరిత్ర గ్రంథాలను చదివితే అసలు ఈ పేరుగల మహావీరుడొకడు ఉండి అద్భుత విజయాలను సాధించిన సంగతే ఎవరికీ తెలియదు. హుమాయున్‌కు, అక్బర్‌కు మధ్యకాలంలో హేమచంద్ర కూడా కొద్ది రోజులైనా ఢిల్లీ రాజ్యాన్ని ఏలిన వాస్తవాన్ని చాలామంది చరిత్రకారులు గుర్తించరు.

రెండో తారాయిన్ యుద్ధంలో మహమ్మద్ ఘోరీ గెలిచినది మొదలుకొని మొగల్ సామ్రాజ్యం తెల్లదొరల చేతుల్లోకి వెళ్లేదాకా అఫ్గన్లో, మొగలులో రాజ్యమేలి, మొత్తం మీద ఐదు శతాబ్దాలకుపైగా దేశంలో మహమ్మదీయ పాలనే కొనసాగిందని సాధారణంగా మన

చరిత్ర పుస్తకాలు చెబుతాయి. నిజానికి ఈ మధ్యకాలంలో అటు, ఆఫ్ఘాన్లతోనూ, ఇటు మొగలులతోనూ నిమిత్తం లేకుండా ఢిల్లీలో స్వతంత్ర హిందూ రాజ్యాన్ని 'రాజా విక్రమాదిత్య' అన్న బిరుదుతో హేమచంద్ర స్థాపించాడు. తన పేరుతో నాణేలను కూడా ముద్రించి, ఉత్తర భారతాన్ని ఏకచ్ఛత్రంగా ఏలడానికి ఆయత్తమయ్యాడు. దురదృష్టవశాత్తూ – కాలు నిలదొక్కుకునేలోపే అక్బర్ సేనలతో జరిగిన రెండో పానిపట్టు యుద్ధంలో వీరవిహారం సాగిస్తూ దిగ్విజయం సాధించనున్న తరుణంలో కంట్లోకి బాణం దిగి కుప్పకూలాడు. దైవికమైన ఆ దుర్ఘటనే జరిగి ఉండకపోతే చరిత్ర గతి మరో విధంగా ఉండేది.

సుప్రసిద్ధ చరిత్రకారుడు ఆర్.సి.మజుందార్ కూడా ఇదే మాట అన్నారు. "Neither fate nor historians have been kind to Hemu... Historians, medieval and modern, have done scant justice to, and failed to show due appreciation of, the unique personality and greatness of a Hindu, who during the heyday of Muslim rule in India, worked his way from a grocer's shop to the throne of Delhi, and, but for an accident in a battle which turned victory into defeat, might have founded a Hindu ruling dynasty, insted of the Mughals, in Delhi"

(అటు దైవంగాని, ఇటు చరిత్రకారులుగాని హేము మీద దయ చూపలేదు... ఇండియాలో ముస్లిం పాలన దుర్నిరీక్ష్యంగా ఉన్న కాలంలో, పచారి దుకాణం దగ్గర మొదలుపెట్టి ఢిల్లీ సింహాసనం వరకూ దారి చేసుకు వెళ్లగలిగిన ఈ హిందువుడి విశిష్ట వ్యక్తిత్వాన్ని, గొప్పతనాన్ని సరిగా మదింపు వెయ్యడంలో మధ్యయుగ, ఆధునిక కాలాల చరిత్రకారులు విఫలమయ్యారు. రణరంగంలో ప్రమాదవశాత్తూ గెలుపు ఓటమిగా పరిణమించి ఉండకపోతే, మొగలులకు బదులుగా అతడు ఢిల్లీలో ఒక హిందూ రాజవంశాన్ని స్థాపించి ఉండేవాడు) అని "మరచిపోయిన హిందూ వీరుడు – హేము" పేరిట ***The History & Culture of the Indian People*** 7వ భాగమైన ***The Moghul Empire*** లో మజుందార్ ఘన నివాళి అర్పించారు.

హేము జీవితం గురించి ప్రపంచానికి తెలిసింది తక్కువ. దానికి కూడా పగవాళ్ల రాతలే ప్రధానాధారం. ఆ కాలపు మహమ్మదీయ చరిత్రకారులకు మతపిచ్చి, స్వామిభక్తి ఎక్కువ. హిందువు అంటేనే వారి దృష్టిలో నికృష్టుడైన కాఫిర్. అందునా కోమటి కులంలో పుట్టినవాడు తన వ్యాపారమేదో తాను చూసుకోకుండా రాజకీయాల్లో తల దూర్చాడని, తమ మహాప్రభువులనే కూలదోసేంతగా బరితెగించాడని హేము అంటే వారికి ద్వేషం. ఆ అక్కసు వారి రాతల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. స్వతంత్రంగా పరిశోధన చేసి, చారిత్రక ఆరాలు తీసి, హేము జీవిత యథార్థాన్ని, అతడి పరిసరాలను, ప్రభావాలను, పూర్వాపరాలను అధ్యయనం చేసేందుకు దేశం స్వతంత్రమైన అర్ధశతాబ్దం తరవాత కూడా గట్టి ప్రయత్నం కనీసం మొదలవలేదు.

నీచుడని, ధూర్తుడని దుర్బుద్ధితో చేసిన నిందలను వడబోస్తే శత్రుపక్షం వారు రాసిపెట్టిన రికార్డులనుబట్టి హేము జీవితాన్ని రేఖామాత్రంగా పోల్చుకోగలం. **నిజాముద్దీన్ అహ్మద్, అబుల్ ఫజల్, అహ్మద్ యాద్గర్** వంటి వారి రాతల వల్ల స్థూలంగా అర్థమయ్యేదేమిటంటే – హేమచంద్ర అనే హేము ప్రస్తుతం హర్యానాలోని రేవారి పట్నంలో పురాణ్‌మల్ అనే పేద వైశ్యుడి ఇంట 1501లో పుట్టాడు. కొద్దికాలం హిందీ, సంస్కృతం, పర్షియన్ భాషల్లో

కొంచెం చదువుకున్నాక కుటుంబ పరిస్థితులవల్ల వీధుల్లో పెట్లుప్పు (saltpetre) అమ్ముకుంటూ బతుకు సాగించాడు. కొన్నాళ్లకు మార్కెట్లో సరుకులు తూచే సర్కారీ కొలువులో కుదిరాడు. ప్రతిభతో అధికారులను మెప్పించి అంచెలుగా ఎదిగాడు. అంగళ్లను పర్యవేక్షించి, అపరాధులను శిక్షించే ఉన్నత పదవికి చేరాడు. అక్కడ సమర్థంగా పనిచేసి ఇస్లాం షా ప్రభువు దృష్టిలో పడ్డాడు. బాబర్ మరణానంతరం అతడి కుమారుడు హుమాయూన్‌ను దేశం నుంచి తరిమి గద్దెనెక్కిన షేర్‌షా కుమారుడు ఈ ఇస్లాంషా. ఇతడి హయాంలోనే హేము కార్యదక్షతను మరింతగా నిరూపించు కుని తపాలా వేగుల దళం శాఖల అధిపతి (Daraga-i-Dak-Chauki) పదవి పొందాడు. రాజకీయ, సైనికపరమైన ముఖ్య కార్యాలను చక్రవర్తి అతడికి అప్పగిస్తూండేవాడు. దర్బారులోని ఇతర రాజప్రముఖులతోనూ అధికారులతోనూ కలిసిమెలిసి ఉండి హేము అందరికీ తలలో నాలుక అయ్యాడు.

1554లో ఇస్లాంషా మరణానంతరం పన్నెండేళ్ల మైనర్ కుమారుడు ఫిరూజ్‌షా గద్దెనెక్కగా – రెండేళ్ళకే అతడిని ఖూనీచేసి అతడి మేనమామ ముబారిజ్‌ఖాన్ మహ్మద్ ఆదిల్‌షా పేరిట సింహాసనం ఆక్రమించాడు. అతడు విలాసపురుషుడు. విచిత్ర వ్యక్తి. ఉండాల్సిన అవలక్షణాలు అనేకం ఉన్నా అతడు ఒక మంచి పనిచేశాడు. హేమును నమ్మదగిన వ్యక్తిగా గుర్తించి వకీల్-ఇ-అలా (ప్రధానమంత్రి)ను చేసి సర్వాధికారాలు ఇచ్చాడు. హేము సర్వశక్తులూ ఒడ్డి, అఫ్గాన్ సర్దార్ల కుట్రలు, కుహకాలను వమ్ముచేసి, ఆగ్రా, లాహోర్, బెంగాల్, మాళ్వ గవర్నర్ల తిరుగుబాట్లనూ అణచాడు. సంగీత, నృత్య గోష్ఠుల్లో, విందువిలాసాల్లో పూర్తిగా నిమగ్నమైన సుల్తాన్ రాజ్యాన్ని రాచవ్యవహారాలన్నీ నేర్పుగా నిభాయించుకుంటూ కంటికి రెప్పలా కాపాడాడు. ఈ క్రమంలో అతడు ఇరవై యుద్ధాలు చేశాడు. ప్రతి యుద్ధమూ గెలిచాడు.

అదీ – సేనాపతులను రణరంగానికి పంపి తాను సుఖంగా రాజభవనంలో కూచుని కాదు. ప్రతి యుద్ధంలోనూ స్వయంగా తానే సేనలను నడిపించి! హేము ఆజానుబాహువు కాదు. కండలను పెంచి భీముడిలా ఉండడు. పొట్టిగా బక్కపలచగా ఉంటాడు. చూసినవారు అతడొక యోధుడనే అనుకోరు. గుర్రం స్వారీ చెయ్యలేడు. జన్మలో అతడు కత్తిపట్టలేదు. బాణం వెయ్యలేదు. రణతంత్రమంతటినీ ఏనుగు మీది నుంచే నడిపించేవాడు. అతడి ప్రతిభంతా గొప్ప సేనాపతిగా సరయిన వ్యూహం పన్ని చతురంగ బలాలను, అన్నివైపులను సమన్వయం చేస్తూ బలగాలను నడిపించటంలో ఉంది. అతడు ఉన్నచోట జయం. అతడు ఉన్నాడంటేనే సేనలకు ఏనుగంత బలం. హేమును సాధ్యమైనంత వికృతంగా, ఆ ఏదో సైతాను అయినట్లుగా చిత్రించిన అబుల్ ఫజల్ అంతటివాడు కూడా శౌర్యంతో, ధైర్యంతో అతడు అద్భుత విజయాలను సాధించి, మొత్తం 22 యుద్ధాలనూ పరాక్రమంతో గెలిచిన వైనాన్ని మెచ్చుకోవటం విశేషం. సాధారణంగా హిందువులంటే చులకన భావంగల మహాగర్విష్ఠులైన ఆఫ్గాన్ సర్దార్లు అందరూ హేమూ ముందు పిల్లికూనల్లా ఉండి, అతడు ఏమి చెయ్యమంటే అది చేసేవారు. సైనికులతో కలిసిపోయి వారి కష్టసుఖాలను పంచుకోవటం, యుద్ధంలో కైవసం చేసుకున్న సొత్తును సైనికులకు ఉదారంగా పంచిపెట్టటం, ప్రత్యక్షంగా రంగంలో ఉండి నడిపించటం హేము అంటే అఫ్గాన్ల భయభక్తులకు కారణం.

అంతటి సమర్థుడు కాబట్టే ఎక్కడ తిరుగుబాటు లేచినా, ఎటు నుంచి ముప్పు వచ్చినా హేము అండనే ఆదిల్‌షా నమ్ముకునేవాడు. ఆ సమయంలో ఎక్కడ ఎవరితో యుద్ధం

చేస్తున్నా దాన్ని ఆపి తక్షణం వచ్చి తనను ఆదుకొనమని ఆర్తనాదం చేసేవాడు. హుమాయున్ బలం పుంజుకుని ఇండియాకు తిరిగి వచ్చి 1555 జూలైలో ఢిల్లీని తిరిగి వశం చేసుకోగానే అతడి భరతం పట్టమని అదిల్‌షా హేమునే ప్రయోగించాడు. అదనుచూసి చావుదెబ్బ తీయడానికి హేము వేచి ఉన్నాడు. ఎదురుచూసిన అవకాశం హుమాయున్ ఆకస్మిక మరణంతో అతడి చేతికందింది. పోయిన సామ్రాజ్యం తిరిగి దక్కిందన్న ఆనందం నిండా ఆర్నెల్లు మిగలకుండా ఓ సాయంత్రం రాజప్రాసాదంపై నుండి ఢిల్లీ సౌందర్యాన్ని తిలకించి, కిందికి దిగుతుండగా హుమాయున్ కాలుజారి కిందికి దొర్లి రెండు రోజుల అనంతరం (1556 జనవరి 26న) కన్నుమూశాడు. ఆ సమయానికి 14 ఏళ్ళ యువరాజు అక్బర్ రెండు నదులకూ, బలమైన శత్రురాజ్యాలకూ ఆవల 300 మైళ్ళ దూరంలో ఉన్నాడు. హుమాయున్ మరణాన్ని రహస్యంగా ఉంచి, అతడి పోలికగల మనిషిని దూరం నుంచి చూపెట్టి రాజు బతికే ఉన్నట్టు భ్రమగొలిపి పదిహేడు రోజులు నాటకమాడారు. చివరికి ఢిల్లీదారిలో ఉన్న అక్బర్‌ను కలనూరులో ఒక చిన్న తోటలో (1556 ఫిబ్రవరి 11న) పట్టాభిషేకమైతే చేశారు. కాని కుర్రరాజు వచ్చి సింహాసనం మీద కూర్చునేలోపే రాజ్యానికి మోసం వచ్చింది.

హేము పకడ్బందీగా వ్యూహం పన్ని జౌధ్ నుంచి వెయ్యి ఏనుగులు, యాభైవేల గుర్రాలు, 51 ఫిరంగులతో ఢిల్లీ మీదకు దండు వెడలగా మొగల్ సర్దార్ల కాళ్ళు చేతులు వొణికాయి. కల్పి, ఆగ్రాల్లోని మొగల్ గవర్నర్లు హేముతో తలపడేందుకు ధైర్యం చాలక ప్రాణభయంతో పారిపోయారు. ఢిల్లీ గవర్నరు తార్డీబేగ్‌ఖాన్ తుగ్లకాబాద్ వద్ద పోరాటమైతే మొదలెట్టాడు కాని విశేష ప్రాణనష్టం అనంతరం ఉప్పెనలాంటి హేము ధాటికి పలాయనం చిత్తగించాడు. 1556 అక్టోబరు 7న హేము విజయగర్వంతో ఢిల్లీలో అడుగు పెట్టాడు. అంతవరకూ అసమర్థ ఆదిల్షా పనుపున చక్రం తిప్పుతూ వచ్చిన వాడల్లా స్వయంగా తానే రాజా విక్రమాదిత్య బిరుదుతో ఢిల్లీ సింహాసనమెక్కాడు. అతడి వెంట ఉన్న అఫ్ఘాన్ సర్దార్లు, రాజపుత్ర వీరులు అందరూ అతడి చర్యను సంతోషంగా సమర్థించారు. తన పేరిట నాణేలు ముద్రించి, అత్యవసర ఉత్తర్వులు జారీ చేసిన మీదట అధికారం స్థిరపరచుకునే లోపే హేమును విధి వెంటాడింది. ఊహించనిది జరిగింది.

ఢిల్లీ, ఆగ్రా కంచుకోటలు సైతం కూలి, పంజాబ్ మినహా మొగల్ సామ్రాజ్యం యావత్తూ చేజారిపోయాక కుర్ర అక్బర్ కళవళపడ్డాడు. అప్పుడతడు సిర్హింద్‌లో విడిదిచేసి ఉన్నాడు. దిక్కుతోచక తన సర్దార్లను సలహా అడిగితే 'హేము ముందు నిలిచి గెలిచే ఆశలేదు. ఒక వైశ్యుడి చేతిలో బందీగా చిక్కే పరాభవం కంటే కాబూల్‌కు తిరిగి వెళ్లి బలం సమీకరించుకోవటమే ప్రస్తుతానికి చక్రవర్తికి శ్రేయస్కరం' అన్నారు. సర్వత్రా నిస్పృహ ఆవరించిన ఆ సమయంలో అక్బర్ సంరక్షకుడు బైరాంఖాన్ పరారయి వచ్చిన తార్డీబేగ్‌ఖాన్ తల నరికి, దెబ్బకు దెబ్బ తీయాల్సిందేనని బోధించి మొగల్ స్కంధావారానికి గుండె దిటవు కలిగించాడు: ప్రాణాలకు తెగించి ఢిల్లీని తిరిగి కైవసం చేసుకోవడానికి పాతికవేల గుర్రాలను, పన్నెండు వేల సేనలను సమీకరించి తరలాడు. హేముతో అమీతుమీ తేల్చుకునేందుకు గతంలో బాబర్‌ను గెలిపించిన పానిపట్టే అనువైన స్థలమని బైరాంఖాన్ ఎంచుకున్నాడు.

మొగలులు దండెత్తి వస్తున్నట్లు తెలిసి వారికి బుద్ధిచెప్పటానికి హేము సర్వసన్నద్ధమై తరలివెళ్ళాడు. 1500 ఏనుగులు, 50 వేల గుర్రాలతో భీకరంగా దూసుకు వస్తున్న అతడి

సేనను ఎదిరించి నిలవగలమన్న ఆశ అక్బర్‌కూ లేదు; అతడి సంరక్షకుడు బైరాంఖానుకూ లేదు. కుత్బుల్ అక్తాబ్ సయ్యద్ జలాల్ అనే మహమ్మదీయ సాధువు దగ్గరికి అక్బర్‌ను తీసుకుపోయి పాదాల మీద పడవేయించి, "చీమల్లా మిడతల్లా అసంఖ్యాకమైన సేనతో నికృష్టపు కాఫిర్ ముంచుకొస్తున్నాడు. ఇస్లాం రక్షణ కోసం యువరాజును మీరే రక్షించాలి" అని బైరాంఖాన్ ప్రార్థించినట్టు ***Tarikh-i-Salatin-i-Afaghana*** లో అహ్మద్ యాద్‌గర్ రాశాడు. **/Elliot & Dowson**, *Vol. VIp.62]* యుద్ధానికి మూడు రోజుల ముందు మొగల్ సర్దార్లందరినీ విందుకు పిలిచి, బహుమానాలిచ్చి "This infidel has routed the whole royal army, and is now making preparations against us. If you do your best in this business, with one heart and soul, Hindustan is yours... If you fail in this, you, whose homes are at a distance of 500 kos will not be able to find an asylum" *(ఈ దైవదూరుడు రాచసైన్యం మొత్తాన్నీ పరాభవించి, ఇప్పుడు మన మీదికే సన్నాహాలు సాగిస్తున్నాడు. మీరు మనస్ఫూర్తిగా శాయశక్తులా పాటుపడితే హిందుస్తాన్ మీది అవుతుంది. ఇందులో విఫలమయ్యారో, 500 క్రోసుల దూరం నుంచి ఇల్లు వదిలి వచ్చిన మీకు ఎక్కడా ఆశ్రయం దొరకదు)* అని బైరంఖాన్ హెచ్చరించినట్టు ఇదే చరిత్ర గ్రంథంలో అహ్మద్ యాద్‌గర్ చెప్పాడు.,**/Elliot & Dowson** *Vol.V p. 64]* ఆ సమయంలో అక్బర్ శిబిరానికి ఎంత ముచ్చెమటలు పోశాయో దేన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. సర్దార్లకు ఉత్తేజాన్నిచ్చి హుషారు చేసినప్పటికీ హేము చేతిలో తమకు పరాభవం తప్పదన్న భయం బైరాంఖాన్‌ను వెంటాడుతూనే ఉంది. అందుకే – అక్బర్‌ను రణరంగం సమీపంలోకి పోనివ్వకుండా, తానూ వెళ్లకుండా 8 మైళ్ల దూరంలో నిలిచి, 500 మంది సైనికులను చుట్టూ కాపలా పెట్టుకుని ఒకవేళ యుద్ధంలో సైన్యం ఓడినట్టు కబురు అందితే, అక్బర్ సహా తక్షణం కాబూల్‌కు దౌడుతీసి ప్రాణాలు దక్కించుకోవటానికి బైరాంఖాన్ సంసిద్ధంగా ఉన్నాడు. గెలిచే ఆశలేక అంతగా గడగడలాడిన అక్బర్ పక్షాన్నే విజయం వరించడం విధివైచిత్రి!

ఓటమి అనేది ఎరుగని హేము ఈ యుద్ధాన్నీ అవలీలగా గెలిచి ఎడమ చేతితో మొగలులను మన్ను తినిపించగలనని ధీమాగా ఉన్నాడు. పటిష్ఠమైన వ్యూహాన్నే పన్నాడు. కానీ మొదలే విధి వక్రించింది. ముందస్తు దాడికి 2 వేల మందితో ఫిరంగుల దళాన్ని పంపితే ఊహించని రీతిలో మొగలులు మెరుపు దాడి చేసి మొత్తం అందరినీ చంపేశారు. తుపాకులు పోయినా హేము అధైర్యపడలేదు. అతని అసలు బలం ఏనుగులు. అబుల్‌ఫజల్ మాటల్లో చెప్పాలంటే హేము ఏనుగులు కొండనైనా తొండంతో చుట్టి ఆకాశంలోకి విసిరేయగలవు. నేల అదిరేలా వేగంగా కదులుతూ తొండంలో అమర్చిన కత్తులతో, బల్లాలతో శత్రువులను చెండాడుతూ, ఎంతటి మహా సేననైనా కాళ్లకింద తొక్కెయ్యగలవు. అందుకే ఆ గజదళమంటే అందరికీ హడలు. ఆ ఏనుగుల్లోకెల్లా పోతరించి ప్రచండంగా పోరాడేది హేము సొంత ఏనుగు. పేరు 'హవాయి'. దాన్నే ఎక్కి చతురంగ బలాలతో పానిపట్టులో అతడు మొగలులను ఢీకొన్నాడు. 1556 నవంబరు 5న జరిగిన చరిత్రాత్మక యుద్ధంలో అన్నివైపుల నుంచి సేనలను ఉరికించి, చక్రబంధంలో ఇరికించి మొగలులను హేము నుగ్గు చేస్తుండగా... ఇక తమ పని ఖాళీ అని మొగలులు గుడ్లు తేలవేసిన స్థితిలో.... శత్రుసైనికుడు వదిలిన బాణం ప్రమాదవశాత్తూ హేము కంట్లో దిగబడింది. దాన్ని

లెక్కచేయకుండా అతడు చేతితో బాణాన్ని లాగేసి, ఏకధారగా రక్తం కారుతున్న కంటికి గుడ్డ కట్టుకుని, యుద్ధం కొనసాగించమంటూ సేనలను పురికొల్పాడు. కాని – కొద్ది నిమిషాలకే స్పృహతప్పి కూలిపోయాడు.

తరవాత కథ మామూలే. తమ మహానాయకుడు నేలకొరగగానే హేము సేనలు బెంబేలెత్తాయి. పరిస్థితి తారుమారయింది. మొగలులు పుంజుకుని శత్రుసేనను ఊచకోత కోశారు. అదృష్టం పండి అనుకోని విజయం సాధించారు. చెప్పుల్లో కాళ్లు పెట్టుకుని కూర్చున్న అక్బర్‌కూ, బైరంఖాన్‌కూ పారిపోయే అగత్యం తప్పింది. స్పృహ తప్పిన హేమును షాకులీఖాన్ అనే మొగల్ సర్దారు గుర్తించి ఏనుగు సహితంగా అక్బర్ సన్నిధికి తోలుకు వెళ్ళాడు. పిలిచినా పలకలేని అచేతన స్థితిలో ఉన్న హేమును బైరాంఖాన్ ప్రేరేపించగా తల నరికి అక్బర్ ఘాజీ అనిపించుకున్నాడు. (కాదు. స్పృహలేని వాడిని తాను చంపటమేమిటని అక్బర్ నిరాకరించి, లాంఛనప్రాయంగా మెడకు కత్తిని మాత్రం తాకించి వదిలివేయగా తల నరికే పుణ్యకార్యాన్ని బైరాంఖాన్ పూర్తిచేశాడని అబుల్‌ఫజల్, ఫిరిస్తా లాంటి అక్బర్ భక్తులు రాసిపెట్టారు. అక్బరే స్వహస్తాలతో హేము తలను ఖండించాడని అహ్మాద్ యాద్‌గర్ చెప్పాడు)

పుణ్యం ఎవరిదైతేనేం? తమకు సింహస్వప్నమైన మహావీరుడు హేమును అక్బర్ ఆధ్వర్యంలో అంత "వీరోచితంగా" మొగలులు అంతమొందించారు. హేము తలను కాబూల్‌కు ప్రదర్శనార్థం పంపి, మొండేన్ని ఢిల్లీలో కోట గుమ్మానికి వేలాడగట్టారు. తాతగారు బాబర్ నెలకొల్పిన దుష్ట సంప్రదాయాన్ని అక్బర్ సైతం అనుసరించి పానిపట్టులో తమ చేత చచ్చిన హిందువుల, ఆఫ్గన్ల తలలతో విజయగోపురాన్ని నిర్మించాడు. అనంతరకాలంలో చిత్తోడ్ కోటలో చేజిక్కిన సైనికులను సంహరించడంతో ఆగకుండా, నిస్సహాయులు, నిరాయుధులు అయిన సామాన్య జనాన్ని పిల్లలు, వృద్ధులు అన్న కనికరం లేకుండా వేల సంఖ్యలో ఊచకోత కోయించాడు. హేమును చంపడంతో పగచల్లారని అక్బర్ సైనికులను పంపి అతడి కుటుంబాన్నీ వేటాడాడు. హేము గ్రామం మీదికి మొగల్ సేనలు దండెత్తి వెళ్లి హేము తండ్రిని పట్టుకుని, మెడ మీద కత్తి పెట్టి మతం మారతావా చస్తావా అన్నారు. "ఎనభయ్యేళ్లుగా నేను ఈ మతం ప్రకారం నా దేవుడిని కొలుస్తున్నాను. దాన్ని ఇప్పుడు నేనెందుకు మార్చుకోవాలి? ప్రాణభయంతో ఆ పని ఎందుకు చెయ్యాలి?" అని ఆ వృద్ధుడు ధైర్యంగా బదులిచ్చాడు. పీర్ మహమ్మద్ ఆ మాటలేవీ విననట్టే పండు ముదుసలి తల నరికి కత్తితో సమాధానం చెప్పాడు. అబుల్ ఫజలే ఈ వైనాన్ని **అక్బర్ నామాలో** గొప్పగా రాశాడు.

అలా ముగిసింది మహావీరుడు హేమచంద్ర మహారాజు కథ. అలా తిరిగింది అక్బర్ దశ.

అక్బర్ ది గ్రేట్-1

"I am in no mood to listen to the sound of good words. My ears are at present attuned only to enjoy the clang of sword. Leave me alone. I am in communion with the Amir (Timur). Send me a good reciter. Let him read to me in loud voice chapters seven to twelve of Shahnama.... Blood, not nectar, holds the key to the success of a sovereign. Give me war .Peace is of no avail to me".

(నేను మంచి మాటలను వినే స్థితిలో లేను. నా చెవులు ఇప్పుడు చవులూరించే కత్తుల చప్పుడు కోసమే రిక్కించి ఉన్నాయి. నన్ను ఒంటరిగా వదిలెయ్యండి. నేనిప్పుడు అమీర్ (తైమూర్)తో ఆత్మసంధానంలో ఉన్నాను. మంచి పాఠకుడొకణ్ని నా దగ్గరికి పంపండి. షానామాలో ఏడో అధ్యాయం నుంచి పన్నెండో అధ్యాయం వరకూ నా ముందు బిగ్గరగా చదవమని చెప్పండి... ఒక చక్రవర్తి విజయానికి కీలక సూత్రం అమృతంలో కాదు... రక్తంలో ఉంది. నాకు యుద్ధం కావాలి. శాంతి నాకు పనికిరాదు.)

ఈ మాటలు భారంగా అని అక్బర్ పాదుషా మళ్ళీ మైమరపు స్థితిలోకి వెళ్ళాడు. ఆయన ఈ లోకంలో లేడు. తోడర్‌మల్, మాన్‌సింగ్, భగవాన్‌దాసులు ఏమి చేయాలో పాలుపోక మొగాలు చూసుకున్నారు.

అప్పటికే చిత్తోడ్‌లో ఊచకోత మొదలై చాలా గంటలయింది. చావు తెగింపుతో కోట తలుపులు తెరుచుకుని తెరలు తెరలుగా విరుచుకుపడ్డ 8000 రాజపుత్ర [illegible]దరినీ నిశ్శేషంగా కత్తులకు ఎరవేసి విజయగర్వంతో ఆ ఉదయం కోటలోకి అక్బర్ అడుగుపెట్టాడు. అనేక సంవత్సరాలుగా తమకు అందకుండా మురిపించి ఊరించిన మేవాడ్ [illegible] ఎట్టకేలకు తనకు వశమయ్యారని, అందరినీ తోలుకుపోయి తన జనానాలో పడేసి తనివితీరా అనుభవించవచ్చునని అతడు చాలా ఆనందపడ్డాడు. కానీ వెళ్లీ వెళ్లగానే అతడికి కాలుతున్న చితులు, వాటిలో భస్మమైన సౌందర్యరాశుల అవశేషాలు హేళన చేస్తూ కనిపించాయి. వాటిని చూడటం వల్లనో, మిగతా రాజ్యాల వారిలా తనకు చప్పున లొంగకుండా దీర్ఘకాలం

పోరాడి తిప్పలు పెట్టారని మేవాడ్ వారి మీద మహాక్రోధంతోనో తెలియదు కాని – తన పూర్వీకుడైన తైమూర్ అంశ అక్బర్‌ని ఆవహించింది.. నిప్పులు కక్కుతూ ఒర నుంచి కత్తిదూసి ఎవర్నీ వదలొద్దు. అందర్నీ చంపండి. సర్వనాశనం చెయ్యండి. మళ్ళీ నేను ఆగమని చెప్పేంతవరకూ ఆపకండి – అని ఆజ్ఞాపించాడు.

ఇంకేం? మొగల్ సైనికులు విజృంభించారు. ఊరిమీద పడ్డారు. విచ్చలవిడిగా లూటీలు చేశారు. ఏ పాపమెరుగని స్త్రీలను, పురుషులను ఇళ్లలోంచి లాగి నరికారు. కన్నెపిల్లలను, ఇల్లాళ్లను వీధుల్లో సామూహికంగా చెరిచి, ప్రాణం తీశారు. తల్లుల చేతిలోని పసిపిల్లలను ముక్కలు చేశారు. ఒక్కొక్కరిని చంపి విసుగుపుట్టి చితులు పేర్చి జనాలను వాటిలోకి విసిరేశారు. ఇంత మందిని చంపామని ఆగ్రా తిరిగి వెళ్ళాక గొప్పగా చెప్పుకోవడానికి ఒక లెక్క, ఒక దాఖలా ఉండాలి కదా? నరికిన తలలనూ, పీనుగులను ఎలా పట్టుకుపోతారు? అందుకని ఖతం చేసిన కాఫిర్లకు గుర్తుగా శవాల మెడలలోని జంధ్యాలను తెంపి గుట్టగా వేశారు. చివరికి తూచితే అవి 74 మణుగులు (నాటి లెక్కల ప్రకారం మణుగుకు 8 పౌండ్లు) బరువు ఉన్నాయట. ఈ ప్రతాపాన్ని స్వయంగా చూసి ఆనందంగా వర్ణించిన అబుల్ ఫజల్ అంచనా ప్రకారం ఆ ఒక్క రోజునే తొమ్మిదిన్నర గంటలు నిరాఘాటంగా సాగిన ఊచకోతలో చిత్తోడ్‌లో 30 వేల మంది జనాన్ని సంహరించారట. ఎటు చూసినా శవాల గుట్టలు, ఎగిరిపడే మాంసఖండాల, ఎల్లెడలా మంటల, గుండెలవిసే ఆక్రందనల బీభత్సాన్ని చూడలేక... మహాప్రభూ! శిక్షించింది చాలు. ఈ సంహారకాండను ఇకనైనా దయచేసి ఆపించండి – అని అక్బర్ ఆంతరంగికులైన ముగ్గురు రాజపుత్ర ప్రముఖులు ఒక దశలో వేడుకోగా 'అక్బర్ ది గ్రేట్' ఇచ్చిన సమాధానమే ఈ వ్యాసం మొదట్లో ఉటంకించిన కలకండ పలుకులు!

మహానుభావుడు, మహా మానవతావాది అనుకునే అక్బర్ ఏమిటి? "Daring... and yet gentle and full of compassion, an idealist and a dreamer" *(సాహసికుడు... అయినా నెమ్మదస్థుడు.. కరుణామయుడు, ఆదర్శవాది, స్వాప్నికుడు)* అని జవహర్‌లాల్ నెహ్రూ అంతటివాడు అభివర్ణించిన మొగల్ చక్రవర్తి ఇలా తైమూర్‌తో ఆత్మను సంధానించుకుని, వేలాది అమాయకులను ఊచకోత కోయించడమేమిటి... అని చాలా మందికి నమ్మశక్యం కాకపోవచ్చు. కాని – అది ముమ్మాటికీ నిజం. రాక్షసత్వం ప్రకోపించిన స్థితిలో అక్బర్ మనసంతటా తైమూర్ నిండిపోవటం వింతకాదు. ఎక్సెస్ లగేజీని వదిలించుకున్నట్టు తన చెరలోని లక్ష మంది హిందువులను కొద్ది గంటల్లో నరికి పారేయించిన అమీర్ తైమూర్‌గారు మొగల్ వంశానికి మూలపురుషుడు. ***Akbar The Great Mogul*** గ్రంథంలో విశ్వవిఖ్యాత చరిత్రకారుడు **విన్సెంట్ స్మిత్** మొదటి అధ్యాయం మొదటి వాక్యాల్లోనే చెప్పినట్టు (భారతదేశంలో పుట్టి భారతదేశంలోనే మరణించినా) అక్బర్ విదేశీయుడు. అతడి నరాల్లో భారతీయ రక్తం ఒక్క బొట్టు కూడా లేదు. తండ్రివైపు నుంచి అతడు తైమూర్‌కు ఏడో తరంవాడు. తల్లివైపు నుంచి చెంఘిజ్‌ఖాన్‌కు వారసుడు.

పరమ శాంతమూర్తికయినా ఒక్కోసారి ఒళ్లెరుగని కోపం రావటం మానవ సహజమే. సాధారణంగా సౌమ్యుడు, సజ్జనుడు అయిన అక్బర్ కూడా చిత్తోడ్ వారు తనను ఎదిరించి, సతాయించిన తీరుకు ఆగ్రహోదగ్రుడై క్షణికోన్మాదంలో జనసంహారం సాగించాడని సరిపెట్టుకుందామా? స్వతహాగా మనిషి సజ్జనుడయితే ఆ క్షణికోన్మాదానికి పశ్చాత్తాపపడాలి

కదా? అయ్యో, నిష్కారణంగా అన్ని వేల మంది స్త్రీ, బాల, వృద్ధుల సంహారానికి కారణమయ్యానే... ఆ కాసేపూ సంస్కారమంతా మట్టికొట్టుకుపోయి నెత్తురు తాగే నరపిశాచిలా వ్యవహరించానే - అని బతికినంత కాలమూ కుమిలిపోవాలి కదా? మరి - తనవల్ల ఘోర తప్పిదం జరిగిపోయిందన్న పరితాపం అక్బర్‌కు కలిగిందా?

లేదు. పైగా తాను చేసిందే సరైన పని అని అక్బర్ దృఢంగా నమ్మాడు. తాను చేసినదాన్ని దేవుడు కూడా మెచ్చాడని ఆయనగారు జంకు లేకుండా చెప్పుకున్నాడు.

చిత్తోడ్‌ను నిర్ధూమధామం చేసి 1568 ఏప్రిల్‌లో ఆగ్రా తిరిగి వచ్చాక ఒక రోజు నిండు దర్బారులో రాజా భగవాన్‌దాస్‌ను అక్బర్ పాదుషా ఒక ప్రశ్న అడిగాడు. 'చిత్తోడ్ నుంచి మొగలులను వెళ్లగొట్టేంతవరకూ నేలమీదే పడుకోవాలని రాజ్యంలోని స్త్రీలూ, పురుషులూ అందరూ ఏకలింగేశ్వరుడి మీద ప్రమాణం చేశారట నిజమేనా?' అని.

భగవాన్‌దాస్ ఇలా బదులిచ్చాడు: 'పాద్‌షా ఆలం! అంతేకాదు. ఉదయసింగ్‌గాని, అతడి పాతిక మంది పుత్రుల్లో ఒకరుగాని గద్దెనెక్కేందుకు తిరిగి వచ్చేవరకూ రోజుకు ఒక్కపూట మాత్రమే భోజనం చేయాలని కూడా వారు ప్రతినబూనారు. వారు బతుకన్నా ప్రాపంచిక సుఖాలన్నా లక్ష్యపెట్టేవారు కాదు. తమ వారసత్వాన్ని రక్షించుకుందుకు ఎంతటి త్యాగానికయినా వెనుదీయరు. వారి స్థైర్యాన్ని కత్తులు, బల్లేలు, ఏనుగులు లొంగదీయలేవు.. కొంత కాలం వరకూ చిత్తోడ్ జోలికిపోకుండా ఉండటమే మంచిదని, ప్రేమతోటే మేవాడ్‌ను జయించడం మేలని తమకు పరమ విధేయుడైన ఈ భృత్యుడికి అనిపిస్తున్నది. ఈ రకంగా మాట్లాడినందుకు మహాప్రభువుల వారు మన్నించాలి'.

యుద్ధమే సర్వమనీ, శాంతి వ్యర్థమనీ నమ్మే అక్బర్‌కు ఈ మాటలు రుచించలేదు. దీర్ఘాలోచన తరవాత రాజా భగవాన్‌దాస్‌కు తన ఆంతర్యాన్ని వివరించాడు. అదేమిటో అబుల్ ఫజల్ మాటల్లో వినండి.

"*మా ప్రాణాలకు తెగించి, విశ్వాసపాత్రుడైన వేలాది అనుచరుల ప్రాణాలు బలిపెట్టి మేము చిత్తోడ్‌ను జయించాము. చచ్చినవారయితేనేమి, గాయపడ్డవారయితేనేమి శత్రుపక్షం సుమారు యాభైవేల మందిని నష్టపోయింది. అల్లా అభిమతం అలా ఉంది. జైత్రయాత్ర పథకాలతో ముందుకు సాగిపొమ్మంటూ దేవుడు ఇచ్చిన సంకేతమే ఈ గెలుపు. జయాపజయాలను అర్థం చేసుకునేందుకు తైమూరీయ మార్గం ఇది. అదృష్టాలను నిర్ణయించేది పైవాడు. నా చర్యలను, పథకాన్ని అల్లా ఆమోదించి ఉండకపోతే ఒంటి మీద చిన్న గాయం కూడా కాకుండా నేను చిత్తోడ్ నుంచి తిరిగి రాగలిగేవాడిని కాను... రాజా భగవాన్‌దాస్! మేవాడ్ ప్రజలు వారి వారసత్వానికి, శౌర్య సంప్రదాయాలకు గర్వపడుతూండవచ్చు. కాని మా వారసత్వమూ వారికి తీసిపోయేదేమీ కాదు. రాణాను మోకరిల్లజేసేందుకు తలపెట్టిన పనిని ఈ దిశలో విడిచిపెట్టేటట్లయితే ఘనత వహించిన అమీర్ తైమూర్ పట్ల విధేయతలో మేము విఫలమైనట్టే అవుతుంది*"..... ("We would be failing in our allegiance to the great Timur if we at this stage relinquish the plan to bring the Rana to the knees.)

మానవతావాది, మహామనీషి అని మన మేధావులు వేనోళ్ల కొనియాడిన అక్బర్ పాదుషా దృష్టిలో ముప్పైవేల మంది అమాయక ప్రజలను నిష్కారణంగా నరికిపోగులు పెట్టిన దుశ్చర్య సిగ్గుపడవలసిన దురాగతం కానేకాదు. పైగా అది దేవుడే మెచ్చి, దీవించి తన చేత చేయించిన

పుణ్యకార్యం అని అతడి దృఢ విశ్వాసం. చిత్తోడ్‌లో అతడిని కమ్మినది క్షణికోన్మాదం కాదు. అది అతడికి స్వతస్సిద్ధమైన సహజోన్మాదం! నరపిశాచిలాంటి తైమూర్ ఆత్మ ఏదో ఒక రోజున దౌర్భాగ్యవశాత్తూ అక్బర్‌ను ఆవహించిందనుకోరాదు. తైమూర్ స్ఫూర్తే అక్బర్‌ను ఎల్లవేళలా నడిపించింది - అనడానికి ఈ మాటలను మించిన రుజువు ఏమి కావాలి? మన మేధావులకు అక్బర్ ఆదర్శ పురుషుడు కాగా అక్బర్‌కేమో తైమూర్ ఆదర్శపురుషుడు!

అల్లాఉద్దీన్ ఖిల్జీ, ఔరంగజేబుల వలె అక్బర్‌కు మతావేశం లేదని, కాఫిర్లన్న ద్వేషంతో హిందువులను ఆయన చంపించలేదని, హిందూ దేవాలయాలను ధ్వంసం చేయించలేదని, ముస్లింలు ఎక్కువ - హిందువులు తక్కువ అన్న భేదభావం లేక అందరినీ సమంగా చూసి, అన్ని మతాలను సమానంగా ఆదరించిన గొప్ప సెక్యులరిస్టు అని మనవారికి గొప్ప నమ్మకం. హిందూ, ముస్లిం సమైక్యతకు, నిజమైన సెక్యులర్ పరిపాలన ఎలా ఉండాలన్నదానికి నమూనాగా అక్బర్‌ను ఎన్నిక చేయటం మనకు పరిపాటి. కాని - మనం ఊహించుకునే అక్బర్ వేరు. అసలు అక్బర్ వేరు.

చిత్తోడ్‌ను చెరబట్టాక అక్బర్ ఘోరమైన అఘాయిత్యాలు సాగించాడని, తనకు ముందు అల్లాఉద్దీన్ ఖిల్జీ, బహదూర్‌షాలు దయతలచి వదిలివేసిన పుణ్యస్థలాలను సైతం ధ్వంసంచేసి మలినపరిచాడని, రాజపుత్రుల ఆరాధ్య దైవమైన ఏకలింగేశ్వర ప్రతిమతో మసీదులో ఖురాన్‌ను ఉంచేందుకు ఆసనం బల్లను చేయించాడని ***Annals and Antiquities of Rajastan*** లో సుప్రసిద్ధ చరిత్రకారుడు **James Todd** వెల్లడించిన సంగతులను చూస్తేనే అక్బర్ సెక్యులరిస్టు అన్న భ్రమలు ఎవరికైనా తొలగాలి. అయితే తెలిసీ తెలియని మహామేధావులు, మహానాయకులు దశాబ్దాల తరబడి నూరిపోయడం వల్ల తలకెక్కిన తప్పుడు భావాలు ఒక పట్టాన వదలవు. విదేశీయుడైన ఒక జేమ్స్‌టాడ్, ఒక విన్సెంట్ స్మిత్ రాసిందే సత్యప్రమాణమా, మన మంచి చక్రవర్తిని భ్రష్టుపట్టించేందుకు వారు అబద్ధాలు అల్లి ఉండొచ్చు కదా అనీ కొందరు అనుకోవచ్చు. కనుక టాడ్‌లూ వద్దు: స్మిత్‌లూ వద్దు; పూర్తిగా అక్బర్ పక్షపాతులైన అబుల్ ఫజల్‌లాంటి భజనగాళ్ళు రాసిన వాటిని కూడా పట్టించు కోవద్దు. తాను ఏమి చేశాడో, ఎందుకు చేశాడో మన మంచి అక్బర్ చక్రవర్తి గారి మాటల్లోనే విందాం.

అక్బర్ గొప్పతనాన్ని, అతడి సెక్యులర్ నిబద్ధతను, సౌశీల్యాన్ని వేనోళ్ల కీర్తించే మేధావులు, చరిత్రకారులు గుర్తించనిదీ, తెలిసినా చెప్పనిదీ ఒక పత్రం ఉంది. అది స్వయానా అక్బర్ పాదుషాయే 1568 మార్చి 9న అధికారికంగా జారీ చేయించిన 'ఫత్‌నామా'. చిత్తోడ్‌ను నేలమట్టం కావించాక విజయోత్సాహంతో ఆగ్రాకు తిరిగి వెళుతూ అజ్మీర్‌లో ఆగినప్పుడు అక్కడి నుంచి **'ఫత్‌నామా- ఇ-చితోడ్'** పేర వెలువరించిన ఈ విజయపత్రంలో తాను చేసిన ఘనకార్యాన్ని వివరిస్తూ 'అక్బర్ ది గ్రేట్'గారు పలికించిన రత్నాల పలుకుల్లో మచ్చుకు కొన్ని:

> ..... The Omnipotent One who enjoined the task of destroying the wicked infidels on the dutiful mujahids through the blows of their thunder - like scimitars laid down: "Fight them! Allah will chastise them at your hands and He will lay them low and give you victory over them.
>
> *(దుర్మార్గులైన అవిశ్వాసులను పిడుగుల్లాంటి తమ కృపాణాల పోట్లతో నాశనం*

చేసే కర్తవ్యాన్ని విధేయులకు అప్పగించిన సర్వశక్తిమంతుడు ఇలా నిర్దేశించాడు: 'వారితో పోరాడండి! మీ చేతుల్లో వారిని సరిచేసి, వారిని కింద వేసి, అల్లా మీకు విజయాన్ని ప్రసాదిస్తాడు')

...... We spend our precious time to the best of our ability in war and jihad and with the help of Eternal Allah... We are busy in subjugating the localities, habitations, forts and towns which are under the possession of the infidels, may Allah forsake and annihilate all of them, and thus raising the standard of Islam everywhere and removing the darkness of polytheism.... by the use of sword. We destroy the places of worship of idols in those places and other parts of India.

(మన విలువైన సమయాన్ని యుద్ధానికి, జిహాద్‌కు శాయశక్తులా వెచ్చిస్తాం. శాశ్వతుడు అయిన అల్లా సాయంతో... అవిశ్వాసుల స్వాధీనంలోని ప్రాంతాలను, జనావాసాలను, కోటలను, పట్టణాలను అణచివేయడంలో మనం నిమగ్నమయ్యాం. అల్లా వారినందరినీ త్యజించి, నిర్మూలించుగాక. కత్తిని ప్రయోగించి, ప్రతిచోటా బహుదేవతారాధన చీకటిని తొలగించి, ఇస్లాం పతాకాన్ని సర్వత్రా ఎగురవేస్తాం. హిందూస్తాన్‌లోని ఇతర ప్రాంతాల్లోనూ విగ్రహారాధన స్థలాలను మనం నాశనం చేస్తాం.)

ఈ మతాభినివేశంలో భాగంగా చిత్తోడ్ మీదికి ఎలా దండెత్తిందీ, మూడు పగళ్లూ మూడు రాత్రులూ భీకర సంగ్రామం చేసి కోటను ఎలా పట్టుకున్నదీ, ఎదిరించినవారిని ఎలా నరికిపోగులు పెట్టినదీ పొరార వివరించాక 'ఫత్‌నామా'లో ఇంకా ఇలా చెప్పారు:

.... the whole victorious troop entered the fort. In accordance with the imperative command *"And kill the idolators all together"* those defiant ones who were still offering resistance..... were put to death and their women and children taken prisoners... immense booty and spoils in cash and kind were acquired... ... this auspicious fathnama is in fact a forctaste of the victories to follow.. ... written by the royal order (to be obeyed permanently) at Ajmer on 10th of the month of Ramzan 975 A.H.

(గెలిచిన సైన్యమంతా కోటలోకి ప్రవేశించింది. 'విగ్రహారాధకులందరినీ కలిపి చంపుడు' అన్న భగవదాజ్ఞ ప్రకారం మనకు ఇంకా తిరగబడుతున్న వారందరినీ చంపేసి, వారి స్త్రీలను, పిల్లలను ఖైదీలుగా పట్టుకొన్నాం. నగదుగా, వస్తు రూపేణా బ్రహ్మాండమైన సొత్తు దొరికించుకున్నాం. ఈ ఫత్‌నామా శుభలేఖ నిజానికి మునుముందు రానున్న విజయాలకు సూచిక... (శాశ్వతంగా శిరసావహించవలసిన) రాజాజ్ఞ ప్రకారం అజ్మీరులో హిజ్రీ 975 సంవత్సరం రంజాన్ నెల 10వ రోజున వ్రాయబడినది.)

విగ్రహారాధన విధ్వంసమే, అవిశ్వాసుల నిర్మూలనే తన ధ్యేయమని, కత్తితోనే దాన్ని సాధించబూనానని స్పష్టంగా, సగర్వంగా ప్రకటించుకున్న ఈ ఔరంగజేబ్ ముత్తాతగారినే గొప్ప సెక్యులరిస్టుగా భావించి 'అక్బర్ ది గ్రేట్' అంటూ మన కుహనా లౌకికవాదులు నెత్తిన పెట్టుకుని ఊరేగుతున్నారు.

అక్బర్ ది గ్రేట్-2

***రా**జ్యాన్నేలే రాణి ఎలా ఉండాలన్నదానికి దుర్గావతి చక్కని ప్రతీక. ఆమె బుందేల్‌ఖండ్ పట్టపురాణి. వీరనారి. భర్త గణపతిరాయ్ మరణించడంతో పసివాడైన కుమారుడి తరఫున 1548లో ఆమె గోండ్వానా గద్దెనెక్కింది. అద్భుత పరాక్రమంతో రాజ్యాన్ని రక్షించుకుంది. ఆదిల్‌షా కు ప్రధానమంత్రిగా ఉన్న హేము 22 యుద్ధాలు చేసి అన్నిటిలోనూ గెలవటమే గొప్ప అనుకుంటే... రాణి దుర్గావతి హేముకంటే నాలుగాకులు ఎక్కువే చదివింది. ఆమె పదహారేళ్లలో ఏకంగా 51 యుద్ధాలు చేసింది. మినహాయింపు లేకుండా ప్రతిసారీ దిగ్విజయం సాధించింది. 70 వేల సేనతో, 20 వేల గుర్రాలతో, 2500 ఏనుగులతో ఆమె దండు వెడలితే ఎంతటి శత్రువులకైనా హడలే.*

తనకు ప్రీతిపాత్రమైన ఏనుగునెక్కి ధనుర్బాణాలతో, కత్తులు, తుపాకులు వగైరా ఆయుధాలన్నిటినీ సమాన ప్రావీణ్యంతో ప్రయోగిస్తూ యుద్ధరంగాన ముందుండి శత్రుసేనలను చీల్చి చెండాడుతూంటే దుర్గావతి అపర దుర్గాదేవిలా భాసించేది. చేతికి చిక్కిన శత్రువులను క్షమించి, బహుమానాలతో గౌరవంగా వెనక్కి పంపిన ఆమె సౌజన్యాన్ని బద్ధవైరులు సైతం ప్రశంసించారు. యుద్ధంలో ఎంత ప్రచండురాలో పరిపాలనలో దుర్గావతి అంత చల్లని తల్లి. తన రాజ్యంలోని 23 వేల గ్రామాల్లోని ప్రతి ఊరి పెద్దనూ ఆమె పేరుతో పిలిచేది. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుని, బాధలను ఆలకించి. అందరి సమస్యలనూ అక్కడికక్కడే తేల్చివేసేది. తన రాజ్యంలో ఎక్కడైనా మనుషుల్ని చంపే పులి కనపడిందని తెలిస్తే దాన్ని వేటాడేంతవరకూ ఆమె పచ్చి మంచినీళ్లయినా ముట్టేదికాదట. ఆ సంగతి ఆమె శత్రుపక్షం వాడయిన అబుల్ ఫజలే **అక్బర్‌నామా** లో రాశాడు.

నిర్దుష్ట విధానాలతో, సమర్థ పాలనతో రాజ్యాన్ని సుభిక్షం చేసి స్వయం సమృద్ధిని సాధించి, శతాబ్దాలుగా వెనకబడిన గోండుల బతుకుల్లో దుర్గావతి వెలుగు నింపింది. కాబట్టే గోండ్వానా ప్రజలందరూ ఆమెను ఇలవేల్పుగా కొలిచారు. అంత సర్వసమర్థురాలు కనుకే ఆమె

కుమారుడు వీరనారాయణ్ పెద్దవాడై పట్టం కట్టించు కున్నాక కూడా పరిపాలన మొత్తాన్నీ తల్లి చేతుల్లోనే పెట్టి ఆమె కనుసన్నల్లో మెలిగాడు. ఒకరి జోలికి పోకుండా, ఎలాంటి వంక లేకుండా దుర్గావతి పాలనలో పదహారేళ్లుగా సుఖంగా బతుకుతున్న ఆ రాజ్యంలోనే అక్బర్ 1564లో తన వామపాదం మోపి, పచ్చటి బతుకుల్లో నిప్పులు పోశాడు.

కారణం? ఏమీ లేదు. విన్సెంట్ స్మిత్ మాటల్లో చెప్పాలంటే:

> "Akbar's attack on a princess of a character so noble was mere aggression, wholly unprovoked and devoid of all justification other than the lust for conquest and plunder."
>
> ***[-Akbar The Great Mogul p.50]***
>
> *(అంత గొప్ప గుణాలుగల రాణిపై అక్బర్ చేసిన దాడి పక్కా దురాక్రమణ: దానికి ఎలాంటి కవ్వింపూ లేదు: జయించాలన్న, దోచుకోవాలన్న కాంక్ష మినహా దానికి ఎలాంటి సమర్థింపూ లేదు.)*

మిడతల దండులా భారీ బలగాలతో మోహరించి గోండ్వానా రాజధాని చౌరాగఢ్ కోటను మొగల్ సర్దార్ ఆసఫ్‌ఖాన్ ముట్టడించాక మొత్తం గోండ్వాన ఒక్క తాటిపై నిలిచి ఆత్మరక్షణకు సమాయత్తమైంది. ఆత్మగౌరవం కోసం, న్యాయం కోసం పోరాడమని రాణి దుర్గావతి ఇచ్చిన పిలుపు గోండులందరినీ ఉద్విగ్నులను చేసింది. చౌరాగఢ్‌లో జరిగిన సంకుల సమరంలో దుర్గావతి ఏనుగునెక్కి మహాపరాక్రమం చూపింది. ఆమె ధాటికి తొలి దశలో మొగలు సేనలు కకావికలయ్యాయి. రాజా వీరనారాయణ్ భీకరంగా యుద్ధం చేస్తూ గాయపడటంతో అతడిని సురక్షిత ప్రాంతానికి తరలించమని రాజమాత ఆజ్ఞాపించింది. రాజుకు అండగా గొప్ప యోధులు పలువురు నిష్క్రమించి, సేనల్లో కొంత గందరగోళం రేకెత్తిన స్థితిలో దుర్గావతి కణతలో బాణం దిగింది. దానిని లాగివేయడానికి అవస్థపడుతుండగా కంఠంలో ఇంకో బాణం దిగింది. తన పని అయిపోయిందని రాణి గ్రహించింది. శత్రువులకు చిక్కే పరాభవంకంటే మరణమే మేలనుకుని బాకుతో తనను తానే పొడుచుకుని దుర్గావతి నేలకొరిగింది. గాయపడ్డ వీరనారాయణ్ తేరుకుని ప్రచండంగా పోరాడినా ప్రయోజనం లేకపోయింది. రాజు సైతం మరణించగానే చౌరాగఢ్ కోటలోని మానవతులు మొగల్ రాకాసులు ఉరికి రాకముందే నిప్పుల్లో దూకి ఆత్మాహుతి చేసుకున్నారు. ముందే కట్టెలు పేర్చి... గడ్డి, దూది, నెయ్యిలాంటి సంభారాలను సిద్ధంగా ఉంచిన ఆవరణలోకి స్త్రీలందరూ వచ్చి ఎవరి స్థానాల్లో వారు నిలిచి, దైవాన్ని ప్రార్థించి చితిఎక్కగానే ఇద్దరు రాజప్రముఖులు సామూహిక చితికి నిప్పటించి గేట్లు తాళం వేశారు.

మొగల్ కాముకుల కాట్లకంటే అగ్నికీలలు మేలనుకుని నిప్పుల్లో పడ్డా ఇద్దరు అభాగినులను మృత్యువు కూడా వంచించింది. మరునాడు కోటలోకి చొరబడ్డ మొగల్ సేనలను బూడిద రాశుల నడుమ కాలని దుంగల కింద ఇద్దరు రాజకుమార్తెలు చెక్కు చెదరకుండా కనిపించారు. ఈ ఘటనాక్రమాన్ని అబుల్ ఫజల్ **'అక్బర్‌నామా'**లో కళ్ళకు కట్టేలా వివరించాడు.

కోటలోపలా, నేలమాళిగల్లోనూ దొరికిన అపార సంపదతో బాటు విధి వంచితులైన ఆ ఇద్దరు స్త్రీలను ఆగ్రాకు తరలించారు. షాహిన్‌షా అక్బర్ ది గ్రేట్ గారి బందిలదొడ్డిలాంటి జనానాలో వారూ బలవంతంగా చేరి చస్తూ బతికారు.

అవిశ్వాసులను చంపి అల్లాను సంతోషపెట్టటానికే చిత్తోడ్‌ను సర్వనాశనం చేశానని అక్బర్ పాదుషాగారు చెప్పుకున్నారు. కనుక కాఫిర్ల రాజ్యమైన నేరానికే గోండ్వానా మీదా దురాక్రమణ జరిపి రాణి దుర్గావతి సహా వేల మందిని బలిగొన్నారని భావించడానికి వీలులేదు. ఎందుకంటే తన సామ్రాజ్య విస్తరణకాంక్షకు, వేరే దురుద్దేశాలతో తాను జరిపిన దురాగతాలకు మతం పేరును వాటంగా వాడుకున్నాడే తప్ప అక్బర్‌కు ముస్లిం రాజ్యాలంటే ప్రత్యేక ప్రేమ ఏమీలేదు. మహానుభావుడు అని మన మేధావులు పొగుడుతారు కాని – నిజానికి అక్బర్ మహాకాముకుడు. తన కన్నుపడిన కాంతలను అంతఃపురంలోకి లాక్కొచ్చిపడేసేదాకా ఆయన విశ్రమించలేదు. తాను మరులుగొన్నది ఎవరి ఇల్లాలు అయినా అక్బర్ తటపటాయించేవాడు కాదు. యుక్తాయుక్తాల గురించి సంశయించే మనిషే అయితే సాటి ముస్లిం అయిన సుల్తాన్ బాజ్‌బహాదూర్ చేపట్టిన కాంతను తాను పొందాలన్న తిమ్మిరిలో మాళవరాజ్యంపై విరుచుకుపడి వేల ప్రాణాలు తీసేవాడు కాదు.

అక్బర్ కామాగ్నిని ప్రజ్వరిల్లజేసిన ఆ మహిళ పేరు రూపమతి. పేరుకు తగ్గట్టు అందాల రాశి. చందమామకంటే, ఆమనిలో తొలి వేకువకంటే ఆమె సౌందర్యం మిన్న అని కవులు కీర్తించేవారు. ఆమెను చూడటం అంటే ప్రేమలో పడటమేనని, ఆమె కనుకొలకుల పానపాత్ర నుంచి ఒక బిందువు మదిరను ఆస్వాదించడం స్వర్గంలో అత్యున్నత సౌఖ్యానికి సోపానమనీ, ఆమె సన్నిధిన ఒక్కక్షణం గడపటం అమృతత్వాన్ని చవిచూడటమేనని, ఆమెలాంటి స్వచ్ఛమైన దివ్యస్త్రీని పదిలక్షల సంవత్సరాల కొకసారి గానీ భగవంతుడు సృష్టించడనీ పల్లెల్లో, పట్నాల్లో జానపదులు పాడుకునేవారు. ఆగ్రా వీధుల్లో మారువేషంతో తిరుగుతుండగా ఒక రోజున ఆ కీర్తిగానం అక్బర్ చెవిన పడింది. విన్నది మొదలుకుని అంతటి అలౌకిక సౌందర్యవతిని అనుభవించి తీరాలన్న ఆరాటం అతడి ఊపిరి సలపనివ్వలేదు. ఆ అందాల భరిణె ఎక్కడున్నా సగౌరవంగా తీసుకురండి. నాచేత గొప్ప సన్మానాలు పొందమని చెప్పండి – అని రాజోద్యోగులను పురమాయించాడు. రూపమతి మాళవ సుల్తాన్ బాజ్‌బహదూర్ అంతఃపురంలో ఉన్నదని. చక్రవర్తి పిలిచినా సరే ఆమెరాదనీ వారు వట్టి చేతులతో తిరిగొచ్చి చెప్పేసరికి అక్బర్ అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. రూపమతిని మర్యాదగా తనకు స్వాధీనపరచకపోతే మాళవ రాజ్యాన్ని ముట్టడించయినా సరే ఆమెను లాక్కురావాలని తనకు సన్నిహితుడైన అధంఖాన్‌కు ఉత్తర్వు చేశాడు.

బాజ్‌బహాదూర్ విలాసపురుషుడు. తానే మంచి సంగీతకారుడు. గొప్ప గాయకుడు. నిత్యం గానాబజానాలతో పొద్దుపుచ్చుతాడు. రూపమతిని వలచి, వలపించుకుని తన రాణిని చేసుకున్నాడు. ప్రాణ సమానంగా చూసుకుంటున్న నెచ్చెలిని మొగలులు అడగగానే అర్పించుకోవడానికి అతడు సహజంగానే ఇచ్ఛగించలేదు. తన హృదయేశ్వరిని తన నుంచి ఏ శక్తీ వేరుచేయలేదని, ఆమె గౌరవాన్ని కాపాడటానికి ఏ మూల్యమైనా చెల్లించడానికి సిద్ధమని అతడు చేసిన ప్రతిజ్ఞ జానపదుల పాటల్లో చిరకాలం మారుమోగింది. 'మన రాజ్యగౌరవానికి ఇది పరీక్షా సమయం. మనం తుదివరకూ పోరాడాలి. విక్రమాదిత్యుడు, భోజరాజు అనంతర కాలంలో హోషాంగ్‌షా, ముహమ్మద్ ఖిల్జీలవంటి ప్రభువులు పాలించిన ఈ సీమను ఒక అధికార మదోన్మత్తుడి కామవాంఛ నుంచి అందరమూ కలిసి కాపాడాలి' అని మాళవరాజు ప్రజలకు చేసిన బహిరంగ విజ్ఞప్తికి మంచి స్పందన వచ్చింది. బెదిరింపులు విఫలమవడంతో అధంఖాన్, పీర్‌మహమ్మద్‌లు పెద్ద సైన్యంతో తమమీదికి దండెత్తి వస్తున్నట్టు

తెలియగానే రాజ్యంలోని అన్ని మతాలవారూ సుల్తాన్‌కు సంఘీభావం ప్రకటించారు.

బాజ్ బహాదూర్ మొగలుల సవాలును వీరోచితంగానే స్వీకరించి సేనలను సన్నద్ధం చేశాడు. ఒకవేళ తాము ఓడిపోతే మొగలుల చేతికి చిక్కకుండా అంతఃపుర స్త్రీలందరినీ చంపెయ్యమని నమ్మకస్తులైన వారిని నియోగించి అతడు యుద్ధానికి కదిలాడు. సారంగపూర్ దగ్గర జరిగిన భీకర సమరంలో మాళవ సేనలు హోరాహోరీగా పోరాడినా అంతిమ విజయం మొగలులకే దక్కింది. బాజ్ బహదూర్ చేసేదిలేక ఖాందేశ్ కొండల్లోకి పారిపోయాడు. పరాజయం కబురు తెలియగానే కోట సంరక్షకులు తమకు అప్పగించిన పనికి ఉపక్రమించారు. శత్రువులకు దక్కకుండా అంతఃపుర స్త్రీలను కత్తులతో నరికేస్తూ రూపమతీని వేటు వేశారు. ఆమె గాయపడింది కాని ప్రాణం పోలేదు. అంతటి సౌందర్యరాశిని చంపేందుకు చేతులు రాకో, తొందరలో గమనించకో గాని ఆమెను మళ్ళీ పొడిచి చంపలేదు. సేవకులు ఆమెను కోటలో సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఇంతలో వికటాట్టహాసంతో విరుచుకుపడ్డ ఆధంఖాన్ రూపమతి ఎక్కడున్నా వెదికి పట్టుకోమని సైనికులకు ఆదేశించాడు. ఆ సంగతి తెలిసి రూపమతి తానే విషం మింగి అక్బర్‌కు అందకుండా పరలోకానికి పోయింది.

అప్పటి బీభత్స దృశ్యాన్ని అబుల్‌ఫజల్ ఇలా వర్ణించాడు.

The chief of them was Rupmati, renowned throughout the world for her beauty and charm. Baz Bahadur was deeply attached to her and used to pour out his heart in Hindi poems descriptive of his love. A monster who had been left incharge of her uplifted the sword and inflicted several wounds on her. Just then the army of fortune arrived and brought out that half-slaughtered lovely one. When Baz Bahadur had fled Adham Khan came in all haste and excitement to Sarangpur to seize the buried and other treasures... ... He took possession of all Baz Bahadur's property... and sent people to search for Rupmati. When this strain reached her ear her faithful blood became aglow, and from love to Baz Bahadur she bravely quaffed the cup of deadly poison and carried her honour to the hidden chambers of annihiliation!

[The Akbarnama, Vol.II, translated by **H.Beneridge** *p. 213-14]*

(బాజ్ బహదూర్ అంతఃపుర స్త్రీలలో అతి ముఖ్యురాలు రూపమతి. తన అందచందాలతో ప్రపంచమంతటా ఆమె ప్రసిద్ధి చెందింది. ఆమెతో బాజ్‌బహదూర్‌కు ప్రగాఢమైన అనుబంధం. ఆమె ప్రేమను వర్ణిస్తూ హిందీలో పాటలు కట్టి తన హృదయాన్ని విప్పి చెప్పాడు. ఆమెకు కాపలాగా ఉంచిన కిరాతకుడు కత్తిదూసి ఆమెపై వేట్లు వేశాడు. సరిగ్గా అదే సమయంలో అదృష్టవంతుల సేన అరుదెంచింది. సగం చంపిన ఆ ప్రేమమూర్తిని బయటికి తీశారు. బాజ్‌బహదూర్ పారిపోగానే ఆధంఖాన్ సారంగపూర్‌కు పరుగున వచ్చాడు. బాజ్‌బహదూర్ ఆస్తి మొత్తాన్ని వశం చేసుకుని రూపమతిని వెదికి తెమ్మని మనుషుల్ని పంపాడు. ఈ 'సంగతి'

చెవిన పడగానే ఆమెలో విశ్వాసపు నెత్తురు ఉడికి, బాజ్‌బహదూర్ మీది ప్రేమతో ప్రాణాంతక విషాన్ని ధైర్యంగా తాగి తన మర్యాదను మరణపు మందిరాల మాటుకు కొనిపోయింది.)

రూపమతి మరణవార్త విని అక్బర్ నివ్వెరపోయాడు. యుద్ధంలో గెలిచినా రూపమతి తనకు అందకుండా ఈ లోకం నుంచే నిష్క్రమించిందన్న నిస్సహాయత కాస్తా ఆధంఖాన్‌పట్ల ఆగ్రహంగా మారింది. తాను అంతగా మనసుపడ్డ సౌందర్యరాశిని ఎంత గట్టిగా చెప్పి పంపినా తనకు సమర్పించ లేకపోయాడన్న కడుపుమంటతోనూ, ఆమె ఏ పరిస్థితుల్లో చనిపోయిందో తెలుసుకోవాలన్న ఉద్దేశంతోనూ, అక్కడ స్వాధీనమైన అపార సంపదలో, పాడే ఆడే సుందరాంగుల్లో తనకు పంపకుండా ఆధంఖాన్ ఏ మేరకు నొక్కేశాడోనన్న ఆదుర్దాతోనూ ఆరోగ్యం బాగా లేకపోయినా అక్బర్ సిరికిం జెప్పని రీతిలో (1561 ఏప్రిల్ 27న) హుటాహుటిన సారంగపూర్ వెళ్ళాడు. ఎక్కడా ఆగకుండా దట్టమైన అడవుల గుండా పదహారు రోజులు ప్రయాణం చేసి సారంగపూర్ చేరీ చేరగానే రూపమతి చనిపోయిన గదికి వెళ్ళి చాలాసేపు మాడిన మొహంతో నిలబడ్డాడు.

దుర్గావతి, రూపమతుల గురించి చెప్పుకునేప్పుడు గుర్తు చేసుకోవలసిన మరో పేరు జయవంతి. ఆమె రాజపుత్ర రాచకన్య. రూపమతిని పోలిన అపురూప సౌందర్యవతి. దుర్గావతిని పోలిన పరాక్రమశాలి. మొగల్ దాస్యం నుంచి మేవాడ్ రాజ్యం విముక్తమయ్యేవరకూ బిడ్డను కనను; చెవి కమ్మలతో సహా ఏ ఆభరణమూ ధరించను అని ప్రతిజ్ఞ చేసి, అద్భుత శౌర్యంతో 22 ఏళ్ల చిన్న వయసులోనే రాజస్థాన్ అంతటా ప్రఖ్యాతి చెందింది. బుందీ రాజ్యపాలకుడైన రాజా సుర్జన్‌రాయ్‌కి జయవంతి సోదరుడి కుమార్తె. పురుష వేషం ధరించి, గుర్రమెక్కి పోరాటంలో ఎప్పుడూ ముందుండే ఆ రాజకుమారి అంటే ప్రజలకు ఎంతో ప్రీతి. సైనికులకు కొండంత స్ఫూర్తి. ఆమె బాణం వేసిందంటే అడవిలో వడిగా పరుగెత్తే మృగమైనా, ఆకాశంలో ఎగిరే ఖగమైనా నేలకూలిందన్నమాటే. 'ఆమె అందం అలౌకికం. ఆమె కోపం శ్రీరాముడి అగ్నిబాణం. ఆమె రణతంభోర్‌కు మకుటంలేని రాణి. ఆమె సైగచేస్తే లక్షల మంది ప్రాణాలిస్తారు. అక్బర్ పాదుషా చేతిలో గొప్ప సైన్యం ఉండవచ్చు. వీరికి రాజపుత్ర రాజులూ అతడి పాదదాసులై ఉండవచ్చు. కాని మా చెంత జయవంతి ఉంది. సుర్జన్‌రాయ్ ఉన్నాడు. వారి తెరువు వచ్చేందుకు సాహసించావో, అక్బర్ పాదుషా! నువ్వు మట్టికొట్టుకుపోతావ్' అని సామాన్యజనం పాడుకునేవారు.

ఆ సెంటిమెంటును చూసే అక్బర్‌కు ఎలాగైనా రణతంభోర్‌ను జయించి జయవంతిని తన పాదాల దగ్గర పడేసుకోవాలన్న కోరిక ప్రబలింది. యాభైవేల సైన్యాన్ని, వందలాది ఏనుగులను, ఫిరంగులను వెంట తీసుకుని స్వయంగా అక్బరే దండెత్తి వెళ్లి 1569 ఫిబ్రవరి 10న రణతంభోర్ చేరాడు. ఎత్తయిన కొండపై కట్టిన ఆ కోట శత్రు దుర్భేద్యమైనది. ప్రసిద్ధి చెందిన చిత్తోడ్‌కోట కూడా దాని ముందు బలాదూరు. ఆ కోటగోడలపై పాకితే చీమలు కూడా జారిపోతాయని అబుల్ ఫజల్ అన్నాడు. అలాంటి కోటను పట్టుకోవాలని అక్బర్ శక్తియుక్తులన్నీ వినియోగించినా, ఎన్ని ఫిరంగులను ప్రయోగించినా ప్రయోజనం లేకపోయింది. కోటలో నిల్వలు సమృద్ధిగా ఉన్నందున ఎంతకాలం ముట్టడి సాగినా లోపలివారు అల్లాడే పరిస్థితి లేదు. కోటలో తొట్రుపాటు ఛాయలే లేవు. జయవంతి కోట

రక్షణకు ముందుండి శత్రువుల దాడిని తిప్పికొట్టి రోజూ వందల సంఖ్యలో మొగల్ సైనికులను హతమార్చింది. పోరాడి లాభం లేదని తేలిపోయాక, యుద్ధంవల్ల కాని దానిని దౌత్యంవల్ల సాధించాలని అక్బర్ నిశ్చయించి రాజా భగవాన్‌దాస్‌ను ప్రయోగించాడు. అక్బర్ సార్వభౌమత్వాన్ని లాంఛనంగా అంగీకరిస్తే చాలు ఎలాంటి షరతులకైనా సమ్మతిస్తామని, ఏ వరమైనా ఇస్తామని చెప్పి, రాజా సుర్జన్‌రాయ్‌ని భగవాన్‌దాస్ బుట్టలో వేశాడు. ప్రాణం పోయినా సరే మొగలులకు తలవంచేది లేదని భీషణ ప్రతిజ్ఞలు చేసిన రాజే ప్రలోభాలకు లొంగి, కోట తాళం చెవులు అక్బర్‌కు అప్పగించాడు.

పిడుగులాంటి ఈ కబురు తెలియగానే రాజకుమారి జయవంతి నిర్ఘాంత పోయింది. దుర్భర వేదనతో తలబాదుకుంది. చరచరా తన మందిరానికి వెళ్లి తాను ధరించి ఉన్న సైనిక ఉడుపులను, ఒంటిమీద ఉన్న రాజలాంఛనాలను తీసేసి, నుదుటి తిలకాన్ని చెరిపేసుకొని, ఆలయ నర్తకి ఆహార్యాన్ని ధరించింది. కోట ఉత్తరపు మూలన ఏకలింగేశ్వరుని నమూనాలో ఉన్న శివుడి గుడికి 'హరహర మహాదేవ' అని జపిస్తూ, ఈ లోకపు స్పృహే లేకుండా వెళ్ళి శివలింగం ముందు సాగిలపడింది. చప్పున లేచి కాళ్లగజ్జలు తెగేలా, గుండెలవిసేలా, సొమ్మసిల్లేలా శివతాండవం చేసి చేసి ఈశ్వరుడి ముందు వాలిపోయింది. పడుతూ పడుతూనే బొడ్లోని కైజారు తీసి గుండెలో పొడుచుకుంది. రక్తం ధారగా చిమ్మి లింగాన్ని అభిషేకించింది. రాజపుత్రుల ఆత్మాభిమానానికి, భారతీయ శౌర్యానికి ప్రతీకగా జయవంతి జాతి జనుల ఎదల్లో చెరగని పదంలా నిలిచిపోయింది.

అక్బర్ ది గ్రేట్-3

చీకటి పడింది. అక్బర్ చక్రవర్తి తన మందిరంలో విశ్రమిస్తున్నాడు. సాయంత్రం ప్రార్థనలు ముగించుకుని లోనికి వెళ్లాక చాలాసేపటికిగాని ఆయన బయటికిరాడు. ఆ సమయం సేవకులకు ఆటవిడుపు. బయటికిపోయి కాసేపు సేదతీరి పాదుషా లేచే సమయానికి ఎవరి స్థానాల్లో వారు చేతులు కట్టుకుని నిలబడతారు. అలవాటు ప్రకారం ఆ వేళా నౌకర్లు అయిపులేరు. వారి కర్మం చాలక పాదుషా ముందే మేల్కొన్నాడు. పిలిస్తే ఒక్క సేవకుడూ పలకలేదు. మండిపడుతూ గది బయటికి వచ్చాడు.

తరవాత ఏమయిందో - అక్బర్ కొలువుచేస్తూ ఆ సమయానికి ఆ పరిసరాలలోనే వున్న అసాద్ బేగ్ తన ***"Wikaya-I Asad Beg"***లో ఇలా రాశాడు.

> That evening he happened to come out sooner than usual, to hear the news from Dakhin, and at first found none of the servants in the palace. When he came near the throne and couch, he saw a luckless lamplighter, coiled up like a snake, close to the royal couch. Enraged at the sight, he ordered him to be thrown from the tower, and he was dashed into a thousand pieces.
>
> ***[The History of India by*** **Elliot & Dowson,** *Vol VI P.164]*
>
> *(దక్షిణ్ వార్తలు వినడానికి ఆ రోజు మామూలుకంటే ముందే ఆయన బయటికి వచ్చాడు: సేవకులెవరూ కనిపించలేదు. రాజాసనం దగ్గరికి వెళ్లి చూశాడు. రాచపాన్పుకు సమీపంలో దురదృష్టవంతుడైన ఓ దీపాల పనివాడు పాములా ముడుచుకుని నిద్రపోతూ కనిపించాడు. చక్రవర్తి మండిపడి, రాజప్రాసాద గోపురం నుంచి వాడిని విసిరెయ్యమని ఆజ్ఞాపించాడు. నేలకు విసిరికొడితే వాడు వెయ్యి ముక్కలయ్యాడు)*

పని సరిగా చేయని నౌకరును ఎవరయినా శిక్షిస్తారు. మహారాజులకు కోపం వస్తే ఎవరి తలయినా తీసెయ్యగలరు. కాని – దీపాలు పెట్టే అల్పజీవిని డ్యూటీలో నిద్రపోయిన నేరానికి బురుజు మీదనుంచి విసిరి ముక్కలు చేసిన ధర్మప్రభువు మాత్రం మనకు తెలిసిన చరిత్రలో ఒకే ఒక్కడు: అక్బర్ ది గ్రేట్!

గిట్టని మనుషుల్ని రాజ్‌మహల్ నుంచి కిందికి తోయించి చంపిన సందర్భం అక్బర్ చరిత్రలో ఇదొక్కటే కాదు. తనను పుట్టింది మొదలుకుని సాకి తల్లిలా పెంచిన దాది మహామ్‌అనగా కన్నకొడుకు... తనకు కుడిభుజంలా అనేక యుద్ధాల్లో పాల్గొన్న వీరసేనాని అయిన ఆధంఖాన్ మీదా అక్బర్ పాదుషా యిటువంటి "కారుణ్యాన్నే" కురిపించాడు. ఆ రోజూ చక్రవర్తి యథాప్రకారం తన గదిలో నిద్రపోతున్నాడు. బయట కలకలం విని దిగ్గున లేచాడు. ఏమైందని అడిగితే పరిచారికలు చెప్పలేక పోయారు. బయటికి వచ్చి కనుక్కుంటే అప్పటికే వజీరు అదగాఖాన్‌ను చంపి చక్రవర్తి మీదే కత్తి ఎత్తడానికి ఆధంఖాన్ రివ్వున వస్తున్నాడని తెలిసింది. సేవకుడందించిన కృపాణం తీసుకుని చక్రవర్తి చప్పున వెళ్లి ఆధంఖాన్‌ను పట్టుకున్నాడు. జరిగిందేమిటో తెలుసుకోండని అతడు చేతులు పట్టుకుని ప్రాధేయపడుతుండగానే పాదుషా అతడి మొహంమీద గుద్దాడు. కిందపడి స్పృహకోల్పోయిన ఆధంఖాన్‌ను కట్టేసి మేడమీద నుంచి తోసి చంపమని ఉత్తర్వు చేశాడు. అంతటివాడిని చేతులారా చంపటం యిష్టం లేక సేవకులు సుతారంగా కిందికి వదిలారు. చచ్చాడో లేదో చూడమని చక్రవర్తి భటులకు చెప్పాడు. వారు చూసివచ్చి సగం మాత్రమే చచ్చాడని చెప్పారు. అయితే – జుట్టుపట్టి మళ్లీ పైకిలాక్కొచ్చి తలబద్దలై చచ్చేలా మళ్లీ విసరమన్నాడు పాదుషా. ఈ రకంగా ఆధంఖాన్‌కు షాహిన్షా "సముచిత న్యాయం" చేసిన వైనాన్ని అబుల్‌ఫజల్ అక్బర్‌నామాలో ***[Akbarnama* tr.by H.Beveridge *Vol.II* PP. 269-72]** పూసగుచ్చినట్టు వివరించాడు.

చంపదలచిన మనిషిని ఇంత క్రూరంగా ఖతం చేయాలా అని విస్తుపోనవసరం లేదు. క్రౌర్యం అక్బర్ వంశంలోనే వుంది. ఆయన తండ్రి హుమాయున్‌గారు తనకు ఎదురు తిరిగిన సొంత తమ్ముడు కామ్రాన్‌ను సింహాసనానికి పోటీ రాకుండా కళ్లు పొడిపించాడు. ఆయన ఉత్తర్వు ప్రకారం మొగల్ కింకరులు రాజకుమారుడి మోకాళ్లను అదిమిపట్టి, నోట్లో ఉండ కుక్కి శూలంతో రెండు కళ్లూ పొడిచి ఉప్పు, నిమ్మరసం చల్లారు. తన తండ్రి ఆ రకంగా కళ్లుమాత్రం పొడిచి సోదరుడి అడ్డు తొలగించుకోగా అక్బర్ పాదుషా యింకో అడుగు ముందుకేసి ఆ పినతండ్రి కుమారుడిని 1565లో గ్వాలియర్‌లో ఏకంగా ప్రాణమే తీయించాడు. ఆనాడు అతడు పెట్టిన ఆ పాపిష్టి ఒరవడినే అనంతరకాలంలో అతడి వారసులయిన షాజహాన్, ఔరంగజేబ్‌లు అనుసరించారని ***Akbar The Great Mogul*** 20వ పేజీలో విన్సెంట్ స్మిత్ అన్నాడు.

మేలు చేసినవారికి హాని చెయ్యడం, గుట్టుచప్పుడు కాకుండా మనుషుల్ని మట్టుపెట్టడం అక్బర్‌కు వెన్నతోపెట్టిన విద్య. 14వ ఏట తాను ప్రవాసంలో వుండగా తండ్రి మరణించి, రాజ్యం పరులపాలై దిక్కుతోచని స్థితిలో అక్బరుకు కొండంత అండలా నిలబడి తన భుజాలపై ఎక్కించుకుని సింహాసనం మీద కూచోబెట్టినవాడు బైరాంఖాన్. గద్దెమీద కాస్త పట్టుచిక్కగానే అక్బర్ ముందుగా బెబ్బే అన్నదీ అతడికే. అంతఃపురంలో విలాసాల్లో మునిగి తేలుతున్న కుర్రరాజును కుంకలా చూసి బైరాంఖాన్ సర్వాధికారాలూ గుప్పిట్లో పెట్టుకుని

బరితెగించినందువల్లే.. పాదుషా కనీస ఖర్చులకు సైతం సొమ్ము ఇవ్వకుండా బిగదీసి, పాదుషాకు విశ్వాసపాత్రులైనవారిని నిష్కారణంగా చంపించి, ఒక దశలో పెద్ద ఎత్తున తిరుగుబాటును లేవదీసినందువల్లే... అదీ మహమ్ అనగా వంటి అంతఃపుర స్త్రీల ప్రేరేపణతోనే అక్బర్‌కు బైరాంఖాన్‌మీద మనసు విరిగిందనీ... అక్కడికీ అతడు ఎంత అవిధేయతకు పాల్పడ్డా పెద్ద మనసుతో అడుగడుగునా క్షమించి. సగౌరవంగా మక్కాకు పొమ్మనగా, దారి మధ్యలో అతడిని పూర్వవిరోధులు హతమార్చారని అక్బర్ భక్తులైన అబుల్ ఫజల్ లాంటి చరిత్రకారులు బుకాయించారు. కాని - ఘటనాక్రమాన్ని పరికిస్తే బైరాంఖాన్ ఖూనీ వెనుక అక్బర్ హస్తం లీలగానైనా కనపడుతుంది.

అక్బర్‌లో గొప్పతనాన్ని మాత్రమే చూసే మన చరిత్రకారుల అవగాహన ప్రకారం 1560లో బైరాంఖాన్ అవిధేయతకూ రాజద్రోహానికీ వరసగా పాల్పడి తల ఎగురవేసిన తరువాతే గత్యంతరంలేక అక్బర్ అతడిపై కత్తిఎత్తవలసి వచ్చింది. వాస్తవానికి అంతకు మూడేళ్లముందే, అంటే గద్దెనెక్కి సంవత్సరం తిరిగిందో లేదో బైరాంఖాన్‌ను అక్బర్ సతాయించడం మొదలెట్టాడు. సికిందర్ అఫ్ఘాన్‌ను ఓడించి లాహోర్ నుంచి ఢిల్లీ తిరిగి వస్తుండగా మాన్‌కోట దగ్గర సేనలు విడిది చేసినప్పుడు జబ్బుపడి ఒళ్లంతా బొబ్బలతో మంచంలో పడివున్న 'ఖాన్‌ఖానన్'(బైరాంఖాన్) డేరామీదికి చక్రవర్తికి చెందిన రెండు ఏనుగులు దాడిచేయబోయాయి. అవి ఆటలాడుతూ అటుకేసి వెళ్లాయే తప్ప వేరే దురుద్దేశం ఏదీ లేదని రాజబంధువులు ఎంత గట్టిగా చెప్పినా బైరాంఖాన్‌కు నమ్మకం చిక్కలేదు. "నామీద ప్రభువులవారికి ఎవరు ఎలాంటి చాడీలు చెప్పారు? ఈ సేవకుడు చేసిన అపరాధమేమిటి? తమరికి ఎందుకు దయతప్పింది" అని ప్రాధేయపడుతూ చక్రవర్తి దగ్గరికి అతడు దూతను పంపాడని *Tabakat-I Akbari* లో నిజాముద్దీన్ అహ్మద్ రాశాడు. ***[Elliot & Dowson, Vol.VI P.256]***

విశాల సామ్రాజ్యాన్ని నిర్మించి, మహామంత్రిగా చక్రం తిప్పుతున్న మనిషికి తనకు తప్పిన గండం యాదృచ్ఛికమో, కావాలని జరిపిన హత్యాయత్నమో పోల్చుకోగల తెలివి వుండదనుకోలేము. అంతకుముందు అటువంటి అనుమానాస్పద ఘటన ఏదీ జరగనిదే... ప్రభువుకు తనపై మనసు విరిగిందనడానికి దాఖలా ఏదీ మునుపు కనిపించకుండానే- కేవలం రెండు రాచ ఏనుగులు తన డేరా దాపునకు వచ్చీరాగానే బైరాంఖాన్ గంగవెర్రులెత్తి "మహాప్రభూ! తమరు నన్ను ఎందుకు చంపించదలిచారు?" అని దూతను ఉరికిస్తాడని ఊహించలేము. నిరంకుశంగా చెలరేగి, రాజద్రోహానికి పాల్పడినందువల్లే బైరాంఖాన్ను అక్బర్ వెళ్లగొట్టాడనీ... మక్కాకు వెళ్లే నౌకకోసం గుజరాత్‌లోని సహర్వాలాలో వేచివున్నప్పుడు, స్థానిక ఆఫ్ఘాన్ గవర్నర్ గట్టి రక్షణ కల్పించనందువల్లే బైరాంఖాన్ను దారికాసి విరోధులు హత్యచేశారని అధికారిక చరిత్ర గ్రంథాలు చెబుతున్నదే నిజమైతే ఆ కథ అక్కడితో పూర్తికావలసింది. కాని - కాలేదు. బైరాంఖాన్ గోరీమీద గడ్డి కూడా మొలవకముందే అతడి భార్య సలీమా సుల్తాన్ బేగాన్ని అక్బర్ పెళ్లి చేసుకున్నాడు. ఆమె ఎవరో కాదు. అక్బర్‌కు దగ్గరి బంధువే. మొదటి నుంచీ ఆమెమీద అక్బర్ కన్నువేశాడు. అనామకంగా దయనీయంగా కుక్కచావు చచ్చిన బైరాంఖాన్ దేహాన్ని గోరీ నుంచి వేరేచోటికి మార్చి గౌరవలాంఛనాలు జరిపించటం - తనకు ద్రోహం చేసినా అతడిపై తనకు కోపం లేదని లోకాన్ని నమ్మించటానికి అక్బర్ ఆడిన నాటకం. దిక్కులేని స్థితిలో తాను 'ఖాన్ బాబా'

(పితృసమానుడు) అని పిలిచి, పూర్తిగా నమ్ముకున్న బైరాంఖాన్‌పట్ల అక్బర్‌కు ఏ మాత్రం గౌరవం వున్నా అతడు అటు మరణించగానే ఇటు అతడి భార్యను జనానాలోకి లాగేసేవాడు కాదు. ఇదంతా చూస్తే తాను కామించిన స్త్రీని పొందడంకోసం బైరాంఖాన్‌ను అక్బరే చంపించి వుంటాడన్న అనుమానం సహజం.

అక్బర్ ఉచ్చనీచాలెరుగని స్త్రీలోలుడు. "నీ భార్య నాకు నచ్చింది. కాబట్టి ఆమెకు విడాకులిచ్చి నాకు వదిలెయ్" అని ఎవరినైనా ఆదేశించగల ధర్మప్రభువు ఆయన. కాదంటే మెడమీద తలకాయ నిలవదు కనుక సాధారణంగా చాలా మంది అవమానాన్ని దిగమింగుకుని విధికి తలవంచేవారు. కొందరు మాత్రం పగబట్టి కనీసం దొంగదెబ్బ అయినా తీయజూసేవారు. 1564లో ఒకసారి ఢిల్లీ వీధుల్లో వెళుతూంటే మిద్దెమీది నుంచి అక్బర్‌మీద పులాద్ అనే బానిస బాణం వేశాడు. అది భుజంలోకి దిగి గాయమైంది. రాజభటులు దుండగుడిని పట్టుకుని అక్కడికక్కడే ముక్కలుగా నరికారు. వాడిచేత హత్యాయత్నం ఎవరు చేయించారో ఆరా తీయాలని అధికారులు అనుకున్నారు. కాని చక్రవర్తి వద్దని వారించాడు. ఎందుకని?

ఎందుకో - విన్సెంట్ స్మిత్ చెబుతాడు వినండి:

> Akbar was then engaged in a scheme for marrying certain ladies belonging to Delhi families, and had compelled one Shaikh to divorce his wife in his favour. The attempted assassination put an end to these discreditable proceedings, and probably was prompted by resentment at the royal invasion of the honour of families. Akbar, throughtout his life, allowed himself ample latitude in the matter of wives and concubines.....
>
> ***[Akbar The Great Mogul, P. 47]***
>
> *(ఢిల్లీ కుటుంబాలకు చెందిన కొందరు స్త్రీలను పెళ్లాడాలని అప్పట్లో అక్బర్ పథకం వేస్తున్నాడు. నేను చేసుకుందుకు వీలుగా నీ భార్యకు విడాకులిమ్మని ఒక షేక్‌ను అతడు నిర్బంధించాడు. ఈ హత్యాయత్నంతో ఆ పరువుతక్కువ సన్నాహాలు ఆగిపోయాయి. కుటుంబాల మాన మర్యాదలపై రాజు దురాక్రమణ చేయడంపట్ల ఆగ్రహమే బహుశా హత్యాయత్నాన్ని పురికొల్పింది. బతికినంతకాలమూ, భార్యల, ఉంపుడుగత్తెల విషయంలో అక్బర్‌కు దౌర్బల్యం జాస్తి.)*

అక్బర్ దృష్టిలో ఆడది సంతలో సరుకు. సంతలో కొన్న సరుకుకు వెలచెల్లిస్తారు. అక్బర్ అదీ చెయ్యడు. తాను ప్రభువు కాబట్టి తన రాజ్యంలోని స్త్రీ లందరూ తనకు భోగవస్తువులేనని అతడి నమ్మకం. అట్టే శ్రమ లేకుండా మంచి "పిట్ట"లను పట్టుకునేందుకే అతడు ఢిల్లీలో "మీనాబజార్" వ్యవస్థను పోషించాడు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏటా అక్కడ జరిపే నౌరోజ్ ఉత్సవాల్లో హిందూ సామంతులందరూ తలా ఒక స్టాల్ తెరిచి తమ రాజ్యంలోని అందమైన ఆడవారిని ప్రదర్శిస్తే, చక్రవర్తి వెళ్లి చూసి తనకు నచ్చినవారిని సెలక్టుచేసుకుని అంతఃపురానికి తోలుకెళ్లేవాడు.

ఇదే సందర్భంలో. అబుల్ ఫజల్ పేర్కొన్న ఇంకో విశేషాన్ని గుర్తు చేసుకోవాలి. రాజప్రముఖులకు చెందిన భార్యలు, "సౌశీల్యానికి" పేరుబడ్డ బేగమ్‌లు తమను తాము

చక్రవర్తికి సమర్పించుకోదలిస్తే తమ కోరికను రాణివాసం సేవకులకు తెలిపి జవాబుకోసం నిరీక్షించేవారట. ఆ సేవకులేమో రాజభవనం అధికారులకు తెలపగా వారు విన్నపాలను పరిశీలించి అర్హులనుకున్నవారిని అంతఃపురంలోకి అనుమతించే వారట. మంచి హోదాగల మహిళలు కొందరికయితే పూర్తిగా నెలరోజులపాటు అక్కడ గడపటానికి అనుమతి దొరికేదట.

[Ain-I Akbari tr by **H.Blochmann**, *Vol-I p. 47]*

శీలంగల ఏ గృహిణీ తానుగా ఏరికోరి రాణివాసానికి వెళ్లి నెలరోజులు వ్యభిచారం చేయాలని కోరుకోదు. అలాగే పరువుగల ఏ రాజప్రముఖుడూ తన భార్యను చక్రవర్తికి తార్చాలని అనుకోడు. అబుల్‌ఫజల్‌కు సహజమైన అతిశయోక్తినీ, అభూత కల్పననీ వదపోస్తే యథార్థమేమిటో పోల్చుకోవడం కష్టంకాదు. చక్రవర్తి కన్నుపడ్డ, లేక చక్రవర్తి ఇష్టపడతాడని జనానా అధికారులకు తోచిన రాజప్రముఖుల భార్యలను, ఇతర స్త్రీలను బలవంతంగా రాణివాసంలో చేర్చుకుని, చక్రవర్తికీ దర్బారు పెద్దలకూ మొగం మొత్తాక వారానికో నెలకో వెనక్కి పంపేవారని, భావించడం సత్యదూరంకాదు.

అంతఃపురంలోకి అనుమతించిన స్త్రీని రాజుకదా అనుభవించేది? మరి - దర్బారు పెద్దలకూ మొగం మొత్తడం అంటున్నారేమిటి అని కొందరికి సందేహం రావచ్చు. ఆడవారి విషయంలో అక్బరు గొప్ప సోషలిస్టు. తాను జయించిన లేక లొంగదీసుకున్న హిందూ రాజ్యాల రాజవంశాల నుంచి కనీసం తలా ఒక కన్యను అంతఃపురానికి పంపాలన్న కంపల్సరీ ఏర్పాటువల్ల... రాజపుత్రులను మంచి చేసుకునే వ్యూహంలో భాగంగా ఆయా రాజకుటుంబాల కన్యలను అక్బర్ స్వయంగా తానో, తన కుటుంబీకులకో పెళ్లి చేసుకోవడంవల్ల అంతఃపురంలో రాణుల సంఖ్యే చాలా హెచ్చుగా వుండేది. వీరికితోడు - ఇంతకుముందు చెప్పుకున్నట్టు టెంపరరీ వీసాపై ఖజానాకు తోలిన రాజప్రముఖుల భార్యలు, ఇంకా 'మీనాబజార్' నుంచి ఏటేటా కొట్టుకొచ్చే హిందూ స్త్రీలు - వీరందరితో అక్బర్ జనానా శరణార్థుల శిబిరంలా ఎప్పుడూ కిటకిటలాడుతూండేది. అంతఃపురంలో 5 వేల రాణులు వుండేవారని, వారికి తలా ఒక గది ప్రత్యేకంగా వుండేదని అబుల్‌ఫజల్ ***(Ain-i-Akbari,*** *Vol.I p.147)* పచ్చి అబద్ధమైతే ఆడాడుకాని - అక్బర్ కాలంలో 5 వేల గదులుగల రాజప్రాసాదం ఏదీలేదు. ప్రతి గదిలోనూ పట్టినంత మందిని కుక్కిన దుర్భరస్థితి చాలదన్నట్టు అంతఃపుర స్త్రీలకు ఎందరో మొగుళ్లు! చక్రవర్తికి దయకలిగితే ఏ కొలువులోని ఏ ప్రముఖుడైనా ఏ అంతఃపుర స్త్రీనైనా ఇష్టానుసారం అనుభవించవచ్చు.

నమ్మబుద్ధికావడంలేదా?

'అక్బర్ ది గ్రేట్ మొగల్' గ్రంథం 185వ పేజీలో విన్సెంట్ స్మిత్ చేసిన ఈ వ్యాఖ్య చూడండి:

> Grimon's statement that Akbar had confined himself to one wife, and distributed his other consorts among the courtiers is not directly confirmed from other sources. It is unlikely that the assertion should have been wholly baseless, because the other statements of fact attributed to Grimon are supported more or less by independent testimony. Probably Akbar really did repudiate some of the hundreds of women in his harem and

distributed them among his nobles. His record renders it improbable that he should have gone as far as to restricthimself to one wife.

(అక్బర్ ఒక్క భార్యకే పరిమితమై మిగతా రాణులను ఆస్థాన ప్రముఖులకు పంచిపెట్టేవాడని గ్రిమాన్ చెప్పినదాన్ని నేరుగా ధ్రువీకరించే యితర ఆధారాలు దొరకలేదు. గ్రిమాన్ వెలిబుచ్చిన యితర అభిప్రాయాలకు మద్దతుగా స్వతంత్ర సాక్ష్యాలు వున్నాయి కాబట్టి ఈ విషయం పూర్తిగా నిరాధారమనేందుకు వీలులేదు. బహుశా అక్బర్ తన అంతఃపురంలోని వందలాది స్త్రీలను ప్రభువర్గీయులకు పంచిపెట్టి వుండవచ్చు. అతడి రికార్డునుబట్టి చూస్తే ఒక్క భార్యకు మాత్రమే పరిమితమయ్యే రకం కాదని స్పష్టం.)

అంటే – అక్బర్ ఏకపత్నీవ్రతుడన్న దానిలో అపనమ్మకమే తప్ప ఆయనగారు పెళ్లిచేసుకుని అంతఃపురంలో పడేసిన స్త్రీలలో అనేక వందల మందిని తనకు ఇష్టులైన వారికి పప్పుబెల్లాల్లా పంచిపెట్టేవాడన్న విషయంలో గ్రిమాన్‌దీ, విన్సెంట్ స్మిత్‌దీ ఒకటేమాట.

పెళ్లిచేసి అక్బర్ చేతిలో పిల్లను పెట్టాక ఆ పిల్ల గతి ఏమవుతుందో ఆ కాలంలో అందరికీ తెలిసిన రహస్యమే. కట్టుకున్నవాడు ఎవరికి అప్పగిస్తే వాడితో ఎంతకాలం చెయ్యమంటే అంతకాలం వ్యభిచారం చేయడమే హిందూ స్త్రీలు అనుభవించే రాణివాసం. ఆ సంగతి తెలుసుకాబట్టే మిగతా రాజపుత్ర రాజ్యాలవారు అక్బర్ మాయలోపడో.... పర్యవసానాలకు భయపడో... కన్నబిడ్డలపట్ల బాధ్యతకంటే సొంత లాభం, అధికారం ముఖ్యమని తలచో – అక్బర్‌కు పాదాక్రాంతులై అతడు కోరిన ప్రకారం అతడితో వైవాహిక బాంధవ్యాలు పెట్టుకొని ధన్యులైనా... మేవాడ్ రాజపుత్రులు అలాంటి దగుల్బాజీ లొంగుబాటుకు సమ్మతించలేదు. ప్రాణంకంటే మానం మిన్న అని భావించడంవల్లే అనేక హిందూ రాజ్యాల్లోని కులస్త్రీలు శత్రువుల చేతికి చిక్కకుండా సామూహికంగా చితిమంటల్లోకి దూకి 'జోహార్' చేశారు.

హిందూ స్త్రీలను పెళ్లాడటం అక్బర్ సెక్యులరిజానికి, హిందూ–ముస్లిం సమైక్యతపట్ల అతడి నిబద్ధతకూ నిదర్శనమని మూర్ఖంగా వాదించే మన మేధావులు 1568 లో రణతంభోర్ కోటను మాయాదౌత్యంతో కైవసం చేసుకునే సందర్భంలో అక్బర్‌కూ, సుర్జన్‌రాయ్‌కీ కుదిరిన సంధి ఒడంబడికను ఒకమారు పరికిస్తే మేలు. ఆ ఒప్పందంలోని మొట్టమొదటి అంశమే... రాజపుత్రులకు అవమానకరమైన విధంగా రాజాంతఃపురానికి వధువును పంపడమనే ఆచారం నుంచి బుందీ రాజ్య పాలకులకు మినహాయింపు వుంటుందని! అలాగే... నౌరోజ్ ఉత్సవంలో రాజప్రాసాదం వద్ద మీనాబజార్‌లో స్టాల్ నిర్వహించడానికి తమ భార్యలను, తమకు బంధువులైన మహిళలను పంపే ఏర్పాటు నుంచి బుందీ ప్రభువులకు మినహాయింపు వుంటుందన్నది ఇంకో ముఖ్యమైన షరతు.

[Akbar The Great Mogul, p.7]

ఆ కాలంలో అంతఃపురం ఎలాంటి వ్యభిచార కేంద్రమో.... పెళ్లిళ్ల పేరిట అక్బర్ వశమైన అభాగినుల గతి ఏమయ్యేదో... చక్రవర్తికి నచ్చితే ఎంచుకుని అనుభవించేందుకు అనువుగా ఏటేటా తమ అంతఃపుర స్త్రీలను ఢిల్లీ పంపి పెరేడ్ చేయించవలసిన దుర్గతి ఎంత నికృష్టమని ఆకాలంలో పరువుగల.హిందువులు భావించేవారో ఈ సంధి షరతులనుబట్టే తెలియడంలేదా? హిందూ –ముస్లిం ఐక్యతకు, సాంస్కృతిక అనుబంధానికి మతాంతర వివాహం చక్కని

సాధనమన్నదే అక్బర్ ఆశయమని అమాయకంగా నమ్మే అల్పబుద్ధులు – అదే నిజమైతే అక్బర్ తన ఇంటి స్త్రీలను ఎంతమంది హిందువులకిచ్చి పెళ్లి చేశాడని ఎప్పుడైనా ఆలోచించారా? పెళ్లి పేర అమాయక బాలికల గొంతుకోసి, నిఖాకాగానే వ్యభిచారంలోకి నెట్టి మన కాలంలో వార్తలకెక్కిన అరబ్‌షేక్‌లకంటే 'అక్బర్ ది గ్రేట్' ఏవిధంగా గొప్ప?

అక్బర్ ది గ్రేట్-4

పధ్నాలుగో శతాబ్దంలో ఢిల్లీ సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీకి ఓ బ్రెయిన్ వేవ్ వచ్చింది. పరమ పవిత్రుడైన ప్రవక్తకు దేవుడు నలుగురు స్నేహితులను ప్రసాదించాడు. వారి శక్తి సామర్థ్యాలతో మతం, న్యాయం అనేవి ప్రతిష్ఠిత మయ్యాయి. అవి పునరుత్థానం రోజువరకూ నిలుస్తాయి. దయామయుడైన దేవుడు నాకూ నలుగురు మేరికల్లాంటి మిత్రులను యిచ్చాడు - నా ప్రాభవం ద్వారా వారు వృద్ధిచెంది అధికారాన్ని, ఔన్నత్యాన్ని పొందారు. నేను కనుక తలచుకుంటే ఈ నలుగురు స్నేహితుల ద్వారా ఒక కొత్త మతాన్ని, మార్గాన్ని స్థాపించగలను. నా కత్తినీ, నా మిత్రుల కత్తులనూ ప్రయోగించి ప్రజలందరూ దాన్ని అనుసరించేటట్టు చేయగలను. ఈ పనిచేస్తే కొత్త మతం ద్వారా మా పేర్లు ప్రవక్త, ఆయన మిత్రుల పేర్లలాగే చిరస్థాయిగా నిలుస్తాయికదా?!... ఇదీ ఖిల్జీగారి లాజిక్. దీన్నే దర్బారులోనూ, ఆస్థాన ప్రముఖుల దగ్గరా, సన్నిహితులతోనూ తరచూ ప్రస్తావిస్తూండేవాడు.

ఓరోజు పానగోష్ఠిలో యిదే టాపిక్ తెచ్చి, తన ప్రతిపాదనకు ఏమంటారని అక్కడున్న అందరినీ అడిగాడు. అంతా మొహాలు చూసుకున్నారు. చక్రవర్తి చెప్పినది సరికాదనడానికి ఎవరికీ ధైర్యం చాలలేదు. ఒక్కడు మాత్రం నిర్భయంగా నోరు విప్పాడు. అతడి పేరు అలాఉల్ ముల్క్. ఢిల్లీకి కొత్వాలు. సుల్తాన్‌కు విశ్వాసపాత్రుడు. 'మహాప్రభూ! ఇక్కడి నుంచి మద్యాన్ని, పానపాత్రలను తీసేయించి, తమ నలుగురు మిత్రులు మినహా మిగతా అందరినీ బయటికి పంపిస్తే, నా మనసులోని మాట తమకు విన్నవించుకుంటానని" అన్నాడతడు. సుల్తాన్ సరేనన్నాడు. ఆయన, మిత్ర చతుష్టయం సావధానంగా వింటూండగా అలాఉల్ ముల్క్ ఇలా చెప్పాడు:

"అయ్యా! మతం, ధర్మం, ఆధ్యాత్మిక మార్గం అనేవి రాజులు కలగజేసుకోదగినవి కావండి. అది ప్రవక్తలు చేయాల్సిన పని. కొందరు ప్రవక్తలు రాజరికపు బాధ్యత కూడా నిర్వర్తించి ఉండవచ్చు. కాని రాజులు మాత్రం ప్రవక్తల బాధ్యతను ఎన్నడూ చేపట్టలేదు. ఆదాము

నాటి నుంచి ప్రపంచం అంతమయ్యేదాకా ఇదే విధి. నా సలహా ఏమిటంటే మహా ప్రభువులవారు ఇంకెప్పుడూ ఈ విషయాల గురించి మాట్లాడరాదని".

"మొగమాటం లేని ఈ మిత్రవాక్యాన్ని విని ఢిల్లీ సుల్తాన్ ఆలోచనలో పడ్డాడు. ఆయన నలుగురు స్నేహితులూ ముల్క్ చెప్పినదాన్ని అంగీకరించి, సుల్తాన్ సమాధానం కోసం ఎదురుచూశారు. కాసేపటి తరువాత అతడు ఇలా అన్నాడు "ఇకమీద నేను అలాంటి మాటలనడం ఎవరూ వినరు. నువ్వు నిజం పలికి, నీ ధర్మం నువ్వు నిర్వర్తించావ్. నువ్వూ, నిన్ను కన్నవాళ్ళూ ధన్యులు..."

[Tarikh-i Firoz shah,* Elliot & Dowson, *Vol.III P.169]

సరిగ్గా ఖిల్జీకి వచ్చిన బ్రెయిన్ వేవే మూడు శతాబ్దాల తరువాత అక్బర్ పాదుషాకూ వచ్చింది. కాని – అతడి దురదృష్టం: సకాలంలో ఖిల్జీకి సరైన సలహా ఇచ్చి వారించిన ముల్క్ లాంటివాడు అతడికి లేకపోయాడు. అక్బర్ చుట్టూ చేరిన వారంతా భజనపరులు. దారి తప్పినప్పుడు హెచ్చరించక పోగా అకార్యానికి మరింత ఎగదోసేవారు. అక్కడికీ యథార్థవాదులు కొందరు లేకపోలేదు. కాని, వారి హితవును వినిపించుకునే తత్వం అక్బర్‌కు లేదు. పైగా తన మాటకాదంటే తనదారికి అడ్డు తగిలితే ఎంతటివారినైనా వెంటాడి వేటాడే మహానుభావుడాయన. అందుకే – యుక్తా యుక్తాలు తెలిసినవారు కూడా నోరు మెదిపేందుకు సాహసించలేకపోయారు. ఇంకేం? అసలే కోతి–పైగా కల్లు తాగింది అన్న సామెతలా అక్బర్ పేట్రేగాడు.

పర్యవసానం: అష్టవంకరల 'దీన్ ఇలాహీ' అనే సంకరమతం!

ఇస్లాంను, క్రైస్తవాన్ని, హిందూ మతాన్ని సమన్వయం చేసి, అన్నిటిలోని మంచినీ తీసుకుని సకల జనులకూ ఆదరణీయమైన, ఆచరణీయమైన ఉత్తమ ఆధ్యాత్మిక మార్గాన్ని ఆవిష్కరించాలని సెక్యులర్ అక్బర్ మహాతపన పడ్డాడని మన దేశవాళీ చరిత్రకారులు బోలెడు మెచ్చేసుకుంటారు. అక్బర్ ది గ్రేట్‌గారు కష్టపడి స్థాపించిన 'దీన్ ఇలాహి' సర్వమత సమానత్వానికి, సెక్యులర్ సహజీవన సిద్ధాంతానికి మకుటాయమానమని, దీనిని ప్రపంచానికి ప్రసాదించడమే అక్బర్‌గారి గొప్పతనాలలోకెల్లా గొప్పదని – తెలియని మేధావులు తీర్పులిస్తుంటారు. మేలిమిని చూసి బంగారమని వారు భ్రమసే 'దీన్ ఇలాహి' వాస్తవానికి మేడిపండు. పొట్టవిప్పి చూస్తే పురుగులే వుండు.

అక్బర్ చక్రవర్తి బనాయించిన రెట్టమతం నిండా కనిపించే రెట్టలను పోల్చుకోవాలంటే ఆ మతం పుట్టిన విధానాన్ని, దాన్ని సృష్టించేందుకు అక్బర్‌ను పురికొల్పిన పైత్యాలను ముందు అర్థం చేసుకోవాలి.

మోసంచేసో, యుద్ధంచేసో, దౌత్యంతోనో రాజ్యాలు గెలిచి, రాజులను వశపరచుకుని దాదాపుగా ఉత్తర భారతమంతటినీ తన ఆధిపత్యంలోకి తెచ్చుకున్న తరువాత... తిరుగుబాట్లూ కొంచెం అణగిమణగిన మీదట అక్బర్ దృష్టి మతంమీద పడింది. తన అంతటి మహాత్ముడు ఎవరో పెట్టిన మతాన్ని అనుసరించడమేమిటి, ఒక ప్రవక్తకు తలవంచడమేమిటి – తానే ప్రవక్తగా మారి ఒక కొత్త మతాన్ని లోకానికి ఎందుకు అనుగ్రహించకూడదు అని అతడి పుర్రెలో పుండు పుట్టింది. చిరకాలంగా అతడి మనసులో మెదులుతున్న ఆలోచన రూపుకట్టింది. అతడి ఆదర్శమూర్తి అయిన తైమూర్‌కు కూడా కలగని వెర్రి ఊహ అది. తాను దైవాంశ సంభూతుడిని, దేవుడి నీడనని అక్బర్‌కు గొప్ప నమ్మకం. ఆ సంగతి

దాచుకోకుండా అంతకు పూర్వమే సూచనప్రాయంగా ప్రపంచానికి యిలా తెలియపరిచాడు:

> "The very sight of kings has been held to be a part of divine worship. They have been styled conventionally the shadow of God, to behold them is a means of calling to mind the Creator, and suggests the protection of the Almighty"
>
> ["Happy sayings' in ***Ain-i-Akbari*** - **Blochmann** *Vol.III P. 398*]
>
> *(రాజుల దర్శనమే దైవారాధనలో భాగం. వారిని దేవుడి నీడలు అని అనూచానంగా అంటారు. వారిని కళ్లజూడటమే సృష్టికర్తను జ్ఞప్తి చేసుకునే సాధనం: సర్వేశ్వరుడి రక్షణకు అది సూచన.)*

రాజు దేవుడి నీడ కనుక..., హిందూస్థాన్ లోకెల్లా తానే గొప్ప రాజు కాబట్టి... తానే దేవుడి నీడ అని నమ్మేసి తాను ప్రవక్తగా కొత్త మతాన్ని నెలకొల్పడానికి అక్బర్ ఆయత్తమయ్యాడు. అందుకు సన్నాహంగా 1579లో మతాధికారుల, సైన్యాధికారుల, రాజప్రముఖుల హైలెవెల్ సమావేశాన్ని నిర్వహించాడు. అందులో అక్బర్ సెలవిచ్చినదిది:

"ఒక్కరి ఆధిపత్యంలో వున్న సామ్రాజ్యంలో జనం వేర్వేరు మత వర్గాల కింద చీలి, పరస్పరం విభేదించుకోవడం బాగాలేదు. ఎన్ని మతాలు వున్నాయో అన్ని ముఠాలున్నాయి. కాబట్టి మనం మతాలను ఒకటిగా చేయాలి. ఆ "ఒకటి"లోనే "అన్నీ" వుండాలి. ఏ మతంలోని మంచినీ విడవకుండా, అంతకంటే మేలైనదాన్ని యితర మతం నుంచి తీసుకుంటూ... దేవుడికి గౌరవాన్ని, ప్రజలకు శాంతిని, సామ్రాజ్యానికి సుస్థిరతను సమకూర్చే రీతిలో ఈ పని జరగాలి. దీనిమీద ఇక్కడ ఉపవిష్టులైన వారందరూ మీమీ అభిప్రాయాలు చెప్పండి. అంతా మాట్లాడేంతవరకూ నేను ఇక్కడి నుంచి కదలను".

ఇది గతంలో అల్లాఉద్దీన్ ఖిల్జీ మదిలో మెరిసిన ఆలోచనే. కాని ఖిల్జీలా ఇష్టాగోష్ఠుల్లోనూ, పానగోష్ఠుల్లోనూ చర్చిస్తూ కూచోకుండా అక్బర్ సీరియస్‌గా 'జనరల్ కౌన్సిల్'ను కొలువుతీర్చి ఏ సంగతీ అక్కడే తేలాలని నిర్బంధించాడు. గర్విష్ఠి, అహంకారి అయిన అంతటి నియంత పల్లవిని అందించినప్పుడు చరణాలను పూర్తిచేయకుండా భజనపరులు ఊరుకుంటారా? అందులోనూ - మిలిటరీ కమాండర్లకు పాదుషాయే దేవుడు: అతడి మాటే దైవశాసనం. వారి మాట కాదంటే తల ఎక్కడ ఎగిరిపోతుందోనని మిగతావారికి భయం. కనుక అంతా కలిసి "పృథ్వీపతి అయినందువల్లా, అమోఘమైన బుద్ధి కుశలతచేతా దేవుడికి సమీపవర్తులైన చక్రవర్తిగారే - సామ్రాజ్యమంతటికీ దేవుళ్లనూ, ఉత్సవాలనూ, ఆచారాలనూ, బలిదానాలనూ, నియమాలనూ నిర్దేశించి- నిర్దుష్టమైన విశ్వమతాన్ని నెలకొల్పేందుకు అవసరమైన అన్ని చర్యలనూ తీసుకొన వలసినది" అని కోరస్‌గా ప్రార్థించారు. ఈ సంగతి సెటిలైపోవటంతో అక్బర్ అక్కడి కక్కడే అబుల్ ఫజల్ తండ్రి షేక్ ముబారక్‌ను పిలిచి "మొగల్ సామ్రాజ్య మంతటా అందరూ ఆచరించదగిన మతధర్మాన్ని దర్బారు నుంచి త్వరలో ప్రకటిస్తామని రాజ్యమంతటా చాటించ"మని పురమాయించాడు.

సభాముఖంగా స్థూలాంగీకారం సాధించాక కొత్త మతం తయారీకి కావలసినది మతాధికారుల 'లైన్ క్లియర్'. హిందూ మతానికి ఎవరు అధికారులో తెలియదుకనుక ఇలాంటి పైత్యపు చేష్టలకు ఆ మతంలోని విజ్ఞులు ఒప్పుకోరనుకున్నారో... లేక - మనకు

దాసులైనవారి మతవర్గం అనుజ్ఞ మనకెందుకు అనుకున్నారో – హిందూ మతాచార్యులను సంప్రదించదలచలేదు. అప్పట్లో క్రైస్తవానికి ఉనికే తక్కువ. మిగిలింది ఇస్లాం. అనేక శతాబ్దాలుగా హిందూ దేశంలో అధికార ప్రాభవంతో వెలుగుతున్న ఆ మతం పెద్దల ఆమోదం లేనిదే ఇలాంటి కార్యాల్లో అడుగు ముందుకు వేయడం కష్టం. అందుకే అక్బర్ మత వ్యూహంలో రెండో దశగా 1579 సెప్టెంబర్‌లో ఒక డాక్యుమెంటును తయారుచేసి మొగల్ సామ్రాజ్యానికి ముఫ్తీ అయిన కాజియుల్ కుజాత్‌చేత, మరో ఐదుగురు ముస్లిం ఉలేమాల చేత సంతకాలు చేయించారు. సివిల్ వ్యవహారాల్లోలాగే ఆముష్మిక వ్యవహారాల్లోనూ చక్రవర్తే అంతిమ న్యాయనిర్ణేత అనీ... ముస్లిం న్యాయానికి సంబంధించిన వ్యాఖ్యాతలందరికంటే అక్బరే అధికుడని... ఏ విషయంలో నైనా ఆయన నిర్ణయానికి తిరుగులేదనీ వారిచేత డిక్రీ ఇప్పించారు.

ఉలేమాల చేత పచ్చజండా ఊపించుకున్నది మొదలుకుని అక్బర్ పీఠాధిపతి అవతారమెత్తి నానా కంగాళీ చేశాడు. ఇస్లాం నుంచి కొంత, హైందవం నుండి కొంత, క్రైస్తవం నుంచి కొంత, పార్సీ మతం నుంచి కొంత, జైన మతం నుంచి కొంత పిక్కి కలిపికొట్టి తయారుచేసిన 'దీన్ ఇలాహి' పంచకూళ్ళ కషాయం ఏ మతం వారినీ మెప్పించలేకపోయింది.

అక్బర్ ప్రవక్తగారి మతంలో చేరేవారు చక్రవర్తి మ్రోల అర్పించుకోవలసినవి నాలుగు: ఆస్తి, జీవితం, గౌరవం, మతం. వీటిలో ఒకదానిని మాత్రం త్యాగం చేయగలిగిన వాడికి ఒక పట్టా: నాలుగూ అర్పించుకోగలిగినవాడికి నాలుగు డిగ్రీలు "నయా గురుకులం" ప్రసాదించేది. అంటే హిందువెవడయినా కొత్త మార్గంలో చేరాలంటే తరతరాలుగా నమ్ముకున్న హిందూమతాన్నీ వదలిపెట్టడానికి సిద్ధపడాలన్న మాట. పోనీ – వేదాలూ, ఉపనిషత్తులూ, పురాణాలూ భక్తి జ్ఞాన కర్మ యోగాల్లోనూ లేనిదీ, ముక్కోటి దేవతల్లో ఎవరూ అనుగ్రహించలేనిదీ... ఏ సద్గురువూ పూర్వం బోధించి ఉండనిదీ అక్బర్‌గారి దగ్గర మాత్రమే దొరికేదీ ఏదైనా ఉందా అంటే అదీ లేదు. సూర్యారాధనలు, హోమాలు, ఉపవాసాలు, శాకాహార భోజనాలూ వగయిరాలు అక్బర్ పుట్టకముందు నుంచీ ఉన్నవే. తన దగ్గర మహత్తులేవో ఉన్నాయని, గొడ్రాళ్లకు బిడ్డలు పుడతారని తన కాళ్లు కడిగిన జలాన్ని తాగితే రోగాలు నయమవుతాయని చక్రవర్తిగారు గొప్పగా ప్రచారమయితే చేయించుకున్నారు. అభాగ్యులకందరికీ తన పాదోదకాన్నీ తాగించారు. దానివల్ల ఉన్న జబ్బులు పోయాయో, లేని జబ్బులు వచ్చాయో తెలియదు. మహాసముద్ర మంతటి అర్షధర్మానికి వారసులైన వారికి అక్బర్‌లాంటి వాడు మిడిమిడి జ్ఞానంతో పుక్కిలించే ఉపదేశాల మీద సహజంగానే గురికుదరదు. అక్బర్ దర్బారులో 'దీన్ ఇలాహి' మతం పుచ్చుకున్న రాజ ప్రముఖులు 18 మంది అని ***Ain-i-Akbari***లో **Blochmann** లెక్క తేల్చాడు. వారిలో రాజా బీర్బల్ ఒక్కడే హిందువు. మిగిలినవారు ముసల్మాన్లు. ఆస్థాన ప్రముఖుల్లోనే గాక సామాన్య జనంలోనూ ఎంతగా ఊదరబెట్టినా కొత్త మతం లోకి మారినవారి సంఖ్య చాలా స్వల్పం. అక్బర్ పెట్టిన మతం అక్బర్ తోటేపోయింది. అనేక హైందవ ఆచారాలను, సంప్రదాయాలను కాపీ కొట్టినందువల్ల హిందువులేమీ ఆకర్షితులు కాలేదు. కాఫిర్ల తరహా ఆచారాలను తెచ్చి పెట్టినందువల్ల ముసల్మాన్లూ దూరమయ్యారు. దేవుడికీ, ప్రవక్తకూ మినహా మానవమాత్రుడికి మోకరిల్లటం తప్పనుకునే ముస్లింలకు చక్రవర్తి పెట్టిన కొత్త పద్ధతులు ఎబ్బెట్టుగా తోచాయి. కొత్త మతం పుచ్చుకొనదలచినవారు సూర్యుడు జాజ్వల్యంగా ప్రకాశించే ఆదివారంనాడు

తలపాగా తీసి అక్బర్ కాళ్ళమీద తలపెట్టి వేడుకోవాలట. దేవుడి ప్రతినిధి అయిన ప్రభువుల వారు అతడిని లేవదీసి నెత్తిన తలపాగాపెట్టి, చెయ్యెత్తి దీవించి 'అల్లా హు అక్బర్' అని రాసిన బిళ్లను బహూకరించడం ద్వారా తన మతంలో చేర్చుకుంటాడట. భక్తుడు ఆ బిళ్లను ఎప్పుడూ తలపాగాలో దాచుకుని తిరగాలట. నూతన మతస్థులు ఒకరినొకరు ఎదురుపడితే 'అల్లా హు అక్బర్' అని పలకరించుకోవాలట. సందిగ్ధమైన ఆ పదానికి అర్థం 'అల్లా గొప్పవాడు' అనీ 'అక్బరే అల్లా' అనీ చెప్పొచ్చు. అర్థం గురించి పెద్ద వివాదం లేచినా దాన్ని మార్చాలన్న ఆలోచన అక్బరుకు రాలేదు. కారణం చెప్పక్కర్లేదు.

మతసహనం అక్బర్‌కు ఆరోప్రాణమని, మతం విషయంలో ఎవరినీ బలవంతం చేసేది లేదని అబుల్ ఫజల్ లాంటివారు ఎంత బుకాయించినా అసహన పూరితమైన కర్కశ చర్యలు చాలానే జరిపారని (Many acts of fierce intolerance were committed) అని విన్సెంట్ స్మిత్ *[Akbar, P.159]* అన్నాడు. వేధింపులకు ప్రధానంగా గురి అయింది మహమ్మదీయులు. నూతన మత విధానాలను వ్యతిరేకించారన్న కక్షతో పెద్ద సంఖ్యలో షేక్‌లను, ఫకీర్లను దేశం నుంచి బహిష్కరించి, గుర్రాలకు మారుగా కాందహార్ మార్కెట్లో బానిసల కింద అమ్మించారట.

ఎదురు తిరిగినవారిని వేధించడంతో ఆగక ఏకంగా ఇస్లాం మతం మీదే అక్బర్ ధ్వజమెత్తాడు. మొదట్లో ఇస్లాంకు నామమాత్రంగా విధేయత ప్రకటించిన వాడల్లా పోను పోను మేలి ముసుగులాగేసి పక్కా ముస్లిం వ్యతిరేకిగా మారాడు. "after the short space of five or six years not a trace of Muhammadan feeling was left in his heart" *(ఐదారేళ్ల స్వల్ప వ్యవధిలో ఆయన హృదయంలో మహమ్మదీయ భావన అనేది ఆనవాలు లేకుండా పోయింది)* అని అక్బర్ సమకాలికుడైన బాదౌని అన్నాడు. (***AIN-I AKBARI***, Blochmann, *Vol. I p.187*) దీన్ ఇలాహి మతపైత్యం ఎలా వికటించి ఎలాంటి ఆంక్షలకు దారితీసిందో The Great Mogul గ్రంథంలో విన్సెంట్ స్మిత్ ఇలా వివరించాడు:

> No child was to be given the name of Muhammad, and if he had already received it the name must be changed. New Mosques were not to be built, nor were old ones to be repaired or restored. Later in the reign mosques were levelled to the ground.
>
> Beards were to be shaved.... Even the prayers themselves, the fast of Ramazan, and the pilgrimage to Mecca were prohibited. The study of Arabic, of Muhammadan law and of Koran was discountenanced... People should be buried with their heads towards the east and their feet towards the west. His Majesty even commenced to sleep in this position... It had the double purpose of honouring the rising Sun and offering an insult to Muhammadans who turn towards Mecca which lies westwards from India.

(పుట్టే బిడ్డకు మహమ్మద్ పేరు పెట్టడానికి వీలులేదు. ఈ వరకే పెట్టి ఉంటే తప్పక మార్చెయ్యాలి. కొత్తగా మసీదులు కట్టరాదు. పాతవాటికి మరమ్మతులు, పునరుద్ధరణలు చెయ్యరాదు. అనంతర కాలంలో మసీదులను పడగొట్టి నేలమట్టం చేశారు.

గడ్డాలు గొరిగితీరాలి... ప్రార్థనలనూ, రంజాన్ ఉపవాసాలను, మక్కాకు యాత్రలనూ చెయ్యడం నిషిద్ధం. అరబిక్ భాషనూ, మహమ్మదీయ న్యాయాన్ని, ఖురాన్‌నూ అధ్యయనం చేయడానికి వీలులేదు. చనిపోయిన వారిని తూర్పువైపు తల, పశ్చిమాన కాళ్లు ఉండేలా పూడ్చిపెట్టాలి. చక్రవర్తి కూడా ఆ భంగిమలోనే నిద్రించ సాగాడు. దీనివల్ల ఉదయించే సూర్యుడిని గౌరవించటమేగాక, ఇండియాకు పశ్చిమాన గల మక్కావైపు మోకరిల్లే మహమ్మదీయులకు అవమానంగా కూడా దీన్ని ఉద్దేశించారు.)

ఈ రకమైన అడ్డగోలు ఆంక్షల్లో ఏ ఒక్కదాన్నయినా ఇవాళ ముస్లిం సోదరులకు వ్యతిరేకంగా ఏ శివసేన థాక్రేనో, 'విశ్వహిందూ' తొగాడియానో, బజరంగదళ్ వాడో ప్రతిపాదిస్తే దేశంలో సెక్యులరిస్టులమని చెప్పుకునేవారందరూ సహజంగానే మీదపడి కరుస్తారు. ఈ దుర్మార్గపు ఆంక్షలను అన్నిటినీ రుద్దిన మొగల్ చక్రవర్తినేమో 'అక్బర్ ది గ్రేట్' అని వారే దేవుడిలా కొలుస్తున్నారు! అదీ చిత్రం.

రాయల వారి రాజ్యం

ఈ రాజు ప్రతి రోజూ వేకువఝామున లేచి ముప్పావు పింటు (కొంచెం తక్కువగా అరలీటరు) నువ్వులనూనె తాగుతాడు. నడుముకు చిన్నగుడ్డ చుట్టుకుని ఒళ్లంతా అదే నూనె పట్టించుకుంటాడు. పెద్ద పెద్ద బరువులెత్తి, కత్తిసాము చేసి చెమటతో నూనె అంతా ఇగిరిపోయేలా వ్యాయామం చేస్తాడు. ఆస్థాన వస్తాదుతో కుస్తీ పట్టాక గుర్రమెక్కి తెల్లవారేదాకా రెండు దిక్కులా మహావేగంగా స్వారీ చేసి వస్తాడు. అప్పుడు స్నానం చేసి రాజప్రాసాదంలోని దేవాలయంలో పూజాదికాలు జరిపాక అనేక స్తంభాలతో అందంగా మలచిన మొగసాలకు వెళ్లి ఉన్నత రాజోద్యోగులతో రాజప్రముఖులతో మాట్లాడి, సందర్శకులను కలిసి, మహామంత్రి తిమ్మరుసుతో ముచ్చటించి రాచకార్యాలు నిర్వర్తిస్తాడు.

పోర్చుగల్ నుంచి రాయబారిగా వెళ్లిన ఫిగెరిడో తోబాటు మేమందరమూ ఇక్కడే రాజును కలిశాము. రాజు మమ్మల్ని ఆప్యాయంగా కరస్పర్శ చేసి, కుశల ప్రశ్నలు వేసి, మంచి బహుమానాలిచ్చి, గౌరవించాడు. ఆయనను ఎంత చూసినా తనివి తీరలేదు. బంగారు పూల తాపడం చేసిన ధవళ వస్త్రాలు ధరించి, మెడలో వజ్రాల హారాలు వేసుకుని, పట్టుకుచ్చుల తలపాగాతో వెలిగిపోతున్నాడు. ఆయన పొట్టికాదు; పొడగరీ కాదు. లావూ కాదు సన్నమూ కాదు. చక్కని శరీరఛాయ. మొహం మీద స్ఫోటకం మచ్చలు ఉన్నా అందగాడు. ఎప్పుడూ సంతోషంగా, చలాకీగా ఉంటాడు. అందరితో సరదాగా మాట్లాడుతాడు. అందరినీ ఆదరంగా చూస్తాడు. విదేశీయులను గౌరవిస్తాడు. ఆయన గొప్ప ప్రభువు. ఎక్కడా న్యాయం తప్పడు. కోపం వస్తే ఉగ్రుడవుతాడు. రాజాధిరాజ రాజమార్తాండ కృష్ణరాయ సార్వభౌముడని ఆయన బిరుదు. ఆయన పేరు చెబితే ఎంతటివారికైనా హడలు.విజయనగర సామ్రాజ్యం మహావైభవంగా విలసిల్లిన కాలంలో ఆ నగరానికి వెళ్ళి దాని వైభోగాన్ని కళ్ళారా చూసి, విజయనగర ప్రభువు.శ్రీకృష్ణదేవరాయలను స్వయంగా కలిసి, కొంతకాలం అక్కడ బసచేసి విశేషాలన్నీ చూనగుచ్చినట్టు వివరించిన పోర్చుగల్ రాజోద్యోగి పెయిస్

(DOMINGOSIPAES) రాసిపెట్టిన రికార్డు నుంచి సేకరించిన వాక్చిత్రమిది. అక్బర్‌లాంటి క్రూరుడిని, వ్యసనపరుడిని, మత పైత్యకారుడినే 'ది గ్రేట్' అని ఆకాశాని కెత్తేవారు ఇంచుమించుగా అదే కాలంలో దక్షిణ భారతాన్ని ఏకచ్ఛత్రంగా ఏలిన కృష్ణరాయల గుణగణాలను, కార్యశైలిని కొంచెం నిజాయితీగా గమనిస్తే రాజన్నవాడు ఎలా ఉండాలో బోధపడుతుంది. మేలిమి బంగారానికీ, కాకి బంగారానికీ తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

వేల సంవత్సరాల భారత చరిత్రలో మహానగరాలకూ మహాసామ్రాజ్యాలకూ కొదవ లేదు. నాటి అద్భుత ప్రాభవాన్ని కళ్లకు కట్టినట్టు వివరించే సాంప్రదాయక సారస్వతానికీ, చారిత్రక ఆధారాలకూ లోటులేదు. ఎటొచ్చీ భారతీయుల కృతమైనది దేన్నీ చారిత్రక ప్రమాణంగా అంగీకరించడానికి మన మోడరన్ మేధ ఒక పట్టాన ఒప్పుకోదు. భారతదేశమంతటా అనేక శతాబ్దాలుగా అనుసరిస్తున్న విక్రమ శకానికి మూల పురుషుడైన విక్రమాదిత్యుడి అస్తిత్వాన్నే గుర్తించనేరని విలక్షణ చారిత్రక దృష్టి మనది. ఉజ్జయిని, ధారా నగరాల్లాగే విజయనగర ప్రశస్తీ రాజుల ప్రాపకం కోరే కోతలరాయుళ్ల అతిశయోక్తులేనని, విక్రమార్కుడిలాగే కృష్ణదేవరాయలూ కల్పిత వ్యక్తేనని చెప్పి రాయల సమకాలికుల కావ్యాలనూ, ప్రబంధాలనూ, ఆ కాలపు శిలా శాసనాలనూ బనాయింపుల కింద బహుశా మనం కొట్టిపారేసేవాళ్ళమేమో. కాని అదృష్టం బావుండి విజయనగర వైభవాన్ని కళ్లతోచూసి, ఆయా ప్రభువులతో స్వయంగా మాట్లాడి, చూసింది చూసినట్టుగా **అబ్దుర్ రజాక్, న్యూనిజ్, పెయిస్, నికొలోకోంటి** లాంటి విదేశీయులు అక్షరబద్ధం చేశారు కాబట్టి రాయలవారు (చరిత్రలో) బతికిపోయారు!

విజయనగర వైభవాన్ని సమగ్రంగా, ప్రామాణికంగా ఆధునిక ప్రపంచానికి పరిచయం చేసిన రాబర్ట్ స్యూయెల్ తన సుప్రసిద్ధ గ్రంథం, ***"A Forgotten Empire"*** లో ఇదే మాట అంటాడు.

> "The account given by (Paes) is all the more interesting and valuable because without it the world would have remained justly in doubt as to whether this king really reigned at all, ... whether he was not a mere puppet, entirely in the hands of his minister, perhaps even an actual prisoner. For Firishta never mentions him by name, and the inscriptions which relate his conquests prove nothing beyond the fact that they took place during a reign... which might have been a reign only in name... But with the description of Paes in our hands there can be no longer a shadow of doubt"
>
> ***[A Forgotten Empire* - R.Sewell *p.121]***

(పెయిస్ ఇచ్చిన వివరాలు ఆసక్తికరమైనవి. విలువైనవి. ఇవే గనుక లేకపోతే ఈ రాజు నిజంగా పరిపాలించాడా... లేక తన మంత్రి చేతిలో కీలుబొమ్మగా ఉన్నాడా, ఏకంగా బందీయే అయినాడా అని ప్రపంచం సందేహించడానికి ఆస్కారం ఉండేది. ఎందుకంటే ఫిరిస్తా ఈ రాజు పేరును ఎక్కడా పేర్కొనలేదు. అతడి విజయాలకు సంబంధించిన శిలాశాసనాల వల్ల ఆ విజయాలు అతడి హయాంలో

జరిగాయని మాత్రమే తెలుస్తుంది. ఆ హయాం అనేది నామమాత్రమే కావొచ్చు. కాని పెయిస్ వర్ణన మన చేతికందాక ఈ విషయంలో సందేహానికి తావే లేదు.)

కృష్ణదేవరాయలు మహావీరుడు. గజనీ మహ్మద్, బాబర్‌లను తలదన్నిన రణతంత్ర నిపుణుడు. వారి వలె క్రూరుడు కాదు. దాక్షిణ్యానికి పెట్టింది పేరయిన ఉదారుడు. అనేక జైత్రయాత్రలను దిగ్విజయంగా నిర్వహించినట్టే సాహితీ సమరాంగణం లోనూ అంతే ప్రతిభను కనబరచి, స్వయంగా గొప్ప కావ్యాన్ని రాసి, కవి పండితులను ఆదరించి, కళలను పోషించిన అపూర్వ యశస్వి, ప్రజలు మెచ్చిన ధర్మప్రభువు. పెయిస్ అన్నట్టు అతడు 'సాహసి. శూరుడు. సరసుడు. అన్ని విషయాలలోనూ పరిపూర్ణుడు'!

విజయనగర ప్రభువులందరిలోకీ కృష్ణదేవరాయలు గొప్పవాడనటంలో సందేహం లేకపోయినా విజయనగర సామ్రాజ్యానికి వైభవం కృష్ణరాయల వల్లే రాలేదు. ఆయనతోటే పోలేదు.

1520లో తాను చూసిన కృష్ణరాయల విజయనగరాన్ని పెయిస్ ఇలా వర్ణించాడు.

'రాజ్యానికి విజయనగరం రాజధాని. దానికి 6 మైళ్ల దూరంలో కొండల వరస ఉంది. అందులో నుంచి ద్వారాల గుండా మార్గాలు ఏర్పడ్డాయి. నగరంలోకి పోవాలంటే ఈ ద్వారాలు తప్ప మరోదారి లేదు. కొండల వరుసలు 72 మైళ్ల పాదవున నగరాన్ని చుట్టి ఉన్నాయి. ఏడు ప్రాకారాల మధ్య శత్రు దుర్భేద్యంగా కట్టిన ఈ నగరంలో అసంఖ్యాకమైన జలాశయాలున్నాయి. నీటి పారుదలకు చక్కని ఏర్పాట్లున్నాయి. పచ్చని పొలాలతో, చక్కని తోటలతో, బాటల పక్క చెట్లతో, తీర్చిదిద్దిన రహదార్లతో, క్రమపద్ధతిన కట్టిన ఇళ్లతో, కళాత్మక కట్టడాలతో, సమస్త వస్తువులు విక్రయించే అంగళ్లతో ఈ నగరం బహు సుందరంగా ఉంది. ఇక్కడి వాణిజ్య వీధులలో పలురకాల కెంపులు, వజ్రాలు, వైఢూర్యాలు, పచ్చలు, ముత్యాలు, రత్నాలు కుప్పలు పోసి విక్రయిస్తున్నారు. అనేక దేశాల నుంచి వర్తకులు వచ్చి ఇక్కడ నివాసం ఏర్పరచుకుని వజ్రవైఢూర్యాది నవరత్నాల వ్యాపారం సాగిస్తున్నారు. ఈ నగరం ఎంతో విశాలమైనది. దీని వైశాల్యం ఇంత అని నేను రాయలేను. ఎందుకంటే నేను ఒక ఎత్తయిన కొండ పైకి ఎక్కి చూసినా నగరం కొంత భాగం మాత్రమే కనిపించింది. కొండల మధ్య విస్తరించి ఉండటంవల్ల పూర్తి నగరాన్ని చూడలేకపోయాను. నాకు కనిపించిన భాగమే రోమ్ నగరం అంత పెద్దదిగా ఉండి, చెట్ల గుంపులతో, ఇళ్లకు చేరిన తోటలతో, ఎటు చూసినా చెరువులతో రమణీయంగా కనిపించింది. ఈ నగరంలోని జన సంఖ్యను లెక్కించటం చాలా కష్టమైనందువల్లా, సుమారుగా ఇంత అని నేను చెప్పినా అతిశయోక్తిగా భావించి ఎవరూ నమ్మరన్న భయంతోనూ ఆ ప్రయత్నం చేయడంలేదు. ఇది ప్రపంచంలోకెల్లా సమృద్ధమైన గొప్ప నగరం అని మాత్రం నేను చెప్పగలను. నగర ప్రాకారానికి వెలుపల అత్యంత మనోహరంగా ఆనెగొంది పట్టణానికి అభిముఖంగా విఠలస్వామి, విరూపాక్ష దేవాలయాలు భక్తులతో నిత్యం కిటకిటలాడుతున్నాయి. ఈ ఆలయాలకు చేరువలో అందమైన వసారాలతో ఇళ్ల వరస ఉంది. నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు మహావైభవంగా నిర్వహిస్తారు. ఇక్కడి ప్రజలు విలాసప్రియులు.

గులాబీపూలు, సువాసన ద్రవ్యాలంటే వారికి మహాప్రీతి. 990 మైళ్ల తీరరేఖ, 300 రేవు పట్నాలు, 240 కోట్ల వార్షికాదాయంతో ఈ సువిశాల సామ్రాజ్యం దుర్నిరీక్ష్యంగా ఉంది. దీనిని రక్షించడానికి రాజు దగ్గర పది లక్షల సైన్యం, 35 వేల కాల్బలం ఉంది.'

[A Forgotten Empire* by R.Sewell *p. 242-253]

1520లో పోర్చుగీసు పెయిస్ తిలకించిన విజయనగరం ఈ రీతిన ఉంటే అతనికంటే నూరేళ్ల పూర్వం 1420లో ప్రౌఢ దేవరాయల హయాంలో అదే నగరాన్ని సందర్శించిన నికోలో డికొంటి తన వర్ణనను ఇలా ప్రారంభిస్తాడు.

'విజయనగర మహానగరం చాలా ఎత్తయిన కొండల నడుమ ఉంది. నగరం చుట్టు కొలత అరవైమైళ్లు. కింద లోతుల నుంచి పైన కొండలదాకా నగరం చుట్టూ గోడలను లేపారు. ఈ నగరంలో ఆయుధాలు ప్రయోగించగలిగినవారు 90 వేల మంది ఉన్నారు... వారి రాజు హిందూ దేశంలోని మిగతా రాజులందరికంటే బలవంతుడు.'

[A Forgotten Empire p. 82-84]

ఇంచుమించుగా ఇదే కాలంలో ఇదే ప్రౌఢ దేవరాయల ఏలుబడిలో 1444లో (అంటే పెయిస్‌కు 75 సంవత్సరాల ముందు) పర్షియా రాజు పనుపున విజయనగరం వెళ్ళిన అబ్దుర్ రజాక్ దర్శించి చెప్పిన విశేషాలివి:

ఈ నగరం చాలా విశాలంగా, జనంతో కిక్కిరిసి ఉంది. ఇక్కడి రాజు మహా బలవంతుడు. అతడి రాజ్యం సింహళ ద్వీపం నుంచి గుల్బర్గా దాకా, బెంగాల్ నుంచి మలబార్ వరకూ వెయ్యి ఆమడల కంటే ఎక్కువ ప్రాంతానికి విస్తరించి ఉంది. నేల సారవంతంగా, సస్యశ్యామలంగా ఉంది. ఈ రాజ్యంలో మూడు వందల ఓడరేవు లున్నాయి. కొండల్లా పోతరించిన వెయ్యి ఏనుగులు, పదకొండు లక్షల బలగాలతో పటిష్టమైన సైన్యం ఉంది. మొత్తం హిందూస్తాన్‌లో ఈ రాజును మించిన శక్తిగల రాజు మరొకడు లేడు. ఏడు ప్రాకారాల నడుమ నిర్మించిన ఈ విజయనగరపురం ఎటువంటిదంటే మొత్తం భూప్రపంచంలో దీనిని పోలిన దాన్ని కన్ను చూడలేదు. చెవి వినలేదు.

[ABDU-R RAZZAK in MATLA US-SA'DAIN* E & D *Vol.IV p.103-106]

ఇలా 15, 16 శతాబ్దాల్లో చూడవచ్చిన విదేశీ యాత్రికులకల్లా సంభ్రమాశ్చర్యాలు కలిగించిన విజయనగర సామ్రాజ్య నిర్మాణమే కారుచీకటిలో కాంతిరేఖలా, కాళరాత్రి ఉషోదయంలా, దేవుడిచ్చిన వరంలా జరిగింది. దండయాత్రల పరంపర తరవాత, అనేక యుద్ధాల్లో గొప్ప హిందూ రాజ్యాలను సక్రమంగానో అక్రమంగానో ఆక్రమించాక 13వ శతాబ్దాంతానికి దాదాపుగా ఉత్తర భారతమంతా మహమ్మదీయుల ఆధిపత్యంలోకి వచ్చింది. దక్షిణాపథాన్నీ కైవసం చేసుకోవడానికి ఢిల్లీ సుల్తాన్లు ముమ్మర యత్నాలు సాగించారు. 1293లో అల్లాఉద్దీన్ ఖిల్జీ దేవగిరిని పట్టుకున్నాడు. నాలుగేళ్ల తరవాత గుజరాత్ మీద దాడి చేశాడు. 1307లో దేవగిరి యాదవరాజును చెరబట్టాడు. 1309లో ఖిల్జీ సేనాని మాలిక్ కాఫుర్ భారీ బలగాలతో దండెత్తి ఓరుగల్లును ఓడించాడు. 1309లో హొయసాల బల్లాల రాజ్యం ద్వార సముద్రంలో అంతరించింది. 1318లో ఢిల్లీ నుంచి దండెత్తిన ముబారక్

షా దేవగిరి పాలకుడు హరపాల దేవుడి చర్మం ఒలిపించి, తల నరికించి నగర ముఖద్వారానికి వేలాడదీయించాడు. తురుష్కుల ధాటికి తాళలేక 1324లో ఓరుగల్లు సామ్రాజ్యం కూలిపోయింది. బలమైన మూడు హిందూ రాజ్యాలు రెండు దశాబ్దాల కాలంలో కుప్పకూలి, ఉత్తరాదిలాగే దక్షిణ భారతమూ చుక్కాని లేని పడవలా కాలప్రవాహంలో కొట్టుకుపోనున్నదని దాక్షిణాత్యుల గుండెల్లో రాయిపడి, దిక్కుతోచని దుస్థితిలో - అదృష్టవశాత్తూ విదేశీయుల దురాక్రమణ వెల్లువకు చెలియలికట్టలా ఆవిర్భవించి 200 సంవత్సరాలకు పైగా దక్షిణాపథాన్ని రక్షించిన మహాశక్తి విజయనగర సామ్రాజ్యం.

ఓరుగల్లు పతనానంతరం ఆనెగొందికి వలసపోయి అక్కడి జంబులేశ్వర ప్రభువు కొలువులో మంత్రి, కోశాధికారులుగా చేరిన హరిహర రాయ, బుక్కరాయ సోదరులు విజయనగర సంస్థాపకులు. మహమ్మద్ తుగ్లక్ దండయాత్రలో ఆనెగొంది రాజును హతమార్చిన తుగ్లక్ సేనలు బందీలుగా ఢిల్లీకి తీసుకుపోయిన ఈ సోదర ద్వయమే అనంతర కల్లోలాన్ని అణచి ఆనెగొందిని పాలించడం తురకలకు అసాధ్యమైన స్థితిలో తుగ్లక్‌కు శరణ్యమయ్యారు. తుగ్లక్ సామంతుడిగా 1336లో ఆనెగొంది గద్దెనెక్కిన కొద్దికాలానికే హరిహర రాయలు స్వాతంత్ర్యం ప్రకటించి... ఇతర హిందూ రాజులను కూడగట్టి ఢిల్లీ సుల్తానును పరాభవించి... తనకు మంత్రి, గురువు అయిన మాధవ విద్యారణ్యుల మార్గదర్శకత్వంలో ఇప్పటి బళ్లారి జిల్లా హోస్పేట దగ్గర విజయనగరాన్ని నిర్మించాడు. అతడి అనంతరం రాజ్యమేలిన బుక్కరాయలు, రెండవ హరిహరరాయలు కూడా విద్యారణ్యుల అడుగుజాడల్లో నడచి దీన్ని ఒక మహాసామ్రాజ్యంగా విస్తరింప జేశారు. కాలక్రమంలో సంగమవంశస్థుల నుంచి సాళువ వంశీకులకు, వారి నుంచి తుళువలకు రాజ్యం సంక్రమించినా, సింహాసనం కోసం కలహాలు, కుట్రలు, హత్యా రాజకీయాలు ఎన్ని నడిచినా తళ్లికోట యుద్ధానంతరం 1565 లో విజయనగరం సర్వనాశమయ్యే దాకా రెండు శతాబ్దాలకుపైగా ఈ సామ్రాజ్యంలో సామాన్యులు సుఖంగా బతికారు. కళలు, సాహిత్యం, సంస్కృతి బహుముఖంగా వర్ధిల్లాయి. విజయ నగర ప్రభువులు నిర్మించిన చెరువులూ, కాల్వలూ, ఇతర వసరులే నేటికీ రాయలసీమ లో నీటి పారుదలకు ప్రధానాలంబనాలు. చిత్రమేమిటంటే హైందవ ధర్మానికి పట్టుగొమ్మగా, ఆంధ్ర సంస్కృతికి ఒక స్వర్ణయుగంగా రెండు శతాబ్దాల పర్యంతం ఉజ్వలంగా వెలిగిన విజయనగర సామ్రాజ్యం తలిచేవారు లేక చరిత్ర పుటల్లో ఘోరంగా మరుగున పడింది. పాశ్చాత్య ప్రపంచంలోని ఏ దేశ రాజధానీనైనా తలదన్నేంత వైభవం కలిగిన ఈ రాజ్యం అస్తిత్వాన్ని ఇండియాలోనే అందరూ మరచిపోయారన్న ఆవేదనతో చారిత్రక ఆధారాలను క్రోడీకరించి, శిథిలాలను కదిలించి ***A Forgotten Empire*** (మరచిపోయిన మహా సామ్రాజ్యం) అన్న గ్రంథంతో నూరేళ్ల కింద ప్రపంచ దృష్టిని ఆకర్షించిన రాబర్ట్ స్యూయెల్ తొలి అధ్యాయంలోనే...

'విజయనగర సామ్రాజ్య సమగ్ర చరిత్రను భావికాలంలో ఎవరైనా రాసేందుకు పునాదిగా అందుబాటులోని సమాచారాన్ని అందించి కేవలం ఒక పరిచయాన్ని మాత్రం నేను ఇస్తున్నాను. ఇది తొలి ప్రయత్నం మాత్రమే కనుక ఇందులో అనేక లోపాలు, ఖాళీలు కనిపించవచ్చు. ఎండిన ఎముకల్లో సైతం జీవం పోసే శక్తిగల రచయిత ఎవరో అనతికాలంలో పూనుకుని రక్తమాంసాలను పూరించేందుకు వీలుగా బొమికలను గుది గుచ్చి కేవలం అస్థిపంజరాన్నే నేను తయారుచేస్తున్నాను' అన్నాడు.

దురదృష్టమేమంటే నూరేళ్ల తరవాత కూడా న్యూయెల్ ఆశించిన బృహత్కార్యం అసలు మొదలే కాలేదు. విజయనగర సామ్రాజ్యం గురించి, రాయల గురించి పుట్టెడు గ్రంథాలైతే పుట్టాయి. వీటిలోనూ, వీటిని చదివీ మహాపండితులు బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నది ఏమిటయ్యా అంటే – 'విజయనగర ప్రభువులు ఆంధ్రులా? కర్ణాటకులా?' 'రాయల అష్టదిగ్గజాల్లో ఫలానా వారు ఉన్నారా లేదా?' 'కృష్ణదేవరాయల తల్లి కులమేమిటి?' 'ఫలానా ఊళ్లో దొరికిన ఫలానా శాసనంలోని ఫలానా పదానికి అర్థమేమిటి?' ఇంకో ఫలానా శాసనంలోని ఫలానా పదానికీ దీనికీ వైరుధ్యం ఉందా?' 'ఫలానా యుద్ధం ఏ తేదీన జరిగింది' – లాంటి పనికిమాలిన వివాదాలతోనే!

ఎవరు గ్రేటు?

విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు ఏలిన కాలంలో ఒక చిన్న సంఘటన జరిగింది. అది మహా యుద్ధానికి దారితీసింది.

ఆ కాలంలో రాయల ఆస్థానంలోని సుప్రసిద్ధ కవి, పండితుల్లో ఎవరూ ఈ జైత్రయాత్రను విపులంగా వివరించినట్టు లేదు. అఫ్‌కోర్స్! ఏ అల్లసాని పెద్దనో, నంది తిమ్మనో, మరొకరో దీని గురించి గొప్ప గ్రంథం రాసినా కవిగారి కల్పనలెమ్మని ఆధునికులమైన మనం అడ్డంగా కొట్టేసేవాళ్లమేననుకోండి! అదృష్టవశాత్తూ పరాయి దేశం నుంచి వచ్చిన న్యూనిజ్ అనే పోర్చుగీసువాడు ఆ సమయంలో విజయనగరంలోనే ఉండి, సంగతి సందర్భాలను స్వయంగా తెలుసుకుని, రాయల వెంట యుద్ధరంగానికి వెళ్ళి, తాను కన్నవీ విన్నవీ పూసగుచ్చి నట్టుగా రాసి పెట్టాడు. ఈ ప్రత్యక్ష ప్రమాణాన్ని ప్రపంచంలో ఏ చరిత్రకారుడూ తోసిపుచ్చలేకపోయాడు.

Chronicle of Fernao Nuniz లో న్యూనిజ్ వర్ణించిన ప్రకారం ***[A Forgotten Empire** by* **Robert Sewell** *pp 323-358]* జరిగింది ఇది.

సయ్యద్ మర్కార్ అనే మహమ్మదీయుడికి రాయలవారు నలభై వేల పర్దావుల డబ్బిచ్చి గోవా వెళ్లి చక్కటి అరేబియా గుర్రాలను కొని తెమ్మని పురమాయించారు. అతడు రాయలకు బాగా తెలిసినవాడే. అంతకుమునుపు అలాంటి కొనుగోళ్ల బేరాలు సజావుగా చేసుకొచ్చినవాడే. అదే నమ్మకంతో మళ్లీ పంపించేసరికి అతగాడికి ఏమి బుద్ధి పుట్టిందో… గోవా దరిదాపులకు వెళ్లినవాడు దారి మళ్లి బీజాపూర్‌కు పరారయ్యాడు.

ఆ సంగతి కృష్ణరాయలకు తెలిసింది. వెంటనే బీజాపూర్ సుల్తాన్ ఆదిల్‌ఖాన్‌కు జాబు పంపాడు. అయ్యా, మీరూ మేమూ పాత వైరాలు మరచి నలభయ్యేళ్లుగా స్నేహంగా ఉంటున్నాం. ఇప్పుడు ఒక ద్రోహివల్ల ఆ స్నేహం చెడటం మాకు ఇష్టం లేదు. దయచేసి మీ దగ్గరి సయ్యద్‌ను మాకు అప్పగించండి– అని.

రాయల ఉత్తరం అందగానే ఇస్మాయిల్ ఆదిల్‌షా తన రాజ్యప్రముఖులనూ, కాజీలనూ

పిలిచి సలహా అడిగాడు. వారేమో - సయ్యద్ మర్కార్ ఇస్లామిక్ విద్వాంసుడు. పైగా మహమ్మద్ ప్రవక్త వంశీకుడు. అంతటి వాడిని విజయనగర ప్రభువుకు ఒప్పజెప్పే ప్రసక్తేలేదు - అన్నారు. సుల్తాన్ అదే మాట రాయలకు చెప్పాదు. ఆ జవాబు అందగానే రాయలు మండిపడ్డాడు. వెంటనే తన మంత్రులనూ, సేనానులనూ, ఇతర ప్రముఖులనూ పిలిచి, సుల్తాన్ జవాబును వినిపించి, ప్రతీకారం తీర్చుకోవాలి, యుద్ధానికి సిద్ధంకండి అన్నాడు. ఆదిల్ షా రాజధాని మీదికి కాకుండా, రాయచూర్ మీదికి దండు వెడలటం ఉత్తమమని, అప్పుడు దాన్ని రక్షించుకోవటానికి సుల్తాన్ రాక తప్పదని సచివులు సలహా ఇచ్చారు. రాయలకూ అది నచ్చింది. ఎందుకంటే రాయచూర్ తొలుత విజయనగర రాజులదే. రాయల పూర్వీకుల నుంచి బహమనీ సుల్తాన్లు దాన్ని గుంజుకున్నారు. తురుష్కుల పరమైన ముద్గల్‌తోబాటు దానినీ తిరిగి వశపరచుకోవాలని పూర్వ ప్రభువు సాళ్వ నరసింహరాజు తన మరణ శాసనంలో పేర్కొన్నాడు. ఆయన కోరిక ప్రకారం రాయచూర్‌ను తిరిగి పొందాలని కృష్ణరాయలు కూడా ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నాడు.

కృష్ణరాయలలో ఎంత రణోత్సాహం ఉందో అంత రాజనీతిజ్ఞత ఉంది. ఉన్నపళాన ఆదిల్‌షా మీద విరుచుకుపడితే దక్షిణాపథంలోని మిగతా సుల్తాన్లు అతనికి అండగా తనపై కత్తికట్టే ప్రమాదం ఉందని ఆయనకు తెలుసు. వారి సైనిక సాయమైతే తనకు అక్కరలేదుగాని - ఆ సాయం కనుక బీజాపూర్ సుల్తాన్‌కు లభిస్తే తనకు గెలుపు కష్టం కాబట్టి - ముందుగా మిగతా సుల్తాన్లను తటస్థంగా ఉండేట్టు చేయాలని సంకల్పించాడు. అందుకోసం - బీరార్ సుల్తాన్ ఇమాద్-ఉల్-ముల్క్‌కు, గోల్కొండ కుతుబ్‌షాహీకి, బీదర్ సుల్తాన్ బరీద్‌షాకు, అహ్మద్‌నగర్ సుల్తాన్ నిజాంషాకు తాను ఆదిల్‌షాపై దండెత్తటానికి కారణాలను వివరించి, వారి సహకారాన్ని కోరుతూ లేఖలు పంపాడు. ముందరి కాళ్లకు బంధం వేయటంతో చేసేదిలేక వారూ 'అలాగే కానివ్వండి. మీకు కావలసిన సహాయం మేము చేస్తాం' అని బదులిచ్చారు. స్వయానా ఆదిల్‌షాకు బావమరది అయిన అహ్మద్‌నగర్ సుల్తాన్ కూడా రాయల దౌత్యం ధాటికి కిమ్మనక ఊరుకున్నాడు. ఆ విధంగా రంగం సిద్ధపరచాక మంచి రోజు చూసుకుని, దేవతా పూజలు, బలులు యథావిధిగా నిర్వర్తించి 1522 ప్రథమ పాదంలో రాయచూర్ మీదికి రాయలు దండు వెడలాడు.

రాజద్వారాల ప్రధాన రక్షకుడైన కామనాయకుడు విల్లులు, బల్లేలు, కత్తులు, తుపాకులు పట్టిన ముప్ఫైవేల మందితో, వెయ్యి గుర్రాలతో ముందుగా దారి తీశాడు. అతడి వెనక యాభై వేల కాల్బలం, రెండు వేల గుర్రాలతో 20 ఏనుగులతో త్ర్యంబకరాయడు.. అతడి వెనక 60 వేల భటులతో, మూడున్నర వేల గుర్రాలతో, ముప్ఫై ఏనుగులతో తిమ్మప్పరాయడు... ఆ వెనుక లక్ష సేన, ఐదు వేల గుర్రాలు, యాభై ఏనుగులతో ఆదప్పనాయకుడు.. ఇలా మెరికల్లాంటి సేనానులు, దండనాయకులు ఇంకా అనేకులు తమ తమ బలగాలతో వెడలారు. (ఆఖరికి - రాయలవారికి రోజూ తమలపాకులు, వక్కలు అందించేవాడు కూడా 15 వేల సేనను, రెండొందల గుర్రాలను తీసుకుని ఈ రణశ్రేణిలో కలిశాడట) ఈ విధంగా సుశిక్షితులైన ఐదున్నర లక్షల కాల్బలం, ముప్ఫైవేల గుర్రాలు, 500 పైగా ఏనుగుల మహాసైన్యంతో శత్రువుల గుండెలదిరేలా కృష్ణదేవరాయలు కదనానికి కదిలాడు.

పైన చెప్పినది కేవలం పోరాడే యోధుల లెక్క. వారుకాక వారి సేవకు, నిత్యావసరాలు

తీర్చడానికి ఇంకా ఎందరో! అన్ని లక్షల మందికి బట్టలు ఉతకటానికి రజకులు, వండి వార్చటానికి వంటవాళ్లు, సామాన్లు మోయటానికి పనివాళ్లు, కావలసిన సమస్త వస్తువులు విక్రయించటానికి వర్తకులు, మళ్లీ వారి సేవకు పనివారు, ఎవరికైనా గుబులు మళ్లితే సేద తీరడానికి వేల సంఖ్యలో వేశ్యలు... ఇలా అన్ని వృత్తులవారూ కలిసి లెక్కకందని ఒక మహాజనసముద్రం. వీరందరికీ తిండితోబాటు నీరు కావాలి. దారి పొడవునా నీటి ఏర్పాటు చేయటానికి పది పన్నెండు వేల మంది నీటి తిత్తులు తీసుకుని ముందు వెళ్లి, నీటి వనరులను గాలించి, శుభ్రమైన నీటిని నింపుకొని వచ్చి మహాసైన్యం చేరుకునే సమయానికల్లా దారికి అటూ ఇటూ బారులు తీర్చి నిలబడి దాహం తీర్చేవారు. విడిది చేసిన చోట లక్షల మంది భోజనాలకు సర్వం సిద్ధం చేసేవారు. విడిది చేసిన చోట రాజు శిబిరం వేరుగా, దండనాథుల శిబిరాలు వేరుగా, బాజారులు తీర్చి అంగళ్లు, వినోద గృహాలు వేరు వేరుగా ఉండి అదంతా ఒక మహాపట్నంలా కనిపించేది. ప్రధాన సైన్యానికంటే పది పన్నెండు మైళ్లు ముందుగా యాభై వేల కాల్బలంతో ఏర్పాట్లు 2 వేల గుర్రాలతో అడ్వాన్సు పార్టీ సాగి అనుపానులను గమనించేది.

కృష్ణ, తుంగభద్ర నదుల నడుమ పెద్ద తటాకాలతో, నిరంతర జలధారలతో కొండల సహజ రక్షణతో శత్రు దుర్భేద్యంగా కట్టిన రాయచూర్ పట్టణం ముట్టడిలో రాయల సేనలకు విశేష ప్రాణ నష్టం జరిగింది. చుట్టూ మూడు వరసల్లో ఉక్కులాంటి గోడలతో, అడుగడుగునా బురుజులతో, ఐదు సంవత్సరాలకు సరిపడిన సరుకుల నిలవలతో నిబ్బరంగా ఉన్న కోటలో కేవలం 400 గుర్రాలు, ఇరవై ఏనుగులతో కొన్ని వందల శతఘ్నులతోటే సుశిక్షితులైన ఎనిమిది వేల మంది సైనికులు రాయల దండు దాడిని సమర్థంగా నిరోధించి వేల సంఖ్యలో తలలు తెగవేస్తూ వీరవిహారం చేశారు. కందకాల సమీపంలోకి వచ్చినవారినల్లా పైన గోడల నుంచి సైనికులు హతమార్చారు. రాయచూర్‌కుగల పటిష్ఠ రక్షణ వ్యవస్థవల్ల మూడు నెలలు హోరాహోరీగా పోరు నడిచింది. రాయలవైపే ఎక్కువ ప్రాణ నష్టం జరిగింది.

ఒకవైపు ప్రచండంగా ముట్టడి కొనసాగుతున్నా రాయల మహాసైన్యం విడిది చేసిన విశాల ప్రాంతం బారులు తీర్చిన బజార్లతో, కోళ్లు, మేకల నుంచి బియ్యం పప్పులు కూరలు మొదలుకుని వస్త్రాల, రత్నాల, వజ్రాల వ్యాపారాల వరకూ క్రయ విక్రయాలతో, రజకుల, సేవకుల సందడితో మహా కోలాహలంగా ఉండేది. 32 వేల గుర్రాలకూ, 550 ఏనుగులకూ సరుకులు మోసే వేలాది గాడిదలకూ, పాడి పశువులకూ రోజుకు ఎంతెంత గడ్డి, గాదం కావలసి వస్తుందో ఎవరికి వారు ఊహించవచ్చు. నిర్మానుష్యమైన ఆ బీడు భూమిలో అంతటి సామగ్రిని ఎలా సేకరించేవారో తెలియదుగాని ఏ మనిషికీ, ఏ జంతువుకూ తిండికీ, నిత్యావసరాలకూ ఏ లోటూ ఉండేది కాదు. సరుకులను మోసుకుపోయే ఎడ్లబండ్లతో, బేరసారాల ఆటపాటల హడావుడితో, వాయిద్యాల మోతలతో, వేలాది స్త్రీలూ పురుషుల కాలక్షేపం కబుర్లతో ఎప్పుడూ బేఫర్వాగా ఉండే ఆ పరిసరాలను చూస్తే వెలుపల ఘోర సంగ్రామం సాగుతున్న ఆనవాళ్లే కనిపించవు. తెలియనివారు అదేదో సంపన్న నగరమనే అనుకుంటారు. దైనందిన జన జీవితం వరకూ ఎక్కడా ఉద్రిక్తత లేకపోయినా రాయల శిబిరం ఆదమరచి ఉన్నదనడానికి వీలు లేదు. విజయనగరం నుంచి వచ్చేటప్పుడు ఎల్లవేళలా ముందు నడిచి పరిసరాల అనుపానులను కనిపెట్టిన యాభైవేల సైనికుల దళమే రేయింబవళ్లూ విడిది చుట్టూ కాపలా కాసి శత్రువుల కదలికలను అప్రమత్తంగా కనిపెట్టేది.

ఈ విధంగా కోటను పట్టుకోవటానికి భీషణ సమరం మొదలైన మూడు నెలలకు బీజాపూర్ సుల్తాన్ ఆదిల్‌షా రాయచూర్‌ను రక్షించుకోవటానికి లక్షా పాతిక వేల సేనతో ఉత్తరపు వైపు నుంచి వచ్చి నది ఒడ్డున దండు విడిశాడు. తాను వచ్చినట్టు తెలియగానే రాయలు నది దాటి తనపైకి ఉరికి వస్తాడని, అతడు చాలా రోజులు ఎదురుచూశాడు. కాని రాయలు అతడిని మించినవాడు. ఏమి జరుగుతుందో తెలుసుకోమని వేగులను పురమాయించాడే తప్ప ఉన్నచోటి నుంచి తాను కదలలేదు. సుల్తాన్‌గారు సర్దార్లను సలహా అడిగితే మనమే అతడి మీద విరుచుకుపడి మన పట్నాన్ని రక్షించుకుందాం అన్నారు. ఇంకేం? అప్పటికప్పుడే నది దాటి ఈవలకి వచ్చి తీరం వెంబడే రాయలసేనకు అభిముఖంగా సుల్తాన్ సేనలు ముందుకు సాగాయి. తమకు తొమ్మిది మైళ్ల దూరంలోకి శత్రువులు రాగానే రాయలూ ఏడు విభాగాలుగా తన సైన్యాన్ని విభజించి శత్రువు దిశగా కదిలాడు. చెవులు చిల్లులు పడే భేరీ నాదాలతో, బాకా చప్పుళ్ళతో భయంకరంగా మొదలైన యుద్ధంలో తొలి విజయం ఆదిల్‌షాదే అయింది. విరోధులను పిట్టల్లా కూల్చే అతడి ఫిరంగుల ధాటికి తాళలేక, ఊచకోతకు నిలవలేక అగ్రశ్రేణిలో చావగా మిగిలిన రాయల సేన వెనుదిరిగి పరుగు లంకించుకుంది. రెట్టించిన ఉత్సాహంతో ముసల్మాన్లు వారిని వెంటాడి వేటాడసాగారు.

ఆ దిశలో రాయల పరాజయం తథ్యమనే అందరికీ తోచింది. విషమ స్థితిని గమనించిన రాయలు సింహంలా తిరగబడ్డాడు. ఆదిల్‌షా తనను గెలవవచ్చేమో గాని పరాభవించానని మాత్రం చెప్పుకోజాలడని దండ నాయకుల ముందు గర్జించాడు. ఒకవేళ యుద్ధంలో తాను మరణిస్తే తన రాణులకు తన గుర్తుగా రాజముద్రికను చూపించి సంప్రదాయం ప్రకారం మంటల్లో ఆహుతి కమ్మని చెప్పమంటూ ఒక నమ్మినబంటుకు వేలి ఉంగరాన్ని ఇచ్చిన మీదట కకావికలైన తన సేనలను నేర్పుగా సమరోన్ముఖం చేశాడు. శత్రువుకు వెన్నుచూపి పరుగున వస్తున్న తన సైనికులను చిక్కినవారిని చిక్కినట్టు నరికెయ్యమని ఆయన ఆజ్ఞాపించడంతో పరిస్థితి మారిపోయింది. వెనక్కివచ్చినా చావు తప్పదని గ్రహించడంతో అగ్రగామి దళంలోని సైనికులు విధిలేక మళ్ళీ వెనక్కి తిరిగి రంకెలు వేస్తూ వెర్రి తెగింపుతో శత్రువుల మీదికి ఉరికారు. వారి వెంబడే లక్షల సంఖ్యలోని మిగతా సేనలూ భీకరంగా దూసుకుపోయి శత్రు సైన్యాన్ని నరికి పోగులు పెట్టాయి. ఊహించని ఈ పరిణామంతో సుల్తాన్ సేనలు నిర్ఘాంతపోయాయి. ఆ తొట్రుపాటుతో వారి సైనిక వ్యూహం భగ్నమైంది. అంతటా గందరగోళం నెలకొంది. సంఖ్యాపరంగా తమలో నిండా ఐదోవంతు కూడా లేని శత్రుసేనను స్థిమితపడ్డ రాయల సైన్యం చీల్చి చెండాడసాగింది. ఆ దశలో సుల్తాన్ ఆదిల్‌షా చెంతకు అసాద్‌ఖాన్ అనే సర్దారుపోయి - బతకాలని అనుకుంటే తన వెంట రమ్మని చెప్పి ఏనుగుమీద ఎక్కించుకుని పరారయ్యాడు. ప్రభువు పలాయనంతో బీజాపూర్ సేనలు. బేజారయ్యాయి.

యుద్ధాల్లో ఇటువంటి పరిణామం మామూలే. మన దేశంలోనే అనేక శతాబ్దాల్లో సాగిన అనేక యుద్ధాల్లో ఇటువంటి దుర్గతి హిందూ సేనలకు పట్టింది. సింద్‌లో మహ్మద్‌బిన్ కాసిం అయినా, పంజాబ్‌లో గజనీ మహ్మద్ అయినా, తారాయిన్‌లో మహమ్మద్ ఘోరీ అయినా, చిత్తోడ్‌లో అక్బర్ అయినా.. పలాయనమైన సేనలను వెంటపడి నిశ్శేషంగా నరికి పారేసేంతవరకూ కత్తి దించలేదు. తమ వారిని వేల సంఖ్యలో హతమార్చిన బీజాపూర్ సేననూ ఒక్కర్నీ వదలకుండా నిర్మూలించాలని రాయచూర్‌లో రాయల సేనానులూ

తహతహలాడారు. రాయలు అందుకు సమ్మతించలేదు.

శత్రు సంహారం ముమ్మరంగా సాగుతూండగా యుద్ధం ఆపమని రాయలు ఆజ్ఞాపించాడు. ఇంకా చీకటి పడలేదు. శత్రు నిర్మూలనను పూర్తి చేయనివ్వమని దండనాయకులు వేడుకున్నారు. రాజు ఆలకించలేదు. తాము చేయని తప్పుకు ఇప్పటికే ఎందరో హతమయ్యారు. తప్పుచేసిన ఆదిల్షాకు జరిగిన శాస్తి చాలు. అతడి సేనను ఇంకా చంపి ప్రయోజనం లేదు. మనం గెలవాల్సింది రాయచూరును. ఇక దాని మీద దృష్టిసారిద్దాం - అని ఆయన దృఢంగా చెప్పాడు. సర్వసైన్యాధిపతి సలాబత్‌ఖాన్ సహా ఐదుగురు బీజాపూర్ సేనానులను మాత్రం బందీలుగా పట్టుకుని, ముసల్మాన్ల గుర్రాలు, ఏనుగులు, వస్తు సామగ్రిని వశపరచుకుని, తన సేనలో మరణించిన వారికి అంత్యక్రియలు, దానధర్మాలు నిర్వహించిన మీదట రాయలు మళ్లీ రాయచూర్ మీదికి కదిలాడు.

అదృష్టవశాత్తూ అదే సమయంలో పోర్చుగీసు వాడయిన క్రిస్టోవో డి ఫిగిరెడో కూడా తన తుపాకి దళంతో అక్కడికి వచ్చి చేరాడు. రాయల అనుమతితో అతడు తన దళంతో వెళ్లి బురుజులపై గోడలపై ఆదమరచి ఉన్న సైనికులు కొందరిని తుపాకులతో కాల్చడంతో, అక్కడి బలగాలు బెంబేలుపడి చెల్లాచెదురయ్యాయి. వెంటనే రాయలసేన గోడలను కూల్చి కోటలో ప్రవేశించింది. పట్టణంలోని జనం ఏమి జరుగుతుందో తెలియక కోటలోకి వెళ్ళి తలదాచుకున్నారు. భయవిహ్వలురైన ప్రజలను సముదాయించి రక్షణ బలగాలకు ఆదేశాలిస్తుండగా ఫిగిరెడో తుపాకి తూటా నుదురులో దిగబడి నగర పాలకుడు నేలకూలాడు. అతడితోబాటు రక్షణ వ్యవస్థా కుప్పకూలింది.

సరిగ్గా ఇది 46 ఏళ్ల తరువాత అక్బర్ చేతిలో చిత్తోడ్‌కు పట్టిన దురవస్థ లాంటిదే. అనేక నెలల భీకర సంగ్రామం తరవాత అక్బర్ తుపాకి తూటా దుర్గ రక్షకుడు జైమాల్‌ను నేలకూల్చడంతో చిత్తోడ్ కోట మొగలుల వశమైంది. ఒళ్లెరుగని గెలుపు తమకంతో కోటలో అడుగుపెట్టిన 'అక్బర్ ది గ్రేట్'గారు ఏ మనిషినీ వదలకుండా, స్త్రీలు, పిల్లలు, వృద్ధులు అన్న కనికరం లేకుండా కనిపించిన వారినల్లా నరికివెయ్యమని ఆజ్ఞాపించాడు. ఒక్క రోజులో ఏకబిగిన 30 వేల మంది అమాయక ప్రజలను ఊచకోత కోయించి రక్తపిశాచి అనిపించుకున్నాడు. మరి అదే పరిస్థితిలో తనకు వశులైన రాయచూర్ వాసులతో కృష్ణదేవరాయలు ఎలా వ్యవహరించాడు?

ఆదిల్‌షాను ఓడించిన ఇరవయ్యో రోజున రాయచూర్ పుర ప్రముఖులు ఒక ద్వారాన్ని తెరచి తెల్లజెండా ఎత్తుకుని కృష్ణదేవరాయలు విడిది చేసిన చోటికి వెళ్ళి ఆయన ముందు సాష్టాంగపడి తమను కనికరించమని వేడుకున్నారు. రాయలు వారికి అభయమిచ్చి పంపి మరుసటి రోజున రాజలాంఛనాలతో కోటలో ప్రవేశించాడు. దీర్ఘకాలం యుద్ధం చేసి తమను గెలిచిన హిందూ రాజు తమను ఏమి చేస్తాడోనని హడలిపోతున్న ప్రజలను సాదరంగా చూశాడు. పట్టణంలోని ముఖ్యులను రావించి మీ ఆస్తులకు, ప్రాణాలకు ధోకాలేదు. ఇక్కడ ఉండదలచు కున్నవారు హాయిగా ఉండవచ్చు. వెళ్లదలచుకున్నవారు ఇక్కడి నుంచి నిరభ్యంతరంగా తమ ఆస్తిపాస్తులతో వెళ్ళిపోవచ్చునని వారికి గుండె దిటవు కలిగించాడు. అంతలో కొందరు వచ్చి మీ సైనికులు ఊరిమీద పడి దోచుకుంటున్నారని చెబితే రాయలు వెంటనే హద్దుమీరినవారిని అదుపుచేసి దోచుకున్న సామగ్రిని ఎవరిది వారికి ఇప్పించాడు.

రాయచూర్‌లో రాయల దిగ్విజయ వార్త దేశమంతటా వ్యాపించింది. ఆ కబురు తెలిసి

త్రుళ్లిపడిన బీరార్, బీదర్, గోల్కొండ, అహ్మద్‌నగర్ సుల్తాన్లు కూడబలుక్కుని విడివిడిగా రాయలకు దూతల ద్వారా లేఖలు పంపారు. మీరు ఆదిల్‌ఖాన్‌ను పరాభవించడంతో తృప్తిపడి, ఇకపై పోరు చాలించి అతడి భూమిని అతడికి దయచేసి ఇచ్చివేయగలరు. అలా కనక చేయకపోతే మేము మీకు ఎదురు తిరిగి, ఆదిల్‌షాకు అండగా మీపై దండెత్తి రాగలము – అన్నది వాటి సారాంశం. విన్నాక అందరికీ కలిపి కృష్ణరాయలు ఒకే జవాబు పంపాడు. ఏమనంటే – 'అయ్యా, ఆదిల్‌షాకు జరగవలసిందే జరిగింది. మీరు కోరినట్టు అతడి నుంచి గెలుచుకున్న ప్రాంతాన్ని అతడకి అప్పగించడం నాకు సమంజసంగా తోచడం లేదు. ఇక – అతడికి సాయంగా శ్రమ తీసుకుని మీరు ఈ రాయచూరు దాకా దండెత్తి రానవసరం లేదు. మీరు కనుక కోరితే నేనే మీ రాజ్యానికి వచ్చి మిమ్ములను ఎదుర్కొనగలవాడను' – అని!

రాయచూర్ నుంచి వెళ్ళిపోదలచుకున్నవారిని సగౌరవంగా సాగనంపి, పాడయిన కోట గోడలను మరమ్మతులు చేయించి, కోట రక్షణకు తగిన బలాన్ని నియమించి, కృష్ణదేవరాయలు విజయగర్వంతో విజయనగరానికి తిరిగి వచ్చాడు. ఆయన వెళ్లేసరికే ఆదిల్షా రాయబారి ఆయన కోసం కాచుకుని ఉన్నాడు. నెల రోజులపాటు అతడిని ఉపేక్షించి, విజయోత్సవాలన్నీ ముగిశాక తాపీగా రాయలవారు దర్శనం ఇచ్చారు. అతగాడు మోసుకొచ్చిన సుల్తాన్ సందేశం ఏమనంటే – 'చిరకాలంగా ఉన్న మన మైత్రిని మీరు ఎందుకు చెడగొట్టి యుద్ధానికి దిగారో తెలియదు. రాయచూర్‌ను మీరు కొల్లగొట్టి ధ్వంసం చేస్తున్నారని తెలిశాకే నేను మీపై దండెత్తవలసి వచ్చింది. ఇప్పటికైనా మాకు చెందిన గుడారాలను, గుర్రాలను, ఏనుగులను, మా నుంచి వశపరచుకున్న ప్రాంతమంతటినీ మాకు తిరిగి అప్పగిస్తే ఆజన్మాంతం మీకు విధేయుడుగా ఉండగలను. కాదంటారా? మీకు ఆనందంగా ఉన్నా మీరు చేసింది మాత్రం పాపమే' – అని.

అంతా విని కృష్ణరాయలు ఒకటే మాట అన్నాడు. 'సరే! మీ సుల్తాన్‌ను వచ్చి నా కాళ్లమీద పడమను. అతడి నుంచి తీసుకున్నదంతా తిరిగి ఇచ్చేస్తాను' అని. రాయబారి ఈ సంగతి ఆదిల్షాకు విన్నవించాడు. ఆ అభిమానవంతుడేమో 'ఆయన కాళ్లు పట్టుకోవటం నాకు సంతోషమే. కాని అందుకోసం నేను విజయనగరం ఎలా రాగలను' అని దౌటు వ్యక్తం చేశాడు. రాయబారి మళ్లీ ఆ కబురు రాయలవారికి చేరవేశాడు. 'ఓహో! అలాగా? ఆయన ఇక్కడిదాకా రావొద్దులే. నేనే రాజ్యం పొలిమేరలకు వస్తాను. అక్కడికి వచ్చి కాళ్లమీద పడమను' అని రాయలు బదులిచ్చాడు. అదే ప్రకారం "కాళ్ళు పట్టు మహోత్సవం" కోసం సుల్తాన్‌గారు సరిహద్దులోని ముద్గల్ రానున్నారని ఆయన దూతలు చెబితే రాయలు సపరివారంగా అక్కడికి వెళ్ళాడు. సుల్తాన్ అక్కడ అయిపు లేడు. అతడిని వెదుక్కుంటూ అతడి ముఖ్యపట్నమైన బీజాపూర్‌కు రాయలు వెళ్లాడు. ఆయన వస్తున్నాడని తెలిసి ఆదిల్షా పరారయ్యాడు. కావాలనుకుంటే అతడి రాజధానిని రాయలు సునాయాసంగా వశపరుచుకుని తన రాజ్యంలో కలిపేసుకోగలిగేవాడే. కాని అందుకు ఆయన సంస్కారం అంగీకరించలేదు. కేవలం ఆదిల్షాకు బుద్ధి చెప్పాలనే ఆయన తలిచాడు. కొద్దిరోజులపాటు రాయలు అక్కడే విడిదిచేసినా ఆదిల్షా జాడలేదు. ఈలోపు రాయల సేనలు వంట చెరుకు దొరకక కనపడ్డ ఇళ్ల నుంచి కలప గుంజుకున్నారు. ఆ సేన పరిమాణం పెద్దది కనుక వాటి తక్షణావసరమైన కట్టెల కోసం నగరంలో చాలా భాగం ధ్వంసమైంది. ఆ సంగతి తెలిసి బీజాపూర్ సుల్తాన్

పశ్చాత్తాపపడ్డాడు. వస్తానని చెప్పి తాను మొగం చాటెయ్యడం వల్లనే కదా ఇలాంటి విపత్తు వచ్చిందని గ్రహించి, ఎలాగైనా రాయలతో సఖ్యతను సాధించుకురమ్మని తన సేనాని అసాద్‌ఖాన్‌ను పంపాడు. అతడేమో రాయలకు మాయమాటలు చెప్పి ఇన్నిటికీ కారణం మీ చెరలోని సలాబత్‌షానేనని దుర్బోధ చేసి అతడి తల నరికించి తాను మాయమయ్యాడు. ఈ మోసాన్ని గ్రహించాక రాయలు ఆగ్రహించి మళ్లీ బీజాపూర్ రాజ్యంపై దండెత్తాడు కాని ఆదిల్షా దొరకలేదు. కొన్నాళ్లకు రాయలకే విసుగుపుట్టి ఆదిల్షా చేత కాళ్లు పట్టించుకునే పంతాన్ని వదిలేశాడు. బీజాపూర్ సుల్తాన్ బతికిపోయాడు.

ఇదీ న్యూనిజ్ విలక్షణశైలిలో వర్ణించిన రాయల రాయచూరు విజయగాథ సారాంశం. మన దేశంలో జరిగిన యుద్ధాల గురించి సమకాలికులైన చరిత్ర కారులు ప్రత్యక్షంగా చూసి రాసిన రికార్డులు బహు అరుదు. 11వ శతాబ్దంలో గజనీ మహ్మద్ యుద్ధాల గురించి అల్‌బెరూని, 16వ శతాబ్దంలో అక్బర్ సంగ్రామాల గురించి అబుల్‌ఫజల్ లాంటి వారు రాసిపెట్టిన ప్రత్యక్ష సాక్షి కథనాలు లేకపోలేదు. కాని – వారు ఆయా ముస్లిం ప్రభువులకు ఆశ్రితులు, పైగా ముస్లిం మత పక్షపాతులు. కాబట్టి వారి రచనల నిండా అబద్ధాలు, అతిశయోక్తులు, వక్రీకరణలు కొల్లలు. తాను పుట్టడానికి కొన్ని శతాబ్దాల పూర్వం జరిగిన యుద్ధాల గురించి ఫిరిస్తా వంటి వారు రాసిప పక్షపాతపు రాతల అష్టవంకరల గురించి చెప్పనే అక్కర్లేదు. న్యూనిజ్ రికార్డు అలాంటిది కాదు. అతడు పోర్చుగల్ దేశస్థుడు. క్రైస్తవుడు. హిందూ మత పక్షపాతి కాదు. కృష్ణదేవరాయల ఆశ్రితుడో, ఆస్థాన విద్వాంసుడో కూడా కాదు. కాబట్టే రాయల రాజ్యంలో కొన్నాళ్లు ఉండి, సంగతి సందర్భాలను గమనించి, పూర్వాపరాలను తెలుసుకుని రాయల వెంట స్వయంగా రణరంగానికి వెళ్ళి అతడు రాసిన 'క్రానికల్'కు విశేష చారిత్రక ప్రాధాన్యం ఉంది. మధ్యయుగాల్లో యుద్ధాలు ఎలా జరిగేవో, దాడులకు, ఎదురు దాడులకు వ్యూహాలు ఎలా పన్నేవారో, సైనిక మోహరింపులు ఎలా ఉండేవో తెలుసుకోవడానికీ న్యూనిజ్ వర్ణన ఉపకరిస్తుంది. అతడు అభివర్ణించిన కృష్ణరాయల కార్యశైలిని గమనిస్తే క్రౌర్యంలేని శౌర్యం ఎలా ఉంటుందో అర్థమవుతుంది.

విచిత్రమేమిటంటే – ఇంత వివరంగా చరిత్రలో దర్శనమిచ్చే కృష్ణదేవ రాయల గురించి చరిత్రకారులు ఇంతవరకూ సరైన మదింపు చేసినట్లు కనపడదు. వేరేవారి సంగతి ఎందుకు? పెయిస్, న్యూనిజ్‌ల రాతలను మూలం నుంచి ఆంగ్లంలోకి అనువదించి, విశేష పరిశోధన చేసి విస్మృత విజయనగర సామ్రాజ్యాన్ని తన సుప్రసిద్ధ గ్రంథంలో 1900లో వెలుగులోకి తెచ్చిన రాబర్ట్ సూయెల్ కూడా ఆదిల్షా చేత కాళ్లు పట్టించుకోవాలనుకోవడం కృష్ణరాయల దురహంకారమనే తేల్చాడు.

> 'No monarch such as the Adil Shah could brook for a moment such a humiliation as was implied by a peace the condition of which was that he should kiss his triumphant enemy's foot; and it was beyond all doubt that this and similar contemptuous arrogance on the part of successive Hindu rulers that finally led, forty years later, to the downfall of the Hindu empire.'
>
> *[A Forgotten Empire by* **R.Sewell** *p.122]*

(శాంతి కావాలంటే గెలిచిన శత్రువు కాళ్లమీద తాను పడాలన్న షరతులో ఇమిడిన అవమానాన్ని ఆదిల్షా వంటి మహారాజు క్షణం కూడా సహించజాలడు. విరోధులను చులకనచేసే ఇలాంటి దురహంకారాన్ని హిందూ ప్రభువులు పరంపరాగతంగా ప్రదర్శించడమే నలభయ్యేళ్ల తరవాత హిందూ సామ్రాజ్య పతనానికి దారి తీసిందన్నది నిస్సందేహం.)

సూయెల్‌కు న్యూనిజ్ ప్రమాణం. ఆ న్యూనిజ్ రాసింది చూస్తే – రాయల షరతు విని ఆదిల్షా అవమాన భారంతో రగిలిపోయిన దాఖలాల్లేవు. కాళ్లు పట్టుకోవటానికైతే అతడికి అభ్యంతరం లేదు. ఎక్కడ? ఎలా? – అన్నదే అతడు లేవదీసిన మీమాంసల్లా. అతడికి లేని అభ్యంతరం ఆధునిక చరిత్రకారులకు ఎందుకు ఉండాలి? తనను రెచ్చగొట్టి, యుద్ధంలో తనకు జరిగిన విశేష నష్టానికి కారకుడైన మహమ్మదీయప్రభువు నుంచి ఏ అపరాధ సుంకమూ కోరకుండా, రాజ్యాన్ని లాగేసుకోకుండా ఉదారంగా ప్రవర్తించి. ఒక్కసారి కాళ్లమీద పడితే చాలు స్వాధీనం చేసుకున్నవన్నీ తిరిగి ఇచ్చేస్తానని శ్రీకృష్ణదేవరాయలు అనడమే అవమానకరమైన దురహంకారం అయ్యేపక్షంలో...

తన చేతిలో ఓడిన ప్రతి రాజూ, తన ప్రాపకం కోరే ప్రతి హిందూ ప్రభువూ ఢిల్లీ దర్బారులో తనకు తాబేదారుగా చేతులు కట్టుకుని నిలబడి. కనపడిన ప్రతిసారీ తన కాళ్లకు సాష్టాంగపడాలనీ.. తనకు దాస్యం చేయటానికి కొడుకునో. మరొకడినో శాశ్వతంగా తన కొలువులో ఉంచాలనీ... తన ఇంటి నుంచి కనీసం ఒక కన్యను పెళ్లి పేరిట అంతఃపురానికి పడుపుగత్తెగా పంపాలనీ దయామయుడు, ధర్మప్రభువు అయిన అక్బర్ ది గ్రేట్ షరతు పెట్టటాన్ని ఏమని వర్ణించాలి?!

మహానగరం సర్వనాశనం

With fire and sword, with crowbars and axes, they carried on day after day their work of destruction. Never perhaps in the history of the world has such havoc been wrought, and wrought so suddenly, on so splendid a city, teeming with a wealthy and industrious population in the full plentitude of prosperity one day, and on the next seized, pillaged, and reduced to ruins, amid scenes of savage massacre and horrors beggering description.

[A Forgotten Empire - **R.Sewell** *p. 208]*

నిప్పుతో, కత్తితో... గడ్డపలుగులతో, గొడ్డళ్లతో రోజు తరవాత రోజు వారు తమ విధ్వంసాన్ని కొనసాగించారు. బహుశా ప్రపంచ చరిత్రలోనే మున్నెన్నడూ ఇంత రమ్యమైన నగరం ఇంత ఆకస్మికంగా ఇంతటి భయానక బీభత్సానికి లోనవలేదు. సంపన్నులు, శ్రమజీవులు అయిన ప్రజలతో ఒక రోజు అష్టైశ్వర్యాలతో తులతూగిన నగరం మరునాటికల్లా శత్రువులకు వశమై, కొల్లగొట్టబడి, కిరాతకపు ఊచకోతల, వర్ణించనలవికాని ఘోరాల నడుమ సర్వనాశనమైంది.

1565 ఫిబ్రవరి నుంచి మొదలుపెట్టి ఐదారు నెలలు నిరాఘాటంగా సాగిన విజయనగర విధ్వంసం గురించి పరాయి దేశస్థుడైన రాబర్ట్ సూయెల్ తన 'విస్మృత సామ్రాజ్యం' గ్రంథంలో ఆవేదనతో పలికిన పలుకులివి. కళలకు నిలయంగా, సరస్వతికి కోవెలగా, నాగరికతకు మణిదీపంలా రెండు శతాబ్దాలకు మించి అద్భుతంగా వర్ధిల్లిన ఒక మహానగరాన్ని, ఒక మహాసామ్రాజ్యాన్ని నామరూపాలు లేకుండా నేలమట్టం చేయటానికి ఎంత పాషాణ హృదయులకైనా చేతులు ఎలా వచ్చాయి? ఒకరు కాదు, ఇద్దరు కాదు. ఏకంగా నలుగురు సుల్తాన్లు తమ రాజ్యాలను వదిలి, పనులు మానుకుని నెలల పర్యంతం ఏకదీక్షతో ఈ దారుణ విధ్వంసాన్ని దగ్గరుండి జరిపించటానికి కారణమేమిటి? అంతటి కసి, పైశాచిక ప్రవృత్తి వారిలో ప్రకోపించటానికి విజయనగర ప్రభువులు చేసిన తప్పేమిటి? లక్షలాది

విజయనగర పౌరులు చేసుకున్న పాపమేమిటి?

రాజులన్నాక సవాలక్ష రాజకీయాలుంటాయి. వారిలో వారికి కక్షలు, కార్పణ్యాలు, క్రోధాలు, పంతాలు లెక్కలేనన్ని ఉంటాయి. వీలుచూసి కీలు విరచడం, నమ్మినవారిని నట్టేట ముంచటం, ఒకరి రాజ్యాన్ని ఒకరు కబళించటం రాజులకు మామూలే. చేతికి చిక్కిన రాజ్యాన్ని ఆక్రమించడంలో తప్పులేదు కాని ఆక్రమించిన రాజ్యాన్ని ఎందుకూ పనికిరాకుండా నాశనం చేయటం... కళ్లు చెదరగొట్టే కళాత్మకక కట్టడాలను, నవరాత్రి వేడుకల్లో లక్షల జనం ఉత్సుకతతో చూస్తుండగా పది లక్షల సైనికులు బారులు తీర్చి నిలబడగలిగిన సువిశాల స్థలంలో రమణీయ మంటపాలను, వాటి ఎల్లడెలా చెక్కిన లోకోత్తర శిల్పాలను ముక్కలు ముక్కలుగా ధ్వంసం చేయటం... ఏ పాపమెరుగని అమాయక జనాన్ని వెంటాడి ఊచకోతలు కోయడం - మనుషులు చేయాల్సిన పనికాదు.

సదాశివరాయలను కీలుబొమ్మను చేసి మూలకూచోపెట్టి అతడి పేరిట రాజ్యం చేసిన అళియ రామరాయల (ఈయన కృష్ణదేవరాయల అల్లుడు) దురుసుతనం, దురహంకారాల వల్లే దక్కన్ సుల్తాన్లు విజయనగర సామ్రాజ్యంపై కత్తిగట్టారన్న వాదంలో కొంత వరకు నిజం లేకపోలేదు. రామరాయలు హద్దుమీరి అనుచితంగా ప్రవర్తించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కాని - కేవలం ఆ కారణం వల్లే నలుగురు సుల్తాన్లూ, అకస్మాత్తుగా కత్తు కలిసి అతడిపై కత్తి ఎత్తారని ఘటనా క్రమాన్ని చూస్తే నమ్మకం కలగదు. ఒకవేళ రామరాయలు చేయరాని మహాపరాధమేదో చేసి దక్కనీ సుల్తాన్లను ఆగ్రోదగ్రులను చేశాడని అనుకున్నా తాళికోట యుద్ధంలో రామరాయలు తల నరికి శూలానికి గుచ్చడంతో ఆ పగ చల్లారి ఉండాలి. రామరాయల మరణంతో సేనలు చెల్లాచెదురై సర్వత్రా నెలకొన్న అయోమయాన్ని ఆసరా చేసుకుని నలుగురు సుల్తాన్లూ విజయనగరాన్ని ఆక్రమించినా, అక్కడి సంపదనంతా తరలించుకుపోయినా, ఆ రాజ్యాన్ని తలా కొంచెం పంచుకున్నా, అప్పటివరకు నడుస్తున్న పాలనా విధానాలను మార్చేసి తమ ఇష్టానుసారం ఇస్లామిక్ వ్యవస్థను నిర్బంధంగా అమల్లోకి తెచ్చినా, ఎవరూ ఆక్షేపించగలిగేవారు కాదు. సిరిసంపదలతో, విశిష్ట నాగరికతతో మహోజ్జ్వలంగా విలసిల్లుతున్న మహానగరాన్ని జనావాసానికి వీలులేనంతగా శాశ్వతంగా నాశనం చేసి వల్లకాడుగా ఎందుకు మార్చాల్సి వచ్చింది?

అళియ రామరాయలు ఆ నలుగురు సుల్తాన్లను యమ యాతన పెట్టి తీరని క్షోభకు గురిచేసినందువల్లే అతడిని చంపినా కసి తీరక రాజధానిని నేలమట్టం చేశారనుకుందామా? మోసాల, రోషాల గురించి చెప్పాల్సి వస్తే ఆ నలుగురు సుల్తాన్లూ తక్కువ తినలేదు. కొద్ది నెలల కిందటి దాకా వారు పరస్పరం కత్తులు దూసుకున్నవారే. ఒకరి రాజ్యాన్ని ఒకరు కొల్లగొట్టినవారే. నిజానికి వారిలో ప్రతి ఒక్కరూ రామరాయల నుంచి కొద్దో గొప్పో ఉపకారం పొందినవారే. గోల్కొండ నవాబుగా జంషీద్ కుతుబ్‌షా ఉన్న కాలంలో అతడితో విరోధించి పారిపోయి వచ్చిన తమ్ముడు ఇబ్రహీంకు రామరాయలే విజయనగరంలో చిరకాలం ఆశ్రయమిచ్చాడు. అన్న మరణానంతరం అతడు గోల్కొండ తిరిగి వెళ్ళటానికి రామరాయలే సహాయం చేశాడు. మళ్ళీ అదే ఇబ్రహీం గోల్కొండ గద్దెనెక్కేసరికి ఉపకారం మరచి రామరాయలకే ఎదురు తిరిగాడు. (ఈ ఇబ్రహీంనే తెలుగు కవులు మల్కిభరాం అన్నారు.) రామరాయలు అహ్మద్‌నగర్ మీదికి దండెత్తగానే ఆ రాజ్యం గెలిచి అతడెక్కడ బలిసిపోతాడోనన్న ఆరాటంతో పాత కక్షలను మరచి అహ్మద్‌నగర్ సుల్తాన్ నిజాంషా కు

ఇబ్రహీం మద్దతునిచ్చాడు. దానితో ఒళ్లు మండిన రామరాయలు అనంతరం కల్యాణికోటపై దండెత్తిన ఘట్టంలో గోలకొండ రాజ్యాన్ని అతలాకుతలం చేసి గుణపాఠం నేర్పాడు. పాన్‌గల్, గణపూర్లను సమర్పించుకొని ఇబ్రహీం కుతుబ్‌షా విధిలేక రామరాయలతో సంధి చేసుకున్నాడు.

అహ్మద్‌నగర్ సుల్తాన్ నిజాంషా కూడా విజయనగరానికి ఆగర్భ శత్రువేమీ కాదు. ఆ మహానుభావుడు 1551లో కాఫిర్ రామరాయలతో ఏరికోరి జతకలిసి అతడి అండతో బీజాపూర్‌లోని ముస్లిం సుల్తాను ఆదిల్షాపైకి నిస్సంకోచంగా దండెత్తినవాడే. ఆ యుద్ధంలో రామరాజు రాయచూరు, ముద్గలు దుర్గాలను, కృష్ణా తుంగభద్రా నదుల నడుమ ప్రాంతాన్ని జయించాడు. బీజాపూర్ సుల్తాన్లు రామరాయలపై కత్తిగట్టటానికి అదే కారణమనడమూ సరికాదు. ఎందుకంటే రాయల తోడ్పాటు లేకుంటే నెగ్గటం కష్టమని గ్రహించి బీజాపూర్ సుల్తాను ఆదిల్షా మళ్ళీ రామరాయలతోనే చెలిమి చేసి అతడి అండతో అహ్మద్‌నగర్‌పై దండెత్తాడు. కాని పరాజయం పాలయ్యాడు. తమకు అవసరమైనప్పుడు, ఒకరినొకరు తిప్పలు పెట్టుకోవటానికి సుల్తాన్లందరూ రాయల ప్రాపకం ఆపేక్షించిన వారేనన్నదే ఇక్కడ పాయింటు.

ఆదిల్షా మరణానంతరం 1557లో అతడి కుమారుడు ఆలీ అదిల్‌షా బీజాపూర్ సుల్తాను అయ్యాడు. ఇతడు తండ్రిని మించిన కృతఘ్నుడు. కపట నీతిలో ఆరితేరినవాడు. అతడు గద్దెనెక్కిన కొత్తలోనే రామరాయల కుమారుడు మరణించాడు. ఆలీ అదిల్షా అప్పుడు విజయనగరం వెళ్లి పుత్రశోకంలో ఉన్న రామరాయలను ఓదార్చి ఇక నుంచి తనను పుత్ర సమానుడిగా చూడమని కోరుకున్నాడు. ఇదే మాట రాయల భార్యకూ చెబితే ఆ వెర్రితల్లి నిజమని నమ్మి ఏకంగా అతణ్ణి దత్తే చేసుకున్నానంది. నాటి నుంచి రామరాయలు అతడిపై పుత్రవాత్సల్యమే చూపాడు. నిజాం షాహీలు తమ రాజ్యం నుంచి తన్నుకుపోయిన ప్రాంతాలను తిరిగి సాధించటానికి సహాయం చెయ్యమని అతడు అడగగానే సరేనన్నాడు. అన్నట్టే 'దత్తపుత్రుడికి' పెద్ద సైన్యాన్నిచ్చి అహ్మద్‌నగర్ మీదికి దండెత్తించాడు. ఆ దండయాత్రలో విజయనగర సేన దౌలతాబాదు వరకూ గల విశాల భూభాగాన్ని జయించింది. హుసేన్ నిజాం షా గత్యంతరం లేక సంధికి ఒప్పుకుని, బీజాపూర్ సుల్తాన్‌కు కల్యాణి ప్రాంతాన్ని అప్పగించాడు. ఈ విధంగా రామరాయలను నమ్మించి, సహాయం పొంది, లాభపడ్డ బీజాపూర్ సుల్తానే అక్కర తీరాక అదే రాయలకు ద్రోహం చేసి విరోధులతో కట్టు కట్టటం విధి వైచిత్రి.

తనకు పూర్వపు విజయనగర ప్రభువులవలె దక్కన్ సుల్తాన్ల అంతర్గత రాజకీయాలకు దూరంగా ఉండకుండా రామరాయలు తరచూ కలగజేసుకుని, మిత్రలాభ మిత్రభేద తంత్రాలను తెలివిగా ప్రయోగించి, వారి మధ్య వైరుధ్యాలను వాడుకుని తన రాజ్యాన్ని బలిష్ఠం చేసుకున్న మాట వాస్తవం. అందులో అనైతిక మైనది, రాజనీతికి విరుద్ధమైనది ఏదీ లేదు. తెర వెనక కుహకాలు కాదు – రామరాయలు చేయబూనిందంతా బాహాటంగానే చేశాడు. అతడు ఒక్కడే కాక, ఆయా సమయాల్లో అతడి మద్దతు పొందినవారూ లాభపడ్డారు.

ఆ విశ్వాసం కూడా సుల్తాన్లకు లేకపోయింది. రామరాయలు ముసల్మాన్లకు చెందిన ప్రాంతాలను తడవకు కొంత ఆక్రమిస్తున్నందున, ప[illegible] మతస్థులపై నీచమైన దాడులు చేయిస్తుండటంవల్ల అతడి దుశ్చర్యను శిక్షించి, మత విశ్వాసులందరినీ అతడికి వ్యతిరేకంగా

కూడగట్టడం ద్వారా అతడి అధికారాన్ని అదుపు చేయాలన్న ఆలోచన ఆదిల్షాకు కలిగిందని ఫిరిస్తా ఉవాచ. ఆ ఉద్దేశంతోనే తన అంతరంగిక ప్రముఖులందరినీ పిలిచి ఆదిల్షా మాట్లాడాడట. ఏకంగా 60 సముద్ర రేవుల మీద వచ్చే విపరీతమైన రాబడితో మహా సంపన్నంగా, దుర్నిరీక్ష్యంగా ఉన్న విజయనగర రాజును గెలవటం ఏ ఒక్కరికీ సాధ్యం కాదు కనుక మిగతా సుల్తాన్లను సమీకరించడమే కర్తవ్యమని వారు చెప్పారట. ఇంకేం? ఈ సంగతి గోల్కొండ సుల్తానుకు రహస్యంగా కబురు పంపితే ఎగిరి గంతేశాడట. బీజాపూర్, అహ్మద్‌నగర్ సుల్తాన్ల మధ్య చిరకాల వైరాన్ని సర్దుబాటు చేసేందుకు మధ్యవర్తిత్వం నెరపటానికి నడుం కట్టి వెంటనే అహ్మద్‌నగర్‌కు దూతను పంపాడట. బహమనీ సుల్తాన్ల కాలంలో విజయనగరానికి సమఉజ్జీలుగా ఉన్నవారము కాస్తా, బహమనీ రాజ్య విచ్ఛిత్తితో బలహీనపడి కుదేలయ్యామనీ... మన బలహీనత అలుసుగా పేట్రేగుతున్న రాయల పీచమణచి మన మత ప్రాభవాన్ని నిలబెట్టుకోవాలంటే మనమందరమూ ఏకం కావాలన్న గోల్కొండ సందేశం వినగానే అహ్మద్‌నగర్ సుల్తాను సై అన్నాడు. కొత్త పొత్తును చుట్టరికంతో గట్టిపరిచేందుకు తన కుమార్తెను అలీ ఆదిల్‌కు ఇచ్చి అతడి చెల్లెలిని తన కుమారుడికి చేసుకోవటానికి అడగగానే ఒప్పుకున్నాడు. విజయనగర వినాశనాన్ని ఆకాంక్షిస్తూ రెండు పెళ్లిళ్లూ మహావైభవంగా జరిగాయి. ఉమ్మడి దాడికి రంగం సిద్ధమైంది.

ఇక కావలసింది యుద్ధానికి ఒక మిష. అప్పటిదాకా తనను పుత్ర సమానుడిలా చూసుకుంటున్న రామరాయలుతో తెగతెంపుల కోసం అలీ ఆదిల్ ముందుగా ఒక రాయబారిని విజయనగరానికి పంపి గతంలో తన నుంచి స్వాధీనపరచుకున్న జిల్లాలను తిరిగి ఇచ్చెయ్యమని అడిగాడు. రామరాయలు సహజ ధోరణిలో దూతను అవమానించి గెంటేశాడు. ఇంకేం? కారణం దొరికింది. సుల్తాన్ల చతుష్టయం యుద్ధానికి ఉపక్రమించింది. బీజాపూర్‌లోని సంకేత స్థలంలో నలుగురూ తమ తమ సేనలతో కలుసుకుని 1564 డిసెంబర్ 25న దక్షిణ దిశగా కదిలి కృష్ణానదికి చేరువలో తాళికోట అనే చిన్న పట్నం దగ్గర దండు విడిశారు.

ఈ కదలికల కబురు విజయనగరానికి వెంటనే అందింది. తమపైకి ముసల్మాన్లు దండెత్తటం, చిత్తుగా ఓడిపోవటం రెండు శతాబ్దాలలో అనేక పర్యాయాలు జరిగింది. కనుక తాజా సవాలుకు ఎవరూ ఆందోళన పడలేదు. మెడమీద కత్తి వేలాడుతున్న సంగతే మరచి ఎడ్లబండ్ల నిండా సరుకులను మోసుకుని నగరానికి వస్తూపోతూ వర్తక వాణిజ్యాలు, దైనందిన కార్యకలాపాలు యథాప్రకారం సాగాయి. జనజీవితంలో మార్పు లేకపోయినా రామరాయలు రాజ్యరక్షణను అశ్రద్ధ చేయలేదు. శత్రువుల జాడ తెలియగానే లక్ష సైన్యాన్ని, 20 వేల గుర్రాలను, 500 ఏనుగులను తీసుకునిపోయి కృష్ణానదిని దాటటానికి అనువైన అన్ని స్థలాలనూ దిగ్బంధం చెయ్యమని చిన్న తమ్ముడు తిరుమలరాయ లను పంపించాడు. అతని వెనుకే పెద్దసేనతో రెండో తమ్ముడు వెంకటాద్రిని తరలించాడు. చివరగా విజయనగర సామ్రాజ్య సైనిక శక్తినంతటినీ సమీకరించి స్వయంగా తానే కదనరంగానికి కదిలాడు. ఆంధ్ర, తమిళ, కన్నడ, మలబారు ప్రాంతాలకు చెందిన అసంఖ్యాక సైనిక దళాలు రాయల వెంట వెళ్ళాయి. కౌటో అంచనా ప్రకారం ఆరులక్షల కాల్బలం, లక్ష అశ్వాలు వాటిలో ఉన్నాయి. శత్రురాజులు నలుగురి బలగాలనూ కలిపినా అందులో సగం లేవు.

నదిని దాటి చొచ్చుకురావటానికి దక్కన్ సేనలు ఎంత ప్రయత్నం చేసినా ఎంత దూరం

వెళ్లినా కాపలా లేని చోటు ఒక్కటీ కనపడలేదు. కొన్ని రోజుల ప్రయాస తరవాత ఇలా లాభం లేదనుకుని ఈవలి ఒడ్డున కాపలా ఉన్న రాయల బలగాన్ని మాయలేడిలా కవ్వించి ఆవలికి తీసుకుపోయిన అనంతరం ముసల్మాన్ల సైన్యం రాత్రివేళ మెరుపు వేగంతో నదిని దాటేసింది. ఇందుకు రామరాయలు ఆశ్చర్యపడ్డా ఆందోళన చెందలేదు. పరిస్థితినిబట్టి రక్షణ వ్యూహం రూపొందించి పోరుకు సర్వసన్నద్ధమయ్యాడు. తెల్లవారేసరికి అతడున్న ప్రాంతానికి పదిమైళ్ల దూరంలోకి శత్రుసైన్యం వచ్చేసింది. మరునాడు 1565 జనవరి 23 మంగళవారం నాడు కృష్ణానదికి చేరువలో తాళికోట దగ్గర ఇరుసేనలూ ఢీకొని భీషణ సంగ్రామం సాగించాయి. ఒకవైపు తిరుమల రాయల బలగం, రెండోవైపు వెంకటాద్రి సైన్యం కాపుకాయగా మధ్యరంగాన్ని రామరాయలు నడిపించాడు.

అప్పటికి రామరాయలకు 96 ఏళ్లని కౌటో, 80 ఏళ్ళని బురహానే మాసిర్, 70 ఏళ్లని ఫిరిస్తా రాసిన దాంట్లో ఏది నిజమైనా అతడు ముదిమి మీద పడ్డవాడన్నంతవరకూ నిర్వివాదం. అయినా గొప్ప పరాక్రమమే చూపాడు. యుద్ధంలో మొదటి నుంచీ రాయలపక్షానిదే పైచేయిగా ఉంది. వెంకటాద్రిరాయల వీర విహారానికి ఆగలేక హుసేన్ నిజాం షా రణరంగం వదిలిపారిపోయాడు. తిరుమల రాయలు, అతని సోదరుడు రఘునాధరాయలు గోలకొండ, బీదరు సుల్తానుల నెదిరించి తురుష్క సేనను బెంబేలెత్తించారు. అదే ఘట్టంలో రఘునాథ రాయలు నేలకొరిగాడు. వెంకటాద్రి కన్నుమోయింది. ఇది చూసి రామరాయలు రెచ్చిపోయి ముస్లిం సేనలను చీల్చి చెండాడాడు. అంతలో నిజాం షా చెదిరిపోయిన సేనను కూడగట్టుకుని మళ్లీ వచ్చాడు. యుద్ధంలో నిలపలేక పారిపోదామను కుంటున్న గోల్కొండ, బీజాపూర్ సుల్తాన్లను వారించి రాగి నాణేలతో కూరిన శతఘ్నులను గురిచూసి పేల్పించి వేల మందిని చంపి విజయనగర సేనను చెదరగొట్టాడు. అదే సమయంలో రాయలపక్షంలోని మహమ్మదీయ సేనానులు ద్రోహం చేసి సుల్తాన్లవైపు కలిశారు. తమ వారనుకున్నవారే తమను నరక సాగడంతో సేనలకు దిక్కుతోచలేదు. ఆ సంకట స్థితిలో అహ్మద్‌నగర్‌కు చెందిన మదపుటేనుగు పల్లకి మీద ఉన్న రామరాయలును పడగొట్టి తొండంతో పట్టుకుంది. జరగకూడనిది జరిగింది.

ఇంకేముంది? మావటివాళ్లు రామరాయలను బంధించి హుస్సేన్ నిజాం షా దగ్గరికి తీసుకుపోయారు. అతడు వెంటనే కత్తిదూసి రాయల తల నరికి దాన్ని శూలానికి గుచ్చి అందరికీ కనపడేలా ప్రదర్శించమన్నాడు. ప్రభువు మరణించాడని తెలియగానే నిస్సత్తువ ఆవహించి ప్రాణభయంతో విజయనగర సైనికులు కాలికి బుద్ధి చెప్పారు. వారిని సమీకరించి, ప్రత్యామ్నాయ వ్యూహం రూపొందించి, మరోచోటైనా శత్రువును నిలువరించే యత్నం చేసినవాడే లేకపోయాడు. పారిపోతున్న సేనలను ముసల్మాన్లు వెంటబడి ఊచకోత కోశారు. రణరంగానికి సమీపంలో ఉన్న కృష్ణానది రక్త ప్రవాహాలతో ఎరుపెక్కింది. ఆ ఒక్కరోజే లక్ష మంది కాఫిర్లను నరికినట్టు ఫిరిస్తా అంచనా. ఊహించని విజయం తో సుల్తాన్లు ఉప్పొంగిపోయారు.

ఈ సంగతులేవీ విజయనగర వాసులకు చాలా రోజుల వరకూ తెలియదు. ప్రభువులు గొప్ప సైన్యంతో వెళ్లారు కనుక ఇంతకుముందు అనేక పర్యాయాల్లో లాగే ముస్లిం సేనలను అవలీలగా జయించి వస్తారు లెమ్మని జనం ధీమాగా ఉన్నారు. జరగకూడనిది జరిగి ఒకవేళ తమపక్షం ఓడినా తల్లడిల్లాల్సిన పనిలేదు. గతంలో మాత్రం అలా జరిగిన సందర్భాలు లేవా? ఏదో కాస్త సొమ్మునో, ఏవో కొన్ని ప్రాంతాలనో విరోధుల మొహాన పడేసి మనవారు

సంధి చేసుకోలేదా? కర్మం చాలక ఓడితే ఇప్పుడూ అలాగే జరుగుతుంది లెమ్మని ప్రజల నిశ్చింత. రణరంగంలో ఏమైనా రాజధాని నగర భద్రతకు మాత్రం ముప్పు ఉండదు. దుర్భేద్యమైన విజయనగరంలోకి ఎవరు అడుగుపెట్టగలరు? ఇన్ని లక్షల జనంతో నిండిన నగరాన్ని ఎవరు మాత్రం ఏమి చేయగలరు అని వారి భరోసా. కాని - దుర్భేద్యమైన ఆ నగరాన్నే రక్షించే దిక్కు లేకుండా పోయిందన్న చేదు నిజం వారికి తెలియదు.

ఎవరి పనులు వారు చేసుకుంటూ అంతా మామూలుగానే ఉందనుకున్న సమయంలో... ఆశ్చర్యం! యుద్ధానికి వెళ్లిన సైనికులు కొందరు మొగాలు వేలాడేసుకుని రిరిగి వచ్చారు. ఇదేమిటని అందరూ నిర్ఘాంతపోతుండగానే కీలు బొమ్మ రాజు సదాశివరాయలు, తిరుమలరాయలు, ఇతర రాజప్రముఖులు పరుగున వచ్చి రాజమహలులో దూరారు. నగర రక్షణ, ప్రజా భద్రతలను క్రీగంటయినా పట్టించుకోకుండా మోయగలిగినంత బంగారాన్ని, వజ్రాలను, ఆభరణాలను, ఖజానాలోని సంపదను 500 ఏనుగుల మీద వేసుకుని సపరివారంగా ఆదరాబాదరాగా పెనుగొండ కోటకు పరారయ్యారు.

ఇదంతా చూసి జనం తెల్లబోయారు. అప్పుడుగాని జరిగిందేమిటో వారికి అర్థం కాలేదు. ఇది మామూలు ఓటమి కాదు. ముంచుకొచ్చినది మహోపద్రవం. రక్షించాల్సిన రాజులే పరుగు లంకించుకుంటే తమను ఎవరు కాపాడాలి? ఇప్పుడు ఏమి చేయాలి? ప్రభువుల్లాగా తామూ పారిపోదామా అనుకుంటే - ఎక్కడికి? ఎలా? ఏలినవారికంటే ఏనుగులున్నాయి. తమకో? ఏ వాహనమూ లేదు. నగరంలోని ఎద్దు, బండ్లు చాలావరకు సైన్యం వెంట యుద్ధానికి పోయాయి. ఇంకా తిరిగి రాలేదు. బండ్లు లేవు కనుక కాళ్లసత్తువకొద్దీ పారిపోదామా? ఇళ్లలోని నగ, నట్రా, విలువైన సామానులు, ఆస్తిపాస్తులు ఏమి కావాలి? పరిగెత్తలేని ముసలివాళ్లు, స్త్రీలు, పిల్లల గతి ఏమికాను? అందుకే - ఏమి జరిగినాసరే అనుకుని దేవుడిమీద భారం వేసి ప్రాణాలు అరచేత పెట్టుకుని జనం గజగజలాడారు. ఏ వీధికా వీధిలో కుర్రకారే కర్రలు, కత్తులు పట్టుకుని రాత్రంతా కాపలాలు కాశారు.

ఈలోపు ప్రభుత్వమనేది లేక విజయనగరం అనాథ అయిన సంగతి ఆ ప్రాంతంలోని దొంగలకు, బందిపోట్లకు తెలిసింది. ఇంకా తెల్లవారకుండానే దొంగల ముఠాలు ఊరిమీద పడి అందింది అందినట్టు దోచుకున్నాయి. ఇళ్లు, దుకాణాలు, ఆస్తులు లూటీ చేశాయి. అడ్డొచ్చినవారిని నరికేశాయి. పగలు, రాత్రి నిర్విరామంగా చెలరేగిన బందిపోట్ల బెడదకు జనం హాహాకారాలు చేస్తూ గోడుగోడున విలపిస్తుండగానే మరునాటి ఉదయానికల్లా అసలు యమదూతలు వచ్చి పడ్డారు.

యుద్ధంలో గెలిచిన జోరులో తాగి తందనాలాడి, విందులు చేసుకుని విశ్రమించిన మీదట సుల్తాన్ల చతుష్టయం ససైన్యంగా విజయనగరంలో ప్రవేశించింది. వచ్చింది నగర వినాశానికి. వచ్చీరాగానే జాగుసేయకుండా ఆ పనిలో పడ్డారు. కనపడినవారినల్లా నరికారు. ఇళ్ళూ దుకాణాలూ గాలించి ఎవరికి దొరికిన సంపదను వారు స్వాధీనం చేసుకున్నారు. దేవాలయాలను, రాజప్రాసాదాలనూ, కళాత్మక నిర్మాణాలనూ, ప్రభుత్వ భవనాలనూ కొల్లగొట్టి నేలమట్టం చేశారు. పెద్ద దేవాలయాలు ఎంత కష్టపడ్డా కూలకపోయేసరికి మందిరాల లోపల కట్టెలు పేర్చి గడ్డికూరి నిప్పంటించారు. మంటల వేడిమికి గ్రానైట్ రాళ్లు దెబ్బతిన్నాక కూల్చివేత కార్యక్రమాన్ని కొనసాగించారు. రాతితో కట్టిన గొప్పదేవాలయాలు, వాటిలో మలచిన అపురూప శిల్పాలు, గోడలు, గోపురాలు, మంటపాలు శాయశక్తులా ధ్వంసం

చేశారు. ఏకశిలపై మలచిన సుప్రసిద్ధ నారసింహ విగ్రహాన్నీ విరగ్గొట్టారు. లక్షల జనం పాల్గొన్న ఉత్సవాలను రాజులు తిలకించేందుకు విశాల ప్రాంగణాల్లో నిర్మించిన సుందర భవనాలను, లంకంత మండపాలను, కళాత్మక వేదికలను ముక్కలు చేశారు. ఐదు నెలలపాటు నిరాఘాటంగా సాగిన ఈ భయానక విధ్వంసకాండతో విజయనగరం వెన్ను విరిగింది. ప్రపంచంలోనే సాటి లేదనిపించుకున్న మహానగరం శవాల పోగులతో, ఎటుచూసినా మంటలతో, బూడిద రాశులతో, కూలిన కుప్పలతో మహాస్మశానంలా తయారైంది. పాడుబడిన ఇళ్లలో పాముల పుట్టలు పెరిగాయి. ఒకప్పటి రాజవీధుల్లో క్రూరమృగాలు సంచరించ సాగాయి.

విధ్వంసం తరవాత రెండేళ్లకు (1567లో) విజయనగరం వెళ్ళిన ఇటాలియన్ యాత్రికుడు సీజర్ ఫ్రెడరిక్ (Caesaro Federeci)కి ఆ నగరం ఇలా కనిపించింది:

> "The citie of Bezenegar is not altogether destroyed, yet the houses stand still, but emptie, and there is dwelling in them nothing but Tygres and other wild beasts"
>
> [*Vijayanagar* **Ed.Vasundhara Filliozat** *p.325*]
>
> *(విజయనగర నగరం పూర్తిగా ధ్వంసమైతే కాలేదు. ఇంకా అక్కడ ఇళ్లున్నాయి. కాని ఖాళీగా ఉన్నాయి. వాటిలో పులులు, ఇతర క్రూరమృగాలు నివసిస్తున్నాయి.)*

మన కాలపు తాలిబన్లను తలదన్నిన పట్టుదలతో ఐదారు నెలలు కష్టపడి అంత గొప్ప మహానగరాన్ని కూల్చివేయటానికి దక్కన్ సుల్తాన్లను పురికొల్పింది కేవలం రాజకీయ కక్షలేనంటే నమ్మటం కష్టం. ఫిరిస్తా రాతలను చూసినా, సుల్తాన్ల మధ్య నడచిన సంవాదాలను గమనించినా ఉత్తర భారతంలో ఢిల్లీ సుల్తాన్లను, వారి వారసులను పట్టిన మతోన్మాద పిశాచమే వీరిని ఆవహించిందని స్పష్టం. బీజాపూర్ సుల్తానుకు అండగా అహ్మద్‌నగర్ పైకి దండెత్తినప్పుడు అక్కడా, గోలకొండ రాజ్యంలోనూ విజయనగర సైనికులు మసీదులను కూలగొట్టి, వాటిలో దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించి, ఇస్లామిక్ గ్రంథాలను, మతచిహ్నాలను అపవిత్రం చేసి, ముస్లిం స్త్రీలతో అసభ్యంగా ప్రవర్తించినందుకు ఆగ్రహించే నలుగురు సుల్తాన్లూ విజయనగరం మీద కత్తిగట్టారని ఫిరిస్తా రాశాడు. మన చరిత్రకారులూ అదే మాటను పట్టుకుని జెనొను అన్నారు. నిజానికి ఇది కల్లబొల్లి కట్టుకథ అని కనీస లోకజ్ఞానం ఉన్నవారెవరికైనా కొంచెం ఆలోచిస్తే తెలిసిపోతుంది. ఎక్కడైనా రాజునుబట్టే సైనికులు. ప్రభువు పరమతాన్ని సహించలేని మతోన్మాది అయినప్పుడే, అతడు పురికొల్పితేనే సైనికులూ శత్రు రాజ్యాల్లో అటువంటి దురాగతాలకు పాల్పడతారు. ఏకకాలంలో, వివిధ పట్నాల్లో అలాంటి దురాగతాలు జరిగాయని ఆరోపించారు కనుక అది రాజుకు తెలియకుండా స్థానిక దళవాయి ఎవడో సాగించిన దుర్మార్గమని అనుకోలేము. రెండు శతాబ్దాల పైబడి నడిచిన విజయనగర సామ్రాజ్య చరిత్ర మొత్తంలో మత దురహంకారం, పరమత ద్వేషం అనేవి ఏ వంశానికి చెందిన ఏ రాజులోనూ కాగడాతో వెదికినా కనపడదు. మనం మాట్లాడుకుంటున్న కాలంలో రాజ్యభారం వహించిన అళియ రామరాయల వరకే చూసినా, ఇస్లాం వ్యతిరేకత మచ్చుకైనా కానరాదు. మహమ్మదీయ సుల్తాన్లతో పోరాడినా మహమ్మదీయులంటే అతడికి ద్వేషం లేదు. అలాంటి ద్వేషమే ఉంటే గోల్కొండ నుంచి

పారివచ్చిన యువరాజు ఇబ్రహీంకు ఆశ్రయమిచ్చేవాడు కాదు. బీజాపూర్ ఆలీ అదిల్ పట్ల పుత్రవాత్సల్యం చూపేవాడూ కాదు. తురుష్క రాజ్యాల నుంచి పారివచ్చిన ముసల్మాన్లకు ఆశ్రయమిచ్చి వారి కోసం ప్రత్యేకంగా ఒక పేటను నిర్మించేవాడు కాదు. అధికారం తన చేతికందగానే అంతదాకా రాజాస్థానంలో, సైన్యంలో కీలక స్థానాల్లో ఉన్నవారిని మార్చి మహమ్మదీయులకు హెచ్చు ప్రాముఖ్యం ఇచ్చేవాడూ కాదు.

మతోన్మాదం ఆనవాలుగా ***Forgotten Empire*** గ్రంథం 205-06 పేజీల్లో సూయెల్ ఇచ్చిన ఈ క్రింది ఫుట్‌నోట్‌ను చిత్తగించండి.

An interesting note by Colonel Briggs is appended to his translation of these passages of Firishtah (iii 130), "It affords a striking example at once of the malignity of the Mahomedans towards this Hindoo Prince, and of the deprived taste of the times, when we see a sculptured representation of Ramraj's head, at the present day, serving as the opening of one of the sewers of the citadel of Bijapoor; and we know that the real head, annually covered with oil and red pigment has been exhibited to the pious Mahomedans of Ahmudnugger, on the anniversary of the battle, for the last two hundred and fifty years, by the descendants of the executioner, in whose hands it has remained till the present period. "This was written in 1829.

(ఫిరిస్తా రాసిన ఈ భాగాలకు తాను చేసిన అనువాదానికి అనుబంధంగా కల్నల్ బ్రిగ్స్ ఆసక్తికరమైన నోట్ ఒకటి ఇచ్చాడు: "హిందూ రాజుపట్ల మహమ్మదీయుల విద్వేషానికి, ఆకాలపు నికృష్ట అభిరుచికి కొట్టొచ్చినట్టుండే ఉదాహరణ ఏమిటంటే- బీజాపూర్ కోటలో మలమూత్రాలు పారే గొట్టానికి మూతగా రాతితో చెక్కిన రామరాజు తలను ఈనాటికీ చూడవచ్చు. అసలు తలనేమో నూనెలో, రసాయనంలో భద్రపరిచి అహ్మద్‌నగర్‌లోని ముస్లింలకు - తల నరికినవాడి వంశీకులు ఏటేటా ఆ యుద్ధ వార్షికోత్సవం నాడు కడచిన రెండొందల యాభై సంవత్సరాలుగా ప్రదర్శిస్తున్నారు." ఇది రాసింది 1829లో)

ఎందరో మహానుభావులు

మధ్యయుగంలో ముసల్మాన్లు హిందూ దేవాలయాలను కూల్చి మతద్వేషంతో హిందువులను చంపిన దృష్టాంతాలు కొల్లలు కదా? మరి... హిందువులు మసీదులను కూల్చి మతద్వేషంతో ముస్లిములను చంపిన సందర్భాలు చరిత్రలో లేవా?

బీజాపూర్ సుల్తానుకు అండగా అహ్మద్‌నగర్ మీదికి దండెత్తినప్పుడు విజయనగర సైనికులు మసీదులను కూలగొట్టి, వాటిలో దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించి, ఇస్లామిక్ మతచిహ్నాలను అపవిత్రం చేసినందువల్లే దక్కన్ సుల్తాన్లు విజయనగరాన్ని నాశనం చేశారని ఫిరిస్తా రాసింది నిజమంటే ఏఏ కారణాల వల్ల నమ్మశక్యం కాదో కిందటి వ్యాసంలో చర్చించాం. ఆ ఆరోపణ వరకూ అబద్ధమనడంలో సందేహం లేకపోయినా, అసలు అటువంటి తప్పిదాలను హిందువులెవరూ చరిత్రలో ఎన్నడూ చేయలేదా? చేసి ఉంటే అలాంటి దురాగతాలకు ఆ కాలపు హిందూ రాజులు ఎలా స్పందించారు?

ఈప్రశ్నలకు జవాబు సర్ హెచ్.ఎం.ఇలియట్ సంపుటీకరించిన ***The History of India As Told By its Own Historians*** రెండవ వాల్యూం 162-164 పేజీల్లో దొరుకుతుంది. క్రీ.శ.13వ శతాబ్దం వాడైన MUHAMMAD UFI తన ***JAMIU-L HIKAYAT***లో ఉటంకించిన రాజా జయసింగ్ కథ అది.

గుజరాత్‌ను జయసింగ్ ఏలిన కాలంలో సముద్రపు ఒడ్డున గల కాంబే నగరంలో మత కలహం చెలరేగింది. స్థానిక మసీదుపై హిందువులు కొందరు దాడిచేసి తగులబెట్టారు. 80 మంది ముసల్మాన్లనూ చంపారు. మసీదులో ఖుత్బా పఠించే ఖాతీబ్ ఆలీ అనేవాడు మూకను తప్పించుకుని నహర్వాలాకు పారిపోయి, జరిగిన సంగతి ప్రభువుల దృష్టికి తెచ్చేందుకు శతవిధాల ప్రయత్నించాడు. రాజాస్థానంలో అతణ్ణి ఎవరూ పట్టించుకోలేదు. దర్బారులోకి ప్రవేశమే దొరకలేదు. ఏమి చెయ్యాలా అని ఆలోచిస్తూండగా రాజుగారు వేటకు వెళ్లనున్నారని తెలిసింది. ఆలీ ముందే అడవికి వెళ్ళి రాజు వచ్చేదారిలో ఓ చెట్టు కింద కూర్చున్నాడు. రాజు కనపడగానే పట్టపుటేనుగును ఆపి తన మొరనంతా కవిత్వంలో వినిపించాడు. రాజు విన్నాడు. అతడికి అన్ని వసతులూ కల్పించి, ఒకచోట ఉంచి, తాను

చెప్పినప్పుడు రాజసభలో ప్రవేశపెట్టమని ఒక సేవకుడికి అప్పగించి, వేట మానుకుని రాజనగరుకు తిరిగి వచ్చాడు. రాగానే మంత్రిని పిలిపించి, మూడురోజులు అంతఃపురం నుంచి బయటికి రాను, ఈలోపు రాచకార్యాలు చక్కబెట్టమని చెప్పి ఆ రాత్రికి రాత్రే ఎవరూ చూడకుండా జవనాశ్వమెక్కి ఒకటిన్నర రోజుల్లో కాంబేకు రివ్వున చేరాడు. వర్తకుడి వేషం వేసుకుని నగరంలోకి వెళ్ళి నాలుగు వీధులూ తిరిగి అంగళ్ళ దగ్గర వాకబు చేశాడు. తనకు అందిన ఫిర్యాదు యథార్థమేనని ధ్రువపరచుకున్నాక ఒక పాత్రలో సముద్రజలాన్ని నింపుకొని మూడోనాటికల్లా నహర్వాలా తిరిగి వచ్చాడు.

మర్నాడు రాజసభ. ఆలీని పిలిపించి రాజు విచారణ సాగించాడు. ఫిర్యాదు అబద్ధమని ముసల్మాన్ల వ్యతిరేక వర్గం గట్టిగా వాదించింది. అటువంటి దుర్మార్గానికి మన రాజ్యంలో ఆస్కారమే లేదని రాజ ప్రముఖులు కొందరు దృఢంగా చెప్పారు. రాజు అంతా విని తన దగ్గర పెట్టుకున్న పాత్రను తీసి అందులోని నీటిని వారందరినీ తాగమన్నాడు. ప్రతివాడూ రూచి చూసి ఇవి సముద్రపు నీరు; తాగలేము అన్నారు.

> The Rai then told them that he had felt unable to put implicit confidence in anyone, because a difference of religion was involved in the case; He had himself therefore gone to Kambay, and having made personal enquiries as to the truth... He said that it was his duty to see that all his subjects were afforded such protection as would enable them to live in peace. He then gave orders that two leading men from each class of Infidels, Brahmins, Fire worshippers and others should be punished. He gave a lac of Baltoras to enable them to rebuild the mosque and minarets. He also granted Khatib four articles of dress. These are preserved to this day...
>
> *[Jamiu-l Hikayat;* **Elliot & Dowson** *Vol.II p. 164]*

వేరే మతానికి సంబంధించిన వ్యవహారమైనందువల్ల ఇందులో ఎవరినీ పూర్తిగా నమ్మడానికి వీల్లేదన్న ఉద్దేశంతో స్వయంగా తానే కాంబే వెళ్ళి విచారించి నిజం తెలుసుకున్నానని అప్పుడు రాజు వెల్లడించాడు. తన రాజ్యంలోని ప్రజలందరూ ప్రశాంతంగా బతకటానికి కావలసిన రక్షణను పొందేలా చూడటం తన కర్తవ్యమని ఆయన చెప్పాడు. అవిశ్వాసులు, బ్రాహ్మణులు, అగ్నిని ఆరాధించే బౌద్ధులు, తదితరుల్లో ప్రతి వర్గం నుంచి ఇద్దరేసి ముఖ్యులను శిక్షించాలని ఆజ్ఞాపించి, మసీదును, దాని గోపురాలను పునర్నిర్మించుకోవటానికి రెండు లక్షల బాల్త్రోరాల ధనాన్ని ఇచ్చాడు. ఖాతీబ్ ఆలీకి నాలుగు వస్త్రాలను బహూకరించాడు. వాటిని ఈరోజు వరకూ భద్రపరిచారు.

అన్య మతానికి సంబంధించిన అభియోగం వచ్చినప్పుడు తన మతానికి చెందిన వారు ఎవరు చెప్పేదీ నమ్మకుండా, స్వయంగా తానే నిజానిజాలను విచారించి అన్యాయానికి లోనయిన పరాయి మతస్థులకు తగిన న్యాయం చేశాడు కదా ఈ హిందూరాజు? మరి–ఇటువంటి సందర్భం ముస్లిం సుల్తానుల హయాంలో వచ్చినప్పుడు, మతద్వేషంతో

మహమ్మదీయులు హాని చేయబూనిన హిందువులకు తురక ప్రభువులు ఎటువంటి న్యాయం చేశారు?

ఫిరూజ్‌షా తుగ్లక్ (1351-1388) హయాంలో ఢిల్లీలోని ఒక బ్రాహ్మణుడు తన ఇంట్లో విగ్రహాలను పూజిస్తున్నాడని, అతడి దుర్బోధతో కొందరు ప్రముఖ ముస్లిం మహిళలు కూడా కాఫిర్లుగా మారుతున్నారని అభియోగం వచ్చింది. వెంటనే సుల్తాన్ గారు అతణ్ని పిలిపించారు. అతడి కేసును ఇస్లామిక్ న్యాయంలో నిష్ణాతులైన ముస్లిం విద్వాంసులు, మత పెద్దల ముందు పెట్టారు. అందరూ ముక్తకంఠంతో ఒకే జవాబు చెప్పారు. ఏమనంటే- ఈ విషయంలో న్యాయ నియమాలు స్పష్టంగా ఉన్నాయి. ఈ బ్రాహ్మడు ముస్లింగా మారనన్నా మారాలి. లేదా - ఇతడిని సజీవ దహనం చేయాలి- అని! వెంటనే- నిజమైన విశ్వాసం ఏదో అపరాధికి ప్రకటించి, సరైన మార్గాన్ని సూచించారు. దానికి అతడు అంగీకరించలేదు. దాంతో సుల్తాన్ గారి ఆజ్ఞప్రకారం అతడిని బతికి ఉండగానే తగులబెట్టి చంపారు. తన ఇంట్లో తాను కూచుని తాను నమ్మిన దైవాన్ని నమ్మిన రీతిలో పూజించిన నేరానికి అన్యమతస్థుడికి అగ్గి అంటించిన పుణ్యకార్యాన్ని ఒక పర్షియన్ చరిత్రకారుడు కళ్ళారా చూసి రికార్డు చేశాడు. ***History of India as told by its Own Historians*** మూడవ వాల్యూం 365 పేజీలో దీనిని చదవవచ్చు.

వేరేవారు ఎవరో రాసింది నిజమోకాదో అని సందేహించాల్సిన పని లేదు. తన రాజ్యంలో ప్రవక్త ప్రవచనానికి విరుద్ధంగా గుడులు కట్టి విగ్రహాలను పూజిస్తూ, ఇతరులనూ పెడమార్గం పట్టించజూసిన కాఫిర్ల నాయకులందరినీ చంపి, ఆ గుడులనన్నిటినీ కూల్చివేయించి, వాటిస్థానాల్లో మసీదులను లేపించాలని స్వయంగా ఫిరుజ్‌షా మహోదయుడే ***Futuhat-i-Firuz Shahi*** లో స్వహస్తాలతో రాసుకున్నాడు.

ఇది కేవలం ఒక ఫిరుజ్‌షా తుగ్లక్‌కు పట్టిన మతపైత్యంగా భావించటానికి వీలులేదు. 1296లో తనకు పిల్లనిచ్చిన చిన్నాయన జలాలుద్దీన్‌ను ఖూనీ చేసి ఢిల్లీ గద్దెనెక్కిన అల్లాఉద్దీన్ ఖిల్జీగారు హిందువులపట్ల ముస్లిం సుల్తాన్లు అనుసరించవలసిన విధానమేమిటో చాలా స్పష్టంగా నిర్దేశించాడు. మచ్చుకు ***Tarikh-i-Firozshahi*** లో పర్షియన్ చరిత్రకారుడు బరాని ఉటంకించిన ఈ సుల్తాన్-కాజీ సంవాదాన్ని చూడండి:

> Thu Sultan asked the Kazi "How are Hindus designated in the Islamic Law...?" The Kazi replied, "They are called payers of tribute and when the revenue officer demands silver from them they should, without question, and with all humility and respect, tender gold. If the officer throws dirt into their mouths, they must without reluctance open their mouths wide to receive it... To keep the Hindus in abasement is especially a religious duty because they are the most inveterate enemies of the Prophet, and because the Prophet has commanded us to slay them, plunder them and make them captive, saying "Convert them to Islam or kill them, enslave them and spoil their wealth and property..."
>
> ***[Barani, in Tarikh-i-Firozshahi,* Elliot & Dowson,** *Vol.III. p. 184]***

("ఇస్లామిక్ న్యాయంలో హిందువుల హోదాను ఎలా నిర్దేశించారు?' అని ఖాజీని సుల్తాన్ అడిగాడు. ఖాజీ ఇలా బదులిచ్చాడు. "వారు 'కప్పం కట్టేవాళ్లు. రెవిన్యూ అధికారి వారిని వెండి ఇమ్మని డిమాండు చేస్తే వారు ప్రశ్నించకుండా, అత్యంత అణకువతో గౌరవంతో బంగారం సమర్పించుకోవాలి. అధికారి వారి నోట్లో దుమ్ము పోయదలిస్తే, వారు ప్రతికూలత చూపకుండా మట్టిని స్వీకరించడానికి వీలుగా తమ నోళ్లను బాగా తెరిచి తీరాలి... హిందువులను అణచి ఉంచడం ప్రత్యేకంగా మతపరమైన కర్తవ్యం. ఎందుకంటే వారు ప్రవక్తకు చిరకాల శత్రువులు. 'వారిని ఇస్లాంలోకి మార్చండి. లేదా చంపివేయండి. బానిసలుగా చేయండి. వారి సంపదను, ఆస్తిని చెడగొట్టండి' అని చెప్పడం ద్వారా వారిని నరకమని, దోచుకోమని, బండీలను చేయమని ఆయన మనకు ఆజ్ఞాపించాడు.")

దానికి సుల్తాన్‌గారు ఏమన్నారు? "ఓ ఖాజీగారూ! మీరు అన్నీ తెలిసిన పండితులు. నేను నిరక్షరాస్యుడిని. అయినా మీకు లేని అనుభవం నాకు ఉంది. ఇస్లామిక్ న్యాయం ప్రకారం హిందువులను అణగదొక్కాల్సిందే... పేదరికంలోకి నెడితేగానీ వారు విధేయులుగా ఒదిగి ఉండరు. అందుకే నేను, బతకడానికి ఎంత అవసరమో అంత మాత్రమే వారి దగ్గర ఉండనివ్వాలనీ. నిల్వలు చేసి సంపద పెంచుకోవడానికి వారిని అనుమతించరాదని ఉత్తర్వులిచ్చాను" (పేజీ 185).

ఈ ధర్మనిర్ణయంలో భాగంగానే తన రాజ్యంలో హిందువులెవరూ గుర్రం ఎక్కకూడదని, ఆయుధాలు ధరించరాదని, నాణ్యమైన వస్త్రాలు ధరించరాదని, తమల పాకులు నమలరాదని, ఇంట్లో వెండి, బంగారం, ఆభరణాలు ఏవీ ఉంచుకోరాదని ఆ సుల్తాన్ ఆంక్షలు పెట్టాడు. వాటిని అతిక్రమించినా, కట్టాల్సిన సుంకం కట్టకపోయినా తన్నులు, గొలుసులతో నిర్బంధాలు, క్రూరమైన శిక్షలు తప్పవు.

అంతకుముందు మహమ్మద్ ఘోరీ పనుపున దేశంలో చెలరేగిన కుతుబుద్దీన్ హయాంలో 1194 సంవత్సరం "the royal army proceeded towards Benares and here they destroyed nearly one thousand temples and raised mosques on their foundations" *(సైన్యం వారణాసి వైపు వెళ్ళి అక్కడు సుమారు వెయ్యి దేవాలయాలను ధ్వంసం చేసి వాటి పునాదులపై మసీదులను కట్టించారు)* అని Hasan Nizami తన ***Taju-l Ma-Asir*** లో రాశాడు.

[Elliot & Dowson & D *Vol.II p. 223***]**

పరమత సహిష్ణుత విషయం ఒకటే కాదు. సాంప్రదాయికమైన భారతీయ విలువలకు, ఆలోచనా రీతికీ ఎనిమిది శతాబ్దాల పర్యంతం భారతదేశాన్ని చెరబట్టి చికాకు పరిచిన విదేశీయుల వైఖరికీ మధ్య ఏనుగుకూ పురుగుకూ ఉన్నంత వ్యత్యాసం ఉంది.

మళ్ళీ ఈ వ్యాసంలో మొదట పేర్కొన్న మహమ్మద్ ఉఫీ దగ్గరికి వద్దాం. తన ***Jamiu-l Hikayat*** లో అతడు ఇంకో కథను చెప్పాడు. ఒకసారి కనౌజ్ మీదికి శత్రురాజు పెద్ద సైన్యంతో దండెత్తి వచ్చాడట. అతడి సైనిక బలం ధాటికి తాను తట్టుకుని గెలవగలనన్న ఆశ ఈ రాజుకు లేకపోయింది. ఏమి చేద్దామని మంత్రుల్ని సలహా అడిగాడు. వారు చెప్పింది నచ్చలేదు. ఒక మంత్రి మాత్రం రహస్యంగా రాజుకు ఒక ఉపాయం చెప్పాడు.

'అయ్యా! నా ముక్కు చెవులు చెక్కించి నన్ను రాజ్యం నుంచి బహిష్కరించండి. తరవాత

సంగతి నేను చూసుకుంటాను' – అని రాజు అదే పనిచేశాడు. వికృతమైన మొహంతో మంత్రి ఏడ్చుకుంటూ వెళ్ళి వైరి సైన్యం వచ్చే దారిలో కాచుకుని కూచున్నాడు. శత్రురాజు కనపడగానే తన గోడు వినిపించి 'నేను మీ మనిషినన్న అనుమానంతోటే మా రాజు నాకు ఇంత క్రూరమైన శిక్ష వేశాడు. ప్రతీకారం కోసం నా గుండె రగిలిపోతున్నది. నేను మీకు సాయం చేస్తాను. అనుమతించండి' అని వేడుకున్నాడు. ఇంత దారుణమైన శిక్షకు తనను గురిచేసిన రాజుమీద ఎవడికి మాత్రం విశ్వాసం ఉంటుంది లెమ్మన్న భావంతో ఆవతలి రాజు సరేనన్నాడు.

"మనం ఉన్నచోటు నుంచి మా నగరానికి ఎడారిగుండా దగ్గరి దారి ఉంది. పదకొండు రోజుల ప్రయాణం. నాకు తప్ప మరెవరికీ ఆ రహస్య మార్గం తెలియదు. దాని వెంట మిమ్మల్ని తీసుకుపోయి శీఘ్రంగా చేరుస్తాను" అన్నాడు మంత్రి. శత్రురాజు సంతోషపడ్డాడు. ఎడారిలో ఏమీ దొరకదు కనుక పదకొండు రోజులకు పరిపడా తిండి, నీళ్లు సమకూర్చుకుని అంతా కదిలారు. 12వ రోజుకల్లా తెచ్చుకున్న నీరు అయిపోయింది. దాహంతో గొంతు లెండుతున్నాయి. ఎటు చూసినా ఎడారి. గమ్యం జాడలేదు. మార్గదర్శకుడైన మంత్రిని పిలిచి ఇదేమిటయ్యా అని రాజు అడిగాడు.

"అయ్యా! ఇదంతా మా ప్రభువుగారి కోసమే చేశాను. ఇప్పుడు మీరు సరిగ్గా ఎడారి మధ్యలో ఉన్నారు. ఇంకో పదకొండు రోజులు నడిస్తేగానీ ఏ దిక్కునా మీకు నీరు దొరకదు. నా రాజకార్యం పూర్తయింది ఇక నన్ను మీరు ఏమి చేసినా సరే" అని మంత్రి చేతులు జోడించాడు. సేనలో కలకలం లేచింది. అందరికీ భయం పట్టుకుంది. ఏమి చేయాలో తోచక రాజు గుర్రమెక్కి అన్ని వైపులకూ శరవేగంతో స్వారీ చేశాడు. పోగా పోగా ఒకచోట గుట్టమీద పచ్చని మొక్కలు కనిపించాయి. అక్కడ నేలను తవ్వించాడు. ముప్పై అడుగులు తవ్వేసరికి స్వచ్ఛమైన జలధార పొంగింది. అందరికీ ప్రాణం లేచి వచ్చింది. నీళ్లు తాగి సేదతీరాక అక్కడే డేరాలు వేసి విశ్రమించారు.

గండం గడిచింది. ఇక తమను మోసగించి గండంలో నెట్టిన వాడిని ఏమి చేయాలన్న ప్రశ్న ఉత్పన్నమైంది. ఏం చేద్దాం అన్నాడు రాజు. వాణ్ణి చిత్రహింసతో నరికి ముక్కలు చేయాల్సిందేనన్నారు పెద్దలందరూ. చిత్రవధకు ఒక్కొక్కరూ ఒక్కో పద్ధతి సూచించారు కూడా. రాజు మాత్రం ఒప్పుకోలేదు. "అతడికి కాసిని నీళ్లు తాగించి వదిలెయ్యండి" అన్నాడు.

విన్నవారికి మతులు పోయాయి. పగవాడి మీద ఇదేమి దయ అన్నట్టు ప్రశ్నార్థకంగా చూశారు. రాజు చిరునవ్వు నవ్వి "ఇదంతా అతడు తన కోసం చెయ్యలేదు. తన ప్రభువు మీద భక్తితోటే బాధ కోర్చి మొహం చెక్కించుకుని ప్రాణాలను పణం పెట్టి ఈ సాహసానికి పాల్పడ్డాడు. ఇందులో అతడి తప్పులేదు. మన అదృష్టం కొద్దీ అతడి పథకం భగ్నమైంది. అతడిని పోనివ్వండి" అన్నాడు.

[Muhammad Ufi in E & D Vol.II p. 170-171]

సరిగ్గా ఇదే పథకాన్ని సోమనాథ్ నుంచి తిరుగు ప్రయాణంలో గజనీ మహమ్మద్ మీదా కొందరు హిందువులు ప్రయోగించారు. ఆ వైనాన్నీ మహమ్మద్ ఉఫీయే రాశాడు. ఆ కథాక్రమం ఇది: సోమనాథ్‌ను ధ్వంసం చేసి అపార సంపదను తరలించుకుపోతున్న సుల్తాన్ మహమ్మద్‌కు శాస్తి చేయాలన్న ఉద్దేశంతో కొందరు హిందువులు అతడు తిరిగి వచ్చే దారిలో కాచుకుని ఉన్నారు. దగ్గరి దారి చూపిస్తామని నమ్మించి మూడు రోజులు నడిపించి నీటిబొట్టు లేని

ఎడారిలోకి తీసుకుపోయారు. ఎంత దూరం వెళ్ళినా నీరు, గడ్డి కనపడకపోయేసరికి సుల్తాన్‌గారు తెల్లబోయి ఇదేమిరా అని 'గైడ్ల'ను అడిగారు. వారేమో 'మమ్మల్ని ఈ పనికి మా రాజుగారే నియమించారు. ఇప్పుడు మీరు ముందుకుపోతే సముద్రంలో పడతారు. వెనక్కిపోతే హిందూ సైన్యానికి చిక్కుతారు. మీలో ఒక్కరూ ప్రాణాలతో తప్పించుకోలేదు. మా పని పూర్తయింది. ఇక మమ్మల్ని మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి' అని నిర్భయంగా చెప్పారు.

ఈ సంభాషణ నడుస్తూండగానే నీటిలో తిరుగాడే పక్షుల గుంపు ఆకాశంలో కనిపించింది. ఆ పక్షులు ఉన్నాయంటే చుట్టుపట్ల నీరు ఎక్కడో ఉండే ఉంటుందని వెదకమని సుల్తాన్ ఆజ్ఞాపించాడు. పక్షులదారినే వెళ్ళగా వెళ్ళగా భటులకు తియ్యని నీటి వనరు కనిపించింది. గండం గడిచింది. అయితే వెనుకటి కథలోని హిందూ రాజులా గజనీ మహమ్మద్ తనను మోసగించిన వారి స్వామిభక్తికి సంతోషించి తిండి పెట్టి వదిలెయ్యలేదు. అక్కడికక్కడే కత్తిదూసి వారిని నరికి అవతల పారేశాడు. (అతడి స్థానంలో ఎవరున్నా సాధారణంగా అదే పనిచేస్తారనుకోండి.) ఈ వివరాలు ***Elliot & Dowson*** మూడవ సంపుటిలోని 192వ పేజీలో ఉన్నాయి.

1211 సంవత్సరం ప్రాంతంలో ఢిల్లీలో నివసించిన ముమహ్మద్ ఉఫీ రాసిందే ఇంకో ముచ్చట. నహర్వాలాలో గురుపాల్ అని ఇంకో రాజు ఉండేవాడట. తొలి దశలో అతడు బీచ్చగాడు. అదృష్టం పండి రాజయ్యాడు. గద్దెనెక్కినా తన పూర్వ జీవితాన్ని, గతంలో తాను పడిన కష్టాలను మరవకుండా, తల వాయకుండా మెలగి న్యాయబద్ధంగా పరిపాలిస్తున్నాడు. అలాంటివాడే ఓ రోజు ఏనుగు మీద గ్రామాంతరం వెళుతూండగా బట్టలు ఉతకటానికి వెళుతున్న అప్సరసలాంటి రజక స్త్రీని చూసి మోహంలో పడ్డాడు. ఎలాగైనా సరే ఆమెను అనుభవించాలన్న తమకంలో ఏనుగును ఆమె చెంతకు పోనిస్తుండగా అతడిలో వివేకం మేలుకొంది. ఇంద్రియాలకు వివశుడై తాను చేయబోయిన తప్పిదాన్ని గుర్తించి పశ్చాత్తాపంతో రగిలిపోయాడు. తన మీద తనకే అసహ్యం వేయగా వాడిన మొగంతో తన నగరుకు తిరిగి వెళ్ళి బ్రాహ్మణ పండితులను పిలిపించి అగ్నిప్రవేశం చేస్తాను - చితిని పేర్పించమన్నాడు. ఆత్మాహుతి చేసుకోవలసినంత పాపకార్యం మీరు ఏమి చేశారని బ్రాహ్మణులు అడిగారు. రాజు చెప్పాడు. అంతా విని "అవును. మీరు చేసింది మహాపాపమే. నిప్పుల్లో దూకినా ప్రాయశ్చితం కానంతటి అకార్యమది. రాజు అయిన వాడే ఇంద్రియాలను అదుపు చేసుకోలేక అందంగా కనిపించిన స్త్రీనల్లా వాంఛిస్తే ఇక నారీ జనానికి రక్షణ ఉండదు. మీరు అగ్నిప్రవేశం చేయాలనుకోవడం సముచితమే. అలాగే కానివ్వండి" అన్నారు బ్రాహ్మణులు.

ఇంకేం? కట్టెలు తెప్పించారు. చితి పేర్పించారు. అగ్నిని కూడా అంటించారు. ఉవ్వెత్తున మంటలు ఎగశాయి. అందరికీ నమస్కరించి రాజు అగ్నిజ్వాలల్లోకి ఉరకబోతూండగా ఆఖరి క్షణంలో పండితులు వారించారు. "రాజా! తప్పు చేసింది నీ శరీరం కాదు... మనసు! శరీరంతో పాపం చేసి ఉంటే నీవు తప్పక సజీవ దహనం కావలసిందే. కాని మనసు చేసిన దానికి శరీరాన్ని శిక్షించటం న్యాయం కాదు. నీ మనసు ఈ వరకే శిక్షించబడి అగ్నిపునీతమైంది. కనుక ప్రాయశ్చిత్తం పూర్తయింది" అని చెప్పి సాదరంగా లేవదీశారు.

[JAMIU-L HIKAYAT, **Elliot & Dowson,** *Vol.III p. 169-70]*

ఈ కథ ఈ రోజు చదివితే మనకు విడ్డూరంగా తోచవచ్చు. ఒక స్త్రీ మీద ఒకింత

మరులుగొన్న నేరానికే అంతగా ఇదైపోవాలా? మహామహా ఋషులే ఒక బలహీన క్షణంలో ఇంద్రియాలకు దాసులు కాలేదా? ఏ తప్పూ చేయకపోయినా పాపపు ఆలోచన కలిగినందుకే దహించుకుపోయి చితికి కట్టెలు పేర్పించాలా? - అని రాజుగారి అతి సున్నితత్వానికి ఆశ్చర్యం కలగవచ్చు. సత్యకాలపు ప్రమాణాలు ఈ కలికాలానికి ఎంతవరకు అనుసరణీయమన్న సంగతి అలా ఉంచితే - రాజయిన వాడే ఇంద్రియాలను నిగ్రహించుకోలేకపోతే రాజ్యంలో ఏ కులస్త్రీకీ రక్షణ ఉండదనీ, అటువంటి కాముకత్వాన్ని ప్రభువుల్లో లేశమైనా పొడసూపరాదనీ ఆ కాలపు పండితులు ధ్రువపరచిన ధర్మనిర్ణయం విజ్ఞులందరూ సావధానంగా పరిశీలించదగ్గది. అటువంటి కట్టుబాటు ఏదీలేక, ఆత్మనిగ్రహం లోపించి చిత్తకార్తె కుక్కలా రాజు, అబలల వెంట పడితే ఏమవుతుందనడానికి చరిత్రలో వేనవేల దృష్టాంతాలు.

ఉదాహరణకు 1469 నుంచి 1500 దాకా మాళవ రాజ్యాన్నేలిన సుల్తాన్ ఘియాసుద్దీన్ సంగతే తీసుకోండి. అతడి నికృష్ట చరిత్రను మొగల్ చక్రవర్తి జహంగీరే చెప్పాలి! WAKIAT-I JAHANGIRI లో జహంగీర్ రాసిన ప్రకారం - ఘియాసుద్దీన్ 48వ ఏట గద్దెనెక్కాడు. అధికారం అందీ అందగానే రాజప్రముఖులను పిలిచి, మా తండ్రి చేతికింద ముప్పై ఏళ్లు సేనలను నడిపించి నానా అవస్థలు పడ్డాను; ఇంకా యుద్ధాలు చేసి రాజ్యాలు జయించే ఓపిక నాకు లేదు. శేష జీవితాన్ని సుఖభోగాల్లో సరదాగా గడపదలిచాను అని సెలవిచ్చాడట. అన్నట్టే ఘియాసుద్దీన్ సదరుగా కనిపించిన స్త్రీనల్లా చేపట్టి 15 వేల కాంతలతో అంతఃపురాన్ని నింపాడట. తాను భోగించే స్త్రీల కోసం ఆ మహానుభావుడు ప్రత్యేకంగా ఒక పట్టణాన్నే నిర్మించాడట. అక్కడ అంతా ఆడవారే. మగ పురుగు ఎక్కడా కనిపించేదికాదు. గవర్నరు, జడ్జి, మేజిస్ట్రేటు, పోలీసు కొత్వాలు వగైరా పదవులన్నిటినీ స్త్రీలే నిర్వహించేవారు. ఫలానా చోట అందమైన పిల్ల ఉన్నదని కబురందిందా ఆమెను లాక్కొచ్చి అనుభవించేదాకా సుల్తాన్‌గారికి నిద్రపట్టేది కాదు. రాజ్యం చేసిన 32 ఏళ్లూ అమ్మాయిలతో కలిసి హాయిగా లేళ్లవనంలో వేట ఆడుతూ, విందు విలాసాలలో, నానారకాల కామకేళిలో నిరంతరం మునిగి తేలేవాడట.

[***Wakiat-i Jahangiri*, Elliot & Dowson,** *Vol. VI p. 349-50*]

ప్రతికథకూ ముగింపు తప్పనట్టు ఘియాసుద్దీన్ కామాయణం కూడా చివరికి విషాదాంతమైంది. తండ్రి ఎంతకూ చావక, తనకు రాజ్యమేలే ఛాన్సు రాకపోయేసరికి ఘియాసుద్దీన్ సుపుత్రుడు నసీరుద్దీన్ విసిగిపోయి స్వయంగా తానే తండ్రిగారిని పై లోకానికి పంపదలిచాడు. రెండుసార్లు విషప్రయోగం చేయజూసినా ఫలించలేదు. దాంతో మూడోమారు స్వయంగా తానే షర్బత్‌లో విషం కలిపి 80 ఏళ్ల తండ్రి దగ్గరికి పట్టుకుపోయి నాన్నగారూ దీన్ని తాగి హాయిగా చచ్చిపోండి అన్నాడట. గత్యంతరం లేక ఘియాసుద్దీన్ దేవుణ్ణి ప్రార్థించి కొడుకు చేతి తీర్థం తాగి బాల్చీ తన్నేశాదని జహంగీర్ కళ్లకు కట్టినట్టు వర్ణించాడు.

తాను కన్నువేసిన కాంతనల్లా చెరబట్టో చేపట్టో వేల సంఖ్యలో జనానాను నింపటంలో అక్బర్ చక్రవర్తే మొనగాదని ఇంతదాకా అనుకున్నాం. జహంగీర్ చెప్పింది చూస్తే అమ్మాయిల పిచ్చిలో మాళవ సుల్తాన్ ఘియాసుద్దీన్ ది గ్రేట్ ముందు అక్బర్ ది గ్రేట్ కూడా దిగదుడుపే.

వెయ్యేళ్ళ మధ్యయుగ చరిత్రలో ఇలా ఎందరో మహానుభావులు.

శాడిస్ట్ జహంగీర్

మళ్ళీ ఇటువంటి తిరుగుబాట్లకు వేరెవరూ సాహసించకుండా - కనౌజ్‌ను రక్షిస్తూ నేలకొరిగిన పదివేల మంది శవాలను ఆ చుట్టుపట్ల ప్రధాన రహదారుల వెంబడి ఉన్న చెట్లకు తలకిందులుగా వేలాడదీయమని నేను ఆజ్ఞాపించాను. ఇలా తరచుగా ఎంత మందిని భయానకంగా శిక్షించినా హిందుస్తాన్‌లో ఎదురు తిరిగి హింసాత్మక చర్యలకు పాల్పడేవారి సంఖ్య ఏ మాత్రం తగ్గడం లేదు. మా తండ్రి హయాంలోనూ, నా హయాంలోనూ యుద్ధంలో నైతేనేమి, మరణశిక్షల రూపంలోనేమి ప్రతి రాష్ట్రంలోనూ ఐదారు లక్షల మంది తిరుగుబాటుదారులను చంపివేస్తున్నా ప్రతిసారీ ఏదో ఒక మూల ఎవడో ఒక నికృష్టుడు లేచి తిరుగుబాటు బావుటా ఎగరేస్తూనే ఉన్నాడు. పర్యవసానంగా హిందుస్తాన్‌లో సంపూర్ణ ప్రశాంతి అనేది ఎప్పుడూ లేదు.

[Major Price's *Memoirs of Jahangueir, P. 128*]

సౌమ్యుడు, సంస్కారి, కళాప్రియుడు, గొప్ప రసజ్ఞుడు, ప్రజారంజకంగా పరిపాలించిన ప్రభువు – అని మన దేశవాళీ చరిత్రకారులు చాలా మంది కొనియాడే జహంగీర్ పాదుషా తన సుప్రసిద్ధ జ్ఞాపకాల్లో స్వయంగా రాసుకున్న పలుకులివి. బాబర్‌గారి కాలంలో మొదట యుద్ధాలు, రక్తపాతాలు అనేకం జరిగినా, రాజ్యవిస్తరణ కోసం అనంతరం అక్బర్ కొన్ని యుద్ధాలు చేయవలసి వచ్చినా మొగల్ సామ్రాజ్యం విస్తరించి స్థిరపడిన దరిమిలా పరిస్థితి మొత్తంమీద ప్రశాంతంగానే ఉన్నదని మనవారి ఊహ. సింహాసనం కోసం రాకుమారుల తిరుగుబాట్లు, దర్బారు కుట్రలు ఎన్ని నడిచినప్పటికీ సామాన్య ప్రజలకు సంబంధించినంతవరకూ అలజడులు ఏమీ లేక జనజీవనం క్రమపద్ధతిలో సాఫీగా నడిచిందని చాలా చరిత్ర గ్రంథాలు నమ్మకంగా చెబుతూంటాయి. అదిగో సరిగ్గా ఆ కాలంలోనే తన పితృపాదులు అక్బర్ ది గ్రేట్‌గారు, అనంతరం తాను - ఎన్ని లక్షల మంది తిరుగుబాటుదారులను నరికిపోగులు పెట్టినా హిందుస్తాన్ అంతటా తిరుగుబాట్లు ఆగకుండా చెలరేగుతూనే ఉన్నాయని జహంగీర్ చక్రవర్తి నెత్తి కొట్టుకుని చెప్పాడు. మన 'సెక్యులర్'

మేధావులకు మొగల్ ప్రభువులు ఎంత ముద్దొచ్చినా నాటి దేశ ప్రజలకు సంబంధించినంతవరకూ ఆ రాజుల పట్ల భ్రమలేమీ లేవని, మొగలులు మెరమెచ్చులకు వారు ఏనాడూ మోసపోలేదని చెప్పటానికి ఈ మాటలను మించిన సాక్ష్యం ఏమికావాలి?

జహంగీర్ హయాంలో భారతదేశ భద్రతా పరిస్థితి గురించి విదేశీయుడు విలియం హాకిన్స్ ఇలా చెప్పాడు:

> "The country is now so full of thieves and outlaws that one can hardly stir out of doors in any part of his dominions without a guard, as almost the whole people are in rebellion"
>
> **/Elliot & Dowson** *Vol. VI p. 495]*
>
> *(దేశంలో దొంగలు, నేరస్థుల బెడత ఎంత తీవ్రంగా ఉందంటే అంగరక్షకుడు లేకుండా సామ్రాజ్యంలోని ఏ భాగంలోనూ ఎవరూ ఇల్లు కదలలేరు. మొత్తం ప్రజలందరూ తిరుగుబాటు చేస్తున్నారు.)*

ఏమైనా అక్బర్ అదృష్టవంతుడు. తనకు మంచి పేరును తెచ్చే కొడుకుని కన్నాడు. అంటే – కుమారుడు గొప్ప పనులు చేసి తండ్రి కీర్తిని ఇనుమడింపజేశాడని కాదు. తండ్రిని మించిన దుర్మార్గాలకు పాల్పడటం ద్వారా ఇతడి కంటే తండ్రే నయమని జనం చేత అనిపించగలగడమే జహంగీర్ ప్రత్యేకత. కానిపనులు చేయడంలో అతడిది అందెవేసిన చేయి. మనుషులను పరిపరివిధాల చిత్రహింసలు పెట్టి పైశాచికానందం అనుభవించడంలో అతడిది విలక్షణ శైలి. మచ్చుకు కొన్ని లీలలను అతడి మాటల్లోనే అవధరించండి:

(తన మీద తిరుగుబాటు చేసి సైన్యాన్ని కూడగట్టి లాహోర్ సమీపంలో హోరా హోరీ పోరాడి ఓడిపోయిన కుమారుడు ఖుస్రావ్ గురించి....)

> ***'ఖుస్రావ్ చేతులు కట్టేసి, కాళ్లకు గొలుసువేసి నా దగ్గరికి రప్పించాను. తిరుగుబాటు లో అతడికి ముఖ్య సహాయకులైన హుస్సేన్‌బేగ్, అబ్దుల్ అజీజ్‌లను అతడికి అటూ ఇటూ నిలబెట్టమన్నాను. వారి మధ్య ఖుస్రావ్ వణికిపోతూ ఏడవసాగాడు. నేను ఖుస్రావ్‌ను నిర్బంధించమని చెప్పి, ఆ ఇద్దరు దుండగులనూ ఒకడిని ఎద్దు చర్మంలోనూ, ఒకడిని గాడిద చర్మంలోనూ కుక్కి కుట్టేసి, ఆ మూటలను గాడిదల మీద వేసి ఊరంతా ఊరేగిం చమన్నాను. ఎద్దు చర్మం త్వరగా ఎండిపోతుంది. కనుక హుస్సేన్ బేగ్ ఆ రోజే చచ్చాడు. మర్నాడు కుట్లు విప్పి చూసేసరికి రెండోవాడు ఒళ్ళంతా పురుగులు పట్టినా బతికే ఉన్నాడు. మళ్లీ ఇలాంటి తిరుగుబాట్లు ఎవరూ చేయకుండా గుణపాఠంగా నేను విడిది చేసిన కోట నుంచి లాహోర్ నగరం దాకా రహదారికి ఇరువైపులా బద్దెలు కొట్టించి ఖుస్రావ్ అనుచరులందరికీ మేకులు కొట్టి కొరత వేయించాను. ఖుస్రావ్‌ను పరమ చండాలంగా ఉన్న ఏనుగు మీద కూచోబెట్టి తీసుకువెళ్లి మరణయాతనతో విలవిలలాడుతున్న ఒక్కొక్కడి పేరునూ వినిపించి ఆనందించాను.'***

తిరుగుబాటుకు పాల్పడితేనే కాదు. తిరుగుబాటుదారులను కీగంట చూసినా జహంగీర్ క్రోధాగ్నికి ఆహుతి కావలసిందే. అలా అన్యాయంగా బలి అయిన వారిలో సిక్కులకు పరమపూజ్యుడైన గురువు అర్జున్‌దేవ్ ఒకడు. ఆయన చేసిన అపరాధమల్లా తన సన్నిధికి

వచ్చిన ఖుస్రావ్‌ను ఆశీర్వదించి నుదుట తిలకం దిద్ది 5 వేల రూపాయలు కానుకగా ఇవ్వడమే. దానినే రాజద్రోహికి సహాయం చేసిన మహాపరాధంగా ఎంచి చక్రవర్తి రెండు లక్షల రూపాయల జుల్మానా విధించాడు. తాను ఏ తప్పూ చేయలేదు. కనుక జుల్మానా కట్టేది లేదని అర్జున్‌దేవ్ నిరాకరించాడు.. జహంగీర్ మండిపడి లక్షలాది సిక్కులు భక్తితో కొలిచే ఆ మాన్య మతగురువు నివాసాన్ని, ఆశ్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుని మామూలు క్రిమినల్‌లా గొలుసులతో కట్టి తన దగ్గరికి ఈడ్చుకు రమ్మన్నాడు. సిక్కు మత పవిత్ర గ్రంథంలో తనకు అభ్యంతరకరంగా తోచిన కొన్ని స్తుతులను తొలగించమని ఆజ్ఞాపించి, అందుకు ఆయన నిరాకరించేసరికి రావి నదీ తీరాన మండుటెండులో, పెనం మీద కూచోబెట్టి కింద నిప్పంటించి... కాలే ఇసుకను, సలసల మరిగించిన నీటిని బానలతో కుమ్మరించి క్రూరంగా చంపించాడు. సిక్కు మత చరిత్రలో అది పెద్ద మలుపు. మొగల్ సామ్రాజ్యపు తొలి రోజుల్లో గురునానక్ స్థాపించినది మొదలుకుని శాంతియుతంగా సాగిన మత సంస్కరణోద్యమం ఈ ఘోర దురాగతం వల్లే మిలిటెంటు రూపం దాల్చి గురు హరగోవింద్‌సింగ్ నేతృత్వంలో ఆయుధాలు పట్టి ప్రచండ పోరాట శక్తిగా ఎదిగింది. ఈ అత్యాచారంతోనే మొగలులకు సిక్కులకు మధ్య సంబంధాలు చెడి చివరికి అది మొగలు సామ్రాజ్య పతనానికి దారి తీసింది. మన సూడో సెక్యులర్ చరిత్రకారులు చాలామంది అర్జున్‌దేవ్‌ను, జహంగీర్ చంపడానికి రాజకీయ కారణాలే తప్ప మత ద్వేషం హేతువు కాదని నమ్మకంగా చెబుతారు. మొగలుల సెక్యులర్ శీలాన్ని నిలబెట్టటానికి పాపం వారు ఎంత కష్టపడ్డా ప్రయోజనం లేదు. ఎందుకంటే అర్జున్‌దేవ్ పట్ల తన వైఖరి ఏమిటో స్వయంగా జహంగీరే ఇలా విడమర్చి చెప్పాడు.

> In Gobindwal, which is on the river Beas, there was a Hindu named Arjun, in the garments of sainthood and sanctity, so much so that he had captivated many of the Hindus, and even of the ignorant and foolish followers of Islam... They called him Guru and from all sides, stupid people crowded to worship and manifest complete faith in him. For three or four generations they had kept this shop warm. Many times it had occured to me to put a stop to this vain affair or to bring him into the assembly of the people of Islam.
>
> ***[Tuzuki-i Jahangiri* - Rogers & Beveridge, *Vol.I p.72]***
>
> *(బియాస్ నదీ తీరాన గోవింద్‌వల్ గ్రామంలో అర్జున్ అనే హిందువు పూజ్య సాధువులా వేషం వేసుకుని పవిత్రుడిగా చలామణీ అవుతూ చాలా మంది హిందువులను, మూర్ఖులైన కొందరు ముసల్మానులను కూడా పట్టుకున్నాడు... వారు అతడిని గురువు అంటారు. అన్నివైపుల నుంచి బుద్ధిహీనులైన జనం గుంపులుగా వచ్చి పూజించి అతడి పట్ల సంపూర్ణ విశ్వాసం కనపరుస్తారు. మూడు నాలుగు తరాలుగా ఈ దుకాణం నడుస్తున్నది. ఈ నిరర్థకమైన దంబాచారాన్ని ఆపడమో, అతణ్ణి ఇస్లాంలోకి తేవడమో చేయాలని నాకు చాలాసార్లు అనిపించేది.)*

అనంతర కాలంలో గురుతేజ్ బహాదూర్‌ను చిత్రవధ చేసిన మనవడు ఔరంగజేబునూ...

అర్జున్‌సింగ్‌ను కిరాతకంగా చంపించిన తాత జహంగీర్‌నూ ప్రధానంగా పురికొల్పినది ఒకే విధమైన మతద్వేషమనడానికి ఇంతకంటే వేరే సాక్ష్యం అక్కర్లేదు. ఈ మతద్వేషంతోటే అహ్మదాబాద్‌లో జైన మతానికి చెందిన ఒకానొక శాఖకు చెందిన వారు కళాత్మకంగా కట్టుకున్న గొప్ప దేవాలయాలను కూల్చి, వాటిలోని విగ్రహాలను జహంగీర్ అపవిత్రం చేయించాడు. ఆ పుణ్యకార్యాన్ని INTIKHAB-I JAHANGIRI ఇలా వివరించింది.

> The Emperor Jahangir ordered them to be banished from the country, and their temples to be demolished. Their idol was thrown down on the uppermost step of the mosque, that it might be trodden upon by those who came to say their daily prayers there. By this order of the Emperor, the infidels were exceedingly disgraced and Islam exalted.
>
> **[Elliot & Dowson,** *Vol. VI. p. 451]*
>
> *(జహంగీర్ చక్రవర్తి వారందరినీ దేశం నుంచి వెళ్లగొట్టి వారి దేవాలయాలను కూల్చి వేయాలని ఆజ్ఞాపించాడు. వారు ఆరాధించే విగ్రహాన్ని మసీదులో పైమెట్టు మీద... రోజూ ప్రార్థనలకు వచ్చేవారు కాళ్లతో తొక్కేలా పడవేయించారు. చక్రవర్తిగారి ఈ ఆజ్ఞ మూలంగా అవిశ్వాసులకు మహాపరాభవం జరిగి ఇస్లాం ఔన్నత్యం ఇనుమడించింది.)*

ఇక్కడో సంగతి గమనించాలి. జహంగీర్ హిందువులపట్ల మతద్వేషం చూపాడు కాబట్టి అతడికి ఇస్లాం పట్ల ఎనలేని మతాభిమానం ఉన్నదని అనుకోకూడదు. ప్రధానంగా అతడిది తాగుబోతు మతం! మద్యాభిమానమే తప్ప మతాభిమానం అతడికి లేదు. మతాచారాలను, మత పెద్దలను అగౌరవపరచడంలో అతడికి స్వమతం, పరమతమన్న తేడాలు లేవు. మచ్చుకు రెండు ఉదాహరణలు:

నెల పొడవునా మహమ్మదీయులు నిష్ఠగా పాటించే ఉపవాస దీక్షను చక్రవర్తి గేలి చేస్తుండేవాడు. ఆ మతానికి చెందిన నిష్ఠాగరిష్ఠులు కొందరిని తన మందిరానికి పిలిపించి తనతో పార్టీలో కూచుని మందు, మాంసం ఆరగించమనేవాడు. కొన్ని రకాల మాంసాలను అల్‌ఖురాన్ నిషేధించిందని చెప్పి ఖాజీలు, ఇమాంలు మందలించినా వినేవాడు కాదు. ఒకసారి వారి అభ్యంతరాలకు విసుగుపుట్టి అన్ని రకాల మద్యాలనూ, మాంసాలనూ తీసుకోవడానికి ఏ మతం అనుమతిస్తుందని అడిగాడు. క్రైస్తవ మతం మాత్రమే అని జవాబు వచ్చింది. వెంటనే అతడు "అలా అయితే మనమందరం క్రిస్టియన్లు కావలసిందే. దర్జీలను పిలిపించండి. మనం ధరించిన అంగరఖాలను కోట్లుగా మార్చమనండి. మన తలపాగాలను హ్యాట్లు చేయమనండి" అన్నాడు. దాంతో తమ మతం ఏమైపోతుందోనని ఇమాంలకు వొణుకు పుట్టింది. భయం, స్వప్రయోజనం కలిసి వారి భాషలో కఠినత్వం తగ్గించాయి: చక్రవర్తి గారు అల్‌ఖురాన్ కట్టుదలకు కట్టుబడి ఉండనవసంర లేదని, తనకు ఇష్టమైన ఓ మద్యాన్నయినా. ఏ మాంసాన్నయినా ఆయన నిస్సంకోచకంగా వినియోగించవచ్చునని వారు ప్రకటించారు.

[Catrous' History of the Mogul Dynasty, *p.138*
Quoted in **Elliot & Dowson.** *Vol. VI. p. 513-14]*

మూర్ఖుడికి ఎవరు మాత్రం ఏమి చెప్పగలరన్న ఉద్దేశంతో, వద్దంటే ఏ అఘాయిత్యం చేస్తాడోనన్న వెరపుతో ముస్లిం మతపెద్దలు తలఒగ్గడంతో కథ అయిపోలేదు. మందు పార్టీలు రోజూ ఉండేవే. ఒకరోజు వారు తప్పించుకున్నా ఇంకో రోజు మతాచారాలను పాటించే ఇంకొకరు చక్రవర్తి బారిన పడేవారు. ఇందాకటి సందర్భంలో ఎదుట ఉన్నది కాజీలు, ఇమాంలు కాబట్టి దర్జీలను పిలిపించి క్రిస్టియన్ దుస్తులు కుట్టించుకుని మతం మారతారని రస్సా వేశాడు. అదే మామూలు ముసల్మాన్లనయితే దాదాపు బలాత్కారమే చేసి బలవంతంగా రంజాన్ దీక్షలో మద్యం తాగించేవాడు.

ఈ సందర్భంలోనే ఇంకో ముచ్చట:

రాత్రంతా చక్రవర్తి స్నేహితులతో కలిసి మందు కొట్టేవాడు. ఆగ్రాలోని వివిధ జాతుల యూరోపియన్లందరూ రాజమహల్‌లోకి స్వేచ్ఛగా వస్తూపోతూండేవారు. వారితో కూర్చుని తెల్లవారేదాకా పాదుషా తాగుతూండేవాడు. ఇస్లాం బూటకపు మతమని క్రిస్టియన్ మతప్రచారకులు హేళన చేస్తుంటే చప్పట్లు కొట్టి ఆనందించేవాడు. మహమ్మదీయులందరూ ఉపవాసాలుండి కఠిన నియమాలను పాటించే సీజనులో కూడా ఈ అర్ధరాత్రి తందనాలను విశృంఖలంగా సాగించేవాడు - అని చెబుతూ కాట్రౌ ఇంకా ఇలా రాశాడు.

> When some of his nation of rather rigid principles happened to be present at these meetings, he compelled them to violate their fast, threatening them, in case of disobedience, with being abandoned to the rage of two lions, who were kept always chained under the windows of his apartments.
>
> ***[Catrous' History of the Mogul Dynasty, p.139]***
>
> *(ఆయన జాతివారే అయిన కొందరు కఠోర నిష్ఠాపరులు ఈ సమావేశాల్లో కనిపిస్తే ఉపవాసాన్ని భంగపరచమని నిర్బంధించేవాడు. తన మాట వినకపోతే సింహాల పాల పడవేస్తానని బెదిరించేవాడు. ఆయన నివాసం కిటికీల కిందే రెండు సింహాలను ఎప్పుడూ గొలుసులతో కట్టివేసి ఉంచేవారు.)*

ఇదంతా హడలగొట్టటానికే గాని - నిజంగా సింహాలబారిన పడేసి సాటి మనిషిని చంపించేవాడా అని సందేహం అక్కర్లేదు. మనుషుల ప్రాణాలు తీయటం మొగల్ పాదుషాలకు నీళ్లు తాగినంత తేలిక. అందునా జహంగీర్‌కు చిత్రహింసలతో మనుషుల్ని చిత్రవధ చేయించటం బోలెడు సరదా. ఒళ్లెరుగని కోపం వచ్చినప్పుడే కాదు. ఉబుసుపోక కాలక్షేపం కోసం కూడా. శాంపిల్‌గా - జహంగీర్ జీవకారుణ్యం గురించి విలియం హాకిన్స్ చెబుతున్నాడు ఆలకించండి:

> *పాపం వాడు భయపడ్డాడు. సింహం దగ్గరగా పోవలసిందేనని రాజు నిర్బంధించాడు. వాడు వెళ్లాడు. సింహం వాడిని ముక్కలు చేసింది. అది చూసి రాజు ఆనందించాడు. అయినా తృప్తి కలగలేదు. మరింత మజా కావాలనుకున్నాడు. ఆ రాత్రి అక్కడ కాపలా కాస్తున్న గుర్రాల దళం నుంచి పదిమందిని పిలిపించి, ఒకరి తరవాత ఒకరు వట్టి చేతులతో సింహంతో తలపడమని ఆజ్ఞాపించాడు. వారందరూ ఒళ్ళంతా తూట్లువడి దారుణంగా గాయపడ్డారు. ముగ్గురైతే చచ్చేపోయారు. ఈ క్రూరక్రీడను రాజు మూడు నెలలు కొనసాగించాడు. అతడి*

పైశాచికానందం కోసం ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నారు. మరెందరో క్షతగాత్రులయ్యారు.

[Narrative by **W.Hawking** in ***Purchas' Pilgrims*** *Vol.I p. 220*]
Quoted in **Elliot & Dowson** *Vol. VI.p.505]*

జహంగీర్ దయగల రాజు. తన వినోదం కోసం తీవ్రంగా గాయపడ్డవారికి ఎక్కువ కాలం ఆ బాధ లేకుండా తన చేతులతోనే విముక్తి ప్రసాదిస్తాడు. ఎలాగంటారా? మళ్లీ హాకిన్స్‌నే సాక్ష్యానికి పిలుద్దాం.

నేను అతడి దర్బారులో ఉన్న కాలంలో ఎన్నో క్రూరకృత్యాలను అతడు చేయడం చూశాను. వారానికి ఐదుసార్లు మదపుటేనుగులతో ఫైటింగ్ చేయించేవాడు. భీకరంగా పోరాడుకునే ఏనుగుల కాళ్ల కింద నలిగి, తొండాలతో తాపులు తిని ఆ పరిసరాల్లోని ఎందరో అమాయకులు మరణించేవారు. ఎవరైనా తీవ్రంగా గాయపడితే, బతికే అవకాశం ఉన్నాసరే - తీసుకుపోయి నదిలో పారెయ్యమని చక్రవర్తి ఆజ్ఞాపించేవాడు. 'పైకి రవాణా చేసెయ్! లేకపోతే బతికినంత కాలం నన్ను తిట్టుకుంటాడు. అంతకంటే వాడిప్పుడు చావడమే మేలు' అనేవాడు.

*[**Purchas's Pilgrims**, Vol.I, p.220,* **E & D** *Vol. VI. p.505]*

మనుషులను హింసించటం జహంగీర్‌కు గొప్ప వేడుక. ఆ సరదా తీర్చుకోవటానికి కొత్త కొత్త ఉపాయాలు కనిపెట్టేవాడు. "కొత్తగా తన ఆస్థానానికి వచ్చిన పారశీకుల ఓరిమిని పరీక్షించటం చక్రవర్తికి చాలా ఇష్టం. అందుకోసం ఆయన ఎప్పుడూ సూదిలా మొనతేలిన ఘంటాన్ని బొడ్లో పెట్టుకుని తిరిగేవాడు. ఆదమరచి ఉండగా దానితో కొత్తవాడి చెవిని చటుక్కున పొడిచేవాడు. అవతలి వాడు విలవిలలాడుతూ కెవ్వుమన్నాడా పరీక్షలో ఓడిపోయినట్టు. పళ్లబిగువున ఓర్చుకున్నాడా ధైర్యస్థుడైనట్టు!"

[Catrou's ***History of the Mogul Dynasty*** *p.140]*

తన శాడిస్టు ప్రతాపాన్ని చూపించటానికి వేరెవరూ కనపడకపోతే కన్నకొడుకునైనా బాధించకుండా జహంగీర్ వదిలేవాడు కాదు. అందుకు మళ్లీ **విలియం హాకిన్సే** ప్రత్యక్ష సాక్షి. 'ఒకరోజు నేను ఉండగా ఏడేళ్ల కుమారుడు సుల్తాన్ షరియర్‌ను రాజు పిలిపించాడు. మాటల సందర్భంలో - సర్వకాల సర్వావస్థలలోనూ తాను తండ్రినే నమ్ముకుని విధేయంగా ఉంటానని చెప్పమంటే కొడుకు ఒప్పుకోలేదు. పాదుషాకు కోపం వచ్చింది. కొడుకును గొడ్డులా బాదాడు. ఆ పిల్లవాడు ఏడవలేదు. తండ్రి కోరిన మాటా చెప్పలేదు. దాంతో తండ్రి ఇంకా చితకగొట్టి దబ్బనం తీసుకుని పసివాడి బుగ్గలను కస్సున పొడిచాడు. రక్తం ధారగా కారింది. అయినా ఆ కుర్రాడు ఏడవలేదు.'

*[**Purchas's Pilgrims** Vol.IX p. 307,* **E & D** *Vol.VI p.507]*

అసలు జోకు ఏమిటంటే హిరణ్యకశిపుడిని చంపి పుట్టిన ఈ జహంగీర్ చక్రవర్తే తనను తాను గొప్ప ధర్మప్రభువుగా భావించుకున్నాడు. ఆ సంగతి లోకానికి తెలియడం కోసం కిరీటాన్ని తగిలించుకున్న కొత్తలోనే ఆయన ఓ ఘనకార్యం చేశాడు. అదేమిటో ఆయనగారి మాటల్లోనే వినండి:

న్యాయాన్ని చేకూర్చవలసిన అధికారులు ఆలస్యం చేసినా, కపటత్వం చూపినా బాధితులు వచ్చి ఏ వేళయినా నేరుగా నాకు మొరపెట్టుకోవటానికి వీలుగా ఆగ్రాలో న్యాయఘంటను నెలకొల్పాను. దానికోసం నాలుగు మణుగుల బరువు, 30 గజాల

పొడవుగల బంగారపు గొలుసును వేయించి, 60 చిరుగంటలను అమర్చాను. ఒక కొసను ఘంటకు కట్టి రెండో కొసను వెలుపల యమునా నది ఒడ్డున ఒక రాతికి బిగింపజేశాను.

*[**Tuzuk-i Jahangiri - Rogers & Beveridge** Vol.I p.7]*

'న్యాయ గొలుసు'ను ఏ వేళ ఎవరు లాగినా మొర ఆలకించి న్యాయం చేస్తానని ఆర్భాటంగా ప్రకటించుకున్నా దానిని ఎవరూ ఒక్కసారి కూడా ఉపయోగించినట్టు కనపడదనీ, ప్రదర్శనకే తప్ప దానిని పెట్టింది వాడుకోవటానికి కాదనీ పూర్వకాలంలో చైనా చక్రవర్తులు, అంతకుముందు ఢిల్లీలోనే ఆనంగపాల మహారాజు చేసిన దానికి ఇది వట్టి అనుకరణ అని వెల్లడించి సర్ హెచ్.ఎం.ఇలియట్ జహంగీర్ బండారం బయటపెట్టాడు.

కోటగుమ్మానికి 'అలంకారం'గా న్యాయఘంటను తగిలించడంతోబాటు 1605లో గద్దె ఎక్కీ ఎక్కగానే తన సామ్రాజ్యంలో సుపరిపాలన నిమిత్తం, అంతదాకా జరిగిన అన్యాయాలను, అవకతవకలను సరిదిద్ది ప్రజలను పరిపూర్ణ న్యాయం చేకూర్చడం కోసం జహంగీర్ పన్నెండు ఆర్డినెన్సులను కూడా ఆర్భాటంగా జారీచేశాడు. అది ఇంకో ప్రహసనం. పగలు, రాత్రి తేడా లేకుండా మద్యపానం చేస్తూ, కైపు కోసం నల్ల మందును తింటూ నిరంతరం మత్తులో మునిగిన మహానుభావుడు తన రాజ్యంలో ఎవరూ మద్యాన్నిగాని, మద్య సంబంధమైనవిగాని, మత్తు పదార్థాలనుగాని అమ్మకూడదని శాసించడం ఆ ద్వాదశ అనుశాసనాల్లో ఒక విడ్డూరం.

'సార్వభౌమత్వాన్ని నేను నూర్జహాన్ బేగానికి అప్పగించాను. ప్రభుత్వ పగ్గాలు ఆమె చేతిలో ఉన్నంతవరకూ నాకు రోజూ సేరు మద్యం, అర్ధసేరు మాంసం మినహా ఇంకేమీ అక్కర్లేదు' అని స్వయంగా *[**Iqbalnama i Jahangiri E & D** Vol. VI. p.405]* చెప్పుకుని రాజ్య వ్యవహారాలు ఏవీ పట్టించు కోకుండా అన్నిటినీ భార్య, బావమరుదుల చేతుల్లో పెట్టిన పచ్చి తాగుబోతు న్యాయం గురించి, సుపరిపాలన గురించి మాట్లాడటమే వింత. విచారణ ఏదీ చేయకుండా, అభియోగం నిజమో కాదో తేల్చుకోకుండా - వీరు దొంగలు అని రాజోద్యోగులు చెప్పగానే ఒక్క రోజులో 400 మందిని ఏనుగులతో తొక్కించి, చంపించినవాడు... నడిబజారులో కుక్కలతో కరిపించి, చర్మం ఒలిపించి, కొరత వేయించి, ముక్కలుగా నరికించి ఎన్నో వందల నిరపరాధులను పైశాచికంగా బలిగొన్నవాడు... న్యాయాన్యాయాలు, యుక్తాయుక్తాల గురించి తాగో, తాగకుండానో చెప్పిన కబుర్లకు లెక్కేమిటి? తన 18వ ఏట మొదలు పెట్టి యాభయ్యో సంవత్సరం వరకూ 32 ఏళ్లలో తాను 28,532 జంతువులను, పక్షులను స్వహస్తాలతో చంపానని గణాంక వివరాలను సెలవిచ్చిన దయామయుడు తన రాజ్యంలో వారానికి రెండు రోజులు ఎవరూ జంతువులను, పక్షులను వేటాడరాదని, జీవహింస పాపమని ఉద్ఘాటించటం ఇంకా చోద్యం. వేటరాజులందరికీ అలవాటే కాని జహంగీర్ వలె వేట ఆడిన 'ధర్మప్రభువు', వేట సందర్భంలో అతడి వలె జీవకారుణ్యం చూపిన 'పరమ శాంతమూర్తి' బహుశా భూప్రపంచంలోనే మరొకడు ఉండడు. ఉదాహరణకు ఒకసారి తాను వేటాడుతుండగా ఏమి జరిగిందో జహంగీర్ చక్రవర్తే స్వయంగా చెబుతున్నాడు వినండి:

"On the 22nd, when I had got within shot of a nilgaw, suddenly a groom and two bearers appeared, and the nilgaw escaped. In a great rage I ordered them to kill the groom on the

spot, and to hamstring the bearers and mount them on asses and parade them through the camp..."

[The Oxford Histrory of India - **Vincent Smith** *p.387]*

(ఒక దుప్పిని నేను కాల్చబోతుండగా, గుర్రాలశాలలో పనిచేసే నౌకరు, ఇద్దరు వాహకులు హఠాత్తుగా ప్రత్యక్షమయ్యారు. దుప్పి తప్పించుకున్నది. నాకు మహాకోపం వచ్చింది. గుర్రాల పనివాడిని అక్కడికక్కడే చంపెయ్యమని ఆజ్ఞాపించాను. మిగతా ఇద్దరికీ మోకాళ్లు విరిచి గాడిదల మీద కూచోబెట్టి శిబిరమంతటా తిప్పించాను.)

ఇది చదివి – పాదుషాగారు వేటాడుతుండగా కర్మం చాలక అడ్డమొచ్చినవారికి మాత్రమే మూడేదని అనుకుంటే పొరపాటు. జహంగీర్ చక్రవర్తి దయార్ద్ర దృష్టికి ఎల్లలు లేవు. తన జోలికి వచ్చినవారు రానివారు అన్న తేడా లేదు. ఆయన వేటాడే విధం ఎంత మహత్తరమైనదంటే:

The King's manner of hunting is thus: About the beginning of November he goes from Agra, accompanied by many thousands, and hunts all the country for thirty or forty coss round about, and so continues till the end of March, when the great heats drive him home again. He causes a tract of wood or desert to be encompassed about by chosen men... and whatever is taken in this inclosure is called the King's sykar, or game, whether men or beasts... All the beasts thus taken, if man's meat are sold, and the money given to the poor. If men, they become the King's slaves, and are sent yearly to cabul, to be bartered for horses and dogs..."

[Kerrs' voyages *vol. VIII p.29* Quoted by **H.M.Elliot, E & D** *Vol.VI p.516]*

(రాజు వేటాడే పద్ధతి ఇది: నవంబరు మాసారంభంలో అతడు వేల మంది వెంట రాగా ఆగ్రా నుంచి బయలుదేరతాడు. ముప్పై నలభై క్రోసుల దూరం అలా మార్చి ఆఖరు దాకా వేటాడుకుంటూ వెళ్లి వడగాల్పులు మొదలయ్యాక ఇంటి ముఖం పడతాడు. అడవిలోనో ఎడారిలోనో తాను తిరిగిన ప్రాంతం చుట్టూ వలయాకారంలో మనుషులను నిలబెడతాడు. ఆ వలయం లోపల ఉండే జంతువులైనా మనుషులైనా ప్రభువుల 'శికార్'గా భావించబడతారు. అందులో పట్టుకునేవి మనిషి తినడానికి పనికొచ్చే జంతువులయితే వాటిని అమ్మి ఆ సొమ్మును పేదలకు ఇస్తారు. వలయం లోపల దొరికే మనుషులేమో రాజుగారి బానిసలవుతారు. ఏటా వారిని కాబూల్‌కు పంపి, గుర్రాలకు మారుగానో, కుక్కల బదులో బార్టర్ పద్ధతిన అమ్మేస్తారు..)

చిత్తం వచ్చినంత మేర గిరిగీసి ఆ లోపల తమ పాలబడేది జంతువైనా మనిషైనా సమాన దృష్టితో సంతలో అమ్మేయగలిగిన ఈ కిరాతక చక్రవర్తినే 'సౌమ్యుడు; మానవత్వంగలవాడు; న్యాయవర్తనుడు' (affable, humane and just) అని ఆర్.సి.మజుందార్ లాంటి మాన్య చరిత్రకారులు ఆకాశానికి ఎత్తారంటే ఏమనుకోవాలి?

మదన కామరాజు కథ

Begum Saheb, the elder daughter of Chah-Jehan was very handsome, of lively parts, and passionately beloved by her father. Rumour has it that his attachment reached a point which it is difficult to believe, the justification of which he rested on the decision of Mullahs, or doctors of their law. According to them, it would have been unjust to deny the king the privilege of gathering fruit from the tree he had himself planted.

[Travels In The Mogul Empire, **Francois Bernier**, *p.11]*

షాజహాన్ పెద్దమ్మాయి బేగంసాహెబా చాలా అందంగా ఉంటుంది. ఆ సుందరాంగిని తండ్రి పిచ్చిగా ప్రేమించేవాడు. ఆ అనుబంధం నమ్మశక్యం కానంత దూరం వెళ్లిందని వదంతి. వారి న్యాయంలో నిష్ణాతులైన మతపెద్దల నిర్ణయాన్ని ఇందుకు సమర్థింపుగా చూపెట్టుకునేవాడట. స్వయంగా తానే నాటిన చెట్టు నుంచి ఫలాలను ఏరుకునే హక్కును రాజుకు నిరాకరించడం అన్యాయమని వారి అభిప్రాయమట.

మొగల్ చక్రవర్తి షాజహాన్ కొలువులో వైద్యుడిగా వున్న ఫ్రెంచివాడు ఫ్రాన్స్వా బెర్నియర్ వెలువరించిన *Travels in the Mogul Empire* గ్రంథంలో పేర్కొన్న దిగ్భ్రాంతికర విషయమిది. దీన్ని రాసింది దశాబ్దానికిపైగా రాజదర్బారులో ఉండి సంగతి సందర్భాలను సాకల్యంగా గమనించినవాడు కనుక – విదేశీ యాత్రికుడెవరో తెలిసీ తెలియక రాసిన అబద్ధంగా దీన్ని కొట్టిపారెయ్యలేము. షాజహాన్ అవసానదశ నుంచి ఔరంగజేబ్ హయాం తొలి సంవత్సరాల వరకూ మొగల్ సామ్రాజ్య స్థితిగతులను, నిష్పాక్షికంగా నిర్దుష్టంగా వివరించే చారిత్రక ప్రమాణంగా బెర్నియర్ గ్రంథానికి పెద్దపేరు.

తన 17వ ఏట తల్లి మరణించినది మొదలు ముప్పైఐదేళ్ళపాటు తండ్రిని అంటి పెట్టుకుని ఉండి, అతని యోగక్షేమాలు, అవసరాలు అన్నీ చూసి, చివరకి చెరలో సైతం వీడక మరణించేంతవరకూ జహనారా తండ్రిని సేవించింది. షాజహాన్‌కి కూడా మిగతా పిల్లలకంటే

ఆమె అంటే మహాప్రీతి. భార్య చనిపోయాక కోటి రూపాయల విలువైన ఆమె చరాస్తిలో సగం ఒక్కదానికే ఇచ్చి మిగతా సగాన్ని మిగతా ఆరుగురు పిల్లలకు పంచాడు. జహనారా వార్షికభృతిని ఆరు లక్షల నుంచి అమాంతం పదిలక్షలకు పెంచెయ్యడమేగాక అంతదాకా భార్య దగ్గర భద్రపరిచిన రాజముద్రికను కూడా ఆమెకు అప్పగించాడు. మహారాణి బాధ్యతలన్నిటినీ ఆ రాకుమారే సమర్థంగా చక్కబెట్టేది. ఒకసారి ఆమెకు ప్రమాదవశాత్తూ మంటల్లో ఒళ్లు తీవ్రంగా కాలితే ఎక్కడెక్కడి నుంచో వైద్యులను రప్పించి, లక్షలు వెచ్చించి చికిత్స చేయించి, దగ్గరుండి సపర్యలు చేసి మళ్లీ పూర్వరూపం తెప్పించాడు. ఈ తండ్రీబిడ్డల అనుబంధానికి మామూలుగా అయితే సంతోషించవలసిందే. పవిత్రంగా ఉండాల్సిన ఈ బంధం అపవిత్రమై నికృష్టపు అక్రమ సంబంధంగా మారిందని ఊహిస్తేనే రోత.

ఇది కేవలం ఓ బెర్నియర్ మోపిన అభాండం కాదు. 1726లో వెలువడ్డ ***Beshryving... Van de Levens der Groote Mogols*** గ్రంథంలో Valentyen కూడా ఇదే సంగతి చెప్పాడని విన్సెంట్ స్మిత్ రాశాడు. ఆ తండ్రి కూతుళ్ల పరస్పర అనురాగంలో పాపం కూడా కలగలసిందన్న అనుమానం చాలా మందికి ఉండేదని **Catrou** కూడా ధ్రువీకరించాడు. బహుళంగా వినిపించే ఆ వదంతి దర్బారులోని వారు దుర్బుద్ధితో లేవదీసిందేనని అతడు అనకపోలేదు. కాని - పాదుషా పేరు చెబితేనే హడలిపోయి ఏమంటే ఎక్కడ ప్రాణం మీదికి వస్తుందోనని బిక్కుబిక్కుమనే దర్బారువారు ఏ రుజువు లేకుండా చక్రవర్తికి సొంత కూతురితో అక్రమ సంబంధం అంటగట్టేంతగా బరితెగించారని నమ్మడం కష్టం.

అనురాగమూర్తి, మహాప్రేమికుడు అని ప్రపంచం గొప్పగా తలిచే షాజహాన్ చక్రవర్తిలో ఇది చాలా మందికి తెలియని కోణం. ముంతాజ్ మహల్ అనే ధర్మపత్నిని అతడు అమితంగా ప్రేమించాడని, భార్య మరణించాక మళ్లీ పెళ్లి చేసుకోకుండా ఆమెనే తలచుకుంటూ జీవితాంతం తపించాడనీ... ప్రియసతి జ్ఞాపకార్థం ఆమె సమాధిపై ప్రపంచ అద్భుతాల్లో పేరెన్నికగన్న తాజ్‌మహల్‌ను కళాత్మకంగా కట్టించి చరితార్థుడయ్యాడనీ, దుర్మార్గపు కొడుకు సింహాసనం లాక్కుని తనను ఖైదు చేశాక కూడా ఆ చెరనుంచే తాజ్‌మహల్‌ను చూసుకుంటూ గతించిన దేవేరిని గుర్తుచేసుకుంటూ ఎనిమిదేళ్లు బతికి అలాగే కన్నుమూశాడనీ చరిత్ర కథల్లో చదివి కంటతడి పెట్టని వారుండరు. ఆహా! ఎంతటి ప్రేమికుడు! ఎంత గొప్ప భావుకుడు!! ఎంత మహామానవుడు!!! అని కవులూ, కళాకారులూ, రసహృదయంలేని సామాన్యులూ కూడా గట్టి నిట్టూర్పులు విడుస్తారు.

కాని - కల్లబొల్లి చరిత్రలు విని మనం ఊహించుకునే షాజహాన్ వేరు. కాముకుడు, పశుప్రాయుడు. నీచుడు, క్రూరుడు అయిన అసలు షాజహాన్ వేరు.

ముందుగా - ఈ ఆదర్శ భర్తగారు సాగించిన ఆదర్శ దాంపత్యపు సొంపునే చూడండి. 1612లో పెళ్లినాటికి షాజహాన్ వయసు 20; ముంతాజ్‌కు 18 ఏళ్లు. ఆమె అసలు పేరు అర్జుమంద్ బాను బేగం. పందొమ్మిది సంవత్సరాల కాపురంలో ఆమె ఎనిమిది మంది కొడుకుల్ని, ఆరుగురు కూతుళ్లను అంటే దాదాపుగా ఏడాదికో బిడ్డను కంటూనే ఉంది. చివరికి 14వ బిడ్డను ప్రసవిస్తూనే 34 గంటలు విలవిలలాడి పురిటిలోనే మరణించింది. నలభై రాకుండానే ఆమెకు నూరేళ్లూ నిండాయి. ఈ వివరాలనుబట్టే షాజహాన్ ఆమెను పిల్లల్ని కనే యంత్రంగా పరిగణించాడే తప్ప ఆమె ఆరోగ్యం సంగతి బొత్తిగా పట్టించుకోలేదని స్పష్టం. ప్రసవానికీ ప్రసవానికీ మధ్య కొద్దికాలంలో ఏమి సుఖపడ్డదో ఆ ఇల్లాలికే ఎరుక.

ముంతాజ్‌కంటే ముందే పర్షియన్ రాకుమారినీ, ముంతాజ్ అనంతరం రాజపుత్ర స్త్రీనీ పెళ్లాడినా ముంతాజ్ బతికినతకాలం ఆమెనే అంటిపెట్టుకుని ఉండి పిల్లలుకనే కార్యక్రమాన్ని ఆమె ద్వారానే సాగిస్తూ షాజహాన్ కొంచెం హద్దుల్లోనే ఉన్నాడు. ఆమెను పురుటినుంచి కాటికి పంపిన అనంతరం అతడు మదపిచ్చితో రెచ్చిపొయ్యాడు. కొత్తగా పెళ్ళిళ్లయితే చేసుకోలేదు గాని పరస్త్రీల వెంటపడి, నచ్చిన ఆడదాన్నల్లా విచ్చలవిడిగా అనుభవించాడు. కావలసిన మదవతులను ఎంచుకోవడానికీ ఓ సెలక్షన్ పద్ధతి ఉండేదట. నౌరోజ్ ఉత్సవాల్లో ఏటా వారంపాటు నడిచే మీనాబజార్ దానికి వేదిక. మామూలుగా మీనాబజార్‌లోకి మగపురుగును రానివ్వరు. పూర్తిగా మహిళలకే అది ప్రత్యేకం. తాతయ్య అక్బర్ తన కాలంలో అందులోకి ఆడవేషం వేసుకుని వెళ్లి కలియతిరిగి అమ్మాయిలను ఎన్నిక చేసుకుని తరవాత అంతఃపురానికి రప్పించుకునేవాడు. మనవడు ఇంకా ముదురు. ఆ కాస్త తెరచాటునూ తీసేశాడు. పల్లిగ్గానే సింహాసనమెక్కి పలువురు తార్తార్ మహిళలు ఆ గద్దెను మోస్తూండగా, మరి కొందరు గణికలు బంగారు పొన్నుకర్ర చేతబట్టి వెనకా ముందూ నడవగా, కొజ్జాలు కోలాహలం చేస్తుండగా, సంగీతంగాళ్లు వాయిద్యాలు మోగిస్తుండగా, రవితేజములలరెట్లు రాజుగారు బజారుకు వెళ్ళేవాడట. అది మామూలు తిరునాళ్ల సంతకాదు. అక్కడ దుకాణాల్లో కూర్చునేది అలగా స్త్రీలు కాదు. రాజప్రముఖుల భార్యలు, వారి దగ్గరి బంధువులూనూ! అందరినీ ఓ కంట గమనిస్తూ సాగి, ఎక్కడ ఏ ఆడది నదురుగా కనిపిస్తే ఆ స్టాలు దగ్గర ఆగి ఏదో ఒక వస్తువును కొనుక్కుని పోతూపోతూ తన మనుషులకు కనుసైగ చేసేవాడు. తరవాత కార్యక్రమాన్ని వాళ్లు చూసుకునేవారు. సెలక్టు అయిన పిట్టలు ఇష్టమున్నా లేకున్నా చచ్చినట్టు సాయంత్రం కల్లా జనానా చేరవలసిందే. చక్రవర్తి మోజు తీరేదాకా సుఖపెట్టి ఇచ్చిన కానుకలు తీసుకుని వెనక్కి రావలసిందే. శాశ్వతంగా ఉండమంటే ఉంపుడుగత్తెలా ఉండిపోవలసిందే. వీరుగాక నాటురకం పాటగత్తెలనూ, ఆటగత్తెలనూ అంతఃపురానికి పిలిపించి కోరుకున్న వారితో కోరుకున్న విధంగా అడ్డమైన మన్మథలీలలు సాగించే వాడని బెర్నియర్ చెప్పాడు. స్త్రీని భోగవస్తువుగా చూడటానికి అలవాటుపడ్డ మొగల్ దర్బారు మారాజులు కూడా ఉచ్చనీచాలు లేని ఈ అశ్లీల కామవికారాలను చూసి చెవులు కొరుక్కున్నారు. మరీ తక్కువరకం ఆడవాళ్లతో కూడా అసభ్యంగా ఎందుకు భోగిస్తున్నారని అంటే "ఏ దుకాణం నుంచి వచ్చినా మిఠాయిలు బాగానే ఉంటాయ"ని షాజహాన్ బదులిచ్చినట్టు ఆ కాలంలో అతడి ఆస్థానంలోనే ఉన్న విదేశీయుడు **Manucci** రాశాడు. పాదుషాగారితో మదన క్రీడల్లో పాల్గొని మహిళలు వీధివెంట వెళుతూంటే 'ఏయ్ షాజహాన్ ఫలహారమా, బాగున్నావా', 'షాజహాన్ భోజనమా ఎలా ఉన్నావ్' అని ఆకతాయిలు ఆటపట్టించేవారట.

'మీనాబజార్' ముద్దుగుమ్మలూ, ఆటపాటల అంగడిబొమ్మలూ కాక దర్బారులో తనకు దగ్గరగా మసలే ప్రముఖుల ఇళ్లలోని అందాలమీదా ఒక్కోసారి పాదుషాగారికి గాలి మళ్లేది. ఈ రాసలీలల్లో పుత్రికారత్నం జహనారా తండ్రికి శాయశక్తులా సహకరించేదట. ఒకసారి తనకు వరసకు మేనమామ అయ్యే షాయిస్తాఖాన్ భార్యను ఆమె తండ్రికి సమకూర్చిపెట్టిందట. The procuress in this affair was (Jahanara)... who in compliance to her father, invited the said woman to a feast, at the end of which Shah Jehan violated her *(ఈ వ్యవహారంలో పొసగుడుగత్తె జహనారా... తండ్రి కోరిక ప్రకారం ఆ మహిళను ఆమె*

విందుకు పిలిచింది. విందు అయ్యాక షాజహాన్ అత్యాచారం చేశాడు) అని **Manucci** కథనం. (మదపిచ్చి షాజహాన్‌ను మరణించేదాకా వదలలేదు. 70 ఏళ్ల వయసులో ఆగ్రా కోటలో బందీగా ఉన్నప్పుడు కూడా తండ్రి పవళింపు సేవకు అవసరమైన దాసీజనాన్ని ఔరంగజేబు ఏర్పాటు చేశాడు.)

ఇన్నివిధాల తన సేవచేసిన జహనారానూ షాజహాన్ తన మానాన తాను బతకనివ్వ లేదు. మొగలు ప్రభువులు సాధారణంగా కూతుళ్లకు పెళ్లిచెయ్యరు. చేస్తే ఆమె మగడు, వారికి పుట్టే పిల్లలు సింహాసనానికి ఎక్కడ పోటీపడతారోనని వారి భయం. (రాజ్యం కోసం తండ్రుల మీద కుమారులు తిరుగుబాటు చేయడం, వీలైతే ఖైదు చేయడం, తోడబుట్టిన వారిని చంపేయడం వారి ఘన సంప్రదాయం) అందుకే అందం చందం ఎంత ఉన్నా జహనారా ఒంటరిగానే బతికింది. ఎంతయినా ఉప్పూకారం తినే శరీరం. అందులోనూ రోజూ మసిలేది మదనకామరాజు షాజహాన్ విశృంఖల శృంగార లోకంలో. దాంతో ఆమెకూ గుబులు మళ్లేది. చెట్టునాటినవాడు పండ్లకు హక్కుదారు అన్న ఉదాత్త సిద్ధాంతం ప్రకారం షాజహాన్ తన పద్ధతిలో ఆమెకు యథాశక్తి సాయం పట్టేవాడు. తాను ఆంబోతులా పేట్రేగి ఎన్ని నికృష్టపు పనులు చేసినా కుమార్తె కనుక కట్టు తప్పితే ఆ దయగల తండ్రి ఉగ్రుడయ్యేవాడు. ఒకసారి జహనారా తన మందిరంలో అర్ధరాత్రి ప్రియుడితో గడుపుతుండగా వాసనపట్టి షాజహాన్ రివ్వున వచ్చాడు. వేరేదారిలేక ఆమె ప్రియుడిని స్నానాలకు వాడే డేగిసాలో దాచింది. అది తండ్రి గమనించాడు. ఏమీ ఎరుగనట్టు కుమార్తెతో ప్రేమగా కబుర్లాడి "ఏమిటమ్మా నీ మొహం అలా వాడిపోయింది? హాయిగా స్నానం చెయ్యి" అని లాలించి వెంటనే సేవకుల్ని పిలిచి డేగిసాను పొయ్యిమీదికి ఎక్కించి బేగం సాహిబాకు వేణ్ణీళ్లు సిద్ధం చెయ్యమన్నాడు. లోపలివాడు కుతకుత మరిగి చచ్చాడని రూఢి అయ్యేదాకా అక్కడే తిష్ఠవేసి నవ్వుకుంటూ నిష్క్రమించాడు. ఇంకోసారి ఇంకో రాజపురుషుడికి కూతురు చేరువయిందని తెలుసుకుని అతగాడిని దర్బారుకు పిలిపించి మర్యాదగా మాట్లాడి విషం కలిపిన తాంబూలాన్ని స్వయంగా తినిపించి సాదరంగా సాగనంపాడు. పల్లకి ఎక్కినవాడు ఇంటికి చేరేలోపే చచ్చాడు. ఈ ఘనకార్యాలను ***"Travels in the Mogul Empire"*** గ్రంథం 12, 13 పేజీల్లో బెర్నియర్ పూసగుచ్చినట్టు వివరించాడు.

మనుషుల్ని చంపటంలో షాజహాన్ స్పెషలిస్టు. ఆయన నాన్నగారికేమో ఏనుగులతో తొక్కించి చంపించడం ఇష్టం. ఈయనకేమో పాములతో కరిపించటం సరదా. ఎప్పుడు ఎవరికి అవసరం పడుతుందోనని భయంకర విషసర్పాలను బుట్టలో పెట్టుకుని ఒక అధికారి దర్బారులో ఎప్పుడూ సిద్ధంగా ఉండేవాడు. ఓ రోజు నగరకొత్వాలు (మన పోలీసు కమిషనరులాంటివాడు) మీద పాదుషాకు ఆగ్రహం వచ్చింది. ఇంకేం? అతడు డ్యూటీ సరిగా చెయ్యడం లేదనీ లంచాలు తింటున్నాడని అభియోగం రడీ అయింది. నేరానికి శిక్షగా త్రాచుపాముతో కరిపించమని పాదుషా ఆజ్ఞాపించాడు. అధికారి బుట్ట తెరిచి ముద్దాయి చేతిమీద విషనాగుతో కాటువేయించాడు. చావటానికి ఎంత సమయం పడుతుందని పాదుషా అడిగాడు. గంటలో ప్రాణం పోతుందని పాములవాడు చెప్పాడు. మహాప్రభువు ఓపిగ్గా అంతసేపూ కూచుని....ప్రాణభయంతో తల్లడిల్లి నురగలు కక్కి సాటి మనిషి చచ్చిపోయే దృశ్యాన్ని చిదానందంగా తిలకించాడు. అందరూ చూసేలా రెండు రోజుల పాటు ఆ శవాన్ని న్యాయాలయం బయటపడేసి ఉంచమని ఆనతిచ్చి నిష్క్రమించాడు. **విన్సెంట్ స్మిత్**

రచించిన ***The Oxford History of India,*** 416వ పేజీలో ఇందుకు సంబంధించిన ప్రత్యక్షసాక్షి కథనాన్ని చూడవచ్చు.

వ్యక్తిగత జీవితంలో ఎటువంటి బలహీనతలున్నా షాజహాన్ ప్రభువుగా సమర్థుడని, న్యాయబద్ధంగా పరిపాలించాడని, అన్నివర్గాల ప్రజలను సమదృష్టితో చూసి, అసాంఘిక శక్తులను అణచేసి, నేరస్తులను శిక్షించి శాంతి, భద్రత చక్కగా కాపాడాడని, అతడి ముప్పైఏళ్ల పాలనలో ప్రజలందరూ సుఖంగా వున్నారని మన చరిత్రకారులు చాలా మంది నమ్మకంగా చెబుతారు. షాజహాన్ హయాంలో మొగల్ సామ్రాజ్యం మహావైభవంతో వెలిగిందని, కళలు, సంస్కృతి, సారస్వతం అద్భుతంగా వర్ధిల్లాయని, దేశం యావత్తూ సిరిపందలతో తులతూగిందని మొగలాయీ దర్బారులోని ఆస్థాన రచయితలు రాసిన అందమైన అబద్ధాలను అమాయకంగా నమ్మేసి, అవును నిజమే షాజహాన్ పాలన భారతదేశ చరిత్రలో స్వర్ణయుగమని కొసవెర్రి కితాబులిస్తుంటారు.

వాస్తవానికి అది స్వర్ణయుగం కాదు... దారుణయుగం! షాజహాన్ పాలనలో లేనిదే న్యాయం. కొరవడిందే భద్రత. ఇది గ్రహించడానికి విదేశీయులనే సాక్ష్యానికి పిలవక్కర్లేదు. మొగలు చక్రవర్తులకు వందిమాగధుల వంటి పర్షియన్ చరిత్రకారులు రాసిపెట్టిన రికార్డులను అలవోకగా తిరగేస్తే చాలు.

ఉదాహరణకు బాద్‌షానామా! తన పరిపాలనను అక్షరబద్ధం చేయటానికి స్వయానా షాజహానే ఏరికోరి ఎంచుకున్న **అబ్దుల్ హమీద్ లాహోరి** స్పెషలార్డరుమీద విరచించిన ఉద్గ్రంథమది. రాసిన ప్రతి అక్షరమూ చక్రవర్తిగాని, అతడి ప్రతినిధులుగాని చూసి ఆమోదించాకే, వద్దనుకున్న విషయాలు తీసేయించి, చేదు నిజాలను తగువిధంగా మార్పించాకే పుస్తకంలోకి ఎక్కేది. అంతగా అధికార ముద్రాంకితమైన గ్రంథరాజం నుంచి ఈ మచ్చుతునకలను చిత్తగించండి:

> It had been brought to the notice of His Majesty that during the late reign many idol temples had been begun, but remained unfinished at Benares, the great stronghold of infidelity. The infidels were now desirous of completing them. His Majesty, the defender of the faith, gave orders that at Benares, and throughout his dominions in every place, all temples that had been begun should be cast down. It was now reported from the province of Allahabad that seventy six temples had been destroyed in the district of Benares.
>
> *[Abdul Hamid Lahori -* **Badshahnama** *vol.I p.449]*

(అవిశ్వాసానికి గొప్ప స్థావరమైన వారణాసిలో ఇంతకు ముందు ప్రభువు హయాంలో విగ్రహారాధన ఆలయాల నిర్మాణం చాలాచోట్ల మొదలైందని, అవిశ్వాసులు వాటిని ఇప్పుడు పూర్తిచేయదలిచారని ప్రభువుగారి దృష్టికి వచ్చింది. విశ్వాసానికి రక్షకులైన మహాప్రభువులు వారణాసిలోను, తన సామ్రాజ్యమంతటనూ నిర్మాణం ఆరంభమైన దేవాలయాలను కూల్చివేయాలని ఆజ్ఞాపించారు. వారణాసి జిల్లాలో 76 దేవాలయాలను ఆ ప్రకారం ధ్వంసం చేసినట్టు ఇప్పుడు నివేదిక అందింది.)

ఇది షాజహాన్‌గారి చల్లని పాలనలో ఆరవ సంవత్సరం (1632) నాటి ముచ్చట! తన సామ్రాజ్యమంతటా కదుతున్న గుడులను కూల్చివెయ్యమని ఆనతిచ్చిన విశ్వాస ఘాతకుడి ఏలుబడిలో సంఖ్యాపరంగా జనాభాలో 90 శాతం వున్న హిందువులకు ఒనగూడిన శాంతి, భద్రత ఏపాటిదో వేరే చెప్పాలా? ఒక్క వారణాసి ప్రాంతంలోనే 76 హిందూ దేవాలయాలను నిష్కారణంగా నేలమట్టం చేయించినవాడు సెక్యులర్ ప్రభువు ఎలా అవుతాడు? ఔరంగజేబుకు అతడికీ మౌలికంగా తేడా ఏమిటి. పోనీ - షాజహాన్ ద్వేషం యావత్తు హిందువుల మీదేనా? మిగతా మతాలవారినైనా ప్రశాంతంగా బతకనిచ్చాడా?

> On the 11th Muharram (1633 AD) Kasim Khan and Bahadur Kambu brought 400 Christian prisoners, male and female, young and old, with the idols of their worship, to the presence of the faith defending Emperor. he ordered that the principles of the Muhammadan religion should be explained to them, and that they should be called upon to adopt it. A few appreciated the honour offered to them and embraced the faith; they experienced the kindness of the emperor. But the majority in perversity and wilfulness rejected the proposal. These were distributed among the amirs, who were directed to keep these despicable wretches in rigorous confinement. So it came to pass that many of them passed from prison to hell. Such of their idols as were likenesses of the prophets were thrown int the Jumna, the rest were broken to pieces.
>
> **[Badshahnama** *Vol I p.534]*
>
> *(1633 సంవత్సరంలో మొహరం నెల 11వ రోజున కాసింఖాన్, బహాదూర్ కాంబులు 400 మంది క్రైస్తవ ఖైదీలను వారు ఆరాధించే విగ్రహాలతో సహా విశ్వాసరక్షకుడైన చక్రవర్తి వద్దకు పట్టుకొచ్చారు. వారిలో స్త్రీలు, పురుషులు, యువకులు, వృద్ధులు వున్నారు. మహమ్మదీయ మతసూత్రాలను వారికి తెలియపరచి ఇస్లాంను స్వీకరించవలసిందిగా వారికి చెప్పాలని చక్రవర్తి ఆనతిచ్చాడు. కొంత మంది తమకు కలిగించిన గౌరవాన్ని అర్థం చేసుకొని ఇస్లాంను హత్తుకున్నారు. వారు చక్రవర్తి అనుగ్రహానికి పాత్రులయ్యారు. కాని చాలామంది ప్రతిపాదనను కుత్సితంతో తిరస్కరించారు. వారిని అమీర్లకు పంచిపెట్టి ఆ నికృష్టులను చెరలో నిర్బంధించ మన్నారు. వారిలో చాలామంది ఖైదు నుంచి నరకానికి పోయారు. విగ్రహాలలో ప్రవక్తలను పోలినవాటిని యమునలో పారవేశారు. మిగతావాటిని ముక్కలుచేశారు.)*

ఇదీ సెక్యులర్ పాలకుడని మన సూడో సెక్యులరిస్టులు నెత్తిన పెట్టుకునే షాజహాన్ కనబరచిన పరమత సహిష్ణుత.

మతద్వేషం సంగతి అలా ఉంచుదాం. మతభేదాలతో నిమిత్తం లేని లౌకిక వ్యవహారాల్లో షాజహాన్ అందించిన సుపరిపాలన ఎలాంటిది? ప్రజలందరూ దుర్భరమైన కరవు కాటకాల్లో

విలవిలలాడుతూ, కాల్చే ఆకలితో కూల్చే వేదనతో క్షోభిస్తున్న ఆపత్కాలంలోనైనా ఆయనగారు సమర్థంగా కదలి ఆదుకున్నాడా?

ఆ సంగతి సర్కారీ చరిత్రకారుడు **అబ్దుల్ హమీద్ లాహోరీ** మాటల్లో ఆలకించండి. షాజహాన్ హయాంలో నాలుగవ ఏట 1630లో మొత్తం దక్షిణ దేశాన్ని, పశ్చిమ భారతాన్ని నుగ్గునూచ చేసిన భయానక కాటకం గురించి అతడు మాట్లాడుతున్నాడు:

> During the past year no rain had fallen... In the present year also there had been a deficiency... and a total want in the Dakshin, and Gujarat... Life was offered for a loaf but none would buy... the ever bounteous hand was now streched out to beg for food.... destitution at length reached such a pitch that men began to devour each other, and the flesh of a son was preferred to his love. The numbers of the dying caused obstructions in the roads...
>
> ***[Abdul Hamid Lahori*- Badshahnama**, *Vol.I. p.362]*
>
> *(కిందటి సంవత్సరం వానలు పడలేదు. ఈ ఏడూ వర్షపాతం తక్కువే.. దక్షిణ్‌లో, గుజరాత్‌లో పూర్తి కరవునెలకొంది.... రొట్టెముక్క కోసం తమను తాము అమ్ముకోవడానికి జనం సిద్ధపడ్డారు. కాని కొనేవారు లేరు. ఎల్లవేళలా సర్వసమృద్ధిని అనుభవించినవారు ఇప్పుడు తిండి అడుక్కునేందుకు చెయ్యిచాస్తున్నారు. దారిద్ర్యం ఎంత దూరం వెళ్లిందంటే మనుషులే మనుషులను తినడం మొదలెట్టారు. కన్నకొడుకు ప్రేమకంటే అతడి మాంసమే మిన్న అని పరిగణించసాగారు. ఆకలితో చచ్చిన వారి శవాలతో రహదారులు నిండి రాకపోకలకు అవరోధం కలిగింది.)*

ఆకలికి తాళలేక మనిషే మనిషిని తినే దారుణ దృశ్యాన్ని తలచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. కన్నబిడ్డలనే కోసుకు తినే దుర్గతికి జనాన్ని నెట్టేంతగా కరవు రక్కసి చెలరేగి ఇనుపగజ్జెలతో తాండవిస్తుంటే రాజ్యమేలే చక్రవర్తి ఏమి చేశాడు? కరవు అనేది తుఫానులాగా భూకంపంలాగా హఠాత్తుగా పైనబడేది కాదుకదా? దీర్ఘకాలం చితికి ఛిద్రమై సర్వనాశనమై ఏ ఆశాలేక ఏ సాయమూ అందక ఆకలితో నెలల పర్యంతం దహించుకుపోతే తప్ప మనిషిలోని మానవత్వం నశించి నరభక్షకుడుగా మారడుగదా? వరసగా రెండేళ్లు వానచినుకు లేక విశాల ప్రాంతాల్లో తాండవించిన కరవు ఇంతగా వెర్రి తలలు వేస్తుంటే పాదుషాగారు ఏమి చేశారయ్యా అంటే -

గొర్రెమాంసమని చెప్పి కుక్కమాంసం అమ్ముతున్నారని, చచ్చిన మనుషుల ఎముకలను పొడిచేసి పిండిలో కలిపి విక్రయిస్తున్నారని తెలియగానే కొంత మంది వర్తకులను కఠినంగా శిక్షించారట. గుజరాత్‌లోని మూడు పట్టణాల్లో వంటశాలలు తెరిపించి పేదలకు రొట్టె, పులుసు పంచిపెట్టించారట. బుర్హాన్‌పూర్‌లో చక్రవర్తి బస చేసినంతకాలం ప్రతి సోమవారం 5 వేలరూపాయల చొప్పున 20 వారాల్లో అర్హులైన(?) పేదలకు లక్ష రూపాయలు ధర్మం చేశారట. బాగా దెబ్బతిన్న అహ్మదాబాద్‌లోనైతే 50 వేల రూపాయలను కరువుపీడితులకు పంచిపెట్టించారట. జనం గోళ్లూడగొట్టి వసూలుచేసే పన్నుల్లో 1/11వ భాగాన్ని ఎంతో దయతలచి మాఫీ చేశారట.

ఇదీ ఘనత వహించిన చక్రవర్తిగారి భారీ ఔదార్యం! రాణివాసంలో ఒక్క ముద్దుల కూతురుకే జల్సా ఖర్చుల నిమిత్తం ఏడాదికి పది లక్షల రూపాయలు మంజూరు చేయగలిగిన ధర్మమూర్తి విశాల ప్రాంతాల్లో వేల గ్రామాల్లో ఆకలిబాధతో కోట్లాది జనం మలమల మాడుతూంటే వారానికి ఐదువేల చొప్పున ఒక ఊళ్లో అదీ 20 వారాల్లో లక్ష రూపాయలు విదిల్చడాన్నే... భయంకర బాధల్లోని ఇంకో నగరంలో అరలక్ష అనుగ్రహించడాన్నే... మూడు ఏరియాల్లో పులుసు కేంద్రాలు తెరిపించడాన్నే.. లోకోత్తర మహోపకారమని అబ్దుల్‌హమీద్ డప్పుకొట్టాడు. మహాజ్ఞానులైన మన చరిత్రకారులూ ఆ మాటే పట్టుకుని "ఆహా! షాజహాన్ ఎంత ధర్మప్రభువు" అని పక్క తాళం వేస్తున్నారు.

షాజహాన్ గద్దెనెక్కిన కొత్తలో తాండవించిన కరవు పరిస్థితులనుబట్టి అతడి పరిపాలన మొత్తం అంతే అధ్వాన్నంగా నడిచిందని భావించటానికి వీలులేదు. నిజమే. కరవు కాటకాల నుంచి తెప్పరిల్లయిన తరువాతయినా బీదల బతుకులు బాగుపడ్డాయా? రెండు దశాబ్దాలు గడిచాక షాజహాన్ చరమదశలో మొగల్ సామ్రాజ్యంలో విస్తృతంగా తిరిగిన **Francois Bernier** కు కనిపించిన జీవిత దృశ్యం ఏమిటో అతడి మాటల్లోనే వినండి.

> The dispotic tyranny was so excessive as to deprive the peasant and artisan of the necessaries of life, and leave them to die of misery and exhaustion... as the ground is seldom tilled otherwise than by compulsion and as no person is able to repair the ditches and canals... the whole country is badly cultivated. The houses too are left in a dilapidated condition. The country is ruined by the necessity of defraying the enormous charges required to maintain the splendour of numerous cout... and large army..."
>
> ***[The Oxford History of India*, V.A.Smith *p.418]***
>
> *(నిరంకుశ పెత్తందారుల క్రౌర్యం ఎంత ఎక్కువంటే రైతుకూ, చేతిపనివాడికీ కనీస జీవితావసరాలు కూడా అమరక దౌర్భాగ్యంతో అలసటతో చావాల్సి వస్తున్నది... నిర్బంధిస్తే తప్ప ఎవరూ సాగు చేయకపోవడంవల్ల, కుంటలు కాలువలు మరమ్మతు చేసే దిక్కులేక మొత్తం దేశంలో సేద్యం అధ్వాన్నమైంది. ఎక్కడ చూసినా ఇళ్లూ శిథిలమయ్యే వున్నాయి.... డాబుసరి దర్బారును వైభవంగా నడపటానికి, పెద్ద సైన్యాన్ని పోషించడానికి దేశం నాశనమవుతున్నది.)*

ఇదీ ఆ కాలంలో జనుల దీనావస్థను కళ్లతో చూసినవారు చెప్పింది. అయినాసరే- షాజహాన్ చక్రవర్తి ప్రజల్ని కన్నబిడ్డలా చూసుకుని (బహుశా తన కన్నకూతురుని "చూసుకున్నట్టే"కావచ్చు!) తండ్రిలా పరిపాలించాడని... న్యాయం చేస్తాను రమ్మని వారంలో ఒక రోజు తలుపులు తెరుచుకుకూచున్నా అరుదుగా తప్ప ఎవరూ ఆయన ఎదుట పడేవారుకారని, దాన్నిబట్టి జనానికి ఏ ఫిర్యాదూ లేదని అనుకోవాలని (!) అబ్దుల్ హమీద్, ఇనాయత్‌ఖాన్‌లాంటి ఆస్థాన భజంత్రీలవారు బాకాలు ఊదారు. తెలివిగల మన మహామేధావులూ ఔనని తల ఊపి షాజహాన్ బ్యాండు మేళంలో కళ్లు మూసుకొని శ్రుతి కలిపారు.

మూర్ఖత్వానికి కూడా ఒక హద్దు ఉండొద్దా?

తాజ్‌మహలా? రాజమహలా?

అది అందమైన పాలరాతి సౌధం.
ప్రపంచ నిర్మాణాల్లోనే ఒక అద్భుతం.

ఏ దేశం నుంచి ఎవరొచ్చినా ఇండియా రాగానే మొదట దానినే చూడాలనుకుంటారు. దాని అతిలోక సౌందర్యానికి ఎంతటి వారైనా మైమరచిపోతారు. దాని పేరు తలచుకుంటేనే కవులూ కళాకారులూ భావుకత ఉప్పొంగి వెర్రెత్తిపోతారు. అంత భావావేశం లేని సామాన్యులకు కూడా తాజ్‌మహల్ అనగానే కళ్లముందు షాజహాన్, ముంతాజ్‌లు కదలాడతారు. ప్రాణ సమానంగా ప్రేమించిన ఇల్లాలికి గుర్తుగా ఆమెను సమాధి చేసిన చోట అపురూప సౌధాన్ని ఆ చక్రవర్తి నిర్మించాడని చరిత్ర పాఠాల్లో చదువుకున్న విషయం గుర్తుకొస్తుంది. వారి అమరప్రేమను తలచుకుని గుండె బరువెక్కుతుంది.

మంచిదే. స్పందించే రసహృదయం అందరికీ ఉండాల్సిందే. ఎటొచ్చీ తాజ్ రేపే తమకంలో మనం గుర్తించని చిన్న పాయింటల్లా ఒక్కటే:

తాజ్‌మహల్‌లో ఉన్నది ముంతాజ్ సమాధే. కానీ తాజ్‌మహల్‌ను కట్టింది మాత్రం షాజహాన్ కాదు. ఆ భార్యాభర్తలు భూమి మీదికి రాకముందే ఆ స్థలంలో ఆ కట్టడం ఉంది. ఇంకా చెప్పాలంటే షాజహాన్ తాతకు తాత అయిన బాబర్ కాలంలోనే ఆ ప్రాసాదం ఉంది. నిజానికి బాబర్ మరణించింది కూడా ఆ ప్రాసాదంలోనే!

ఔను. తాజ్‌మహల్ సమాధి మందిరమూ కాదు. ప్రేమకు కట్టిన ఆలయమూ కాదు. అది ఒక పురాతన రాజమందిరం.

అనంతర కాలంలో వ్యాప్తిలోకొచ్చిన కట్టుకథలను వినివిని.... మహాచరిత్రకారు లందరూ అక్షర సత్యంగా ధ్రువీకరించిన అవాస్తవాలను చదివి చదివి... మిడి మిడి జ్ఞానపు సినిమాలను, నాటకాలను చూసి చూసి... ఇవాళ మనకు ఈ సంగతి చెబితే నమ్మశక్యం కాకపోవచ్చు.

కాని – యథార్థం!

దీని రుజువు కోసం ఎక్కడికో వెళ్ళి వెదకక్కర్లేదు. కావలసిన రుజువులన్నీ షాజహాన్ కాలంలోనే దొరుకుతాయి. అన్నిటికంటే పెద్ద చారిత్రక సాక్ష్యం షాజహాన్ చక్రవర్తి తన ఘనతను లోకానికి చాటడం కోసం స్వీయ పర్యవేక్షణలో రాయించిన **బాద్‌షానామాలోనే** ఉంది!

బాద్‌షానామాలో ఏముందో చదివే ముందు ఆ గ్రంథం గురించి, దాని రచయిత గురించి సర్ హెచ్.ఎం.ఇలియట్ తన ప్రామాణిక గ్రంథంలో చెప్పిన ఈ మాటలను ఆలకించండి:

> This is a history of the first twenty years of the reign of Shah Jehan, composed by Abdul Hamid Lahori.... Abdul Hamid himself says in his preface that the Emperor desired to find an author who could write the memoirs of his reign in the sty... of Abul Fazl's Akbarnama... He was recommended to the emperor for the work, and was called from Patna.. to undertake the composition.
>
> ***[History of India As Told by its Own Historians,* Elliot & Dowson,** *Vol: VII p.3*]
>
> *(ఇది షాజహాన్ పాలనలో తొలి ఇరవై సంవత్సరాల చరిత్ర. రాసినవాడు అబ్దుల్ హమీద్ లాహోరి... అబ్దుల్ హమీదే తన ముందు మాటలో ఏమన్నాడంటే - చక్రవర్తిగారు తన పాలనా విశేషాలను రాయడం కోసం తగిన రచయితను చూడాలనుకున్నారట... ఈ పనికి ఇతడిని చక్రవర్తికి సిఫారసు చేసి, దీని రచన కోసం పాట్నా నుంచి పిలిపించారట)*

ఇంతగా స్పెషలార్డరు మీద తయారైన బాద్‌షానామాలో ముంతాజ్ సమాధి గురించి ఏముందో చూడండి. భారత ప్రభుత్వానికి చెందిన పురాతన పత్ర భాండాగారం (నేషనల్ ఆర్కయివ్స్)లో భద్రపరచిన బాద్‌షానామా 403వ పేజీ (దానిని ఈ పేజీలోనే చూడండి.)లోని 28 నుంచి 35 లైన్లలో ఉన్నదానికి ప్రొఫెసర్ పి.ఎన్.ఓక్ ఆంగ్లానువాదం ఇది.

28. Covered with a majestic magnificient lush garden, to the south of that great city and
29. Amidst which (garden) the building known as th Palace (Manzil) of Raja Mansingh, at present owned by Raja Jai Singh
30. Grandson (of Mansingh) was selected for the burial of the Queen whose abode is in heaven
31. Althought Raja Jaisingh valued it greatly as his ancestral heritage and property, yet he would have been agreeable to part with it gratis for the Emperor Shahjahan.
32. (Still) out of sheer scrupulousness so essential in matters of bereavement and religious sanctity he (Jai Singh) was granted Sharifabad (in exchange)

* * *

35. Next Year that illustri... body of the heaven... queen was laid to rest.

తెలుగులో దీని అర్థం ఇది:

28. ఆ గొప్ప నగరానికి దక్షిణాన రాచఠీవిగల, రమణీయమైన, ఏపుగా పెరిగిన తోటతో ఆవరించబడి

29. తోట మధ్యలో ఒక భవంతి ఉన్నది. దానిని రాజా మాన్‌సింగ్ పాలెస్ (మంజిల్) అంటారు. ప్రస్తుతం దానికి యజమాని రాజా జయసింగ్

30. (అతడు మాన్‌సింగ్) మనవడు. (ఈ భవనాన్ని) స్వర్గస్థురాలైన రాణిని ఖననం చేయడం కోసం ఎంచుకున్నారు.



బాద్‌షానామా 403 వ పేజీనుండి.

31. వంశపారంపర్యంగా తనకు సంక్రమించిన ఈ ఆస్తిని గొప్ప విలువగలదిగా తలచినప్పటికీ రాజా జయసింగ్ దానిని షాజహాన్ చక్రవర్తికి ఉచితంగా వదిలిపెట్టటానికి సుముఖంగా ఉన్నాడు.

32. (అయినా) వియోగానికి, మతపరమైన పవిత్రతకు సంబంధించిన వ్యవహారాల్లో సూక్ష్మ విషయాల్లోనూ తప్పనిసరిగా చూపాల్సినట్టి నిష్ఠతో (ప్రతిఫలంగా జయసింగ్‌కు) షరీఫాబాద్ మంజూరు చేయబడింది.

* * *

35. మరుసటి సంవత్సరం స్వర్గలోకవాసి అయిన మహారాణి పార్థివ దేహం సమాధి చేయబడింది.

షాజహాన్ భార్య సమాధి స్థలంలో – ఆమె మరణించడానికి పూర్వమే ఒక పురాతన రాజమందిరం ఉండేదనీ, తాజ్‌మహల్‌కు వన్నెతెచ్చిన రమ్యమైన తోట కూడా షాజహాన్‌కు పూర్వం నుంచీ అక్కడ ఉండేదనీ! దీన్నిబట్టే తెలియడంలేదా? ప్రస్తుత తాజ్‌మహల్ వాస్తవానికి ప్రాచీన హిందూ రాజప్రాసాదం అనడానికి దీనికి మించిన రుజువు కావాలా?

పోనీ – ఆ స్థలంలో పురాతన మందిరమేదో ఉండేది; షాజహాన్ దానిని కూల్చేసి కొత్తగా తన అభిరుచి ప్రకారం అద్భుత సమాధి మందిరాన్ని నిర్మించి ఉంటాడు – అని అనుకుందామా? నేలమట్టం చేసే ఉద్దేశమే ఉంటే అంత పెద్ద సౌధాన్ని షాజహాన్ ఎందుకు సెలక్టు చేస్తాడు? భార్యను సమాధి చేయడానికి ఆ కాలాన ఆగ్రాలో ఖాళీస్థలాలే కరవొచ్చాయా? అనేక అంతస్థులు, వందల గదులు ఉన్న పురాతన రాజప్రాసాదాన్ని నేలమట్టం చేయటానికి, శిథిలాల కుప్పలను తొలగించటానికి, బృహత్ సౌధాన్ని కొత్తగా నిర్మించటానికి ఎన్నేళ్ళు

పడుతుంది? అది తయారయ్యేదాకా - ముంతాజ్ శవం ఎక్కడుంది?

తాను అమితంగా ప్రేమించిన అర్ధాంగి మరణించాక పాతిపెట్టటానికి గొప్ప సమాధి గృహం కట్టాలని ఆమె బతికుండగానే నిశ్చయించి, చాలా సంవత్సరాలు కష్టపడి అద్భుతంగా కట్టించి, సమాధి రెడీ! నీదే ఆలస్యం' అని షాజహాన్ అని ఉంటే వేరే సంగతి! కాని - అలా జరిగినట్టు ఆస్థాన చరిత్రకారులు ఎక్కడా చెప్పలేదు. రెడీమేడ్ సమాధి ఏదీలేదు కనుకే - షాజహాన్‌కు 14వ నెంబరు బిడ్డను కనే ప్రయత్నంలో పురుటిలోనే ముంతాజ్ బుర్హాన్‌పూర్‌లో మరణించినప్పుడు ఆమెను ఆ ఊళ్లోనే పాతిపెట్టారు. ఆగ్రాలో మాన్‌సింగ్ పాలెస్‌ను ఆక్రమించి సమాధి గృహంగా మార్చాలని షాజహాన్‌కు దురాలోచన కలిగాక, ఆరు నెలల తరవాత బుర్హాన్‌పూర్‌లోని గోరీ తవ్వి శవాన్ని 600 మైళ్ల దూరంలోని ఆగ్రా తీసుకుపోయి (ఇప్పుడు మనం తాజ్‌మహల్ అనుకునే చోట) సమాధి చేశారు. ఈ సంగతి **ఇనాయత్‌ఖాన్** రాసిన **షాజహాన్‌నామా** చూస్తే తెలుస్తుంది.

ఇనాయత్‌ఖాన్ ఎవరో కాదు. షాజహాన్‌కు సమకాలికుడు. అతడి తండ్రి జహంగీర్‌కు వజీరు. షాజహాన్ కొలువులో లైబ్రేరియన్‌గా ఉండగా, **బాద్‌షానామా** ఉద్గ్రంథాన్ని సరళమైన భాషలో సంక్షిప్తం చేసి ఇనాయత్‌ఖాన్ **షాజహాన్‌నామా**ను రాశాడు. దీని రాతప్రతిని 19వ శతాబ్దంలో **A.R.Fuller** ఇంగ్లీషులోకి అనువదించి ప్రపంచ ప్రసిద్ధికి తెచ్చాడు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రచురించిన షాజహాన్‌నామా లో ముంతాజ్ మరణం, ఖననం గురించి ఇలా ఉంది:

On the 17th of Zi'l-Qada, 1040 (17 june 1631) the unfortunate demise of Her Majesty the Queen took place.... This treasury of chastity was buried temporarily in a pavilion in the garden of Zainabad at Burhanpur... *(p. 70)*

(1631 సంవత్సరం జూన్ 17న మహారాణి మరణించింది. బుర్హాన్‌పూర్‌లోని జైనాబాద్ తోటలో ఆమెను తాత్కాలికంగా ఖననం చేశారు.)

On the 17th of Jumada I 1041 (11 December 1631), the sacred remains of Her late Majesty the Queen were sent from Burhanpur to the metropolis of Akbaradad.... To the south of the metropolis, a luxuriant piece of high ground, which had formerly been the property of Raja Man Singh and now belonged to his grandson Raja Jai Singh, was selected as the burial place for that "Dweller in Paradise"... After its arrival at Akbarabad the blessed corpse was consigned to the earth on the 15th Jumada II 1041 (15 January 1632)...

[***Shah Jahan Nama* - A.R.Fuller,** *p. 73-74*]

(1631 డిసెంబర్ 11న స్వర్గీయ మహారాణి వారి భౌతిక దేహాన్ని బుర్హాన్‌పూర్ నుంచి అక్బరాబాద్ (ఆగ్రా)కు తరలించారు... ఆ నగరానికి దక్షిణాన ఆమె సమాధికి ఎత్తుమీద ఉన్న చక్కటి స్థలాన్ని ఎంపిక చేశారు. అది పూర్వం రాజా మాన్‌సింగ్ ఆస్తి. ప్రస్తుతం ఆయన మనవడు రాజా జయసింగుకు చెంది ఉంది... అక్బరాబాద్ (ఆగ్రా)కు చేరుకున్న మీదట భౌతికకాయాన్ని 1632 జనవరి 15న భూస్థాపితం

చేశారు.)

ఒకవేళ - చోటు బాగుంది, లొకాలిటీ బాగుంది కాబట్టి రాణిగారి సమాధికి పాలెస్ ఎస్టేటును ఎంచుకున్నారు; ఖాళీ స్థలంలో గొయ్యి తీసి రాణి శవాన్ని రెండోమారు సమాధి చేశాక దాని చుట్టూ అద్భుతమైన పాలరాతి సౌధాన్ని చాలా ఏళ్లు కష్టపడి నిర్మించారు - అనుకుందామా?

ఇప్పుడు అనుకోవడం ఏమిటి? ఇంతకాలమూ ప్రపంచమంతా నమ్ముతున్నదే అది. ప్రామాణికమైన ఆధునిక విజ్ఞాన సర్వస్వంగా అందరూ పరిగణించే ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా లోనూ ఇదే మాట ఉంది:

> "…. She died… in Burhanpur in 1631… The building was commenced in 1632 after plans had been prepared by a council of architects from India, Persia, Central Asia and beyond… More than 20,000 workmen were employed daily to complete the Mausoleum building itself by about 1643 although the whole Taj complex took 22 years to complete, at a cost of 40,000,000 rupees."
>
> *ముంతాజ్ 1631లో మరణించగా 1632లో భవన నిర్మాణం మొదలైందట. ఇండియా, పర్షియా, మధ్య ఆసియా, ఇంకా ఆవలి నుంచి కూడా వచ్చిన ఆర్కిటెక్టుల మండలి వేసిన ప్లాన్ల ప్రకారం రోజూ ఇరవై వేలకు పైగా పనివారు కష్టించి 1643 నాటికి (అంటే పదకొండేళ్ల తర్వాత) మాసోలియం (సమాధి మందిరాన్ని) పూర్తి చేశారట. మొత్తం తాజ్‌కాంప్లెక్సు నిర్మాణానికి 22 ఏళ్లు పట్టిందట. నాలుగు కోట్ల రూపాయలు ఖర్చయ్యాయట.*


ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా చెప్పింది కనుక… అనేక తరాలుగా స్వదేశీ, విదేశీ మేధావులు, మహాచరిత్రకారులు అందరూ ఇదే మాట అన్నారు కనుక… అదే నిజమని మనమంతా నమ్మేస్తున్నాం. కాని -

సువిశాల మహాసామ్రాజ్యాన్ని ఏలే చక్రవర్తిగారు మరణించిన పట్టమహిషికి స్మృతి చిహ్నంగా ప్రపంచంలో ఏ భర్తా ఏ భార్యకూ చేయని రీతిలో సమాధిపై అద్భుత సౌధాన్ని నిర్మించదలిస్తే…


దేశదేశాల నుంచి మహాశిల్పులను రావించి, వారితో ఒక మండలి ఏర్పరచి, దానిచేత ప్లాను గీయించి, ఒక మహా ప్రాసాదానికి రూపకల్పన చేయిస్తే…

రోజుకు 20 వేల మంది పనివారిని పెట్టి ఏకంగా ఇరవై రెండేళ్ల పాటు కోట్ల రూపాయలు వెచ్చించి భారీ ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమం ఏకధాటిగా కొనసాగితే..

మొత్తం సామ్రాజ్యంలో అనేక సంవత్సరాల పర్యంతం అదే పెద్ద విశేషం కాదా? ప్రభుత్వ యంత్రాంగం యావత్తూ ఆ పనిమీద ఏళ్ల తరబడి నిమగ్నమై ఉండాలి కదా? మహాశిల్పులను పిలిపించటం, వారు రకరకాల ప్రతిపాదనలు చేయటం, వాటిని ప్రభువులు పరిశీలించటం, చివరికి ఖరారు చేసిన ప్లాను ప్రకారం పని ప్రారంభించటం, అసలైన సమాధి గృహాన్ని పూర్తిచేయటం, మిగతా నిర్మాణాలను సాగించటం… ఇవన్నీ కోలాహలంగా జరిగి ఉండాలి




యమునా నదివైపు నుంచి చూస్తే కనిపించే తాజ్‌మహల్ దృశ్యం. ముందు నుంచి కనిపించే ...గంతస్థుల పాలరాతి కట్టడానికి దిగువన నదిమట్టం వరకు మరో రెండు అంతస్థులు ఉండటా... చూడవచ్చు. మధ్యలో కనిపించే అర్చిల వరసకు వెనక 22 గదులున్నాయి.



...జ్‌మహల్‌కు వాకిటనే కాపిగార్లు. ప్రతి హిందూ రాజమహల్‌లో ఉండేవే. గార్డులు, బోయీలు, పరిచారకులు వీటిలో ఉండేవారు. కుడిఎడమల అష్టభుజాకారంలో గోపురాలు చూడవచ్చు.

అష్టభుజాకారంలోని బావి. ఏడంతస్తుల్లో ప్రతి అంతస్తు నుంచి ఇందులోకి ప్రవేశద్వారాలున్నా
ంది అంతస్తుల్లో డబ్బు, నగలు, రత్నాలపెట్టెలను ఉంచేవారు. శత్రువులు దాడిచేసేటప్పుడు వల్లువై
న్నిటినీ బావిలోకి విసిరేవారు. పాలరాతి తాజ్‌కు పశ్చిమాన మసీదు సమీపంలోని ఒక టవరులో
ఈ బావివుంది. రాజమహలులో ఇలాంటివి వుండటం సహజం. ఆత్మలకు నగానట్రా దాచుకునే
వస్తలు, శత్రువుల బెడదలు వుండవు కనుక సమాధి మందిరంలో ఇటువంటి ఏర్పాటు అనూహ్య



తాజ్‌మహల్ ప్రాంగణంలో వక్కల్‌ఖానా అనే మ్యూజిక్‌హౌస్ మసీదు ముందు సంగీత వాద్యాలు మోగించడాన్నే ముస్లింలు మహాపరాధంగా పరిగణిస్తారు. అలాంటిది మసీదు, సమాధి గృహం ఉన్నచోట సంగీతశాలలతో ఏమి పని? హిందూ రాజమహల్‌లోనైతే రోజూ భేరీ మృదంగ వాద్యాలకు ఇలాంటి ఏర్పాట్లు మామూలే.

కదా? రోజుకు వేల మందిని నియోగించటానికి, పాలరాతిని, నిర్మాణ సామగ్రిని ఎక్కడెక్కడి నుంచో తెప్పించటానికి, సరుకు కొనుగోలుకు, రవాణాకు.... రోజూ బోలెడు ఖర్చు జరిగి ఉండాలికదా? ఆ లెక్కలన్నీ ఎక్కడో రాసి ఉండాలి కదా? ప్రపంచంలో కనీవినీ ఎరుగని ఇలాంటి ప్రేమ సమాధి మహా నిర్మాణ యజ్ఞాన్ని ఏళ్ల పర్యంతం కళ్లచూసిన ఆస్థాన భజనపరులు ఆ వివరాలన్నిటినీ చిలవలు పలవలుగా వర్ణించి ఉండాలి కదా?

ఎక్కడ ఆ రికార్డులు?

నమ్ముతారో లేదో! తాజ్‌మహల్ నిర్మాణానికి సంబంధించి మొగలు దర్బారులో పిసరంత రికార్డు కూడా లేదు. అసలలాంటి భారీ నిర్మాణం ఒకటి సాగిన దాఖలాయే ఎక్కడా కనపడదు. నలభై లక్షల రూపాయలని ఒకరు.... యాభై లక్షలని ఒకరు... నాలుగు కోట్లని ఒకరు.. తొమ్మిది కోట్లని ఒకరు ఖర్చు అంచనాలను తరవాతి కాలంలో ఊహించడమే తప్ప నిర్మాణ వ్యయానికి సంబంధించిన ఖర్చుల వివరాలు ఇదమిత్థంగా ఎక్కడా లేవు.

పోనీ – శతాబ్దాల కిందట జరిగిన పని కాబట్టి రికార్డులు పోయాయని అనుకుందామా? అక్బర్ కాలం నుంచి ఔరంగజేబు దాకా మొగల్ సామ్రాజ్య పతనం వరకూ జరిగిన ముఖ్య కార్యాలన్నిటికీ, పెట్టిన ప్రధాన ఖర్చులన్నిటికీ రికార్డు ఉంది కదా? అన్నిటిలోకి అతి ముఖ్యమైన ఈ ప్రేమ మందిర నిర్మాణానికి మాత్రం రికార్డు ఎందుకు లేదు?

షాజహాన్ చక్రవర్తికి పబ్లిసిటీ ఇష్టం ఉండదనీ... ఆయన తాను చేయదలచినవన్నీ మూడో మనిషికి తెలియకుండా, ఎక్కడా రికార్డు లేకుండా గప్‌చుప్‌గా చేసే మనిషనీ సరిపుచ్చుకుందామా? ఊహుఁ ఆ ఆశా లేదు. షాజహాన్‌కున్నంత పబ్లిసిటీ పిచ్చి ఇంకే మొగల్ చక్రవర్తికీ లేదు. సింహాసనం అందుకోవడానికి ముందు నుంచే చరిత్రలో తనకు ప్రత్యేక స్థానం ఉండాలని తహతహలాడాడు. తాను చేసే ప్రతి పనినీ, చెప్పే ప్రతి మాటనూ అందమైన భాషలో అక్షరబద్ధం చేయడానికి గద్దెనెక్కిన వెంటనే అతడు వ్రాయసగాళ్లను నియమించాడు. రాతగాడు రాసిన ప్రతి ముక్కనూ తాను తనిఖీచేసి, తన ఇమేజి పెరిగే రీతిలో అతిశయోక్తులతో సవరణలు జరిపిన తరవాతే చిత్తుప్రతిని రికార్డులోకి ఎక్కనిచ్చేవాడు. ఈ రికార్డుల పైత్యం ఎంత దూరం వెళ్లిందో 1609లో షాజహాన్ దర్బారును దర్శించిన ఇంగ్లీషు యాత్రికుడు విలియం హాకిన్స్ మాటల్లో చెప్పాలంటే..

> "During the time that he drinks his six cups of strong liquor, he says and does many idle things; yet whatever he says or does, whether drunk or sober, there are writers who attend him in rotation.... so that not a single incident of his life but is recorded, even his going to the necessary and when he lies with his wives..."
>
> [**Elliot & Dowson**, *Vol. VII p.176*]

(ఆరు కప్పుల చిక్కని మద్యాన్ని సేవించేటప్పుడు ఆయన పనికి మాలిన మాటలు చాలా అంటాడు. మందుకొట్టినప్పుడూ, కొట్టనప్పుడూ కూడా ఆయన ఏమి చెప్పినా, ఏమి చేసినా వెంటనే రికార్డు చేయడానికి రొటేషన్ పద్ధతిలో రాతగాళ్లు కాచుకుని ఉంటారు. ఆయన జీవితంలో ఏ చిన్న ఘటననూ వారు రికార్డు

చేయకుండా మానరు - ఆఖరికి ఆయన మరుగుదొడ్డికి వెళ్లటం, భార్యలతో శయనించటం కూడా...)

చక్రవర్తి కాలకృత్యాల కార్యక్రమాలను కూడా వదలకుండా రాసి పెట్టినవారు తమ రాజ్యంలో కోట్లు ఖర్చుపెట్టి వేల మందిని నియమించి నిజంగా అపురూప పాలరాతి సౌధం ఒకటి నిర్మాణం అయి ఉంటే వాటి వివరాలన్నీ దస్తాల లెక్కన దస్త్రాల్లో రాసి పెట్టకుండా ఉండేవారా?

ముంతాజ్ మహల్‌నుబట్టి తాజ్‌మహల్ అన్న పేరు వచ్చిందని మనం ఊహించటమే తప్ప - వాస్తవానికి షాజహాన్ భార్య పేరు ముంతాజ్ మహల్ కాదు. ముంతాజ్ - ఉల్-జామాని. ఆమె అసలు పేరు అంజుమంద్ బాను బేగం. ముంతాజ్ అన్న పేరును విరిచేసి అందులోని 'తాజ్'ముక్కను 'మహల్'ను తగిలించటం ఇస్లామిక్ సంప్రదాయం కాదు. సమాధి మందిరాన్ని 'మహల్' అని పిలవటం ప్రపంచంలోని ఏ ముస్లిం సమాజంలోనూ లేదు. అదీగాక - తాజ్‌మహల్‌ను షాజ్‌హాన్ కట్టించినట్టు గాని, ముంతాజ్‌ను అక్కడ ఖననం చేసినట్టుగానీ, అనంతర కాలంలో షాజ్‌హాన్‌ను అక్కడ పూడ్చినందుకు దాఖలాగా గానీ తాజ్‌మహల్ వద్ద ఒక శాసనమూ లేదు... ఒక శిలాఫలకమూ లేదు. ఎందుకని? అది కబ్జా చేసిన పురాతన రాజభవనం అన్న నిజం ప్రజలందరికీ తెలుసు కనకేనా దాన్ని తన ఘనకార్యంగా చిత్రించుకునేందుకు షాజహాన్ సాహసించలేకపోయింది?

నిజానికి షాజహాన్, ముంతాజ్‌లు పుట్టకముందు నుంచీ తాజ్‌మహల్ ఉంది. ఇంకా చెప్పాలంటే మొగల్ సామ్రాజ్య స్థాపకుడైన బాబర్ కూడా అందులో నివసించాడు.

> "On Thursday I entered Agra and took up my residence at Sultan Ibrahim's palace... ... A few days after the Id we had a great feast in the grand hall, which is adorned with the peri-style of stone pillars, under the dome..."
>
> *(గురువారం నేను ఆగ్రాలో ప్రవేశించి సుల్తాన్ ఇబ్రహీం పాలెస్‌లో నివాసం ఏర్పరచుకున్నాను... ఈద్‌కు కొన్ని రోజుల తరవాత అక్కడ డోము (గుమ్మటం) కింద రాతి స్తంభాల శ్రేణిలో రమ్యమైన గ్రాండ్‌హాలులో గొప్ప విందు చేసుకున్నాం)* అని బాబర్ తన జ్ఞాపకాల్లో రాసుకున్నాడు. ***[Memoirs of Zehir - Ed - Din - Babur, Vol.II p. 192 & 251]*** రాతి గుమ్మటమూ, రాతి స్తంభాల శ్రేణిగల పాలెస్ ఆగ్రాలో 'తాజ్‌మహల్' ఒక్కటే. అలాగే - ఆగ్రాలోని గార్డెన్ పాలెస్‌లో బాబర్ మరణించాడని విన్సెంట్ స్మిత్ రాశాడు. తాజ్‌మహల్ మినహా ఇంకో తోట పాలెస్ ఏదీ ఆగ్రాలో లేదు.

ఇలాంటి క్లూలనుబట్టి తనకు స్ఫురించేది నిజమో కాదో అని సందేహించాల్సిన పనిలేదు. ముంతాజ్‌ను పూడ్చి పెట్టేనాటికే తాజ్‌మహల్ పురాతన సౌధమని షాజహాన్‌కు స్వయానా కొడుకైన ఔరంగజేబే లిఖితపూర్వకంగా ధ్రువీకరించాడు. 1652లో రాజకుమారుడు ఔరంగజేబ్ తండ్రికి రాసిన లేఖలో తన తల్లిని సమాధి చేసిన స్థలంలో ఉన్న ఏడంతస్తుల భవనం చాలా పురాతనమైందని, ఎక్కడికక్కడ నీరు లీక్ అవుతున్నదని, ఉత్తరం వైపు ఉన్న డోము (గుమ్మటం) పగులుబారిందని పేర్కొన్నాడు. ఔరంగజేబ్ రాసిన ఈ ఉత్తరం ప్రస్తావన

Aadaab-e- Alamgiri, Yadgarnama, Muruqqa-i Akbarabadi అనే మూడు పర్షియన్ గ్రంథాల్లో కనిపిస్తుంది. తక్షణం జరగాల్సిన మరమ్మతులను సొంత ఖర్చుతో తాను చేయిస్తున్నానని, విస్తృతమైన మరమ్మతు లను వీలువెంబడి చక్రవర్తి చేయించదగునని ఆ ఉత్తరంలో ఔరంగజేబు రాశాడు. [*Taj Mahal - The True story* By P.N.Oak, *p.275*] 1632లో మొదలుపెట్టి 22 ఏళ్ల కాలం తాజ్ నిర్మాణాలు సాగాయని అనంతరకాలపు చరిత్రకారులు చెప్పేది నిజమైతే ఔరంగజేబు ఆ ఉత్తరం రాసేనాటికి అసలు తాజ్‌మహాల్ నిర్మాణమే ఇంకా పూర్తి అయి ఉండకూడదు కదా? 1652నాటికే ఆ భవన సముదాయం పాతబడి మరమ్మతులు అవసరమయ్యాయని యువరాజే స్వయంగా చూసి చెప్పగా.. సరికొత్త తాజ్‌మహాల్ నిర్మాణం 1653నాటికి పూర్తయిందని అన్నీ తెలిసిన భారతప్రభుత్వం వారు తాజ్‌మహాలు ముందు పెట్టిన నోటీసులో ఎలా చెప్పారు?

మరో విషయం. న్యూయార్క్‌కు చెందిన ప్రొఫెసర్ మార్విన్ మిల్లర్ తాజ్‌మహాల్ తలుపుల్లో నదివైపు ఉన్నదాని నుంచి శాంపిల్ తీసుకుని కార్బన్ డేటింగ్ టెస్టు చేయిస్తే ఆ తలుపు షాజ్‌హాన్‌కంటే 300 సంవత్సరాల పాతదని తేలింది.

దేశదేశాల నుంచి ప్రత్యేకంగా శిల్పులను రావించి బ్రహ్మాండమైన ప్లాన్లు వేయించి ఇరవై వేల మంది పనివారిని పెట్టి పునాదుల నుంచి కొత్తగా కట్టించడమే నిజమైతే- సమాధి కోసమని నిర్మించిన భవనం అచ్చు సమాధి మందిరంలాగే ఉండాలి కదా? రాణిగారి పవిత్రాత్మ మినహా మనుషులెవరూ అక్కడ కాపురం ఉండబోవటం లేదు కనక వందలాది గదులూ గాదాలూ ఉండే అవసరమే లేదుకదా? మరి - తాజ్‌మహాల్ ఎలా ఉంది.

The Taj and Its Environments అనే ప్రసిద్ధ గ్రంథంలో మౌల్వీ మొయినుద్దీన్ అహ్మద్ తాజ్‌మహాల్ నిర్మాణాలను వివరిస్తూ ఇలా అన్నాడు.

> The place between the chicf gate of the mausolenm and the grand portal was known as Jilo Khana... The area enclosed within the four walls of Jilo Khana was occupied by 128 rooms of which only 76 remain... Near the garden wall there are two Khawaspuras each containing 32 rooms..(At present half of the eastern "pura" is occupied by a cowstable)" - *(p.64)*
>
> *(సమాధి మందిరం ప్రధాన ద్వారం నుంచి గ్రాండ్ పోర్టల్ వరకూ ఉన్న స్థలాన్ని జిలోఖానా అంటారు... దాని నాలుగు గోడల మధ్య 128 గదులుండేవి. వాటిలో 76 మాత్రమే ఇప్పుడు మిగిలాయి... తోట గోడ సమీపంలో రెండు 'ఖవాస్‌పురా'లు ఉన్నాయి. ఒక్కో 'పురా'లో 32 చొప్పున గదులున్నాయి... (తూర్పువైపు 'పురా' సగభాగంలో ఇప్పుడు గోశాల ఉంది.)*

రాచవారి సమాధులకు వెనుక బేస్‌మెంటులో 14 గదులున్నాయని, రాతి స్లాబులతో అక్కడికి మెట్ల దారి మూసి ఉందని, భూగృహంలో అన్ని గదులు ఎందుకు కట్టారో అర్థం కాలేదని కూడా మౌల్వీ మొయినుద్దీన్ రాశాడు. మూడో అంతస్థులో నాలుగు అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఆ అంతస్థు మూలలలో అష్టభుజాకారంలో గదులున్నాయి; ఒక్కోదానికి నాలుగు ద్వారాలున్నాయి. నాలుగు స్టెయిర్ కేసులున్నాయి. అక్కడి నుంచి 34 మెట్లు ఎక్కితే పూర్తిగా

పైకి వెళతాం. అక్కడ నాలుగు మూలలా నాలుగు టవర్లున్నాయి. ఒక్కో దానికి ఎనిమిది తలుపులున్నాయి. ప్రతి టవరుమీదా ఇత్తడి కలశాలున్నాయి - అని కూడా ఆయన వివరించాడు. పై టవర్ల మీద కలశాలు, ఒక్కో అంతస్థులో అన్నేసి గదులు, భూగృహంలో రహస్య గదులు, ఎనిమిది లోహాల మిశ్రమంతో చేసిన ప్రధాన ద్వారానికి ఇత్తడి మేకులు ఎందుకున్నాయో మౌల్వీకి అర్థం కాలేదు. పాలరాతి కట్టడాన్ని, ముందున్న తోటను ఆవరిస్తూ కట్టిన గోడకు లోపల ప్రతి అంతస్థుమీదా ఒక అపార్టుమెంటు తగిలేలా బహుళ అంతస్థుల బావి ఒకటి తవ్వి ఉందిట: పక్కన ఉన్న యమునా నది నుంచి దానికి నీరు చేరేది. ఈ హంగులు, కట్టడాలు అన్నీ ఒక సమాధి మందిరం సముదాయంలో ఎందుకున్నాయన్నది ప్రశ్న. Outside the enclosure at the south are ancillary buildings, such as stables, outhouses and guard Quarters (దక్షిణాన ఎన్‌క్లోజరుకు బయట అశ్వశాలలు, ఔట్‌హౌస్‌లు, గార్డుల క్వార్టర్ల వంటి ఉపభవనాలు ఉన్నాయి) అని ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా కూడా చెబుతుంది. సమాధి గృహంలో అశ్వశాలలు, ఔట్‌హౌస్‌లు ఎందుకున్నాయని సదరు విజ్ఞాన సర్వస్వ కర్తలు ఆలోచించి ఉండరు!

ఆ భవన సముదాయం సమాధి కోసం కట్టింది కాదని, ఒరిజినల్‌గా అది ఒక రాజమహలనీ గుర్తుంచుకుంటే ఈ వివరాల్లో విస్తుపోవలసింది ఏదీలేదు. రెండు బేస్‌మెంట్లు, ఏడు అంతస్థులూ, అనేక గోపురాలూ కలిసి తాజ్‌భవన సముదాయంలో కనీసం 350 గదులున్నాయి. గార్డు రూములు, గెస్టు రూములు, అనేక ఎనెక్సీలు రాజభవనాల్లో లాగే ఉన్నాయి. శత్రువులు చొచ్చుకురాకుండా ప్రధాన ద్వారానికి ఇత్తడి మేకులు దిగగొట్టటమూ, ఖైదీలను ఉంచటానికి, రహస్య సమాలోచనలకు నేలమాళిగలూ... ఎమర్జన్సీలో తప్పించుకుపోవటానికి భూగర్భ మార్గాలు... వందలాది రాజపరివారానికీ, పనివారికి, వచ్చేపోయే అతిథులకు వందలాది గదులు, ఔట్‌హౌసులు, అశ్వశాలలు, గోశాలలు, వాద్యశాలలు, హిందూ వాస్తు శాస్త్రప్రకారం అష్టభుజ మందిరాలు, గోపురాలపై కలశాలు, ఆపదవచ్చినప్పుడు విలువైన సంపద విరోధులకు చిక్కకుండా మూటకట్టి బావిలో వేయటానికి ప్రతి అంతస్థులోను ఏర్పాట్లు.. ప్రతి రాజప్రాసాదంలోనూ సాధారణంగా ఉండేవే.

మరి - షాజహాన్ చేయి చేసుకున్నది ఎక్కడ?

గోరీలు, సమాధులు ఉన్నచోట్ల గోతులు తీయటం, పూడ్చటం, ఫ్లోరింగుకు, గోడలకు నగిషీలు చెక్కటం, మాసోలియాన్ని అందంగా మలచటం, గోడల మీద, ఆర్చిలమీద ఖొరాన్ సూక్తులను చెక్కించటం వంటి పైపై పనులు మాత్రమే బహుశా షాజహాన్ చేయించి ఉండాలి. అదీ ఒక్కసారిగా మొదలెట్టి చకచకా పూర్తిచేసిన పనికాదు. 1641లో భారతదేశం వచ్చిన విదేశీ యాత్రికుడు టావెర్నియర్ తాను వచ్చాకే (అంటే ముంతాజ్‌ను మళ్ళీ సమాధి చేసి కనీసం తొమ్మిదేళ్లు గడిచాకే) తాజ్‌మహల్ పనులు మొదలై 14 ఏళ్లపాటు సాగాయని తన గ్రంథంలో రాశాడు. ఇంతోటి పై మెరుగుల పనులకు బ్రిటీష్ ఎన్‌సైక్లోపీడియాలో చెప్పినట్టు రోజూ ఇరవై వేల మంది పనివారు ఇరవై రెండేళ్లపాటు రెక్కలు ముక్కలు చేసుకోవలసింది ఏమీ లేదు. (పది మంది కార్మికులు ఆరు సంవత్సరాలపాటు పనిచేసినా 10×365×6=21900 పనిదినాలు అవుతుంది). పైగా - నియోగించిన పనివారికి కనీస వేతనాలు ఇవ్వకుండా, సరైన తిండి కూడా పెట్టకుండా వెట్టిచాకిరి చేయించి, ఎదురు తిరిగేవారిని దారుణంగా హింసించేవారనడానికి

అనేక దృష్టాంతాలున్నాయి. తాజ్‌మహల్ మీద ఖర్చయిన సొమ్ముకంటే ఆ పేరు చెప్పి రాజాల నుంచి, మున్సబ్‌దారుల నుంచి విరాళాలుగా షాజహాన్ గుంజిందే ఎన్నో రెట్లు ఎక్కువ.

తాజ్‌మహల్ గురించి వాస్తవాలు తెలియకపోయినా ఊహలకు, కట్టుకథలకు మాత్రం లోటులేదు. అంతటి అపురూప కళాఖండాన్ని మరెక్కడా ఇంకెవరూ నిర్మించకుండా పని పూర్తవగానే షాజహాన్ శిల్పుల చేతులు నరికించాడన్నది వీటిలో ఒకటి. తాజ్‌మహల్‌ను నిజంగా షాజహానే కట్టించి ఉంటే... మరణించిన భార్యకు గురుతుగా అంత అద్భుత కళాసృష్టిని చేయించగలిగిన ప్రేమమూర్తికి తన కోసం ఆ బృహత్ నిర్మాణాన్ని చేసి పెట్టిన కళాకారుల చేతులు నరికించేంత క్రౌర్యం ఉంటుందని నమ్మడం కష్టం.

షాజహాన్ చక్రవర్తి అటువంటి కిరాతకాలకు పాల్పడే రకం కాదని కాదు. అతడు స్వతహాగా క్రూరుడు. ఆ సంగతి గుడ్డివాడయిన అన్నను తన రక్షణలో ఉంచమని తండ్రికి చెప్పి, రాత్రివేళ రహస్యంగా ఖూనీ చేయించినప్పుడే తెలిసింది. జహంగీర్ మరణానంతరం లైన్ క్లియరయింది నీవు రావొచ్చునని మామ ఆసఫ్‌ఖాన్ కబురంపాక దక్కన్ నుంచి తాను తిరిగి వచ్చి గద్దెనెక్కేలోపే తన సోదరులను, దాయాదులను అందరినీ సఫా చేసెయ్యమని చెప్పిన వైనమే షాజహాన్ క్రూర స్వభావాన్ని వెల్లడిస్తుంది.

గతించిన ప్రియసతికి గుర్తుగా రమణీయ పాలరాతి సౌధాన్ని అతడే కట్టించాడన్న ఊహతో షాజహాన్ గొప్ప ప్రేమికుడు, గొప్ప మానవుడు అని మనం అనేసుకుంటాం. కాని వాస్తవానికి అంజుమన్ బాను అలియాస్ ముంతాజ్ మీద ఆయనలో ప్రేమ ప్రవాహం పొంగి కట్టలు తెంచుకున్న దాఖలా ఏదీ లేదు. నూర్జహాన్‌మీద జహంగీర్ కనపరచిన ప్రేమలో నూరోవంతయినా షాజహాన్‌కు ముంతాజ్‌మీద ఉన్నట్టు కనపడదు. మొదటి భర్త అనుమానాస్పద పరిస్థితుల్లో ఖూనీ అయ్యాక జహంగీర్ సవతి తల్లి ఆశ్రయంలో ఉన్న నూర్జహాన్‌ను రాణిగా చేపట్టినది మొదలుకుని జీవితాంతమూ జహంగీర్ ప్రేమపూజారిలా ఆమెను ఆరాధించాడు. స్త్రీని భోగవస్తువుగా చూసే మొగల్ పాదుషాల వైఖరికి భిన్నంగా భార్యను నెత్తిన పెట్టుకుని అధికారమంతా ఆమె చేతిలో పెట్టాడు. ఆమె పేరిట నాణాలు ముద్రించాడు. జారీచేసే ప్రతి ఫర్మానా మీదా చక్రవర్తితో పాటు ఆమె పేరూ ఉండేది. పేరుకు జహంగీర్ రాజు అయినా నూర్జహానే చక్రం తిప్పేది.

మరి షాజహాన్....?

తన రాజకీయ తంత్రంలో భాగంగా కుర్ర యువరాజు ఖుర్రం (అతడే తరవాత షాజహాన్)కు తన మేనకోడలు ముంతాజ్‌ను నూర్జహాన్ కట్టబెట్టింది. ఆమె రాచకన్య కాదు కనుక నిశ్చితార్థం చేసుకున్న ఐదేళ్లకుగానీ షాజహాన్ ఆమెను పెళ్ళాడలేదు. ఈలోపు ఓ పారసీక రాకుమారిని వివాహం చేసుకున్నాడు. చక్రవర్తి కావడానికి ముందు గానీ తరవాతగానీ ముంతాజ్ మీద (గ్యాప్ లేకుండా పధ్నాలుగు కాన్పులు చేయించడం మినహా) వల్లమాలిన ప్రేమ కనబరచిన సందర్భాన్ని ఆస్థాన భజనగాళ్లు ఎక్కడా రాయలేదు. చనిపోయాక తాజ్‌మహల్ సముదాయంలో ఖననం చేసి గొప్ప సమాధి సౌధంగా నగిషీలు చెక్కించినా, ఆ ప్రాంతంలో పూడ్చిపెట్టింది ముంతాజ్ ఒక్కదాన్నే కాదు. షాజహాన్ ఇంకో భార్య సిర్హింద్ బేగంకు... ముంతాజ్ బేగం రాణిగారికి ఇష్టమైన పరిచారిక సతీఉన్నీసాకు కూడా అదే కాంప్లెక్సులో గోరీలు కట్టారు. ఆక్రమించిన రాజమహల్‌ను బొందలదిబ్బగా

మార్చాలనుకున్నారే తప్ప స్పెషల్‌గా ముంతాజ్ దివ్యస్మృతికే దానిని శాశ్వత హారతిగా ఉద్దేశించలేదని దీన్నిబట్టే తెలుస్తుంది. రాణికి, పరిచారికకు ఒకే విధమైన సమాధులు కట్టించటాన్నిబట్టే షాజహాన్ దృష్టిలో రాణికి ఉన్న స్థానమేమిటో బోధపడుతుంది.

ఎవరూ తొంగి చూడకుండా చాలా గదులను షాజహాన్ కాలంలోనే రాయిరప్పతో నింపి మూసేశారు. సమాధులు ఉన్న పరిసరాలు మినహా మిగతా అంతస్థులను, సముదాయంలోని భవనాలను సందర్శకులు చూడటానికి వీలులేకుండా స్వతంత్ర భారతంలోనూ ప్రభుత్వం మూసేసింది. మొత్తం 7 అంతస్థుల్లో ఐదింటికి సీళ్లు వేశారు. దాంతో చారిత్రకమైన తాజ్‌మహల్ కాంప్లెక్సును పూర్తిగా చూసే అవకాశం ప్రజలకు లేకుండాపోయింది.

తాజ్‌మహల్ పురాతన రాజమహల్ అని **పి.ఎన్.ఓక్** అనే పెద్దాయన ముప్పై ఎనిమిదేళ్ల కిందే మొత్తుకుని, ప్రబల సాక్ష్యాధారాలతో పుస్తకాల మీద పుస్తకాలు రాశాడు. అయినా చారిత్రక వక్రీకరణను సరిచేయాలన్న ఆలోచన ఏ ప్రభుత్వానికీ లేకపోయింది. లోకం దారి లోకానిదే.. వాస్తవాల గతి వాస్తవాలదే.

తాజ్‌మహల్ సముదాయం షాజహాన్ కట్టినది కాదని గుర్తించినందువల్ల, వాస్తవంగా అది పురాతన రాజమహలని గ్రహించినందువల్ల ఇప్పుడు ఎవరికీ నష్టంలేదు. కష్టం లేదు. బాబరీ మసీదు వివాదం వలె ఇందులో మతపరమైన ఉద్రిక్తత రేకెత్తే విషయం ఏదీలేదు. అద్వితీయ ప్రాముఖ్యంగల జాతీయ కట్టడపు చరిత్రను సరిగా అర్థం చేసుకుని, అబద్ధాల నుంచి అజ్ఞానం నుంచి బయటపడినందువల్ల జాతికి మంచే తప్ప హాని జరగదు. పూర్వాశ్రమంలో అది రాజమహల్ అని అంగీకరించినందువల్ల తాజ్‌మహల్ అందచందాలేవీ తరిగిపోవు.

మరి – ఎవరికైనా అభ్యంతరం ఎందుకుండాలి?

ఔరా! ఔరంగజేబు

తన శిష్యుడు చక్రవర్తి అయ్యాడని తెలిసి ఆ గురువు పొంగిపోయాడు. దేశానికి రాజయినా తనకు శిష్యుడు కాకపోతాడా... చిన్నప్పుడు తన దగ్గర చదువుకున్న సంగతి మరచిపోతాడా... గురుదక్షిణగా మంచి మున్సబీ అయినా ఇవ్వకపోతాడా... ఓ మోస్తరు జాగీరు ఇచ్చినా తన బతుకు సుఖంగా వెళ్ళిపోతుంది కదా – అని ఎంతో ముచ్చటపడ్డాడు. ఆ ఆశతోనే తానున్న కాబూల్ నుంచి రెక్కలు కట్టుకుని ఢిల్లీలో రివ్వున వాలాడు. రాజాస్థానంలోకి నేరుగా వెళ్లి రాజ పరివారంలో అందరినీ పలకరిస్తూ, కలివిడిగా తిరిగేస్తూ, చక్రవర్తి నుంచి పిలుపు కోసం, అందుకోబోయే బహుమానం కోసం ఎదురుచూడసాగాడు.

చక్రవర్తి స్థానంలో వేరెవరైనా ఉంటే అతడి పని సులువుగా అయ్యేదే. ఎంతయినా తనకు చదువు చెప్పిన పెద్దమనిషి. ఆశపడి వచ్చాడు. మున్సబీలు, జాగీర్లు ఇవ్వడం ఇష్టం లేకపోతే కనీసం మంచి బట్టలిచ్చి, కాసిని డబ్బులు చేతిలో పెట్టయినా ఇంకో ఇంకో రాజయితే మర్యాదగా పంపించేవాడే. దానికీ మనసొప్పకపోతే కడుపునిండేలా కనీసం ఒక మంచి మాటయినా పలికి సాదరంగా సాగనంపేవాడే.

కాని – ఈ చక్రవర్తి ఔరంగజేబు! అందరిలాంటివాడు కాదు. తనచుట్టూ తిరుగుతున్న ముల్లాషాను మూణ్ణెల్లు చూసీ చూడనట్టు ఉపేక్షించి చివరికి ఒక రోజు ముసలి మాస్టార్ని తన సన్నిధికి పిలిపించాడు. పరుగున వచ్చిన అయ్యవారికి సభాసదులందరూ వింటుండగా భేషైన క్లాసు తీసుకున్నాడు. ఏమి చెప్పాడు అన్నది ఆ కాలంలో మొగలు దర్బారులో వైద్యుడిగా ఉన్న **Francois Bernier** 0సుప్రసిద్ధమైన తన ***Travels in the Mogul Empire*** గ్రంథంలో 155 నుంచి 161 దాకా ఏడు పేజీల్లో ఏకరవు పెట్టాడు. సారాంశం ఏమిటంటే ...

"ఏమయ్యా, ముల్లాజీ? ఎందుకొచ్చావ్? నీకు నేను జాగీర్లిచ్చి సన్మానించాలా? ఏమి ఉద్ధరించావని? నాకు పనికొచ్చే చదువు ఏమి చెప్పావని? దేశాల గురించి, అక్కడి పరిస్థితుల

గురించి, ఆయా రాజుల గురించి, వారి బలాబలాల గురించి నువ్వు చెప్పిందంతా తప్పేనాయె. రాజన్నవాడికి ఎన్నో భాషలు తెలియాలి కదా? నాకు అరబిక్ తప్ప మరో భాష నేర్పావా? రాజకుమారుడు ఎన్నో విషయాల్లో ఆరితేరాల్సి ఉండగా గ్రామరు తప్ప మరో సబ్జెక్టు నువ్వు చెప్పావా? ఓరి వాచాలుడా, ఈ సంగతి చెప్పు... రాజుకూ, ప్రజలకూ మధ్య సంబంధాలు, విధులు ఎలా ఉండాలన్న అతి ముఖ్య వివరమైనా నాకు నేర్పావా? నేను ఏదో ఒక నాటికి కత్తిపట్టి - నా సోదరులతో సింహాసనం కోసం పోరాడాల్సి రావచ్చుని, నీకు తెలియదా? యుద్ధాలు ఎలా చేయాలో నువ్వు బోధించావా? అదృష్టం కొద్దీ నీకంటే తెలివైనవారిని తరవాత సంప్రదించాను కాబట్టే బతికిపోయాను. పో! పో! నీ ఊరికి వెళ్లిపో. నువ్వు ఎవరో, ఏమయ్యావో కూడా ఎవరికి తెలియకూడదు."

ఇటువంటి గురు సత్కారాన్ని ప్రపంచ చరిత్రలో బహుశా ఇంకే ప్రభువూ చేసి ఉండదు!

ఔరంగజేబు మనుష్యద్వేషి. మనుషులను హింసించటంలో అతడికి స్వ, పర భేదాలు లేవు. తనకు భయపడి ఆగ్రా కోటలో తలుపులు బిడాయించుకుని కూర్చున్న ముసలి తండ్రిని లొంగదీయడానికి నీటి సరఫరా ఆపేసి దాహంతో మాడ్చిన సుపుత్రుడతడు. 'ఒరేయ్ కొడకా! హిందువులు చాలా మంచి వాళ్లురా! చనిపోయిన పితరులకు కూడా వాళ్లు నీరు వదులుతారు. నువ్వు గొప్ప ముసల్మానువు! బతికుండగానే నన్ను నీటి కోసం అలమటింపజేస్తున్నావ్' అని ఆ సందర్భంలోనే షాజహాన్ నిష్ఠూరమాడాడు. ***[History of Aurangzib* - Jadu Nath Sarkar,** *Vol.II p. 80]*

సింహాసనం కోసం తండ్రిని బంధించి, అతడికి ప్రీతిపాత్రుడైన అన్నగారి తల నరకడమేగాక ఆ తలను గిఫ్ట్‌ప్యాక్ చేసి తండ్రికి బహుమానంగా పంపిన సత్పురుషుడు ఔరంగజేబు. రాజ్యం కోసం సోదరులను సంహరించడం తప్పనిసరి అయిందనీ, అతడు ఊరకుంటే వారే అతణ్ణి చంపి ఉండేవారనీ మాట వరసకు అనుకున్నా, గద్దెనెక్కాక కూడా ఔరంగజేబు క్రౌర్యం పెరిగిందే తప్ప తగ్గలేదు. ఔరంగజేబు తండ్రి, తాత, ముత్తాతలు మిగతావారి విషయంలో ఎంత దుర్మార్గులైనా కుమారుల విషయంలో వల్లమాలిన ప్రేమ చూపేవారు. కుమారుడు జహంగీర్ తనకు విషప్రయోగం చేయబోయాడని తెలిసి కూడా ఎంత పనిచేశావురా అని అక్బర్ తల్లడిల్లాడే తప్ప కొడుకు తల తీయించలేదు. తనకు ఎదురు తిరిగి తన సింహాసనానికే ఎసరుపెట్టిన కొడుకు చేతికే మరణశయ్య మీద రాజ్యం అప్పగించిపోయాడు. తాను తండ్రికి చేసిన మర్యాద తన కుమారుడు షాజహాన్ తనకే జరిపి బాహాటంగా తిరుగుబాటు చేసి ఎంతగా పేట్రేగినా జహంగీర్ వంశోద్ధారకుడి మీద పుత్రవాత్సల్యం చంపుకోలేదు. ఆపాటి మెతకదనం కూడా ఔరంగజేబులో లేదు. రాజ్యం కోసం అన్నదమ్ములను సంహరించినట్టే రాజ్యం చిక్కాక కన్నబిడ్డలనూ కట్టుకున్న భార్యలన్నూ కూడా దారుణంగా పీడించాడు. తాను అనుకున్న ప్రకారం నడవకపోతే ఎవరినైనా సతాయించేవాడు. వారసత్వ యుద్ధంలో తనకు తండ్రి అప్పగించిన ప్రతి అడ్డమైన పనినీ కిమ్మనక చేసిన పెద్దకుమారుడు మహమ్మద్ సుల్తాన్ కూడా పోను పోను ఔరంగజేబు చేష్టలకు మనసు విరిగి బాబాయి పంచన చేరాడు. పినతండ్రి మరణించాక వెనక్కి వచ్చి క్షమాపణలు చెప్పుకున్నా ఆలకించక ఔరంగజేబు అతణ్ణి చెరలో పెట్టాడు. రెండో కొడుకు మువాజం (షా ఆలం) గోల్కొండ సుల్తానుతో కుమ్మక్కయ్యాడని అనుమానం తోచగానే

ఔరంగజేబు అతడి మున్సబీ ఊడబెరికి, కాబోయే చక్రవర్తి అని కూడా చూడకుండా ఎనిమిదేళ్లు జైల్లో పెట్టాడు. (తొంభయ్యో ఏట తండ్రి మరణించేనాటికి అరవయ్యోపడిలో పడ్డ ఆ కుమారుడే సింహాసనానికి దిక్కయ్యాడు.) మూడో కొడుకు ఆజం ఓ రోజు పొరపాటున తన సింహసనాన్ని కాలితో తాకగా ఔరంగజేబు అగ్గిరాముడై మళ్ళీ నీ మొహం నాకు చూపించవద్దని గెంటేశాడు. నాలుగో కొడుకు అక్బర్, తండ్రి మతపైత్యాన్ని భరించలేక తిరగబడి పర్షియా పారిపోయాడు. ప్రవాసంలోనే మరణించాడు. అంతేకాదు. కుమారులు తిరగబడిన నేరానికి రెండో భార్య నవాబ్‌బాయినీ... కవిత్వంలో సంగీతంలో ప్రావీణ్యం సాధించిన నేరానికి పెద్దకుమార్తె జేబున్నీసాను మరణించేదాకా ఖైదులో పెట్టిన ఘనుడు ఔరంగజేబు. కొడుకులను, కూతుళ్లను, ఇల్లాళ్లను ఎవరినీ నమ్మక అందరిమీదా గూఢచారుల నిఘా పెట్టి, తన పాలబడిన ప్రతి ఒక్కరినీ శాయశక్తులా వేధించి, వేటాడి, తనవల్ల ఎవరికీ పెద్ద ఉపకారం జరగకుండా బతికినంతకాలమూ జాగ్రత్తపడ్డ ఈ పుణ్య పురుషుడు - చిన్నతనంలో తనకు చదువు చెప్పిన ముల్లాను ఏనుగెక్కించి ఊరేగించలేదని విస్తుపోనక్కరలేదు.

అయితే - చిన్ననాటి గురువుకు ఇచ్చిన లెక్చరులో ఔరంగజేబు అన్న ఒక మాట అక్షర సత్యం. రాజన్నవాడికి తన బాధ్యతలు ఏమిటో, ప్రజలతో ఎలా మెలగాలో, ఎలాంటి సంబంధాలు పెట్టుకోవాలో తెలిసి ఉండాలన్న అతడి అభిప్రాయం చాలా నిజం. అతి ముఖ్యమైన ఆ జ్ఞానాన్ని చిన్నతనంలో అతడికి కలిగించకపోవడం గురువు తప్పే కావచ్చు. కాని - పెద్దయ్యాక కూడా అలాంటి ఇంగిత జ్ఞానం ఔరంగజేబుకు కలగలేదు. అప్పట్లో ప్రపంచంలోకెల్లా శక్తిసంపన్నమైన విశాల మహాసామ్రాజ్యాన్ని ఏకచ్ఛత్రంగా యాభై ఏళ్లు ఏలిన ఈ మూర్ఖాగ్రేసర చక్రవర్తికి ప్రజలతో ఎలా మెలగాలో ఏనాడూ తెలియదు. అదే తెలిస్తే - నూటికి 80 మందికిపైగా ప్రజలు మహమ్మదీయేతరులు అయిన దేశంలో మహమ్మదీయ మతాన్ని బలవంతంగా రుద్ది, మతం పేర తగని విచక్షణ చూపి, అన్య మతాలవారి గుళ్లూ, బళ్లూ ధ్వంసంచేసి, అడుగడుగునా తీరని అన్యాయాలకు గురిచేసేవాడు కాదు. తన్మూలంగా ప్రజా బాహుళ్యం విశ్వాసం కోల్పోయి అందరి ఉసురూ తగిలి, ఎవరినీ నమ్మలేకుండా, తన నీడను చూసి భయపడే స్థితిలో, తిరుగుబాటు తర్వాత తిరుగుబాటును ఎదుర్కొంటూ నికృష్టపు బతుకు బతికేవాడూ కాదు.

విచిత్రం ఏమిటంటే - ఔరంగజేబు కాలంలో ఉండి, అతడి కార్యకలాపా లను ప్రత్యక్షంగా చూసి, వీర విధేయులైన ఆస్థానపక్షులు కూడా ఔరంగజేబు కనపరచిన మతద్వేషాన్ని, స్వమతస్థులపట్ల వలపక్షాన్ని, అన్యమతస్థులను పన్నుల గుదిబండలతో కుంగదీసిన వైనాన్ని కాదనలేదు. మధ్యయుగంలోని రాజాశ్రితులే ఆపాటి నిజాయితీని కనపరచగా ఈ ఆధునిక కాలంలో ఎర్రగంతల నడమంత్రపు మేధావులు పుట్టుకొచ్చి, కొసవెర్రి సిద్ధాంతాల పైత్యంతో చరిత్రను నానా కంగాళీ చేసి, అదే ఔరంగజేబును పరమసాధువుగా, ప్రజలందరినీ సమదృష్టితో చల్లగా చూసిన సెక్యులర్ నిష్ఠాగరిష్ఠుడిగా చిత్తం వచ్చినట్టు చిత్రించి పారేశారు.

ఉదాహరణకు - ఔరంగజేబు అభిమాన సంఘంలో మెంబరైన సతీశ్‌చంద్ర అనే కుహనా చరిత్రకారుడు ఎన్.సి.ఇ.ఆర్.టి.వారి పనుపున మధ్యయుగం భారతం గురించి 11వ తరగతికి రాసిన పాఠ్యగ్రంథంలో -

"భారతదేశంలో అత్యధిక జనాభా హిందువులన్న రాజకీయ వాస్తవాన్ని ఔరంగజేబు

ఏనాడూ మరచిపోలేదు. హిందువులను పూర్తిగా దూరం చేసుకునే ఏ పాలసీ అయినా కుదిరేది కాదని అతడికి తెలుసు... షరియా నిబంధనల మేరకే - చిరకాలంగా ఉన్న దేవాలయాలను ధ్వంసం చేయరాదని, కొత్త దేవాలయాలను మాత్రం కట్టనీయరాదని ఔరంగజేబు ఆనతిచ్చాడు... ఆలయాల గురించి అతడి ఉత్తర్వు కొత్తదేమీ కాదు. ఢిల్లీ సుల్తాన్ల కాలం నుంచీ ఉన్నదే... కొత్త ఆలయాలు కట్టనీయరాదన్న ఆజ్ఞ ఔరంగజేబు హయాం తొలిదశలో పాత గుడుల విస్తృత విధ్వంసానికి దారితీసిన దాఖలాలు లేవు.... పోను పోను మరాఠాలు, జాట్లు తదితరుల నుంచి తనకు ప్రతిఘటన వచ్చేకొద్దీ ఔరంగజేబు కొత్త వైఖరి అవలంబించాడు... స్థానిక శక్తులతో ఘర్షణ వచ్చినప్పుడు అపరాధులకు శిక్షగా, ఒక హెచ్చరికగా పురాతన దేవాలయాలను సైతం కూల్చడం, సమంజసమేనని అతడు భావించాడు. దేవాలయాలు విద్రోహకర భావాలను వ్యాప్తి చేస్తున్నాయని కూడా అతడు ఆగ్రహించాడు" అంటూ చెప్పుకొచ్చి "It is wrong to think that there were any orders for the general destruction of temples" (మొత్తంగా దేవాలయాలను ధ్వంసం చేయమంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయనుకోవడం తప్పు) అని ఔరంగజేబుకు క్లీన్‌చిట్ ఇచ్చారు. *[Medievall ndia, p. 231]*

షరియత్ చెప్పింది కనుక కొత్త ఆలయ నిర్మాణాలను వద్దనడం తప్ప... తనతో రాజకీయ విరోధం పెట్టుకున్న వారికి శిక్షగా, మిగతావారికి హెచ్చరికగా స్థానిక దేవాలయాలు కొన్నిటిని - అవికూడా విద్రోహకర భావాలకు ప్రసార కేంద్రాలుగా పనిచేస్తున్న వాటిని అక్కడక్కడ కూల్చివేయడం మినహా - దేవాలయా లను కూల్చాలన్న జనరల్ ఉత్తర్వు ఏదీ 'జిందాపీర్' ఔరంగజేబు జారీ చేయలేదని సతీశ్‌చంద్రాదులు ఎంత గట్టిగా ఒట్టేసి చెప్పినా అసలు నిజాన్ని దాచలేరు. ఆలయ విధ్వంస మహత్కార్యాన్ని 'ఆలంగీర్' ఔరంగజేబుగారు పనిగట్టుకుని భారీ ఎత్తున ఏకదీక్షతో సాగించారని చరిత్ర కోడై కూస్తున్నది. ఉదాహరణకు - మొగల్ దర్బారులో నలభై ఏళ్లు ఉండి, ఆయా ఘటనలను కళ్లతో చూసిన Muhammad Saki Musta'idd Khan ఔరంగజేబు పాలనపై అతడి మరణానంతరం వెలువరించిన పర్షియన్ గ్రంథం ***MA ASIR -I ALAMGIRI*** లో చెప్పిందిది:

"On the 17th Zi-L Ka'da 1079 (18th April 1669) it reached the ear of His Majesty, the protector of the faith that in the provinces of Thatta, Multan and Benares.... foolish Brahmans were in the habit of expounding frivolous books in their schools, and that.... Musulmans as well as Hindus went there, even from long distances... The "Director of Faith" consequently issued orders to all the governers of provinces to destroy with a willing hand the schools and temples of the infidels... It was reported to his religious Majesty, that in obedience to order, the Government officers had destroyed the temples of Bishnath at Benares.."

[MA-ASIR-I ALAMGIRI,* Elliot & Dowson, *Vol. VII p. 184]

(1669 సంవత్సరం ఏప్రిల్ 18న విశ్వాసరక్షకులైన మహాప్రభువుల వారికి చెవిన పడిందేమంటే - తట్టా, ముల్తాన్, బెనారస్ రాష్ట్రాలలో బుద్ధిహీనులైన

బ్రాహ్మణులు తమ పాఠశాలలలో అడ్డదిడ్డపు గ్రంథాలను బోధిస్తున్నారనీ, చాలా దూరప్రాంతాల నుంచి కూడా ముసల్మాన్లు, హిందువులు వాటిని నేర్వడానికి వెళుతున్నారనీనూ. వెంటనే కాఫిర్లకు చెందిన పాఠశాలలను, దేవాలయాలను నాశనం చేయవలసిందిగా అన్ని రాష్ట్రాల గవర్నర్లకూ ప్రభువులవారు ఉత్తర్వు లిచ్చారు.... ఆ ఉత్తర్వు మేరకు వారణాసిలోని విశ్వనాథాలయాన్ని ప్రభుత్వాధికారులు కూల్చివేసినట్లు ప్రభువులకు రిపోర్టు అందింది.)

... In the thirteenth year of the reign, this justice - loving monarch, commanded the destruction of the Hindu temple of Mathura... The richly jewelled idols from the Pagan temples were transferred to Agra, and there placed beneath the steps leading to the Nawab Begam Sahib's mosque, in order that they might even be pressed under foot by the true believers....

[Ibid, p. 185]

(తన పరిపాలనలో పదమూడవ ఏట న్యాయాన్ని ప్రేమించే ఈ చక్రవర్తి మధురలోని హిందూ దేవాలయం విధ్వంసానికి ఆనతిచ్చారు. కాఫిర్ల దేవాలయాల నుంచి తెచ్చిన ఆభరణ భూషితమైన విగ్రహాలను ఆగ్రాకు తరలించారు. అక్కడి నవాబ్ బేగం సాహిబ్ మసీదుకు వెళ్లే మెట్ల కింద నిజమైన మత విశ్వాసం గల వారందరూ కాళ్లతో తొక్కేందుకు వీలుగా వాటిని పడవేశారు.)

'In the twenty second year of the reign... Khan Jahan Bahadur arrived from Jodhpur bringing with him several cartloads of idols, taken from the Hindu temples that had been razed. His majestry gave him great praise' *(p.187)*

(ఈ హయాంలోని 22వ సంవత్సరంలో - నేలమట్టంగా కూల్చేసిన హిందూ దేవాలయాలలోని - విగ్రహాలను అనేక బండ్లతో తీసుకుని జోధ్‌పూర్ నుంచి ఖాన్ జహాన్ బహాదూర్ వచ్చాడు. చక్రవర్తి ఆయనను గొప్పగా మెచ్చుకున్నారు.)

ఇక ***MIR-AT-I Alam*** అనే పర్షియన్ గ్రంథంలో బఖ్తావర్‌ఖాన్ ఔరంగజేబు గుణగణాలను ఆకాశానికెత్తుతూ రాసిన ఈ పలుకులను చిత్తగించండి:

"Hindu writers have been entirely excluded from holding public offices, and all the worshipping places of the infidels and the great temples of these infamous people have been thrown down and destroyed in a manner which excites astonishment...."

[MIR-AT-I ALAM, **Elliot & Dowson,** *Vol. VII. p.159]*

(ప్రభుత్వ పదవులేవీ పొందకుండా హిందువులను పూర్తిగా మినహాయిం చారు. ఈ భ్రష్టులకు చెందిన గొప్ప దేవాలయాలను, ప్రార్థనా స్థలాలనన్నింటినీ కూల్చి, అచ్చెరువు కలిగించే రీతిలో ధ్వంసం చేశారు.)

ఔరంగజేబు హయాంలో కాఫిర్ల వేట దశలవారీగా పథకం ప్రకారం సాగింది. గద్దెనెక్కిన తొలి సంవత్సరాల్లో తనను తాను ఇస్లాం రక్షకుడిగా అతడు ప్రకటించుకున్నా, ఇస్లాంకు విరుద్ధమైన పద్ధతులు కొన్ని మాన్పించి, ఆ మతానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినా, మసీదుల నిర్మాణాలకు మరమ్మతులకు ధనమిచ్చినా హిందువులు పెద్దగా పట్టించుకోలేదు. నొచ్చుకోలేదు. ఎవరి మతం మీద వారికి ప్రత్యేకాభిమానం ఉండటం సహజమనే వారు అనుకున్నారు. వాస్తవానికి ఆ తొలి దశలో ప్రతికూలత ఏదైనా ఉంటే అది ముస్లిం వర్గాల నుంచే వచ్చింది. ఔరంగజేబుది ఇస్లాంలో సున్నీతెగ. దానికి వ్యతిరేకులైన షియాల మీద ధ్వజమెత్తి, శాంతియుతంగా మత ప్రచారం చేసుకుంటున్న ముస్లిం సాధువుల మీద, ఉదార దృక్పథం గల సూఫీల మీద కన్నెర్ర చేయడం మహమ్మదీయులలోని లిబరల్ వర్గాలకు మనస్తాపం కలిగించింది. రెండో దశలో మొగలు దర్బారులో చిరకాల ప్రాముఖ్యం పొందిన రాజపుత్రులను, ఉదార స్వభావులైన ముస్లిం ప్రముఖులను ఏవో మిషల మీద దూర ప్రాంతాలకు పంపేసి, దర్బారును, మిలిటరీ మతఛాందసులైన సున్నీ ఉలేమాలతో నింపిన మీదట ఇస్లామీకరణ వ్యూహం జోరందుకుంది. మొగలు దర్బారులో కళలను, సంగీతాన్ని నిషేధించడం, కవి పండిత గాయకులను తరిమేయడం, కాలగణన పద్ధతిని సౌరమానం నుంచి చాంద్రమానానికి మార్పించడం, దర్బారులోని రాజలాంఛనాలను, ఆహార్యాన్ని, అభివాద విధానాన్ని, ఝరోకా దర్శనాలను, వార్షిక తులాభారాలను మాన్పించడం కలకలం రేపినా జన జీవితం మీద వాటి ప్రభావం లేదు. వారి దర్బారు; వారి ఇష్టం – అనే సామాన్య ప్రజలు అనుకున్నారు. ఈ అల్పపీడనమే మునుముందు తమ పాలిట పెనుతుఫానుగా మారనున్నదని ఊహించలేకపోయారు.

1679 ఏప్రిల్ 2 మొగల్ పరిపాలనలో బ్లాక్‌డే. ఆ రోజున ఔరంగజేబు కాఫిర్ల దేశం (దార్ ఉల్ హర్బ్)గా ఉన్న ఇండియాను ఇస్లామిక్ రాజ్యం (దార్ ఉల్ ఇస్లాం)గా మార్చడం కోసం హిందువుల మీద బహిరంగంగా 'జిహాద్' (పవిత్ర యుద్ధాన్ని) ప్రకటించాడు. శతాబ్దం కిందట తన ముత్తాత అక్బర్ ఎత్తివేసిన జిజియా పన్నును మళ్లీ తెచ్చి రుద్ది హిందుస్తాన్‌లో హిందువులను 'జిమ్మీల'నబడే రెండో రకంగా పౌరులను దిగజార్చి... తమ ఉనికిని భరించి, ఇస్లామిక్ పాలనలో మనలనిచ్చినందుకు ప్రతిగా అవమానకరమైన సుంకాన్ని అవమానకరమైన పద్ధతిలో ప్రతివారూ చెల్లించుకోవలసిన దుర్గతికి వారిని గురిచేశాడు. ఆ రోజు నుంచి తన ప్రభుత్వ బలాన్నీ, అధికారాన్నీ, వనరులనూ, సైనిక శక్తినీ హిందువులను పరిపరి విధాల వేధించి ఇస్లాంను స్వీకరించక తప్పని పరిస్థితి తెచ్చి పెట్టేందుకే వినియోగించాడు. ఇందులో భాగంగా అతడు భారీఎత్తున జరిపించిన ఆలయాల విధ్వంసం గురించి విఖ్యాత చరిత్రకారుడు విన్సెంట్ స్మిత్ తన ***Oxford History of India*** లో ఇలా రాశాడు.

> Temples were demolished wholesale with fanatical fury... The images were treated in the most insulting ways possible... At or near Udaipur 123, and at Chitor in the same state 63 temples were over-thrown. The friendly state of Amber (jaipur)... suffered the loss of 66 temples... in one year... Aurangzeb in the course of his long reign caused the demoli-

tion of thousands of temples.. The ruin was not confined to new or recent structures. Temples of all ages were attacked indiscriminately.

[The Oxford History of India,* V.A.Smith, *p.439-40]

(మతోన్మాద ఆగ్రహోగ్రతతో దేవాలయాలను టోకున కూల్చేశారు... దేవతా ప్రతిమలను సాధ్యమైనంతగా అవమానించారు... ఉదయపూర్ వద్ద 123, చిత్తూరులో 63 ఆలయాలను పడగొట్టారు. ఆ ఒక్క సంవత్సరంలోనే మొగలులకు మిత్రరాజ్యమైన అంబేర్ (జైపూర్) కూడా 66 దేవాలయాలను కూల్చి వేయించాడు. కొత్తగా కట్టిన వాటికి, ఇటీవలి నిర్మాణాలకు మాత్రమే విధ్వంసం పరిమితం కాలేదు. అన్ని వయసుల ఆలయాల మీదా విచక్షణా రహితంగా దాడి జరిగింది.)

అయినా - సతీశ్‌చంద్ర లాంటి మన పాఠ్యకారులు మాత్రం అక్కడక్కడ ఏవో కొన్ని గుడులను - అవీ కొత్తగా కట్టినవాటిని - అందునా రాజకీయ కారణాలతో ఏదో కొంచెం ధ్వంసం చేశారంతే అని చప్పరించేస్తారు. వీరే కనుక ఔరంగజేబు కాలంలో పుట్టి ఉంటే తన పట్ల వారి అభిమానానికి, వారి అసత్యవాద వైదుష్యానికి గుర్తుగా కనీసం తలా ఒక జాగీరు అయినా ఆలంగీర్ అనుగ్రహించేవాడే!

తరతరాలుగా ఆరాధిస్తున్న ఆలయాన్ని కూల్చి భక్తుల మనసు క్షోభ పెట్టడంతో ఆగక ఔరంగజేబు హిందువులుగా పుట్టిన నేరానికి, ఇస్లాంలో చేరకుండా ఇంకా తమ మతంలోనే ఉన్న అపరాధానికి రకరకాలుగా హిందువుల వెన్ను విరచబూనాడు. క్లర్కులు, అకౌంటెంట్లు, ఆఫీసర్లు వంటి సర్కారీ ఉద్యోగాల్లో ఉన్న హిందువులందరినీ బర్తరఫ్‌చేసి, వారి స్థానాల్లో ముస్లింలను నియమించాలని అన్ని రాష్ట్రాల గవర్నర్లకు, తాలూక్‌దార్లకు ఫర్మానా పంపాడు. దేశంలోపల సరుకుల రవాణాపై రహదారి పన్ను ముస్లింలు కట్టక్కర్లేదన్నాడు. హిందువులు చచ్చినట్లు చెల్లించాలన్నాడు. కస్టమ్స్ సుంకాలూ హిందువుల మీద విపరీతంగా ముస్లింల మీద నామమాత్రంగా మోపాడు. ఇక తలచుకుంటేనే బతుకుమీద రోత పుట్టించే జిజియా పన్ను చెప్పనే అక్కర్లేదు. దాదాపుగా సంవత్సరంలో తన గ్రాసానికి అయ్యేంత మొత్తాన్ని ఎంత పేద హిందువైనా ఎంత కరువు కాలంలోనైనా చచ్చినట్లు కట్టి తీరాల్సిందే.

అడ్డగోలు జిజియా పన్నును మళ్లీ మోపారని తెలియగానే దేశమంతా అట్టుడికింది. దాన్ని తీసేయమని చక్రవర్తికి మొరపెట్టుకోవటానికి రాజధాని ఢిల్లీలో వేలాది ప్రజలు పోగయ్యారు. చుట్టుపట్ల జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో జనం వచ్చారు. యమునా నది తీరాన రాజప్రాసాదం ముందు నిలబడి కొత్త పన్నును ఎత్తెయ్యవలసిందని చక్రవర్తికి మొరపెట్టుకున్నారు. చక్రవర్తి ఆలకించలేదు. ఒక రోజు ప్రార్థన చేయడానికి ఔరంగజేబు మసీదుకు వెళుతుండగా రాజమహల్ నుంచి మసీదు వరకు రహదారి నిండా హిందువులు కిక్కిరిసి తమకు న్యాయం చేయమని ప్రార్థించారు. దుకాణాల వారు, కార్మికులు, చేతిపనులవారు పనులు మానేసి అక్కడ గుమికూడారు. ఆ జన సమూహాన్ని దాటుకుని వెళ్లడం చక్రవర్తికి అసాధ్యమైంది. అవతల ప్రార్థనకు సమయం మించిపోతున్నది. ఏమిచేయాలా అని ఆలోచిస్తే ఆ దయగల ప్రభువుకు గొప్ప ఉపాయం స్ఫురించింది. వెంటనే గజశాలలోని ఏనుగులన్నిటినీ తెప్పించి గుంపు మీదికి వదిలిపెట్టమన్నాడు. పర్వతాల్లాంటి ఏనుగులు వచ్చాయి. అమాయక జనం మీద భీకరంగా విరుచుకుపడ్డాయి.

వాటి కాళ్ల కింద నలిగి, తొండాలకు చిక్కి వందల మంది మరణించారు. అనేక వందల మంది క్షతగాత్రులయ్యారు. హాహాకారాలతో దిక్కులు దద్దరిల్లాయి. వీధినిండా పీనుగుల పోగు. అయితేనేం? రోడ్డు క్లియర్ అయింది. చక్రవర్తి ఠీవిగా దైవప్రార్థనకు వెళ్ళాడు. ఈ భయానక బీభత్స ఘట్టాన్ని ఔరంగజేబు సమకాలికుడైన ఖాఫీఖాన్ రాసిన ***Muntakhabu-l Lukab*** లో చదవొచ్చు.

[**Elliot & Dowson** *Vol. VII p.296]*

ఈ అకృత్యాలు, అఘాయిత్యాలు అన్నిటినీ ఇస్లాం ప్రబోధం మేరకే, ఆ మతాన్ని పరిరక్షించి, ఇస్లామిక్ రాజ్యాన్ని సంస్థాపించడం కోసమే చేశానని ఔరంగజేబు తలపోసి ఉండవచ్చు. కాని బాధిత ప్రజలు మాత్రం అలా అనుకోలేదు. స్వదేశంలో స్వమతాన్ని అనుసరించినందుకు తమమీద పగబట్టినట్టు అతడు పెట్టిన తిప్పలకు ఢిల్లీ వీధుల్లో రగిలిన నిరసన ఏనుగుల కాళ్ల కింద నుగ్గయిపోలేదు. అనంతర కాలంలో అదే దావానలంలాగా మారి ఔరంగజేబుకు కంటికి కునుకు లేకుండా చేసింది. చివరికి మొగల్ మహాసామ్రాజ్యాన్నే దహించి వేసింది.

రాజపుత్ర ప్రతాపం

కుక్కకి విశ్వాసం నేర్పగల రాజవంశమది.

ఒకప్పుడు సర్వ స్వతంత్రంగా రాజ్యాన్ని ఏలిందే. చేటుకాలం దాపురించి దేశం విదేశీయుల పాలబడ్డాక విధికి తలవంచి మొగల్ పాదుషాలకు తాబేదారు అయింది. మున్సబ్‌దారుగా రాజదర్బారులో తమకు మంచి హోదానిచ్చి, సామంత ప్రతిపత్తిని మన్నించినందుకు ప్రతిఫలంగా ఆ రాజవంశం వారు తరతరాలుగా మొగల్ చక్రవర్తులను వీర విధేయతతో సేవించారు. కుడిభుజంలా కాపుకాసి సామ్రాజ్యానికి ఎక్కడ ఎటువంటి సవాలు వచ్చినా చక్రవర్తి ఆనతిచ్చినదే తడవుగా రివ్వున వెళ్లి ప్రాణాలకు తెగించి పోరాడేవారు.

అదిగో – ఆ స్వామి భక్తి తత్పరతలో భాగంగానే అఫ్ఘనిస్తాన్‌లో లేచిన అలజడిని అణచి మొగల్ సామ్రాజ్యాన్ని రక్షించటానికి రాజా జశ్వంత్‌సింగ్ పెద్ద సేనతో దండెత్తి వెళ్ళాడు. దీర్ఘకాలం పోరాడి, చలికి తట్టుకోలేక ఖైబర్ కనుమల్లో 1678 డిసెంబరులో కన్నుమూశాడు.

జీవితాంతం తనను సేవించి తన కోసం నేలకొరిగిన రాజప్రముఖుడి కుటుంబాన్ని మనసున్న ఏ చక్రవర్తి అయినా ఆదరించి శాయశక్తులా సాయపడతాడు. మేలు చేయకుంటే మానె; కనీసం కీడు మాత్రం మనిషన్నవాడు చేయడు కదా? మరి – ఔరంగజేబు ఏమి చేశాడు?

రాజా జశ్వంత్‌సింగ్ మరణించాడని తెలియగానే అతడి మార్వార్ రాజ్యాన్ని ఔరంగజేబు అర్జంటుగా గుంజుకున్నాడు. మామూలుగా ఒక సామంతరాజు చనిపోతే అతడి ఉత్తరాధికారి ఎవరన్నది మొగల్ చక్రవర్తి నిర్ణయిస్తాడు. కొడుకుల్లో తన కిష్టమొచ్చిన వాడికి, కొడుకులు లేకపోతే దాయాదుల్లో ఒకరికి రాజ్యం అప్పగించడం రివాజు.

జశ్వంత్‌సింగ్‌కు వారసులు లేకపోలేదు. జగత్‌సింగ్ అని ఎదిగిన కుమా రుడున్నాడు. అతడినీ తన వెంట అఫ్ఘాన్ తీసుకెళ్లాడు. తండ్రి కంటే ముందే అతడూ యుద్ధంలో నేల కొరిగాడు. రాజు, అతడు ఏకైక వారసుడు తన పట్ల స్వామిభక్తితో ప్రాణాలు బలిదానం

చేశారన్న కనీస కృతజ్ఞతతో ఉత్తరాధికారి ఎంపికలో చక్రవర్తి సానుభూతితో ఉదారంగా వ్యవహరించి రాజకుటుంబానికి, అక్కడి ప్రజలకు మనస్తాపం కలగకుండా చూడవలసింది. ఘనత వహించిన ఔరంగజేబు మాత్రం అదే అదనుగా విరుచుకుపడి మరణించిన ప్రభువుకు అంత్యక్రియలైనా కాకుండానే తన బలగాన్ని హుటాహుటిన జోధ్‌పూర్ పంపి తగని తొందరలో రాజ్యాన్ని స్వాధీనపరచుకున్నాడు.

ఈ కృతఘ్నతకు మొత్తం రాజస్తాన్ నివ్వెరపోయింది. మొగల్ సింహాసనానికి జశ్వంత్‌సింగ్ అచంచల విధేయత చూపినా ఔరంగజేబుకు మాత్రం మొదటి నుంచీ అతడంటే లోలోన మంటే. అఫ్ఘానిస్తాన్‌లో అతడిని విష ప్రయోగం చేయించి ఔరంగజేబే చంపించాడన్న అనుమానం అప్పటికే మార్వారీ రాజపుత్రుల్లో ప్రబలంగా ఉంది. కొన్ని తరాలుగా విధేయత మాటున అణగారి ఉన్న శౌర్యప్రతాపాలు రాజపుత్ర వీరుల్లో తాజా దుర్మార్గంతో మళ్లీ ప్రజ్వరిల్లాయి. చరిత్రాత్మక మహా సంఘర్షణ మొదలైంది.

రాజా జశ్వంత్‌సింగ్ మరీ నిస్సంతు కాదు - మరణించే నాటికి ఆయన రాణులు ఇద్దరు గర్భవతులు. వారిలో ఒకరు మగశిశువును ప్రసవిస్తే చాలు ఆ బిడ్డను వారసుడిగా ప్రకటించటానికి ఏ అభ్యంతరమూ లేదు. అందుకే ప్రసవం వరకూ వేచి ఉండమని మార్వార్ ప్రముఖులు వేడుకున్నారు. ఔరంగజేబు వినలేదు. పైగా ఎవరికీ ఇష్టంలేని ఇంద్రసింగ్ అనే దాయాదికి జోధ్‌పూర్ రాజ్యాన్ని 34 లక్షల రూపాయలకు అమ్మేశాడు. దాని వల్ల రాజకీయ వర్గాల్లో చీలిక తేగలమని అనుకున్నాడు. కాని ఆ అతి తెలివి తనకే బెడిసి కొడుతుందని ఊహించలేకపోయాడు. ఇంద్రసింగ్‌ను కీలుబొమ్మగా నిలిపి తన గవర్నరు తాహిర్‌ఖాన్ చేత తెరచాటు పెత్తనం చేయించాడు. కీలక స్థానాలన్నిటా ముస్లిం అధికారులనే నియమించడంతోపాటు రాజ్యంలోని హిందూ దేవాలయాలనూ వరనబెట్టి కూల్చివేయించసాగాడు. (ఈ సందర్భంలో జోధ్‌పూర్ ఆలయాల్లో విరగొట్టిన దేవతా విగ్రహాలను బండ్లకొద్దీ తోలుకొచ్చినందుకే ఔరంగజేబు ఖాస్-ఇ-జహాన్‌ను తెగమెచ్చుకున్నట్టు కిందటి వ్యాసంలో చూశాం) దీంతో జనంలో నిరసన మరీ పెరిగింది. సరిగ్గా ఆ సమయంలోనే జశ్వంత్ మరణంతో తనను వారించే వారెవరూ లేరన్న ధీమాతో 1679 ఏప్రిల్ 12న సామ్రాజ్యమంతటా జిజియా పన్నును హిందువులపై ఔరంగజేబు అమానుషంగా రుద్దాడు. అక్బర్ కాలం నుంచీ మొగలు పాదుషాలతో పెంచుకున్న మొగమాటాల నుంచి బయటపడి రాజపుత్రుల్లో పౌరుషాగ్ని మళ్ళీ రగలడానికి ఇది బాగా దోహదించింది.

జశ్వంత్‌సింగ్ మరణించగానే అతడి ఐదుగురు రాణులు, ఏడుగురు ఉంపుడుగత్తెలు రివాజు ప్రకారం నిప్పుల్లో దూకి సహగమనం చేశారు. గర్భవతులు కాబట్టి ఇద్దరు రాణులు అగ్నిప్రవేశం చేయలేదు. అఫ్ఘాన్‌లోని జమరుద్‌లో రాజు మరణించిన చోట అంత్యక్రియలు ముగించుకుని దుర్గాదాస్ రాథోడ్ నాయకత్వంలో రాజపరివారం జోధ్‌పూర్ తిరిగి వెళుతూండగా ఔరంగజేబు వారి మీదికి సేనలను ఉసిగొలిపాడు. దారి మధ్యలో లాహోర్ వద్ద మొగల్ సేనలు వారిని చుట్టుముట్టాయి. అక్కడే 1679 ఫిబ్రవరిలో ఇద్దరు రాణులు మగ బిడ్డలను ప్రసవించారు. అందులో పెద్దరాణి బిడ్డకు అజిత్‌సింగ్ అని పేరు పెట్టారు. ఇప్పటికైనా వేధింపు మాని ఆ బిడ్డను వారసుడిగా గుర్తించమని రాథోడ్ మళ్లీ వేడుకున్నాడు. ఔరంగజేబు వినకుండా ఇద్దరు రాణులనూ, వారి బిడ్డలనూ ఢిల్లీకి తీసుకురమ్మన్నాడు. అతడి ఆజ్ఞప్రకారం మేర్వార్ రాజకుటుంబం నాలుగైదు వేల రాజపుత్ర వీరుల కాపలాతో

ఢిల్లీ వెళ్లి ఒక భవంతిలో విడిది చేయగానే మొగల్ సేనలు చుట్టుముట్టి దిగ్బంధం చేశాయి. పసి రాకుమారుడిని తన దగ్గర పెరగనిస్తేనే, అదీ మహమ్మదీయ మతాన్ని స్వీకరిస్తేనే రాజ్యానికి వారసుడిగా గుర్తిస్తానని ఔరంగజేబు అడ్డగోలు షరతు పెట్టాడు.

అది రాజపుత్రులకు సహజంగానే సమ్మతం కాలేదు. ఒప్పుకోకపోతే రాణులను, బిడ్డలను ఎప్పుడు ఏమి చేస్తాడోనన్న భయమూ వారికి కలిగింది. ముందుగానే జాగ్రత్త పడి దుర్గాదాస్ ఒక ఉపాయం పన్నాడు. అయ్యా, మా రాజ్యానికి వెళ్లిపోతాం అనుమతించవలసింది అని జోధ్‌పూర్ సైనికుల్లో కొందరు చక్రవర్తిని ప్రార్థించారు. వారితో తనకు పనిలేదు కనక పాదుషా సరే పొమ్మన్నాడు.

తరవాత ఏమైందో సుప్రసిద్ధ చరిత్ర గ్రంథంలో ***Muntakhabu-L-Lukab***లో ఔరంగజేబు సమకాలికుడైన **ఖాఫీఖాన్** ఇలా రాశాడు.

> Meanwhile the Rajputs had obtained two boys of the same age as Raja's children. They dressed some of the female attendants in the garments of the ranis, and left these women and the boys under guard in their camp. The (real) ranis, disguised as men, went off at night.... and made their way with all speed to thicr country.
>
> ***[Muntakhabu-L-Lukab,* Elliot & Dowson,** *Vol. VII p. 298]*
>
> *(ఈ లోపు రాకుమారులంత వయసు గల ఇద్దరు పసిబాలురను సంపాదించారు. ఇద్దరు దాసీలకు రాణి వేషం వేశారు. ఆ నకిలీ రాణులను, బిడ్డలను విడిదిలో ఉంచి అసలు రాణులు మగవేషం వేసుకుని బిడ్డలను తీసుకొని రాత్రికి రాత్రి పరారై మహా వేగంగా సైనికులతో కలిసి తమ రాజ్యానికి చేరారు.)*

కాసేపటికి మోసం బయటపడింది. ఔరంగజేబు భగ్గుమన్నాడు. ఎంత దూరమైనా తరుముకు వెళ్లి ఎక్కడున్నా పట్టుకోమని సేనను పురమాయించాడు. మొగల్ సేన ఇరవై క్రోసుల దూరం వెంటపడినా ప్రయోజనం లేకపోయింది. పిట్టలు ఎగిరిపోయి క్షేమంగా గూటికి చేరాయి. ఔరంగజేబు దుర్మార్గానికి లోలోన రగిలిపోతూ, రాజ కుటుంబం ఏమవుతుందా అని ఆందోళన చెందుతున్న మార్వార్ ప్రజలకు రాణులు, బిడ్డలు క్షేమంగా తిరిగి వస్తున్నారనేసరికి వెయ్యి ఏనుగుల బలం వచ్చి నట్టయింది. రాజ్యంలో ప్రతివారూ చేతికందిన ఆయుధాలను తీసుకుని మొగల్ దురాక్రమణదారులపై తిరగబడ్డారు. రాజ పరివారాన్ని వెంటబెట్టుకుని దుర్గాదాస్ రాథోడ్ నేతృత్వంలో పోరాట యోధులు మార్వార్ పొలిమేరల్లో అడుగుపెట్టగానే వేలాది జనం వీరోచిత ఘనస్వాగతం పలికారు. ప్రజల్లో పెల్లుబికిన స్వాతంత్ర్య కాంక్షకూ, తమ పట్ల కట్టలు తెంచుకున్న ఆగ్రహానికీ తాళలేక కీలుబొమ్మ ఇంద్రసింగ్, అతడి రక్షకుడు తాహిర్‌ఖాన్‌లు అంతకుముందు రోజే పరారయ్యారు. దుర్గాదాస్ విజ యోత్సాహంతో జోధ్‌పూర్ ప్రవేశించి పసి రాకుమారుడు అజిత్‌సింగ్‌కు వైభవంగా పట్టం గట్టాడు.

ఈ సంగతి తెలిసి ఔరంగజేబుకు ఒళ్లెరుగని కోపం వచ్చింది. వెంటనే మార్వార్ మీద 'జిహాద్' ప్రకటించి, తన సామ్రాజ్యంలోని గొప్ప యోధులందరినీ అన్నివైపుల నుంచీ సమీకరించి జోధ్‌పూర్ మీదికి దండెత్తించాడు. తన దర్బారును కూడా అజ్మీర్‌కు తరలించి

సైనిక దాడిని స్వయంగా పర్యవేక్షించడంతోబాటు తన కుమారుడు అక్బర్‌కు రాజపుత్రులతో యుద్ధానికి ప్రధాన బాధ్యత అప్పగించాడు. మిడతల దండులా అన్ని వైపుల నుంచి విరుచుకువచ్చే మొగల్ సేనల ముందు చిట్టెలుక వంటి మార్వార్ సంస్థానం నిలవలేకపోయింది. రాజ్యం మొగలుల వశం కాక తప్పదని గ్రహించగానే మేవాడ్ రాణా రాజ్‌సింగ్ సహాయాన్ని దుర్గాదాస్ అభ్యర్థించాడు.

రాణా రాజ్‌సింగ్ ఎవరో కాదు. మార్వార్ బుల్లిరాజు అజిత్‌సింగ్ తల్లికి స్వయానా మేనబావ. అతడు ఒకరికి భయపడే రకం కాదు. ఆర్తులను ఆదుకోవడానికి ఎంతకైనా తెగిస్తాడు. ఈ గుణం వల్లే గతంలో ఒకసారి నేరుగా ఔరంగజేబుతోనే తలపడ్డాడు.

అదో రసవత్తర ప్రణయగాథ. కిషన్‌గఢ్ రాకుమారి చారుమతి అతిలోక సౌందర్యం గురించి విని, గద్దెనెక్కిన కొత్తలో మోహించి, ఆమెను తనకిచ్చి పెళ్ళి చేయమని ఔరంగజేబు ఒత్తిడి చేశాడు. కిషన్‌గఢ్ రాజా ఒప్పుకోలేదు. దాంతో మొగల్ సేనలు అతడి కోటను చుట్టుముట్టి పిల్లను ఇస్తావా చస్తావా అని గొంతు మీద కూచున్నాయి. ఆ దశలో రాజకుమారికి రుక్మిణీ కల్యాణ ఘట్టం గుర్తుకొచ్చింది. తనను రక్షించగల వాడు మేవాడ్ రాణా ఒక్కడేనని నిశ్చయించుకుని అచ్చు రుక్మిణి లాగే పురోహితుడిని రహస్య దూతగా పంపింది. పురోహితుడు ఉదయ్‌పూర్ వెళ్లి రాకుమారి పంపిన స్వర్ణ కడియాన్ని రాణా పాదాల ముందు ఉంచాడు. తీసి చూస్తే అందులో – 'రాజహంస ఒక ఊరపందితో జత కూడాలా? స్వచ్ఛమైన రాజపుత్ర రాచకన్య ఒక కోతి మొహం కిరాతకుడికి భార్య కావాలా? నా ప్రాణం పోయినా ఇందుకు ఒప్పుకోను. ఈ దారుణ దుర్గతి నుంచి నన్ను రక్షించే రాజపుత్ర వీరుడితోనే నేను పాణిగ్రహణం చేస్తాను.' అన్న రాజకుమారి సందేశం కనిపించింది.

ఆ అభ్యర్థనకు రాజపుత్ర వీరుడు ఇవ్వగలిగింది ఒకటే జవాబు. వెంటనే గుర్రమెక్కి మెరికల్లాంటి యోధులు కొందరిని వెంటపెట్టుకుని కొద్ది గంటల్లో కిషన్‌గఢ్ చేరాడు. శిశోదియా రాజపుత్ర వీరుల రణశంఖం వినిపించగానే ముట్టడిలో కొట్టుమిట్టాడుతున్న కోటలోని వారికి ప్రాణం లేచి వచ్చింది. వారు లోపలి నుంచి, మేవాడ్ వీరులు వెనుక నుంచి దాడి చేయడంతో మొగల్ సేనలు ఆడకత్తెరలో నలిగాయి. శత్రుసేనల కళేబరాలను దాటుకుని రాజ్‌సింగ్ విజయగర్వంతో కోటలో అడుగుపెట్టి తనను వలచిన రాకుమారిని దర్జాగా పెళ్ళాడాడు. ***The Pageant*** గ్రంథం 497–98 పేజీల్లో ఈ రొమాంటిక్ కథను **Adolf Waley** సవిస్తరంగా వివరించారు.

రాణా చేసిన పనికి ఆగ్రహం వచ్చినా ఔరంగజేబు రెచ్చిపోలేదు. అప్పటికి అతడు సింహాసనంలో ఇంకా స్థిమితపడలేదు. అన్నదమ్ములతో వారసత్వ యుద్ధాలు ఇంకా ముగియలేదు. ఆ సమయంలో తనకు రాజకీయ మద్దతునిచ్చిన మేవాడ్ రాణాతో వ్యవహారం చెడగొట్టుకోవటం ఇష్టంలేక మిన్నకున్నాడు. అనంతర కాలంలోనూ ఔరంగజేబుకు అణకువగా ఉన్నట్టు కనిపించినా సమయం వచ్చినప్పుడు తడాఖా చూపి మేవాడ్ పరువు నిలబెట్టటానికి రాజ్‌సింగ్ వెనకాడలేదు. రాజా జశ్వంత్‌సింగ్ మరణానంతరం ప్రత్యేకంగా కారణమేది లేకుండా మార్వార్‌పై ఔరంగజేబు కత్తిగట్టిన తీరునుబట్టే అతడేదో పెద్ద ఎత్తు మీద ఉన్నాడని రాజ్‌సింగ్‌కు అర్థమైంది.

హిందూ రాజ వంశాలను మచ్చిక చేసుకుని మంచితనంతో సామ్రాజ్యానికి కావలి కాయించుకోవాలని అక్బర్ కాలం నుంచి షాజహాన్ దాకా అనుసరించిన రాజనీతి మీద

ఔరంగజేబుకు ఏనాడూ లక్ష్యం లేదు. హిందూ మతానికి, సంప్రదాయానికి అలంబనాలుగా ఉన్న హిందూ రాజ్యాలను, రాజాలను ఏ మేరకు చేరదీస్తే ఆ మేర తనకు ప్రియాతిప్రియమైన సంపూర్ణ ఇస్లామీకరణ ధ్యేయం కుంటుపడుతుందని అతడి నమ్మిక. అందుకే దశల వారీగా ముసుగు తీసేసి పక్కా మతోన్మాదిలా హిందూత్వం మీద హిందువుల మీద విషం గక్కసాగాడు.

నిష్కారణంగా మార్వార్‌పై వేటు వేసినవాడు ఆ వెంటనే మేవాడ్ జోలికీ రాకమానదని రాజ్‌సింగ్ గ్రహించాడు. పొరుగున ఉన్న మార్వార్ ఏ మేరకు మొగలుల వశమైతే ఆ మేరకు తన రాజ్యభద్రతకు ముప్పున్న సంగతీ అతడికి తెలుసు. ఈ కారణం వల్ల కూడా సత్వరం కదిలి మార్వార్ రాణికి, పసిరాజుకూ తన నగరంలో ఆశ్రయమిచ్చాడు. బుల్లిరాజుకు ఒక జాగీరు రాసివ్వడమే గాక తన మేనగోడలిని ఇచ్చి పెళ్లి చేసేందుకు నిశ్చితార్థమూ చేశాడు. 1679 అక్టోబరులో మేవాడ్‌ను మట్టి కరిపించటానికి పెద్ద సేనతో తహావుర్‌ఖాన్‌ను, తన కుమారులు మువాజం, ఆజంలను ముప్పేట దాడికి ఔరంగజేబు మోహరించగానే రాజ్‌సింగ్ తన పూర్వీకుడు రాణాప్రతాప్ ఆదర్శంగా గెరిల్లా పోరుకు ఉపక్రమించాడు. రాజ కుటుంబాలను భోమాత్ కొండల్లో సురక్షితమైన పల్లెకు తరలించాడు. ఇళ్లూ ఊళ్లూ ఖాళీ చేయించి ప్రజానీకాన్నీ కొండలకు తరలించి శత్రువులకు తిండి నీళ్ళూ దొరక్కుండా చేశాడు. ఉదయపూర్‌లో 173 దేవాలయాలను, చిత్తోడ్‌లో 60 దేవాలయాలను ధ్వంసం చేసి, దేవతా విగ్రహాలను ముక్కలు చేసి అవమానించి హిందూ మతం మీద ఔరంగజేబు కసి అయితే తీర్చుకున్నాడు గాని కొండల్లో కనుమల్లో అందకుండా తిరుగుతూ అధాటున దాడి చేసి తమను ముప్పుతిప్పలు పెట్టే రాణా దెబ్బను తట్టుకుని, మేవాడ్ రాజ్యంలో తన అధికారాన్ని ప్రతిష్ఠించలేకపోయాడు. 20 వేల గుర్రాలతో, పాతిక వేల కాల్బలంతో రాణా రాజ్‌సింగ్ వీర విహారం చేశాడు. ఒకసారి యువరాజు అక్బర్‌ను నేరుగా ప్రత్యక్ష యుద్ధంలోనే ఓడించాడు.

మొగలులపై పోరాటం ముమ్మరంగా సాగుతుండగానే రాణా రాజ్‌సింగ్ 1680 అక్టోబరులో మరణించాడు. అతడి అనంతరం రాణా అయిన కుమారుడు జయసింగ్ తండ్రి అంత పరాక్రమం చూపకపోయినా మార్వార్ వారితో కలిసి పోరునైతే కొనసాగించాడు. మేవాడ్ శిశోదియాల అండ మార్వార్ రాజపుత్రులకు గొప్ప బలాన్ని ఇచ్చింది. అటువారినీ, ఇటు వీరినీ మొగలులు విడవకుండా వెంటాడి నానాయాతన పెట్టారు. అనేక యుద్ధాలు చేశారు. చాలా వాటిలో గెలిచారు. కాని – గెలిచామన్న తృప్తిని మాత్రం పొందలేకపోయారు. రాజపుత్రులు ఏ క్షణం ఎటు నుంచి దాడి చేస్తారో తమకు ఎప్పుడు మూడుతుందో తెలియని భయవిహ్వలతలో వారికి కంటికి కునుకు లేకుండా పోయింది.

ఏళ్లతరబడి భారీ సైన్యంతో పోరాడినా రాజపుత్రులను లొంగదీయలేక పోవటం ఔరంగజేబుకు హృదయశల్యమైంది. దీనికి తోడు ఊహించని బ్రహ్మాస్త్రాన్ని రాజపుత్రులు అతడిమీద ప్రయోగించారు. తమను లొంగదీయటానికి ఔరంగజేబు పంపిన అక్బర్‌నే తమవైపు తిప్పుకుని తండ్రి మీదికి ఉసిగొలపటం రాజపుత్రుల మాస్టర్ స్ట్రోకు! ఎంత సేవ చేసినా మెచ్చుకోలు లేకుండా ఏదో ఒక విధంగా తనను సతాయిస్తున్నాడని తండ్రి మీద లోలోన గుర్రుగా ఉన్న జూనియర్ అక్బర్ దుర్గాసింగ్ రాథోడ్ వంటి వారి ప్రోత్సాహంతో తెగువ తెచ్చుకుని తిరబడ్డాడు. అక్బర్‌కు అప్పటికి 23 ఏళ్లు. ఔరంగజేబుకు 63. ఎప్పుడో ఒకప్పుడు సింహాసనం కోసం తండ్రితోనో, సోదరులతోనో పోరాడక తప్పదు. కాబట్టి

అదేదో ఇప్పుడే చేస్తే పోలేదా అనుకున్నాడు అక్బర్. తనకు ముందున్న చక్రవర్తుల రాజనీతిని తుంగలో తొక్కి ఔరంగజేబు హిందువులను కాల్చుకుతింటూ వారి దేవాలయాలను ఒక ఉద్యమంలా పడగొట్టిస్తున్న తీరు వల్ల మొగల్ సామ్రాజ్యానికి తీరని హాని కలుగుతున్నదని, సకాలంలో అడ్డుకోకపోతే దాని పర్యవసానాలు దారుణంగా ఉంటాయని అతడికి తోచింది. మేవాడ్ రాణాతో తాను ఎంత కష్టపడి పోరాడినా మెప్పు అనేది లేకుండా, తాను ఎందుకూ కొరగాని వాడన్న రీతిలో అక్కణ్నించి కదిలించి మార్వార్ రంగానికి పంపేసినందుకూ తండ్రి మీద అతడికి కడుపు మండింది. తండ్రిపై తిరగబడితే తమ సైనిక శక్తి యావత్తూ అండగా ఉంటుందని మొగల్ సేనాని తహావుర్‌ఖాన్ ద్వారా రాజపుత్రులు పంపిన రాయబారం అతడి మీద బాగానే పని చేసింది. రాజపుత్రుల సాయంతో అజ్మీర్‌లోని తండ్రిపై దండెత్తడానికే అతడు నిశ్చయించుకున్నాడు. అయితే తండ్రికి అనుమానం రాకుండా ఉండేందుకు - మేవాడ్, మార్వార్ ప్రభువులను తాను లొంగదీసుకున్నానని, చక్రవర్తి ముందే లాంఛనప్రాయంగా సరండరు అవుతామని వారు చెప్పినందున వారిని, వారి బలగాలను వెంటబెట్టుకుని అజ్మీర్ వస్తున్నానని తండ్రికి తెలివిగా కబురు పంపాడు.

అయితే తెలివితేటల్లో ఔరంగజేబు కొడుకును మించినవాడు. ఆవలించకుండానే అతడు పేగులు లెక్కబెట్టగలడు. అప్పటికే రాజస్థానంలో నడుస్తున్న గూడుపుఠాణీ అతడి చెవిన పడింది. రాజపుత్రుల వత్తాసుతో తిరుగుబాటు చేయదలిచావట నిజమేనా అని కుమారునికి జాబు పంపాడు. ఎలాగూ తెలిసిపోయింది కదా అని అక్బర్ బాహాటంగా బయటపడ్డాడు. అవును నాన్నగారూ, తిరగబడ్డాను. ఇందులో కూడా మీరే నాకు ఆదర్శం. నేను నడుస్తున్నది మీ అడుగుజాడల్లోనే. నేరుగా మీ దగ్గరికే వస్తున్నాను. గుర్రమెక్కి యుద్ధానికి సిద్ధం కండి - అని సమాధానం పంపాడు. ఆ ఊపులోనే ఔరంగజేబును సింహాసనం నుంచి తొలగించినట్టు బహిరంగ ప్రకటన చేశాడు. ఇస్లామిక్ న్యాయం ప్రకారం ఔరంగజేబు పాలించే హక్కును కోల్పోయాడని నలుగురు ఉలేమాలు డిక్రీ జారీ చేశారు. 1681 జనవరి 11న అక్బర్ తానే చక్రవర్తినని ప్రకటించి తన వెంట ఉన్న ప్రముఖులకు గౌరవ హోదాలు, జాగీర్లు గట్రా పంద్యారాలు చేసి, రాణా జయసింగ్, దుర్గాదాస్ రాథోడ్ తదితర రాజపుత్ర ప్రముఖులతో ససైన్యంగా దండు వెడలాడు.

ఈ సంగతి తెలిసి ఔరంగజేబు గుండెలో రాయి పడింది. ఆ సమయంలో అతని సేన ఏదీ దగ్గర లేదు. కుమారులు, కమాండర్లు అందరూ తలా ఒకచోట యుద్ధాల్లో మునిగితేలుతున్నారు. ఉన్నపళాన వారిని రమ్మన్నా వెంటనే చేరుకోలేరు. అజ్మీర్ శిబిరంలో ఔరంగజేబు దగ్గర కొజ్జాలు, పరిచారకులు తప్ప యుద్ధం చేయగల సైనికులు ఏడు ఎనిమిది వందలకు మించి లేరు. అవతల అక్బరేమో డెబ్బైవేల రాజపుత్ర సేనతో మృత్యువులా తరుముకు వస్తున్నట్టు వేగులవారి భోగట్టా. ఇక తన పని ఖాళీ అనే ఔరంగజేబు భయపడ్డాడు. వెంటనే బలగాలతో పరుగున రమ్మని పెద్ద కొడుకు మువాజింకు, చిన్నకొడుకు ముహమ్మద్ అజింకు, ఇతర సేనానులకు, ఫౌజ్‌దార్లకు కంగారుపడుతూ కబుర్లు అయితే చేశాడు కాని సకాలంలో చేరుకోగలరన్న ఆశ లేదు. దాంతో - ఖాఫీఖాన్ రాసినట్టు రాజ శిబిరమంతటా భయవిహ్వల స్థితి అలుముకుంది. ఎక్కడ చూసినా గందరగోళమే. (A great panic fell upon the royal camp, and wild confusion followed' - ***Khafi Khan***, Elliot & Dowson, *Vol. VII 302)*

ఆ సమయంలో ప్రతిక్షణం విలువైనది. వేగం మీదే ఆధారపడింది. యువరాజు అక్బర్ జాగు చేయకుండా రివ్వున వెళ్ళితే 120 మైళ్ల దూరంలోని అజ్మీర్‌ను రెండు రోజుల్లో చేరుకోగలిగేవాడు. నిస్సహాయుడైన ఔరంగజేబును అవలీలగా ఓడించి అఖండ సామ్రాజ్యానికి సార్వభౌముడు కాగలిగేవాడు. భారత చరిత్రను కొత్త మలుపు తిప్పేవాడు. కాని – జూనియర్ అక్బర్ మహా బద్ధకస్తుడు. పోరాటానికి, కీలక యుద్ధానికి కావలసిన వడి, వాడి, లాఘవం అతడిలో మృగ్యం. తనను తాను చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు కనుక నిజంగా చక్రవర్తి అయిపోయినట్టే అతడు ఊహించుకున్నాడు. తీరుబడిగా పెళ్లినడకలు నడుస్తూ ఆడుతూ పాడుతూ విందులూ విలాసాల్లో కేరింతలు కొడుతూ సరదాగా మజిలీలు చేస్తూ 120 మైళ్ల ప్రయాణానికి ఏకంగా 15 రోజులు తీసుకున్నాడు. కులుక్కుంటూ అతడు అజ్మీర్ దరిదాపులకు చేరేసరికి ఎక్కడెక్కడి రాకుమారులూ, మొగల్ సర్దార్లూ శరవేగంతో ససైన్యంగా వచ్చి చక్రవర్తికి అండగా ఉన్నారు. ఇది గెలిచే ఘటం కాదని తేలిపోవడంతో అంతదాకా అక్బర్ పక్షాన ఉన్న మొగల్ సైనికులూ గాలివాటాన్ని బట్టి ఔరంగజేబు మందలో కలిశారు. పాతిక ముప్పైవేల రాజపుత్ర వీరులే అక్బర్ వెంట దృఢంగా నిలబడ్డారు. ప్రాణాలు ధారవోసయినా అతడిని గెలిపించటానికి కృతనిశ్చయంతో ఉన్నారు.

యుద్ధం జరిగితే ఎలా ఉండేదో! కాని – ఆశ్చర్యం !! ఔరంగజేబు తన సహజ శైలిలో మాయ నాటకమాడి కత్తి ఎత్తకుండానే కొడుకు బలాన్ని నిర్వీర్యం చేశాడు. ఎలాగంటే – తెల్లవారితే యుద్ధమనగా అర్ధరాత్రి కుమారుడు అక్బర్‌కు ఒక అబద్ధపు లేఖ రాశాడు. మనం అనుకున్న ప్రకారం రాజపుత్రులను భలే మోసం చేసి ఇక్కడికి లాక్కొచ్చావ్. శభాష్! రేపు యుద్ధంలో వారిని ముందు భాగాన నిలబెట్టు. ముందు నుంచి నేను, వెనక నుంచి నీవు వారిని కమ్ముకుని సఫా చేసేద్దాం– అని అందులో రాసి, ఆ ఉత్తరం దుర్గాదాస్ రాథోడ్ కంటపడేలా చేశాడు. దాన్ని చదువుకున్న రాజపుత్ర ప్రముఖులకు మతిపోయింది. ఇదేమిటని అడుగుదామని అక్బర్ బసకుపోతే ఆయన నిద్రపోతున్నాడు. ఎవరొచ్చినా లోనికి రానివ్వవద్దన్నాడు అని భటులు చెప్పారు. అక్బర్ సేనాని తహోవుర్ ఖాన్‌ను అడుగుదామనుకుంటే అప్పటికే అతడే ఔరంగజేబు శిబిరానికి వెళ్లినట్టు తెలిసింది. (వెళ్లిన మాట నిజమే. ఎందుకో తెలియదు. కాని లోనికి పోగానే ఔరంగజేబు మనుషులు అతణ్ని నరికివేశారు.)ఊహించని పరిణామాలతో తాము మోసపోయామన్న అభిప్రాయం రాజపుత్రులకు సహజంగానే కలిగింది. వెంటనే ఎవరి సేనలతో వారు ఆ రాత్రే నిష్క్రమించారు. తెల్లవారి జూనియర్ అక్బర్ లేచేసరికి శిబిరం ఖాళీ. కల కరిగిన కలవరంతో అతడూ మహిళా పరివారాన్ని వెంటేసుకుని కాలికి బుద్ధి చెప్పాడు. ఈసారి మాత్రం వేగంగానే కదిలి రాజపుత్రులను అందుకున్నాడు.

అసలు మోసం వారికీ అర్థమైంది. కాని – చేయగలిగింది లేదు. భారీ బలగాలతో సర్వసన్నద్ధంగా ఉన్న చక్రవర్తిని గెలవటం కలలో మాట. కాబట్టి దగాపడ్డ అక్బర్‌ను తమ వెంట తీసుకుని తిరిగి రాజస్తాన్ వెళ్లారు. అక్కడా దేగలాంటి ఔరంగజేబు బారి నుంచి అతడిని కాపాడటం తమకు కష్టమని భావించి, ఆ కాలంలో ఔరంగజేబుకు సింహస్వప్నంగా ఉన్న మరాఠా ప్రభువు శంభాజీ దగ్గరికి దుర్గాదాస్ రాథోడ్ రహస్యంగా చేర్చాడు. గతంలో మార్వార్ రాణులను ఔరంగజేబు నుంచి రక్షించటానికి పడ్డంత ప్రయాసను, చూపినంత చాకచక్యాన్ని ఈ సందర్భంలోనూ ప్రదర్శించి అక్బర్ కోసం వెయ్యి కళ్లతో వెదుకుతున్న

రాజభటుల కళ్లు గప్పి క్షేమంగా అదంగు చేర్చాదు.

తనకు పక్కలో బల్లెమైన మరాఠా శిబిరంలో తన కుమారుదు చేరటంతో ఔరంగజేబుకు గంగవెర్రులెత్తింది. రాజపుత్రులను జయించే సంకల్పాన్ని పక్కనబెట్టి తన యావచ్ఛక్తినీ దక్కనులో మరాఠాలను సాధించడం మీదే అతడు కేంద్రీకరించాడు. రాజ్‌సింగ్ మరణానంతరం మేవాడ్ రాణా అయిన జయసింగ్‌తో రాజీ కుదుర్చు కున్నాదు. మళ్ళీ తన జీవిత కాలంతో అతడు మేవాడ్ తెరువు పోలేదు. మార్వార్‌తో అధికారికంగా సంధి అయితే పొసగలేదు. అక్కడి రాజపుత్ర వీరు[illegible] ఆ తర్వాత రెండు దశాబ్దాలకు పైగా విడవకుండా సాగించిన గెరిల్లా దాడులకు త[illegible]క మొగల్ సర్దార్లే ఔరంగజేబుకు తెలియకుండా రాజపుత్రులతో సర్దుబాటు చేసుకున్నారు. ("చౌథ్") తమను తమ మానాన బతకనిచ్చినందుకు ప్రతిఫలంగా మొత్తం పన్నుల రాబడిలో నాలుగో వంతును వారికి రక్షణ కట్నం కింద చెల్లించుకునేందుకు వారు సమ్మతించారు. దుర్గాదాస్ రాథోడ్ మరాఠా వెళ్లిన కాలంలోనూ సామాన్య ప్రజల తోడ్పాటుతో మొగలులపై నిరంతర పోరాటం జరిగింది. పేరుకు మొగల్ పాలన అయినా రాజపుత్రులదే రాజ్యమైంది. పరిస్థితులు చక్కబడ్డాక రాజా అజిత్‌సింగ్ 1707 మార్చిలో జోధ్‌పూర్ ప్రవేశించాక ఆ తెర కూడా తొలగింది.

> As Ajit entered Jodhpur, the Mughals fled, leaving their property behind: they were slained or made captive. Many of them fled in the disguise of Hindus, to escape the merciless retribution of the Rajputs smarting under 26 years of oppression... The fort of Jodhpur was purified with Ganges water and Tulsi leaves. Ajit Singh was crowned Maharajah of Marwar. Durgadas's life's task was thus crowned with success.
>
> ***[History of Aurangzib*, J.N.Sarkar**, *Vol. V p. 292]*
>
> *(జోధ్‌పూర్‌లో అజిత్‌సింగ్ ప్రవేశించగానే, మొగలులు ఆస్తులు వదిలేసి పారిపోయారు. వారిని వెంటబడి చంపారు. లేదా బందీలను చేశారు. 26 ఏళ్ల అణచివేతకు భగభగలాడుతున్న రాజపుత్రుల నిర్దాక్షిణ్య ప్రతీకారం నుంచి తప్పించుకుందుకు చాలామంది హిందువుల్లా మారువేషాల్లో పారిపోయారు. జోధ్‌పూర్ కోటను గంగాజలంతో, తులసి ఆకులతో శుద్ధి చేశారు. అజిత్‌సింగ్‌ను మార్వార్ మహారాజుగా పట్టాభిషేకం చేశారు. దుర్గాదాస్ జీవితాశయానికి ఈ విజయం మకుటాయమానం.)*

మార్వార్ పాలకుడిగా అజిత్‌సింగ్ అధికారాన్ని ఔరంగజేబు అనంతరం మొగల్ చక్రవర్తి అయిన బహదూర్ షా లాంఛనంగా గుర్తించాదు. నాటి నుంచి మొగల్ సామ్రాజ్య పతనానంతరం దేశం విదేశీయుల పరమయ్యేదాకా రాజస్థానమంతటా రాజపుత్రుల పతాకమే సగర్వంగా రెపరెపలాడింది.

మొత్తం ఉపఖండాన్ని ఏకచ్ఛత్రంగా ఏలి ప్రపంచంలోకెల్లా శక్తిమంతుడైన చక్రవర్తి అనిపించుకున్న ఔరంగజేబు ఈ ప్రకారంగా ఎన్నేళ్లు ఎన్ని ప్రయత్నాలు చేసి, ఎన్ని యుద్ధాలు సాగించినా గుండె బలం గల రెండు బుల్లి రాజ్యాలను గెలవలేకపోయాడు. అసమమైన మొగల్ సైనిక శక్తికి ఎదురొడ్డి నిలిచి రాజపుత్ర పౌరుషాన్ని ప్రతాపాన్ని ప్రపంచానికి చాటిన

దుర్గాదాస్ రాథోడ్, రాజ్‌సింగ్‌ల గొప్పతనాన్ని ఎంత వర్ణించినా తక్కువే. విచారించాల్సిన విషయం ఏమిటంటే – మొత్తం జాతికి గర్వకారణమైన వీరి వీరగాథకు చరిత్ర పుస్తకాల్లో చోటే కరువు. తన సుదీర్ఘ పాలనలో ఔరంగజేబు ఎదుర్కొన్న అనేకానేక తిరుగుబాట్లు తలనెప్పుల్లో ఒకటిగానే సెక్యులర్ చరిత్రకారుల దృష్టిలో దీనికి గుర్తింపు! సోకాల్డ్ జాతీయ చరిత్రలో ఇలాంటి జాతీయ వీరులకున్నది కేవలం న్యూసెన్స్ వాల్యూ!!

గద్దలైన పిట్టలు

పల్లకి ఎక్కకూడదు. గుర్రంమీద తిరగకూడదు. ఆయుధాలు పట్టకూడదు. సాంప్రదాయిక విద్యలను నేర్వకూడదు. నమ్మిన దైవాలను కొలవకూడదు. సర్కారీ కొలువు ఆశలేదు. అన్నీ ఆంక్షలే. అడుగడుగునా యాతనలే. కాశీ విశ్వనాథాలయం కూల్చేశారు. సోమనాథ్‌లో రెండో గుడిని పడగొట్టారు. మధురలో కేశవ దేవాలయాన్నీ నేలమట్టం చేశారు. దేశమంతటా చిన్నా పెద్దా, పాతా కొత్తా హిందూ దేవాలయాలన్నిటినీ, హిందూ విద్యా సంస్థలన్నిటినీ వరసబెట్టి వేల సంఖ్యలో కూల్చేస్తున్నారు. హిందువులుగా బతకనిచ్చినందుకు కృతజ్ఞతగా ప్రతి హిందువూ తమ కాళ్లదగ్గరికి వచ్చి వినయంగా జిజియా అనే తలపన్ను కట్టిపోవాలని కట్టడి చేశారు.. నుదుట తిలకంబొట్టు, మెడలో జంధ్యం కనిపిస్తే చాలు అవమానించి క్రూరాతిక్రూరంగా మతం మారమంటూ హింసిస్తున్నారు. ఒక్క కాశ్మీర్‌లోనే రోజుకు మణుగుబరువు జంధ్యాలు తెంపిపారేస్తున్నారు. ఎలా బతకాలో అర్థం కావడంలేదు. ఏమి చేయాలో పాలుపోక మీ దగ్గరికి వచ్చాం. మీరే ఏదో దారి చూపాలి.

కాశ్మీర్ నుంచి గుంపుగా ఆనందపూర్ వచ్చిన హిందూ ప్రముఖులు గుండె నీరయ్యేలా గోడు వెళ్ళబోసుకున్నారు. అంతా విని సిక్కు గురువు తేజ్ బహాదూర్ దీర్ఘాలోచనలో పడ్డాడు. ఏమి చెబుతాడా అని అందరూ ఆయన ముఖం కేసి చూస్తుండగా తొమ్మిదేళ్ల గోవిందదాస్ తోటి పిల్లలతో ఆటగోలుగా అటు వచ్చాడు. తండ్రివైఖరి చూసి దగ్గరికి వెళ్ళి 'ఏమిటి నాన్నగారూ, అంత తీవ్రంగా ఆలోచిస్తున్నారు' అని అడిగాడు.

'భూమికి పాపభారం ఎక్కువైంది. అన్నివిధాల యోగ్యుడైనవాడు ముందుకొచ్చి తలను బలి ఇస్తేనేగాని ఈ క్లేశం తొలగదు' అన్నాడు తేజ్‌బహాదూర్.

'అలాంటి బలిదానానికి మీకంటే యోగ్యులెవరు? అన్నాడు కుర్రవాడు.

తండ్రి ముఖం వికసించింది. ఆత్మార్పణం చేయాలన్న తన సంకల్పాన్ని కుమారుడి నోటితో దైవం బలపరిచినట్టే ఆయనకు తోచింది. 'వెంటనే వెళ్లండి. గురుతేజ్ బహాదూర్

కనుక మతం మారితే మీరూ ఇస్లాంను స్వీకరిస్తామని చక్రవర్తికి తెలపండి. గురునానక్ మిమ్మల్ని చల్లగా చూస్తాడు' అని కాశ్మీరీ హిందువులను ఓదార్చి పంపేశాడు. తన సన్నాహాలను తాను మొదలెట్టాడు. 1675 జూలై 8న సిక్కు 'సంగత్'ను సమావేశపరచి చిన్నారి కుమారుడు గోవింద్‌ను తన ఉత్తరాధికారిగా గురుపీఠం మీద సకల లాంఛనాలతో కూచోబెట్టాడు. శిష్యుల నుంచి, కుటుంబ సభ్యుల నుంచి సెలవు తీసుకుని ముగ్గురు అంతేవాసులతో కలిసి భక్తులు విలపిస్తుండగా ఢిల్లీకి పయనమయ్యాడు.

బలవంతపు మతం మార్పిడికి ఒప్పుకోవద్దని చెబుతూ హిందువుల్లో తిరుగుబాటును ప్రేరేపిస్తున్నాడని అప్పటికే ఔరంగజేబు చక్రవర్తి – తేజ్‌బహాదూర్ పేరు చెబితే మండి పడుతున్నాడు. తాజా వర్తమానం కూడా తెలిశాక అగ్గిమీద గుగ్గిలమై ఎక్కడున్నా అతడిని నిర్బంధించి పట్టుకురమ్మని ఉత్తర్వు చేశాడు. జూలై 12న ఆనందపూర్ దాటగానే రోపార్ పోలీసులు ఆయనను, శిష్యులను అరెస్టు చేసి సిర్హింద్‌కు పంపారు. మూడు నెలలకుపైగా చెరలో ఉంచాక ఇనుపబోనులో బంధించి ఢిల్లీకి తీసుకువెళ్లారు. ఇస్లాంలోకి మారతానని చెప్పమంటూ – గొలుసులతో కట్టేసి అమానుషంగా హింసించారు. అడ్డమైన అభియోగాలు మోపారు. అవి కూడా ఎంత సిల్లీ అంటే చెరసాల పైనుంచి అంతఃపురంలో నిషిద్ధ రాణివాసం గదులకేసి చూస్తున్నాడన్నది ఒక ఆరోపణ. నిజమేనా అని ఔరంగజేబు అడిగితే ఆ మహాయోగి ఇలా బదులిచ్చాడట:

> "Emperor Aurangaazeb, I was on the top storey of my prison, but I was not looking at thy private apartments, or at thy queen's. I was looking in the direction of the Europeans, who are coming from beyond the seas to tear down thy hangings (pardas) and destroy thy empire."
>
> [***The Oxford History of India*, V.A.Smith,** *P.454*]
>
> *(ఔరంగజేబ్ చక్రవర్తీ! చెరసాల పై అంతస్థు మీద నుంచి నేను చూసింది నీ అంతఃపురాన్నో, నీ రాణి అభ్యంతర మందిరాన్నో కాదు. ఆ సమయంలో నేను చూస్తున్నది నీ పరదాలను చింపిపారేసి నీ సామ్రాజ్యాన్ని ధ్వంసం చేయటానికి సముద్రాలు దాటుకుని వస్తున్న యూరోపియన్ల కేసి!)*

ఎన్ని అభియోగాలు మోపి, ఎన్ని యాతనలు పెట్టినా, ఎన్ని ప్రలోభాలు చూపినా తేజ్ బహాదూర్ లొంగలేదు. నిజంగా నీకు దివ్యత్వం ఉంటే ఏదైనా మహిమ చూపమని చివరికి ఔరంగజేబు అడిగాడు. దైవసంకల్పానికి అడ్డు రాకూడదని చెప్పి సద్గురువు నిరాకరించాడు. దాంతో కాఫిర్లను శిక్షించటానికి మతాచారం ప్రకారం ఔరంగజేబు చిత్రవధలకు ఆనతిచ్చాడు. మొదట శిష్యుల వంతు. భాయి మాతీదాస్‌ను రెండు బద్దెల మధ్య కట్టేసి కదలకుండా నిలబెట్టి తల నుంచి మొలదాకా రంపంతో కోసి జరాసంధుడిని వలె చీల్చారు. భాయి దయాళ్‌ను సలసల మరిగే నీళ్ళ గుండిగెలోకి తోశారు. భాయి సతీదాస్‌ను దూదిమేటలో చుట్టి నిప్పుటించారు. ఆ పైశాచిక కృత్యాలన్నీ తన కళ్లముందే జరిగినా తేజ్‌బహాదూర్ చలించలేదు. మనఃస్థైర్యం కోల్పోలేదు. ఏమి చేసినా లొంగకపోయేసరికి చివరికి 1675 నవంబరు 11న పట్టపగలు అందరూ చూస్తుండగా చాందినీచౌక్‌లో పవిత్ర గురుమూర్తి తల నరికారు. కత్తివేటు పడుతూంటే ప్రశాంత వదనంతో ఆయన నిబ్బరంగా ఉన్న తీరుకు

తలారి కూడా తెల్లబోయాడు.

ఈ ఘోరాన్ని చూసినవారు తల్లడిల్లారు. మొగలులు ఎక్కడ పగబడతారోనన్న భయంతో ఖండిత దేహం దగ్గరికి పోయేందుకు ఎవరూ సాహసించలేదు. ఘోరకలికి ప్రకృతి విలపించిందా అన్నట్టు ఆ రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. తేజ్ బహదూర్ శిష్యులు కొందరు రాత్రివేళ వర్షంమాటున చాటుగా వెళ్లి గురుదేవుడి శిరస్సును రహస్యంగా ఆనందపూర్ చేర్చారు. లఖీదాస్ అనే ఇంకో భక్తుడు అదే రాత్రి ఎడ్లబండిలో మొండేన్ని వేసుకుని రైసినాలోని తన ఇంటికి తీసుకెళ్ళాడు. బహిరంగంగా అంత్యక్రియలు చేసే అవకాశం లేదు కనుక తన గుడిసెకు తానే నిప్పంటించి తెల్లవారకముందే అమర గురువుకు అగ్నిసంస్కారం జరిపాడు.

పవిత్ర శిరస్సుకు ఆనందపూర్‌లో గురుగోవింద్ భక్తిశ్రద్ధలతో యథావిధిగా దహన సంస్కారం చేసి వలవల విలపిస్తున్న భక్తజనానికి ధైర్యం చెప్పాడు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం తన తండ్రి బలిదానాన్ని లోకం గుర్తుపెట్టుకుంటుందని బాల గురువు ఉద్వేగంగా అన్నాడు.

అయితే - సూర్యచంద్రులు ఇంకా ప్రకాశిస్తుండగానే సూడో సెక్యులర్ చరిత్రకారులనబడే గుడ్డిమాలోకం మాత్రం తేజ్‌బహాదూర్ ఆత్మార్పణాన్ని గుర్తించ నిరాకరించింది. తేజ్ బహాదూర్ ఊళ్లమీద బలాదూరు తిరుగుళ్లు తిరుగుతూ మతద్వేషం రెచ్చగొట్టేవాడు; దారిదోపిడీలు చేయించేవాడు; అందుకే ఔరంగజేబు అతణ్ణి శిక్షించాడు అని ఈ కాలపు కుహనా చరిత్రకారులు సర్వజ్ఞుల్లా సెలవిస్తారు. అసలు అతడి కుటుంబంలో వారికే అతడంటే పడదు. వారే అతడిమీద పితూరీలు చేశారు అని కొనమెరుపు జోడిస్తారు. ఎన్.సి.ఇ.ఆర్.టి.వారు దేశంమీద అచ్చోసి వదిలిన పాఠ్యగ్రంథాల్లో ఇలాంటి తల తిక్కరాతలను విజ్ఞులు ఆక్షేపించినందుకే ఆ మధ్య 'విచిత్ర చరిత్రకారులు' రేచుకుక్కల్లా గయ్‌మన్నారు.

సింహాసనంలో కుదుటపడి ఇండియాను ఇస్లామీకరించే పనిని సీరియస్‌గా మొదలెట్టాక ఔరంగజేబు తన దురాగతాలకు ఎక్కడా ఆనవాళ్లు ఉండకుండా చేయదలచి పరిపాలనా విశేషాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయించే పద్ధతిని మాన్పించాడు. అప్పటికే మొదలెట్టిన చరిత్రలనూ బలవంతంగా మూసేయించాడు. అతడికి తెలియ కుండా విశేషాలను రహస్యంగా రాసిపెట్టి అనంతర కాలంలో గ్రంథస్థం చేసిన ఆస్థాన ప్రముఖులు కూడా ఇబ్బందికరమైన వాస్తవాలను చాలావరకు దాటవేశారు. తమకు గురుపాదులైన పర్షియన్ రచయితలు చెప్పలేదు కనక అలాంటి ఘాతుకం జరిగి ఉండటానికే వీల్లేదని మన కుహనా చరిత్రకారుల నమ్మకం. వాస్తవమైతే రాయరుగాని గురు తేజ్‌బహదూర్‌ను నీచంగా చిత్రించిన పర్షియన్ రాతగాళ్ల అభాండాలను మాత్రం అక్షర సత్యంగా వారు ఔదలదాల్చుతారు. తేజ్‌బహదూర్‌ను దారికాచి దోచుకునే బందిపోటుగా, ఖైదును తప్పించుకోవడానికి అజ్ఞాతవాసం చేసిన నేరగాడిగా చిత్రించే రాతలు ***"utterly incompatible with the whole tenor of Guru Tegh Bahadur's life and writing"*** *(గురుతేజ్‌బహదూర్ రచనల తీరుతో, జీవన సరళితో ఏ మాత్రం పొంతన లేనివి)* అని విశ్వవిఖ్యాత చరిత్రకారుడు ***M.A.Macauliff*** 1909లో ప్రచురించిన తన The Sikh Religion నాలుగో సంపుటంలో నిర్ద్వంద్వంగా నిరూపించాడు. Bhatt Vahi Multani Sindhi, Bhatt Vahi Jadavbansian, Guru Kian Sakhiyan

వంటి ప్రామాణిక సిక్కు గ్రంథాలు తేజ్ బహాదూర్ అమరగాథను సవిస్తరంగా వివరించాయి. ఔరంగజేబును మతద్వేషం లేని మంచి మనిషిగా చిత్రీకరించే కుయత్నాలకు పొసగవు కనుక అలాంటి వాటిని మన చరిత్ర బ్రహ్మలు సహజంగానే పట్టించుకోరు.

ఎవరు పట్టించుకున్నా, ఎవరు పట్టించుకోకున్నా గురుతేజ్ బహాదూర్ బలిదానం వృథా కాలేదు. దుర్మార్గాలను ఎదిరించే ధైర్యం లేక చేవ చచ్చి దీనంగా హీనంగా జీవచ్ఛవాల్లా బతుకుతున్న సామాన్య జనానీకంలో అది కదలిక తెచ్చి గొప్ప ఉత్తేజాన్నిచ్చింది. ఉత్తర భారతంలో ముఖ్యంగా పంజాబ్‌లో నైతిక, రాజకీయ మహాచైతన్యం పెల్లుబుకడానికి అది కారణభూతమైంది.

ఆ చైతన్య వ్యాప్తికి ప్రోది చేసినవాడు గురు గోవింద్.

గురుపీఠం అధిష్టించే నాటికి అతడికి తొమ్మిదేళ్లు. 1666లో గోవింద్ తల్లి కడుపులో ఉన్నప్పుడే తేజ్‌బహాదూర్ దేశాటనకు వెళ్ళాడు. కుమారుడికి ఆరేళ్లు వచ్చాకగానీ ఆయన తిరిగి రాలేదు. తండ్రితో కలిసి ఉన్నది మూడేళ్లు. ఆయన ఏమి నేర్పాడో ఎలా నేర్పాడోగాని బడికి వెళ్ళి చదువుకోవలసిన వయసులో విధివశాత్తూ సంక్రమించిన గురుతర బాధ్యతను ఆ బాలుడు అద్భుతంగా నిర్వర్తించాడు. సిక్కు మతం రూపురేఖలనే మౌలికంగా మార్చి 'నక్కలను పులులుగా, పిట్టలను గద్దలుగా మార్చగలడన్న' జోస్యాన్ని నిజం చేశాడు.

తన ముత్తాతను చిత్రవధ చేసిందీ, తాతను చెరలో పెట్టిందీ, తండ్రి తల నరికిందీ మొగలాయీ ముస్లిం ప్రభువులే అయినా మొగలు వంశంమీదగాని, మహమ్మదీయ మతం మీదగాని గోవిందదాస్ ద్వేషం పెంచుకోలేదు. మొగలుల నిరంకుశ, క్రూర పరిపాలనలో కోట్లాది హిందువులందరూ పడుతున్న దుస్సహ క్లేశాల్లో తన కష్టాలూ భాగమని... దుష్టపరిపాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాడటమే కర్తవ్యమని అతడు చిన్నతనంలోనే గ్రహించాడు. మహారాష్ట్రలో శివాజీవలె పంజాబ్‌లో సామాన్య జనాన్ని జాగృతపరిచి పటిష్ఠ పోరాట శక్తిగా తీర్చిదిద్దడానికి జీవితాంతం శ్రమించాడు. గురువుపట్ల సిక్కు సమాజంలో ఉన్న నిశ్చల భక్తిని, అచంచల విధేయతను ఇందుకు సమర్థంగా ఉపయోగించుకున్నాడు.

తొమ్మిదేళ్ల వయసులో గురుపీఠమెక్కి మేనమామ సాయంతో లోతుపాతులను ఆకళింపు చేసుకున్న గోవింద్ 19వ ఏటికల్లా వయసుకు మించిన పరిణతి చెంది ఛత్ర చామరాలతో సకల రాజలాంఛనాలతో సిక్కు సమాజాన్ని స్వతంత్రంగా పరిపాలించ సాగాడు. భక్తజనుల తోడ్పాటుతో గుర్రాలను, ఏనుగులను, వేల సంఖ్యలో సైనికులను క్రమేణా సమకూర్చుకున్నాడు. పీర్ బుధుషా, కాలేఖాన్‌లనే మహమ్మదీయ సర్దార్లూ వారిలో ఉన్నారు. కొత్తగా నిర్మించుకున్న ఆనందపూర్ కేంద్రంగా బలోపేతమైన ఈ సరికొత్త సైనిక శక్తికి అసూయ చెంది ఆ ప్రాంతపు రాజు భీమ్‌చంద్ కప్పం కట్టి తనకు తాబేదారుగా మెలగాలని గోవింద్‌ని డిమాండ్ చేశాడు. అందుకు నిరాకరిస్తే ఆనందపూర్ మీదికి దండెత్తాడు. సిక్కులు ఆ దాడిని తిప్పికొట్టారు. అది గోవింద్ సాధించిన తొలి సైనిక విజయం. మునుముందు ఎటు నుంచి ప్రమాదం వచ్చినా ఎదుర్కొగలిగేందుకు వీలుగా యమునా నది ఒడ్డున అడవి నడుమ లోయలో రక్షణ దుర్గంగా పవుంటాను గురు గోవింద్ నిర్మించాడు. కొంతకాలం సపరివారంగా అక్కడే వుండి రామాయణ, భారతాలను, ప్రధాన పురాణాలను పంజాబీలోకి అనువదించడం, కృష్ణావతారం, రామావతారం, చండీ చరిత్ర తదితర కావ్యాలను, 'విచిత్ర

నాటకం' అనే తన ఆత్మకథను అద్భుతశైలిలో రాశాడు. ఒక వంక ఆధ్యాత్మిక సాహితీ రంగాల్లో బహుముఖ కృషి సాగిస్తూనే ఇంకో వంక ఎటువంటి దాడినైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా సైనిక పాటవం పెంపొందించుకున్నాడు. ఆత్మరక్షణకు సకాలంలో జాగ్రత్తపడ్డాడు కాబట్టే 1688 అక్టోబరులో చుట్టుపట్ల కొండరాజ్యాల ప్రభువులందరూ కలిసి ఒక్కసారే పవుంటా మీద విరుచుకుపడినా భంగాని దగ్గర చరిత్రాత్మక యుద్ధంలో సిక్కులే ఘనవిజయం సాధించారు. దాంతో గురుగోవింద్ కీర్తి దశదిశలా వ్యాపించింది.

ఏనాటికైనా మొగలు సామ్రాజ్యం తనపై కత్తికట్టక మానదని ముందే గ్రహించి గురు గోవింద్ ఆనందపూర్ సమీపంలో ఆనందగఢ్, కేశగఢ్, లోహగఢ్, ఫతేగఢ్‌లనే నాలుగు కోటలను రెండేళ్లలో యుద్ధప్రాతిపదికన నిర్మించాడు. గతంలో అతడి చేతిలో ఓడిన కొండరాజులే మొగలు సైన్యం ముట్టడిలో చిక్కి ఆదుకోవలసిందిగా ఆర్తనాదాలు చేస్తే సైన్యంతో దండెత్తి వెళ్ళి నాదౌన్ యుద్ధంలో మొగల్ సేనాని ఆలిఫ్‌ఖాన్‌ను గోవింద్ ఓడించాడు. ఉపకారం పొందిన ఆ రాజులే అక్కర తీరాక అపకారులై సిక్కులకు వ్యతిరేకంగా మొగలాయీలతో లాలూచీ అయ్యారు.

ఇలాంటి అనేక చేదు అనుభవాల తరవాత – వేరెవరో కలిసి వస్తారన్న భ్రమ లేకుండా సిక్కులను సిక్కులే రక్షించుకోవాలని, సామాన్య సిక్కుల్లోని భీరుత్వాన్ని, దౌర్బల్యాన్ని, స్వార్థచింతనను పారదోలి సాయుధ సాధువులుగా మలచి వారి నుంచే మహాపోరాట శక్తిని ఆవాహన చేయాలని గురు గోవింద్ దీర్ఘకాలం ఆలోచించి స్థిర నిశ్చయానికి వచ్చాడు. ఆ మహదాలోచన నుంచే చరిత్రాత్మకమైన 'ఖాల్సా' పుట్టింది.

అది 1699 సంవత్సరం. వైశాఖి పండుగ ముందు రోజు. ఆనందపూర్ సమీపంలోని కేశ్‌గఢ్‌లో గురుగోవింద్ గొప్ప దర్బారు నిర్వహించాడు. 80 వేల మంది సిక్కులు అందులో పాల్గొన్నారు. 'ఇటుక కూడా రాయిగా మారాల్సిన సమయం వచ్చింది. కేవలం మంచిగా ఉంటామంటే చాలదు. చెడునూ ఎదుర్కోవాలి. చెడు చేసేవారిని నాశనం చెయ్యాలి. పొరుగువాణ్ణి ప్రేమిస్తేనే చాలదు. నీ జోలికి వచ్చే పొరుగువాణ్ణి శిక్షించాలి కూడా. సాధువులను సేవించడంతోబాటు బాధకులను బాధించాలి. మిత్రులకు మంచి చేయడంతోబాటు శత్రువులకు హాని చేయాలి. దేవుడు, గురువు, కత్తి – ఇవే ఈ కాలపు త్రిమూర్తులు. ఎప్పుడో మరణించాక కాదు – ఇప్పుడే ఇక్కడే ముక్తిని పొందాలి' అని అనర్గళంగా ప్రసంగిస్తూ గురు గోవింద్ ఒర నుంచి కస్సున కత్తి దూశాడు. 'ఏ మహత్కార్యం చేయాలన్నా ముందు ఒక మహాత్యాగం చేయాలి. అత్యున్నత ఆత్మత్యాగం చేయగలిగితే పవిత్ర కరవాలం వీరజాతిని సృష్టిస్తుంది. దైవం కోసం, సత్యం కోసం, మతం కోసం తలను బలి ఇవ్వగలవారు మీలో ఎవరు? లేచి నిలబడండి' అని గంభీరంగా గర్జించాడు.

విన్నవారు అవాక్కయ్యారు. అంతటా నిశ్శబ్దం. అందరి మొహాల్లోనూ భయం. ఎవరూ లేవలేదు. గురువు మళ్ళీ రెట్టించాడు. 'మతం కోసం ప్రాణాన్ని ఇవ్వగలవారు ఒక్కరూ లేరా అని మూడోసారి కేకేశాడు. ఎట్టకేలకు దయారామ్ అనే ఖత్రి కులస్థుడు 'నేను బలికి సిద్ధం' అన్నాడు. 'సరే! రా' అని ఒక చేత కత్తి, రెండో చేత అతడి రెక్క పట్టుకుని పక్కనే ఉన్న డేరాలోకి తీసుకువెళ్లి మెదలకుండా కూర్చోమన్నాడు. అక్కడే ఒక పాత్రలో నింపి ఉంచిన మేక రక్తంలో కత్తిని ముంచి, మళ్ళీ దర్బారులోకి రౌద్రంగా వచ్చి 'ఇంకొకరు బలికావాలి. ఎవరొస్తారో ముందుకు రండి' అన్నారు. కత్తి నిండా నెత్తురు చూడగానే

అందరి గుండెలూ ఝల్లుమన్నాయి. కొంచెం సేపటికి తెగువ చేసి ధరమ్‌దాస్ అనే జాట్ కులస్థుడు లేచాడు. అతణ్ణీ దేరాలోకి తీసుకెళ్లి అలాగే చేసి మళ్ళీ నెత్తురుతో తడిసిన కత్తితో వచ్చి ఇంకో తల కావాలన్నాడు గురువు. ఈసారి త్వరగానే ఒకడు లేచాడు. ఇలా మొత్తం ఐదుసార్లు చేసి ఐదుగురిని లోనికి తీసుకెళ్లిన తరవాత వేలాది భక్తులు గుండె దడతో గుడ్లప్పగించి చూస్తుండగా, ఒకే రకం నూతన వస్త్రాలు కట్టించి ఆ ఐదుగురినీ వెంటబెట్టుకుని వచ్చి పరిశుద్ధులైన ఈ ఐదుగురే 'ఖాల్సా' అని గురువు ప్రకటించాడు. దయాసింగ్, ధరమ్‌సింగ్, మొఖంసింగ్, సాహిబ్‌సింగ్, హిమ్మత్‌సింగ్' అంటూ ఐదుగురికీ పేరు చివర సింగ్ చేర్చి రెండంచుల బాకుతో కలగలిపిన పవిత్ర జలంతో వారికి దీక్ష ఇచ్చాడు. 'పంజ్‌ప్యారే' (ప్రియ పంచకం)గా ప్రకటించిన ఆ ఐదుగురి చేతుల మీదుగానే తానూ దీక్ష స్వీకరించి, గోవింద్‌సింగ్‌గా పేరు మార్చుకుని 'ఖాల్సాలో గురువు... గురువులో ఖాల్సా' అన్న భక్తి సంబంధాన్ని రూఢి చేశాడు. కేశ్ (పొడవైన జుట్టు), కంఘా (దువ్వెన), కచ్చా (లంగోటి), కర (ఇనుపగాజు), కృపాణం అనే పంచ 'క'కారాలను విధిగా ధరించాలని కట్టడిచేసి, ఎక్కువ తక్కువలు లేకుండా ఖాల్సా సభ్యులందరూ సమానులేనని ప్రకటించాడు.

[The History and Culture of The Indian People - **Ed. R.C.Majumdar**
Vol. VII p.318]

అలా జరిగిన ఖాల్సా స్థాపన సిక్కు సమాజంపై అద్భుత ప్రభావం చూపింది. కులాల ఇనుపగోడలు బద్దలుకొట్టి, సర్వ సమానత్వం పాటించే కొత్త మతం బడుగు వర్గాలను విశేషంగా ఆకర్షించింది. పేదలు, దళితులు, పాకీ పనివారు, తాపీ పనివారు, పశుల కాపరులు, క్షురకులు, వడ్రంగులు వగైరా సకల వర్గాల సమస్త వృత్తుల సామాన్యులూ గురువు నుంచి దీక్షపొంది భయాలు బెంగలు వదిలి ప్రచండ మతావేశంతో పంథ్ పరిరక్షణకు ఆయుధాలు పట్టి వీరభద్రుల్లా విజృంభించారు. ఆ కాలపు రాజపుత్రులకు తీసిపోని విధంగా ప్రాణాలను లెక్కచెయ్యక అపార ధైర్య సాహసాలను చూపారు.

రాజపుత్రులే పెద్ద తలనెప్పి అనుకుంటే అది చాలదన్నట్టు సిక్కులు కూడా పటుతర సాయుధ పోరాటశక్తిగా ఎదగడం దక్కన్‌లో మరాఠాల దెబ్బకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఔరంగజేబుకు ఒళ్లు మండించింది. ఖాల్సా ఏర్పాటు, అనంతర పరిణామాలు చెవిన పడగానే సిక్కుల భరతం పట్టమని ఉత్తరాదిన ఉన్న మొగల్ ఫౌజ్‌దార్లకు, కొండ ప్రాంతాల ప్రభువులకు పాదుషా పురమాయించాడు. గతంలో మొగలుల నుంచి రక్షణకు గురు గోవింద్ సాయాన్ని దేబిరించిన కొండరాజులే మొగలులు ఎగదోయగా ఆనందపూర్ పైకి దండెత్తారు. తీవ్ర నష్టాలకు లోనయినా సిక్కులు వారిని తుక్కుతుక్కుగా ఓడించగలిగారు. 1701లో జరిగిన మొదటి యుద్ధం మొదలుకుని ఆనందపూర్ పైన నాలుగు దండయాత్రలు జరిగాయి. అన్నిటిలోనూ సిక్కులనే విజయం వరించింది. ఇక కొండరాజుల ప్రతాపం మీద ఆధారపడి లాభం లేదని మొగల్ గవర్నర్ వజీర్‌ఖాన్ తానే భారీ సైన్యాన్ని దింపాడు. అటు మొగలులు, ఇటు కొండరాజులు కలిసి కమ్ముకుని ఆనందపూర్ కోటను 1704 డిసెంబర్‌లో ముట్టడించారు. సిక్కులు వీరోచితంగానే పోరాడారు. కాని నెలల తరబడి సాగిన ముట్టడివల్ల కోటలోని నిత్యావసరాల నిల్వలు అడుగంటాయి. అలాగే ఊరకుంటే ఆకలిచావులు తప్పని విపత్కర స్థితిలో గత్యంతరం లేక గురు గోవింద్ రాజీ రాయబారాలకు మెత్తబడ్డాడు. తమను క్షేమంగా వెళ్లనిస్తే కోట ఖాళీ చేయడానికి ఆయన అంగీకరించాడు. మాయదారి

వజీర్‌ఖాన్ ఖురాన్‌మీద ప్రమాణం చేసి సరేనన్నాడు. ఆ మాట నమ్మి గురు గోవింద్, అతని మనుషులు కోట నుంచి బయటికి వచ్చాక మొగలులు దారికాచి వెంటపడి వారిని వేటాడారు. గురు గోవింద్, అతని అనుయాయులు కొందరు గుర్రాల మీద సిర్సా నది దాటి పోగలిగారు. కాని చాలామంది అనుచరులు, ముఖ్యంగా స్త్రీలు, పిల్లలు శత్రువుల దాడిలో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఆ గందరగోళంలో గురుగోవింద్ తల్లి, అతడి కుమారుల్లో ఇద్దరు మొగలుల చేతికి చిక్కారు. సిర్హింద్‌కు బందీలుగా పట్టుకొచ్చిన ఆ పిల్లలను ప్రాణం దక్కాలంటే మతం మారమని నిర్బంధించాడు.

ఆ పిల్లల్లో ఒకడికి ఎనిమిదేళ్లు. చిన్నవాడికి ఐదేళ్లు. తల్లి తండ్రి కనపడకుండా పోయారు. తమ వాళ్లందరూ చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లాచెదురయ్యారు. ఆ స్థితిలో మొగలాయీ యములాళ్ల చేతికి చిక్కి, వారు చెప్పిన మాట వినకపోతే ప్రాణానికి ముప్పు తప్పనప్పుడు సాధారణంగా ఎంతటి ధీరులైనా బేజారవుతారు. కాని ఆ ఇద్దరు పసిబాలురు బలవంతపు మతమార్పిడికి కచ్చితంగా తిరస్కరించారు. వజీర్ ఖాన్ ఇద్దరు పసివారి చుట్టూ ఇటుకలు పేర్పించి బతికుండగానే గోడ కట్టించాడు. మెడవరకూ గోడ లేచాక మళ్లీ అడిగాడు. ప్రాణం పోయినాసరే మతం మారేదిలేదని వారు ఖండితంగా చెప్పాక ఇద్దరి తలలు నరికించాడు. తన కళ్లముందే మనవళ్లను అంత రాక్షసంగా హతమార్చడాన్ని చూడలేక గురువు మాత గుండె పగిలి చచ్చిపోయింది.

ఈలోపు పారిపోతున్న గురువు పరివారాన్ని మొగలు సేనలు వెంటాడాయి. రోపార్ దగ్గర వారిని అందుకున్నాయి. భీషణ సంగ్రామంలో గురు గోవింద్ కుమారులిద్దరు వీరమరణం పొందారు. పొద్దుగుంకేసరికి గురువు గాక ఐదుగురే సజీవంగా మిగిలారు. శిష్యుల బలవంతం మీద విధిలేని పరిస్థితుల్లో రాత్రికి రాత్రి గురువు పలాయనమయ్యాడు. అతడిని పట్టుకోవటానికి అడవిలోకి ప్రతి అంగుళాన్నీ మొగలు సేనలు గాలిస్తుండగా, వారి కళ్లుగప్పి బయటపడటం అసాధ్యమనుకుంటున్న స్థితిలో మొగలు శిబిరంలోని ఇద్దరు మహమ్మదీయ శిష్యులు గురు గోవింద్‌ను ఆదుకున్నారు. మహమ్మదీయ సాధువు వేషం వేసి మేనా ఎక్కించి వారాయనను సురక్షిత ప్రాంతానికి తరలించారు. నానా కష్టాలు పడ్డాక, వెంట్రుకవాసిలో అనేకమార్లు మృత్యువును తప్పించుకున్న మీదట చాలా మంది శిష్యులు, గతంలో ఆయనను వదిలిపోయిన నలభై మంది ముఖ్యులు కూడా తిరిగి వచ్చి ఇప్పటి ముక్తసర్ వద్ద గురువును కలుసుకున్నారు. వాసనబట్టి వారిపైకి ఉరికిన మొగలు సైన్యంతో అక్కడే అంతిమ యుద్ధం జరిగింది. వెర్రి తెగింపుతో సిక్కులు చేసిన వీర విహారానికి నిలవజాలక మొగలులు కాలికి బుద్ధి చెప్పారు. ఇక మళ్లీ వారి జోలికి రాలేదు.

శత్రువులిచ్చిన ఆ విరామంతో గురు గోవింద్ కాలు కూడదీసుకున్నాడు. చెల్లాచెదురైన శిష్యులు, పరివారం మళ్లీ ఆయనను చేరుకున్నారు. పోరాటాల్లో కోల్పోయిన 'ఆదిగ్రంథ్'ను అసాధారణ జ్ఞాపకశక్తితో గురుగోవింద్ తిరగరాశాడు. మచ్చీవారా అడవుల్లో సంచరిస్తుండగా 'జఫర్‌నామా'పేరిట ఆయన పర్షియన్ కవితలో ఔరంగజేబుకు ఒక సుదీర్ఘ లేఖ రాసి, దక్కన్‌లో మరాఠాలతో జీవన్మరణ పోరాటం సాగిస్తున్న చక్రవర్తికి పంపాడు. ఔరంగజేబుకుగల పరమత ద్వేషం ఎంత తప్పో, వజీర్‌ఖాన్ వంటి గవర్నర్లు ఎటువంటి ఘాతుకాలు, నమ్మకద్రోహాలు సాగిస్తున్నారో అందులో గుండెలు పిండేలా వర్ణించాడు.

దానిని చదివితే ఔరంగజేబు వంటి పాషాణ హృదయుడికి కూడా పునరాలోచన కలిగింది.

వివరంగా అన్నీ మాట్లాడటానికి రమ్మని అతడు గురుగోవింద్‌ను పిలవనంపాడు. కొన్ని వేల మంది యోధులను వెంటబెట్టుకుని రాజస్తాన్ గుండా గురువు దక్కన్‌కు వెళుతుండగా 1707 ఏప్రిల్‌లో ఔరంగజేబు మరణవార్త తెలిసింది. ప్రయాణం మానుకుని ఆయన వెనక్కి మరలాడు. అనంతరం 65వ ఏట 'బహదూర్‌షా' పేరుతో ఢిల్లీ గద్దెనెక్కిన ఔరంగజేబు కుమారుడు మువాజం సిక్కులతో వైరానికి స్వస్తిచెప్పి రాజీకొచ్చాడు. అతడితో సఖ్యతకు గురు గోవింద్ సింగ్ అంగీకరించాడు. కొత్త చక్రవర్తి అభ్యర్థనపై తమ్ముడితో వారసత్వ యుద్ధంలో అతడికి సాయంగా పెద్దసేనతో దక్కనుకు వెళుతూ నాందేడ్‌లో గోదావరి తీరాన విడిది చేసినప్పుడు సిక్కు శిబిరంలోని వజీర్‌ఖాన్ మనుషులు భక్తుల్లా నటించి గురుగోవింద్ ఆదమరచి ఉండగా కత్తితో పొడిచారు. మిగతా భక్తులు చప్పున కనిలి ఆ దుండగుడిని నరికివేశారు.

ఏం లాభం? గోవింద్ గాయాలు నయం కాకపోగా మూణ్ణెల్లలో మరీ తీవ్రమయ్యాయి. బతికే ఆశ లేకపోయింది. అంత్యకాలం ఆసన్నమైనదని గ్రహించి గురుదేవుడు 1708 అక్టోబరు 7న భక్తులను సమావేశపరిచి తుది ఆదేశాలను ప్రకటించాడు. వంశపారంపర్యంగా వస్తున్న గురుపీఠానికి తన తరవాత వంశాంకురం మిగలకుండా ఉన్న నలుగురు కొడుకులూ అప్పటికే మరణించారు కనుక... పీఠాధిపత్యం కోసం కొట్లాటలకు అవకాశం లేకుండా... తన అనంతరం గురువు పదవిని ఆయన ఏకంగా రద్దు చేశాడు. వ్యక్తి స్థానంలో 'ఆదిగ్రంథ్'నే గురువుగా భావించి, దాని నుంచే ప్రేరణ పొందాలని అనుశాసించాడు. ఇకపై ఖాల్సాను భగవంతుడే కాపాడి, నడిపిస్తాడనీ...మతానికి సంబంధించిన లౌకిక వ్యవహారాలను పవిత్ర పంచాయత్‌లు నిర్ణయిస్తాయనీ... ముఖ్య సమస్య ఏది ఎదురైనా మతస్థులందరూ సమావేశమై తమలో నుంచి ఐదుగురిని ఎన్నుకుని వారి నిర్ణయాన్నే గురువు నిర్ణయంగా శిరసావహించాలనీ ఉద్బోధించాడు. అంతిమ సందేశం తరవాత కడపటి వీడ్కోలుగా 'వాహ్ గురుజీకా ఖాల్సా...' అంటూ అందరికీ నమస్కరించి ముందే చితిపేర్చి ఉంచిన ఆవరణలోకి తానొక్కడే ప్రవేశించి తలుపులు వేసుకున్నాడు. కంచె దాటి లోనికి రావటానికి ఎవరినీ అనుమతించలేదు. మహాజనులందరూ ఏకధారగా కన్నీరు కారుస్తూ 'సత్‌శ్రీ అకాల్' అని జపిస్తుండగా చితి అంటుకుంది. మంటలు లేచాయి. 42 ఏళ్ల పిన్నవయసులో గురుగోవింద్ జీవయాత్ర అగ్నికీలల్లో పరిసమాప్తమైంది.

సద్గురువు బోధ, తపన వ్యర్థమవలేదు. 'ఖాల్సాకు రాజ్యం సాధించి పెట్టాలన్న గోవింద్‌సింగ్ చిరకాల స్వప్నం ఆయన జీవసమాధి అనతరం పద్దెనిమిది నెలలకే బందా బహదూర్ నాయకత్వంలో సాకారమైంది. 1710 మేలో వజీర్‌ఖాన్ మరణించాక సట్లెజ్ నుంచి యమునా వరకూ సిర్హింద్ రాజ్యం ఖాల్సాకు వశమైంది... నలభయ్యేళ్ల తరవాత మొత్తం పంజాబ్‌లో ఖాల్సా బావుటా ఎగిరి దాదాపు నూరేళ్ళు సిక్కుల ఆధిపత్యం సాగింది. నిజంగా అది గొప్ప అద్భుతం.' (Ibid *p.324*)

సాటిలేని ఛత్రపతి

ధర్మయుద్ధాలు చేసిచేసి మన ప్రభువులు దేశాన్ని అధర్మానికి బలిచేశారు. ఏ నియమాన్నీ పాటించక ఎంత నీచానికైనా ఒడిగట్టే పాపాత్ములతో కూడా నియమ బద్ధంగా యుద్ధంచేసి.. చంపదగినట్టి శత్రువు చేతికి చిక్కినా క్షమించి వదిలేసి... మోసగించినవాడి చేతిలో మళ్లీ మళ్లీ మోసపోయి.. పొంచి ఉన్న ముప్పును సకాలంలో గుర్తించి, సరయిన ప్రతిచర్యతో ఆత్మరక్షణ చేసుకోకుండా అదమరచి... మన అమాయక చక్రవర్తులు అడుగడుగునా దగాపడ్డారు. మంచికి మంచి - చెడుకు చెడు అన్న రీతిలో ఎవరికి అర్థమయ్యే భాషలో వారికి బుద్ధి గరపి ఆది నుంచీ మన రాజులు తెలివిగా వ్యవహరించి ఉంటే దేశ పరిస్థితి మరో విధంగా ఉండేది. ఈ చారిత్రక తప్పిదాన్ని చక్కగా గ్రహించి, శౌర్యానికి శౌర్యంతో, క్రౌర్యానికి క్రౌర్యంతో, మోసానికి మోసంతో సమాధానం చెప్పి శత్రువులకు సింహస్వప్నమైనవాడు.. కోట్లాది హిందువుల వెయ్యేళ్ల గుండె దిగులు తీర్చినవాడు... జాతీయ వీరుడికి ఉండాల్సిన సకల లక్షణాలు మూర్తీభవించిన పురుషోత్తముడు మధ్యయుగ చరిత్ర మొత్తంలో ఒకే ఒక్కడు: *ఛత్రపతి శివాజీ.*

సాక్షాత్తూ భగవంతుడే భూమిమీదికి వచ్చి 'నేను ఫలానా' అని ఐడెంటిటీ కార్డు చూపించి, సమస్త ప్రాణికోటినీ నడిపించేదీ, జగన్నాటకమంతా ఆడించేదీ తానేనని డిక్లేర్ చేసి, అందుకు కావలసినన్ని దృష్టాంతాలను తన అవతార కాలంలో లెక్కలేనన్ని చూపించినా సరే - వ్యభిచారి, మోసగాడు, పక్షపాతి, కపటి అని పరమాత్ముడిలోనే తప్పులెంచిన గొప్ప లోకం ఇది! ఇక - తనకు ఏ గొప్పా ఆపాదించుకోని, ఏ మహిమా చూపని, అప్పరాల్ మానవమాత్రుడైన ఒక శివాజీని మాయల మరాఠీ అని ఈసడించడమనగా ఎంత?!

గజదొంగ, బందిపోటు, తిరుగుబాటుదారు, కుక్క నక్క కొండను తవ్వే ఎలుక, రాస్కెల్, స్కౌండ్రల్... గిట్టని సమకాలికులు మొదలుకుని ఈ కాలపు అరకొర మేధావుల వరకూ

ఎవరికి తోచిన విశేషణాలను వారు జోడించి ఇలా ఎంత చులకన చేసినా భారతీయ జనబాహుళ్యానికి మాత్రం ఆనాడూ ఈనాడూ కూడా శివాజీ మహావీరుడు; ధర్మప్రభువు; ఆదర్శపురుషుడు.

సాధారణంగా ఎవరినైనా అభిమానులు ఆదరిస్తారు; విరోధులు చీదరిస్తారు. గిట్టనివారి చేత కూడా శభాష్ అనిపించుకోగలిగినవాడే నిజమైన యోగ్యుడు. శివాజీ పేరు చెబితే చిరచిరలాడే మొగలాయీ ఆస్థాన ప్రముఖుడు ఖాఫీఖాన్ తిట్టిపోస్తూనే మెచ్చుకున్న తీరు శివాజీ గుణగణాలకు గొప్ప సర్టిఫికెటు:

> Fortune so favoured this treacherous worthless man, that his forces increased, and he grew more powerful every day... But he made it a rule that wherever his followers went plundering, they should do no harm to the mosques, the Book of God, or the women of anyone. Whenever a copy of the sacred Kuran came into his hands, he treated it with respect, and gave it to some of his Musulman followers.
>
> ***[Muntakhabu-L Lukab*, Elliot & Dowson,** *Vol. VII p.2600]*
>
> *(ఏందుకూ కొరగాని ఈ విశ్వాసఘాతకుడికి అదృష్టం ఎంత అనుకూలించిందంటే అతడి బలాలు పెంపొంది రోజు రోజుకూ మరీ శక్తిమంతుడయ్యాడు... తన అనుచరులు ఎక్కడ కొల్లగొట్టేందుకు వెళ్ళినా మసీదులకూ, పవిత్ర గ్రంథానికీ, ఎవరి స్త్రీలకూ హాని చేయరాదని అతడు కట్టడి చేశాడు. పవిత్ర ఖొరాన్ ప్రతి ఎప్పుడు తన చేతికి దొరికినా గౌరవం చూపి తన ముసల్మాన్ అనుచరుల్లో ఎవరికైనా దాన్ని ఇచ్చేసేవాడు.)*

జనావాసాలపై ఎప్పుడు ఎక్కడ దాడిచేసినా ముందుగా హిందూ దేవాలయాలను ధ్వంసం చేసి, పవిత్ర గ్రంథాలకు, పవిత్ర విగ్రహాలకు సాధ్యమైనంత అపచారం చేసి, హిందూ స్త్రీలపై పిశాచాల్లాపడి అడ్డమైన అఘాయిత్యాలు చేయించడం పరిపాటి అయిన మహమ్మదీయ సుల్తాన్లతో పోల్చిచూస్తే శివాజీ విశిష్టత ఎంత గొప్పదో అర్థమవుతుంది.

ఒకసారి యుద్ధంలో తన సైనికులు మహమ్మదీయ స్త్రీని చెరబట్టి విజయ చిహ్నంగా శివాజీకి సమర్పించబోతే అతడు వారిపై మండిపడి, ఆ మహిళను సగౌరవంగా సాగనంపాడు. హిందూ మతమంటే ప్రాణం ఇచ్చేంత ఇష్టమైనా, హిందూ ధర్మ పునరుజ్జీవనాన్ని జీవితాశయంగా పెట్టుకుని జీవితాన్ని అంకితం చేసినా శివాజీకి ఇతర మతాలపట్ల ద్వేషం ఏ కోశానా లేదు. రాయగఢ్ రాజభవనం ఎదుట ముస్లింల కోసం ఆయన మసీదును కట్టించాడు. హిందువుల వలెనే ముస్లింలూ మనస్ఫూర్తిగా ఆయనను సేవించారు. ముల్లా హైదర్ ఆయన అంతరంగిక కార్యదర్శి, ఇబ్రహీంఖాన్, దౌలత్‌ఖాన్, సిద్దీమిస్రీలనే ముసల్మాన్లు ఆయన నౌకాదళ కమాండర్లు.

శివాజీకి తనకంటూ మొదట రాజ్యమే లేదు. సాధారణ జాగీర్దారు కుమారుడుగా ఒక మోస్తరు ఎస్టేటులో జీవితం ఆరంభించి చిన్న వయసులోనే స్వతంత్రించి, కొద్దిపాటి బలాలను కూడగట్టి, అవసరమైనచోట పరాక్రమం చూపి అవకాశమున్నచోట లౌక్యంతోనో, దౌత్యంతోనో కార్యం సాధించి, తప్పనిసరి పరిస్థితుల్లో క్రౌర్యాన్ని కనపరచి వెనకబడిన మహారాష్ట్రలో

ఒకటొకటిగా కోటలను వశపరచుకుని, అంచలంచెలుగా రాజ్యాన్ని విస్తరించుకున్న కార్యశూరుడతడు. ఈ క్రమంలో మహమ్మదీయ సుల్తాన్ల మధ్య వైరుధ్యాలనూ, వారికీ మొగల్ పాదుషాలకూ గల విరోధాలనూ చక్కగా వినియోగించు కున్నాడు. శాశ్వత మిత్రత్వ, శతృత్వాలు ఎవరితో పెట్టుకోకుండా సమయాన్నిబట్టి వ్యూహం పన్నాడు. భయంకర యుద్ధాలు చేశాడు - ఎన్నో దిగ్విజయాలలాగే ఘోర పరాజయాలనూ చవిచూశాడు. కాలం ప్రతికూలించినప్పుడు మేవాడ్ రాజపుత్ర వీరులవలె భేషజాలకు పోకుండా శత్రువులకు తలవంచాడు. చివరి సైనికుడు నేలకొరిగేంతవరకూ గెలిచే ఆశలేని పోరును కొనసాగించిన వెనుకటి హిందూ రాజులకు భిన్నంగా అవమానకరమైన రాజీలకూ సిద్ధపడ్డాడు. అవసరమైనప్పుడు కపట నాటకాలూ ఆడాడు. ఎత్తుకు పైఎత్తు వేసి విరోధులను చిత్తుచేశాడు. నేలకు కొట్టిన బంతిలా కిందపడిన ప్రతిసారీ రెట్టింపు వేగంతో పైకిలేచాడు. వాటమెరిగి అడుగువేసి అనుకున్నది సాధించాడు. భారత ఉపఖండమంతటినీ ఏకచ్ఛత్రంగా ఏలి ప్రపంచంలోకెల్లా శక్తిమంతమైన దనిపించుకున్న మొగలాయీ మహాసామ్రాజ్యాన్నే గడగడలాడించి, అవక్ర విక్రమంతో గొప్ప రాజ్యాన్ని సాధించి, జాతిజనుల కన్నుల పండువగా పట్టాభిషిక్తుడై స్వర్ణాక్షరాలతో రాయదగిన ఘన చరిత్ర సృష్టించాడు.

శివాజీయే కనుక కొన్ని శతాబ్దాల ముందు పుట్టి ఉంటే చరిత్ర గతి ఇంకో విధంగా ఉండేది. 10వ శతాబ్దంలో షాహీరాజు జయపాలుడి స్థానంలో ఇతడే ఉంటే భారతదేశం లోపలికి మహమ్మదీయ సుల్తాన్లు చొచ్చుకు రాగలిగేవారు కాదు. ఉపఖండం ముక్కలు చెక్కలు అయ్యేదీ కాదు. చేజిక్కిన మహమ్మద్ ఘోరీని క్షమించి వదిలేసి, చివరికి అతడి చేతిలోనే హతమైన సత్తెకాలపు ధర్మరాజు పృథ్వీరాజ్ చౌహాన్ స్థానంలో శివాజీ ఉన్నట్టయితే రెండో తారాయిన్ యుద్ధం పర్యవసానం ఇంకొకలా ఉండి, ఆరు శతాబ్దాల బానిసత్వం భారతజాతికి తప్పేది. ఖాణ్వాలో బాబర్ మీద రాజపుత్రుల ఐక్యపోరాటాన్ని సంగరాణా కాక శివాజీ నడిపించి ఉంటే మాయ నాటకాలు సాగక బాబర్ తోకముడిచి వెనక్కిపోయేవాడు.

వెనుకటి శతాబ్దాల్లో పుట్టి ఉంటే ఎలా ఉండేదన్న సంగతి అలా ఉంచితే 17వ శతాబ్దంలో శివాజీ అనేవాడు లేకపోయినా దేశ పరిస్థితి మహా దారుణంగా ఉండేది. శివాజీ రంగంలోకి వచ్చేనాటికి హిందువుల ఆశాజ్యోతి దాదాపు ఆరిపోయింది. హిందూ మతాన్ని, సంప్రదాయాన్ని, హిందువుల ఆత్మగౌరవాన్ని ఇనుప పాదాలతో అణగదొక్కటానికి భారీ ప్రయత్నాలు సాగుతున్నాయి. వింధ్యకు దక్షిణాన మహమ్మదీయ ప్రభంజనాన్ని రెండు శతాబ్దాల పర్యంతం కొండలా నిరోధించిన విజయనగర మహాసామ్రాజ్యం శివాజీ పుట్టటానికి ఆరు దశాబ్దాల కిందటే కుప్పకూలింది. ఉత్తరాదిన హిందూ పౌరుషానికి ప్రతీకలనుకున్న రాజపుత్రులకూ నిరంతర పరాజయాల తరవాత నీరసం వచ్చింది. రాణాప్రతాప్ కుమారుడు అజిత్‌సింగే మొగలాయీ సార్వభౌమత్వానికి విధిలేక దోసిలి ఒగ్గాడు. తిరుగుబాటులన్నీ అణగి మొత్తంగా భారత ఉపఖండం ఇస్లామిక్ పెత్తనంలోకి వచ్చిన తరుణంలో ఒక మామూలు జాగీర్దారు కుమారుడు మొగలాయీ మహాసామ్రాజ్యం మీద తిరగబడటమే అబ్బురం. హిందూ జాతి మనుగడే ప్రశ్నార్థకమైన కారుచీకటిలో పదిహేడవ ఏట గుండె బలమే మూలధనంగా అనేక అవస్థల నడుమ పళ్ల బిగువున మిణుగురు పురుగులా బయలుదేరిన శివాజీ మూడు దశాబ్దాల స్వల్ప వ్యవధిలో అందరి అంచనాలనూ తారుమారు చేస్తూ ఒక మహాకాంతి పుంజంలా వెలుగులు విరజిమ్మాడు. హిందూత్వానికి పెట్టని కోటగా

నిలిచి దీర్ఘ శిశిరం తరవాత యావద్భారతానికి ఆశల వసంతాన్ని ఆవిష్కరించాడు. రెపరెపలాడే ఆ చిరుదీపాన్ని సునాయాసంగా ఆర్పెయ్యగలనని అహంకరించిన ఔరంగజేబు చక్రవర్తి తన అపార వనరులను, అజేయ సైనిక బలాన్ని, యావచ్ఛక్తిని వినియోగించి జీవితమంతా ఝంఝూమారుతంలా వెంటాడినా తానే కడదేరాడు తప్ప ప్రచండ 'శివ'శక్తిని లొంగదీయలేక పోయాడు. శివాజీ విరోధులు, సమకాలికులైన ఆంగ్లేయులు, బుడతకీచులు, అనంతర కాలంలో తెలిసీ తెలియని అసంపూర్ణ ప్రజ్ఞావంతులు అతడిని కేవలం ఒక స్థానిక తిరుగుబాటుదారుగా, ప్రాంతీయ బందిపోటుగా, మహా అయితే మహారాష్ట్రలో కొంత భాగానికి కొంత కాలం పెత్తందారుగా చిత్రించి కించపరిస్తేనేమి? అతడి ప్రథమ శత్రువూ, ప్రబల విరోధీ అయిన మొగల్ సామ్రాట్టు ఔరంగజేబు అంతటివాడే 1630లో యాభై మూడేళ్ల పిన్న వయసులో శివాజీ అకాల మరణం వార్త విని "He was a great captain and the only one who has had the magnanimity to raise a new kingdom, while I have been endevouring to destroy the ancient sovereignties of India. My armies have been employed against him for nineteen years and nevertheless his state has been increasing" *(అతడు గొప్ప నాయకుడు. హిందుస్థాన్‌లోని ప్రాచీన రాజ్యాలన్నిటినీ ధ్వంసం చేయాలని నేను పాటుపడుతుండగా కొత్త రాజ్యాన్ని స్థాపించగలిగిన ధీరోదాత్తుడు అతడొక్కడే. పందొమ్మిదేళ్లుగా నా సేనలన్నీ అతడి మీద ప్రయోగించినా అతడి రాజ్యం మాత్రం విస్తరిస్తూనే పోయింది)* అన్నాడు చాలదా?

[The History & Culture of The Indian People Vol. VII p. 277]

శివాజీ ఎప్పుడు ఏమి చేశాడు అన్న దానికి తిరుగులేని డాక్యుమెంటరీ రుజువులు ఉన్నాయి కాబట్టి సరిపోయింది గానీ అతడి సాహస కృత్యాలను ఈ కాలంలో వింటే అటువంటి మహావీరుడొకడు మూడు శతాబ్దాల కిందట నిజంగానే ఈ దేశంలో ఉండేవాడని చాలా మంది నమ్మేవారు కాదేమో. ఆ మరాఠా ముఠాకోరును సజీవంగానో నిర్జీవంగానో నా ముందుకు పట్టి తెమ్మని బీజాపూర్ ప్రభువు 1659లో ఆజ్ఞాపించగా, 'అదెంతపని? గుర్రం దిగకుండానే ఆ ఎలుకను బోనులో పట్టి ఈడ్చుకు వస్తాన'ని ప్రగల్భాలు పలికి, పదివేల సైన్యంతో కదిలి దారిపొడవునా హిందూ జనపదాలను, హిందూ దేవాలయాలనూ నాశనం చేస్తూ, తరుముకు వచ్చిన మహాబలశాలి అఫ్జల్‌ఖాన్‌తో శివాజీ ఎలా తలపడ్డాడు? భయపడినట్టే నటించి, లొంగి పోవడానికేనన్నట్టు దీనంగా కొండదిగి వచ్చాడు. పదివేల సైనికులు చుట్టుముట్టి ఉండగా, అందునా వస్తాదులాంటి తనను ఆ చిట్టెలుక ఏమి చేయగలదన్న దిలాసాతో ఎత్తుమీది గుడారంలో ముఖాముఖి భేటీకి అఫ్జల్‌ఖాన్ అంగీకరించాడు.లోనికి వచ్చీ రాగానే అప్యాయంగా అక్కున చేర్చుకున్న భంగిమలో శివాజీని సందిట్లో ఇరికించుకుని పక్కనుంచి బాకుతో పొడవగా అంగరఖా లోపలి కవచం మరాఠా వీరుడిని కాపాడింది. భల్లూకపు పట్టులో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతూనే శివాజీ మెరుపు వేగంతో కదిలి ఇనుప పులిగోళ్లతో చెట్టంత మనిషిని పొట్టచీల్చి చంపాడు.

వేల సైన్యం పహరా మధ్య ఎద్దులాంటి అఫ్జల్‌ఖాన్‌ను ఒంటిచేత్తో చంపేసిన శివాజీ ప్రతాపం చెవిన పడగానే, ఔరంగజేబు భగ్గున మండాడు. అడ్డూ అదుపూ లేకుండా పేట్రేగుతున్న ఆ 'నరక శునకాని'కి తగిన శాస్తి చేయమని తన మేనమామ షయిస్తాఖాన్‌ను చక్రవర్తి పురమాయించాడు. ఉమ్మడి శత్రువును ఎదుర్కోవడంలో బీజాపూర్‌వారూ

మొగలులతో చెయ్యి కలిపారు. ఉత్తరం నుంచి మొగలులు, దక్షిణం నుంచి బీజాపూరీలు ఏకకాలంలో విరుచుకుపడటంతో శివాజీ అడకత్తెరలో పోకలా నలిగాడు. రెండేళ్ళ హోరాహోరీగా పోరాడి, ఎంత పరాక్రమం చూపినా అతడికి పరాజయాలే ఎక్కువగా సంప్రాప్తించాయి. అతడి అధీనంలోని కొంకణ్ ప్రాంతాన్ని ఆక్రమించి, చకాన్‌లాంటి ముఖ్య స్థావరాలను వశపరచుకుని, శివాజీకి చెందిన పూనా కోటలో పీఠం పెట్టి విజయగర్వంతో షయిస్తాఖాన్ పొంగిపోతుండగానే మరాఠా బెబ్బులి ఊహించని రీతిలో తిరగబడింది.

శివాజీ ఎప్పుడు దాడి చేస్తాడోనన్న భయంతో షయిస్తాఖాన్ పూనా చుట్టూ గట్టి దిగ్బంధమే చేశాడు. మరాఠీ వాడెవడినీ అనుమతి లేకుండా నగరంలోకి రానివ్వొద్దని గొప్ప కట్టడే చేశాడు. కాని శివాజీ తెలివితేటల్లో అతడిని తలదన్నినవాడు. అందరి కళ్లు కప్పి మారువేషాల్లో జట్లు జట్లుగా మెరికల్లాంటి 400 మంది అనుచరులను పూనాలోకి చేరవేశాడు. చీమ కూడా లోపల చొరకుండా కోట చుట్టూ, లోపలా వేల సైన్యాన్ని బందోబస్తు చేసిన మొగలు రాజప్రతినిధి ఒక్క సంగతి మరిచాడు. ఏమిటంటే – ఆ కోట శివాజీకి కొత్తకాదు. చిన్నతనం నుంచీ చాలా ఏళ్లు అతడు అందులోనే ఉన్నాడు. అక్కడి ప్రతి అంగుళమూ అతడికి బాగా తెలుసు. అంతమంది కాపలా వాళ్ల కళ్లు ఎలా కప్పారోగాని మొత్తం 400 మంది కోటలో ప్రవేశించారు.

అది రంజాన్ మాసం. ఉపవాసం చేసిన అలుపుతో లోపల అందరూ గాఢనిద్రలో ఉండగా కమాండో ఆపరేషను మొదలైంది. శివాజీ కత్తిచేతబట్టి అర్ధరాత్రి నేరుగా షయిస్తాఖాన్ పడక గదిలోకే చొచ్చుకు వెళ్ళాడు. అతని వెనకే 200 మంది అనుసరించారు. అలికిడికి మేలుకున్న రాణులు గొల్లుమన్నారు. షయిస్తాఖాన్ దిగ్గున లేచి ఆయుధం అందుకునే లోపే శివాజీ కత్తి ఝుళిపించాడు. ఖాన్‌గారి వేలు తెగింది. ఇంతలో దీపాలు ఆరాయి. చీకటిలో మరాఠాలు అందినవారిని అందినట్లు నరికారు. ఆ చిందులాటలో కొందరు బానిస స్త్రీలు తమ యజమానిని బయటికి చేరవేశారు. ఈ గొడవకు బయటి సైనికులు అప్రమత్తమయ్యారు. మిగతా 200 మంది మరాఠాలు వారితో తలపడ్డారు. మొగలు దళాలు తబ్బిబ్బు నుంచి తేరుకునేలోపే శివాజీ దళం వచ్చినంత వేగంగా నిష్క్రమించింది. చంపింది యాభై మందినే అయినా వైస్రాయి మీదే జరిగిన దాడితో మొగలుల గుండెల్లో ఫిరంగులు పేలాయి. నేరుగా శత్రువు కోట మీదే మెరుపు దాడిచేసి లాఘవంగా బీభత్సం సృష్టించి దర్జాగా తప్పించుకుపోయిన సాహస కార్యం కనీవినీ ఎరుగనిది. అందుకే అఖిల భారతప్రజానీకానికి శివాజీ మీద ఆరాధనా భావం ఇంకా పెరిగింది.

షయిస్తాఖాన్ గువ్వపిట్టలా శివాజీ చేతికి చిక్కినందుకు మండిపడి ఔరంగజేబ్ అతణ్ణి తక్షణం బెంగాల్‌కు గెంటేసి తన కుమారుడు ముఅజంను దక్కన్ గవర్నర్‌గా నియమించాడు. అతడిమీదా నమ్మకం చిక్కక మళ్లీ 9 నెలలకే రాణా జయసింగ్‌ను అక్కడికి తరలించాడు. అతడికి అప్పగించిన అతి ముఖ్య బాధ్యత ఎలాగైనా శివాజీని అణచివెయ్యమని. జయసింగ్ కడు సమర్థుడు. అటు రణతంత్రంలోనూ, ఇటు దౌత్యం లోనూ ఆరితేరిన ఘటం. శివాజీకి ఎటు నుంచీ సహాయం అందకుండా బీజాపూర్ అదిల్షాను, గోల్కొండ కుతుబ్‌షాను సరిచేసుకుని, మహారాష్ట్ర లోపల శివాజీ ప్రాభవానికి ఓర్వలేని స్థానిక పెత్తందార్లను, శివాజీ మీద పగబట్టిన అఫ్జల్‌ఖాన్ బంధువులనూ కూడగట్టి, పథకం ప్రకారం జయసింగ్ శివాజీ వెంటపడ్డాడు. అతడూ శాయశక్తులా పోరాడాడు. మూడు నెలలు సాగిన భీషణ సంగ్రామంలో

కొండలాంటి మొగల్ సామ్రాజ్య సైనిక బలాధిక్యం ముందు ఎంత పరాక్రమం చూపినా శివాజీకి పరాజయం తప్పలేదు. చివరికి మిగిలిన పురందర్ కోటను కూడా మొగల్ సేనలు రెండు నెలలపైగా ముట్టడించిన మీదట గెలిచే ఆశ ఏ కోశానా లేకపోవడంతో గత్యంతరం లేక శివాజీ రాజీకొచ్చాడు. తన కోటలు ఇరవై మూడింటిని మొగలులకు స్వాధీనపరచి, 12ను మాత్రమే తాను ఉంచుకుని, మొగలు దర్బారుకు విధేయుడై, బీజాపూర్‌పై మొగలులు చేయబోయే దాడికి పూర్తిగా సహకరించి చక్రవర్తి పక్షాన పోరాడే షరతుమీద సంధి కుదిరింది. ఇచ్చిన మాట ప్రకారం బీజాపూర్‌పై జయసింగ్ దండయాత్రలో శివాజీ శక్తివంచన లేకుండా సహకరించినా అనేక కారణాలవల్ల ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అందువల్ల గుర్రుగా ఉన్న చక్రవర్తిని సముదాయించి పూర్తి విశ్వాసం కలిగించడానికి ఆగ్రా వెళ్ళి దర్శనం చేసుకుంటే బావుంటుందని జయసింగ్ నచ్చచెప్పాడు. శివాజీ అంగీకరించాడు.

. కాలం కలిసి రానప్పుడు తగ్గి ఉండటం మేలన్న వివేకంతో వేరే దారి లేక తన స్వాతంత్ర్యాన్ని వదులుకుని, మున్సబ్‌దారు స్థాయికి దిగజారి, చక్రవర్తి సన్నిధికిపోయి చేతులు కట్టుకు నిలబడేందుకు సిద్ధపడ్డా అక్కడ జరిగిన అవమానం ఆత్మాభిమానంగల శివాజీకి భరించరానిదైంది.

ఆ రోజు 1666 మే 12. అది ఔరంగజేబు యాభయ్యో పుట్టిన రోజు. దర్బారు యావత్తూ మహా కోళాహలంగా ఉంది. శివాజీ వెళ్ళి చక్రవర్తికి యథావిధిగా మొక్కి కానుకలు సమర్పించినా రివాజు ప్రకారం అతనికి ఎదురు మర్యాదలు చేయకుండా వెనక్కిపోయి వేచి ఉండమన్నారు. మరీ తక్కువ రకం మున్సబ్‌దార్ల సరసన వెనక వరసలో అతడిని నిలబెట్టారు. గతంలో తాను చిత్తుగా ఓడించిన జశ్వంత్‌సింగ్ కూడా తనకంటే ముందు వరసలో ఉండటం శివాజీకి అవమానంగా తోచింది. అతడి స్థానంలో మరొకడుంటే చక్రవర్తి ఎదుట నోరు మెదిపేందుకు సాహసించక పరాభవాన్ని దిగమింగి మిన్నకుండేవాడే. పౌరుషానికి మారు పేరయిన శివాజీ ఊరుకోలేకపోయాడు. తనకు ఇచ్చిన మాట ప్రకారం గౌరవం ఇవ్వక అవమానించారని నిండు సభలో అందరూ వింటూండగానే అసమ్మతి తెలిపాడు. ఆ పరాభవోద్వేగంలో సొమ్మసిల్లాడు. సభాసదులు తెల్లబోయారు. అవిధేయతకు ఆగ్రహించిన ఔరంగజేబు కుమారుడితో సహా శివాజీకి గృహ నిర్బంధ శిక్ష విధించాడు. ఎవరు ఎన్నివిధాల నచ్చచెప్పినా వారిని విడిచేందుకు ఒప్పుకోలేదు. దాంతో శివాజీ తెలివిగా పథకం వేసి తనను తానే విడిపించుకున్నాడు.

అదో పెద్ద సాహసం. జయసింగ్ కుమారుడు రామ్‌సింగ్ భవనంలోని తన విడిది నుంచి రోజూ బ్రాహ్మణులకు పంచి పెట్టడానికి తట్టలకొద్దీ మిఠాయిలను తాను లోబరచుకున్న పనివారి ద్వారా పంపించడం మొదలుపెట్టాడు. చివరికి ఆగస్టు 19న నలతగా ఉందని, ఎవరినీ లోనికి రావద్దని చెప్పి, తనను పోలిన ఒకడిని తెరల వెనుక పాన్పుమీద పడుకోబెట్టి కావడి బుట్టలో దాక్కొని కాపలా వాళ్ల కంట్లో కారం కొట్టి తప్పించుకు పోయాడు. 18 గంటల తరవాత మోసం బయటపడేసరికే ఆగ్రా పొలిమేరలు దాటి చాలా దూరం పోయాడు. పారిపోవడంలోనూ ఎంత లాఘవం చూపాడని? ఆగ్రాకు మహారాష్ట్ర నైరుతి దిక్కున ఉంది కనుక అటువైపే వెళతాడని అందరూ ఊహించారు. కాని వెళ్ళాల్సిన దానికి వ్యతిరేక దిశలో ఉత్తరంగా మధురకు వెళ్లి గడ్డం మీసాలు తల గొరిగించుకుని సన్యాసి వేషం వేశాడు. అటు నుంచి తూర్పుకు తిరిగి అలహాబాద్ వెళ్లాక నైరుతికి మళ్ళీ బుందేల్‌ఖండ్,

హైదరాబాద్‌ల మీదుగా వెంట్రుకవాసిలో ప్రమాదాలను తెలివిగా తప్పించుకుంటూ చుట్టూ తిరిగి ఆగ్రాలో బయలుదేరిన 25 రోజుల తరవాత యతి వేషంలో రాయగఢ్ కోటలోప్రవేశించి తల్లికాళ్లకు మొక్కితే మొదట ఆమె కుమారుడిని పోల్చుకోలేదు. గుర్తుపట్టాక ఆమెకే కాదు మహారాష్ట్ర అంతటా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. సింహం గుహలో అడుగుపెట్టి, బాహాటంగా చక్రవర్తినే ధిక్కరించిన తీరుకు, సాహసోపేతంగా చెర నుంచి తప్పించుకున్న విధానికి దేశ ప్రజలందరూ శివాజీ ధైర్యానికి విస్తుపోయి మనసులోనే ఆయనకు నీరాజనాలర్పించారు.

ఇంత జరిగాక ఔరంగజేబు ఆగ్రహోదగ్రుడై తన సైనిక శక్తినంతటినీ శివాజీ వేటకు వినియోగించి ఉండాల్సింది. కాని అక్కడే శివాజీకి అదృష్టం అనుకూలించింది. అతడు ఆగ్రా నుంచి తప్పించుకున్న పక్షం రోజులకే పర్షియన్ దండయాత్రను ఎదుర్కోవడానికి పంజాబ్‌కు పెద్ద సైన్యం పంపాల్సి వచ్చింది. ఆ వెంటనే పెషావర్‌లో తిరుగుబాటు లేచింది. దాంతో శివాజీ మీద దృష్టి సారించటానికి ఔరంగజేబుకు వ్యవధి లేకపోయింది. శివాజీతో కుమ్మక్కయ్యాడన్న అనుమానంతో జయసింగ్‌ను తీసేసి దక్కన్‌కు మళ్లీ యువరాజు మువాజంను, జశ్వంత్‌సింగ్‌ను పంపించాక మొగలు శిబిరంలో గొడవలు లేచి, సమన్వయం లోపించింది. దాంతో శివాజీ పని మరీ తేలికైంది. ఔరంగజేబు ప్రావకానికి తహతహలాడుతున్నట్టే కనిపించి, జశ్వంత్‌సింగ్ సాయంతో సంధి కుదుర్చుకుని, శివాజీ మూడేళ్ళ విరామంలో పద్ధతి ప్రకారం బలం పుంజుకున్నాక 1670లో మళ్ళీ విజృంభించాడు. గతంలో తాను కోల్పోయిన కోటలన్నిటినీ ఒకటొకటిగా తిరిగి సంపాదించి, మొగలు సామ్రాజ్యంలో వ్యాపార కేంద్రమైన సూరత్‌ను యథేచ్ఛగా దోచుకుని, అటు మొగలుల నుంచి ఇటు బీజాపూర్ వారి నుంచి రక్షణ కట్నం వసూలు చేసే స్థాయికి ఎదిగాడు. అధికార ప్రాభవానికి పతాక సన్నివేశంగా 1674 జూన్ 6న రాయగఢ్‌లో శాస్త్రోక్తంగా, మహావైభవంగా సకల రాజలాంఛనాలతో పట్టాభిషిక్తుడయ్యాడు. తైమూర్ వంశపు సార్వభౌమాధికారంతో ప్రమేయం లేకుండా సర్వస్వతంత్రంగా ఒక హిందూ రాజ్యం ఆవిర్భవించడం 17వ శతాబ్దిలోని ముఖ్యమైన రాజకీయ పరిణామం. క్షత్రియ కుల వతంస, సింహాసనాధీశ్వర, మహారాజ, ఛత్రపతి బిరుదాలతో సింహాసనమధిష్ఠించి, అష్టప్రధానులతో హిందూ సంప్రదాయబద్ధంగా సమర్థ ప్రభుత్వ వ్యవస్థను నెలకొల్పిన శివాజీని చూసి మహారాష్ట్రే కాదు మొత్తం దేశమే గర్వపడింది. శివాజీ కూడా ఏ ఒక ప్రాంతానికో పరిమితం కాక యావద్దేశంలో హిందూ ధర్మసంరక్షణ కోసం జీవితమంతా అంకితమయ్యాడు. 1679లో హిందువులపై జిజియా పన్నును మళ్లీ రుద్దినందుకు తీవ్రంగా స్పందిస్తూ ఔరంగజేబుకు రాసిన చారిత్రక లేఖ శివాజీ మతోద్వేగానికి మచ్చుతునక.

"దేవుడు మనుషులందరికీ దేవుడే. మహమ్మదీయులకు మాత్రమే కాదు. ఇస్లాం, హిందూత్వం అనేవి మానవజాతిని చిత్రించేందుకు దివ్య చిత్రకారుడు వాడిన రెండు వేర్వేరు రంగులు. మసీదులో అయినా దేవాలయంలో అయినా ప్రార్థించేది అతడినే. బొమ్మ మీద కొత్తరేఖలు గీయడమంటే చిత్రకారుడిని తప్పుబట్టినట్టే అవుతుంది. మత కారణంతో ఏ మనిషినైనా ద్వేషించడం పవిత్ర గ్రంథంలో పదాలను మార్చడంతో సమానమే. జిజియా పన్ను విధింపు అన్యాయం. చీమలమీద, దోమలమీద ప్రతాపాన్ని చూపించడం పరాక్రమం అనిపించుకోదు" అని ఆ చారిత్రాత్మక లేఖలో ఔరంగజేబుకు ఛత్రపతి మొగం వాచేట్టు

చివాట్లు పెట్టాడు.

చరిత్రకారులు కొందరు చెప్పినట్టు శివాజీ జనాన్ని దోచే బందిపోటు, జాలిలేని క్రూరుడు అయిన పక్షంలో పెద్ద బలగంతో అతడు వస్తున్నాడంటేనే హడలిపోయి ఎక్కడి జనం అక్కడ పారిపోయేవారు. కాని తన రాజ్యంలోనే కాదు, వేరే రాజ్యంలో అడుగుపెట్టినప్పుడు కూడా శివాజీకి అఖండ స్వాగతమే లభించింది. కర్ణాటక (ఇప్పటి తమిళనాడు) ప్రాంతాలపైకి జైత్రయాత్ర చేయడానికి వెళుతూ మార్గమధ్యంలో గోల్కొండ కుతుబ్‌షాతో మంతనాలకు అతని ఆహ్వానం మీద 1677 ఫిబ్రవరిలో నెల రోజులు హైదరాబాద్‌లో శివాజీ మకాం చేసిన ఘట్టం ఇందుకో ఉదాహరణ. యాభైవేల సేనతో గొలకొండ రాజ్యం పొలిమేరలో అడుగుపెట్టింది మొదలు వెళ్ళిపోయేదాకా శివాజీ సైన్యం ఎవరికీ ఏ అసౌకర్యం కలిగించకుండా అత్యంత క్రమశిక్షణతో మెలిగింది. భాగ్యనగర్ వీధులన్నీ శుభ్రం చేసి అతడు వెళ్ళేదారిపొడవునా పూలు, కుంకుమ చల్లారు. నగరమంతటా స్వాగత తోరణాలు కట్టారు. సపరివారంగా ససైన్యంగా గోలకొండకు వెళుతున్న ఛత్రపతిని చూడటానికి మేడల మీద మిద్దెల మీద జనం విరగబడ్డారు. అడుగడుగునా ముత్తయిదువలు మంగళహారతులిచ్చారు. శివాజీ ఉన్న నెల రోజులూ వేడుకలు వినోదాలతో పండుగ వాతావరణం నెలకొంది. ముస్లిం రాజ్యంలోకి హిందూ రాజు గౌరవ అతిథిగా వెళ్ళి అఖండ సత్కారాలందుకోవడం దేశ చరిత్రలో అపురూప ఘట్టం.

పెద్ద యుద్ధాలు చేసి గొప్ప విజయాలు సాధించిన రాజులు చరిత్రలో ఎందరో ఉన్నారు. వారు ముందుండి స్వయంగా సేనలను నడిపించినప్పుడే ఆ విజయాలు ఎక్కువగా సిద్ధించేవి. యుద్ధరంగంలో రాజు చెలరేగి వీర విహారం చేసినంతవరకూ సేనలూ ఉత్సాహంగా పోరాడేవి. ఏ బాణమో తగిలి రాజు కూలినా, ఏనుగు గాయపడినందున ఏ గుర్రంమీదకో మారినా ఇంతే సంగతులు. సేనలు కంగారుపడి చెల్లాచెదురవటంతో నిమిషాల్లో జయాపజయాలు తారుమారయ్యేవి. క్రీ.శ. 702 లో సింద్‌లో దాహిర్‌సేన్ నుంచి 1565 లో తళ్లికోటలో అళియరామరాయల వరకూ ఇదే విషాదగాథ. ఒక్క రాజు మీదే గెలుపోటములు ఆధారపడే పద్ధతికి శివాజీ వైఖరి పూర్తిగా భిన్నం. రంగంలో తాను ఉన్నా లేకున్నా ఫలితం ఒక్కలాగే ఉండేలా అతడు పరిస్థితినిబట్టి యుద్ధ వ్యూహం పన్నేవాడు. అత్యంత ప్రమాదభరితం అనుకున్న కార్యాన్ని తనమీదే వేసుకుని అద్భుత పరాక్రమం చూపేవాడు. ఇతరులు కూడా చేయగలరనుకున్న సందర్భంలో పోరాడే అవకాశాన్ని సహచరులకు ఇచ్చేవాడు. మనుషుల గుణగణాలను, శక్తిసామర్థ్యాలను సరిగ్గా అంచనా వేసి, ప్రతిభ బయటపడేందుకు సావకాశం కల్పించి, ఉత్తేజితులను చేయడంలో, సమర్థులైన ద్వితీయ నాయకశ్రేణిని తయారుచేయటంలో ఆయనకు ఆయనే సాటి. స్వయంగా ముందుండి ఎన్ని యుద్ధాలను గెలిచాడో తన సహచరులను పంపించీ అన్ని విజయాలను సాధించాడు. యుద్ధ వ్యూహం కూడా ఎంత పకడ్బందీగా పన్నేవాడంటే బలాబలాలను, భౌతిక స్థితిగతులను, ఉన్న అవకాశాలను, రాగల అవరోధాలను దృష్టిలో ఉంచుకుని ఒకసారి రణతంత్రం నిర్ణయించి పంపితే ఆయన మనుషులు తు.చ. తప్పక దాన్ని అమలుపరచగలిగేవారు. యుద్ధంలోనేకాక మామూలు విషయాల్లోనూ తన ఉనికితో నిమిత్తం లేకుండా పనులు సాఫీగా జరిగేపోయే వ్యవస్థను రూపొందించటం శివాజీ ప్రత్యేకత. అందుకే అన్ని నెలలు ఔరంగజేబు చెరలో అతడున్నా అతడి రాజ్యంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందీ ఎదురవలేదు. ప్రభువు లేని లోటే ఎక్కడా

కనిపించలేదు. శివాజీ అమలుపరిచిన పాలనా వ్యవస్థ కూడా ఎవరినో చూసి అనుకరించింది కాదు. అతడు పెద్దగా చదువుకున్నదీ లేదు; అనేక రాజరికాల పనితీరును అధ్యయనం చేసిందీ లేదు. నూనూగు మీసాల వయసు నుండి నడివయసులో కన్నుమూసేవరకూ జీవితమంతా జీవన్మరణ పోరాటాల్లో, నిరంతరర సంఘర్షణల్లో గడిపిన వాడికి ఇతర విషయాలు ఆలోచించే తీరికే తక్కువ. అయితేనేమి? కష్టపడి సంపాదించిన రాజ్యంలో శివాజీ నెలకొల్పిన వ్యవస్థ అనేక తరాలుగా దేశంలో పాతుకుపోయిన మొగలాయీ పాలనా విధానానికి పూర్తిగా భిన్నమైనది. అవినీతికి, వృథా వ్యయానికి, అనేక తలనెప్పులకు కారణమైన జమీందారీ, జాగీర్దారీ, మున్సబ్‌దారీ వ్యవస్థలను రద్దుపరచి గ్రామంలో పంచాయతీ నుంచి పైస్థాయిన సుబేదారీ వరకూ ప్రభుత్వానికి ప్రజలతో నేరుగా సంబంధముండి, భూమిశిస్తు, పన్నులు అన్నీ ఏకాఎకి ప్రభుత్వానికి కట్టేట్లు, సైన్యానికి, రాజోద్యోగులకు జీతం ఖజానా నుంచే చెల్లించేట్టు శివాజీ చేసిన ఏర్పాటు వల్ల ప్రజలు బాగా సుఖపడ్డారు. అన్ని మతాలవారికీ స్వేచ్ఛగా సమాన హక్కులతో బతికే సావకాశం కల్పిస్తూనే హిందూ మత బహుముఖ వికాసానికి అతడు చూపిన ప్రత్యేక శ్రద్ధ మూలంగా మిగతా దేశమంతటా రెండోరకం పౌరులుగా దారుణ దుర్విచక్షణకు లోనవుతూ నైతిక స్థైర్యం కోల్పోయిన హిందువులకు కొత్త ఉత్తేజాన్నిచ్చాడు. ***Shivaji and His Times*** గ్రంథాన్ని ముగిస్తూ **జాదూనాథ్ సర్కార్** అన్నట్టు శివాజీ నిప్పులాంటి శీలంతో, వాస్తవిక కార్యదక్షతతో, రాజకీయ దూరదృష్టితో జాతి జనులకు గొప్ప ప్రేరణ ఇచ్చాడు. శతాబ్దాల బానిసత్వంలో రకరకాల అణచివేతల తరవాత కూడా హిందూ మహావృక్షం చావలేదని, మళ్లీ చిగురించి రాజాధిరాజులను తయారుచేయగలదని రుజువు చేశాడు. ఆదర్శ ప్రభువు ఎలా ఉండాలో తన నడత ద్వారా చూపించాడు. అందుకే – భారత జాతి గర్వంగా తలెత్తుకోవడానికి ఒక్క శివాజీ చాలు.

మరాఠా మహాయుద్ధం

రాజు మరణించాడు. ఉత్తరాధికారి ఎవరో తెలియదు. గతించిన రాజుకు కొడుకులు లేక కాదు. ఉన్నారు. ఒకరు కాదు ఇద్దరు. పెద్దవాడు పాతికేళ్లవాడు. కాని అలవాట్లు చెడ్డవి. గుణమూ మంచిదికాదు. తండ్రికే ఎదురుతిరిగి ప్రధాన శత్రువు పంచనచేరి, అనేక విధాల తండ్రి నచ్చచెప్పిన మీదట ఈ మధ్యే తిరిగి వచ్చాడు. అప్పటికీ బుద్ధిమారిన సూచన లేనందున ఎందుకైనా మంచిదని దూరాన ఒక కోటలో కట్టుదిట్టమైన కాపలా మధ్య తండ్రే అతణ్ణి దాదాపు బందీగా ఉంచాడు. అతడిని రాజును చెయ్యడం మంత్రిమండలికి ఇష్టంలేదు. ఇక రెండో కొడుకు పదేళ్ల పసివాడు. పట్టం కట్టినా రాజ్యం చెయ్యగల ఈడు కాదు. అయినా అతడి తల్లి చప్పున కదిలి ఇద్దరు మంత్రుల సాయంతో బాలుడిని గద్దెనెక్కించింది. అది కొందరు మంత్రులకు నచ్చలేదు. సైన్యాధికారుల్లోనైతే ఎవరికీ ఇష్టంలేదు. ఒకరొకరుగా జారుకుని పెద్ద రాకుమారుడి వైపు మళ్లారు. ఏది ఏమైనా సవతి కొడుకు అడ్డు తొలగించుకోవాలని పిల్లరాజు తల్లి ఎత్తులు వేసింది.

ఇంతవరకూ చెప్పి – తరవాత ఏమై ఉంటుంది అని అడిగితే ఎవరైనా తడుముకోకుండా చెప్పేస్తారు – 'ఏముంది? అంతఃకలహాల్లోపడి రాజ్యం నాశనమై శత్రువులకు తేలిగ్గా వశమై ఉంటుంది' అని. ఇలాంటి సందర్భాల్లో అనేక ఇతర రాజ్యాల్లో ఏమి జరిగిందో తెలిసిందే కనుక ఇక్కడా అదే జరిగి ఉంటుందన్న అభిప్రాయం సహజమే.

కాని – మనం మాట్లాడుతున్నది శివాజీ అనంతరం మహారాష్ట్ర గురించి. చిత్తశుద్ధితో దృఢదీక్షతో జీవితమంతా కష్టపడి అతడు స్థాపించిన రాజ్యవ్యవస్థ ఇటువంటి సంక్షోభాలకు కుప్పకూలేదికాదు. శివాజీ మరణంతో అనాథ అయిన మరాఠా రాజ్యాన్ని అప్పుడంలా నమిలెయ్యగలనని అహంకరించిన ఔరంగజేబుకు కళ్లు బైర్లుకమ్మేలా అంతర్గత సంక్షోభాల అగ్నిపరీక్షలకు తట్టుకుని 'శివ'శక్తి విజృంభించింది. ఒక నాయకుడు అంతరించగానే మరో నాయకుడు ఆవిర్భవించి, శివాజీ వారసత్వమనే కంచుకాగడాను అందుకుని ముందుకు

తీసుకుపోయాడు. ఒక దశ దాటాక ప్రత్యేకంగా ఒక నాయకుడి అవసరమే లేక స్వాతంత్ర్యపోరాటం ప్రజల అండదండలతో దానికదే ముందుకు సాగింది. అణగారిపోతుందనుకున్న సంఘర్షణశక్తే అజేయంగా నిలిచి శత్రువులకు కొన్ని తరాలసేపు ముచ్చెమటలు పోయించింది. అలా నడిచిన ప్రజా యుద్ధం మధ్యయుగ భారత చరిత్రలో మరవలేని ఘట్టం.

1680 ఏప్రిల్ 4 మధ్యాహ్నం చైత్రపూర్ణిమ నాడు 53వ ఏట ఆకస్మిక అనారోగ్యంతో కన్నుమూసే సమయంలో శివాజీకి పోరాటం మధ్యలో మృత్యువు తనను లాక్కుపోతున్నదన్న చింతలేదు. తన తరవాత రాజ్యం ఏమవుతుందోనన్న బెంగా లేదు. బుద్ధి తెలిసినప్పటి నుంచీ కత్తిపట్టి నిరంతరంగా యుద్ధాలు చేస్తూనే ఉన్నా అంతర్ దృష్టిని ఎప్పుడూ దైవంమీదే నిలిపిన కర్మయోగి అతడు. 1677లో భారీ సైన్యంతో కర్ణాటక మీదికి జైత్రయాత్రకు వెళుతూ, మార్గమధ్యంలో సేనను అనంతపురంలో ఆపి తాను శ్రీశైల సందర్శనానికి వెళ్ళినప్పుడు పారవశ్యంలో తన తలను తానే మల్లికార్జునుడికి బలి ఇచ్చుకొనబోయిన భక్తాగ్రేసరుడతడు. కాబట్టే అవసాన కాలంలో చుట్టూ చేరి రోదిస్తున్న బంధు జనానికి తానే ధైర్యం పలికి, అందరినీ బయటికి పంపి, దైవానికి కడపటి ఆత్మనివేదన చేసుకుని ప్రశాంతంగా నిశ్చింతంగా జీవయాత్ర చాలించాడు.

రాజ్యభవిష్యత్తు గురించి శివాజీ భరోసాకు తగ్గట్టే అతడి మరణానంతరం పెద్ద కుమారుడు శంభాజీలో ఎవరూ ఊహించని పరివర్తన వచ్చింది. అంతకుముందు వ్యసనాలకు బానిసై విలాసాల్లో మునిగితేలి దుందుడుకు చేష్టలతో తండ్రి గుండెలమీద కుంపటి అనిపించుకున్న రాకుమారుడు తండ్రి కాలం చేసినట్లు తెలియగానే రాజకీయ పరిణతితో తెలివిగా అడుగులు వేశాడు. ఎక్కడో దూరాన పన్హాల దుర్గంలో దాదాపు నిర్బంధంలో ఉన్నవాడు రాజప్రముఖులతో రాయబారాలు సాగించి, తన ప్రయోజకత్వం మీద నమ్మకం కోల్పోయినవారికి కూడా విశ్వాసం కలిగించి, దాదాపు ముఖ్యులందరినీ తనవైపు తిప్పుకుని, ముందు పన్హాల కోటను వశపరచుకున్నాడు. దక్షిణ మరాఠా, దక్షిణ కొంకణ్ ప్రాంతాలను తన అధీనంలోకి తెచ్చుకుని రాయగడ్‌కి బయలుదేరేప్పుడు అతడి వెంట 5 వేల సైనికులు ఉండగా రాజధాని చేరేసరికి ఆ సంఖ్య 20 వేలకి పెరిగింది. ఆ ఊపు, ఉద్ధతి చూసేసరికి ప్రతిఘటన అనేదే లేక కోట తలుపులు సాదరంగా తెరుచుకున్నాయి. శంభాజీ నిరాటంకంగా వెళ్ళి జూలై 20న సింహాసనం ఎక్కాడు.

తనకు వ్యతిరేకంగా జరిగిన అంతఃపుర కుట్రను భగ్నం చేశాక కూడా కుట్రదారయిన సవతి తల్లి సోయ్రాబాయిమీద గాని, ఆమె గద్దెనెక్కించిన సవతి తమ్ముడు రాజారామ్ మీదగాని శంభాజీ పగబట్టలేదు. వారి గౌరవ మర్యాదలకు ఎక్కడా లోపం రానియ్యలేదు. సోయ్రాబాయిని గోడ కట్టించి సజీవ సమాధి చేశాడని చరిత్రకారులు కొందరు చెప్పింది తప్పు. శంభాజీ సౌజన్యం చూపినా మనసు మార్చు కోక అతడికి విషప్రయోగం చేయటానికి విఫలయత్నం చేశాక ఆమె ఆత్మహత్య చేసుకుంది.

కోట్ల జనం ఆరాధ్యదైవంలా కొలిచే శివాజీ అంతటివాడితో పోల్చినప్పుడు శంభాజీ ప్రత్యేకత కంటికి ఆనకపోవచ్చు. కాని మరాఠా చరిత్రలో శంభాజీ ఘనత తక్కువది కాదు. అతడు కొంత మంది చరిత్రకారులు చిత్రించినంత చెడ్డవాడు కాదు. కవికులేశ్ అనే ఉత్తరాది బ్రాహ్మణుడిని ముఖ్య సచివుడిగా పెట్టుకుని, మిగతా మరాఠా ముఖ్యులందరినీ దూరం

చేసుకున్నాడని, తనపై కుట్ర చేస్తున్నట్లు అనుమానం కలిగిన వారినల్లా క్రూరంగా శిక్షించాదని, ఎల్లవేళలా మధిర, మగువలతో జల్సాచేసేవాడని జాదూనాథ్ సర్కార్ వంటి విఖ్యాత చరిత్రకారులు ధ్రువీకరించిందే నిజమైతే, అతడి రాజ్యం వారు చెప్పినంతగా అస్తవ్యస్తమై ఉంటే ఔరంగజేబు అవలీలగా మహారాష్ట్రులను కాళ్లతో తొక్కేసేవాడే. శత్రువు బలహీనతలను ఉపయోగించుకుని లాభపడటంలో అతడిని మించినవాడు లేడు. కాని శంభాజీ గద్దెనెక్కిన మరుసటి సంవత్సరమే తనపై తిరగబడ్డ కుమారుడు అక్బర్‌కి ఆశ్రయమిచ్చాడన్న అక్కసుతో అతడిపై కక్షగట్టి స్వయంగా తానే దక్కనుకు తరలివెళ్లి సర్వశక్తులూ ఒడ్డి పోరాడినా అంతటి ఔరంగజేబే శంభాజీని గెలవలేకపోయాడు. 'పాపిష్టి తండ్రికి పుట్టిన పాపిష్టి కుమారుడు' శంభాజీకి శాస్తిచేసి, మరాఠాలు మెడలు విరిచి మూడోనాటికి తిరిగొద్దా మనుకుని 1681 సెప్టెంబరులో దక్కను మీదికి దండెత్తి వెళ్లిన ఔరంగజేబు పావు శతాబ్దానికిపైగా తాను గెలవలేని యుద్ధంలో అక్కడే కూరుకుపోతానని, చివరికి తన జీవితం కూడా నిరాశా నిస్పృహల నడుమ అక్కడే కడతేరిపోతుందని ఊహించి ఉండడు. చిన్నతనంలో మానసిక దౌర్బల్యం వల్ల కొన్నాళ్లు మొగలుల పంచనచేరి ఘోర తప్పిదం చేసినా 'ఛత్రపతి' అయిన తరవాత శంభాజీ మళ్లీ అటువంటి తప్పును జన్మలో చేయలేదు. తండ్రివలెనే అవక్ర విక్రమంతో సేనలను నడిపించాడు కాబట్టే నాలుగేళ్లు ఎన్నివిధాల యత్నించినా శంభాజీని మొగలు పాదుషా ఓడించలేకపోయాడు. చేతనైన అన్ని యత్నాలూ చేసి అన్నీ విఫలమయ్యాకే నేరుగా శంభాజీని పరాభవించడం తనవల్ల కాదని గ్రహించి, మరాఠాల నుంచి రక్షణ పొందుతూ, అందుకు ప్రతిఫలంగా వారికి పెద్ద మొత్తం చెల్లించుకుంటున్న బీజాపూర్, గోల్కొండ రాజ్యాలను పట్టుకుని శంభాజీ ఆర్థిక వనరులను దెబ్బతీయటానికి ఔరంగజేబు ఉపక్రమించాడు. కొండలాంటి మొగలు సామ్రాజ్యం ధాటికి నిలవలేని రెండు దక్కను రాజ్యాలను తేలిగ్గానే ఆక్రమించాడు. అదీ శంభాజీకే ఉపకరించి అతణ్ణి మరింత బలశాలిని చేసింది. ఆ రెండు రాజ్యాల సైనికులూ ఉపాధి కోసం మరాఠా శ్రేణుల్లో కలిసి వారి సైనిక శక్తిని ఇంకా పెంచారు. దక్కనులో మరాఠాలకు పోటీ శక్తిగా నిలిచిన రెండు రాజ్యాలనూ కూల్చివేయడం చాలా తప్పయిపోయిందని ఔరంగజేబు బతికినంతకాలం చింతిస్తూనే ఉన్నాడు.

రాజ్యమేలిన తొమ్మిదేళ్లూ శంభాజీ విరామమెరుగక నాలుగువైపులా నాలుగు శక్తులతో హోరాహోరీగా పోరాడాడు. ఒక వంక మొగలులు, రెండోవైపు పోర్చుగీసువారు, మూడోవైపు ఆంగ్లేయులు. నాలుగో దిశగా జంజీరా సిద్దీలు. ఏకకాలంలో నలుగురు శత్రువులతో మనుగడ కోసం పోరాడుతూండగానే ఐదోవైపు సొంత శిబిరంలోనే నమ్మక ద్రోహులైన పంచమాంగ దళం బెడద. యుద్ధాల్లో ఎంత ప్రతాపం చూపినా చివరికి ఈ అంతశ్శత్రువే శంభాజీకి శాపమైంది. 1689లో సంగమేశ్వరం దగ్గర అతడు మొగలాయీల చేతికి చిక్కింది చాలామంది చరిత్రకారులు ఆరోపించినట్టు తాగి తందనాలాడుతూ కేళీ విలాసాల్లో మునిగి తేలుతూండగా కాదు. గణోజీ షిర్కే అనే పేరుగల సొంత బావే ద్రోహిగా మారి శంభాజీ ఆనుపానులను మొగల్ సర్దారు ముకరాబ్‌ఖాన్‌కు వెల్లడించడమే గాక స్వయంగా తానే దారి చూపుతూ కొండల మధ్య దుర్భేద్యమైన సంగమేశ్వరానికి శత్రువులను తోడ్కొని వెళ్ళాడు. ఐదు లక్షల సైనికులతో తొమ్మిదేళ్లు తంటాలుపడ్డా ఔరంగజేబు సాధించలేని కార్యం కేవలం ఒక నమ్మకద్రోహి వల్ల అవలీలగా సాధ్యమైంది.

శంభాజీ పట్టుబడ్డాడని తెలిసి మొగలు శిబిరమంతటా పండుగ జరుపుకున్నారు. శంభాజీని, అతడి మంత్రి కవికులేశుణ్ణి బఫూన్ వేషాలు వేయించి, టోపీకి గంటలు కట్టి, గేలిచేస్తూ ఒంటెలమీద ఊరేగించి బహదూర్‌గడ్‌లో ప్రత్యేకంగా ఇందుకోసమే కొలువుదీరిన ఔరంగజేబు దర్బారుకు తీసుకువెళ్లారు. సంపదనంతా ఎక్కడ దాచిందీ. మొగలు శిబిరంలో ఎవరెవరు తనకు సమాచారం చేరవేస్తున్నదీ చెప్పమనీ శంభాజీని పాదుషా నిర్బంధించాడు. ప్రాణం నిలవాలంటే ఇస్లాం మతం పుచ్చుకోవాలనీ కండిషను పెట్టాడు. ఎంతగా బెదిరించినా, ఎన్ని రోజులు ఎన్ని విధాల వేధించినా శంభాజీ బెసగలేదు. చిత్రవధ చేస్తారని తెలిసీ భయపడకుండా ఔరంగజేబు తప్పుడు పనులను నిండు సభలో చడామడా తిట్టాడు. తరవాత ఏమైంది?

"He (Sambhuji) was ordered by the Emperor to embrace Islam. he refused and was made to run the gauntlet of the whole Imperial army. Tattered and bleeding he was brought before the Emperor and repeated his refusal. His tongue was torn out and again the question was put. he called for writing material and wrote "Not even if the emperor bribed me with his daughter." So then he was put to death by torture."

(ఇస్లాంను స్వీకరించమని చక్రవర్తి ఆజ్ఞాపించాడు. శంభూజీ తిరస్కరించాడు. రెండు వరుసలుగా నిలబెట్టిన సైనికుల మధ్య నుంచి పరుగెత్తించి మొత్తం సైన్యం చేత అతణ్ణి చితకబాదించారు. దెబ్బలకు బట్టలన్నీ పేలికలై, ఒళ్లంతా రక్తం కారుతున్న స్థితిలో చక్రవర్తి ముందు నిలబెట్టినా మళ్ళీ తిరస్కరించాడు. అతడి నాలుక కోసేసి మళ్లీ అడిగారు. రాత సామగ్రిని తెప్పించుకుని 'పాదుషా తన కూతుర్నే నాకు లంచంగా పెట్టినా సరే ఒప్పుకోను' అని రాశాడు. దాంతో అతణ్ణి చిత్రహింసలు పెట్టి చంపేశారు.)

ఆ చిత్రహింస ఎలాంటిది?

"That very night his eyes were blinded and next day the tongue of Kavikalash was cut out. The Muhammadan theologians pronounced a decree that Shambhuji should be put to death on account of his having" slain, captured, dishonoured Muslims and plundered the cities of Islam".. they were put to a cruel and painful death on 11th march, their limbs being hacked off one by one and their flesh thrown to the dogs. Their severed heads were stuffed with straw and exhibited in all the chief cities of the Deccan to the accompaniment of drum and trumpet."

[***History of Aurangzeb* - J.N.Sarkar,** *Vol.IV p. 480]*

(ఆ రాత్రే అతడి కళ్లు పొడిచారు. మర్నాడు కవికలశ్ నాలుక కోశారు. "ముస్లిములను చంపి, బంధించి, అగౌరవపరచినందుకు, ఇస్లాం నగరాలను

కొల్లగొట్టినందుకు" శంభాజీని చంపాలని మహమ్మదీయ న్యాయవేత్తలు డిక్రీ ప్రకటించారు... మార్చి 11న శరీరాంగాలను ఒకటొకటిగా నరికి ఆ మాంసాన్ని కుక్కలకు వేసి వారిని క్రూరంగా బాధపెట్టి చంపారు. ఖండించిన వారి శిరస్సుల్లో గడ్డికూరి డోలు, బాకాలు వాయిస్తూ దక్కన్‌లోని ముఖ్యపట్టణాలన్నిటా ప్రదర్శించారు.)

23 ఏళ్ల కిందట ఆగ్రా దర్బారులో ఔరంగజేబు ముందు శివాజీ చూపిన తెగువ కంటే చిత్రహింసలు భరిస్తూ శంభాజీ కనపరచిన ఆత్మశక్తి గొప్పది. కళ్లుపీకి, నాలుక కోసి, శరీరాన్ని ఖండఖండాలుగా నరికి మాంసాన్ని కుక్కలకు వేస్తున్నా బెంబేలెత్తక మతం మార్పిడికంటే మరణమే మేలని తలచి మృత్యువును కౌగిలించుకున్న మేరు సమానధీరుడిని మానసిక దుర్బలుడని, వ్యసనపరుడని, వదరుబోతని –ఖాఫీఖాన్ వంటి విరోధులేగాక జాదూనాథ్ సర్కార్ వంటి విఖ్యాత చరిత్రకారులు సైతం కించపరచడం జాతి దురదృష్టం.

శంభాజీ ఆత్మబలిదానం సంగతి తెలియగానే మహారాష్ట్రుల గుండెలు మండాయి. బతికి ఉన్నప్పటికంటే అమరుడయ్యాకే శంభాజీ వెయ్యింతల శక్తితో తన జాతిని ఉత్తేజితులను చేశాడు. 'ఔరంగజేబ్' గ్రంథంలో మునిలాల్ అన్నట్టు ప్రతి మహారాష్ట్రుడు ఒక సైనికుడయ్యాడు. ప్రతి మరాఠా గృహం ఒక కోటగా మారింది. రాజు మరణించాక మునుపటివలె సింహాసనం కోసం ఎవరూ కొట్లాడలేదు. శంభాజీ కుమారుడు సాహు ఏడేళ్ల కుర్రాడు. గద్దెనెక్కే హక్కు కుమారుడికి ఉన్నా స్వచ్ఛందంగా దాన్ని వదిలేసుకుని శంభాజీ భార్య ఏసూబాయి నాటికి యుక్తవయస్కుడైన మరిది రాజారామ్‌కు పట్టం గట్టించింది. రాజ్యప్రముఖులందరూ ఒకేచోట ఉంటే మొగలులు దాడిచేసే పక్షంలో అందరూ బందీలై రాజ్యానికి నాథుడు లేకుండా పోతుంది కనుక తలా ఒక కోటలో నివసించే ఏర్పాటు ఆమే చేసింది. దాని ప్రకారమే కొత్తరాజు రాజారామ్ మొగలు సేనలు రాయగడ్ మీద విరుచుకుపడేలోపే సన్యాసి వేషంలో కొద్ది పరివారంతో శత్రువుల కళ్లుకప్పి తూర్పుతీరంలో విసిరేసినట్టున్న జింజీ కోటకు మకాం మార్చాడు. అది జరిగిన కొద్దిరోజులకు రాయగడ్‌మీద మొగలులు దాడిచేసి శంభాజీ భార్యను, మిగతా అంతఃపుర స్త్రీలను, బాల రాకుమారుడిని బందీలుగా పట్టుకున్నారు. తర్వాత 18 ఏళ్లకి ఔరంగజేబ్ మరణించాకగాని వారికి చెర వదలలేదు.

శంభాజీని చిత్రవధ చేసి, రాయ్‌గఢ్‌ను పట్టుకోవటంతో మరాఠాల వెన్ను విరిచేసినట్లేనని, ఇక నిశ్చింతగా తాను ఢిల్లీ వెళ్లిపోవచ్చునని ఆశించిన ఔరంగజేబుకు మళ్లీ విధి వక్రీకరించింది. శంభాజీని హతమార్చిన పదహారేళ్ల తరవాత కూడా గెలిచే ఆశ వమ్మయి అతడు నీడలతో యుద్ధం సాగిస్తూనే ఉన్నాడు. జింజీకోటను పట్టుకుని రాజారాంను బంధించాలని మొగల్ సర్దారు జుల్ఫికర్‌ఖాన్ ఎన్నేళ్ళు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఏదీ ఫలించ లేదు. ఎనిమిదేళ్ళ దీర్ఘపోరాటం తరవాత ఎట్టకేలకు జింజీ కోటను పట్టుకున్నా రాజారాం చిక్కలేదు. అతడు మెరుపులా మాయమై 1698లో సతారా కోటను కేంద్రస్థానం చేసుకున్నాడు. అర్భకుడు, అసమర్థుడు అనుకున్న రాజారామ్ మరాఠా బావుటాను అందిపుచ్చుకుని అటు తూర్పు తీరాన మొగలులను తారెత్తించగా ప్రధానమైన మరాఠా రాజ్యంలో శివాజీ మలచిన సమర్థ నాయకశ్రేణి పోరాటాన్ని అద్భుతంగా సాగించింది. శివాజీవలె, శంభాజీవలె రాజారామ్ కదనరంగంలో ముందుండి పరాక్రమమైతే చూపించలేదుగాని – సమర్థులైనవారికి సేనలను

నడిపించే బాధ్యత అప్పగించి వీరవిహారానికి పరిపూర్ణ స్వేచ్ఛనిచ్చాడు. ఈ సందర్భంలో ముఖ్యంగా చెప్పుకోవలసింది మొగలుల గుండెల్లో నిద్రపోయిన సేనాపతి శాంతాజీ ఘోర్పడే, ధనాజీ జాదవ్‌ల భీకర ప్రతాపాన్ని. శివాజీ ఒద్దికలో తర్ఫీదైన శాంతాజీ, శంభాజీకి బాసటగా నిలిచి అతడి మరణానంతరం సేనాపతి బాధ్యత స్వీకరించి, మొగలు సేనలను మృత్యువులా వెంటాడాడు.

మహారాష్ట్రుల బలం కోటల్లో ఉన్నదన్న అభిప్రాయంతో భారీ సైన్యాన్ని మోహరించి, విశేష వ్యయప్రయాసలతో అనేక నెలలు కష్టపడి వందల ప్రాణాలు బలిపెట్టి ఒక్కో కోటను ఔరంగజేబు పట్టుకున్నా ఆ సంతోషం మూణ్ణాళ్లు కూడా మిగలకుండా అతడి సేనలు వెనక్కి మరలిన వెంటనే మరాఠా సేనలు విరుచుకుపడి స్థానిక మొగలు సర్దార్లను నయానో భయానో లోబరచుకునో, భీకరంగా పోరాడో మళ్లీ ఒకటొకటిగా వాటిని వశపరచుకునేవి. ఔరంగజేబుకు కాళ్ల శని, డబ్బు శని మాత్రమే మిగిలి నానాటికీ నిస్సత్తువ పెరిగేది. శత్రువు ఫలానా రాజ్యంలో ఫలానా కోటలోనో ఫలానా చోటో ఉంటాడని తెలిస్తే అతడు ఎంత బలశాలి అయినా లక్షల సైన్యంతో మిడతల దండులా మీదపడి మన్నుకరిపించటంలో ఔరంగజేబు ఆరితేరిన ఘటం. కాని – తన సుదీర్ఘ జీవితంలో అతడు తలపడిన విరోధులు ఒక ఎత్తు, చరమ దశలో అతడి భరతం పట్టిన మరాఠాలది ఇంకో ఎత్తు. వారు ఎక్కడ పొంచి ఉంటారో తెలియదు. ఎప్పుడు మీద పడతారో తెలియదు. కొండలు కోనలు వారికి కొట్టిన పిండి. ప్రతి చెట్టూ పుట్టా వారికి క్షుణ్ణంగా తెలుసు. ఎత్తయిన కొండల్లో, కోసురాళ్ల ఇరుకుదారుల్లో వారి గుర్రాలు మెరుపు తీగల్లా పరుగెత్తగలవు. వాటి వెంటపడేసరికి మొగలు బలగాల ఒళ్ళు హూనమై తల ప్రాణం తోకకొచ్చేది. ఇక గెరిల్లా యుద్ధతంత్రంలో మహాప్రవీణుడైన మరాఠాల సేనాపతి శాంతాజీ పేరు చెబితే ఎంతటి మొనగాడయినా గడగడ వణికేవాడు. ఆ భయవిహ్వలత ఏ స్థాయికి చేరిందో ఔరంగజేబు సమకాలికుడైన పర్షియన్ చరిత్రకారుడు ఖాఫీఖాన్ మాటల్లో ఆలకించండి:

"Everyone who encountered Santa was either killed or wounded and made prisoner; or. if anyone did escape, it was with his mere life, with the loss of his army and baggage... wherever the accursed dog went and threatened an attack, there was no Imperial amir bold enough to resist him.

***[Khafikhan,* Elliot & Dowson,** *Vol.VII p.347]*

(శాంతాను ఎదుర్కొన్న ప్రతివాడూ చావనైనా చచ్చేవాడు – లేదా గాయపడి బందీగా చిక్కేవాడు. ఒకవేళ ఎవడైనా తప్పించుకున్నా అది వొట్టి ప్రాణంతోనే: తన సైన్యాన్ని; సామాన్లను నష్టపోయే!... ఈ నికృష్టపు కుక్క ఎక్కడికి వెళ్లి దాడికి దిగబోయినా, చక్రవర్తి కొలువులోని ఏ అమీర్‌కూ అతడిని నిరోధించేందుకు ధైర్యం చాలేదికాదు.)

His greatest monument is the abject fear he inspired in all ranks of the Mughal army... when the news arrived that Santa had come within 16 or 18 miles of him. Firuz Jang (Aurangzib's highest general) lost colour in terror, and making a false an-

nouncement that he would ride out to oppose him.... fled towards Bijapur by a roundabout route!

[History of Aurangazeb; **Sarkar** *Vol. V. p.127-128]*

(మొగల్ సైన్యం అన్ని శ్రేణుల్లోనూ అతడు రేకెత్తించిన భయవిహ్వలతే అతడికి గొప్ప స్మృతి చిహ్నం! శాంతా, తనకు 16, 18 మైళ్ల చేరువలోకి వచ్చాడన్న వార్త రాగానే ఔరంగజేబ్‌కు అత్యున్నత సైన్యాధికారి అయిన ఫిరుజ్‌జంగ్ మొహం భయంతో మాడిపోయింది. శాంతాను ఎదుర్కోవడానికి వెళుతున్నట్టు అబద్ధపు ప్రకటన చేసి చుట్టు దారిలో అతడు బీజాపూర్‌కు పరారయ్యాడు.)

కొమ్ములు తిరిగిన మొగల్ సేనానులకే శాంతా పేరు చెబితే లారెత్తేటప్పుడు మామూలు మొగలు సైనికులు ఎప్పుడైనా గుర్రాలు నీళ్లు తాగక మొరాయిస్తే నీటిలో వాటికి శాంతాజీ ఘోర్పడే, ధనాజీ జాదవ్‌ల ప్రతిబింబాలు కనిపించాయేమోనని హడలిపోయేవారంటే ఆశ్చర్యమెందుకు? ఇంతగా అరవీర భయంకరుడైన శాంతాజీలో ఒక్కటే లోపం. అతడి నోరు మహాచెడ్డది. కఠార క్రమశిక్షణ విధించి, ఏ మాత్రం తప్పుచేసినా క్రూరంగా శిక్షించి, ఎంతటివారినైనా చులకనచేసి అతడు ఎందరికో కంటగింపు అయ్యాడు. ఒక దశలో మహారాజు రాజారాంనే నా దయవల్లే నీ అధికారం నిలిచిందని మాట మీరాడు. దాంతో సహజంగానే రాజుకు ఒళ్లు మండి అతని పదవి ఊడబెరికి అతడి స్థానంలో ధనాజీని సేనాపతిని చేశాడు. కొన్నాళ్ళకు వ్యక్తిగత కక్షలవల్ల శాంతాజీని సన్నిహితులే హత్యచేశారు. ఈ అంతర్గత సంక్షోభం ప్రభావమేదీ మహారాష్ట్రుల పోరాటపటిమపై పడలేదు. దీని నుంచి మొగలాయీలు లాభపడలేకపోయారు.

సంవత్సరాలు గడుస్తూ దక్కన్ ఊబిలో అంతకంతకూ కూరుకుపోయే కొద్దీ మొగలులు బేజారవగా మరాఠాల నైతిక స్థైర్యం అంతకంతకూ పెరగసాగింది. మరాఠాలపై 'పవిత్ర యుద్ధం' ప్రకటించి వారి వెంటపడిన ఔరంగజేబే... హిందువులలో మత చైతన్యం, స్వాతంత్ర్య దీక్ష, సంఘీభావాలు పెల్లుబికి అతడిపైనే ఎదురు యుద్ధం సాగించిన దరిమిలా వరస పరాజయాలతో, నిరర్థక విజయాలతో కళవళపడ్డాడు. వేటగాడే వేటాడబడ్డ విచిత్రస్థితికి 1699 డిసెంబరు 22న రాసిన ఒక లేఖలో రాజారాం చెప్పిన ఈ మాటలు ప్రబల నిదర్శనం.

"మేము చక్రవర్తిపైకి మా సైన్యాలను పూర్తిస్థాయిలో ప్రయోగించాము. అతడి శిబిరంమీద దాడిచేసి చక్రవర్తి కుమార్తెనే పట్టి వేశాము.. శత్రువు ధైర్యం కోల్పోయాడు. శక్తిశాలి అయిన ఈ చక్రవర్తిని మేము బొత్తిగా ఖాతరు చెయ్యము. దేవుడు మేలు చేస్తే త్వరలోనే అతణ్ణి పూర్తిగా పరాభవిస్తాము."

(***The History & Culture of Indian People****, Vol. VII p.369-70)*

రాజారాం పలికింది వట్టి ప్రగల్భాలు కాదని అనంతర పరిణామాలు రుజువు చేశాయి. దురదృష్టవశాత్తూ వాటిని తిలకించి సంతోషించేందుకు రాజారామే బతికిలేడు. 1700 మార్చి 2న తన ముప్ఫయ్యో ఏట రాజారామ్ జబ్బుపడి మరణించాడు. అతడి తరవాత రాజ్యభారం సొంతంగా వహించగల వారసుడెవరూ లేకపోయినా సంక్షోభం రాలేదు. రాజారాం భార్య తారాబాయి తన నాలుగేళ్ల కుమారుడు శివాజీకి పట్టంగట్టి అతడి పేర తాను రాజ్యంచేసి రాజకీయ శూన్యాన్ని అద్భుతంగా పూరించింది. తారాబాయి సమర్థంగా

పరిపాలించి, సైనిక చర్యలనూ చక్కగా సమన్వయపరిచి, విజయాల పరంపరతో మొత్తం మరాఠా జాతిలో తన భర్తకంటే ఎక్కువగా ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని కలిగించింది. ఆమె తెలివి, బుద్ధికుశలత కలిగి, పౌర, సైనిక వ్యవహారాలపై పరిపూర్ణ జ్ఞానంతో ప్రఖ్యాతి చెందింది అని ఖాఫీఖాన్ లాంటి ముస్లిం చరిత్రకారులు సైతం మెచ్చుకున్నారు. (*E & D Vol.VII p.367*). ఒక మహానాయకుడెవరో ఉంటేగానీ పనులు నడవని దశను ఏనాడో దాటి, పాలక స్థానంలో ఎవరున్నారు ఎవరు లేరన్న దానితో నిమిత్తం లేకుండా సంఘర్షణ క్రమేణా 'ప్రజాయుద్ధం'గా మారాక మరాఠాలకు వెనుదిరిగి చూసుకోవలసిన అవసరమే లేకపోయింది. పేరుకు ఔరంగజేబు చక్రవర్తి అయినా దక్కన్‌లో మహారాష్ట్రుల ఆధిపత్యమే కొనసాగింది. దొంగదాడులు మానేసి క్రమేపీ పెద్ద సైన్యంతో బాహాటంగానే మొగలులను ఢీకొంటూ, మొగలు పరగణాల నుంచి మొగలు అధికారుల నుంచి పన్నులు వసూలు చేస్తూ, మొగలాయీల వస్తు వాహనాలను యథేచ్ఛగా దోచుకుంటూ మరాఠాలు ఔరంగజేబుకు కంటికి కునుకు లేకుండా చేశారు. చక్రవర్తి సొంత శిబిరంలోనే ధాన్యం మార్కెట్టుని వారు కొల్లగొట్టినా అడ్డుకున్న దిక్కులేకపోయింది. జాదూనాథ్ సర్కార్ మాటల్లో చెప్పాలంటే

> "After 1703 the Marathas were masters of the situation all over the Deccan and even in parts of Northern India. The Mughal officers were helpless and reduced to the defensive; they only sought to escape from the enemy by flight or by the payment of blackmail without venturing to resist them".
> **[*History of Aurangzeb, Vol. V, p.242*]**
>
> *(1703 తరవాత దక్కన్ అంతటా, ఉత్తర భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మరాఠాలదే పెత్తనమైంది. మొగలు అధికారులు నిస్సహాయులై ఆత్మరక్షణలో పడ్డారు. ప్రతిఘటించే ప్రయత్నమే చేయకుండా పరారయ్యో, బ్లాక్‌మెయిల్ చెల్లించుకునో శత్రువు నుంచి తప్పించుకోవాలనే వారు తహతహలాడారు.)*

మొగలు సేనలంటే ఏ మాత్రం భయం లేకుండా శతఘ్నులతో, తుపాకులతో, విల్లంబులతో, ఏనుగులు, ఒంటెలతో వేల సంఖ్యలో దర్జాగా దండెత్తుతూ తామే చక్రవర్తులమైనట్లు మరాఠాలు వ్యవహరిస్తున్నారని విదేశీ యాత్రికుడు **Manucci** కూడా రాశాడు.

మరాఠా బిట్టెలుకలను ఎడమచేత్తో మట్టుపెట్టి దేశం మొత్తాన్నీ బలవంతంగా ఇస్లామీకరించే సంకల్పాన్ని అవలీలగా సాధించగలననుకుని వచ్చిన ఔరంగజేబు మరాఠా 'ప్రజాయుద్ధం' ధాటికి మతిపోయింది. 1681లో చేతికి అందినట్టే కనిపించిన విజయం పాతికేళ్ళ తరవాత కూడా ఎండమావిలా మిగిలి తన నవనాడులనూ కుంగదీస్తున్నా... సైనిక అవసరాలకు ఎంత డబ్బూ చాలక ఖజానా కొల్లబోయి, సైనికులకు నెలలతరబడి జీతాలు చెల్లించలేని దౌర్భాగ్యస్థితి దాపురించినా... పట్టువిడువక అలాగే పోరాడి పోరాడి ఔరంగజేబు చివరికి తన 90వ ఏట పరాభవ భారంతో, తీవ్ర నిరాశా నిస్పృహలతో 1707 మార్చి 3న అహ్మద్‌నగర్‌లో నిరర్థక జీవయాత్రను చాలించాడు.

మరాఠాల వీరగాథ చెప్పాలంటే ఇంకా చాలా ఉంది. శివాజీ విజయం నుంచి ఔరంగజేబు మరణం వరకూ దక్కన్‌లో నడిచిన నిరంతర పోరాటాలను, వాటిలో మరాఠాలు సాధించిన

అద్భుత విజయాలను గమనిస్తే ఒకందుకు మాత్రం విచారం కలుగుతుంది. అవసాన దశలో సర్వశక్తులూ ఉడిగిన ఔరంగజేబును మరాఠాలు తలచుకుంటే సునాయాసంగా ఓడించి, కనీసం దక్కన్‌లో మొగల్ సామ్రాజ్యాన్ని బాహాటంగా హస్తగతం చేసుకోగలిగేవారు. ఉత్తరాది నుంచి చక్రవర్తికి చేరే సంపదను, సరుకులను దోచుకుని, మొగలు అధికారుల గోళ్లూడగొట్టి మామూళ్లు వసూలు చేసి తృప్తిపడి, తమకు లాభసాటిగా చక్రవర్తి ఇం పదికాలాలు ఇలాగే చల్లగా ఉండాలని కోరుకున్నారేగానీ గట్టిగా ఒక పట్టుపడితే, మొత్తం మొగలు సామ్రాజ్యానికి తామే చక్రవర్తులు కాగలరని గ్రహించలేకపోయాడు. ***Great Moghals*** గ్రంథంలో ***Abraham Eraly*** అన్నట్లు మరణావస్థలోని సింహం మాంసాన్ని కొంచెం కొంచెం కొరికారే తప్ప అరణ్యానికి తామే రాజులు కావచ్చుని మరాఠాలు ఆలోచించలేదు. 'ఈ చక్రవర్తిని తేలిగ్గా పట్టుకుని బంధించగల సమయం వచ్చింది. మన దేవాలయాలను తిరిగి కట్టుకొని మన మతాన్ని రక్షించుకోగలం. మీకేమీ పట్టనట్టు మీరంతా మిన్నకున్నా రేమిటి?' అని 1681లోనే జయసింగ్ కుమారుడైన రామ్‌సింగ్‌కు ఉత్తరం రాసిన శంభాజీ తన వరకూ తాను ఆ దిశలో చొరవ తీసుకుని కదిలింది లేదు. అటు ఉత్తరాది నుంచీ ఎంతకీ కదలికలేదు. లక్షల సైన్యంతో సపరివారంగా దక్కనుకు వెళ్లిన ఔరంగజేబు పావు శతాబ్దంపైగా అక్కడే కూరుకుపోయి, డేరాల బతుకులో నానా అగచాట్లు పడి, అంతకంతకూ బలహీనుడై ప్రాభవమంతా కోల్పోయిన దశలో జాతీయ శక్తులన్నీ ఏకమై ఉంటే మొగలుల పీడ నుంచి దేశాన్ని సునాయాసంగా విముక్తి చేయగలిగేవి. రాజస్థాన్‌లో రాజపుత్రులు, పంజాబులో సిక్కులు, ఉత్తరాదిన జాట్లు ఎవరి పరిధిలో వారు గిరిగీసుకుని మొగలులతో పోరాడి పరిమిత విజయాలతో తృప్తి పడకుండా... అందరూ ఏకమై మరాఠాలతో సమన్వయం చేసుకుంటూ ఉమ్మడి వ్యూహంతో కదిలినట్టయితే ఢిల్లీ కోటను అవలీలగా పట్టుకోగలిగేవారు. జాతీయ వాదులందరూ అప్పుడే కలిసి మొగలు సామ్రాజ్యాన్ని అంతమొందించి ఉంటే చరిత్రగతి ఇంకో విధంగా ఉండేది. శతాబ్దాల విదేశీ దాస్యం జాతికి తప్పేది. సకాలంలో సరైన వ్యూహంతో దృఢంగా కదిలే చేవ నాయకులనబడే వారికి లోపించడమే ఆది నుంచీ ఈ దేశానికి శాపం.

మహామంత్రి మాదన్న

అక్కన్న మాదన్నలు అన్నదమ్ములనుకుంటారు గానీ నిజానికి వారు ఏమీకారు. గోల్కొండలో మాదన్న మంత్రిగా ఉండగా - కవి పండితులతో, బంధుజనంతో నిత్యం కళకళలాడే అతడి లోగిలికి అక్కన్న రోజూ వెళ్ళి ఖోంచేసి, వంట వారిమీద, పనివారి మీద పెత్తనం చేసేవాడు. యజమానుల తాలూకువాడే కాబోలని సేవకులు అనుకునేవారు. భార్య తరఫు బంధువేమోనని మాదన్న భావించాడు. ఆయనకు చుట్టమేమోనని ఇంటావిడ అనుకుంది. ఇలా కొన్నాళ్లు గడిచాక ఓ రోజు మాదన్నగారు *'అయ్యా, తమరెవరు? మీకూ మాకూ చుట్టరికమేమిటి?'* అని అడిగితే అక్కన్న నవ్వి 'నేను పెద్దమ్మ (దరిద్ర దేవత జ్యేష్ఠాదేవి) కొడుకుని, నువ్వు చిన్నమ్మ (లక్ష్మీదేవి) కొడుకువి. అక్కాచెల్లెళ్ల పిల్లలం కాబట్టి మనది అన్నదమ్ముల సంబంధం' అన్నాడు. ఆ చమత్కారం నచ్చి మాదన్న అతణ్ణి అన్నగా స్వీకరించాడు. ఆపై సేనాని పదవిని ఇప్పించాడు.

ఇది 85 ఏళ్ల కిందటి 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము'లో విఖ్యాత చరిత్రకారుడు **కొమర్రాజు లక్ష్మణరావు**గారు ఉటంకించిన కథ. 'ఎంతవరకు నిజమో తెలియదు' అని కొమర్రాజు 'షరా' పెట్టినా, అంత పెద్దాయన అంత గొప్ప విజ్ఞాన సర్వస్వంలో రాశాడు కాబట్టి నిజమే అయి ఉంటుందని అమాయకులు అనుకోవడం సహజం.

మరో మహాపండితుడు **వేదం వెంకటరాయ శాస్త్రి**గారు తన **అక్కన్న మాదన్నల చరిత్ర**ను ఇంకో గమ్మత్తు కథతో మొదలెట్టారు. స్వయానా అన్నదమ్ములైన అక్కన్న మాదన్నలు ఇరవయ్యేళ్ల ప్రాయంలో గోలకొండ సేనాపతి సయ్యద్ ముజాఫర్ కొలువులో లెక్కలు రాసేందుకు చేరి ఓ రోజు తానాషా వేయించిన దండోరా విన్నారట. ఔరంగజేబు చక్రవర్తి నుంచి తమకు అందిన ఖాళీ తెల్లకాగితాన్ని చదివి పెట్టిన వారికి గొప్ప సన్మానం చేస్తామని దాని సారాంశం. ఈ సోదరులు ఉల్లిరసం సిరాతో రాసిన అక్షరాలను నీళ్లు చల్లి చూపించి, మళ్లీ అదే రసాయన ప్రక్రియతో కనపడకుండా జవాబు కూడా రాసి తానాషాను మెప్పించారట.

అతడి ప్రాపకంతో క్రమేణా మంత్రి, సేనాపతుల స్థాయికి ఎదిగారట.

ఇది కూడా కల్తీలేని కట్టుకథ. తానాషా గద్దెనెక్కిందే 1672లో. అప్పటికి 20 ఏళ్ల వయసు వారయితే 1686లో హత్యకావించబడే నాటికి అక్కన్న మాదన్నలు సుమారుగా 35 ఏళ్ల ప్రాయంలో ఉండాలి. కాని ఆ కాలంలో చిత్రించిన చాలా బొమ్మల్లో మాదన్నలో నడివయసు దాటిన మొహమే కనపడుతుంది.

సుప్రసిద్ధ చారిత్రక రచనలు చేసిన మహామహులే ఇలా తలా తోకా లేని విషయా లకు విలువ ఇచ్చినప్పుడు మహాపురుషుడైన మాదన్న మంత్రి గొప్పతనం ఈ కాలపు వారికి బొత్తిగా తెలియకపోవడంలో వింతేముంది?

మధ్యయుగంలోని అనేక మంత్రులు, మారాజుల్లా కవి పండితుల చేత తమ కీర్తిని కొనియాడుతూ గ్రంథాలను రాయించుకోలేదు కనుక, ప్రసిద్ధ కావ్యకన్యకల అంకితాలు పొందలేదు కనుక.... అధికారం, ఐశ్వర్యం ఎంత ఉన్నా నిరాడంబరంగా, నిస్వార్థంగా బతికారు కనుక అక్కన్న మాదన్నలకు పబ్లిసిటీ లేకపోయింది. అసలు వారు ఆంధ్రులా మహారాష్ట్రులా అన్నదే ఈ కాలంలో చాలా మందికి డౌటు. చారిత్రక రచనల కవిలికట్టల్లో విదేశీయులు, మహమ్మదీయులు తెలిసీ తెలియక రాసిన అసత్యాలను, స్థానిక ఐతిహ్యాల అతిశయోక్తులను జల్లెడ పట్టి చారిత్రక సాక్ష్యాధారాలను పరిశీలిస్తే అక్కన్న మాదన్నలు ఒకే తల్లిబిడ్డలని, వారి తండ్రి హనుమకొండలో సాధారణ రెవిన్యూ ఉద్యోగి అని తేలుతుంది. సుమారు 1645 సంవత్సరంలో 20-25 ఏళ్ల వయస్సులో బతుకుతెరువు కోసం గోలకొండ వచ్చి అప్పటి 'మీర్‌జుమ్లా' మీర్జా మహమ్మద్ సయీద్ కొలువులో అన్నదమ్ములు గుమస్తాలుగా చేరారు. పాతికేళ్లలో క్రమేణా పైకి వెళ్లి, అధికారుల మెప్పుపొంది సేనాధిపతి సయ్యద్ ముజాఫర్‌కు మాదన్న పేష్కార్ (కార్యదర్శి) కాగలిగాడు. సుల్తాన్ అబ్దుల్లా మరణానంతరం జరిగిన వారసత్వ యుద్ధంలో ముజాఫర్, మాదన్నలు అబుల్ హసన్ పక్షం వహించారు. ఆ కృతజ్ఞతతో 1672లో అతడు గద్దెనెక్కాక సయ్యద్ ముజాఫర్‌ను మీర్‌జుమ్లా (ప్రధానమంత్రి)గా నియమించాడు. ముజాఫర్ కళ్ళు నెత్తికెక్కి తననే ధిక్కరించసాగాక సుల్తాన్‌కు ఒళ్లు మండి ముజాఫర్‌ను ఖైదులో పెట్టి, మీర్‌జుమ్లా పదవిని రద్దుచేసి, మాదన్నకు 'సూర్య ప్రకాశరావు' అనే బిరుదమిచ్చి వజీరుగా నియమించాడు. అక్కన్నను సేనాపతిని చేశాడు.

భద్రాచలం తాసిల్దారుగా ఉండి రాముడికి గుడికట్టించి, సర్కారీ సొమ్ముతో ఆభరణాలు చేయించి, చిరకాలం కారాగారవాసం చేసిన కంచర్ల గోపన్న అనే భక్త రామదాసుకు మేనమామలన్నది ఒక్కటే అక్కన్న మాదన్నల గురించి తెలుగువారికి బాగా తెలిసిన సంగతి. అందులో అసత్యం లేదు. దారుణ హత్యకు గురి అయ్యే నాటివరకూ రాజ్యాధికారమంతా వారి చేతుల్లోనే ఉండేది. ఈ కాలపు నాయకుల్లా వారికి వల్లమాలిన బంధుప్రీతి ఉంటే సుల్తానుకు సిఫారసు చేసో, పలుకుబడిని వినియోగించో, బకాయి సొమ్మును తామే కట్టేసో మేనల్లుడిని విడిపించటం వారికి కష్టమేమీ కాదు. సర్కారు సొమ్మును మితిమీరిన భక్తిపారవశ్యంలో దైవకార్యాలకు వినియోగించాడే తప్ప గోపన్న సొంతానికేమీ వాడుకోలేదని మేనమామలకు తెలుసు. వారూ దైవభక్తి కలవారే. తెలుగునాట కొన్ని దేవాలయాలను స్వయంగా కట్టించి, అనేక ప్రాచీనాలయాలను సొంత సొమ్ముతో అభివృద్ధి పరచినవారే. కనుక మేనల్లుడి దురవస్థకు వారు జాలిపడలేదనుకోలేము. ఔరంగజేబు ఎంత పట్టుబట్టినా,

మాదన్నను, వదులుకునేందుకు ఇష్టపడని సుల్తాను అతడే అడిగితే తప్పుచేసిన తాసిల్దారును తప్పక వదిలేసేవాడే. అలా పలుకుబడిని వినియోగించకపోవడాన్ని బట్టి పాలనా వ్యవహారాల్లో మాదన్న ఎంత నిక్కచ్చి మనిషో అర్థమవుతుంది.

దేశమంతటా ముస్లిం మతోన్మాదం హెచ్చి, హిందువులను రెండో రకం పౌరులుగా చూస్తూ, అడుగడుగునా దారుణ దుర్విచక్షణకు గురిచేస్తూ, చిన్నపాటి పదవికి కూడా హిందువులకు అర్హత లేదని ఆంక్షలు విధించి, హిందూ దేవాలయాలను కూల్చి, పరిపరి విధాల హిందూ మతాన్ని ఔరంగజేబు వేటాడుతున్న చేటుకాలంలో - అదే చక్రవర్తికి చెందిన ఒక సామంత రాజ్యంలో ముస్లిం ప్రభువు దగ్గర ఒక హిందువు మంత్రిగా ఉండి, రాజ్యభారమంతా తానే వహించి అద్భుత కార్యదక్షతను కనపరచడం మామూలు విషయం కాదు. 16వ శతాబ్ది పూర్వార్థంలో సుల్తాన్ ఆదిల్షా దగ్గర ప్రధానమంత్రిగా ఉండి హేమచంద్ర అనే హేము సాధించిన ఘన విజయాలకు మాదన్న ఖ్యాతి ఏ విధంగానూ తీసిపోదు. హేమువలె ఏనుగెక్కి రణరంగంలో ముందుండి అనేక యుద్ధాల్లో వీరవిహారం చేసి ఉండకపోవచ్చు. కాని - రణతంత్ర రచనలో రక్షణ వ్యవస్థను కట్టుదిట్టం చేసి, సమర్థులకు సరైన బాధ్యతలను అప్పగించడంలో మాదన్న ప్రజ్ఞ తక్కువది కాదు. సైన్యం కోసం జాగిర్దార్లమీద ఆధారపడే పూర్వ పద్ధతిని మాని, మొత్తం జాగిర్లను రద్దుపరిచి, సైనికులకు నేరుగా ప్రభుత్వం నుంచే జీతాలిచ్చే ఏర్పాటును చేయడంవల్ల, కఠోర క్రమశిక్షణను అమలు జరపడంవల్ల - గోలకొండ సేన గతంలోవలె కిరాయి మూకల నానాజాతి సమితిలా కాకుండా పటిష్ఠ రక్షణ శక్తిగా ఎదిగింది. పై స్థాయిలో సేనానులు, సర్దార్లు ఎందరు నమ్మకద్రోహానికి పాల్పడ్డా, సరైన అదనులో మొగలుల శిబిరంలోకి ఫిరాయించి ఎన్ని సమస్యలు తెచ్చి పెట్టినా గోలకొండ సైన్యం కడదాకా ధృఢంగా నిలిచి, అద్భుత పరాక్రమం చూపగలిగిందంటే అది మాదన్న మంత్రి చలవే. బీజాపూర్ బలం క్షీణించేకొద్దీ దక్కన్‌లో బలీయశక్తిగా ఎదిగిన మహారాష్ట్రులతో పొత్తు కుదుర్చుకుని గోలకొండకు మరాఠాల రక్షణ పొందడం మాదన్న రాజనీతిజ్ఞతకు చక్కని నిదర్శనం. 1677లో శివాజీని సాదరంగా ఆహ్వానించి, హైదరాబాద్‌లో నెల రోజులు విడిది చేయించి, గోలకొండతో మైత్రీబంధం ఏర్పరచిన తీరు మాదన్న మంత్రి దూరదృష్టికి దృష్టాంతం. గోలకొండకు అండగా నిలిచేందుకు ఆనాడు మరాఠాలను మాదన్న ఒప్పించడంవల్లే 1686-87 అంతిమ పోరాటంలో ఔరంగజేబు ముట్టడిని గోలకొండ తట్టుకోవటానికి శంభాజీ సైన్యం ఎంతగానో అక్కరకొచ్చింది.

హేమువలె రణతంత్రంలో అరుదైన ప్రజ్ఞ కనపరచడమే గాక దైనందిన పరిపాలనలోనూ మాదన్న చెరగని ముద్ర వేశాడు. వజీర్ కాగానే సుల్తాన్‌తో కలిసి రాజ్యంలోని ప్రతి గ్రామం తిరిగి, పరిస్థితిని, సమస్యలను స్వయంగా అర్థం చేసుకుని పాలనా విధానాలను ఆయన సమూలంగా సంస్కరించాడు. లంచగొండి అధికారులను, పనీపాటా లేకుండా ప్రభుత్వం మీదపడి మేస్తున్న మోతబరువు సర్దార్లను ఇంటికి పంపి, వారి స్థానంలో దీక్షాదక్షత కలవారికి బాధ్యతలప్పగించి, వేతన విధానాన్ని ప్రభుత్వ వ్యయాన్ని, పరిపాలనా వ్యవస్థను మాదన్న క్రమబద్ధం చేశాడు. పన్నుల విధానాన్ని సంస్కరించి, వసూళ్లను పెంచి అటు ప్రభుత్వాన్నీ నష్టాల ఊబి నుంచి బయటవేశాడు. ఇటు అన్ని వర్గాల ప్రజలకూ సుఖసంతోషాలతో నిశ్చింతగా బతికే వీలు కల్పించాడు. మాదన్న మంత్రి జీవితంపై విశేష పరిశోధన జరిపిన

కొమరగిరి వెంకట భూపాలరావుగారు తన ప్రామాణిక గ్రంథం ***The Illustrious Prime Minister Madanna*** లో చెప్పినట్టు మద్రాసులోని ప్రాచ్య వ్రాతప్రతుల గ్రంథాలయంలోని 62 కైఫీయత్తులను, కన్నెమెరా లైబ్రరీలో భద్రపరచిన వందలాది ఈస్టిండియా కంపెనీ రికార్డులను చూస్తే గ్రామ పరిపాలనలో మాదన్న అనుసరించిన విధానాలు, అతడు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, వాటివల్ల ఒనగూడిన సత్ఫలితాలు విశదమవుతాయి.

శ్రీకాకుళం నుంచి చెన్నపట్నం దాకా దాదాపుగా ఇప్పటి ఆంధ్రప్రదేశ్ అంతా, మహారాష్ట్ర, కర్ణాటకల్లోని కొన్ని భాగాలు కలిసిన గోలకొండ సామ్రాజ్యంలో ఆనాడు మాదన్న మంత్రి గ్రామీణ వికాసానికి, వాణిజ్యం, పరిశ్రమల అభివృద్ధికి, అసాంఘిక శక్తులను అణచి శాంతిభద్రతలను కాపాడటానికి, రకరకాల మోసాల, పీడనల బారి నుంచి ప్రజలను రక్షించటానికి అనుసరించిన విధానాలను పరిశీలిస్తే 21వ శతాబ్దపు అవినీతిమయ ప్రభుత్వ నిర్వాకాలకంటే అప్పటి పరిస్థితులు చాలా మెరుగని ఎవరైనా ఒప్పుకోక తప్పదు.

పరిపాలన ఎలా ఉండాలి, పరిపాలకుడు ఎలా మెలగాలి అన్న దానికి నిలువెత్తు నిదర్శనమైన మాదన్న మంత్రిలాగే - చరిత్రలో అన్యాయం జరిగిన ఇంకో గొప్ప మనిషి అబుల్ హసన్ తానాషా. కొంతమంది కథలల్లినట్టు దిక్కులేక ఊళ్లుపట్టి తిరుగుతూండగా ఒక మహమ్మదీయ సాధువు దయవల్ల ఆకస్మికంగా రాజకుటుంబంలో పడిన అనామకుడు కాదతడు. కుతుబ్‌షాహీల వంశంలో పుట్టినవాడే. సుల్తాన్ అయ్యేందుకు జన్మతః అర్హత ఉన్నవాడే. అబుల్ హసన్ ఒళ్లు తెలియకుండా తాగి తందనాలాడిన ఘనుడన్నది నిజమే. కాని అది అతడి చిన్నప్పటి సంగతి. విశృంఖల వ్యసనాలకు అలవాటుపడిన రాజకుటుంబీకులకు సైతం రోతపుట్టి, అతడి గోల భరించలేక ఫిర్యాదు చేస్తే సుల్తాను మందలించాడు. ఆ అవమానానికి నొచ్చుకొని అబుల్ హసన్ కట్టుబట్టలతో బయటికిపోయాడు. తరవాత హైదరాబాద్ ఫతేదర్వాజా దగ్గరి షారాజు ఖత్తాల్ అనే హిందూ సాధువు మఠంలో చేరాక అబుల్ హసన్ ధోరణి, ఆలోచనా సరళి పూర్తిగా మారాయి. [ఆ సాధువే అతడికి 'తానాషా' (బాలయోగి) అని పేరు పెట్టాడు.] రాజభోగాలకు దూరమై అతి సామాన్యుడిలా గురువును పధ్నాలుగేళ్లు సేవించాక అతడి జీవితం ఊహించని మలుపు తిరిగింది.

అప్పుడు గోలకొండ నేలుతున్న అబ్దుల్లా కుతుబ్‌షాకు ముగ్గురు కూతుళ్లు. రెండో అమ్మాయిని సంధి షరతుల్లో భాగంగా ఔరంగజేబు కొడుకుకు కట్టబెట్టాడు. (తరవాత ఆ కొడుకుమీద దయతప్పి కన్న తండ్రే ఖైదులో పెట్టాడు) పెద్దల్లుడు సయ్యద్ నిజాముద్దీన్ మకుటంలేని మహారాజులా పెత్తనం చలాయిస్తూండేవాడు. సుల్తాన్ మూడో కూతురిని అతడే తన మిత్రుడు సయ్యద్ సుల్తాన్‌కు ఇవ్వడానికి, మామను ఒప్పించి నిశ్చితార్థం కూడా చేయించాడు. ఆ తరవాత చెప్పుడు మాటలవల్ల అతడికి మిత్రుడి మీద ద్వేషం పుట్టి ఆ పెళ్ళి ససేమిరా జరగడానికి వీల్లేదని పట్టుబట్టాడు. అతడిని దూరం చేసుకోలేక సుల్తాన్ సరేనన్నాడు. అదే ముహూర్తానికి పెళ్ళి జరపడానికి వేరే వరుడు అర్జంటుగా కావలసి వచ్చాడు. బయటి వాడెందుకు - మన అబుల్ హసనే ఉన్నాడు కదా అని రాజబంధువులు అన్నారు. ఇంకేం? పెళ్ళికొడుకు వేషం వేసుకుని ఎదుర్కోలుకు రడీ అవుతున్న సయ్యద్ సుల్తాన్ ఇంటిమీద రాజభటులుపడి. అతడి ఒంటిమీది దుస్తులు లాగేసుకుని పోయి ఆశ్రమంలోని అబుల్ హసన్‌కు కట్టబెట్టి పెళ్ళి పందిరికి తోడ్కొని పోయారు.

అలా దశ తిరిగిన అబుల్ హసన్‌కు సింహాసనం కూడా దైవికంగా లభించింది. నాటకీయంగా అతడి పెళ్ళి అయిన పన్నెండేళ్ళకు 1672లో సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్షా మరణించాడు. అతడికి కుమారులు లేరు. పెద్దల్లుడు తండ్రి చెరలో ఉన్నాడు. చిరకాలంగా రెండో అల్లుడు నిజాముద్దీనే చక్రం తిప్పుతున్నందున ఇక అతడే గద్దె నెక్కుతాడని అందరూ అనుకున్నారు. అతడూ అలాగే అనుకుని ఒళ్లెరుగని పొగరుతో సయ్యద్ ముజఫర్, మూసాఖాన్ వంటి రాజప్రముఖులు కొందరిని అవమానించాడు. వారికి ఒళ్లు మండి రహస్యంగా కుట్రచేసి నిజాముద్దీన్‌ను ఖైదులో పెట్టి అబుల్ హసన్‌కు పట్టం గట్టారు. అతడు మూర్ఖుడు, వ్యసనపరుడు కాబట్టి గానాబజానాలతో పొద్దు పుచ్చి పెత్తనం తమకు వదిలేస్తాడని భ్రమపడ్డారు. అతడిని కీలుబొమ్మలా చూసి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకుండా బరితెగించారు.

అబుల్ హసన్ వారు అనుకున్నట్టు మూర్ఖుడు కాదు. అసమర్థుడూ కాదు. మాదన్న మంత్రాంగంలో మిత్రబేధతంత్రం నడిపి వారిద్దరి మధ్యా చీలిక తెచ్చి ముందు మూసాఖాన్‌ను బంధించాడు. తర్వాత అదను చూసి కదిలి ముజాఫర్ కుతంత్రాలను నిండుసభలో బట్టబయలు చేసి అక్కడికక్కడే ముజాఫర్‌ను చెరలో పెట్టాడు. అనంతరం మాదన్నను నమ్మి పెత్తనం అప్పగించినా, అతడి మీద అచంచల విశ్వాసం కనపరచినా అబుల్ హసన్ పలువురు చరిత్రకారులు చిత్రించినట్టు మాదన్న చేతిలో కీలుబొమ్మగా ఏమీ లేదు.

అబుల్ హసన్ వ్యసనాలకు బానిస; కాఫిర్లను నెత్తినెక్కించుకుని, మహమ్మదీయులను అణగదొక్కిన మతభ్రష్టుడు; శత్రువులతో చేతులు కలిపిన ద్రోహి - అని ఔరంగజేబు ఎంత ధర్మాగ్రహం అభినయించినా గోలకొండ పతనంలో ఔరంగజేబే అసలు పాపి. మహమ్మదీయ మతం మీద అతడికి నిజంగా అభిమానమే ఉంటే మహమ్మదీయ రాజ్యమైన గోలకొండ మీద నిష్కారణంగా విరుచుకుపడేవాడు కాదు. 1687లో గోలకొండ ముట్టడి మహోధృతంగా నడుస్తున్న సమయంలో ముస్లిం ఉలేమాలు. మత పెద్దలు సాటి ముస్లిం రాజుపై ఇంతటి కక్ష తగదని ఎన్నివిధాల చెప్పినా ఆలకించక పోగా హితవు పలికినవారినే శిక్షించిన క్రూరాత్ముడతడు. అబుల్ హసన్ మతసహిష్ణుతను నెపంగా చూపి 1687లో గోలకొండను మొత్తంగా కబళించినా, ఔరంగజేబు దానికి 30 ఏళ్ల ముందు నుంచీ ఆ దిశలో కుయత్నాలు సాగిస్తూనే నచ్చాడు. ఉపఖండమంతటా విస్తరించిన మొగల్ సామ్రాజ్యం ముందు గోలకొండ రాజ్యం సైనిక శక్తి హీనాతిహీనమే. అయినా చక్రవర్తి కాక ముందు నుంచే పగబట్టినా ఆ చిన్న రాజ్యాన్ని రాజుమార్గంలో లొంగదీయడం ఔరంగజేబు వల్ల కాలేదు. ప్రతిసారీ వంచనకే దిగాడు. గోలకొండ రాజ్యప్రముఖులను ప్రలోభాలు పెట్టి లోబరచుకుని రాజద్రోహానికి ప్రేరేపించడం ద్వారానే అన్నిసార్లూ గోలకొండను దెబ్బతీశాడు.

మొగలాయియీ సార్వభౌమత్వాన్ని అంగీకరించి ఏటా రెండు లక్షల వరహాల కప్పం కట్టడానికి 1636 మేలో షాజహాన్‌తో ఒడంబడిక కుదుర్చుకున్నది మొదలుకుని గోలకొండ ప్రభువులు తమలో తప్పు ఎన్నడానికి ఆస్కారం ఇవ్వకుండా అణకువగానే ఉన్నారు. చక్రవర్తి పంపిన ప్రతినిధి తమ దర్బారులో తగని దర్పం చలాయిస్తూ తమను ఎంత చులకనగా చూసినా కుతుబ్‌షాహీలు కిమ్మనలేదు. వారు ఎంత ఒంగి ఉన్నా ఔరంగజేబు మాత్రం వారి వెంట పడటం మానలేదు. రెండవసారిగా దక్కన్‌కు వైస్రాయ్ హోదాలో వచ్చింది మొదలుకుని గోలకొండను కొల్లగొట్టే కుతంత్రాలను ఔరంగజేబు ఉధృతం చేసి, మీర్‌జుమ్లాను బుట్టలో వేశాడు. వార్షిక కప్పం బకాయి పడ్డదని, రాజద్రోహిగా మారిన మీర్‌జుమ్లా కుమారుడిని

నిర్బంధించారని మిషలు చూపి 1656లో తన కుమారుడు మహమ్మద్ చేత పెద్ద సైన్యంతో గోలకొండ మీద దాడి చేయించాడు. హైదరాబాద్ కోటను పట్టుకుని, నగరాన్ని కొల్లగొట్టించాడు. సుల్తానును కాళ్ళదగ్గరికి రప్పించుకున్నాడు. కొత్తగా శాంతి ఒప్పందం రాసుకుని, కప్పం బకాయిలన్నీ కట్టేసి, పదిహేను లక్షల వరహాల యుద్ధ పరిహారం చెల్లించి, ఔరంగజేబు కొడుక్కు సుల్తాన్ కూతుర్ని ఇచ్చి పెళ్ళికూడా చేసినా గోలకొండను తన హిట్‌లిస్టు నుంచి ఔరంగజేబు తీసెయ్యలేదు. సున్నీ తెగవారిని మినహా ఇతరులను ముస్లింలుగా గుర్తించడం ఇష్టం ఉండని ఆ పాదుషాకు షియా శాఖకు చెందిన గోలకొండ సుల్తాన్లను వారి మానాన వారిని బతకనివ్వడానికి ప్రాణం ఒప్పలేదు. మరాఠా శంభాజీ మదం అణుస్తానని ప్రతిజ్ఞ చేసి దక్కనుకు సైనిక మహాప్రస్థానం సాగించిన ఔరంగజేబు మరాఠాల ఆయువుపట్లను బిగదీసే వ్యూహంలో భాగంగా 1685లో బీజాపూర్‌ను ముట్టడిస్తూ పనిలో పనిగా తన కుమారుడు మువాజం (షా ఆలం)ను పెద్ద సైన్యంతో గోల్కొండ మీదికి దండెత్తించాడు. మొగలులకు వ్యతిరేకంగా బీజాపూర్ సుల్తాన్లతో అబుల్ హసన్ కుత్బుషా కుమ్మక్కయ్యాడన్నది దానికి చూపిన సాకు. మొగలు సేనలు తమ రాజధాని దాకా రాకుండానే గోలకొండ సేనలు ఎదురువెళ్ళి అడ్డగించాయి. ముల్ఖేడ్ దగ్గర జరిగిన భీషణ సంగ్రామంలో ఆ సైన్యాన్ని గెలవలేక రాకుమారుడు చేతులెత్తేశాడు. ఔరంగజేబు తిన్నగా గెలవలేకపోతే వక్రంగానైనా గెలిచి తీరాలనుకుని గోలకొండ సేనాధిపతి మీర్ అహ్మద్ ఇబ్రహీంను ఆశలుపెట్టి తనవైపు తిప్పుకున్నాడు. సేనాపతే విద్రోహిగా మారి వెనుతిరిగిపొమ్మని సైన్యాన్ని ఆజ్ఞాపించడంతో మొగలుల పంట పండింది. అడ్డగించేవారు లేక మొగలు సేనలు రాకాసి మూకల్లా హైదరాబాద్ వైపు దూసుకువెళ్ళాయి. బెంబేలెత్తిన నవాబు హైదరాబాద్ రాజభవనాన్ని ఖాళీ చేసి సపరివారంగా గోలకొండ కోటకు తరలివెళ్ళాడు. పోదలచుకుంటే సురక్షితమైన వరంగల్లు కోటకో, కొండపల్లి కోటకో వెళ్లండిగాని ప్రస్తుత పరిస్థితుల్లో భద్రత తక్కువైన గోలకొండకు మాత్రం వద్దు అని మహామంత్రి మాదన్న ఎంత వారించినా సుల్తాను వినలేదు. ఆ తప్పే చివరకి సర్వానర్థం తెచ్చిపెట్టింది.

రాజే పరారయ్యాడని తెలిసి, జనానికి దిక్కుతోచక, రక్షక వ్యవస్థ కుప్పకూలిన స్థితిలో ఒకవైపు దొంగల ముఠాలు ఇంకో వంక మొగలు మూకలు ఊరుమీదపడి అందినది అందినట్టు దోచుకుని, నానా అత్యాచారాలకు పాల్పడిన ఘోరకలి అనంతరం షా ఆలం రాకుమారుడిని ప్రాధేయపడి సుల్తాను సంధికి ఒప్పించాడు. భారీ పరిహారం చెల్లించి, వార్షిక కప్పాన్ని 2 లక్షల వరహాలకు పెంచి, అక్కన్న మాదన్నలను గెంటేసే షరతులమీద 1685 అక్టోబరులో రాజీ కుదిరింది. ఇస్తానని ఒప్పుకున్న పైకాన్ని సుల్తాను చెల్లించాడు. దాన్ని రాబట్టుకుని మొగలు సైన్యమూ నిష్క్రమించింది.

అక్కన్న మాదన్నలను బయటికి పంపేందుకు సుల్తానుకు చేతులు రాకపోయినా ఈ లోపు ఆయన పరివారంవారు కిరాయి మనుషులతో ఆ సోదరుల తలలు నరికించి పుణ్యం కట్టుకున్నారు. సర్వానర్థాలకూ మాదన్నే కారణమన్న క్రోధంతో పూర్వపు సుల్తాను అబ్దుల్లా కుతుబ్‌షా భార్యలిద్దరు, అబుల్ హసన్ రాణులు కొందరు రహస్యంగా కుట్రచేసి జంషేడ్ అనే బానిసను ఉసిగొలిపారు. 1686 మార్చి 16 సాయంత్రం కొలువు ముగించుకుని సుల్తాను దగ్గర సెలవు తీసుకుని పల్లకిలో ఇంటికిపోతున్న మాదన్నను, అతడి సోదరుడిని రాజభవనం వెలుపలికి రాగానే జంషేడ్ ముఠా దారికాచి దాడిచేసింది. మాదన్న

అంగరక్షకులను ముందే లోబరచుకున్నందున ఆపదలో రక్షించవలసిందిపోయి పరారయ్యారు. పల్లకీల్లోంచి కిందికి లాగి అక్కన్న, మాదన్నలను నేలమీద పడవేసి హంతకులు తలలు నరికారు. మొండాలను ఈడ్చుకుపోయి రాజభవనం గేటుకు వేలాడగట్టారు. ఇరువురి తలలను రాణివాసంవారు షా ఆలం రాకుమారుడికి సగౌరవంగా సమర్పించగా, అతడు వాటిని షోలాపూర్‌లో విడిదిచేసిన ఔరంగజేబుకు పంపించాడు. పాదుషా మహదానందంతో ప్రత్యేకంగా సభతీర్చి సోదరుల శిరస్సులను కసితీరా ఏనుగులచేత తొక్కించాడు.



అక్కన్న మాదన్నలను చంపుతున్నదృశ్యం.
(ప్రత్యక్షసాక్షి గీసినచిత్రం)

అక్కన్న మాదన్నల హత్య అబుల్ హసన్ తానీషాకు తెలిసే జరిగిందని కొందరంటారు. కాని నిజంకాదు. జరిగిన ఘాతుకాన్ని విని అతడు ఎంత పరితపించినా, ప్రయోజనం లేకపోయింది. పరిస్థితి అతడి అదుపు తప్పి అప్పటికే చాలా కాలమైంది. ఏమైతేనేమి - సోదరులిద్దరు రాజ్యం నుంచే కాక లోకం నుంచే నిష్క్రమించడంతో సంధిషరతుల్లో మిగిలిపోయిన ఒక్కటి కూడా తీరినట్టయింది. అధికారపూర్వకంగా తాను ఆమోద ముద్ర వేసిన సంధి షరతులన్నిటినీ సుల్తాను నెరవేర్చిన తరవాత చక్రవర్తిలో పెద్దమనిషి తరహా ఏ మాత్రం ఉన్నా గోలకొండను ప్రశాంతంగా బతకనివ్వవలసింది.

కాని మనం మాట్లాడుతున్నది ఔరంగజేబు గురించి. బంగారం లాంటి ఆదాయ వనరులతో, సిరిసంపదలతో కళకళలాడే గోలకొండ స్వతంత్ర అస్తిత్వాన్ని కాళ్ళకింద తొక్కేసి తన సామ్రాజ్యంలో కలిపేసుకోవడానికి ఏ వంక దొరుకుతుందా అన్నదే ఎప్పుడూ అతడి ధ్యాస. ఆ సంగతి మీర్జా ముహమ్మద్ అనే ధూర్తుడిని గోలకొండకు తన రాజప్రతినిధిగా పంపే ముందు ఔరంగజేబు ఇచ్చిన ఈ ఆదేశాన్ని చూస్తేనే తెలిసిపోతుంది.

"My sole intention is that you should bandy words with him so fearlessly that he too may be harsh to you and thus give me a justification for extirpating him. As far as possible, quarrel with him, and never treat him politely in private or public."

(నా ఏకైక అభిమతం ఏమిటంటే నువ్వు అతణ్ణి జంకు లేకుండా మాటలతో కుళ్ళబొడవాలని; అలాచేస్తే అతడూ నీతో కరకుగా వ్యవహరించవచ్చు. ఆ విధంగా నాకు అతణ్ణి నలిచిపారెయ్యడానికి ఒక కారణం దొరుకుతుంది. సాధ్యమైనంత వరకూ అతడితో పోట్లాడు. బహిరంగంగాగాని, ఏకాంతంలోగాని అతడికి ఎప్పుడూ

మర్యాద ఇవ్వకు.)

తనకు అప్పగించిన "ప్రత్యేక బాధ్యతను" రాజప్రతినిధిగా భేషుగ్గా నిర్వర్తించాడు. నిండు సభలో సుల్తానును నోటికొచ్చినట్టు తిట్టి, నిష్కారణంగా అవమానించి అందరి ముందూ పరువు తీసి రెచ్చగొట్టటానికి ఎన్ని విధాల ప్రయత్నించినా తానాషా రెచ్చిపోలేదు. ఇలా గోల్కొండను కబళించటానికి వంక కోసం అనేక సంవత్సరాలుగా అనేక కుతంత్రాలు పన్ని, అన్నీ విఫలమయ్యాక ఔరంగజేబు ఏ సాకూ లేకుండానే 1687 జనవరిలో బీజాపూర్ నుంచి బయలుదేరి గోలకొండపై బాహాటంగా దురాక్రమణ చేశాడు. తాను ఎంత అణగిమణగి ఉన్నా చక్రవర్తికి తనపై అకారణ ద్వేషమెందుకో అర్థంకాక అబుల్‌హసన్ తెల్లబోయాడు. తమరు ఏమి చేయమన్నా చేస్తాను; దేనికైనా ఒప్పుకుంటాను, మీ దాసుడిని; ఆజ్ఞాపించండి – అని వేడుకుంటూ ఎన్నో విన్నపాలు చేశాడు. ఔరంగజేబు ఏదీ వినలేదు. ఎత్తిన కత్తి దించలేదు. గత్యంతరం లేక సుల్తాన్ తిరగబడ్డాడు. మాదన్న మరణించినా మాదన్న నెలకొల్పిన సైనిక వ్యవస్థ కోట రక్షణకు అద్భుతంగా పనిచేసింది. లక్షల సైన్యాన్ని మోహరించి, వందల శతఘ్నులను ఎక్కుపెట్టి, కోటచుట్టూ కందకాలు తవ్వించి, మందుపాతరలు అమర్చి, ఔరంగజేబు తన శక్తియుక్తులన్నీ ప్రయోగించినా గోలకొండను ఏమీ చేయలేకపోయాడు. ఏడు నెలల ముట్టడిలో అతడికి అన్నీ విఘ్నాలే. అడుగడుగునా ఎదురుదెబ్బలే. అతడి శిబిరంలోనే సర్దార్ల మధ్య ఐక్యత లేదు. తన సైన్యంలోనే షియాలమీద చక్రవర్తికి నమ్మకం లేదు. వారికి అతడి మీద విశ్వాసం పోయి గోలకొండ సుల్తాన్‌కు శాయశక్తులా ప్రచ్ఛన్న సహాయం అందించారు. సాటి ముస్లిం రాజ్యంపై అర్థంపర్థం లేని ఈ యుద్ధం సున్నీలకూ ఇష్టంలేదు. ఆర్భాటంగా శతఘ్ని దళాన్నయితే మోహరించారు కాని దానిని నడిపించే నాథుడే లేకపోయాడు. సేనాధిపతి ఫిరోజ్‌జంగ్ మీద అలిగి శతఘ్ని దళాధిపతి అస్త్రసన్యాసం చేస్తే ఔరంగజేబు అతణ్ణి బంధించాడు. వేరెవరూ దొరకకపోవడంతో మళ్లీ అతడే పాదుషాకు దిక్కయ్యాడు. సేనాధిపతి ఫిరోజ్‌జంగ్ గొప్ప సాహసం చేయిబోయి రాత్రివేళ రహస్యంగా నిచ్చెనలేసుకుని కోట గోడమీదికి ఎక్కితే ఊరకుక్క మొరిగి పథకం చెడగొట్టింది. మందుపాతరలమర్చి కోటగోడలు ధ్వంసం చేయబోగా అవి మొగలుల మీదే పేలి తడవకు వెయ్యిమంది చొప్పున హతమయ్యారు. ఈ లోపు భారీ వర్షాలు కురవడంతో మొగలులు తాము తీసిన గోతుల్లో తామే పడ్డారు. నెలల తరబడి పడిన శ్రమ అంతా వృథా అయింది. ఈలోపు మరాఠా సేనలు బయటి నుంచి చుట్టు ముట్టి ఆహారం, నీరు, ఇతర సరఫరాలను అడ్డగించడంతో మొగల్ సైన్యం మలమల మాడింది. భయంకరమైన కరువు తాండవించింది. అంటువ్యాధులు ప్రబలాయి.

తన ఎత్తుగడలన్నీ తనకే బెడిసికొట్టడంతో ఔరంగజేబు చివరికి తనకు అలవాటైన అధర్మ యుద్ధానికి ఉపక్రమించాడు. తనకు సాయం చేస్తే ఏమి కోరినా ఇస్తానని కోటకు ప్రధాన రక్షకుడైన అబ్దుల్ రజాక్‌లారీకి సందేశాలు పంపించాడు. రజాక్ నిజాయితీపరుడు. ప్రలోభాలకు కక్కుర్తిపడి రాజద్రోహానికి పాల్పడేది లేదని అతడు తెగేసి చెప్పాడు. ఔరంగజేబు అంత తేలిగ్గా ఓటమిని అంగీకరించే ఘటం కాదు. ద్రోహులకు దేశం గొడ్డుపోలేదని అతడికి తెలుసు. మళ్ళీ వల విసిరాడు. అబ్దుల్లా పాని అనే ఇంకో సైనికుడు ప్రలోభాలకు చిక్కాడు. తాను కాపలా కాస్తున్న కోట ద్వారాన్ని తెల్లవారుఝామున తెరిచి శత్రువులను లోనికి రానిచ్చాడు. ఇంకేం? మొగల్ సైన్యం మిడతల దండులా లోపలికి ప్రవేశించింది.

అబ్దుల్ రజాక్ ఒళ్ళంతా గాయలవుతున్నా లెక్కచెయ్యక వీరవిహారం చేసి ఎందరిని మట్టుబెట్టినా ప్రయోజనం లేకపోయింది. శౌర్యం వల్ల కాని పని మోసం వల్ల నెరవేరింది. గోలకొండ కూలింది.

మొగల్ సేనలు తన విలాస మందిరంలోకి చొచ్చుకువచ్చే సమయానికి అబుల్ హసన్ పానగోష్ఠిలో అమ్మాయిల మధ్య మైమరచి ఉన్నాడనీ, సైనికులను చూసి నాట్యకత్తెలు ఆగినా, అతడు "ఈ సుఖాన్ని ఒక్క క్షణమూ వదులుకోను; నువ్వు కానివ్వు" అన్నాడని కొంత మంది చరిత్రకారులు చెప్పింది పచ్చి అబద్ధం. నిజానికి జరిగింది వేరు. కోటలోకి శత్రువులు చొరబడ్డారని తెలియగానే సుల్తాను తన రాణులకు ధైర్యం చెప్పి, అందరి దగ్గరా సెలవు తీసుకుని దర్బారు హాలులోకి వెళ్ళి సింహాసనం మీద ప్రశాంతంగా కూర్చున్నాడు. తనను నిర్బంధించేందుకు వచ్చిన మొగల్ సేనానులను హుందాగా స్వాగతించి, ఉండండి; నాస్తా చేసి వెళదాం అన్నాడట. ఇది నాస్తా చెయ్యదగ్గ సందర్భమా అని ఆశ్చర్యంగా అడిగితే "అన్నీ ఇచ్చిన దేవుడే అన్నిటినీ తీసుకు పోతున్నాడు. జీవితంలో కష్టాలూ పడ్డాను. సుఖాలూ చూశాను. నాకు చింత ఎందుకు?" అని పరమ వేదాంతిలా మాట్లాడి అందరినీ అబ్బురపరిచాడు.

ఎనిమిదిన్నర నెలల ముట్టడి తరవాత 1687 సెప్టెంబర్ 21న గోలకొండ కోటను దొంగదారిన పట్టుకున్న రోజునే సుల్తాన్ అబుల్‌హసన్‌ను ఖైదుచేసి దౌలతాబాద్ కోటలో నిర్బంధించారు. పదిహేనేళ్ళు అక్కడే బందీగా గడిపి 1703లో తన 75వ ఏట అబుల్ హసన్ దయనీయంగా మరణించాడు. అతణ్ణి అంతగా వెంటాడి, వేటాడిన ఔరంగజేబూ గోలకొండ కోటను కట్టుకుపోలేదు. అబుల్ హసన్ సమాధికి కొద్ది గజాల దూరంలోనే నాలుగేళ్ళ తర్వాత ఆ చక్రవర్తినీ సమాధి చేశారు. విజేత, పరాజితుడు ఒకే మట్టిలో కలిశారు.

పాములు పెట్టిన పుట్టలు

Ghulam Kadir went to Emperor Shah Alam and said, "Find me some gold, or I will send you to join the dead". Shah Alam reviled and reproached him, saying, "I am in your power, cut off my head, for it is better than to live like this". Ghulam Kadir sprang up, and threw himself upon the Emperor's bosom. Kandahari Khan and Purdil Khan seized his hands, two of their companions held his feet. Kandahar Khan tore out one of his eyes; and that bloodthirsty reckless ruffian tore out the other with his own hands, amid the wailing of the Emperor. Ghulam Kadir then gave orders that the needle should be passed into the eyes of Prince Akbar, Sulaiman Shukoh, and Ahsan Bakht.. ... Then he called for a painter, and said, "Paint my likeness at once, sitting knife in hand, upon the breast of Shah Alam, digging out his eyes". He then forebad his attendants to bring any food or water either to Shah Alam or his sons.

[Fakir Khairu-D **Din Muhammad** - ***IBRAT NAMA*****, Elliot & Dowson,** *Vol, VIII p. 248-49]*

ఘులాం కదీర్ చక్రవర్తి షా ఆలం దగ్గరికి వెళ్ళి 'నాకు కొంచెం బంగారం చూడు; లేదా నిన్ను చంపేస్తాను' అన్నాడు. షా ఆలం అతణ్ణి తిట్టి, 'నేను నీ చేతిలో ఉన్నాను. నా తల నరికెయ్. ఇలా బతకడం కంటే అదే మేలు' అని ఆక్రోశించాడు. ఘులాం కదీర్ ఎగిరిపాదుషా ఛాతి మీద కూచున్నాడు. కందహారీ ఖాన్ ఒక చెయ్యి, పుర్దిల్‌ఖాన్ ఇంకో చెయ్యి పట్టుకున్నారు. ఇంకో ఇద్దరు అతడి కాళ్లు నొక్కి పెట్టారు. కందహారీ ఖాన్ పాదుషా కన్ను ఒకటి పీకాడు. రక్తపిపాసి అయిన ఆ దుండగుడు (ఘులాం కదీర్) తన చేతులతోనే రెండో కన్నును

పాదుషా వలవల ఏడుస్తుండగా చాకుతో పీకేశాడు. తరవాత రాకుమారులు అక్బర్, సులేమాన్‌షుకో, అహ్సాన్ బఖ్త్‌ల కళ్లు సూదితో పొడిచెయ్యమని ఆజ్ఞాపించాడు... అనంతరం ఒక చిత్రకారుడిని పిలిపించి, 'షా ఆలం గొంతు మీద నేను కూచుని చాకుతో కనుగుడ్లను పెకలిస్తున్న దృశ్యాన్ని బొమ్మ గీయ'మన్నాడు. షా ఆలంకు, అతడి కొడుకులకు అన్నం నీళ్లు ఇవ్వకుండా మాడ్చెయ్యమని పనివారిని ఆదేశించాడు.

'ఇబ్రత్‌నామా' గ్రంథంలో ఫకీర్ ఖైరుద్దీన్ మహమ్మద్ వర్ణించిన బీభత్స దృశ్యమిది. సర్ హెచ్.ఎం.ఇలియట్ సంపుటీకరించిన History of India As Told By Its Own Historians ఎనిమిదో భాగం 248, 249 పేజీలలో దీనిని చూడొచ్చు. ఇందులో పేర్కొన్న షా ఆలం అల్లాటప్పా రాజు కాదు. మొత్తం భారత ఉపఖండాన్ని ఏకచ్ఛత్రంగా ఏలిన ఔరంగజేబుకు మూడు తరాల తరవాతి వారసుడు. ఒకనాడు ప్రపంచంలోకెల్లా శక్తిమంతమైనదనుకున్న మొగల్ మహాసామ్రాజ్యానికి కడపటి చక్రవర్తుల్లో ఒకడు. ఒకప్పుడు పాదుషా కన్నెర్ర చేస్తే ఎంతటి గండరగండలైనా గడగడ వణికేవారు. పాదుషా తలచినదే తడవుగా ఎంతటివారి తలలైనా నిమిషంలో తెగిపడేవి. ఇంచుమించు రెండు శతాబ్దాలు చండప్రచండంగా చెలరేగి, వేలూ లక్షల ప్రజల ప్రాణాలతో చిత్తానుసారం చెలగాట మాడగలిగిన మొగల్ సార్వభౌమత్వానికి చరమ దశలో పట్టిన దుర్గతికి 1788లో షా ఆలం ప్రారబ్ధం ప్రబల దృష్టాంతం.

దేశాన్నేలే చక్రవర్తిని దుండగుడొకడు బంగారం తెమ్మని పీడించి, ఇవ్వకపోతే సింహాసనం నుంచి పడదోసి గొంతు మీద కూచుని కనుగుడ్లు పీకేయటం... పాదుషాను, రాకుమారులను కళ్లు పొడిచి అన్నం. నీళ్లు అందకుండా మలమల మాడ్చటం కేవలం ఒక ప్రభువు హయాంలో విధివశాత్తు దాపురించిన వైపరీత్యాలు కావు. మొగల్ చక్రవర్తిత్వానికి దైన్యం, హైన్యం ఒక రోజులోనో, ఒక తరంలోనో సంప్రాప్తించలేదు. ఔరంగజేబు రోజుల్లోనే వీటికి బీజాలు పడ్డాయి. దక్షిణాన గోలకొండ, బీజాపూర్‌ల నామమాత్ర అస్తిత్వాలను సైతం హరించి మొత్తం హిందుస్తాన్‌ను ఏకచ్ఛత్రాధిపత్యం కిందికి తేగలిగానని ఔరంగజేబు మురిసిన సమయంలోనే అతడికి మొగల్ సామ్రాజ్యానికి పోగాలమూ ప్రారంభమైంది. పాతికేళ్లకు పైగా దక్కన్‌లో చేసిన నిరంతర యుద్ధాలకు ఎక్కడి సొమ్ము చాలక చివరి దశలో ఔరంగజేబు చాలా అవస్థపడ్డాడు. పావు శతాబ్దంపాటు రాజధానికి దూరమై తెరిపిలేని యుద్ధాల్లో మునిగి తేలడంతో పరిపాలనపై చక్రవర్తికి పట్టు తప్పింది. దర్బారు ప్రముఖులది ఇష్టారాజ్యమైంది. ఎక్కడెక్కడి వసూళ్లనూ దక్కన్‌కు తరలించినా సైనికుల జీతాలకే చాలేది కాదు.

అంతో ఇంతో పాలనా దక్షత కలిగి, ప్రభుత్వంపై ఎదురులేని పట్టుగల ఔరంగజేబు హయాంలోనే పరిస్థితి అలా ఉంటే మరుగుజ్జులు, అర్భకులు, అధములు రాజ్యమేలిన అనంతర కాలంలో అన్నీ సంక్షోభాలే. అంతటా వైపరీత్యాలే.

అక్బర్ నుంచి ఔరంగజేబు వరకూ ఒక్కో చక్రవర్తి కొన్ని దశాబ్దాల పర్యంతం రాజ్యమేలగలగగా ఔరంగజేబు తరవాత ఒక పాదుషా ఐదేళ్ళు కొనసాగడం అబ్బురమై పోయింది. ఒకే సంవత్సరంలో ఇద్దరు గద్దెనెక్కిన సందర్భాలూ ఉన్నాయి.

గతంలో పాదుషా మరణించినప్పుడో, మరణించాడని పుకారు పుట్టినప్పుడో రాజకుమారుల మధ్య వారసత్వ యుద్ధం జరిగేది. అందరిలోకి అదృష్టవంతుడికి కిరీటం దక్కగా మిగతావారికి కారాగారమో, సోదరుడి చేతులమీదుగా పరలోకవాసమో ప్రాప్తించేది. ఒక

రాజకుమారుడికి సింహాసనం అందాక ఇక జీవితాంతమూ అతడి పెత్తనానికి ఎదురు ఉండేది కాదు. దర్బారులో ఎవరిని పైకి తేవాలి, ఎవరిని అణగదొక్కాలి, ఎవరికి ఏ బాధ్యతలు అప్పగించాలి అన్నది చక్రవర్తి ఇష్టాన్ని బట్టే ఉండేది. పరిపాలనా సౌధం మొత్తానికీ అతడే మూలస్తంభంగా ఉండేవాడు. రెండు శతాబ్దాలకు పైగా నిలిచిన ఈ అధికార వ్యవస్థ ఔరంగజేబు అనంతర కాలంలో అస్తవ్యస్తమైంది.

షాజహాన్‌లానే ఔరంగజేబు కూడా తన మరణానంతరం కుమారులు కలహించుకో కుండా రాజ్యాన్ని సామరస్యంగా అనుభవించాలని అభిలషించాడు. కాని తానే తండ్రి మాట ఖాతరు చెయ్యనప్పుడు కుమారులు మాత్రం తన మాట ఎందుకు వింటారు? ఔరంగజేబు చేతిలో అప్పటికే హతం కాగా మిగిలినవారిలో పెద్దవాడైన, మువాజం సామరస్య పరిష్కారం కోసం ప్రయత్నించినా మిగతా సోదరులు పడనివ్వలేదు. 'బహదూర్ షా' బిరుదుతో మువాజం గద్దెనెక్కాడు. వారసత్వ యుద్ధాల్లో అతని సోదరులిద్దరూ మరణించారు. బహదూర్ షా తండ్రి అంత క్రూరుడు కాదు. మంచివాడే కాని – పదును తక్కువ. అతడు గద్దెనెక్కిందే రిటైరు కావలసిన ఈడులో. అదీ ఎనిమిదేళ్లు ఖైదులో ఉండి బయటికొచ్చిన తరవాత! 65వ ఏట లేటు వయసులో కిరీటం ధరించి ఐదేళ్లు రాజ్యం చేశాడో లేదో ఆయనకు భూమ్మీద నూకలు చెల్లాయి. 1712లో బహదూర్ షా మరణంతో మొగల్ సామ్రాజ్యం మీద ,చక్రవర్తి సర్వం సహాధిపత్యానికీ కాలం తీరింది. కీలుబొమ్మల శకం మొదలైంది. అంతదాకా దోసిలి ఒగ్గి ఉన్న సర్దార్లు కింగ్‌మేకర్లయ్యారు. చక్రవర్తులు వారి చేతిలో డమ్మీలయ్యారు.

బహదూర్ షాకు నలుగురు కొడుకులు. ముగ్గురిలో యోగ్యుడు రెండోవాడు అజీముష్ ఖాన్. అందరిలోకీ అతడే బలవంతుడు. అతనికి ఎదురునిలిచే చేవలేక మిగతా ముగ్గురు సోదరులూ చేతులెత్తేశారు. మామూలుగా అయితే అజీముష్ పట్టాభిషేకానికి ఏ అవరోధమూ ఉండకూడదు. కాని బహదూర్‌షాకు వజీరుగా ఉండి దర్బారులో గట్టి పట్టుగల జుల్ఫికర్ ఆలీఖాన్‌కు అజీముష్ అంటే సరిపడదు. అతడొస్తే తన ఆటలు సాగవు కనుక తెలివిగా మిగతా ముగ్గురు రాకుమారులను కూడగట్టాడు. తనను వజీరుగా పెట్టుకుని, పరిపాలన తనకు వదిలేసి ముగ్గురు సోదరులూ రాజ్యాన్ని పంచుకుని అనుభవించే షరతు మీద ముఠాకట్టాడు. అందరినీ సమీకరించి సేనలను నడిపిచి మొదట అజీముష్‌ను చంపేశాడు. తరవాత ఆడిన మాట తప్పి సోదరుల్లో పెద్దవాడయిన జహాందర్ షాతో కుమ్మక్కయి మిగతా ఇద్దరు రాకుమారులనూ చంపేశాడు.

పేరుకు మాత్రం జహాందర్ చక్రవర్తి. చక్రం తిప్పేది వజీరు జుల్ఫికర్. దర్బారులో నియామకాలు, ఉద్వాసనలు అన్నీ మంత్రి నిర్ణయాన్నిబట్టే జరిగేవి. పాలనా విధానాలూ అతడే నిర్ణయించేవాడు. ఎలాగూ తన మాట చెల్లుబాటు కాదు కనుక ప్రభుత్వమంతటినీ వజీరు చేతుల్లో పెట్టి చక్రవర్తి నిరంతర వ్యసనాల్లో మునిగి తేలాడు. నెత్తిమీద కిరీటం నిండా సంవత్సరం కూడా నిలవకున్నా ఆ కొద్దికాలంలోనే కొన్ని తరాలకు సరిపడిన అపకీర్తిని కష్టపడి సంపాదించాడు.

గానాబజానాలు, కామవికారాలు, భ్రష్టాచారాలు మొగల్ చక్రవర్తులకు కొత్త కాదు. కాని జహాందర్‌షా భ్రష్టుల పంక్తిలో ముందు పీట వేయదగినవాడు. సాధారణంగా మొగల్ చక్రవర్తులను పాపభీతి లేకుండా ఆకాశానికెత్తే **ఖాఫీఖాన్** లాంటి సమకాలిక చరిత్రకారుడు

కూడా In the brief reign of Jahandar, violence and debauchery had full sway... All the brothers and relatives, close and distant, of Lal Kunwar received mansabs... worthy, talented and learned men were driven away. *(జహాందర్ స్వల్పకాలిక పాలనలో హింస, వ్యభిచారాలు విజృంభించాయి... లాల్‌కన్వర్ చుట్టాలు, పక్కాలు అందరికీ మున్సబ్‌గిరీలు దక్కాయి... యోగ్యులు, విజ్ఞులు అయిన ప్రతిభావంతులను తరిమేశారు)* అని తెగనాడాడు. (***Khafikhan*****, Elliot & Dowson**, *Vol. VII p.432).*

జహాందార్ షా అధముడు. అతడి ఉంపుడుగత్తె లాల్‌కున్వర్ ఇంకో అధమురాలు. ఓ రోజు ఇద్దరూ కలిసి లాల్‌ఖిలాపైకి ఎక్కి చల్లగాలి పీలుస్తుండగా సాని దృష్టి దూరాన యమునా నదిలో జనాన్ని మోసుకుపోతున్న పడవమీద పడింది. వెంటనే ఆమెకు మహత్తరమైన కోరిక కలిగింది. 'నిండా జనం ఉన్న పడవ మునిగిపోవటం నేను ఎప్పుడూ చూడలేదు' అంది ప్రాణేశ్వరుడితో గోముగా.

'ఓస్!... అదెంత భాగ్యం? ఆ అనుభవమూ నీకు కలిగిస్తాను చూడు' అని లలనామణిని లాలించి పాదుషాగారు వెంటనే ఆజ్ఞలు జారీ చేశాడు. భటులు పరుగున వెళ్లి పరవళ్లు తొక్కుతున్న నది మధ్యలో పడవను నిలువునా ముంచారు. 80 మంది ప్రయాణికుల్లో తొమ్మిది మంది మాత్రమే ఈదుకుంటూ ఒడ్డునపడ్డారు. సానిదాని చిరుకోరికకు 71 మంది బలిఅయ్యారు.

ఈ అమర ప్రేమికులదే ఇంకో ముచ్చట. రాణివాసంలోకి వచ్చినా అమ్మగారికి పాత అలవాట్లు పోలేదు. పాదుషాను వెంటేసుకుని చీకటి పడగానే రథం మీద బలాదూరు తిరుగుళ్లకు పోయి, తాగి తందనాలాడుతుండేది. ఓ అర్ధరాత్రి ఇద్దరూ తప్పతాగి రథంలో ఊగి వచ్చారు. బండి దిగగానే సాని తూలుకుంటూ వెళ్లి మంచం మీద పడింది. కైపు ఎక్కువైన చక్రవర్తి బండిలోనే నిద్రపోయాడు. ఆ సంగతి గమనించని సారథి బండిని రథశాలకు తీసుకుపోయాడు. కాసేపటికి పాదుషా కనిపించడం లేదని అంతఃపురంలో గగ్గోలు పుట్టింది. అమ్మగారిని కష్టపడి లేపి అడిగితే తెల్లమొగం వేసి కెవ్వుమంది. పరిసరాలన్నీ గాలిస్తే చాలాసేపటికి బండిలోపడి గుర్రుపెడుతున్న చక్రవర్తి దర్శనమైంది.

ఒళ్లెరుగని తన నిర్వాకానికి పాదుషా సిగ్గుపడ్డాడా? లేదు. బండివాడిమీద మండిపడి మర్నాడు పొద్దున్నే బహిరంగంగా ఉరి తీయించాడు!

కాలం అనుకూలిస్తే లోకానికి ఇలాంటి లీలలు ఇంకా ఎన్నో అనుగ్రహించేవాడే కాని జహాందర్‌షా పాదుషాగిరీకి సంవత్సరం నిండకుండానే మోసం వచ్చింది. అతడు హతమార్చిన సోదరుడు అజీముష్‌ఖాన్ కుమారుడు ఫర్రుఖ్ సియర్ ప్రతీకారం తీర్చుకోదలచి తన తండ్రివల్ల ఉపకారం పొందిన ఇద్దరు సుబేదార్లను ఆశ్రయించాడు. సయ్యద్ హుస్సేన్ ఆలీ, సయ్యద్ అబ్దుల్లాఖాన్ అనే ఆ ఇరువురు సోదరులూ పెత్తనమంతా తమ చేతుల్లో పెట్టే షరతుమీద అతడికి అండగా నిలిచి జహాందర్‌షాపైకి పెద్ద సేనతో దండెత్తారు. పాదుషా ప్రమాదాన్ని ఆలస్యంగా గుర్తించి ఆత్మరక్షణకు తత్తరపడ్డాడు. కాని అతడి చేతిలో చాలినంత బలగం లేదు. ఉన్న సైన్యానికి చాలా నెలలుగా జీతాలు లేవు. వేతనాలు ఇస్తే తప్ప యుద్ధానికి కదిలేది లేదని సిపాయిలు మొరాయించారు. ఖజానాలో సొమ్ముల్లేవు. ఏమి చేయాలో తోచక చివరికి రాజమహలులోని బంగారు, వెండి పాత్రలను, గోడలకు, కప్పులకు ఉన్న బంగారు తాపడాలను, కనిపించిన ఆభరణాలను ముక్కలుచేసి జీతాల కింద తలా ఇంత చేతిలో

పెట్టాల్సిన కర్మ పట్టింది. మొగల్ సామ్రాజ్యం దివాలా పరిస్థితి దాంతో జగద్విదితమైంది. అంతా చేసి ఎలాగో సైన్యాన్ని కూడగట్టి పంపినా ప్రయోజనం లేకపోయింది. జహాందర్‌షా కుమారుడు ఉత్తర కుమారుడిలా దండెత్తి వెళ్ళి ఆగ్రా సమీపాన శత్రుసేనను చూడగానే బేజారై కాళ్లకు బుద్ధి చెప్పాడు. అతనిలాగే మహావీరులైన ఇద్దరు సేనాపతులు యుద్ధం చేయక చోద్యం చూశారు. నిజాం ఉల్ ముల్క్ అనే ఇంకో సర్దారు వైరిపక్షంలో ససైన్యంగా చేరిపోయాడు. దీంతో బెంబేలెత్తిన చక్రవర్తి తన ఉంపుడుగత్తెతో కలిసి ఎడ్లబండిలో రహస్యంగా ఢిల్లీకి పరారయ్యాడు. అక్కడికి పోయి జుల్ఫికర్ ఖాన్ దగ్గర తలదాచుకుంటే అతడు సమయానుకూలంగా విధేయత మార్చేసి, సయ్యద్ సోదరులకు చక్రవర్తిని పట్టిచ్చాడు. (దానికి ప్రతిఫలంగా కొత్త కొలువులో పెద్ద పదవి దొరుకుతుందని అతడు ఆశపడ్డాడు. కాని అవతలి వారు అతడిని మించినవారు. అక్కర తీరగానే అతణ్ణీ ఆప్యాయంగా అక్కున చేర్చుకుని పీక కోసేశారు.)

ఇంకేం? ఫర్రుఖ్ సియర్ విజయగర్వంతో ఆగ్రా వెళ్ళి సింహాసనాన్ని స్వాధీనపరచు కున్నాడు. సయ్యద్ సోదరులు జహాందర్‌షా తల నరికి పళ్లెంలో పెట్టి ఫర్రుఖ్‌కు కానుకగా సమర్పించారు. అన్నమాట ప్రకారం వారిలో ఒకరిని వజీరుగా, ఒకరిని మీర్‌బక్షీ (సేనాధిపతి)గా నియమించారు. మళ్లీ పాతకథే. జుల్ఫికర్ ఖాన్ స్థానంలో సయ్యద్ సోదరులు తయారై అధికారమంతా గుప్పిట్లో పెట్టుకుని పాదుషాను తోలుబొమ్మలా ఆడించజూశారు. అది ఫర్రుఖ్‌కు దుస్సహమైంది. సయ్యద్‌ల పట్టు నుంచి తప్పించు కునేందుకు అతడు అనేక యత్నాలు చేయడం, వారు ఎత్తుకు పైఎత్తు వేయడంతో ఆరేళ్లు గడిచాయి. తనను తొలగించి మరొకరిని ఎక్కడ గద్దెనెక్కిస్తారోనన్న భయంతో సొంత తమ్ముడు సహా ముగ్గురు రాజకుమారులను ఫర్రుఖ్ కళ్లు పొడిచి ఖైదు చేయించాడు. (కళ్లు లేనివాడు రాజు కారాదని తైమూర్ వంశాచారం.) మంత్రి, సేనాపతులకూ పాదుషాకూ మధ్య ఉద్రిక్తత క్రమేణా పెరిగి చివరికి బహిరంగ సంఘర్షణకు దారితీసింది. దక్కన్‌కు సుబేదారుగా వెళ్ళిన హుస్సేన్ అలీ మరాఠాల మద్దతుపొంది పెద్ద సైన్యంతో ఢిల్లీ మీదికి దండెత్తాడు. 'మీ ఇద్దరినీ ఏనుగులతో తొక్కిస్తా, చంపేస్తా' అంటూ పులిలా గర్జించిన పిరికి చక్రవర్తి తీరా సయ్యద్ సైన్యాన్ని చూసేసరికి పిల్లిలా తోకముడిచి, అంతఃపురంలో దాక్కున్నాడు. సయ్యద్ హుస్సేన్ అక్కడికే వెళ్ళి పాదుషాను పట్టుకుని మొదట కళ్లు పీకాడు. తరవాత తల నరికించాడు.

1719లో ఇలా ఫర్రుఖ్‌సియర్ అడ్డు తొలగించుకున్నాక సయ్యద్ సోదరులు స్వయంగా తామే సింహాసనం ఎక్కుదామని ఒక దశలో ఆలోచించారు. పాదుషాలు ఎంత అయోగ్యులైనా రాజకీయ వర్గాల్లో మొగల్ వంశంపట్ల మన్నన పోలేదనీ, అంత తేలిగ్గా వారు మరో వంశం ఆధిపత్యాన్ని అంగీకరించరనీ అర్థమయ్యాక మళ్లీ తోలుబొమ్మల అన్వేషణలో పడ్డారు.

సాధారణంగా సింహాసనం ఎక్కిస్తామంటే ఎవరైనా ఎగబడతారు. అలాంటిది – కీలుబొమ్మ రాజరికంలో కేండిడేట్లకే కరవొచ్చింది. యాభయ్యేళ్ల ఔరంగజేబు పాలన లోనూ... 1707లో ఔరంగజేబు మరణానంతరం జరిగిన అనేక వారసత్వ యుద్ధాల్లోనూ ఎందరో రాజకుమారులు హతమై తైమూర్ వంశం దాదాపుగా అంతరించిపోయింది. మిగిలిన కొంత మంది కూడా గడచిన కొన్ని సంవత్సరాల అనుభవాన్ని చూశాక ముళ్ల కిరీటం తగిలించుకుని బలిపీఠం ఎక్కడానికి సాహసించలేకపోయారు. రాజవంశీకుల కోసం సయ్యద్ సోదరులు గాలిస్తున్నారని తెలిసి రాణివాసంలోని తల్లులు తమ పిల్లలను దాచిపెట్టసాగారు. గట్టిగా వెదికితే చివరికి

జహాందర్ తమ్ముడి కొడుకు ఒకడు కనపడ్డాడు. వాడి నెత్తికి కిరీటం తగిలిస్తే మూడు నెలలకే క్షయరోగంతో మరణించాడు. తరవాత వంతు అతడి సోదరుడు రఫియుద్దౌలాది. విషంపెట్టి చంపారో, క్షయరోగంతో పోయాడో కచ్చితంగా తెలియదుకానీ అతడూ మూడు నెలలకే బాల్చీ తన్నాడు. ఇలా ఒక్క ఏడాదిలో ఇద్దరు యువకులు రాజగండంలో హతమయ్యాక సయ్యద్‌ల గాలింపులో 17 ఏళ్ల రోషన్ అఖ్తార్ దొరికాడు. అతడు బహదూర్‌షా మనవడు. గద్దె నాకు వద్దు అని అతడు ఎంతో మొత్తుకున్నా సయ్యద్‌లు నచ్చచెప్పి 'మహమ్మద్ షా' పేరుతో 12వ మొగల్ చక్రవర్తిగా 1719లో పట్టం కట్టారు. అతడిదీ మూణ్ణాళ్ల ముచ్చటేనని అంతా అనుకున్నారు. కాని అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ మహమ్మద్ షా 1748 దాకా అంటే 29 ఏళ్లు రాజ్యం చేశాడు.

తనను చక్రవర్తిగా అందరికీ చూపెడుతూనే ఇరవై నాలుగు గంటలూ నిఘా పెట్టి, అనుమతి లేనిదే ఎక్కడికీ వెళ్లలేని, ఎవరినీ కలవలేని నిర్బంధ స్థితిలోకి నెట్టిన సయ్యద్‌లను వారి విరోధుల అండతో అతడు దెబ్బతీశాడు. గద్దెనెక్కిన మరుసటి సంవత్సరాని కల్లా నిజాం ఉల్‌ముల్క్ లాంటి సయ్యద్‌ల విరోధులను కూడగట్టి వారి సైనిక మద్దతుతో సోదరులు ఇద్దరినీ జయప్రదంగా సంహరించాడు. దానివల్ల పాత పెత్తందారుల పోరయితే తప్పింది కాని వారి స్థానంలో నిజాం ఉల్‌ముల్క్ లాంటి కొత్త పెత్తందారులు తిష్టవేశారు. చక్రమంతా వారే తిప్పేవారు. పాతికేళ్లకుపైగా రాజ్యమేలినా పరిపాలన అంటే ఏమిటో మహమ్మద్ షాకు తెలియదు. తెలుసుకునే ప్రయత్నమూ చేయలేదు. అంతఃపురం నాలుగు గోడలకు పరిమితమై ఎప్పుడూ తాగి తందనాలాడటమే తప్ప తన చుట్టూ ఏమి జరుగుతుందో గమనించిన పాపానపోలేదు. దృఢ నిర్ణయమనేది అతడు జన్మలో ఎరుగడు. ఈ అలసత్వంవల్లే పర్షియా నుంచి నాదిర్షా దండెత్తి గుమ్మంలోకి వచ్చేదాకా మహమ్మద్‌షా జాగ్రత్తపడలేదు. అతడు కళ్లు తెరిచేటప్పటికి పరిస్థితి చేయిదాటిపోయింది.

పర్షియన్ ప్రభువు నాదిర్షా సాధ్యమైనంత సంపదను కొల్లగొట్టే ఉద్దేశంతో హిందుస్థాన్ మీదికి దండెత్తి వస్తున్నట్టు తొలి హెచ్చరికలు అందిన వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకుని ఉంటే భయానక ఘోరకలి తప్పేది. పర్షియన్ సేనలు కాబూల్ దిశగా దూసుకు వస్తున్నట్టు తెలిసిన వెంటనే అక్కడి సుబేదారు నాసిర్‌ఖాన్ మొగలు దర్బారుకు మొరపెట్టుకున్నాడు. మా దగ్గర రక్షణకు కావలసిన బలగం లేదు. ఉన్న సేనకు ఆయుధాలు చాలవు. సైనికులకు చాలాకాలంగా జీతాల్లేవు. నాకే ఐదేళ్లుగా జీతం అందడంలేదు. నాకు బకాయిపడిన దాని నుంచి కనీసం ఒక సంవత్సరం గ్రాసాన్ని వెంటనే ఇప్పించినా మందీ మార్బలాన్ని సమకూర్చుకోగలను – అని సుబేదారు ఆక్రోశిస్తే అదంతా సొమ్ము కోసం అల్లిన కథ అని ప్రధానమంత్రి కొట్టిపారేశాడు. పిడుగులాపడ్డ శత్రువుతో ఉన్న బలగంతోనే ఆఫ్గాన్ సుబేదారు ఎంత భీకరంగా పోరాడినా ప్రయోజనం లేకపోయింది. కైబర్ కనుమ దాటి, కాబూల్, పెషావర్‌లను ఆక్రమించి, సింధునది దాటి నాదిర్షా పంజాబ్‌వైపు చొచ్చుకు రాసాగాక ఎట్టకేలకు మొగల్ పాదుషా ప్రమాదాన్ని గురించి లక్ష కాల్బలంతో 60 వేల అశ్వబలంతో ముగ్గురు సర్దార్లను యుద్ధానికి పంపాడు. వారు వెంటనే ముందుకు సాగకుండా తమలో తాము కలహించుకుంటూ కుంటిసాకులతో కాలయాపన చేస్తూ నెలరోజుల విలువైన కాలం వృథా చేశారు. ఎట్టకేలకు కర్నాల్ దగ్గర భీషణ సంగ్రామం జరిగినప్పుడైనా ఒకరిమీద కక్షతో ఇంకొకరు సమయానికి సాయపడకుండా చోద్యం చూస్తూ పరాజయాన్ని కొని

తెచ్చుకున్నారు. 50 లక్షల రూపాయలు చెల్లించే షరతు మీద నాదిర్షాకూ మొగల్ పాదుషాకూ నిజాం ఉల్ ముల్క్ చొరవతో సంధి కుదిరి సంక్షోభం సమసిందని అనుకుం టూండగా ఆ ఉల్‌ముల్క్ మీది అక్కసుతో ఇంకో బుర్హాన్ ఉల్‌ముల్క్ రాజద్రోహానికి పాల్పడ్డాడు. నీకు వాళ్లు ఇస్తామన్నది చాలా తక్కువ; పాదుషాను, అతడి వజీరును పట్టి బంధించావా అపార సంపద నీ కాళ్ల దగ్గర పడుతుంది అని నాదిర్షాకు బాగా ఎక్కించాడు. దాంతో సమస్య విషమించి, అదనపు సొత్తును గోళ్లూడగొట్టి వసూలు చేసుకోవడానికి మొగల్ పాదుషాను వెంటపెట్టుకొని నాదిర్షా 1739 మార్చి 20న న్యూఢిల్లీలో పాపిష్టి పాదం మోపాడు. తరవాత మూడోరోజునే అతడిని తైమూర్ దయ్యం ఆవహించింది. తన సేనలపై స్థానికులు దాడి చేసినందుకు మండిపడి అభాగ్య జనాన్ని వేల సంఖ్యలో ఊచకోత కోయించాడు. దేశ చరిత్రలో ఎన్నటికీ మరవలేని ఆ ఘోరకలిని స్వయంగా చూసిన ఆనంద్‌రామ్ ముఖ్లిస్ మాటల్లో చెప్పాలంటే:

> "An order went forth from the Persian Emperor for the slaughter of the inhabitants. The Chandni chauk, the fruit market... and the buildings around the Masjid-i Jama were set fire to and reduced to ashes. The inhabitants, one and all were slaughtered... The author beheld these horrors from his mansion, outside the city... The massacre lasted half the day... For a long time the streets remained strewn with corpses, as the walks of a garden with dead flowers and leaves. The town was reduced to ashes... All the regal jewels and property and the contents of the treasury were seized by the Persian conqueror... Jewels... were valued at about fifty krors. The peacock throne alone... had cost one kror of rupees... In short the accumulated wealth of 348 years changed masters in a movement.
>
> ***[Anand Ram Mukhlis, TAZKIRA,* E & D** *Vol.VII p. 88-89]*

(పౌరులను నరికెయ్యమని పర్షియన్ చక్రవర్తి నుంచి ఆదేశం వెళ్ళింది. చాందినీ చౌకు, పండ్ల మార్కెటు, జామామసీదు చుట్టుపక్క ఉన్న ఇళ్లన్నీ తగలబెట్టి బుగ్గి చేశారు. పురజనులు మొత్తం అందరినీ ఊచకోత కోశారు. నగరం బయట ఉన్న తన మేడమీద నుంచి ఈ గ్రంథకర్త ఈ ఘోరాలను చూశాడు. ఊచకోత సగం రోజు సాగింది... తోటలో నడిచే దారిలో వాడిన పువ్వులు, ఆకులు పోగుపడినట్టు వీధుల నిండా శవాలు చాలాకాలం గుట్టలుగా పడి ఉన్నాయి. పట్టణమంతా బూడిద అయింది.... రాచవారి నగలు, ఆస్తి, ఖజానాలో ఉన్నవన్నీ పర్షియన్ విజేత వశపరచుకున్నాడు. కొల్లగొట్టిన నగల విలువ 50 కోట్లు ఉంటుంది. నెమలి సింహాసనం ఒక్కటే కోటి రూపాయల ఖరీదు చేసేది... ఒక్క మాటలో చెప్పాలంటే 348 సంవత్సరాల్లో పోగుపడిన సంపద ఒక్క క్షణంలో చేతులు మారింది.)

మృతుల సంఖ్య ఎంతో ఈ ప్రత్యక్ష సాక్షి పేర్కొనలేదు. 1741లో రాసిన ***TARIKH-I HINDI*** లో రుస్తుం అలీ అంచనా ప్రకారం తొమ్మిది గంటలు సాగిన ఆ ఊచకోతలో లక్ష మంది ప్రాణాలు పోయాయి. [E & D *Vol. VIII p.64*]

ఢిల్లీ నగరంలో విలువైన వస్తువు దేన్నీ వదలకుండా ఇల్లిల్లూ దోచుకుని, రాజనగరు మొత్తాన్ని కొల్లగొట్టి కోట్లు విలువచేసే నగలను, కోట్ల రూపాయల రొక్కాన్ని, ఖరీదైన వస్తువులను, అపురూపమైన కోహినూర్ వజ్రాన్ని, సుప్రసిద్ధ నెమలి సింహాసనాన్ని వందలాది ఏనుగుల మీద, ఒంటెల మీద, గాడిదల మీద వేసుకుని మూణ్నెళ్ల తరవాత నాదిర్షా స్వదేశానికి మరలాడు. మహమ్మద్ షా కాళ్లావేళ్లాపడగా దయతలచి అతడి కిరీటాన్ని మళ్లీ అతడి నెత్తిమీదే పెట్టాడు. కాని - ఏలుకోవటానికి ఏమీ మిగలలేదు. ఘనత వహించిన మొగల్ సామ్రాజ్యం అస్తమించిందని నాదిర్షా ఉపాఖ్యానంతోటే లోకానికి విశదమైంది. నాదిర్షా విడిచిపెట్టింది ఏదైనా ఉంటే దాన్ని అహ్మద్ షా అబ్దాలీ వరస దండయాత్రల్లో తుడిచిపెట్టాడు. సామ్రాజ్యం పేరుకు ఉపఖండమంతటా విస్తరించి ఉన్నా చక్రవర్తి అధికారాన్ని సొంత దర్బారులోనే గుర్తించేవారు లేకుండాపోయారు. ఒకప్పుడు తు.చ. తప్పక నిక్కచ్చిగా అమలైన పాదుషా ఫర్మానాలను లక్ష్యపెట్టేవారు లేకపోయారు. ఎవరికి వారే పెత్తందారులై అందినకాడికి దండుకోసాగారు. దర్బారు కుట్రలు, మంత్రు లకూ, సేనాపతులకూ మధ్య కక్షలు, కీలుబొమ్మ రాజరికాలు హద్దూపద్దూ లేకుండా చెలరేగాయి.

డబ్బు, బంగారం తెమ్మని చక్రవర్తిని, అతడి పరివారాన్ని చితకబాది చిత్రహింసలు పెట్టడాలు, అంతఃపురంలోని స్త్రీల బట్టలు ఊడదీసి ఒంటిమీది నగలు దోచుకోవడాలు, చక్రవర్తికి, రాజకుమారులకు మంచినీళ్లు కూడా ఇవ్వకుండా మాడ్చటాలు చాలా మామూలు ఘటనలయిపోయిన కాలంలో ఒక షా ఆలం చక్రవర్తికి ఒక ఘులాంకదీర్ చేసిన 'రాచమర్యాద' అసుర సంధ్యవేళ మొగల్ సామ్రాజ్య దారుణ దుర్గతికి మచ్చుతునక. కొన్ని దశాబ్దాల తరవాత ఆంగ్లేయులు చెలరేగి మొగల్ సామ్రాజ్యానికి ప్రేత సంస్కారం చేసేంతవరకూ ఈ తోలుబొమ్మలాట నడిచింది. **చీమలు పెట్టిన పుట్టలు పాముల కిరవైన యట్లు...** అన్న పద్యపాదం తిరగబడి తొలి మొగలాయీ చక్రవర్తులు అనే పాములు పెట్టిన పుట్టలు చివరికి చలిచీమలకు యిరవయి అయ్యో పాపం అనేవారు లేకుండా కాలప్రవాహంలో కరిగిపోయాయి.

ఉపసంహారం

గతం మరచిన జాతికి భవిష్యత్తు చీకటి.

మనం ఎవరమో... ఎప్పుడు, ఎక్కడ బయలుదేరామో... బతుకు దారిలో ఎన్ని మజిలీలు దాటామో... ఎలాంటి కష్టాలు పడ్డామో... ఏ గొప్పతనాలు చూశామో... ఏ తప్పులు చేశామో తెలిస్తే తప్ప గత కాలం గురించి సరయిన అవగాహన కలగదు. గతం తెలియనిదే వర్తమానం అర్థం కాదు. భవిష్యత్తుకు దారీ దొరకదు. అలా జాతి భవితకు పథ నిర్దేశం చేసేదే చరిత్ర.

చరిత్ర అంటే గోరీల దిబ్బ కాదు. రాజులూ, రాజువంశాలూ పుట్టిగిట్టిన తారీఖుల పట్టిక కాదు. యుద్ధాలూ, వాటి గాయాలూ, తెగిన శిరస్సుల లెక్కలూ ఏకరవు పెట్టే పోస్టుమార్టం నివేదిక కాదు. చరిత్ర అనేది విద్యార్థులు మార్కుల కోసం, ర్యాంకుల కోసం చదవక తప్పని సబ్జెక్టు కాదు. హిస్టరీ మాస్టర్లకు, హిస్టరీ పాఠాల రాతగాళ్లకు, పాఠ్యాంశాలను నిర్ణయించే సర్కారీ సంస్థలకు పరిమితమైన వ్యవహారం కాదు. చదువుల మొక్కుబడి కాగానే అవతల పారేసి జన్మంతా హాయిగా మరచిపోగలిగిన విషయం కాదు. చరిత్ర ప్రజలందరికీ సంబంధించిన, జీవితాంతం ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవలసిన సబ్జెక్టు. దానిలోని విషయం ప్రజలు; దాని పరమావధి ప్రజల బాగు. చరిత్ర తెలుసుకోవడమంటే - మన పూర్వుల గురించి, వారిని నడిపించిన ఆశయాల గురించి, వారిని ప్రేరేపించిన ప్రభావాల గురించి, వారు పడిన అగచాట్ల గురించి, సాధించిన విజయాల గురించి, అనుభవించిన పరాజయాల గురించి, ప్రతికూల పరిస్థితుల్లో సాగించిన పోరాటాల గురించి, వాటి పర్యవసానాల గురించి, నాటి నుంచి మన వరకూ జాతి జీవితం తిరిగిన మలుపుల గురించి కనీస జ్ఞానం కలిగి ఉండటం.

గతాన్ని గుర్తు చేసుకోకపోవడమే ఆరోగ్యానికి మంచిది అనుకునే జాతులూ ప్రపంచంలో లేకపోలేదు. ఉదాహరణకు ది గ్రేట్ బ్రిటన్ లాంటి గొప్ప దేశాల్లో శతాబ్దాల కింద ఘనత వహించిన కొన్ని వంశాలకు మూల పురుషులు పూర్వాశ్రమంలో బందిపోట్లు! బహు ఘోరాలు

చేసిన నేరగాళ్లు! ఇవాళ ప్రపంచానికి పెద్దన్న, నాగరికతకు పరాకాష్ఠ అని పేరుపడ్డ అమెరికాలో సోకాల్డ్ నాగరికత ఎలా మొదలైందో... అనాదిగా అక్కడ జీవిస్తూ వచ్చిన లక్షలాది ఆదివాసులను ఎంత క్రూరంగా, అమానుషంగా చంపేసి ఆ దేశాన్ని దొరలు ఆక్రమించుకున్నారో తెలిస్తే మనిషన్న వాడికి అన్నం సయించదు. అటువంటి భయంకర గతాలను మరచిపోవడమే మేలని ఆయా దేశాల వారు అనుకోవడం సహజమే. తాము ఎటువంటి క్రూరాత్ములకు వారసులో వారు పనిగట్టుకుని స్మరించనవసరం లేదు కూడా.

కాని – భారతీయుల వారసత్వం అలాంటిది కాదు. సిగ్గుపడవలసిన గతం ఈ దేశానికి లేదు. ప్రపంచంలో మరే జాతికీ లేనంతటి ఘనమైన చరిత్ర మనకు ఉంది. ప్రపంచంలో మరెక్కడా లేనంతటి గొప్ప సంస్కృతి, ఉత్కృష్ట నాగరికత బహు ప్రాచీన కాలంలోనే – ఇప్పటి అనేక నాగరిక దేశాలు అటవిక దశలో మగ్గిన కాలంలోనే – ఈ దేశంలో విలసిల్లాయి. మన దేశం ప్రపంచానికి నాగరికత భిక్ష పెట్టింది. ఆలోచించడం ఎలాగో నేర్పింది. కళలను, విజ్ఞానాన్ని ప్రసాదించింది. శాస్త్రీయ దృష్టిని, సత్యాన్వేషణ పద్ధతిని అలవరచింది. సంకుచితత్వపు మాయ తెరలను చీల్చి అనేకత్వంలో ఏకత్వాన్ని దర్శించే సంస్కారాన్ని పరిచయం చేసింది. భరతఖండంలో ఆవిర్భవించిన ఆర్యసంస్కృతే అనేక దశల్లో అనేక దేశాలకు అతి ప్రాచీన కాలంలో విస్తరించి అనేక రూపాల్లో ప్రపంచమంతటా పరిమళించింది.

ఇది కళ్లు తెరిస్తే కనిపించే వాస్తవం. ఇందుకు రుజువులు, శాస్త్రీయ సాక్ష్యాలూ, ఆధారాలూ ఆధునిక కాలంలో కావలసినన్ని వెల్లడయ్యాయి. మన ఉజ్వల వారసత్వానికి ఆనందంతో ఉప్పొంగవలసిందిపోయి ఆధునికులమైన మనం మాత్రం కళ్లు గట్టిగా మూసేసుకుని.. మన మాజీ పాలకులు వారి స్వార్థం కోసం అనేక తరాల తరబడి నూరిపోసిన అబద్ధాలనే నెమరువేసుకుంటూ... ఆర్యులు విదేశీయులనీ ఎక్కడి నుంచో దండయాత్రలు చేసి ఈ దేశాన్ని దౌర్జన్యంగా ఆక్రమించి తమ అజ్ఞానాన్ని, మతమౌఢ్యాన్ని అందరిమీదా రుద్దారనీ తెల్లదొరలు ఆడిన కల్లలను, మతమౌఢ్యంతో రాసిన రాతలను శాశ్వత సత్యాలుగా ఈనాటికీ నమ్ముతున్నాం. మన చరిత్రను దుర్బుద్ధితో భ్రష్టుపట్టించిన విదేశీయుల పీడ విరగడ అయ్యాక కూడా వారు భ్రష్టుపట్టించిందే అసలైన చరిత్ర అని మనం అమాయకంగా భ్రమిస్తున్నాం.

వేల సంవత్సరాల నాగరికత గల ఈ ప్రాచీన దేశానికి తనదంటూ ఒక విలక్షణ చరిత్ర ఉన్నదన్న వాస్తవాన్నే మన చరిత్ర పాఠ్యగ్రంథాలు గుర్తించవు. అనేక తరాలుగా పాఠ్య పుస్తకాల్లో మనం చదివిందీ, మన పిల్లలను చదివిస్తున్నదీ దురాక్రమణదారుల చరిత్ర. పారశీకులు, గ్రీకులు, కుషాన్లు, శ్వేతహూణులు, అరబ్బులు, తురుష్కులు, మొగలులు, ఆఫ్ఘాన్లు, పోర్చుగీసువారు, డచ్చివారు, ఫ్రెంచివారు, ఆంగ్లేయులు... ఇలా ఒకరి తరవాత ఒకరు బయటి నుంచి దాడిచేసి, స్వల్పకాలమో దీర్ఘకాలమో సాగించిన ఆధిపత్యాల పరంపరలే చరిత్ర గ్రంథాల నిండా కనపడతాయి. అతి ప్రాచీన నాగరికతకు కర్తలైన ఆర్యులను సైతం ఈ దేశస్థులుగా గుర్తించకుండా విదేశీయుల పద్దులో చేర్చి, ఆది దండయాత్రకు వారినే పీటల మీద కూచోబెట్టటంతో ఒరిజినల్ చరిత్ర అనేది మన దేశానికి లేకుండాపోయింది. తనకంటూ ఒక సమాజంగాని, సంస్కృతిగాని లేక ఈ దేశం ఒక మహాశూన్యమైనట్టూ... ఎవరు ముందు, ఎవరు వెనక అన్న తేడాయే తప్ప ఇక్కడ రాజ్యాలేలిన అందరూ విదేశీయులే అయినట్టూ చిత్రించడం శతాబ్దాల పర్యంతం మనలను అణచిపెట్టి పెత్తనం చెలాయించిన విదేశీ జాతుల స్వార్థ ప్రయోజనాలకు అవసరమైందంటే అర్థం చేసుకోవచ్చు. తాము కాళ్లతో

తొక్కేసిన జాతికి గొప్ప చరిత్ర, ఘన సంస్కృతి ఉన్నాయని ఒప్పుకుంటే పాలితులు ఎక్కడ తెలివిమీరి తమకే ఎదురు తిరుగుతున్నారోనన్న భయంతో వారి ఆత్మగౌరవాన్ని హరించి న్యూనతా భావాన్ని పెంపొందించేందుకు విదేశీ పాలకులు సర్వవిధాల యత్నించడం సహజమే. సంకెళ్లు తెగిన అర్ధశతాబ్దం తరవాత కూడా అదే ఆత్మన్యూనతా భావంలో మేధావి వర్గాలు కొట్టుమిట్టాడుతూ విదేశీయులు తగిలించిపోయిన అబద్ధాల రంగుటద్దాల నుంచే జాతి చరిత్రను అవలోకించడమే విడ్డూరం.

భారతదేశం ఒక నానాజాతి సమితి. నిరంతరం జాతుల సంఘర్షణే తప్ప జాతీయతా భావం మునుపెన్నడూ లేదు. ఏ గ్రామానికా గ్రామం ఏ మండలానికా మండలం దేనికదేగా బతుకుతూ దేశం ఏమైనా పట్టించుకునేది కాదు. తమకు వెలుపల ఏమి జరుగుతోంది, పై స్థాయిలో రాజ్యాన్ని ఎవరు పాలిస్తున్నారు, బయటి నుంచి ఎవరు వచ్చి రాజ్యాన్ని ఆక్రమిస్తున్నారు అన్న సంగతే జనం గమనించేవారు కాదు. ముస్లిం ప్రభువుల కాలంలో, ముఖ్యంగా మొగల్ సామ్రాజ్యంలోనే మొత్తం దేశం దాదాపుగా ఏకచ్ఛత్రాధిపత్యం కిందికి వచ్చి జాతీయ ప్రభుత్వమనేది ఏర్పడింది. పాపం, ముస్లిం ప్రభువులు కష్టపడి దేశమంతటా ఏకీకృత పాలనా వ్యవస్థను ప్రవేశపెట్టాక, బ్రిటిష్ వారు శ్రమ అనుకోకుండా ఆ దివిటీని అందిపుచ్చుకుని మరింత ముందుకు తీసుకెళ్లారు. కనుక జాతీయ భావం అనేది భారతీయులకు విదేశీయులు పెట్టిన బిక్ష! ఇదీ – మధ్యయుగంలో మహమ్మదీయ ఆస్థాన రచయితలూ; అనంతరం ఆంగ్లేయ మేధావి వర్గం పనిగట్టుకుని పరి పరి విధాల సాగించిన ప్రచారం. భారతదేశ ప్రాచీన వైభవం గురించి, అనేక హిందూ రాజవంశాల, వాటి చక్రవర్తుల విఖ్యాతి గురించి ప్రాథమిక అవగాహన ఉన్నవారెవరికైనా ఇది పచ్చి అబద్ధమని తెలుసు. 11వ శతాబ్దం మొదట్లో గజనీ మహమ్మద్ దండయాత్రను పంజాబ్‌లో షాహీ రాజులు ఎదుర్కొన్న సమయంలోనే దేశంలో ఎక్కడెక్కడి ప్రాంతాల నుంచో ప్రజలు సంఘీభావం చూపి యుద్ధనిధికి యథాశక్తిగా విరాళాలు పంపారని అప్పటి పర్షియన్ చరిత్రకారులే అంగీకరించారు. 12వ శతాబ్దంలో ఘోరీ మహమ్మద్‌తో యుద్ధంలో 150 రాజ్యాల రాకుమారులు పృథ్వీరాజ్‌కు బాసటగా కదనానికి కదిలి వెళ్ళారనీ శత్రుపక్షం వారే రాశారు.

మన జాతీయతకు, సంఘీభావానికి ఇంతకుమించిన దృష్టాంతాలు అక్కర్లేదు. అయినా దురదృష్టవశాత్తూ అనంతర కాలంలో గోబెల్స్ తరహాలో విదేశీయులు సాగించిన దుష్ప్రచారం జాతీయవాదులు అనుకునే మన మేధావుల్లో సైతం చాలా మందికి బ్రెయిన్‌వాష్ చేసింది. బ్రిటీష్ యూనివర్సిటీల్లో చదివి చదివి, ఆంగ్లేయ సంపర్కం పెరిగి పెరిగి చివరికి వారు కూడా విదేశీయుల మూసలోనే ఆలోచించ సాగారు. అంతకుపూర్వం దేశంలో జాతీయ భావం లేదంటే... తెల్లవారితో వీరోచితంగా కదు సమర్థంగా పోరాడుతున్న తమ ప్రయోజకత్వం వల్లే జాతీయోద్యమమనేది తొలిసారిగా ఆవిర్భవించిందంటే.. వారికీ గర్వకారణమే కదా? బహుశా అందుకే కాబోలు జాతీయ నేతల్లోనూ పలువురు దొరలు చులకన చేసిన హిందూ సంస్కృతిని, హిందూ గత వైభవాన్ని, సనాతన హిందూ విలువలను కీర్తించి దొరల లోకంలో అపకీర్తిని తెచ్చుకోకుండా జాగ్రత్తపడి... పాత అంతా రోత అన్న విదేశీ రాగానికి వంతపాడి... ఆధునికత పేరిట విదేశీయుల అజ్ఞానాన్ని పుణికి పుచ్చుకున్నారు.

ఇది చాలదన్నట్టు మైనారిటీ జంజాటమొకటి వచ్చి పడింది. బ్రిటిష్ వారు విభజించి

పాలించాలని చూస్తున్నారు కనుక వారిని సమర్థంగా ఎదుర్కొనాలంటే హిందూ - ముస్లిం సమైక్యతతో ఉమ్మడి పోరాటం అవసరమని మన జాతీయ నాయకులు సరిగానే ఆలోచించారు. కాని - దేశంలోని ముస్లింలను విదేశీ దురాక్రమణదారుల చేతిలో హిందువుల్లాగే నానా యాతనలుపడ్డ సహ బాధితుల్లా చూడకుండా విదేశీ దురాక్రమణ దారుల వారసుల్లా పరిగణించడం వారు చేసిన పెద్ద తప్పు. మెడమీద కత్తిపెట్టి మతం మారతావా చస్తావా అంటే ప్రాణం మీద తీపితో విధిలేక తలవంచిన వారి సంతతే భారతీయ ముస్లింల్లో అధిక సంఖ్యాకులు. బలవంతంగానో, ఇష్టంతోనో ఇస్లాంను స్వీకరించిన తరవాత కూడా మధ్యయుగంలో వారి పూర్వీకులు గొప్ప సమానత్వం అనుభవించిందీ లేదు. బయటి దేశాల నుంచి నేరుగా ఊడిపడ్డ అఫ్ఘాన్లు, మొగలులు, వారి రక్తసంబంధీకులే కల్తీలేని ఘరానా ముస్లింలైనట్టూ, కొత్తగా ఇస్లాం స్వీకరించిన భారతీయులు తక్కువ రకం వారయినట్టూ దుర్విచక్షణ చూపి ప్రభుత్వంలో పెద్ద పదవులు, హోదాలు, రాయితీలూ విదేశీ ముస్లింలే ఎక్కువగా అనుభవించారు.

ఎన్ని తరాల కింద ఏ పరిస్థితుల్లో మతం మారారు, ఏమి సుఖపడ్డారు అన్న సంగతి అలా ఉంచితే 20వ శతాబ్దం నాటికి దేశంలోని ముస్లింల జీవన స్థితిగతులు హిందువులలాగే దుర్భరంగా ఉన్నాయి. వీరిలాగే వారూ భయానక ఆర్థిక, సామాజిక పీడనలో సమానంగా కష్టాలు పడుతున్నారు. ముస్లింలనూ హిందువుల సోదరులుగా, ఒకే ఉమ్మడి వారసత్వం కలిగి, కష్టసుఖాలను కలిసి పంచుకుంటున్న వారిలా, వెయ్యేళ్లకు పైగా సాగిన విదేశీ దురాక్రమణల సమాన బాధితుల్లా పరిగణించి జాతీయ సంఘీభావాన్ని పెంపొందించి ఉంటే నిజమైన మత సఖ్యత సాధ్యమయ్యేది. మన నేతలు ఈ రాజమార్గాన్ని వదిలి భారతీయ ముస్లింలను తుగ్లక్‌లూ ఖిల్జీలూ ఔరంగజేబుల డైరక్టు వారసుల్లా చూసి ఆ విదేశీ ముష్కరులను ఏమైనా అంటే మన ముస్లిం సోదరుల మనసులు ఎక్కడ బాధపడతాయోనని తగని ఆరాటం ప్రదర్శించటంతో హిందూ - ముస్లిం సమైక్యతకు తీవ్ర విఘాతం కలిగింది. జాతీయోద్యమం నిరంతర ఉద్రిక్తతలతో కుంటుతూనే సాగింది. ముస్లిం సోదరులకు గొప్ప ఉపకారం చేస్తున్నామనుకుని మన నాయకులు అవలంబించిన వైఖరే ముస్లింల విశాల ప్రయోజనాలకు, దేశ శ్రేయస్సుకు శాపమైంది. భారతీయ ముస్లింలకు మనస్తాపం కలగనీయరాదన్న ఆత్రంతో మధ్యయుగాల మహమ్మదీయ దురాక్రమణదారులు, ముస్లిం దుష్టపాలకులు సాగించిన ఘాతుకాలను, జాతికి చేసిన చెరుపును ఉపేక్షించి, అసలు అటువంటి అఘాయిత్యాలే పెద్దగా జరగలేదని, జరిగినా ఆయా వ్యక్తుల క్రౌర్యం, కుటిలత్వాలే వాటికి కారణం తప్ప మతతత్వానికి ఎలాంటి సంబంధం లేదని జాతీయ వాదులమని చెప్పుకున్న మేధావులు వాదించసాగారు. హిందూ మతంలోని కుల వ్యవస్థ, అస్పృశ్యత, సామాజిక పీడనల వల్లే బాధిత ప్రజలు ఇష్టాపూర్తిగా ఇస్లాం శరణు జొచ్చారనీ, ముస్లింలు హిందూ దేవాలయాలను ఎక్కడైనా ఎప్పుడైనా ధ్వంసం చేసినట్టే - అంతకుముందు హిందువులూ బౌద్ధ, జైన దేవాలయాలను నాశనం చేశారనీ గజనీ మహ్మద్, ఔరంగజేబుల తరఫున వకల్తా తీసుకున్నట్టు మాట్లాడారు. జాతీయ వాదులనుకునే పెద్దలే ఈ రకమైన వాదనను సమర్థించటంతో క్రమేణా ఇదే పుస్తకాలకెక్కి, అసలు చరిత్రను వక్రీకరించి, అనేక తరాల బుర్రలను ఖరాబు చేసింది. దీన్ని వివరించాలంటే పెద్ద గ్రంథమవుతుంది.

11వ శతాబ్దంలో గజనీ మహ్మద్ ఘోరాలు మొదలుకుని 18వ శతాబ్దంలో మొగలు

సామ్రాజ్య పతనం దాకా ఏడు శతాబ్దాల పర్యంతం తెరపి లేకుండా సాగిన మహమ్మదీయ దురాక్రమణలను మన దేశ ప్రజలు ఏనాడూ సమర్థించలేదు. ప్రాణాలకు తెగించి సర్వస్వం ఒడ్డి తిరగబడటం ఏనాడూ మానలేదు. విదేశీ తురుష్క పాలకులను భారతీయులుగా ఈ దేశస్థులు ఎప్పుడూ గుర్తించలేదు. చిత్రహింసలు పెట్టినా చిత్రవధ చేసినా ఊళ్లమీద పడి ఇళ్ళనూ, ఇల్లాళ్ళనూ ఆగం చేసినా, ఎన్ని అమానుష ఆంక్షలు విధించినా, బతుకునెంత నరకం చేసినా ఈ జాతి దౌర్జన్యానికి తలవంచలేదు.

ఇండియాలో మహమ్మదీయులు ప్రపంచంలో మరే ముస్లిం రాజ్యంలోనూ లేనంత పెద్ద సంఖ్యలో ఉన్న మాట యథార్థం. కాని మొత్తం దేశం ఇస్లాం మతాన్ని ఎప్పుడూ స్వీకరించలేదు. ఈజిప్టు, ఉత్తర ఆఫ్రికా, ఆసియా మైనర్, పర్షియా, మధ్య ఆసియాలాంటి ప్రాంతాలు, రాజ్యాలు శతాబ్దాల ఇస్లామిక్ దాడిలో పూర్వ అస్తిత్వాన్ని పూర్తిగా కోల్పోయి నూరుశాతం ముస్లిం దేశాలు అయిపోయాయి. భారతదేశం మాత్రం దురాక్రమణలను, దాష్టీకాలను ధైర్యంగా తట్టుకుని కొండలా నిలిచింది. మహావీరులు, శూరులు అనుకున్న రాజపుత్రులే తోకముడిచి అక్బర్ మాయలో పడి మొగలుల పంచన చేరిన దశలోనూ.... హిందూ ధర్మరక్షకులని అనుకున్న కాకతీయ, కొండవీడు, విజయనగరం వంటి మహాసామ్రాజ్యాలే సర్వనాశనమైన ఆపత్కాలంలో కూడా ప్రజలు బేజారై విదేశీ ముష్కరులకు పాదాక్రాంతం కాలేదు. ఔరంగజేబు హయాంలో మొగల్‌సామ్రాజ్యం యావద్భారతాన్నీ ఆక్రమించిందనుకున్న సమయంలోనూ దక్షిణ భారతం నామమాత్రపు విధేయతే తప్ప మొగలుల రాజకీయ నియంత్రణకు లోబడలేదు. ఇండియాలోకెల్లా పెద్ద ముస్లిం సంస్థానమైన హైదరాబాద్‌లో ముస్లింల సంఖ్య మొత్తం జనాభాలో ఏనాడూ 10 శాతానికి మించలేదు. అలాగే మధ్యభారతంలో ముస్లిం జనాభా ఎప్పుడూ 4 శాతం లోపే. హిందువుల్లో జాతీయ భావం లేకపోతే, సామాజికంగా మతపరంగా వారు సంఘటితమై పట్టుదలతో పోరాడి ఉండకపోతే ఇస్లాం ప్రచండ వ్యాప్తిని ఎదిరించి ఇంత నిబ్బరంగా నిలవటం సాధ్యమయ్యేది కాదు.

ఇస్లామిక్ రాజ్యంలో ముస్లింలు కానివారిని జిమ్మీలని పిలుస్తారు. వారి మతంలోవారిని కొనసాగనిచ్చినందుకుగాను జిజియా పన్నును ఆరొందల ఏళ్ల మధ్యయుగ చరిత్రలో హిందువుల గోళ్లూడగొట్టి ఎంతో మంది సుల్తాన్లు వసూలు చేశారు. ఆ పన్ను చెల్లింపునకూ ఒక పద్ధతి ఉంది. వేరేవారితో పంపడానికి వీలులేదు. ఎవరి పన్నును వారే వెళ్లి సంబంధిత అధికారికి సమర్పించుకుని స్వీకరించమని సవినయంగా ప్రార్థించాలి. కరవులే రానీ కాటకాలే రానీ ఈ పన్నుకు మాత్రం మినహాయింపు ఇవ్వడానికి ఔరంగజేబులు సమ్మతించేవారు కాదు. వారి ఉనికిని సహించినందుకు మూల్యంగా జిజియా పన్ను మోదడమేగాక ముస్లిమేతరులపై ఇస్లామిక్ ప్రభువులు తమ మత నిబంధన ప్రకారం రకరకాల ఆంక్షలు విధించేవారు. మచ్చుకు వాటిలో కొన్ని:

1. కొత్త ప్రార్థనా స్థలాలేవీ కట్టరాదు. 2. ముస్లింలు ధ్వంసం చేసిన పాత దేవాలయాలను పునరుద్ధరించరాదు. 3. ముస్లిం యాత్రికులను తమ ప్రార్థనా స్థలాల్లో బసచేయనివ్వాలి. 4. ఏ ముస్లిం అయినా వారి ఇంట్లో ఉంటానంటే మూడు రోజులు ఆతిథ్యం ఇవ్వాలి. జబ్బుపడితే ఇంకా ఎక్కువ రోజులు ఉండనివ్వాలి. 5 ప్రతి ముస్లిం పట్ల గౌరవం చూపాలి. 6. తమ ప్రైవేటు సమావేశాల్లోకి ముస్లింలను హాజరు కానివ్వాలి. 7. మహమ్మదీయుల్లా

దుస్తులు వేసుకోకూడదు. 8. చూడగానే వారు తక్కువ రకం హోదా అని తెలిసేలా వారి దుస్తులు ఉండాలి. 9. ముస్లిం పేర్లు పెట్టుకోకూడదు. 10. జీను, కళ్లెం వేసుకుని గుర్రంమీద తిరగకూడదు. 11. ఆయుధాలు పట్టకూడదు. వేళ్ళకు ముద్రికలు, ఉంగరాలు ధరించరాదు. 12. వారి ఆచారాలను, ఆనవాయితీలను ముస్లింల్లో ప్రచారం చేయరాదు. 13. ముస్లింల నివాస ప్రాంతంలో వారు ఇళ్లు కట్టుకోకూడదు. 14. తమ మతాచారాలను వారు బహిరంగంగా ఆచరించకూడదు. బంధువులు మరణిస్తే బిగ్గరగా ఏడవకూడదు.

ఇటువంటి కుంగదీసే ఆంక్షల అదకత్తెరలో నిత్యం నలుగుతూ... ఎప్పుడు ఏ ముష్కరుల దండు విరుచుకుపడి ఇళ్లు లూటీచేసి, స్త్రీలను చెరచి, అడ్డొచ్చిన వారిని నరికేస్తుందోనని హడలిపోతూ..... హిందువులు కావడం పెద్ద అనర్థత అయిపోయిందని అనుదినం ఆవేదన పడుతూ... మతం మారితే చాలు ఆంక్షల అడ్డంకులు అన్నీ తొలగుతాయన్న ప్రలోభాలను తట్టుకుంటూ కోట్లాదిప్రజలు తమ ప్రత్యేక ఉనికిని నిలుపుకొన్నారంటే వారి ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఎలా కొనియాడాలి? అంతు అదుపు లేకుండా అనేక శతాబ్దాలు చెలరేగిన దురాగతాల్లో వారు మానసికంగా ఎటువంటి రంపపు కోత అనుభవించి ఉండాలి? ఎగియన్, మెసపోటోమియన్, అస్సీరియన్, అక్కాడియాన్ లాంటి ప్రాచీన సంస్కృతులెన్నో ఆనవాళ్లు మిగలకుండా కాలగర్భంలో కొట్టుకుపోగా ప్రపంచంలో ఒక్క ఆర్య సంస్కృతి మాత్రమే అనేక సహస్రాబ్దాల పర్యంతం దాడులకు, దురాక్రమణలకు, ప్రభువుల నిరాదరణకు, నిరంతరం వేధింపులకు గురిఅవుతూ కూడా నిశ్చలంగా, చెక్కుచెదరక కాలపరీక్షలో నిలిచింది. అంతటి ఘనమైన సంస్కృతికి తాము వారసులైనందుకు ఈ దేశవాసులందరూ మతభేదాలకు అతీతంగా గర్వించవద్దా? కత్తుల వంతెనపై నడిచి అడుగడుగునా రక్తం ధారపోసి కష్టనష్టాలకోర్చి ఈ సంస్కృతిని, ప్రత్యేక అస్తిత్వాన్ని కాపాడుకున్న మన పూర్వీకులను తలచుకుంటే హృదయం కృతజ్ఞతతో బరువెక్కవద్దా? వందనీయులైన అలాంటి పూర్వులను మూర్ఖులనీ, అజ్ఞానులనీ చులకన చేసి వారిని అష్టకష్టాలు పెట్టిన దుష్టపాలకులనేమో సౌమ్యులు, విశాల హృదయులు, ధర్మప్రభువులు అని నెత్తిన పెట్టుకుంటున్నామంటే దీనికి మించిన కృతఘ్నత మరొకటి ఉంటుందా?ప్రాచీన దేవాలయాలను, కళాత్మకమైన కట్టడాలను, పురాతన విశ్వవిద్యాలయాలను కిరాతకంగా కూల్చిన తాలిబన్ల తాతపాదులను 'సహృదయులు, కళాపోషకులు, గొప్ప నిర్మాణాలు చేసిన మహనీయులు' అని పాఠ్య గ్రంథాల్లో ఇంకా నేర్పిస్తున్నామంటే భావితరాల బుర్రలోకి మనం చొప్పించేది చదువా? విషమా?

అల్లెస్ హెయిలీ అనే అమెరికన్ రచయిత రాసిన రూట్స్ (***Roots***) నవలను మన దేశంలో లక్షలాది మంది ఇష్టంగా చదివారు. ('**ఏడు తరాలు**' పేరిట ఇది తెలుగులో కూడా వచ్చింది.) తన వంశవృక్షాన్ని తెలుసుకోగోరి తండ్రి తాతల నుంచి ముత్తాతల ముత్తాతల వరకూ ఏడు తరాల వెనక్కి సాగించిన అన్వేషణ ఆ కథ. తన పూర్వులు ఒకప్పుడు ఆఫ్రికాలో కొండజాతి తెగలో స్వతంత్రంగా తలెత్తుకుని ఎంత పరువుగా బతికారో... వారిని విదేశీ ఏజంట్లు,మాటువేసి బలవంతంగా ఎత్తుకుపోయి, ఓడలో రహస్యంగా అమెరికా తీసుకుపోయి బానిసలుగా ఎలా అమ్మారో.. అనేక తరాల బానిస బతుకులో తన వెనుక తరాల వారు ఎన్ని అగచాట్లుపడి ఎంత క్షోభ అనుభవించారో ఆ రచయిత కళ్లకు కట్టేలా వర్ణిస్తే చదివిన మనం గుండెలు పిండినట్టుగా బాధపడ్డాం. మంచిదే. ఎవరి పూర్వీకులైతేనేం తోటి మానవుల యాతనకు స్పందించే మానవత్వం అందరికీ ఉండాల్సిందే.

కాని – అల్లస్ హెయిలీ వంశంకంటే ఘోరమైన నరక యాతనలు అనుభవించిన మన పూర్వుల మాటేమిటి? హెయిలీ అన్వేషణలో తెలియవచ్చిన బానిసత్వం కంటే ఈ దేశంలో కొన్ని వందల సంవత్సరాల్లో లక్షల, కోట్ల జనాన్ని నుగ్గునూచ చేసిన బానిసత్వం వెయ్యిరెట్లు క్రూరం. అఫ్గానిస్తాన్ నుంచో, దానికి ఆవలి నుంచో తెరలు తెరలుగా దండయాత్రలు చేసిన మహమ్మద్‌బిన్ కాసిం, గజనీ మహ్మద్, మహమ్మద్ ఘోరీ, తైమూర్‌లాంటి నరపిశాచాలు భారతదేశంలో పల్లెలూ పట్నాలపై పడి చంపినవారిని చంపగా మిగిలినవారిలో తమకు బుద్ధిపుట్టినవారిని ముఖ్యంగా స్త్రీలను, పిల్లలను వేల సంఖ్యలో బందీలుగా పట్టుకునేవారు. దొరికినంతలో నాణ్యమైన 'శాల్తీ'లను సుల్తాన్ సేవకు, ఆయన ఆప్తుల భోగానికి ఎంచుకోగా మిగిలిన జనాన్ని సైనికులు పంచేసుకునే వారు. సైనికులు ఎవరికి చిక్కిన మనుషుల్ని వారు బానిసలుగా ఉంచేసుకోవచ్చునని కొంత మంది దయగల ప్రభువులు ఆనతిచ్చేవారు. ఇలా ఒకసారి హిందుస్తాన్ మీదికి దండయాత్ర చేసి మరలి వెళ్ళేసరికి లక్షల సంఖ్యలో బందీలు జమ అయ్యేవారు. ఒక్కో సైనికుడి వాటాకూ నలుగురో ఐదుగురో బానిసలు వస్తే అందరినీ ఏమి చేసుకుంటారు? తిండి ఎక్కణ్ణించి పెడతారు? అందుకని అక్కర్లేని బందీలని మార్కెట్లో బానిసలుగా అమ్మేవారు. సుల్తాన్‌గారు తిరిగొస్తున్నారని తెలియగానే బానిస వ్యాపారులు ఆవురావురుమంటూ మూగేవారు. హిందుస్తాన్ నుంచి లాక్కొచ్చిన కులస్త్రీలను, పరువుగా బతికిన అభిమానవంతులను పశువుల్లా సంతలో నిలబెడితే శరీర భాగాలను తడిమి చూసుకుని ఒంటినిబట్టి రేటును కట్టి కామందులు ఇళ్లకు తోలుకెళ్లేవారు. ఒక్కోసారి మార్కెట్లో సరుకు దిగుబడి మరీ ఎక్కువై కాందహార్, ఘజనీలాంటి మార్కెట్లలో బానిసల ధరలు దారుణంగా పడిపోయాయనీ, పట్టుకొచ్చిన బానిసలను లెక్క పెట్టిపెట్టి చేతులు నొప్పి పుట్టాయని 11వ శతాబ్దంనాటి పర్షియన్ చరిత్రకారులు రాశారు. ఇదేదో తొలినాళ్ల విదేశీయుల దండయాత్రల్లో మాత్రమే జరిగిందనీ, దేశంలో మహమ్మదీయ పాలన కుదురుకున్నాక బానిసత్వం బాధ తప్పిందని అనుకోవడానికీ వీలులేదు. ఘనత వహించిన మొగల్ సామ్రాజ్యం వేళ్లూనిన తరవాత 'చల్లని ప్రభువు' జహంగీర్ హయాంలోనూ పాదుషాగారు తన వేట కింద గిరి గీయించిన వర్తులం లోపల నివసించే జంతువులు, మనుషులు సర్కారు వారి ఆస్తిగా పరిగణించబడేవారని, జంతువుల్ని కోసుకు తిని మనుషుల్నేమో బానిసల కింద అమ్మేసేవారని ఆ కాలపు చరిత్రకారులు రాశారు. ఒక హిందూ రాజ్యం మీద యుద్ధానికి వెళ్ళారంటే వేలాది అభాగ్య జనాన్ని బానిసలుగా పట్టుకొచ్చి, అయినకాడికి సంతలో తెగనమ్మగా మిగిలిపోయినవారిని రాజాస్థానంలో చాకిరీకి, రాజపురుషుల కామపైత్యాలు తీర్చడానికి వాడుకునేవారు. బానిసల జనాభా మరీ పెరిగిపోయిందనుకుంటే పరపరా తలలు నరికేసి ఎక్సెస్ బరువు తగ్గించుకునేవారు.

"During the Sultanate, whenever the slaves under the Mohammedan feudal chieftain became too numerous the heads of these servants were cut off without mercy and were made into heaps in front of the darbar" *(ఢిల్లీ సుల్తాన్ల హయాంలో బానిసల సంఖ్య మరీ పెరిగితే నిర్దయంగా తలలు నరికేసి దర్బారు ఎదుట గుట్టలు పోసేవారు)* అని సుప్రసిద్ధ చరిత్రకారుడు **డి.డి.కోశాంబి** ***Introduction to the Study of Indian History*** లో రాశారు. ఢిల్లీ మీదికి యుద్ధానికి పోబోతూ బందీల బాదరబందీ జాస్తి అయినందున కొన్ని గంటల్లో లక్ష మందిని చంపించానని స్వయంగా

రాసుకున్న తైమూర్ ఘనత సరేసరి.

ఈ ప్రకారం వందల సంవత్సరాల్లో దజన్లకొద్దీ తరాల్లో ఈ దేశంలో పరువుగల కుటుంబీకులు అనేక లక్షల మంది దురాక్రమణదారుల చేజిక్కి పశువుల్లా అమ్ముడై అడ్డమైనవారికీ అడ్డమైన ఊడిగం చేస్తూ సిగ్గుతో చితికి, మనసు చంపుకుని దారుణ దురవస్థల పాలయ్యారంటే జాతి జనులకు పట్టిన ఆ ఘోర కలిని తలచుకుని మనం కనీసం ఒక కన్నీటిబొట్టు విడవవద్దా? వారంతా తరవాత ఏమయ్యారోనని ఆలోచించవద్దా? కనీస సానుతాపం కూడా చూపకుండా అసలు అలాంటి ఘోరాలే జరగనట్టు, అనేక శతాబ్దాల ముస్లిం పాలనలో అక్కడక్కడ అఘాయిత్యాలు మినహా మొత్తం మీద ప్రజా జీవితమంతా హాయిగా, ప్రశాంతంగా సాగినట్టు మనం పుస్తకాల్లో చదువుకుంటూ....ప్రజా పీడకులనే జాతి గర్వించదగ్గ పూర్వీకులలా, ఆధునిక జాతీయతకు ప్రోదిచేసిన మూలపురుషులుగా సంభావించుకుంటున్నామంటే మనకుగల చరిత్ర జ్ఞానం ఎలాంటిది? మనం చెప్పుకుంటున్న జాతీయత ఏపాటిది? జాతీయ వీరులను చిల్లర తిరుగుబాటుదారులుగా, జాతీయ క్రూరులనేమో మానవీయ మహా పురుషులుగా భ్రమపడేటప్పుడు దేశభక్తి, జాతీయ భావం, జాతీయ పౌరుషం వంటి ఉత్తమ లక్షణాలు భావి తరాలకు ఎలా అబ్బుతాయి? గతం గురించే మన అవగాహన ఇంతవంకర టింకరగా ఉన్నప్పుడు... గత పరిణామాల పర్యవసానమైన సంక్లిష్ట సమస్యల వర్తమానం ఎలా అర్థమవుతుంది? జాతి భవిష్యత్తుకు మంచి దారి ఎలా కనపడుతుంది? చరిత్ర అనేది జాతి జనులందరికీ స్ఫూర్తినిచ్చి ముందుకు నడిపించాల్సిన శక్తా; లేక హిస్టరీ మాస్టర్లకు, పాఠ్య పుస్తకాల రచయితలకు, సిలబస్ రాయించే ప్రభుత్వ సంస్థలకూ, వాటిని నియంత్రించే ప్రభుత్వానికీ, రాజకీయ పార్టీలకు మాత్రమే పరిమితమైన వాదులాట వ్యవహారమా?

ఈ రకమైన ఆలోచనాధారే ఈ గ్రంథ రచనను పురికొల్పింది. ఎన్.సి.ఇ.ఆర్.టి. కరిక్యులంలో చరిత్ర పాఠాల మార్పుచేర్పులకు సంబంధించి కొంతకాలంగా రగులుతూ మేధావి వర్గాల్లో విస్తృతంగా నలుగుతున్న వివాదంలో కొసరు గొడవలు ముదరి అసలు విషయాలు అడుగునపడ్డ చందాన్ని గమనించాక జాతిచరిత్రను జాతీయ దృక్కోణం నుంచి మొత్తంగా తిరగరాయాల్సిన అవసరాన్ని రేఖామాత్రంగా చర్చించాలనిపించింది. హిందువులు, ముస్లింలు, ఇతరులు అన్న తేడా లేకుండా జాతి జనులందరూ ఆత్మ పరిశీలన చేసుకుని, ఉజ్వలమైన ఉమ్మడి వారసత్వానికి మానసికంగా దగ్గరై, నిండయిన దేశభక్తితో అన్నదమ్ముల్లా అంతా కలిసి ముందడుగు వేయగలగాలంటే చిరకాలంగా మనలో గూడు కట్టిన భ్రమల తెరలు, అవకాశవాద పోకడలు, పలాయన వైఖరులు తొలగాలన్న ప్రగాఢ కాంక్ష ఈ రచనకు భూమిక. చదువరుల ఆలోచనా విధానంలో ఏ కాస్త మార్పు తేగలిగినా ఈ చిరు ప్రయత్నం సఫలమైనట్టే.

అనుబంధం

తిరగరాయాల్సిన చరిత్ర

చరిత్ర గురించి, మానవ నాగరికత గురించి మన మెదళ్ళలో చిరకాలంగా పేరుకుపోయిన అభిప్రాయాల తుప్పును వదిలించగల మహా సంఘటన ఒకటి నిరుడు (2002) గుజరాత్‌లో జరిగింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీకి చెందిన సముద్ర శోధకుల బృందం గుజరాత్ తీరానికి 30 కిలోమీటర్ల దూరంలోని కాంబే సింధుశాఖ వద్ద కాలుష్య స్థాయిని కనిపెట్టటం కోసం సముద్ర గర్భాన్ని ఫోటోలు తీస్తే తలవని తలంపుగా కొన్ని అత్యద్భుత చిత్రాలు కెమెరాలకు చిక్కాయి. తేరిపార చూస్తే – ఒక మహానగరం అవశేషాలవి. 9 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్నాయి. తీర్చిదిద్దిన సువిశాల స్నానశాలలు, కళాత్మకమైన విశాల వేదికలు, భారీ ధాన్యాగారాలు, క్రమపద్ధతిలో అందంగా బారులుతీర్చి నిర్మించిన ఇళ్ళు, మురుగు పారుదలకు చక్కటి ఏర్పాట్లతో ఆ నగరం ఎంతో చూడముచ్చటగా ఉంది.

సముద్ర గర్భంలో ప్రాచీన నగరం బయటపడటమే గొప్ప. అంతకంటే పెద్ద విశేషమేమిటంటే చాయాచిత్రాల జాడలనుబట్టి సముద్రగర్భం నుంచి వెలికితీసిన కొయ్య శిలాజాన్ని హైదరాబాద్‌లోని ఎన్‌జిఆర్ఐ ప్రయోగశాలకు శాస్త్ర పరీక్ష నిమిత్తం పంపితే అది క్రీ.పూ. 7500 సంవత్సరాల కిందటిదని తేలింది. కాంబేలో కనపడిన స్నానశాలలు, వేదికలు, ఇళ్ళ అమరికలు, పౌరవసతులు అన్నీ గతంలో మొహంజోదారో, హరప్పాల్లో బయల్పడిన నాగరికతల్లో లాగే ఉన్నాయి. మొహంజోదారో నాగరికత క్రీ.పూ. 2500 నాటిదని చరిత్ర పండితులు కాల నిర్ణయం చేశారు కనుక కాంబేది కూడా ఆ కాలపు నాగరికతే కాబోలునని మొదట్లో అనుకున్నారు. కాని – కాదు. శిలాజాలు క్రీ.పూ. 7500 నాటివంటే సముద్రగర్భంలోని నగరం కూడా ఇంచుమించుగా ఆ కాలపుదే అయి ఉండాలి. క్రీ.పూ. 7500 అంటే ఇప్పటికి 9500 సంవత్సరాలకంటే వెనుకటి మాట! ఆ కాలంలోనే అంత అభివృద్ధి చెందిన నగరాన్ని నిర్మించగలిగారంటే ఆనాటికి భారతదేశంలో నాగరికత ఉచ్చస్థాయిలో వెలిగిపోతున్నదనే కదా అర్థం?

అదే నిజమైతే – ఇప్పటివరకూ హిస్టరీ, ఆంత్రోపాలజీ, సోషియాలజీ టెక్స్ట్ పుస్తకాల్లో మానవ నాగరికత పుట్టుక – పరిణామాల గురించి చెబుతున్నవి తప్పని ఒప్పుకుని మొత్తాన్నీ తిరగరాసుకోవాలి. క్రీ.పూ. 7500 నుంచి క్రీ.పూ. 5000 వరకూ కొత్త రాతియుగమని, నాగలిని కనుగొనడం, పొలం దున్నడం మొదలై అప్పుడప్పుడే కొంచెం కొంచెంగా నాగరికత నడక నేర్చిందని, క్రీ.పూ. 3100 ప్రాంతాల్లో సుమేరియన్లతోగాని మానవ నాగరికత బహుముఖంగా వికసించలేదని ఇంతకాలం మనం పెట్టుకున్న నమ్మకాలన్నిటికీ కాంబేలో కొత్త నిజాల ధాటికి అడుగు ఊడిపోయింది. ఇప్పటిదాకా మనం చరిత్ర పూర్వ యుగమని అనుకుంటున్న కాలంలోనే నాగరికత, లిపి, రాత అభివృద్ధి చెందిన దాఖలాలు ఇప్పుడు కానరావడంతో మానవ చరిత్ర ఆరంభాన్ని ఇక 4000 సంవత్సరాల వెనక్కి నడిపించవలసి ఉంటుంది. మానవ నాగరికత మెసొపటేమియాలో పుట్టి నైలునదీ లోయలో మెట్టి పశ్చిమాసియా మీదుగా సింధులోయలో ప్రవేశించిందన్న సాంప్రదాయక శాస్త్ర విశ్వాసానికి న్యాయంగా అయితే కాలం చెల్లాలి. కాంబే సింధుశాఖలో బయటపడ్డ నగరం నిజంగా క్రీ.పూ. 7500కు పూర్వపుదే అయితే ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రాచీన నగరం, ప్రపంచంలో కెల్లా అతి పురాతన నాగరికత ఇండియాలోనే విలసిల్లాయని నిఖిల లోకం ఒప్పుకుని తీరాలి.

నిజంగా క్రీ.పూ. 7500 నాటిదే అయితే – అని ఇక్కడ అంటున్నది. కాంబే తవ్వకాల్లో బయటపడ్డ నగరం అంత పురాతనమైనది కాకపోవచ్చునన్న అనుమానంతో కాదు. బయటి ప్రపంచానికి అబ్బురంగా ఉండొచ్చుకాని మనవరకూ ఇందులో విస్తుపోవలసింది ఏమీలేదు. ప్రస్తుత పాకిస్తాన్‌లో భాగమైన మెహర్‌గఢ్‌లో క్రీ.పూ. 6500 ఏళ్లనాటి హారప్పా నాగరికత అవశేషాలు చాలాకాలం కిందే బయటపడ్డాయి. క్రీ.పూ. 2500 నాటిదని లోకం అనుకుంటూ వచ్చిన హారప్పా నాగరికత అంతకు నాలుగువేల ఏళ్లకు పూర్వం క్రీ.పూ. 6500 నుంచే ప్రాచీన భారతంలో విరాజిల్లిందని విశదమైనప్పుడు ఆ ప్రాచీనత ఇంకో వెయ్యి సంవత్సరాలు వెనక్కి వెళ్లి క్రీ.పూ. 7500కు చేరిందంటే నమ్మశక్యం కానట్టు నిర్ఘాంతపోవలసిన పనిలేదు. ప్రపంచానికి నాగరికత నేర్పింది భారతదేశమేనని చిరకాలంగా మనకున్న విశ్వాసం శాస్త్రీయంగా కూడా నిర్ద్వంద్వంగా రుజువవనున్నందున అఖిల భారత ప్రజలు సంతోషంగా పండుగ చేసుకోవలసిన సందర్భమిది. క్రికెట్ స్కోర్లు, క్రైమ్‌న్యూసు, పాప్‌డాన్సులు, టీవీ మసాలాలు ఆకర్షించినట్టుగా ఇటువంటి సీరియస్ విషయాలు మనలో చాలా మందికి పట్టకపోవడం వేరే సంగతి.

అత్యధిక సంఖ్యాకులు విద్యాగంధం లేక దుర్భర దారిద్ర్యంలో అలమటించే దేశంలో చరిత్ర, ప్రాచీన నాగరికతల గురించి ఆలోచించే కోరిక, తీరిక సామాన్య జనబాహుళ్యానికి ఎలాగూ ఉండవు. వీటి గురించి మనసుపెట్టగలిగిందీ, వెలుగుచూసిన కొత్త వాస్తవాలకు స్పందించగలిగిందీ మేధావులూ, విద్యావంతులే మరి. చేదు నిజం చెప్పాలంటే వారి స్పందన అంతంత మాత్రమే.

దీనికీ బలమైన కారణం లేకపోలేదు.

మన దేశానికి రాజకీయ స్వాతంత్ర్యమైతే వచ్చింది గాని మేధోపరంగా మనకు బానిసబంధాలు ఈనాటికీ వదలలేదు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఇంగ్లీషు వారు తెచ్చి రుద్దిన వలస విద్యావిధానమే ఇంగ్లీషువారు మరలిపోయిన అర్ధశతాబ్దానికి కూడా

అరకొర మార్పులతో చలామణిలో ఉన్నది. ప్రాచీన భారత సంస్కృతిని, నాగరికతను తూష్ణీకరించి, వాటిపట్ల వైముఖ్యం, చులకనభావం భారతీయుల్లో కలిగించడం కోసం మెకాలేవంటివారు పథకం ప్రకారం వ్యాప్తి చేయించిన దుర్బోధలే చరిత్ర పుస్తకాల్లో నేటికీ తు.చ. తప్పక చోటుచేసుకున్నాయి. తెల్లవారు రాకపూర్వం ఇండియాలో ఉన్నదంతా మతమౌఢ్యపు గాఢాంధకారమని, ఆ గతాన్ని గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిదని తరాల తరబడి నూరిపోసిన పర్యవసానంగానే నేటికీ మన దేశంలో చాలా మంది మేధావులలో చాలామంది తలలపై బానిస మనస్తత్వం జడలు కట్టింది. మిగతా ప్రపంచమంతా ఆర్యుల దండయాత్ర వాదంలో పసలేదని ఏనాడో తోసిపుచ్చినా మన చరిత్ర పాఠ్యగ్రంథాలు మాత్రం ఆ కాలం చెల్లినవాదాన్నే నేటికీ విద్యార్థులకు నూరిపోస్తుండటం మానసిక బానిస బంధానికి మచ్చుతునక. కాంబే సింధుశాఖలో కనుగొన్న హరప్పా తరహా నగరం పదివేల సంవత్సరాల కిందటిది అయినపక్షంలో ఇప్పటివరకూ ఆర్యుల దండయాత్ర గురించి ప్రచారంలో ఉన్న అబద్ధపువాదం తుత్తునియలు అవుతుంది. మధ్య ఆసియా నుంచో దక్షిణ రష్యా నుంచో ఇండో యూరోపియన్ ఆర్యులు క్రీ.పూ. 1500 ప్రాంతంలో ఇండియామీదికి దండయాత్ర చేశారట. అంతకుముందు ఇక్కడ ఉన్న ద్రవిడ నాగరికతను ధ్వంసం చేసి, ద్రావిడ నగరాలను నాశనం చేసి, పిల్లలూ, వృద్ధులని చూడకుండా ద్రావిడులను ఊచకోత కోసి ఆ సమాధులు పునాదులుగా వేద సంస్కృతిని స్థాపించారట. తరవాత క్రీ.పూ. 1200 ప్రాంతాల్లో తీరుబడిగా ఋగ్వేదాన్ని రాసుకున్నారట. అలా తరిమికొట్టబడిన ద్రావిడ జాతి దక్షిణాదికి విధిలేక వలసపోయిందట. ఇదీ ఇన్ని శతాబ్దాలుగా మాక్స్‌ముల్లర్‌లాంటి పాశ్చాత్య మేధావులు పనిగట్టుకుని సాగించిన అసంబద్ధ విష ప్రచారం.

ఈ వాదం నిజమాకాదా అని ఇప్పుడు ఎవరూ తర్కించవలసిన పనిలేదు. ఈ వాదన లేవదీసినవారికే అది నిజమన్న నమ్మకం లేదు. ఆర్య దండయాత్ర సిద్ధాంతానికి ఆద్యుడు మాక్స్‌ముల్లర్. ఆర్యులు అనగా ఎలాంటి పదార్థమో ఆయనకే సరిగా తెలియదు. వేదపండితుడిగా అవతారమెత్తాక మొదటి ఇరవై ఏళ్లు ఆర్యులది ప్రత్యేక జాతి అని ఆ మహానుభావుడు ఇల్లెక్కి చాటాడు. దానికి ఆధారాలేమిటో చూపించమని నలుగురూ నిలదీసేసరికి ఆర్యులది వేరే జాతికాదు.. ప్రత్యేక భాషా కుటుంబం మాత్రమేనని ప్లేటుమార్చి ఆ తరవాత ముప్ఫై ఏళ్లు ఆర్యభాషావాదాన్ని ఎత్తుకుని ఊరేగాడు. పోనీ ఆ భాషల విషయంలోనైనా ఆయనకు సాధికారికంగా మాట్లాడగల ప్రావీణ్యం వుందా అంటే అదీ లేదు. సంస్కృత భాషావేత్త, వేదపండితుడు అని తాహతుకు మించిన పేరు వచ్చిందేగాని, మాక్స్‌ముల్లర్‌గారు ఎవరైనా సంస్కృతంలో మాట్లాడితే ఒక్క ముక్కా అర్థం చేసుకోగలిగేవాడు కాదు. జర్మన్‌లోనో, ఇంగ్లీషు లిపిలోనో సంస్కృతాన్ని రాసుకుని కూడబలుక్కుని చదవటమే తప్ప సంస్కృత శబ్దం ఎలా ధ్వనిస్తుందో ఆయన ఎరుగడు. ఆ బండారం ఎక్కడ బయటపడుతుందోననే కాబోలు ఈ సోకాల్డ్ కలియుగ వేదవ్యాసుడు భారతదేశం భాష చరిత్ర, సంస్కృతుల గురించి టన్నులకొద్దీ రాసినా తన జీవితకాలంలో భారతదేశంలో ఒక్కసారీ అడుగుపెట్టలేదు. ఆర్యులంటూ ప్రత్యేక జాతి ఏదీ లేకపోతే కేవలం వారి భాషను పట్టుకుని క్రీ.పూ. 1500లో ఆర్యులు ఇండియాకు వచ్చారనీ, క్రీ.పూ. 1200లో ఋగ్వేదం రాశారనీ, మీరు ఎలా కనిపెట్టారు అని పండితులు నిలదీస్తే మాక్స్‌ముల్లర్‌గారు ఏమన్నారో తెలుసా? "ఏమో! ఏ వేదం ఎప్పుడొచ్చిందో ఎవరికెరుక? అది క్రీ.పూ. 1200లో

జరిగివుండొచ్చు. 2000లో కావచ్చు. క్రీ.పూ. 4000 లోనూ కావచ్చు" అని విద్యారంగా పలికి పాదరసంలా తప్పించుకున్నారు.

ఇదిగో – ఇలాంటి తెలిసీ, తెలియని కుహనా పండితుల బూటకపు వాదాన్ని నిజమని భ్రమించి మనం కూడా ఆర్యులనేవారు ఏ మధ్యాసియా నుంచో వచ్చి ఇండియాను ఆక్రమించిన విదేశీయులని అనుకుంటూ వచ్చాం. అది పచ్చి అబద్ధమని ప్రపంచమంతా గ్రహించినా మన చరిత్ర పాఠాల్లో మాత్రం అదే యథార్థమైనట్టు రాసుకుంటూ వచ్చాం. నిజానికి ఆర్యులు బయటివారు కారు. ఇక్కడివారే. ఆర్య సంస్కృతి ఇక్కడ పుట్టి, ఇక్కడ విలసిల్లి, ఇటునుంచి బయటికి విస్తరించిందే తప్ప బయటినుంచి దిగుమతి అయింది కాదు. ఈ విషయంలో ఎవరికైనా ఎక్కడైనా సందేహమనేది మిగిలివుంటే అది కూడా కాంబే దగ్గర ఇప్పుడు కనపడ్డ నాగరికతతో సందేహ నివృత్తి అయి ఉండాలి. ప్రపంచానికి తెలిసిన నాగరికతలన్నిటి కంటే కాంబే నాగరికత ప్రాచీనమైనది అయినప్పుడు వేరెవరో బయటి నుంచి వచ్చి మనకు నాగరికత నేర్పలేదని, ఇక్కడి నాగరికతే బయటికి వెళ్లి ప్రపంచమంతా వ్యాపించిందని ఎవరైనా అంగీకరించి తీరాలి. సింధు నాగరికత అని ఇంగ్లీషువారు తెలిసీ తెలియక పేరు పెట్టారేగానీ నిజానికి మనది సరస్వతి నాగరికత. సరస్వతి ఒకప్పుడు గంగకంటే పవిత్రంగా భారతీయులు ఆరాధించిన మహానది. అంబితమే నదీతమే దేవీతమే అని ఋగ్వేదఋషులు పలుమార్లు ప్రస్తుతించిన సరస్వతి నది తీరం పొడవునా ఆర్యనాగరికత అఖండంగా విలసిల్లింది. పర్యావరణ విపరిణామాలకు లోనై ఆ మహానది గతిని మార్చుకుని, క్రమేణా ఎండి, పూర్తిగా అదృశ్యమవడంతో ప్రాచీన సరస్వతి నాగరికత కూడా క్రమానుగతంగా క్షీణించింది. ఆ గత వైభవ అతి ప్రాచీన చిహ్నాలే ఇప్పుడు కాంబేలో బయల్పడిన శిథిలాలు. ప్రస్తుతం సముద్రగర్భంలో వున్నా, ఒకప్పుడు అది ప్రాచీన నదీ నాగరికతలో అంతర్భాగమైనదని శాస్త్ర పరిశోధనల్లో తేలింది. ఉప్పెనవచ్చి మునిగిపోయిందని అనుకుంటున్న పురాణకాలపు ద్వారక నగరం ఇదేనా అన్నదీ పరిశీలించి నిగ్గు తేల్చవలసి వుంది.

రేడియో కార్బన్, మెటలర్జికల్ టెస్టులు, ఆర్కియాలజీ పరీక్షలు వగైరాలు యావత్తూ ముగిసి సమగ్ర సమాచారం వెల్లడయ్యాకైనా శతాబ్దాలుగా మన మేధావులు చాలా మంది బుర్రలకు పట్టిన బూజు వదిలితే మంచిదే. చిరకాలంగా చరిత్రకు జరిగిన వక్రీకరణలు తొలగి మన ఉజ్వల గతం గురించి మనకు ఒకింత గర్వం కలగడం కంటే కావలసింది ఏముంది?

(2002 ఫిబ్రవరి 11న ప్రసారమైన రేడియో ప్రసంగం)

(ఆకాశవాణి సౌజన్యంతో)

పనికొచ్చిన పుస్తకాలు

Interpreting Early India - Romila Thapar
Ancient Indian Social History - Some Interpretations, - Romila Thapar
Life and Letters of Max Muller, 1902
Max Muller - A Life Long Masquerade - Brahma Dutt Bharti
Chronology of Ancient Hindu History - Kota Venkatachalam
The Plot in Indian Chronology - Kota Venkatachalam
Age of Buddha, Milinda & Amtiyoka - Kota Venkatachalam
Indian Eras - Kota Venkatachalam
Is Sandrokottas Chandragupta Maurya? - Sriram Sathe
The Origin of Human past - V.Lakshmikantam
The Invasion of India By Alexander The Great - J.N.Mc.Crindle
Arise Arjuna- David Frawley
Sankara Digvijaya - Madhava Vidyaranya
Lectures on the Ancient History of India - D.R.Bhandarkar
Aryan Invasion of India -The Myth and The Truth - N.S.Rajaram
The Aryan Invasion Theory - A Reappraisal - Srikant G Talageri
The Aryan Invasion - A Myth - Dr. N.R. Waradpande
Aryans-Who are They ? Sriram Sathe
The Politics of History - N.S. Rajaram
Anicent India As described by Megasthenes and Arrian - J.W. Mc. Crindle
The History of India As Told By Its Own Historians.- H.M.Elliot & John Dowson, *8 vol.s The History of Indian people and culture, Ed.R.C. Majumedar Vol. 1 to VIII*
The Oxford History of India - V.A.Smith
History of India - Anil Chandra Banerjee
Akbar The Great Mogul - V.A. Smith
Akbar - Munilal
History of India (9 Vols.) - Ed.A.V.Williams
The Wonder that was India - A.L.Basham
The Story of Civilisation : Our Oriental Heritage - Will Durant
Travels in the Mogul Empire - Francois Bernier
Akbar Nama of Abul Fazl - Tr. H. Beveridge
AIN-I Akbari - Abul Fazl
Comprehensive History of Indian Empire Ed. - W.W.Hunter
The Shah Jahan Nama of Inayat Khan -Ed. W.E. Begley & Z.A.Desai
Aurangzib - Stanley Lane
The Great Moghuls - Abraham Eraly
History of Aurangzib,- Jadu Nath Sarkar, *5 Vols.*
Short History of Aurangzib - Jadunath Sarkar

Shivaji and His Times - Jadunath Sarkar
The Illustrious Prime Minister Madanna - K.V. Bhupala Rao
Indian Muslims: Who Are They? - K.S. Lal
India In the 17th Century, Memoris of Francois Martin
The Story of Civilisation, Our Oriental Heritage - Will Durant
Negationism in India: Concealing the record of Islam - Koenrad Elst.
Hindu Temples : What happened to them - Sitaram Goel
Muslim Slave System in Medieval India - K.S. Lal
A Forgotten Empire - Robert Sewell
Vijayanagar ed. Vasundhara Filliozat
History of Medieval Deccan in 2 vols. ed. Prof. A.K. Sherwani
Some Blunders of Indian Historial Research - P.N. Oak
Islamic Havoc in Indian History - P.N. Oak
The Tajmahal is a Hindu Palace - P.N.Oak
Advanced study in the History of Medieval India - J.C. Mehta
Guru Tegh Bahadur - Harbans singh
Guru Tegh Bahadur and the Persian Chronicles - J.S. Grewal
The New Cambridge Histroy of India - The Mughal Empire - J.F. Richards
Mewar Saga - D.R. Mankekar
Prithviraj Chauhan and His Times - R.S. Somani
Eminent Historians - Arun Shourie
The Soul of India - Amaury De Rien court
Seccession And Imperial leadership Away The Mogals 1526-1707 - Neeru Mishra
A Pageant of India, Adoly waley
Medieval India, Satish Chandra
HIMU: The Hindu "Hero" of Medieval India - Snil Kumar Sarkar
Hemu: Napoleon of Medieval India - K.K.Bharadwaj
From the Death of Shivaji to The Death of Aurangjeb - Y.G.Bhave
The Grand Rebel - Dennis Kincard
New History of Marathas - G.S.Sardesai
Baji Rao, The narrior Peshva - E.Jaiwant Paul
హిందూమహాయుగము - కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
మహమ్మదీయ మహాయుగము - కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
ఆంధ్రుల చరిత్ర సంస్కృతి - ఖండవల్లి లక్ష్మీరంజనం
సాతవాహన సంచిక
భారతదేశ చరిత్ర - సంస్కృతి - బి.ఎన్.శాస్త్రి
భారతదేశచరిత్ర - మధ్యయుగం - కె. కృష్ణారెడ్డి

పత్రికలు ఏమన్నాయి?

It is an earnest attempt to reveal the true face of INdian history. A seasoned editor and a gifted columnist, Sastry now proves himself to be a scholarly historian and an assiduous researcher. With a crusading spirit and fervour, he takes upon himself the gigantic task of delving deep into the very roots of Indian history and interpreting true purport. The approach is highly investigative and analytical. The reasons adduced are prudent and supported by authoritative texts. Time and again Sastry questions the very basic concepts propounded by celebrated historians... penetrating content, rational argumentation and streamy style help the reader study the book with delightful diligence.

- ***'The New Indian Express'***, July 18, 2003

జాతీయతాభావనని ఆధారం చేసుకుని మతదృక్పథంతో ఈ వ్యాసాలు రాశారు. దండయాత్రల పేరుతో హిందువులను ఊచకోత కోసిన ఎన్నో దృష్టాంతాలను పలుమార్లు ప్రస్తావించారు. చరిత్రలోని కొన్ని ప్రధాన ఘట్టాలపై, ప్రముఖ వ్యక్తుల ఉదంతాలపై రచన కొనసాగింది... వార్తాపత్రిక 'కాలం' రచన, గ్రంథ రచన వేర్వేరు. 'కాలం'లోని వివిధ వ్యాసాలు ఏకసూత్రతవల్ల దీనికి గ్రంథ స్వరూపం స్పష్టపడింది. లేకపోతే వ్యాస సంకలనంలాగా అనిపించేది. ఈ గీత చెరిగిపోవడంవల్ల సీరియస్ పుస్తకం అనే భావన కలుగుతుంది. అలా కలగడంవల్ల ఇందులో చర్చించిన చరిత్ర అంశంపై పాఠకుడు సీరియస్‌గానే ఆలోచిస్తాడు. అందుకే ఈ గ్రంథంలో వెలిబుచ్చిన ఆలోచనలతో అంగీకరించేవారు, విభేదించేవారు ఉంటారు.

- *'వార్త' దినపత్రిక*, 14 సెప్టెంబర్ 2003

వాక్యాలలో వాడి, వేడి వుండేకాని దూషణలూ భూషణలూ రెండూ లేవు. సత్యాన్వేషణలో కావలసిన సంతులనం ఉంది. రచన శాస్త్రీయంగా సాగింది. చాలా ప్రామాణికంగా చరిత్రను శాస్త్రిగారు తమ పాత్రికేయ దర్పణంలో చూపించారు. యూనివర్శిటీ హిస్టరీ ప్రొఫెసర్లు చేయలేన్ని పనిని ఒక పత్రికా సంపాదకుడు చేసి చూపించాడంటే అది మొత్తం పత్రికా లోకానికే గర్వకారణం.

- *'ఆంధ్రభూమి' దినపత్రిక*, 15 జూన్ 2003

నా పూర్వీకులెవరు? వారి చరిత్ర ఏమిటి? బళ్లో చదువుకున్న చరిత్రలో ఏది నిజం, ఏది అబద్ధం? అనే జిజ్ఞాసతో 'ఏది చరిత్ర'ను చదవడం ప్రారంభిస్తే ఒక్కో వ్యాసం గడిచేకొద్దీ వొళ్ళు గగుర్పొడుస్తుంది. రక్తం ఉడుకులెత్తుతుంది. ఇన్నాళ్లుగా ఎన్నేళ్లుగా మనలో తప్పుడు చరిత్రను చదివిస్తున్నవారిపై ఆగ్రహావేశాలు పెల్లుబుకుతాయి. తప్పుడు చరిత్ర రాసినవాణ్ణి, అదే సరైన చరిత్ర అని సర్టిఫైచేసి మన మొహాన కొట్టినవాణ్ణి వీధిలో నిలవేయాలనిపిస్తుంది... మన జనాభాలో 10 శాతం మంది ఈ పుస్తకం చదివినా చాలు. చరిత్రను తిరగరాయాలనే

డిమాండుతో ఒక మహా ఉద్యమమే ప్రారంభమవుతుంది... పది మంది కలిసి ఒక ఉద్యమంగా ఈ గ్రంథ పఠనాన్ని యజ్ఞంలా జరిపించగలిగితే జాతి జనులు మేల్కొంటారు.

– *'ఆంధ్రభూమి' సచిత్ర వారపత్రిక*, 26 జూన్ 2003

ఇంత చక్కటి వ్యాసాల సమాహారంలో ఖుస్రూఖాన్, రాణి దేవళదేవి గురించి ఎలాంటి ప్రస్తావనా లేకపోవడం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది... కొన్ని చిన్న చిన్న తప్పులు కూడా ఉండకుండా ఉంటే బాగుండేది. ఉదాహరణకి చిత్తోడ్‌ను చిత్తూరుగానూ (76వ పేజీ), ఇర్ఫాన్ హబీబ్‌ను మహ్మద్ షబీబ్‌గానూ (92 పేజీ), అనంగపాలుడిని ఆనందపాలుడిగాను (94వ పేజీ), జయమల్లుని జైమాల్‌గానూ (131 పేజీ) సర్‌హింద్‌ను సిర్హింద్‌గానూ (250 పేజీ) పొరపాటుగా వ్రాయటం జరిగింది. అయితే అమూల్యమైన ఈ గ్రంథానికి అవి దిష్టిచుక్కలు మాత్రమే.

– *'జాగృతి' వారపత్రిక*, 23 జూన్ 2003

దేశ చరిత్రకు జరిగిన అపచారాన్ని, మహాపురుషులకు జరిగిన అన్యాయాన్ని జాతికి తలకొట్టేసిన వైనాన్ని బైటపెట్టి అసలైన చరిత్రను బైటికి తెచ్చే బృహత్ కార్యాన్ని ఒక యజ్ఞంలా నిర్వహించారు ఆంధ్రభూమి సంపాదకులు శ్రీ యం.వి.ఆర్.శాస్త్రి... పుస్తకం మొత్తం పూర్తయ్యేసరికి తప్పుడు చరిత్రను మన మొహానకొట్టివాడికి, దీన్ని సరిదిద్దినట్టు నటించి మరింత భ్రష్టుపట్టించినవారికి గుండు కొట్టించి సున్నంబొట్లు పెట్టి గాడిదమీద ఊరేగించాలనిపిస్తుంది. భరతమాత సంతానమైన ప్రతివారూ ఈ పుస్తకాన్ని చదవాలి. పదిమందితో చదివించాలి. ప్రతి మున్సిపాలిటీ, మండల కేంద్రంలో ఈ పుస్తకాన్ని చదివించటం ఒక ఉద్యమంలా నిర్వహించాలి. జాతీయవాదులందరికీ ఈ పుస్తకం చేరేట్లు చూడాలి. ప్రతి గ్రంథాలంలో. పాఠశాల లైబ్రరీలో ఉండాల్సిన పుస్తకం ఇది.

– *'జనసందేశ్' వారపత్రిక*, 10 జూన్ 2003

రచయిత ఎక్కడా తన స్వంత అభిప్రాయాలను పాఠకులమీద రుద్దే ప్రయత్నం చేయలేదు. చెప్పినవాటికి సాక్ష్యాధారాలు చూపించారు. చేయి తిరిగిన పత్రికా సంపాదకులు గనుక చెప్పవలసిన విషయమేదో నిర్మొహమాటంగా చెప్పేసి, ఆలోచించుకునే అంశాన్ని పాఠకులకు వదిలేశారు. మన చరిత్రపై కుతూహలం గలవారికి ఈ గ్రంథం ఒక 'అక్షయ తూణీరం' వంటిది.

– *'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక*, నవంబర్ 2003

వర్తమాన కాలంలో మసకబారుతున్న మన మహోజ్వల చరిత్రపై కొత్త వెలుగులు ప్రసరిస్తూ, 'ఉన్నమాట' చెబుతూ, ఎంత హేమాహేమీలనైనా సూటిగా ప్రశ్నిస్తూ రంగుటద్దాలను పెట్టుకుని కాక సత్యదీపం పట్టుకుని ఆంధ్రభూమిలో ఒక్క కుదుపు కుదిపిన మంచి విశిష్ట రచయిత యం.వి.ఆర్.శాస్త్రిగారు... చరిత్రను ఎలా చదవాలో, చూడాలో, అర్థం చేసుకోవాలో, విశ్లేషించుకోవాలో ఈ గ్రంథంలో చాలా సూటిగా, దీటుగా, కొండొకచో ఘాటుగా రాశారు. ఈ గ్రంథం వెలువరించి శాస్త్రిగారు మేధావులకూ, బుద్ధిజీవులకూ ఒక మేల్కొలుపునిచ్చారు. సామాన్య పాఠకులకు సైతం చరిత్ర పఠనం పట్ల అనురక్తిని కలిగించారు. తిరగ రాసుకోవాల్సిన, సత్యదర్శనాత్మకమైన భారత చరిత్రకు ఈ గ్రంథం 'దారిదీపం'.

– *'పత్రిక' మాసపత్రిక*, జూలై 2003

'ఏది చరిత్ర' ద్వారా శ్రీ యం.వి.ఆర్.శాస్త్రి భారతదేశ చరిత్రను నడివీధిలోకి తెచ్చారు. 'మాకంతా తెలుసు. మాకే తెలుసు. మేము చెప్పిందే చరిత్ర' అని దబాయిస్తున్న కుహనా చరిత్రకారులను బోనెక్కించారు... ఈ గ్రంథం చదివినవారికి కలవాహిని అలల వాలులో కొట్టుకుపోకుండా నిలబడిన రాణాప్రతాప్‌లాగా రచయిత శాస్త్రి, యుద్ధానికి ద్రవ్యాన్ని సమకూర్చిన భామాషాలాగా గ్రంథ ప్రచురణ భారాన్ని వహించిన అజో-విభొ-ఫౌండేషన్ వారు గోచరిస్తే, అందులో ఆశ్చర్యం ఉండబోదు. ఈ గ్రంథంలోని ఉపసంహారం అనే అధ్యాయాన్ని పదవ తరగతికి పాఠ్యభాగం చేయాలి. ఇకముందు జరిగే ఏ ఇంటర్వ్యూలోనైనా సరే ఉద్యోగమిచ్చేది కావచ్చు, పెళ్లి కుదిర్చేదికావచ్చు.. - 'ఏది చరిత్ర?' చదివారా? అనేది తప్పనిసరి ప్రశ్నకావాలి.

- ***'నడుస్తున్న చరిత్ర' మాసపత్రిక,*** జూలై 2003

'ఏది చరిత్ర' పుస్తకం దేశాన్ని గురించి తెలుసుకోవాలనుకునేవారికి ఒక చక్కటి గ్రంథం. అజ్ఞానంలో, అసత్యవాదుల ప్రభావంలో పడినవారికి కళ్లు తెరిపించే దివ్యాంజనం! దేశభక్తులు, సాంఘిక శాస్త్రవేత్తలు, సామాజిక సమరసతను కాంక్షించేవారికి ఈ పుస్తకం ఓ కరదీపిక; ఓ ఆయుధం. ఈ పుస్తకాన్ని అందరూ చదవాలి. చదివించాలి. తెలుగు వారందరూ గర్వించదగ్గ గ్రంథం ఇది. అనేక భాషల్లోకి అనువదింపబడి భారతీయులు జీర్ణం చేసుకోవాల్సిన సత్యామృతం ఈ పుస్తకం.

- ***'ఋషిపీఠం' మాసపత్రిక,*** జూలై 2003

యం.వి.ఆర్.శాస్త్రిగారు రాసిన ఈ చరిత్రక వ్యాసాలు చరిత్రాత్మకమైనవి. సంచలనాత్మకమైనవి. ఎన్నో దిగ్భ్రాంతికరమైన విషయాలను వెలుగులోకి తెస్తున్నాయి. ఇన్నాళ్ళు పాఠ్యగ్రంథాల్లో చదువుకున్నవన్నీ అబద్ధాలని తెలిసి తలకిందులయిపోతాం!... తాజ్‌మహల్ షాజహాన్ కట్టించింది కాదనీ, షాజహాన్, ముంతాజ్ బేగంల పుట్టుకకు ముందు 300 ఏళ్లనాడు రాజా మాన్‌సింగ్ కట్టిన రాజమహల్ అనీ శాస్త్రి సప్రమాణంగా నిరూపిస్తుంటే నోటమాటరాక అవాక్కయిపోతాం... ఇంత ఆలోచనాత్మకమైన, ఆవేదనాత్మకమైన గ్రంథానికి తగిన గుర్తింపు రావాలి. ముఖ్యంగా చరిత్రను బోధించేవారు ఉదాసీనంగా ఉండకుండా సానుకూలంగానో ప్రతికూలంగానో ప్రతిస్పందించాలి. భయాలతో ఆవేశాలతో సత్యాలను మరుగుపుచ్చకుండా చర్చలు, వాదోపవాదాలు, పునః పునః పరిశోధనలతో ఈ గ్రంథంలోని అంశాలను నిగ్గుతేల్చాలి...

- ***'వాఙ్మయి' త్రైమాసిక పత్రిక,*** జూలై-సెప్టెంబర్ 2003

The heroic attempt made by Sri M.V.R. Sastry through his monumental book 'Yedi Charitra' in Telugu in exposing the Western and English authors of INdian History and their deliberate designs in distorting factual aspects, is laudable... The extent to which these biased historians can stoop to twist the truth has been well brought out by the author... This beautiful book of excellence shall make all Indians proud of their origin, identify and cultural views...

- ***'Bharatiya Pragna', Monthly,*** July, 2003

19.05.10
డా.వి.గుణం.

సహేతుకమైన

14.06.10
డా.వి.గుణం

చిక్కని చరిత్ర విమర్శ గ్రంథం. సహేతుకమైన ప్రశ్నలతో నిప్పులు చెరిగారు శాస్త్రి గారు. మనం చదువుకున్న చరిత్రలో యిన్ని అసత్యాలు, అర్థ సత్యాలు, వక్రీకరణలు ఉన్నాయని అంత అద్భుతమైన విశ్లేషణలతో నిరూపిస్తూ ఉంటే గుండె మండిపోతుంది.

ముఖ్యంగ (తిరగరాయాల్సిన చరిత్ర) (అనుబంధం), ఉపసంహారం పాఠ్యాంశాలుగ పెట్టదగ్గవి.

ఈ పుస్తకం అందరితోను చదివించాల. ఎందరితో వీలైతే అందరితో. ఫోటోస్టాట్ తీయించడం, పుస్తకం ఇవ్వడం ఏదో ఒకలా చదివించాల.

ఇప్పటికే 6 యిద్దరితో చదివించేశా. (ఒకరు పారాయణం గాలించేంతవరకు, మరొకరు జీర్ణం చేసుకునేలా సంపూర్ణంగ). ఆరంభశూర్య-ంలో యుండదు అని చెప్పను కానీ చాల మందితో చదివిస్తా. ఇది నిర్ణయం. నా నిశ్చయం

PTO

ఆర్యులు దేశాన్ని దండయాత్రలు జరిపారు అనడం అసంగతమనీ, మాక్స్‌ముల్లర్ పండితుడు ఇంగ్లీషులోకి రాసుకుని తప్ప సంస్కృతం దేవనాగరిలో చదవలేడు... ఎవరైనా సంస్కృ-తంలోకి మార్చితే అర్థం చేసుకోలేడనీ (అది ఆటంకం కదంటే ఏమీ చెప్పలేం వారికి)..., ఇటికను బహుమానంగా కురిపించి పురాణాలు అప్రామాణికాలు అనడం, తాజ్ మహలు రాజామాన్ సింగ్ కట్టించిందని నిరూపించడం చూస్తే పూర్వ చరిత్రకారుల తెంపరితనానికి రక్తం పొంగుతుంది.

ఇదొక మహోద్గ్రంథం అని సనాతనులు భావించిన మిగతవారు కూడ ఒక కొత్త కోణం అని గరివించేల ఉంది కనీ ఎవ్వరూ దీన్ని కొట్టి పడేసేల మాత్రం లేదు.

— సూరంపూడి పవన్ సంతోష్


ఎం.వి.ఆర్. శాస్త్రి